సరికొత్త వివరణలతో

# సమగ్ర భారతచరిత్ర

## మధ్యయుగం



కె కృష్ణారెడ్డి

ప్రజాశక్తి బుక్‌హౌస్

సరికొత్త వివరణలతో

# సమగ్ర భారత చరిత్ర

## మధ్యయుగాలు

కె. కృష్ణారెడ్డి

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013

అనువాదం : సఫ్దర్ అహ్మద్

ప్రచురణ సంఖ్య : 1009

ప్రచురణ కాలం : సెప్టెంబర్, 2007

వెల : రు. 150/-

టైటిల్ : శ్రీరాం కారంకి

ప్రతులకు
**ప్రజాశక్తి బుక్‌హౌస్**
1-1-187/1/2, చిక్కడపల్లి
హైదరాబాద్-20. ఫోన్ : 27660013

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ,
విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

# విషయసూచిక


ముందుమాట 5

I. మధ్యయుగ భారతదేశ రాజకీయ చరిత్ర 7

1. విహంగ వీక్షణ 9
2. తొలి మధ్యయుగ భారతదేశం 23
3. ఘోరీలు - ఢిల్లీ సుల్తానుల రాజ్యం 35
4. ప్రాంతీయ వంశాలు 65
5. మొగల్ సామ్రాజ్యం 81
6. శివాజీ, పేష్వాల నాయకత్వంలోని మరాఠాలు 105
7. మొగల్ సామ్రాజ్య పతనం; ప్రాంతీయ రాష్ట్రాల ఆవిర్భావం 117
8. మధ్య యుగ వంశాల ప్రాంతీయ పాలనా క్రమం 131

II. రాజకీయ వ్యవస్థ ప్రభుత్వం 133

9. సాధారణ అధ్యయనం 135
10. తొలి మధ్యయుగ కాలం 141
11. ఢిల్లీ సుల్తానుల రాజకీయ వ్యవస్థ - పరిపాలన 155
12. మొగల్ రాజకీయ వ్యవస్థ - పరిపాలన 173

III. ఆర్థిక వ్యవస్థ 207

13. తొలి మధ్యయుగ ఆర్థిక వ్యవస్థ 209

14. ఢిల్లీ సుల్తానుల ఆర్థిక వ్యవస్థ 213

15. మొగల్ ఆర్థిక వ్యవస్థ 227

16. ఐరోపాతో వాణిజ్యం 237

IV. సమాజం - మతం 249

17, మధ్యయుగ భారతీయ సమాజం 251

18. మధ్యయుగ భారతీయ మతం 277

V. సంస్కృతి 311

19. తొలి మధ్యయుగ కాలం 313

20. ఇండో - పర్షియన్ సంస్కృతి 325

21. మొగల్ పాలకుల విభిన్న సంస్కృతి 335

VI. అనుబంధం 361

22. వంశక్రమం 363

23. మ్యాపులు 387

# రచయిత తొలి పలుకులు

**భా**రతదేశ చరిత్రను అంశాల వారీగా, శాస్త్రబద్ధంగా పరిశీలించి, వివరించడం ఈ పుస్తకంలోని నూతనత్వం అని ముందుగా చెప్పాలి. పూర్తిగా భిన్నమైన, నూతన ప్రణాళికతో ఈ పుస్తకాన్ని రచించానని వేరుగా చెప్పనవసరం లేదు. దీనిలో రాజకీయ చరిత్రపై కాకుండా ఇతర అంశాలపై కేంద్రీకరణ హెచ్చుగా ఉంది. ప్రతి అధ్యాయంలోను ఆ కాలానికి చెందిన రాజకీయ చరిత్రను ప్రత్యేకంగా పేర్కొన్నాను. అయినప్పటికీ తరతరాలుగా వస్తున్న విస్తారమైన, విభిన్నమైన అన్ని జీవిత కోణాల ఆవిష్కరణకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇచ్చాను. పాలక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ, సామాజిక, మత, సాంస్కృతిక సంస్థలు, ఆచారాలు, విశ్వాసాలను సుబోధకంగా వివరించే ప్రయత్నం చేశాను. పైకి భిన్నత్వం కనిపిస్తున్నప్పటికీ భారత దేశ చరిత్ర మొత్తంలోను అంతర్లీనంగా కొనసాగిన ఏకత్వాన్ని చూపించాను.

వివిధ దశల్లో చరిత్రను ప్రభావితం చేసిన రకరకాల శక్తుల గురించి విశ్లేషించడానికి శాయశక్తులా ప్రయత్నించాను. సామాజిక మార్పుకు దోహదపడి అవి చరిత్రను ఎలా తీర్చిదిద్దాయో తెలియ చేశాను. దురదృష్టవశాత్తు అనేక రిఫరెన్సు గ్రంథాలలో సామాన్యుడి గురించి కాని, దేశ సాంస్కృతిక వారసత్వం గురించి కాని తగినంత చెప్పకపోవడమే కాకుండా, ఆ చెప్పినది కూడ ఒక పద్ధతి ప్రకారం లేదు. ఈ పుస్తకంలో నూతన ప్రణాళికను అనుసరించడం ద్వారా ఆ లోపాలను అధిగమించే ప్రయత్నం జరిగింది. అంతేకాదు ఆధునిక యుగానికి సంబంధించిన భాగంలో విద్యార్థుల అవసరాలను గమనంలో ఉంచుకొని విషయాలను పొందుపరిచాను. బారత స్వాతంత్ర్యపోరాటాన్ని వివరించే సమయంలో వాస్తవాలకు అనుగుణంగా ఉన్నదున్నట్లు చెప్పడానికి కృషి చేశాను. భారత దేశ చరిత్రను, సంస్కృతిని ప్రాచీన కాలం నుండి, వర్తమాన కాలం వరకు సమగ్రమైన రీతిలో వివరించడానికి ఒక నమ్మకమైన ప్రయత్నం చేశాను.

**'సరికొత్త వివరణలతో సమగ్ర భారత చరిత్ర'** పేరుతో వెలువడుతున్న ఈ పుస్తకంలో నాలుగు భాగాలున్నాయి. **1. ప్రాచీన యుగం, 2. మధ్య యుగం, 3. ఆధునిక యుగం, 4. జాతీయోద్యమం.** విద్యార్థులను మాత్రమే కాకుండా, భారత దేశ చరిత్ర, సంస్కృతి పట్ల ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరిని దృష్టిలో పెట్టుకొని ఈ పుస్తకాన్ని రూపొందించాను. ఈ ప్రయత్నాన్ని పాఠకులు హర్షించి ఆదరిస్తారని ఆశిస్తాను. చివరిగా, ఈ పుస్తకాన్ని చక్కటి తెలుగులోకి తెచ్చిన అనువాదకులకు, నిశితంగా ఎడిట్ చేసి ఎంతో వేగంగా ప్రచురించిన ప్రజాశక్తి వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**న్యూఢిల్లీ,**

**10-09-2007**

**కూనం కృష్ణారెడ్డి**

# అంకితం

**చరిత్ర రచనలో నా ఈ కృషిని ప్రేమాదరాలతో**

**అంగీకరించి సహకరిస్తున్న**

**నా చిన్ని కుటుంబం**

***ఉమ, ఆదిత్య, నీలిమలకు***

# I

# మధ్యయుగ భారతదేశ రాజకీయ చరిత్ర

1

# విహంగ వీక్షణ

క్రీస్తు శకం తొలి సహస్రాబ్ది మధ్య నాటికి భారతదేశ చరిత్రలో అతిపెద్ద పరివర్తనం దాదాపు సక్రియంగా ఉంది. అంతకు ముందు వచ్చిన మహాపరివర్తనంలో మౌర్య, గుప్త సామ్రాజ్యాలతో కూడిన చారిత్రక ఘట్టం ఇమిడి ఉంది. ఈ రెండవ పరివర్తనా కాలం సుమారు పది శతాబ్దాల పాటు కొనసాగింది. అంటే ఎనిమిదవ శతాబ్దపు మధ్య దశకాల నుండి తొలి ఆధునిక కాలమైన 18వ శతాబ్దపు మధ్యదశకాల వరకు ఈ పరివర్తన సంభవించింది. దాని తొలి చరిత్ర ప్రాచీన భారత పోకడలతో ప్రారంభమైనప్పటికీ వాటిని మధ్యలోనే వదిలించుకుంది. దాని మలి చరిత్ర ఆధునికతకు ఒక స్వరూపాన్ని ఇచ్చింది. ఈ సుదీర్ఘ మధ్యయుగ పరివర్తన వెల్లువలా వచ్చిపడిన శిలాశాసనాలలో తొలుత దర్శనమిస్తుంది. విభిన్న సముదాయాలపై, విభిన్న ప్రాంతాలపై ఆధిపత్యం వహించిన అనువంశిక పాలకులు, అప్పటి సామాజిక కార్యకలాపాల గురించి ఈ శిలాశాసనాలు చక్కటి వర్ణనలు అందిస్తాయి. ఈ విశాల వీక్షణంలో మనము తొలి మధ్యయుగ శతాబ్దాలలో సమాజాలను, వాటిలోని సామాజిక స్వరూపాలను మార్చివేసిన ప్రధాన ఘట్టాలను పరిశీలిద్దాం (క్రీ.శ. 1000కు ముందు).తర్వాత రెండవ సహస్రాబ్ది ఆరంభంలో సంభవించిన పరిణామాలను, చివరగా 1500 నుండి తొలి ఆధునిక యుగ లక్షణాలు సంతరించుకున్న కాలం వరకు జరిగిన పరిణామాలను విశ్లేషిద్దాం.

పల్లవులు, పుష్యభూతిల వలే ఇతర తొలి మధ్యయుగ పాలక వంశాలకు కూడా ప్రాచీన బాంధవ్యాలు ఉండేవి. గుప్తుల వలే అనేక మంది మధ్యయుగ రాజులకు నదీ తీరాల్లోని సారవంతమైన ప్రాంతాల్లో మాతృభూములుండేవి. కాని మధ్యయుగ సమాజాలలో ప్రజలు ఇలాంటి సారవంతమైన ప్రాంతాలెన్నింటినో ఏర్పాటు చేసుకున్నారు. బావుల తవ్వకం, నీటి పథకాలు, కాలువలు, జలాశయాల నిర్మాణం, పంటలు పండించేందుకు ఎద్దుల సహాయంతో నడిచే ఎత్తిపోతల పథకాలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంవల్ల కొత్త ప్రదేశాల్లో సైతం సారవంతమైన భూములు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త ప్రాంతాలలో ఆవిర్భవించిన మధ్యయుగ రాచరిక వంశాలు కేవలం ప్రాచీన సంస్కృతుల నుండి పుట్టుకు

వచ్చిన అభ్యంగాలు మాత్రమే కాదు. అవి సామాజిక స్వరూపాలకు కొత్త గుర్తింపునిచ్చిన వినూత్న సామాజిక సంఘటనాలను (Organizations) కూడా సూచిస్తాయి. వాటి ఉన్నత వర్గాలకు విభిన్న పుట్టుపూర్వోత్తరాలు, భాషలు ఉండేవి. తొలి మధ్యయుగ సంవత్సరాలలో సామాజిక జీవన నైసర్గిక స్వరూపంలో దాదాపు విప్లవాత్మకమైన మార్పు వచ్చినట్లు శిలాశాసనాలు సూచిస్తాయి. చారిత్రక ఉల్లేఖనంలో తొట్టతొలిగా వేలాది మంది వ్యక్తులు, లెక్కలేనన్ని ప్రాంతాలు ఈ శాసనాలలో నమోదు చేయబడ్డాయి. అవన్నీ ఒక్కసారిగా వెల్లువలా వచ్చినట్లు కనపడతాయి.

తొలి సహస్రాబ్దిలో ఆవిర్భవించిన కొత్త పాలకవంశాలు చాలా వరకు సారవంతమైన లోయలు, ఆయకట్టులతో ముడిపడి ఉన్న సుదూర వాణిజ్య మార్గాలలో అభివృద్ధి చెందాయి. పంజాబ్‌లో రాచరికాలు పర్వత పాదాలలో వికసించాయి. గంగా, నర్మద, తపతి, సబర్మతి, మహానది, కృష్ణా, గోదావరి, పెన్నా, కావేరి, వాయిగాయ్ నదుల వెంబడి పాలకవంశాలు హెచ్చింపు అయ్యాయి. ద్వీపకల్పంలో అవి నదుల ఆయకట్టు ప్రాంతాలలో సుసంపన్నమయ్యాయి. మధ్యయుగాల రాజకీయ భౌగోళిక స్వరూపాన్ని చూపే ఎలాంటి చిత్రపటమైనా రంగులమయంగా కనిపిస్తుంది. ఎందుకంటే పాలకవంశాల రాజ్యాల సరిహద్దులు చాలా త్వరగా మారిపోయేవి. ఈ మార్పులు కూడా భారీ ఎత్తున సంభవించేవి. అయితే మధ్యయుగ రాజ్యాలలో అభివృద్ధి చెందిన సామాజిక వాతావరణాలు సుస్థిరమైన ఆర్థిక ప్రాంతాలలో పొదిగిఉండేవి. పెద్ద పాలక వంశాల పాలనా కాలం సగటున 300 సంవత్సరాలు ఉండేది. వీటితో పోలిస్తే మౌర్యులు, గుప్తుల పాలనా కాలం 137, 230 సంవత్సరాలు మాత్రమే. రాచరిక వంశాల విజయ రహస్యం భౌతిక, ఆధ్యాత్మిక శక్తిని నిర్వహించడానికి తగిన సామాజిక వ్యవస్థలను ఏర్పాటు చేయడంలో అవి పోషించిన కీలకపాత్రలో దాగి ఉంది. సంచార జీవితాన్ని గడిపే ప్రజల మధ్య సృజనాత్మక సంబంధాలను ఏర్పరచడంలో రాచరిక వంశాలు ఎంతో తోడ్పడ్డాయి. పెద్ద మనుషుల ఆధిపత్యం ఉండే గ్రామీణ ప్రాంతాల్లో, వ్యాపారులు, సైనికులు, వృత్తిదారులు, తీర్థయాత్రికులతో కిటకిటలాడే పట్టణాల్లో ప్రజల మధ్య విభిన్న రకాల సంబంధాలను పాలకులు అభివృద్ధి పరిచారు. ఫలితంగా పాలక వంశాలు సాంస్కృతిక ప్రాంతాలలో సంప్రదాయానికి సాంస్కృతిక ప్రతీకలుగా మారాయి. అలాంటి ప్రాంతాలు అనేక ఆధునిక సామాజిక స్వరూపాలకు మూలకేంద్రాలుగా మారాయి.

చారిత్రక సృజనాత్మకత కలిగిన ఈ మూడు సుదీర్ఘకాలాలలో సామాజిక ఉనికి యొక్క నూతన స్వరూపాలు, సముదాయాలు వెలుగులోకి వచ్చాయి. తొలి మధ్యయుగ కాలం దాదాపు తొలి సహస్రాబ్ది చివరి వరకు కొనసాగింది. దాని మూలాలు రాచరిక ఆధిపత్యం కలిగిన పరిమిత ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉండేవి. ఆ ప్రాంతాల్లో రాజులు స్థానిక ఉన్నత వర్గాలతో చేతులు కలిపి సామాజిక మార్పు దిశను నిర్దేశించారు. పదవ శతాబ్దం నుండి 14వ శతాబ్దం మధ్య దశకాల వరకు ఒక మధ్యయుగ పరివర్తన సంభవించింది. పాత

మధ్యయుగ రాజ్యాలలో మార్పునకు యుద్ధ వీరులు కారకులయ్యారు. రాజ్యాల వెలుపల ఉన్న కొత్త ప్రాంతాలకు (భూములు) కూడా విస్తరించారు. ఈ కొత్త ప్రాంతాలలో సైనిక పాలనలు కొండబురుజుల చుట్టూ అభివృద్ధి చెందాయి. ఈ బురుజులు వాణిజ్య మార్గాలతో అనుసంధానమై ఉండేవి. ఇలాంటి ప్రాంతాలలో యుద్ధవీరులు తమ బలాన్ని ఆశ్విక దళం, సైనిక వర్తనంతో చాటుకునే వారు. ఈ పరివర్తన తర్వాత మలి మధ్యయుగ కాలం కొనసాగింది. ఈ కాలపు రాజకీయ దురంధరులలో చక్రవర్తులు ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తారు. ఈ చక్రవర్తులలో గొప్పవారు 16వ శతాబ్దంలో మొగల్ సామ్రాజ్యాన్ని స్థాపించారు. దాదాపు రెండు శతాబ్దాలపాటు తన రాజకీయ ప్రాబల్యాన్ని చాటుకున్న మొగల్ సామ్రాజ్యం సామాజిక స్వరూపాన్ని గణనీయంగా మార్చివేసింది. మౌర్య, గుప్త సామ్రాజ్యాల వలె అది ఒక నూతన శకానికి నాంది పలికింది. దానిని 'తొలి ఆధునిక శకం' అని పిలవవచ్చు.

## తొలి మధ్యయుగ కాలం (ఏడు నుండి పదవ శతాబ్దం వరకు)

తొలి మధ్యయుగ రాజ్యాలు అనువంశిక పాలన గల మూల ప్రాంతాలలో సామాజిక సముదాయాల ప్రాబల్యం నుండి ఆవిర్భవించాయి. (ప్రాచీన) సామ్రాజ్యాల కంటే విస్తీర్ణంలో చాలా చిన్నవైన ఈ రాజ్యాలు సంపద పరంగా, సైనికపరంగా, ఉత్పత్తిపరంగా ఎంతో శక్తివంతంగా ఉండేవి. ఎందుకంటే మధ్యయుగ పాలక వంశాలు ప్రాంతీయ సమాజాలతో చాలా దగ్గరగా ముడిపడి ఉండేవి. ఈ సమాజాలు తమ ఉత్పాదక సామర్థ్యాన్ని అనూహ్యంగా పెంచుకుంటూ పోయాయి. ఈ నేపథ్యంలో రాచరిక కటుంబీకులు కప్పం, పన్నుల సేకరణతో తమను తాము సంపన్నులను చేసుకున్నారు. తమ సంపదను స్థానిక పెద్దల ప్రయోజనాలను నెరవేర్చే పథకాలపై వెచ్చించారు. ముఖ్యంగా ఆలయాలు, విహారాల (మఠాలు) నిర్మాణం, మత వేడుకలనిర్వహణ, నీటి పారుదల సౌకర్యాల కల్పన, మత శాస్త్రాలలో ప్రావీణ్యులైన భిక్షువులు, బ్రాహ్మణులకు చేయూత, వ్యవసాయక్షేత్రాలు, పట్టణాలను బందిపోటు దొంగల నుండి కాపాడడం, శత్రు రాజ్యాలనుండి రాచరిక ప్రాంతాలను పరిరక్షించడం, ఇతర ప్రాంతాల నుండి కప్పం రాబట్టేందుకు సైన్యాలను పంపడంపై ఎక్కువగా వెచ్చించారు. స్థానిక పెద్దలు భూమి, కార్మికులపై తమ పట్టును నిలుపుకునేందుకు రాజుకు పన్నులు, కప్పాన్ని చెల్లించేవారు. పాలకులతో కలిసి భూమి ఉత్పాదకతను పెంచడానికి పెట్టుబడులు పెట్టేవారు. రాచరిక వ్యవస్థలో స్థానిక పెద్దల భాగస్వామ్యం పెరిగే కొద్దీ పాలక వంశానికి స్థానిక మద్దతు కూడా పెరిగేది. అలా అవి తమ రాజ్యాలను అదుపులో ఉంచగలిగాయి. అలాగే చాలాకాలం పాటు పరిపాలన కొనసాగించాయి. అన్ని ప్రధాన రాచరిక వంశాలు స్థానిక ఉన్నత వర్గాల ఉనికిని చాలా వరకు నిర్ధారించాయి. అలాంటి వర్గాలు ఆధునిక కాలం వరకు కొనసాగాయి.

రాజకీయ వ్యవస్థల నిర్వహణ ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి, ఒక కాలం నుండి మరో కాలానికి వేర్వేరుగా ఉండేది. కాని సమకాలీన నివేదికలు కొన్ని సాధారణ

లక్షణాలను సూచిస్తాయి. రాచరిక వ్యవస్థలో వివిధ హోదాలు కలిగిన ప్రజల మధ్య కొనసాగిన సంబంధాలను ఆ నివేదికలు వెల్లడిస్తాయి. ఈ సంబంధాలవల్లే సార్వభౌమత్వం ఉద్భవించిందని, చట్టపరమైన లేదా రాజ్యాంగపరమైన శాసనాల వల్ల కాదని ఆ నివేదికలు స్పష్టం చేస్తాయి. ప్రజల సార్వజనిక కలయికల్లో వ్యక్తమయ్యే ఆరాధ్య భావం, గౌరవం సార్వభౌమత్వాన్ని ప్రతిబింబిస్తాయి. లిఖిత కలయికలు చాలా వరకు కానుకలు, ఒప్పందాలు హామీల రూపంలో ఉండేవి. ఒప్పంద హామీ పత్రాలు సాధారణ వ్యక్తులు, ఉన్నత స్థానంలో ఉన్న వారి మధ్య కుదిరేవి.

స్థానిక పెద్దలను లోబరచుకొని వారికి సార్వజనిక కార్యక్రమాల్లో తగిన గుర్తింపు ఇస్తూ పురోగామి రాజులు తమ ప్రాబల్యాన్ని పెంచుకొనే కొద్దీ పాలక వంశాలు కూడా విస్తరించాయి. పాత స్థానిక పాలకులను సార్వభౌమత్వంలో దిగువ శ్రేణులనుండి తప్పించడం ప్రమాదంతో కూడుకున్న వ్యవహారంగా ఉండేది. ఎందుకంటే వారి చుట్టూ ఉన్న సంబంధ, బాంధవ్యాలను కూడా అది ప్రమాదంలో పడవేసేది. స్థానిక సంబంధాలు ఉద్భవిస్తున్న రాచరిక వంశాలకు స్థానికంగా బలాన్ని చేకూర్చాయి. రాజ్యకాంక్ష ఉన్న వారు హోదాలు, గౌరవాలను కల్పించడం ద్వారా స్థానిక పాలకుల మద్దతును కూడగట్టేవారు. వారితో సంబంధాలను బలోపేతం చేసుకునే వారు. లేదా ఆ దిశగా కృషి చేసేవారు. రాచరిక కుటుంబాలు స్థానిక పెద్దలపై ఆధిపత్యం సాధించేందుకు పరస్పరం పోటీ పడేవి. ఆయా పాలక వంశాలు స్థానిక పెద్దలపై ఒత్తిడి తెచ్చేవి. ఒక స్థానిక పెద్దను మచ్చిక చేసుకోవడానికి కొన్నిసార్లు ఒకటి కంటే ఎక్కువ రాచరిక కుటుంబాలు ప్రయత్నించేవి. ఆ విధంగా చూస్తే స్థానిక పాలకుడు ఒకరి కంటే ఎక్కువ మంది రాజులను (సార్వభౌములను) గుర్తించేవాడని మనకు బోధ పడుతుంది.రాజు మహారాజు లేదా మహారాజాధిరాజుగా ప్రస్థానం కొనసాగించే కొద్దీ బహుళ సార్వభౌమత్వాలు కూడా అనేక అంచెలుగా రూపాంతరం చెందేవి. వీటి జాబితాలో కొత్త సామంతుల పేర్లు వచ్చి చేరేవి. ఫలితంగా స్థానిక ప్రజలు ఒక రాజుకు వంగి నమస్కారాలు చేస్తే ఆ రాజు తన కంటే పెద్ద రాజు ఎదుట మోకరిల్లేవాడు. అలా రాజుల శ్రేణి పెరుగుతూ ఉండేది. రాజు ఎంత బలవంతుడైతే అంతే ఎక్కువగా ప్రజలు అతడిని గౌరవించేవారు. ఆ ప్రజలు ఇతర రాజులను కూడా గుర్తించేవారు.

తమ వారసుల్లాగే తొలి మధ్యయుగ పాలకులు కూడా తమ ప్రాబల్యాన్ని ప్రత్యక్ష నియంత్రణ ద్వారా కాకుండా స్థానిక వనరులపై పరోక్షంగా ఆధిపత్యం తెచ్చుకోవడం ద్వారా విస్తరించుకునే వారు. తమ రాజ్య పరిధిలోకి అనేక ప్రాంతాలను కలుపుకునే వారు. సుదూర ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాలలో తమ హోదాను గరిష్ట స్థాయిలో చాటుకునేవారు.

వ్యవసాయ వలసవాదంతో రాచరిక ప్రాంతాలు కూడా విస్తరించాయి. ప్రతి రాచరిక కుటుంబం తమ మూల ప్రాంతంపై దృష్టి సారించినప్పటికీ రాజ్య పరిధులను విస్తరిస్తే కాని

అది అభివృద్ధి చెందేది కాదు. విస్తారమైన రాచరిక అభివృద్ధి కొత్త ప్రాంతాల్లో నూతన అధికార కేంద్రాలను సృష్టించింది. ఈ కేంద్రాలు చిన్నవే అయినప్పటికీ తమ తమ పరిధిలో సంపూర్ణ అధికారాన్ని కలిగి ఉండేవి. అధిక జనసాంద్రత కలిగిన మహానగరాల కంటే ఇలాంటి చిన్న గ్రామాలే ఎక్కువగా వెలిశాయి. మధ్యయుగ భౌగోళిక స్వరూపంలో ఇలాంటి పరిణామం జరగడం సహజం. అప్పటికీ కొత్త పొలాలను ఏర్పాటు చేసుకోవడానికి, కొత్త గ్రామాలను ఏర్పరచడానికి విశాలమైన భూభాగాలు అందుబాటులో ఉండేవి. ఇలాంటి విస్తరణ (రాచరిక ప్రాంతాల) స్థానిక పెద్దల అధికారాన్ని కూడా పెంచింది. వారు గ్రామీణ వ్యవసాయ విస్తరణను నిర్వహించడంతోపాటు దానిని నియంత్రించేవారు. మధ్యయుగ భారతదేశంలో రాజ్యం పెద్ద ఎత్తున వ్యవసాయ వలసవాదాన్ని ప్రోత్సహించిన దాఖలాలు చరిత్రలో ఎక్కడా నమోదు కాలేదు. స్థానిక పెద్దలు వ్యవసాయ విస్తరణను నియంత్రించిన కారణంగా మధ్యయుగ రాచరిక కుటుంబాలకు అత్యంత అవసరమైన వనరులన్నీ వారి చేతుల్లో కేంద్రీకృతమై ఉండేవి.

రాజకీయ భౌగోళిక స్వరూపం (శిలాశాసనాలు ప్రత్యక్షమైన ప్రతి చోట) స్థానిక ప్రాంతాలతో కూడి ఉండేది. ఈ ప్రాంతాలలో బహుళ అంచెల సార్వభౌమత్వాలు ఉండేవి. ఎందుకంటే స్థానిక పాలకులు ఒకరికంటే ఎక్కువ మంది రాజులను గుర్తించేవారు. రాచరిక పరిధులు కూడా వివిధ దిశల్లో విస్తరించేవి. ఎలాంటి శిలాశాసనాలు లేని విశాలమైన భూభాగాలు అనేక రాజ్యాల పరిధిలో ఉండే ప్రాంతాలకు దగ్గరగా ఉండడంవల్ల వాటి యాజమాన్యం అస్థిరంగా ఉండేది. స్థిరమైన సరిహద్దులు గల రాజ్యపాలిత ప్రాంతాలుగా కాకుండా వాటి స్వరూపం తరచూ మారుతూ ఉండేది.

ఒక సార్వభౌముని గుర్తించే ప్రాంతం మరో సార్వభౌముని గుర్తించే ప్రాంతంలో ఇమిడి పోయేది. ఈ వ్యవహారం ఆధునిక రాజకీయ వ్యవస్థలు ఏర్పడే వరకు కొనసాగింది. 16వ శతాబ్దంలో అమల్లోకి వచ్చిన ఆధునిక వ్యవస్థలు 19వ శతాబ్దంలో పరిణతి చెందాయి.

మధ్యయుగ రాచరిక కుటుంబాలు అనేకం సామ్రాజ్యవాద, ప్రాంతీయవాద, స్థానిక వాద అంశాలను జతపరిచాయి. అనేక రాజ్యాలు సామ్రాజ్యాల తరహాలో విస్తరించాయి. పోటీ, బహుళ నియంత్రణ ఉన్న ప్రాంతాలను ఏర్పరిచాయి. తొలి పాలక వంశాలు మూల ప్రాంతాల నుండి లభించిన స్థానిక మద్దతు కారణంగా అభివృద్ధి చెందాయి. సాంస్కృతిక ప్రాంతం ఏ విధంగా ఒక రాజ్యం నుండి మరో రాజ్యానికి మారేదో తమిళనాడు చరిత్రను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఆరవ శతాబ్దం మొదలుకొని పదిహేడవ శతాబ్దం వరకు పల్లవ, చోళ, పాండ్య, చెరా, విజయనగర, నాయక వంశాలు తమిళనాడు ప్రాంతంలో బహుళ సార్వభౌమత్వాలను స్థాపించాయి. తమిళ భాష ఈ ప్రాంతానికి సాంస్కృతికంగా ఒక ప్రత్యేక గుర్తింపునిచ్చింది. రాజ్య అధికారం పొరుగున ఉన్న కర్ణాటకలో కూడా విస్తరించింది. కేరళ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర శ్రీలంకలో కూడా పై రాజ్యాలకు భౌగోళిక నియంత్రణ, ఆధిపత్యం

ఉండేవి. తమిళ ప్రాంతాన్ని పాలించిన అతిపెద్ద వంశం కర్ణాటకలోని విజయనగరలో 14వ శతాబ్దంలో ఆవిర్భవించింది. ఈ వంశానికి చెందిన ప్రముఖ పాలకులు తెలుగు, కన్నడ భాషలను మాట్లాడేవారు.

తమిళ ప్రజలపై పాలన సాగించిన వంశాలన్నీ మౌలికంగా తమ స్వంత నివాస ప్రాంతాలనే అట్టిపెట్టుకుని ఉండేవి. పాండ్య దేశం (మధురై చుట్టూ)లో వెలువడిన శిలాశాసనం చోళుల దండయాత్రను సామ్రాజ్యవాద ఆధిపత్యంగా పరిగణిస్తాయి. అలాగే తంజావూరులోని చోళ శిలాశాసనాలు పాండ్యుల దండయాత్రను అదే రీతిలో గుర్తిస్తాయి. మధ్యయుగ పరిస్థితులను బట్టి చూస్తే రాజ్య సరిహద్దుల కంటే స్థానిక పాలకుల వ్యక్తిగత విధేయత ఆధారంగానే రాజ్యాలు కొనసాగేవని అర్ధమవుతుంది. ఆ విధంగా చోళ, పాండ్య రాజులు వేర్వేరు ప్రాంతాలను పాలించేవారు.

తొలి మధ్యయుగ రాజకీయ పాలనా కేంద్రాన్ని "నాడు"గా పిలిచేవారు. ఇందులో వ్యవసాయిక గ్రామాలు పరిమిత సంఖ్యలో ఉండేవి. ఒక్క పాండ్య రాజ్యంలోనే మదురైకి దక్షిణాన 30 నాడులు ఉండేవి. మధ్యయుగ 'నాడు' స్థానిక పాలన పరిధిని సూచిస్తుంది. వ్యక్తిగత విధేయత, మైత్రి ఆధారంగా ఈ నాడులు ఆయా రాజ్యాల పరిధిలో ఉండేవి. అయితే స్థానిక పరిపాలన కేంద్రాలు విశాలమైన సాంస్కృతిక సంబంధాల ఆధారంగా నిర్ధారించబడేవి. ప్రస్తుత తమిళనాడు రాష్ట్రంలోని ప్రాంతాలపై బహుళ సార్వభౌమత్వాలు కొనసాగినా 'నాడు' అనేపదం అన్ని చోట్లా ప్రత్యక్షం కావడం అందుకు నిదర్శనం.

## మధ్యయుగ పరివర్తనం (11-15 శతాబ్దాలు)

క్రీస్తు శకంలోని తొలి సహస్రాబ్ది ముగిసి రెండవ సహస్రాబ్దికి బాటలు వేస్తుండగా రాజకీయ పరిధులు గణనీయంగా మారిపోయాయి. చోళుల సామ్రాజ్య విస్తరణ పతాక స్థాయికి చేరుకున్న తర్వాత ద్వీపకల్పంలో రాచరిక వంశ ప్రాబల్యం సముద్ర తీరం నుండి లోపలి ఎగువ ప్రాంతాలకు మారింది. అక్కడ యుద్ధ తెగలు, సంచార జాతులు కాలక్రమంలో సైనిక – రైతాంగ సంబంధాలను ఏర్పరచుకున్నాయి. కర్ణాటక, ఆంధ్ర, మహారాష్ట్రలలో వంశ ప్రాబల్యం గల కొత్త కేంద్రాలు ఆవిర్భవించాయి. మాల్వా, రాజస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియా వాణిజ్య మార్గాల గుండా పయనిస్తూ దాడులు నిర్వహించే శత్రు సైన్యాలతో స్థానిక యోధులు తలపడేవారు. ఖాన్‌దేష్, బెరార్, మహారాష్ట్ర, ఆంధ్ర, కర్ణాటకలలో కేంద్రీకృతమైన దక్కను సైనికీకరణ (మలి మధ్యయుగంలో) సామాజిక మూలాలు 'ప్రాచీనచరిత్రలు' కలిగిన ఈ భూమిలోనే ఉన్నాయి. వ్యవసాయ సమాజాల లోపల, చుట్టూ ఉన్న యోధులను సమీకరించడంతోనే రాచరిక వంశాలు ఆవిర్భవించాయి. అయితే అవి సంచార, వేట, పర్వత ప్రాంత సమాజాల నుండి కూడా పుట్టుకొచ్చాయి. తొలి పాలకవంశాలు చాలా వరకు వన సంచార జాతుల నుండే వచ్చాయి. అయితే తర్వాత ఆవిర్భవించిన వంశాలు మాత్రం ఎక్కువగా

వ్యవసాయదారుల సమాజాలకు చెందినవి. కరవును తరచుగా ఎదుర్కొనే దక్కను ప్రాంతంలో మందు వేసవిలో పోరాటానికి సంసిద్ధత, అంగీకారం సహజంగా వచ్చేది. మధ్యయుగ దక్కనులో ప్రధాన వ్యవసాయదార కులాలన్నీ సైనికులు, క్షేత్ర స్థాయి రైతులిద్దరినీ కలిగి ఉండేవి.

అందుకు భిన్నంగా రాజస్థాన్‌లో రాజ్‌పుత్ అనే ఏకైక ప్రధాన సముదాయం ఆవిర్భవించింది. ఈ కులం వ్యవసాయంలో ఎప్పుడూ పాలు పంచుకోలేదు. తమ పాలితులైన రైతులకు ఆ బాధ్యతను పూర్తిగా అప్పగించింది. తొమ్మిదవ శతాబ్దంలో రాజ్‌పుత్ సముదాయంలోనే వేర్వేరు తెగలు అభివృద్ధి చెందాయి. చహమానులు (చౌహాన్లు), పరమారులు (పవార్లు), గుహిళులు (సిసోడియాలు), చాళుక్యులు (సోలంకిలు) విశాలమైన గుర్జర ప్రతిహార కుదురుల నుండి పుట్టుకొచ్చాయి. ప్రతిహారుల పూర్వీకులు వన సంచార జీవితాన్ని గడుపుతూ క్రమంగా సామ్రాజ్యవాద మధ్యయుగ రాజరిక వంశాన్ని స్థాపించారు. ఈ వంశం రాజస్థాన్, మాల్వా, గంగా తీరప్రాంతంలో విస్తరించింది. తర్వాతి శతాబ్దాలలో వేర్వేరు రాజ్‌పుత్ కుటుంబాలు మైదాన ప్రాంతాలు, పొరుగున ఉన్న పర్వత ప్రాంతాలకు విస్తరించాయి. ఈ ప్రాంతాలలో కోటలను నిర్మించారు. బ్రాహ్మణులను పూజారులుగా నియమించారు. అయితే యుద్ధం, తెగపట్ల వారి విధేయత, రైతులపై ఆధిపత్యం రాజ్‌పుత్ ధర్మంలో కీలక సూత్రాలుగా మారాయి. వారు మిత్రులను, అనుకరణవాదులను ఆకర్షించి తమను తాము ఆదర్శవంతమైన క్షత్రియులుగా తీర్చిదిద్దుకున్నారు. రాజ్‌పుత్ సాంస్కృతిక ప్రభావం వారి మిత్రుల్లో, పోటీదారుల్లో, అనుకరణవాదుల్లో గణనీయంగా విస్తరించింది.

రాజ్‌పుత్ పూర్వీకుల గాధను వీరోచితంగా తీర్చిదిద్దిన వంశ చరిత్రలు రాజ్యకాంక్షగల పాలకులకు ప్రామాణికంగా మారాయి. వీరు రాజస్థాన్‌లోని తూర్పు ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పైకి వచ్చారు. తెగ రాజ్యాలన్నింటినీ రాజ్‌పుత్ సంస్కృతి పూర్తిగా తన ప్రభావంలోకి తీసుకునే వరకు(18వ శతాబ్దంలో) వంశ చరిత్రలే ఆయా వ్యక్తుల రాచరికహోదాను ప్రసాదించేవి. రాజ్‌పుత్ ఆధిపత్యం కారణంగా ఉత్తర భారతదేశంలోని రాజస్థాన్, పశ్చిమ గంగాతీరం, పంజాబ్‌లలో జాట్ రైతులు ఒక యుద్ధ తెగగా ఎదిగారు. ఈ ప్రాంతాలలో వారు సురక్షితమైన గ్రామాలను, కొండ బురుజులను నిర్మించారు.

భారతదేశంలో మధ్యయుగ పరివర్తనను వేగిర పరచిన యుద్ధ వీరుల మూడవ వర్గం టర్కీ, ఆఫ్ఘనిస్తాన్, మంగోలియాకు చెందిన తెగలతో కూడుకొని ఉంది. వీరు గుర్రాలపై స్వారీ చేస్తూ శత్రు సముదాయాలను ఊచకోత కోసేవారు. ఆఫ్ఘనిస్తాన్, పర్షియా (ఇరాన్), మధ్య ఆసియాలోని ఎగువ ప్రాంతాలపై వీరి యుద్ధ సమాజానికి ప్రాబల్యం ఉండేది. పదవ శతాబ్దం తర్వాత వీరు దిగువ ప్రాంతాలలో కూడా బలమైన సైనిక శక్తిగా ఎదిగారు. మహ్మద్ ఘజ్ని తండ్రి సబుక్తిగిన్ పంజాబ్‌లో హిందూ షాహీలతో పోరాడాడు. ఆఫ్ఘనిస్తాన్, పర్షియాలలో తన యుద్ధాలకు తగిన వనరులను సమకూర్చుకునేందుకు అతడు ఈ దండయాత్ర చేపట్టాడు.

మహ్మద్ 997లో తన తండ్రి వారసత్వాన్ని స్వీకరించాడు. తన తండ్రి ఆశయాల సాధనకు అన్ని దిశల్లోనూ విస్తరించాడు. అతడు ఆఫ్ఘనిస్తాన్, పర్షియాలను జయించాడు. ఖలీఫా నుండి 'యామిన్ అల్‌దౌలా' (ఇస్లామిక్ రాజ్యం కుడి భుజం) అనే బిరుదును పొందాడు. భారతదేశంపై 17సార్లు దండయాత్ర చేసి స్థానిక పాలకుల నుండి కప్పం రాబట్టాడు. ప్రసిద్ధ భౌగోళ శాస్త్రవేత్త అల్‌బెరూని అధ్యయనానికి నిధులను కూడా సమకూర్చాడు. శతాబ్దాల తరబడి అరబ్ భౌగోళ శాస్త్రవేత్తలు రూపొందించిన వ్యాపార మార్గాల గుండా ప్రయాణించి సమగ్రమైన చిత్రపటాలను అల్‌బెరూని రూపొందించాడు. వాటి ఆధారంగానే మహ్మద్ తన దండయాత్రలను కొనసాగించాడు. అల్‌బెరూని చిత్రపటాలు సింధూ-గంగా నదీ తీరాలలోని అన్ని ప్రాంతాలను, హిందూ మహాసముద్ర తీరాన్ని, ముఖ్యంగా గుజరాత్, సింధ్ ప్రాంతాలను చూపుతాయి. ఘజ్నిలోని భారత ధనిక వ్యాపారులు మహ్మద్‌కు రహస్య సమాచారాన్ని అందించి ఉంటారు. సైనిక దాడి కోసం సంపన్నమైన ప్రాంతాలను సూచించి ఉంటారు. మహ్మద్ కాలం నాటికి సింధూ, గంగా పరివాహక ప్రాంతాలు (రాజస్థాన్, గుజరాత్) మధ్య అసియా వాణిజ్య వ్యవస్థలో భాగంగా ఉండేవి. ఈ ప్రాంతాలను మహ్మద్ మధ్య ఆసియా రాజకీయాల పరిధిలోకి కూడా తెచ్చాడు. 12 నుండి 14వ శతాబ్దం వరకు మధ్య ఆసియా నుండి వచ్చిన సైన్యాలు భారత ఉత్తర మైదాన ప్రాంతాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. అల్‌బెరూని అధ్యయనం (1048) నుండి మార్కోపోలో (1271-1295), ఇబ్న్ బట్టుటా (1325-1354) యాత్రల వరకు దక్షిణ యురేషియాలోని భూమార్గాలలో రవాణా మధ్య ఆసియా వైరి పాలక వంశాలకు నిరంతర సంచార మార్గంగా మారిపోయింది. పర్షియాలోని కౌమ్ నుండి మధ్య ఆసియాలోని సమర్‌ఖండ్, భారతదేశంలోని ఢిల్లీ, సూరత్ నుండి నేటి బంగ్లాదేశ్‌లోని ఢాకా వరకు సామ్రాజ్య విస్తరణ కోసం ఆయా వంశాలు (తెగలు) పోటీ పడ్డాయి. అదే సమయంలో భారత సముద్ర తీరం సమగ్రమైన వాణిజ్య వ్యవస్థగా అభివృద్ధి చెందింది. పదమూడవ శతాబ్దంలో ఢిల్లీలో ఒక కొత్తరకమైన రాజ్యం ఆవిర్భవించింది. ఢిల్లీ సుల్తానుల రాజ్యం పుట్టుపూర్వోత్తరాలు ముహమ్మద్ ఘోరి విజయాలలో ఉన్నాయి. అతడు 1186లో ఘజ్నవీయులను పెకలించివేయడానికి సింధూలోయలోకి పెద్ద సైన్యంతో ప్రవేశించాడు. 1190లో అతడు రాజస్థాన్‌లోని భటిండాను స్వాధీనం చేసుకున్నాడు. ఈ పరిణామం పృథ్వీరాజ్ చౌహాన్‌తో అనేక యుద్ధాలకు దారి తీసింది. 1192లో ఘోరి ఎట్టకేలకు చౌహాన్‌ను ఓడించాడు. 1206లో ముహమ్మద్ మరణించినపుడు అతడికి అత్యంత విశ్వాసపాత్రుడైన మమ్లూక్ సైనికాధికారి (మాజీ బానిస) కుతుబుద్దీన్ ఐబక్ ఒక స్వతంత్ర పాలక వంశాన్ని స్థాపించాడు. ఢిల్లీ కేంద్రంగా స్థాపితమైన ఈ వంశం ఢిల్లీ సుల్తానుల రాజ్యం అని ఉమ్మడిగా పిలిచే పాలక వంశానికి నాంది పలికింది.

ఆసియాలో తిరుగులేని మంగోలులను తరిమికొట్టడంతో ఢిల్లీ సుల్తానుల రాజ్య ప్రతిష్ఠ అమాంతంగా పెరిగిపోయింది. ఛంగీజ్ ఖాన్ (1160–1227) మంగోలు తెగలను ఐక్యం చేసి చరిత్రలో ఎన్నడూ ఎరుగని రీతిలో మహా సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని ఆకాంక్షించాడు. అతడి మనవళ్లలో ఒకడైన బతుఖాన్ 1237లో మంగోలు సైన్యాలను ఐరోపాలోకి నడిపించాడు. బల్గేరియా, మాస్కో, కీవ్, హంగేరి, పోలెండ్‌లను ఆక్రమించి అక్కడి పాలకులను స్వర్ణద్వారానికి కప్పం చెల్లించేలా వివశులను చేశాడు.

మరో మనవడు కుబ్లాయ్ ఖాన్ ఉత్తర చైనాను స్వాధీనం చేసుకున్నాడు. 1271లో యువాన్ చక్రవర్తిగా బాధ్యతలు స్వీకరించాడు. 1279లో అతడి సైన్యాలు చిట్టచివరకు దక్షిణ చైనాకు చెందిన సుంగ్ చక్రవర్తిని ఓడించాయి. కుబ్లాయ్ వంశం 1368 వరకు చైనాను పాలించింది. యురేషియా అంతటా మంగోలు తపాలా, రహదారుల వ్యవస్థ వెలసింది. ఈ మార్గాలు చైనా నుండి తుర్కిస్తాన్, పర్షియా, రష్యా వరకు విస్తరించాయి. భూమార్గాన సరుకుల రవాణా పుంజుకుంది. ఫలితంగా చైనా నుండి మందుగుండు, దిక్సూచి, ముద్రణా యంత్రాలు ఐరోపా రాజ్యాలకు చేరాయి. ఈ మార్గాల గుండా మార్కోపోలో వెనీస్ నుండి చైనాకు, మరలా వెనీస్‌కు పయనించాడు. అయితే మంగోలులు భారతదేశాన్ని మాత్రం ఆక్రమించలేకపోయారు. వరుసగా దండయాత్రలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో వారు సింధూలోయ నుండి వెనుదిరిగారు. తమ సైనిక ప్రాబల్యాన్ని ఇతర ప్రాంతాలలో ప్రదర్శించాలని నిర్ణయించుకున్నారు. అందులో ఘన విజయం కూడా సాధించారు. వివాహ సంబంధాల కారణంగా మంగోలులతో బాంధవ్యాన్ని పెంచుకున్న తుర్కు యుద్ధవీరులు మాత్రం భారతదేశంలో విజయం సాధించారు. తైమూర్‌లేన్ అని కూడా పిలవబడే తైమూర్, సమర్‌ఖండ్ సమీపంలోని కిష్ వద్ద జన్మించాడు. మంగోలువారసత్వ రాజ్యమైన సమర్‌ఖండ్ కొద్ది కాలం మాత్రమే కొనసాగింది. ట్రాన్స్ ఆక్సియానాకు చెందిన చగతాయి ఖాన్ కుటుంబ వారసుడైన తైమూర్ గవర్నర్‌గా, వజీరుగా (మహామంత్రి) పని చేశాడు. చివరకు 1370లో ఖాన్‌కు వారసునిగా పాలనా బాధ్యతలను చేపట్టాడు. 1387 నాటికి పర్షియా, ఆఫ్ఘనిస్తాలను స్వాధీనం చేసుకున్న తర్వాత అతడు 1398లో భారత దేశంలోకి ప్రవేశించాడు. గంగా పరీవాహక ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొని ముల్తాన్ గవర్నర్‌ను ఢిల్లీ గద్దెపై కూర్చోబెట్టాడు. ఆఫ్ఘనిస్తాన్‌కు తిరుగు ప్రయాణం చేపడుతూ ఈ నియామకం చేశాడు. అతడి విజయాలు ఢిల్లీ సుల్తానుల రాజ్య సామ్రాజ్య అధికారాన్ని హరించివేశాయి. ఆ రాజ్యం ముక్కలు ముక్కలుగా చీలిపోయి ప్రాంతీయ శక్తిగా మిగిలిపోయింది. ఈ ప్రాంతాన్ని కూడా 1526లో బాబర్ ఆక్రమించాడు. తాను తైమూర్, ఛంగీజ్‌ఖాన్‌లిద్దరికీ వారసుడినని బాబర్ ప్రకటించేవాడు.

తొలి సహస్రాబ్ది చివరలో ప్రారంభమైన మధ్యయుగ పరివర్తన తొలి,మలి మధ్యయుగ చరిత్రను వేరు చేస్తుంది. తొలి మధ్యయుగ కాలంలో మూల ప్రాంతాల (వారసత్వ పాలన బలంగా ఉన్న)లో వచ్చిన అంతర్గత మార్పులు స్థానిక సమాజాలను మార్చడంలో కీలక పాత్ర పోషించాయి. 1200 నాటికి ఇది ఏ మాత్రం వాస్తవం కాదు. సుదూర ప్రాంతాల నుండి

వచ్చిన యుద్ధ తెగలు స్థానిక చరిత్రల్లో అన్ని చోట్లా ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయి. గుర్జర ప్రతిహారులు, సామ్రాజ్యవాద చోళులతో యోధుల శకం మొదలైంది. ఘజ్నికి చెందిన మహ్మద్ తెరపైకి వచ్చే నాటికి వ్యవసాయ ఉన్నత వర్గాలపై ఉద్దేశ్యపూర్వకంగా ఆధిపత్యం వహించడం పాలకులకు సర్వసాధారణమై పోయింది. ఘజ్నవీలు, వారి వారసులు వృత్తిపరమైన సైనిక సామ్రాజ్యవాదాన్ని విస్తరించి, సమీకృతం చేసి దానికి వ్యవస్థాగత స్వరూపాన్ని ఇచ్చారు. అలాగే సైనిక పాలకుల ప్రాంతీయ మూలాలు, సాంస్కృతిక కూర్పులో కూడా గణనీయమైన మార్పును తీసుకువచ్చారు.

భారతదేశ మధ్యయుగ పరివర్తన కాలంలో మధ్య ఆసియా యోధులు తమ ప్రాబల్యాన్ని స్వల్పకాలంలో చాటుకున్నారు. వేగంగా కదిలే గుర్రాలపై స్వారీ చేసే నిపుణులైన విలుకాండ్ర ధాటికి, భారీ సైనిక మోహరింపుకి జడిసి శత్రు సైన్యాలు అట్టే లొంగిపోయేవి. ముట్టడి, క్షేత్రస్థాయి పోరాటంతో, సమర్థవంతమైన ఆశ్వికదళంతో, సుదూర లక్ష్యాలను సైతం ఛేదించగల ఫిరంగులతో, రోజుల తరబడి యుద్ధరంగంలో స్థిరంగా నిలబడే సామర్థ్యంతో ఈ సైన్యాలు దండయాత్ర ఫలాలను పూర్తిగా దక్కించుకునేవి. ఈ తరహా యుద్ధతంత్రానికి తుర్కు, ఆఫ్ఘన్ తెగలు సమర్థవంతమైన సైనికులను అందించేవి. తెగ సంఘీభావం, సైనిక క్రమశిక్షణ, స్ఫూర్తి కలిగిన ఈ సైనికులు భీకరంగా తలపడేవారు. మరోవైపు మధ్య ఆసియా భూభాగాలు, తెగలు(పశుపోషకులు) ఈ సైన్యాలకు తక్కువ ధరకు అశ్వాలను అందించేవి. అలాగే మంగోలు సామ్రాజ్య పరిధిలోని రవాణా మార్గాలు ఉన్నతమైన యుద్ధ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చేవి. అందుకు భిన్నంగా హిందూకుష్ పర్వతశ్రేణులకు తూర్పు, దక్షిణాన ఉన్న సమకాలీన పాలక వంశాలు అఫ్ఘనిస్తాన్, అరేబియాల నుండి భూ, సముద్ర మార్గాల ద్వారా దిగుమతి చేసుకునే అశ్వాలపై ఆధారపడేవి. ఆశ్విక దళాలున్నప్పటికీ అవి ప్రధానంగా గజదళాల సహాయంతో పోరాడేవి. అంతిమ సైనికుని వరకు పోరాడటం చాలా అరుదు. ఆశ్విక దళాలను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా తగిన కోటలను కలిగి ఉండేవి కావు.

తమ మధ్య ఆసియా యుద్ధాలకు వనరులను సమకూర్చిపెట్టగల సంపన్నమైన ప్రాంతంగా భారతదేశాన్ని అక్కడి యోధులు పరిగణించారు. ఘజ్నవీలు, ఘురీద్‌లు, తైమూరు... ఇలా అందరూ భారతదేశంవైపు చూసేవారు. అయితే ఢిల్లీ సుల్తానుల చేతిలో మంగోలు సైన్యాలు ఘోర పరాభవాన్ని చవిచూడడంతో రాజకీయ వాతావరణం పూర్తిగా మారిపోయింది. మధ్య ఆసియా సుల్తాన్లకు భారతదేశంలో మంచి పట్టు లభించింది. వారు స్థానికులతో బాగా కలిసిపోయారు. అలాగే సంపన్నమైన ఉత్తర భారత ప్రాంతాన్ని శత్రువుల నుండి సంరక్షించే బాధ్యతను భుజాన వేసుకున్నారు. మారుతున్న రాజకీయ వాతావరణంలో వారు అంతర్భాగమయ్యారు. ఆ విధంగా మంగోలులు తాము ఎన్నడూ చూడని భారత ప్రాంతాలలో పరోక్షంగా ఎన్నో పరిణామాలకు కారణభూతమయ్యారు. మంగోలు యుద్ధ తంత్రంలో బాగా

శిక్షణ పొందిన ఐబక్, ఇల్తుమిష్, బాల్బన్ తదితర పోరాటవీరులు తమ నైపుణ్యాన్ని మంగోలు సైన్యాలను అడ్డుకోవడంలో ప్రదర్శించారు. భారత దిగువ ప్రాంతాలలో స్థిరపడిన తర్వాత తుర్కు, ఆఫ్ఘన్ సుల్తానులు స్థానిక సమాజాలలో సభ్యులుగా మారారు. భారతదేశంలో పునరావాసం పొందిన ప్రవాస మధ్య ఆసియా వలసదారులయ్యారు. అయితే వలసయోధులు మధ్య ఆసియా నుండి తరచూ దాడి చేస్తూ భారత దిగువ భూభాగాలను ఆక్రమించసాగారు. స్థానిక ప్రత్యర్థులకు లేని విధంగా మధ్య ఆసియా వ్యాపార మార్గాలు బాగా అందుబాటులో ఉండడంతో వారు అత్యాధునిక సైనిక పరికరాలు, పరిజ్ఞానాన్ని పొందగలిగారు. ఈ కారణంగానే వారు తమ దండయాత్రలలో విజయాలను కైవసం చేసుకున్నారు. పదహారవ శతాబ్దంలో బాబర్ అందుకు ఓ మంచి ఉదాహరణ. చివరికి ఢిల్లీ సుల్తానులకు వ్యతిరేకంగా అతడు ఫిరంగులను, ఉన్నత శ్రేణి ఖడ్గ కవచాలను సమర్థవంతంగా వినియోగించారు. అప్పటికీ ఢిల్లీ సుల్తానులు సాంప్రదాయబద్ధమైన మధ్య ఆసియా యుద్ధ తంత్రాన్నే పాటించేవారు.

**ఆధునికత అంచున మొగలులు (16-18 శతాబ్దాలు)**

మొగల్ సామ్రాజ్య ఆవిర్భావం మధ్యయుగ భారతదేశ చరిత్రలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. ఆక్రమణ, ఆధిపత్యం కంటే వారు ఎంతో ఎక్కువ సాధించారు. ఒక సామ్రాజ్యవాద సమాజాన్ని స్థాపించారు. ఎన్నో ఆధారాల నుండి శక్తిని గ్రహించిన ఈ సమాజం తన ప్రభావాన్ని విస్తరించుకుంటూపోయింది. స్థానిక పాలకులను దాసోహం చేసుకునే శక్తి మొగల్ పాలకులకు నశించినప్పటికీ వారి సామ్రాజ్యం మాత్రం సైనిక శక్తి ఆధారంగా దేశమంతటా వ్యాపించింది. మధ్యయుగానికి చెందిన ఈ మహా సామ్రాజ్యం ఆధునిక యుగపు తొలి అంచులకు చేరుకుంది. ఉజ్బేక్ సైన్యాల నుండి తప్పించుకోవడానికి తన పూర్వీకుల భూమి అయిన సమర్‌ఖండ్‌ను వదిలివచ్చిన బాబర్ చగతాయ్ తుర్కు వంశానికి చెందిన వాడు. భారత మైదాన ప్రాంతాలలో అతడు ఉజ్బేక్ తరహా ఆశ్విక దళ పద్ధతులలో చొచ్చుకొని వచ్చాడు. మందుగుండు తుపాకులు, ఫిరంగులతో ప్రత్యర్థి సైన్యాలను తుడిచిపెట్టాడు. ప్రత్యర్థి సైన్యాలు మనుగడ సాగించినా అతడు పంజాబ్‌నుండి బెంగాల్ వరకు దండయాత్ర జరిపాడు. సరిగ్గా 14 ఏళ్ల తర్వాత షేర్‌షాసుర్ బీహార్, బెంగాల్‌లలో ఒకకొత్త వంశాన్ని స్థాపించాడు. అంతకుముందు అతడు లోధీలు, బాబర్ ఇద్దరి పక్షాన పోరాడాడు. జౌన్‌పూర్‌లో విద్యాభ్యాసాన్ని (పార్సీ) పొందిన సుర్ తన ప్రతిభను అనతి కాలంలోనే చాటుకున్నాడు.అతడి సైన్యాలు బాబర్ వారసుడైన హుమాయూన్‌ను అజ్ఞాతవాసంలోకి నెట్టివేశాయి. షా మరణం తర్వాత సుర్ వంశం ఎంతో కాలం మనుగడ సాగించలేకపోయింది. సుదీర్ఘ పర్యవసానాలు గల పరిపాలనా సంస్కరణలు ఎన్నింటినో చేపట్టినప్పటికీ ఆ వంశం నిలదొక్కుకోలేకపోయింది. 1555లో ఢిల్లీ గద్దెను చేజిక్కించుకున్న హుమాయూన్ అక్కడ ఒక ప్రమాదంలో మృతి చెందాడు. అతడి 14 ఏళ్ల కుమారుడు అక్బర్ 1556లో సింహాసనాన్ని అధిష్టించాడు. అక్బర్ సంరక్షకుడు, సైన్యాధ్యక్షుడు అయిన బైరమ్ ఖాన్ కీలకమైన నగరాలను స్వాధీనం చేసుకొని మాల్వా,

రాజస్థాన్‌లను లొంగదీసుకున్నాడు. ఆ తర్వాత అతడు బహిష్కరణకు గురై హతుడయ్యాడు. అక్బర్ (1556–1605) తన భారీ సైన్యాలతో వివిధ రాజ్యాలను ఆక్రమించడం మొదలుపెట్టాడు. సైనిక బలం, నిధులు, నాయకత్వం, సాంకేతిక పరిజ్ఞానం, విజయం తదితర విషయాలలో అక్బర్ సైన్యాలకు తిరుగులేకుండా పోయింది.

సజీవంగా ఉన్న ఒకే ఒక్క కుమారుడు జహంగీర్ (1605–1627)కు అక్బర్ వారసత్వం లభించింది. అతడి తర్వాత వారసత్వ పోరులో విజయం సాధించిన షాజహాన్ (1627–58), తదుపరి ఔరంగజేబ్ (1658–1707) మొగల్ సామ్రాజ్యాన్ని పాలించారు. ఔరంగజేబ్ మరణం తర్వాత మొగల్ సామ్రాజ్య పతనం ప్రారంభమైంది. బ్రిటీషు దళాలు ఢిల్లీ పీఠాన్ని 1858లో హస్తగతం చేసుకునే వరకు మొగల్ వంశం కొనసాగినా దాని ప్రభావం వందేళ్లకు ముందే క్షీణించిపోయింది.

ప్రతి చక్రవర్తి తన సొంత సారథ్యంలో ఎన్నో సైన్యాలను కలిగి ఉండడమే మొగల్ విజయ రహస్యం. మొగల్ సైనికాధికారులు వ్యక్తిగతంగా బలవంతులే కాకుండా సంచార సైన్యాలను, తగిన పరికరాలను, నిర్ణయాత్మక చర్యను తీసుకునే శక్తిని కలిగి ఉండేవారు. అయితే మనుగడ కోసం వారు సామ్రాజ్యంపై ఆధారపడక తప్పేదికాదు. ఇలాంటి అధికారులపై కేంద్రీకృత నియంత్రణ ఉండడంవల్ల వారు కొంత కాలంపాటు సామ్రాజ్యానికి విధేయులుగా ఉన్నా స్థానిక సవాళ్లు, అవకాశాలను నిర్ణయాత్మకంగా అందిపుచ్చుకునే సామర్థ్యాన్ని కోల్పోయారు. ఎందుకంటే రవాణా, సంచార, సమాచార వ్యవస్థలు నెమ్మదిగాను, అత్యంత ఖరీదైనవిగాను ఉండేవి. పదవీ కాంక్షగల శక్తిమంతులైన సైనికాధికారులు తీవ్రమైన కేంద్రీకృత నియంత్రణ కారణంగా కొన్నిసార్లు అవిధేయులుగా, విద్రోహులుగా మారే అవకాశం ఎప్పుడూ ఉండేది. నిర్ణయాత్మకమైన సైనిక శక్తిని నియంత్రించే సంస్థానాధీశుల వ్యక్తిగత విధేయత కలిగి ఉన్నంత వరకూ మొగల్ చక్రవర్తులు విజయ పరంపరను కొనసాగించారు. సంస్థానాధీశుల స్వయం ప్రతిపత్తి, విధేయతలను సమాన స్థాయిలో ఉంచడానికి సామ్రాజ్య సంపదను పెంచక తప్పలేదు. మరో మాటలో చెప్పాలంటే మనుగడ సాగించడానికి సామ్రాజ్యాన్ని అన్ని వైపులా విస్తరించక తప్పలేదు. విస్తరణ శక్తిమంతులైన సైనికాధికారులకు వ్యక్తిగతంగా మంచి అవకాశాలను కల్పించింది. తమను,తమ వారసులు, అనుచరులను సంపన్నులను చేసుకోవడానికే వీరిలో అనేక మంది సామ్రాజ్య సేవలో చేరారు. పదవీ కాంక్షగల రాకుమారులుకు కూడా ఈ విస్తరణ కొత్త అవకాశాలను కల్పించింది. వారసత్వంలో లభించే ఆస్తులు, హోదా కోసం వేచి చూడకుండానే తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశాలు వారికి లభించాయి. ఒక సైనికాధికారికి సామ్రాజ్య ఆస్తులు వారసత్వంగా సంక్రమించాలన్న నియమం ఏదీ ఉండేది కాదు. పోరాట యోధులకు చక్రవర్తి వనరులను పునఃపంపిణీ చేసేవాడు. అలాగే హోదాలను కూడా నిర్ధారించేవాడు. పెరుగుతున్న సామ్రాజ్యవనరులు ప్రతితరంలోనూ విధేయతకు మంచి

ప్రయోజనాలు, రాయితీలను కల్పించాయి. అవిధేయతకు శిక్ష తీవ్రంగా ఉండేది. అయితే విధేయత మంచి ఫలితాలను ఇచ్చేది.

సైనిక విస్తరణ ప్రక్రియలో అక్బర్ ఒక కేంద్రీకృత మొగల్ వ్యవస్థను స్థాపించాడు. నియమనిబంధనలను ఖచ్చితంగా పాటించే ఈ వ్యవస్థవల్ల సామ్రాజ్యం గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారస్వామ్యంగా మారింది. షేర్‌షా పద్ధతులను అనుసరిస్తూ అక్బర్ తన సామ్రాజ్యాన్ని పరిపాలనా విభాగాలుగా నిర్వహించాడు. ఈ విభాగాలు స్థానిక అవసరాలతో నిమిత్తం లేకుండా  వ్యవహరించేవి. కొన్ని గ్రామాల సమూహం పరగణాలుగా, తర్వాత సర్కార్లుగా చివరకు సుబాలుగా నిర్ధారించబడ్డాయి. నేటి తాలుకాలు, జిల్లాలు, రాష్ట్రాలను అవి పోలి ఉండేవి. ఉదాహరణకు బెంగాల్ సుబా 19 సర్కార్లుగా, 600 పరగణాలుగా విభజించబడి ఉండేవి. ఆయా ప్రాంతాలను నిర్ధారిత సామ్రాజ్యవాద పదాలతో నామకరణం చేయడం సైద్ధాంతిక, ఆచరణాత్మక ప్రయోజనాలను కలిగించేది. ప్రాంతాల పేర్లను స్థిరీకరించడంతో ప్రజలందరినీ గుర్తించే అవకాశం లభించింది. తమ తమ ప్రాంతాల్లో ప్రజలు ఎంత పలుకుబడి కలిగి ఉన్నప్పటికీ సామ్రాజ్య వ్యాప్తంగా వారికి ఒకే రకమైన గుర్తింపు ఉండేది. కేంద్రీకృత సామ్రాజ్య వ్యవస్థలో అన్ని ప్రాంతాలను గుర్తించే వారు. సామ్రాజ్యంలోని అన్ని ప్రాంతాలలో సామాజిక వర్గాలపై సామ్రాజ్య హోదాల భావజాలాన్ని ఈ నామకరణం అమలు చేసింది. మొగల్ హోదాలు, నాణేలు, బరువులు, కొలతలు, రహదారుల పేర్లు, పట్టణాల పేర్లు, ఆస్తి హక్కులు, పన్నులు, తపాలా, పోలీసు లాంటి ప్రభుత్వ విధులు, పౌర, నేర చట్టాలు ప్రాంతీయ, స్థానిక సమాజాలలో చొచ్చుకుపోయిన కొద్దీ సామ్రాజ్య నిర్దిష్టత మరింత పెరిగింది. పాలనా పదజాలాలు ప్రాంతాలు, భాషల సరిహద్దులను చెరిపివేసి ఒక రాజకీయ వ్యవస్థ పదనిఘంటువును సృష్టించాయి. వ్యవసాయ భూముల నుండే మొగల్ సామ్రాజ్యానికి ఆదాయం ప్రధానంగా లభించేది. పంట దిగుబడిని నిర్దిష్టంగా కొలిచేవారు. అధికారులు, పాలితుల మధ్య సంబంధాలను పన్ను బకాయిలు నిర్ధారించేవి. భూమి శిస్తును సామ్రాజ్యానికి చెల్లించే బాధ్యత కల్గిన వ్యక్తిని జమీందారు అని పిలిచేవారు. సిద్ధాంతపరంగా చూస్తే జమీందారు భూమి కలిగిన వాడు అని అర్థం. అయితే ఆచరణలో వారు మొగల్ అధికారులు. స్థానిక సముదాయాల మధ్య మధ్యవర్తులుగా వ్యవహరించేవారు. స్థానిక సముదాయాలు పన్ను భారాన్ని తమలో తాము పంచుకునేవి. జమీందార్లకు దిగువన స్థానికతత్వం రాజ్యమేలేది. ఒక పరగణాలో జమీందారు, ఆపై స్థాయి అధికారులతో సామ్రాజ్య పరిపాలనా వ్యవస్థ ఉండేది. మొగల్ సామ్రాజ్యంలో ఆస్తులు, భూమి కేటాయింపుల జాబితాను 1596లో తొలిసారిగా అబుల్ ఫజల్ గొప్ప సంగ్రహం 'అయిన్–ఈ–అక్బరీ'లో సంకలించారు. పంజాబ్ నుండి మాల్వా, గుజరాత్, బెంగాల్ వరకు విస్తరించి ఉన్న సామ్రాజ్యంలో పరిపాలనా, ఆర్థిక పరిస్థితులను నమోదు  చేసిన తొలి చారిత్రక సంకలనం అదే. భూమి విలువ, వ్యవసాయ

విస్తరణ పెరగడంతో సామ్రాజ్య ఆదాయం కూడా పెరిగింది. వ్యవసాయ విస్తరణకు సామ్రాజ్యం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. అక్బర్ పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుండి ఔరంగజేబు మరణం వరకు గంగా పరీవాహక ప్రాంతం, బెంగాల్‌లలో సాగులో ఉన్న వ్యవసాయ భూమి 60 శాతం వరకు విస్తరించింది. అత్యంత నాటకీయమైన పరిణామం తూర్పు బెంగాల్‌లో సంభవించింది. అక్కడ మొగల్ సైన్యాలు అడవులను నరికివేసి వ్యవసాయాన్ని ప్రోత్సహించాయి. 1666లో కేవలం ఒక్క మసీదు నిర్వహణకు 166 ఎకరాల అటవీ ప్రాంతాన్ని దానంగా (సనద్) ఇచ్చారు. ఆ విధంగా మధ్యయుగ తొలి సంవత్సరాలలో హిందూమతం లాగా ఇస్లాం కూడా మొగల్ భారతంలోని అటవీ ప్రాంతాలలో కొత్త వ్యవసాయ సమాజాల స్థాపనకు దోహదం చేసింది.

## 2

# తొలి మధ్యయుగ భారతదేశం

### పరిచయం

**భా**రతదేశంలో తొలి మధ్యయుగ కాలాన్ని సాధారణంగా ముస్లిం దండయాత్రల రాజకీయ పర్యవసాన కోణం నుండి చూస్తారు. నిరంతర చారిత్రక ప్రక్రియ నుండి పుట్టుకొచ్చిన పరిస్థితిగా ఆ కాలాన్ని ఎన్నడూ గుర్తించలేదు. ఫలితంగా దేశంలో సంభవించిన రాజకీయ విచ్ఛిన్నంపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు. నిరంతర యుద్ధాలకు పెద్దపీట వేశారు. అయితే అలాంటి రాజకీయ పరిస్థితికి ప్రాతినిధ్యం వహించిన స్థూల సామాజిక నిర్మాణాన్ని అర్థం చేసుకోవడానికి ఎలాంటి కృషి చేయలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు దేశమంతటా లభిస్తున్న శిలాశాసనాలను సాక్ష్యంగా తీసుకుంటే దేశ వ్యాప్తంగా ఆవిర్భవించిన ఆయా సామాజిక, రాజకీయ ఉన్నత వర్గాలను గమనించకుండా ఉండలేము. అలాంటి ఉన్నత వర్గాలు తమకు కేటాయించబడిన భూములు, విధులతో ప్రయోజనం పొందైనా ఉంటారు లేదా తమ తమ ప్రాంతాలలో ఎప్పటి నుండో సామాజిక, రాజకీయ హోదా కలిగిన భూస్వాములై ఉండొచ్చు.

ఆ విధంగా తొలి మధ్యయుగ భారతదేశంలో కీలక వ్యక్తులుగా వివిధ వర్గాల సామంతులు, మహాసామంతులు, మండలేశ్వరులు, మహామండలేశ్వరులు, రాజకులాలు, రాజపుత్రులు చెలామణి అయ్యారు. వీరంతా ప్రాథమికంగా భూస్వాములు. కాని ఆయా ప్రాంతాల పరిభాషలో గుర్తింపు పొందారు. అనేక రాచరిక కుటుంబాల పెద్దలతో వారి సంబంధం బహుశా వేర్వేరుగా నిర్వచించబడి ఉండేది. అలాగే ఒక రాజ్యంలో సంస్థాన వ్యవస్థ ఈ సంబంధస్వభావాన్ని నిర్ధారించి ఉంటుంది. అలాంటి పరిస్థితి సైనిక దుస్సాహసానికి దారి తీసిందని చెప్పడం అర్థరహితమేమి కాదు. నిరంతరంగా పుట్టుకొచ్చిన పాలక వంశాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయి. ఈ ప్రక్రియను సమకాలీన రాజకీయ సిద్ధాంతంలో పరోక్షంగా అంగీకరిస్తారు. ఇందులో రాజు అన్న సూత్రం విభిన్న నిర్వచనాలను సంతరించుకుంది. నిరంతర అధికార కేంద్రాలలోనే తొలి మధ్యయుగ రాజ్యాలు చాలా వరకు ఆవిర్భవించాయి. మరికొన్ని కొత్త ప్రాంతాలలో ఏర్పాటయ్యాయి. ఆ ప్రాంతాలలో నూతన సామాజిక ప్రక్రియలకు నాంది పలికాయి. మునుపటి కాలాల్లో లాగే ఈ పాలక వంశాలు, రాజ్యాలు కూడా బ్రాహ్మణిక

సూత్రాల చట్రంలోనే చట్టబద్ధతను కోరుకున్నాయి. ఈ దశలో 'ఇతిహాస–పురాణాల' సాంప్రదాయం మునుపటి కంటే ఎక్కువ స్థాయిలో అమల్లోకి వచ్చింది. ఆయా పాలక వంశాల వారసత్వాన్ని సూర్యుడు, చంద్రుడు లేదా ఒక పురాణ పురుషుడితో జత చేసి వాటికి గౌరవ హోదాను సంతరింపచేశారు. మూల పురుషుడి సాహస గాధలను ప్రధానంగా సంస్కృత భాషలో వర్ణించారు. కొన్నిసార్లు అతిశయం, కొన్నిసార్లు వాస్తవిక సంఘటనల ఆధారంగా వంశ చరిత్రను రచించారు. ఆ విధంగా వారికి అవసరమైన రాజకీయ చట్టబద్ధతను, స్థిరత్వాన్ని కల్పించారు. కనుక కొత్త పాలకవర్గాలు పురోహితులపై ఎక్కువగా ఆధారపడ్డాయి. తాము పాలిస్తున్న ప్రాంతాలపై పట్టు సాధించేందుకు దేవాలయాలు లాంటి వ్యవస్థలను ఆధారం చేసుకున్నాయి. ఈ సహకార స్వరూపం బ్రాహ్మణులు, దేవాలయాలకు లభించిన భూదానాలను చెప్పకనే వివరిస్తుంది. ఉదాహరణకు పల్లవ, చోళ కాలాల మధ్య కేటాయించిన భూములను పోల్చితే ఈ విషయం అర్థమవుతుంది. చోళ పత్రాలను అధ్యయనం చేస్తే బ్రాహ్మదేయాలు లేదా బ్రాహ్మణ గ్రామాలు వారి రాజ్యమంతటా విస్తరించి ఉండేవని, అలాంటి గ్రామాలలో ఉద్దేశ్యపూర్వకంగా ఏర్పాటు చేసిన సామాజిక కూర్పును మరింత అర్థం చేసుకోవచ్చు. సనాతనవాదులకే పాలకులు పెద్దపీట వేయలేదు. వారు దేవాలయాలకు కూడా దానాలు చేశారు. వాటిని దేవదానాలని పరిగణిస్తారు. దేవాలయం ఒక గ్రామీణ ప్రాంతంలోనే కాక పట్టణ ప్రాంతాలలో కూడా ఆయా సార్వజనిక కార్యకలాపాలకు కీలక కేంద్రంగా ఉండేది.

భారత సమాజంలో ప్రధాన వ్యవస్థాగత మార్పును తీసుకువచ్చిన కాలంగా తొలి మధ్యయుగ కాలాన్ని ముందుంచుతారు. ఆర్థిక వ్యవస్థ గ్రామీణీకరణ చెందింది. భూకేటాయింపులతో భూస్వాములు అన్ని చోట్లా పుట్టుకొచ్చారు. సమాజంలో వారు భూస్వామ్య లక్షణాలను ప్రవేశపెట్టారు. వాణిజ్యం నశించి పట్టణ కేంద్రాలు స్తంభించిపోయాయి. పాత ఉత్పత్తి మండళ్లు ప్రాధాన్యతలేని వెనుకబడిన ఉపకులాలుగా కుదించుకుపోయాయి. చారిత్రక ఆధారాలను బట్టి రాజ్యానికి సాధ్యమైనంత ఆదాయాన్ని సమకూర్చిపెట్టే విధంగా గ్రామీణ సమాజాన్ని నిర్వహించారని బోధపడుతుంది. ఈ రాజకీయ నిర్మాణంలో వాణిజ్య కార్యకలాపాలకు తులనాత్మకంగా చాలా పరిమితమైన పాత్ర ఉండేది. అయినప్పటికీ ఆయా ప్రాంతాల స్థిరీకరణ ప్రక్రియ ఈ కాలంలో  కీలకమైన దశకు చేరుకుంది. సమాజం పతనావస్థలో ఉండేదన్న అభిప్రాయాన్ని ఈ ప్రక్రియ పటాపంచలు చేస్తుంది. ఈ కాలంలో చాలా ప్రాంతాలు ఇంకా ఆవిర్భావ దశలోనే ఉన్నా పూర్వపు జానపద విభాగాలతో అవి సంబంధాలు పెట్టుకోలేదు. రాజకీయ ప్రక్రియలో భాగమే కాకుండా ఈ ప్రాంతాల ఆవిర్భావానికి అనేక సాంస్కృతిక లక్షణాలు కూడా ఉండేవి. ప్రాంతాల ఆవిర్భావానికి దారి తీసిన కారణాలను గుర్తించడం అంత తేలిక కాకపోయినా కనీసం కుల నిర్మాణం, భాషల ప్రాంతీయ నేపథ్యాలను అన్వేషించవచ్చు. సంస్కృతీకరణ, వృత్తిమార్పుల వల్ల కులాలు ఏర్పాటయ్యాయి. ఈ ప్రక్రియను విశ్లేషిస్తూ కాని ఒక ప్రాంతం యొక్క సాంస్కృతిక ప్రభావాల జాబితాను అందించలేము. ఇవే ప్రభావాలను ప్రాంతీయ భాషల వికాస పరిణామక్రమంలో చూడవచ్చు. సంస్కృతం అధికార భాషగా కొనసాగింది. కాని ఒక ప్రాంతానికి అనువైన భాషనే ఉత్తమ సాధనంగా

వినియోగించేవారు. ఈ తాపత్రయం 'ఆది గ్రంథాలను' ప్రాంతీయ భాషల్లోకి అనువాదం చేసే వరకు వెళ్లింది.

**ప్రధాన వంశాలు :**

**ఉత్తర భారతానికి చెందిన ప్రతిహారులు** : వీరు తొలుత స్థానిక అధికారులుగా ఉండేవారు. కాని క్రమంగా గుజరాత్, రాజస్థాన్‌లలో ఒక రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సింధూ ప్రాంత అరబ్బు పాలకులను గుజరాత్‌లోకి అడుగుపెట్టకుండా తమ పాలకుడు ఒకటవ నాగభట్ట నేతృత్వంలో ప్రతిఘటించడంతోవారు వెలుగులోకి వచ్చారు. అయితే ప్రతిహార వంశం నిజమైన వ్యవస్థాపకుడు, గొప్ప పాలకుడు మాత్రం మిహిరభోజుడు. ఎందుకంటే అతడు రాష్ట్రకూటులు ప్రతిహార రాజ్యాన్ని తాత్కాలికంగా ధ్వంసం చేసిన తర్వాత దానిని పునర్నిర్మించాడు. అతడి రాజ్యాన్ని సులైమాన్ అనే అరబ్బు వ్యాపారి సందర్శించాడు. అతడి వారసుడు మహింద్రపాలుడు భోజుడి రాజ్యాన్ని సంరక్షించడమే కాకుండా దానిని మగధ, ఉత్తర బెంగాల్ వరకు విస్తరించాడు. అతడి ఆస్థానంలో రాజశేఖర అనే కవి ఉండేవాడు. అతడు 'కర్పూర మంజరి', 'కావ్యమీమాంస' లాంటి రచనలు చేశాడు. మహీంద్రపాలుని వారసునిగా అతడి కుమారుడు మహీపాలుడు గద్దెనెక్కాడు. అతడి పాలనా కాలంలోనే రాష్ట్రకూటుడైన మూడవ ఇంద్రుడు కానౌజ్‌పై దాడి చేసి ఆ నగరాన్ని ధ్వంసం చేశాడు.

**దక్కను రాష్ట్రకూటులు** : బాదమి చాళుక్య చివరి పాలకుడు రెండవ కీర్తివర్మన్‌ను పదవీచ్యుతుడిని చేసిన తర్వాత దంతిదుర్గ ఈ వంశాన్ని స్థాపించాడు. అతడు ఎల్లోరా వద్ద దశావతార గుహను కూడా నిర్మించాడు. ఒకటవ కృష్ణ ఈ రాజ్యాన్ని మరింత పటిష్టం చేశాడు. అతడు మైసూరు గంగాలను, వేంగీ చాళుక్యులను ఓడించాడు. ఎల్లోరాలోని కైలాస లేదా శివాలయం అతడు నిర్మించినదే. ఒకటవ అమోఘవర్షుడు రాజధానిని ఎల్లోరా నుండి మాన్యఖేతా (మాల్ఖేడ్)కు తరలించాడు. ఆ నగరాన్ని అతడే నిర్మించాడు. సాహిత్య పోషకునిగా ప్రసిద్ధిగాంచిన అమోఘవర్షుడు 'కవి రాజమార్గ' (కన్నడంలో వెలువడిన అద్భుత రచన), రత్నమాలిక (జైనకృతి) అనే గ్రంథాలను కన్నడంలో రచించాడు. హరిసేన, జినసేన,గుణభద్ర లాంటి జైన విద్వాంసులు అతడి కొలువులో ఉండేవారు. మరో ప్రసిద్ధ రాష్ట్రకూటుడు మూడవ ఇంద్రుడు ప్రతిహారులు, పాలులపై విజయం సాధించి తన సైన్యాలను గంగాలోయ నడిబొడ్డు వరకు తీసుకెళ్లాడు. అల్ మసూదీ అనే అరబ్బుయాత్రికుడు అతడి రాజ్యాన్ని సందర్శించాడు. మూడవ కృష్ణుడు చోళ పాలకుడు ఒకటవ పరాంతకునితో సహా తన సమకాలీన పాలకులందరినీ ఓడించాడు. రామేశ్వరం వద్దగల ప్రసిద్ధ కృష్ణేశ్వర ఆలయంతోపాటు అతడు ఎన్నో ఆలయాలను నిర్మించాడని ప్రతీతి. రాష్ట్రకూట వంశానికి చెందిన చివరి పాలకుడు కర్కా కళ్యాణి చాళుక్య వంశ స్థాపకుడు తైల చేతిలో ఓటమి పాలయ్యాడు.

**ఈశాన్య భారతానికి చెందిన పాలులు** : పాల వంశాన్ని గోపాల స్థాపించాడు. అతడిని ప్రజలు ఎన్నుకున్నారని చెబుతారు. ప్రసిద్ధిగాంచిన ఓదాంతపురి విహారాన్ని అతడు నిర్మించాడు. పాటలీపుత్ర రాజధానిగా అతడు పరిపాలించాడు. పాల వంశానికి చెందిన గొప్ప పాలకుడు గోపాలుని కుమారుడైన ధర్మపాలుడు. కానౌజ్‌పై ఆధిపత్య పోరు అతడి

పాలనలోనే మొదలైంది. అతడు విక్రమశిల విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. అలాగే బీహార్‌లోని సోమపుర (పహార్‌పూర్) విహారను నిర్మించాడు. ధర్మపాలుని కుమారుడైన దేవపాలుడు సామ్రాజ్యాన్ని ప్రగ్జ్యోతిపూర్ (అస్సాం), ఒరిస్సాలోని కొన్ని భూభాగాల వరకు విస్తరింపచేశాడు. శ్రీవిజయ (ఇండోనేషియా) పాలకుడు శైలేంద్ర బలపుత్రదేవకు నలందలో విహారాన్ని నిర్మించడానికి అనుమతి ఇచ్చాడు. కాని అతడి మరణం తర్వాత పాల సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. తర్వాత 11వ శతాబ్దపు చివరి దశాబ్దాలలో ఒకటవ మహిపాలుడు దానిని పునరుద్ధరించాడు. 12వ శతాబ్దపు మధ్య దశకాల వరకు ఆ సామ్రాజ్యం కొనసాగింది. సేన వంశ వ్యవస్థాపకుడు విజయసేన పాల వంశాన్ని నిర్మూలించాడు.

**చోళ సామ్రాజ్యం :** క్రీ.శ. 850లో పాండ్యుల మిత్ర రాజ్యం నుండి తంజావూరు పట్టణాన్ని విజయాలయ హస్తగతం చేసుకోవడంతో సామ్రాజ్యవాద చోళులు ఆవిర్భావంలోకి వచ్చారు.అయితే పల్లవులను గద్దె దింపడంలో ఆదిత్య చోళ ప్రధాన పాత్రను పోషించాడు. వారి రాజ్యాన్ని అతడు పూర్తిగా స్వాధీనం చేసుకున్నాడు.

ఒకటవ పరాంతకుని అతడి హయాం తొలుత అభివృద్ధిని, సంపదను సాధించినప్పటికీ రాష్ట్రకూటుల వల్ల ఘోర పరాభవాన్ని, నష్టాన్ని చవిచూసింది. మూడవ కృష్ణుడు అతడిని తక్కోళం (949 క్రీ.శ)యుద్ధంలో ఓడించాడు. చోళ సామ్రాజ్యంలో సగ భాగాన్ని ఆక్రమించుకున్నాడు. సుమారు 30 ఏళ్ల వరకు ఆ రాజ్యంలో గందరగోళం, అరాచకం రాజ్యమేలాయి. గణరాదిత్య, అరింజయ, రెండవ పరాంతకుడు, ఉత్తమ చోళ అతడి వారసులు.

తొలుత అరుమోలివర్మన్‌గా పిలవబడిన ఒకటవ రాజరాజ చోళ సామ్రాజ్యానికి నిర్దిష్టమైన పునాదులు వేశాడు. అతడు సాధించిన అపూర్వ విజయాలలో పాండ్య, కేరళ, సిలోన్ రాజ్యాల సైనిక కూటమిని ఓడించడం ప్రధానమైనది. గంగాల నుండి ఆధునిక మైసూరులోని కొన్ని ప్రాంతాలను కైవసం చేసుకున్నాడు. పశ్చిమ చాళుక్య రాజ్యంపై దాడి చేసి వారిని వేంగి నుండి తరిమికొట్టాడు. మాల్దీవులను హస్తగతం చేసుకున్నాడు. శ్రీవిజయ శైలేంద్ర పాలకుడు శ్రీమారా విజయతుంగకు నాగపట్టణం వద్ద ప్రసిద్ధమైన చూడామణి విహారాన్ని నిర్మించేందుకు అనుమతినిచ్చాడు.

ఒకటవ రాజేంద్రుడు తండ్రికి తగ్గ తనయుడని నిరూపించుకున్నాడు. తన హయాంలో చోళ సామ్రాజ్యాన్ని అత్యంత విశాలమైన, గౌరవప్రదమైన స్థాయికి తీసుకెళ్లాడు. అతడి అపూర్వ విజయాలలో కొన్ని ఇలా ఉన్నాయి : సిలోన్ దండయాత్రను సంపూర్ణంగా చేపట్టడం; పాండ్య, కేరళ రాజ్యాల స్వాధీనం, వేంగిలో వారసత్వ పోరులో జోక్యం చేసుకోవాలనుకున్న పశ్చిమ చాళుక్యులను ఓడించడం, పశ్చిమ చాళుక్యుల పక్షాన పోరాడినందుకు కళింగ పాలకుడు మధుకమర్నవుడిని శిక్షించడం, గంగాలోయకు సైనిక బలగాల తరలింపు, గంగాలోయ ప్రాంతంపై విజయాన్ని పురస్కరించుకొని గంగైకొండ చోళాపురం అనే కొత్త రాజధాని నగర నిర్మాణం; శ్రీ విజయకు నావికదళ యాత్ర; అక్కడి పాలకుడు సంగ్రామ విజయతుంగకు రాజ్యబాధ్యతల అప్పగింత. రాజకీయ, వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకునేందుకు అతడు చైనాకు రెండు రాయబార బృందాలను కూడా పంపాడు. అతడి వారసుల్లో రాజాధిరాజ

పాండ్య, కేరళ, సిలోన్ రాజ్యాలలో తిరుగుబాట్లను అణచివేశాడు. ఒకటవ కులోత్తుంగ వేంగి రాజ్యాన్ని చోళ సామ్రాజ్యంతో జత చేశాడు. రెండవ రాజరాజ చోళ పాలకుల్లో చివరివాడు. అతడి తర్వాత కూడా చోళులు స్థానిక భూస్వాములుగా చాలా కాలం పాటు కొనసాగారు.

**రాజపుత్రులు :**

**అగ్నికుల వంశాలు :**

**తూర్పు రాజస్థాన్‌కు చెందిన చౌహాన్లు :** తూర్పు రాజస్థాన్ స్థావరంగా వీరు సింహరాజ నేతృత్వంలో స్వతంత్రులయ్యారు. కాని అసలుసిసలు వ్యవస్థాపకుడు మాత్రం రెండవ విగ్రహరాజు. అతడు చౌహాన్ రాజ్యాన్ని గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాల వరకు విస్తరించాడు. తదుపరి ముఖ్య పాలకుడు రెండవ అజయరాజు విస్తరణ విధానాన్ని ధాటిగా కొనసాగించి అజయమేరు(అజ్మేర్) నగర నిర్మాణానికి బాటలు వేశాడు. ఈ వంశానికి చెందిన గొప్ప ఆక్రమణదారు మూడవ విగ్రహరాజు తోమర్లను ఓడించి ఢిల్లీని స్వాధీనం చేసుకున్నాడు. గుజరాత్‌ను దోచుకొని ధ్వంసం చేశాడు. అతడు కళా సాహిత్యాలను కూడా పోషించాడు. ప్రసిద్ధ నాటకమైన 'హరికేళి నాటక'ను రచించాడు. మూడవ పృథ్వీరాజ చౌహాన్లలో ప్రసిద్ధుడు. అతడు తన పొరుగు రాజ్యాలన్నింటిపై విజయం సాధించాడు. చందేలా పాలకుడు పరమార్ది, చాళుక్యపాలకుడు రెండవ భీమ, గహడవాలా పాలకుడు జయచంద్ర పృథ్వీరాజ చేతిలో పరాభవం పాలయ్యారు. మొదటి తరాయిన్ (1191) యుద్ధంలో అతడు ఘుర్‌కు చెందిన ముహమ్మద్‌ను ఓడించాడు. అయితే రెండవ తరాయిన్ (1192) యుద్ధంలో ఓటమి పాలయ్యాడు. పృథ్వీరాజ్ రసో, పథ్వీరాజ విజయ అనే రెండు గొప్ప కావ్యాలను చంద్‌బర్దాయ్, జయనాక అనే కవులు రచించారు.

**కథియావార్ సోలంకిలు** : వీరిని గుజరాత్ చాళుక్యులని కూడా పిలుస్తారు. వీరు కథియావార్ ప్రాంతాన్ని అనహిలపాటక రాజధానిగా పరిపాలించాడు. ఒకటవ మూలరాజ నేతృత్వంలో వీరు స్వతంత్రులయ్యారు. ఒకటవ భీమ పాలనలో మహ్మూద్ ఘజ్ని సోమనాథ (1025–26) ఆలయాన్ని దోచుకున్నాడు. మౌంట్ అబూలో ప్రసిద్ధమైన దిల్వారా ఆలయాలను అతడు నిర్మించాడు. ఈ వంశానికి చెందిన గొప్ప పాలకుడు జయసింహ సిద్ధరాజ పరమార్లు, చౌహాన్లు, చందేలులు, కళ్యాణి చాళుక్యులపై విజయాలను సాధించాడు. అతడు సాహిత్యాన్ని గొప్పగా పోషించాడు. 'సిద్ధహేమచంద్ర' అనే గ్రంథాన్ని హేమచంద్ర రచించాడు. సిద్ధపుర వద్ద ప్రసిద్ధమైన రుద్రమహాకాల్ ఆలయాన్ని నిర్మించాడు. కుమారపాలుడు జైనమతాన్ని బాగా పోషించాడు. హేమచంద్ర అతడికి సలహాదారుగా వ్యవహరించాడు. రెండవ మూలరాజ హయాంలో ఘుర్‌కు చెందిన ముహమ్మద్ భారతదేశంపై తొలిసారిగా దాడి చేశాడు. కాని మౌంట్ అబూ వద్ద అతడు ఓటమి పాలై వెనుదిరిగాడు. గుజరాత్ చివరి హిందూ పాలకుడు కర్ణదేవుడిని అల్లావుద్దీన్ ఖల్జీ ఓడించాడు.

**మాల్వా పవార్లు :** వీరు పరమార్లుగా కూడా పిలవబడతారు. ధర్ రాజధానిగా వీరు మాల్వాపై నియంత్రణ సాధించారు. రెండవ సియాక ఈ వంశానికి చెందిన తొలి ముఖ్యమైన పాలకుడు. ముంజ విజయవంతమైన సేనాపతిగా పేరుగాంచారు. అతడు కాలాచురిలు,

సోలంకిలపై విజయాలు సాధించాడు. అయితే చివరకు కళ్యాణి చాళుక్య పాలకుడు తైల చేతిలో హతమయ్యాడు. పరమార్లలో ప్రసిద్ధుడైన భోజదేవుడు వివిధ అంశాలపై 23 గ్రంథాలను రచించాడు. వాటిలో "సమరాంగన సూత్రధార", పతంజలి యోగసూత్రపై వ్యాఖ్యానం ముఖ్యమైనవి. ధర్ వద్ద సరస్వతి ఆలయాన్ని నిర్మించాడు. చివరి పాలకుడు మహ్లక్‌దేవ తన రాజ్యాన్ని అల్లావుద్దీన్ ఖిల్జీకి సమర్పించుకున్నాడు. దక్షిణ రాజస్థాన్‌కు చెందిన ప్రతిహారులను గుర్జర ప్రతిహారులుగా గుర్తించకూడదు. పై నాలుగు వంశాలలో అత్యంత బలహీనులైన పరిహారులు స్వల్పకాలం మాత్రమే పాలించగలిగారు.

**ముఖ్యమైన ఇతర రాజ్‌పుత్ర వంశాలు :** బుందేల్‌ఖండ్ ప్రాంతంలో చందేలులు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించారు. తమ తొలి పాలకుడు జయశక్తి పేరున జయభుక్తి అనే రాజ్యాన్ని స్థాపించారు. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో వారి రాజధాని. యశోవర్మన్ ఈ వంశంలో ప్రముఖ పాలకుడు. తన రాజ్యాన్ని విస్తరించడమే కాకుండా అతడు ప్రసిద్ధమైన చతుర్భుజ (విష్ణు) ఆలయాన్ని ఖజురహోలో నిర్మించాడు. అయితే ధంగా పాలనలో చందేలా రాజ్యకీర్తి పతాక స్థాయికి చేరుకుంది. ఆలయ నిర్మాణాలు కూడా ఊపందుకున్నాయి. రెండవ వీరవర్మన్ ఈ వంశానికి చెందిన చిట్టచివరి పాలకుడు. అతడిని అల్లావుద్దీన్ ఖిల్జీ ఓడించాడు. హైహాయులుగా కూడా పిలవబడే కాలాచురిలు ఛేది లేదా దహళమండల ప్రాంతాన్ని పాలించారు. వారి రాజధాని నేటి మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ వద్దగల త్రిపురిలో ఉండేది. ఒకటవ కోకల్ల నేతృత్వంలో వారు వెలుగులోకి వచ్చారు. అయితే వారిలో గొప్ప పాలకుడు మాత్రం గంగేయదేవ. ఒరిస్సాను స్వాధీనం చేసుకున్న తర్వాత అతడు త్రికళింగాధిపతి అనే బిరుదును పొందాడు. కానౌజ్ రాజధానిగా గహడవాలా పాలకులు చంద్రదేవ నేతృత్వంలో ఎదిగారు. వీరు తురుష్కదండ అనే పన్నును ప్రజలపై విధించారు. ముస్లిం దండయాత్రలను ఎదుర్కోవడానికి లేదా వారికి కప్పం చెల్లించడానికి ఈ పన్నును విధించారు. గోవిందచంద్ర గహడవాలా పాలకుల్లో గొప్పవాడు. అతడు కాలాచురిలు, చందేలులు ఇద్దరినీ ఓడించాడు. అతడి మంత్రి లక్ష్మీధార అనేక శాసన గ్రంథాలను రచించాడు. అందులో కల్పధర్మ ముఖ్యమైనది. చివరి ముఖ్య గహడవాలా పాలకుడు జయచంద్రను ముహమ్మద్ ఘోరి చంద్వార్ యుద్ధంలో (1193) ఓడించాడు. నైషాధచరిత్ర రచయిత శ్రీహర్ష అతడి అస్థానకవి. సుమారు 36 రాజ్‌పుత్ర వంశాలలో ఒకటైన తోమరు వంశం హర్యానా ప్రాంతాన్ని పాలించింది. అనంగ్‌పాల్ తోమర్ రాజధాని నగరమైన ఢిల్లిక (తర్వాత ఢిల్లీ)ను నిర్మించి తోమర వంశాన్ని స్థాపించాడు. మూడవ విగ్రహరాజు చౌహాను ఢిల్లీని ఆక్రమించడంతో వారి స్వాతంత్ర్యానికి తెరపడింది.

## దక్కను వంశాలు

**కళ్యాణి చాళుక్యలు :** రాష్ట్ర కూటులను తుదముట్టించిన తైల ఈ వంశాన్ని స్థాపించాడు. ఈ వంశ చరిత్రలో ఒకటవ సోమేశ్వరుడు ముఖ్య శకాన్ని తీసుకువచ్చారు. అతడు రాజధానిని మాణ్యఖేతా నుండి కళ్యాణికి తరలించాడు. ఆరవ విక్రమాదిత్య హయాంలో చాళుక్యుల కీర్తి ప్రతిష్టలు పతాక స్థాయికి చేరుకున్నాయి. 'విక్రమాంక చరిత్ర'ను రచించిన బిల్హనుడు, 'మితాక్షర'ను రచించిన విజ్ఞానేశ్వరుడు అతడి ఆస్థాన కవులు. మూడవ సోమేశ్వరుని

పాలనలో చాళుక్య సామ్రాజ్యం పతనం వైపు పయనించింది. అయితే కళాసాహిత్యాలకు మంచి ప్రోత్సాహం లభించింది. అతడు 'అభిలాషతీర్థ చింతామణి' లేదా 'మానసోల్లాస' అనే సుదీర్ఘ గ్రంథాన్ని రచించాడు.

**తూర్పు చాళుక్యులు :** విష్ణువర్ధనుడు ఈ వంశాన్ని స్థాపించాడు. వీరిని వేంగి చాళుక్యులని కూడా పిలుస్తారు. మూడవ విజయాదిత్య గుణగ హయాంలో క్రియాశీల సామ్రాజ్యవాద విధానాన్ని అనుసరించారు. అతడు రాష్ట్ర కూట వంశాన్ని పూర్తిగా నిర్మూలించాడు. దక్షిణ పథం అంతటిపై తన ఆధిపత్యాన్ని స్థాపించాడు. ఒకటవ భీమ శివభక్తుడు. తూర్పుగోదావరి జిల్లాలోని భీమవరం, ద్రాక్షారామం ఆలయాలను నిర్మించాడు. కొంత కాలం పాటు వీరు తెలుగు చోడ పాలకుడు జటచోడ భీమకు రాజ్యాన్ని కోల్పోయారు. అయితే చోళ రాజు ఒకటవ రాజరాజ వేంగిని ఆక్రమించి చాళుక్య రాకుమారుడు ఒకటవ శక్తివర్మన్‌కు సింహాసనాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడంలో సహాయపడ్డాడు. శక్తివర్మన్ వారుసుడిగా విమలాదిత్య గద్దెనెక్కాడు. అతడు రాజరాజ చోళ కుమార్తె కుందవాయ్‌ని వివాహమాడాడు. వారికి రాజరాజ నరేంద్ర అనే కుమారుడు జన్మించాడు. చోళ–చాళుక్య వంశాల మధ్య వియ్యం చివరకు ఒకటవ కులోతుంగ హయాంలో రెండు రాజ్యాల ఏకీకరణకు దారి తీసింది.

**దేవగిరి యాదవులు :** రాష్ట్రకూటుల నుండి తన కుటుంబానికి సామంత హోదాను సూనచంద్రుడు పొందాడు. అందుకే యాదవులు పాలించిన ప్రాంతం సూన దేశగా ప్రసిద్ధమైంది. కళ్యాణి చాళుక్యల ఆధిపత్యాన్ని నిర్మూలించడం ద్వారా ఐదవ భిల్లమ యాదవ రాజ్యానికి పునాది వేశాడు. ఈ కుటుంబానికి చెందిన అత్యంత శక్తిమంతుడైన పాలకుడు సింహన (సింఘన). దక్కనులో అతడి ఆధిపత్యాన్ని సవాలు చేయడానికి ఇటు హోయసల రాజ్యం కాని అటు కాకతీయులు కాని సాహసం చేయలేకపోయారు. అతడు సంగీత సాహిత్యాలను పోషించాడు. సంగీతంపై ముఖ్యమైన కృతి అయిన 'సంగీతరత్నాకర్'ను సారంగదేవుడు అతడి ఆస్థానంలోనే రచించాడు. ఖాన్‌దేశ్‌లోని పాటన్ వద్ద తన తాత భాస్కరాచార్య స్మృతికి చిహ్నంగా చంగదేవుడు ఖగోళశాస్త్ర కళాశాలను ఏర్పాటు చేశాడు. రామచంద్రుని హయాంలో అల్లావుద్దీన్ ఖిల్జీ దేవగిరిపై దాడి చేసి శాంతి ఒప్పందానికి వచ్చేలా ఒత్తిడి చేశాడు. శంకరదేవను మాలిక్ కఫూర్ ఓడించాడు. కఫూర్ అతడికి మరణశిక్ష విధించి యాదవ రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

**వరంగల్ కాకతీయులు :** వీరి తొలి నాయకుడు ఒకటవ బేతుడు, పశ్చిమ చాళుక్యుల సామంతునిగా ఉండేవాడు. కాకతీయుల చరిత్రలో రెండవ ప్రోల హయాం ఒక ముఖ్యమైన మైలురాయి. అతడు చాళుక్యల ఆధిపత్యానికి తెర దించాడు. రుద్రదేవుని విజయాలు అతడు హనుమకొండలో చెక్కించిన శిలాశాసనంలో వర్ణించబడ్డాయి. అతడు కళాసాహిత్యాలను పోషించడమే కాకుండా హనుమకొండ వద్ద సుప్రసిద్ధమైన వెయ్యి స్తంభాల గుడిని నిర్మించాడు. ఓరుగల్లు అనే కొత్త నగరాన్ని నిర్మించాడు. గణపతిదేవుడు తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలపై పూర్తిగా పట్టు సాధించాడు. ఓరుగల్లు నిర్మాణాన్ని కూడా పూర్తి చేశాడు. రెండు కోటలను నిర్మించి రాజధానిని అక్కడికి తరలించాడు. గణపతిదేవుని కుమార్తె రుద్రమదేవి కాకతీయ

వంశంలోనే గొప్ప పాలకురాలు. పరిపాలనా వ్యవహారాల్లో ఆమె నిరంతరం పాలు పంచుకోవడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో స్వయంగా సైన్యానికి నేతృత్వం వహించింది. చివరి పాలకుడు ప్రతాపరుద్రుడు ముస్లిం దండయాత్రలను నిరంతరంగా ఎదుర్కొన్నాడు. తొలుత ఖిల్జీలు, తర్వాత తుగ్లక్‌లు వరంగల్‌పై దాడి చేశారు. ప్రతాపరుద్రుడు 'నీతిసార' అనే కాకతీయ రాజకీయ సిద్ధాంత గ్రంథాన్ని రచించాడు.

**ద్వారసముద్ర హోయసల రాజులు :** తొలి హోయసల రాజుల్లో ఒకడైన ఒకటవ బల్లల బేలూరు రాజధానిగా పరిపాలించాడు. అయితే ద్వారసముద్ర (హలేబీడు) ప్రత్యామ్నాయ రాజధాని నగరంగా ఉండేది. బిత్తిగ లేదా విష్ణువర్ధనుడు హోయసల రాజ్యాన్ని తీర్చిదిద్దిన నిజమైన పాలకుడు. తొలుత అతడు జైన మతాన్ని ఆచరించాడు. కాని తర్వాత వైష్ణవునిగా మారాడు. రామానుజ వైష్ణవ బోధనలతో ప్రభావితుడైన అతడు ప్రసిద్ధమైన హోయసలేశ్వర ఆలయాన్ని హలేబీడు వద్ద నిర్మించాడు. రెండవ బల్లల ఎట్టకేలకు పశ్చిమ చాళుక్యల నుండి స్వాతంత్ర్యాన్ని ప్రకటించాడు. మూడవ బల్లల 1310 వరకు రాజ్యాన్ని సంరక్షించాడు. కాని ఆ తర్వాత మాలిక్ కఫూర్ చేతిలో ఓటమి పాలయ్యాడు. చివరకు మధురై సుల్తాన్‌తో జరిగిన యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు.

## సింధ్ ఆక్రమణ

**అధికారానికి వచ్చిన అరబ్‌లు :** ఇస్లాం మతం అరబ్ ఎడారుల్లో పుట్టి పెరిగింది. ఆ మతాన్ని తొలుత పుచ్చుకున్న అరబ్‌లు దానిని ఆసియాలో ప్రబలమైన శక్తిగా తీర్చిదిద్దారు. తమ కొత్త మతాన్ని వ్యాప్తి చేయాలని, ప్రపంచమంతటా సైనిక ఆక్రమణ చేపట్టాలని వారు నిర్ణయించారు. ఒక విశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించారు. అది పశ్చిమంలో అట్లాంటిక్ సముద్రం నుండి ఈశాన్యంలో సింధూనది వరకు, ఉత్తరంలో కాస్పియన్ సముద్రం నుండి దక్షిణంలో నైలు లోయ వరకు విస్తరించి ఉండేది. మహ్మద్ ప్రవక్త (622–32) వారసులు ఖలీఫాలుగా పిలవబడ్డారు. అబూ బకర్ మొదటి ఖలీఫాగా ఎన్నుకోబడ్డాడు. అబూతోపాటు అతడి ముగ్గురు వారసులు (632–661)ను రషీదున్ (అనువర్తిత ఖలీఫాలు) అని పిలిచేవారు. తర్వాత ఉమాయ్యద్‌ల వంశపాలన (661–749) వచ్చింది. వారి స్థానాన్ని అబ్బాసిద్‌లు (749–1258) ఆక్రమించారు. పాలక వంశాలలో మార్పులు వచ్చినప్పటికీ ఖలీఫా ప్రపంచంలోని ముస్లింలందరికీ పెద్దగా కొనసాగాడు. ఉమాయ్యద్‌ల హయాంలోనే సింధ్‌ను ఆక్రమించడంలో అరబ్‌లు కృతార్థులయ్యారు.

**అరబ్ ఆక్రమణకు కారణాలు :** అత్యంత ప్రధాన కారణం మాత్రం సంపదే. ప్రాచీన కాలం నుండి భారతదేశంతో వ్యాపార సంబంధాలు గల అరబ్‌లకు భారత్ ఒక ధనిక దేశమని బాగా తెలుసు. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలక కేంద్రంగా ఉన్న సింధ్ మక్రన్ తీరం అరబ్ సామ్రాజ్యానికి చాలా దగ్గరగా ఉండేది. ఈ ప్రాంతం అరబ్‌లకు తొలి లక్ష్యంగా మారింది. అరబ్‌ల మత ఛాందసం కూడా మరో కారణమని చెప్పవచ్చు. ఇస్లాం యుద్ధ తరహా స్ఫూర్తిని, అరబ్‌లలో జాతీయ భావనను కలిగించింది. సామ్రాజ్యాన్ని అన్ని దిశలా విస్తరించాలన్న తపన కూడా మరో కారణం. కేవలం ఇస్లాం మతానికే కాకుండా ఇస్లామిక్ రాజ్యాలకు కూడా

ఖలీఫాలు అధిపతులుగా ఉండేవారు. అయితే అరబ్ దండయాత్రకు దారి తీసిన తక్షణ కారణం మాత్రం సింధ్‌కు చెందిన సముద్ర దొంగలు అరబ్ ఓడలను స్వాధీనం చేసుకోవడమే. సిలోన్ రాజు ఇరాక్ అరబ్ గవర్నర్ అయిన హజ్జాజ్‌కు కొందరు ముస్లిం మహిళలను పంపాడు. అయితే వారు ప్రయాణిస్తున్న ఓడను సింధ్ ఓడరేవు దేబల్‌కు చెందిన సముద్ర దొంగలు స్వాధీనం చేసుకున్నారు. సింధ్ పాలకుడు దహార్ ఆ మహిళలను తక్షణం విడుదల చేయాలని హజ్జాజ్ డిమాండ్ చేశాడు. అయితే తనకు సముద్ర దొంగలపై ఎలాంటి నియంత్రణ లేదని దహార్ సమాధానం పంపాడు. దహార్ తిరస్కార ధోరణితో కోపోద్రిక్తుడైన హజ్జాజ్ సింధ్‌ను ఆక్రమించాలని నిర్ణయించాడు. అందుకు ఖలీఫా వాలిద్ నుండి అనుమతి కోరాడు. తొలుత సంశయించినప్పటికీ ఆక్రమణకు ఖలీఫా అనుమతినిచ్చాడు.

**ఆక్రమణ, పాలన :**

క్రీ.శ.711లో మహమ్మద్ బిన్ కాసీం నేతృత్వంలో ఒక బలమైన సైన్యాన్ని హజ్జాజ్ పంపించాడు. సింధ్ వైపు కదిలిన కాసీం సైన్యం దేబల్ ఓడరేవు పట్టణాన్ని స్వాధీనం చేసుకుంది. మరికొన్ని సైనిక కేంద్రాలను అతడు దాటుకొని వచ్చాడు. అప్పటి వరకు దహార్ ఎలాంటి ప్రతిఘటన ఇవ్వలేదు. కాని ఇప్పుడు శత్రువును ఎదుర్కోవడానికి అతడు బ్రాహ్మణాబాద్ నుండి బయల్దేరి వెళ్లాడు. క్రీ.శ. 712 జూన్ 20న యుద్ధం జరిగింది. శత్రువును వీరోచితంగా ఎదుర్కొంటూ దహార్ నేలకొరిగాడు. రాకుమారుడు జైసింఘు కొంత వరకు ప్రతిఘటించినప్పటికీ బ్రాహ్మణాబాద్ కోటను విడిచి పారిపోయాడు. ఆలోర్, తదితర కోటలను కూడా స్వాధీనం చేసుకున్న మహమ్మద్ సింధ్‌పై అరబ్ ఆక్రమణను పూర్తి చేశాడు. సింధ్‌ను ఆక్రమించిన తర్వాత క్రీ.శ. 713లో మహమ్మద్ ముల్తాన్‌పై దాడి చేయడానికి బయల్దేరాడు. కాని అతడిని వెనక్కి రప్పించి మరణదండన విధించడంతో జైసింఘు బ్రాహ్మణాబాద్‌ను తిరిగి స్వాధీనం చేసుకోగలిగాడు. అయితే సింధ్‌కు కొత్త అరబ్ గవర్నర్‌గా నియమితుడైన జునైద్ జైసింఘును ఓడించి అతడికి మరణశిక్ష విధించాడు. తర్వాత జునైద్ భారతదేశం లోపలి భాగాలకు సైన్యాలను పంపాడు. కాని ఆ దండయాత్రలన్నీ విఫలమయ్యాయి. ఈ వైఫల్యానికి కారణమైన భారతీయ పాలకుల్లో ఒకటవ ప్రతిహార నాగభట్టు, రెండవ చాళుక్య విక్రమాదిత్యలు ప్రధానమైన వారు. ఈలోగా అబ్బాసిద్ ఖలీఫాల ప్రాబల్యం క్షీణించడం మొదలుపెట్టింది. ఫలితంగా దూర ప్రాంతాలపై వారు నియంత్రణ కోల్పోయారు.

క్రీ.శ.871లో సింధ్ ఖలీఫాల నియంత్రణ నుండి విముక్తి అయ్యింది. అయితే అప్పటికి కూడా సింధ్‌లోని అరబ్‌లు తమను తాము ఐక్యం చేసుకోలేకపోయారు. వారి రాజ్యం రెండు ముక్కలుగా చీలిపోయింది. ఎగువ, దిగువ సింధ్ రాజ్యాలు మన్సూరా, ముల్తాన్ రాజధానులుగా ఏర్పడ్డాయి. ఆ విధంగా ఘజ్నీ మహమ్మద్ దండయాత్రలు వరకు సింధ్‌లో రెండు అరబ్ రాజ్యాలు కొనసాగాయి.

**అరబ్ ఆక్రమణ విశిష్టత :**

సింధ్‌పై అరబ్ దండయాత్ర భారత రాజకీయాలపై చాలా పరిమితమైన ప్రభావం చూపింది. అరబ్‌లు భారతదేశ సైనికశక్తిని దెబ్బతీయలేదు. కనుక భారతదేశంపై ఇస్లాం

దండయాత్రకు బాటలు వేయలేకపోయారు. అయితే వారు భారతీయులు, అరబ్‌లను దగ్గరకు తీసుకురాగలిగారు. భారతదేశంలో ఒక ఇస్లామిక్ రాజ్యాన్ని తొలుత స్థాపించింది మాత్రం అరబ్‌లే. సింధ్‌లో వారి పరిపాలన ఇస్లాం చరిత్రలో ఒక కొత్తదనాన్ని తీసుకువచ్చింది. ముస్లిమేతరులందరినీ ఇస్లాం రెండు వర్గాలుగా విభజించింది. తొలి వర్గానికి చెందిన ప్రజలను జిమ్మీలు అని పిలిచేవారు. మతపరమైన పన్ను జిజ్యా చెల్లించిన అనంతరం ఇస్లామిక్ పాలకుని సంరక్షణలో జీవించడానికి వీరిని అనుమతించారు. రెండవ వర్గానికి చెందిన ప్రజలను కాఫిర్లుగా పిలిచేవారు. కాఫిర్లను ఇస్లామిక్ రాజ్యంలో జీవించడానికి అనుమతించలేదు. వారికి రెండే రెండు ప్రత్యామ్నాయాలు ఉండేవి. ఒకటి మతమార్పిడి, లేదా మరణం. హిందువులు కాఫిర్ల వర్గం కిందికి వచ్చారు. మహమ్మద్ బిన్ కాసీం సింధ్‌ను ఆక్రమించినపుడు హిందువులందరినీ ఇస్లాంమతానికి మార్చడం లేదా వారికి మరణదండన విధించడం ఆచరణ సాధ్యం కాదని గ్రహించాడు. కనుక ఖలీఫా అనుమతితో అతడు హిందువులను జిమ్మీలుగా ఆమోదించాడు. దీంతో తుర్కులు ఒక పూర్వ నిర్ధారిత పరిష్కారాన్ని అన్వేషించగలిగారు. సింధ్‌పై అరబ్ ఆక్రమణతో ముస్లిమేతరులపట్ల ఇస్లామిక్ రాజ్యాల విధానంలో ఒక కొత్త శకం ప్రారంభమైంది. అరబ్ ఆక్రమణ భారతీయ సంస్కృతిని ఇస్లామిక్ ప్రపంచానికి పరిచయం కూడా చేసింది. అక్కడి నుండి అరబ్‌ల ద్వారా భారతీయ సంస్కృతి ఐరోపాకు పరిచయమైంది. భారతీయుల నుండి సంఖ్యాశాస్త్రాన్ని కూడా అరబ్‌లు నేర్చుకున్నారు. ఇప్పుడు దానిని 'అరబిక్ సంఖ్య' అని పిలుస్తారు. భారతీయుల జోతిష్యశాస్త్రం, వైద్య శాస్త్రం నుండి కూడా వారు లబ్దిపొందారు.

**ఘజనీలు :**

**పరిచయం**

**క్రీ.**శ. 997లో మహ్మద్ తన తండ్రి నుండి వారసత్వాన్ని స్వీకరించాడు. తండ్రి ఆకాంక్షలను అన్ని దిశలావిస్తరించాడు.అతడు ఆఫ్ఘనిస్తాన్, పర్షియాలను స్వాధీనం చేసుకొని యామిన్-అల్-దౌలా (రాజ్య కుడి భుజం) అనే బిరుదును ఖలీఫా నుండి పొందాడు. భారత దేశమంతటా 17సార్లు దండయాత్రలు నిర్వహించి స్థానిక పాలకుల నుండి కప్పం వసూలు చేశాడు. మహ్మూద్ హిందూషాహీలను ఓడించాడు. తర్వాత మధుర, కన్యా కుబ్జ నగరాలను దోచుకున్నారు. 1025-26లో అతడు గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయాన్ని దోచుకున్నాడు. అతడి సాహసాలు లోకోక్తిగా మారాయి. తరతరాలుగా అభిమానులు, వైరి వర్గీయులు వాటిని ప్రతీకగా నెమరు వేసుకుంటూనే ఉన్నారు. దోపిడి, దహనం, ముస్లిం, ముస్లిమేతరులతో సహా అవిశ్వాసుల హత్యతో అతడు చెరగని పేరు పొందాడు. సాంస్కృతిక రాజకీయాలలో అతడు ప్రతీకగా మారాడు. 14వ శతాబ్దంలో ఇద్దరు సున్ని రచయితలు బరాని, ఇసామి-వీరు ఢిల్లి, దక్కను బహమని రాజ్యాలలో రచనలు కొనసాగించారు - మహ్మద్‌ను ఒక ఆదర్శ ముస్లిం పాలకునిగా కొనియాడారు. ఎందుకంటే అతడు అవిశ్వాసులతోపాటు ముస్లిం తెగలైన షియా, ఇస్మాయిలీలను కూడా వధించాడు. తన సంపదలో కొంత భాగాన్ని భూగోళ శాస్త్రవేత్త అల్-బిరూని అధ్యయనానికి మహ్మద్ వెచ్చించాడు. అల్-బిరూని తన ఘజనీలు పోషకులు

అందించిన సహకారం, సమాచారంతో మధ్యయుగ భారతదేశ భౌగోళిక చిత్రపటాన్ని అద్భుతంగా తయారు చేశాడు.

### ఘజనీ దండయాత్రలు

క్రీ.శ.977లో సమానీదుల రాజ్యంపతనావస్థకు చేరుకోవడంలో సుబుక్తగిన్ (మధ్య ఆసియాకు చెందిన తుర్కుబానిస) అదే అవకాశంగా తీసుకొని విశాలంగా విస్తరించి ఉన్న మధ్య పర్షియా రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఈ రాజ్యానికి తూర్పున సింధూనది సరిహద్దుగా ఉండేది. కాబుల్‌కు దక్షిణానగల ఘజ్ని అతడి రాజధానిగా ఉండేది. మహ్మద్ తన 27వ ఏట తండ్రి నుండి వారసత్వం స్వీకరించినపుడు అతడికి ముందుగానే విశాలమైన ప్రాబల్య కేంద్రం ఉండేది. ఆ కేంద్రాన్ని అతడు శీఘ్రగతిన విస్తరింపచేశాడు. వేసవి కాలంలోనే మహ్మద్ భారత దండయాత్రలు ప్రారంభమయ్యేయి. రుతుపవనాలు కురిపించే వర్షాలు పంజాబ్ నదులను నింపకముందే అతడు ఆఫ్ఘనిస్తాన్‌కు తిరిగి వెళ్ళేవాడు. లేకుంటే దోచుకున్న ధనంతో అతడి సైన్యాలు పంజాబ్‌లోనే ఇరుక్కుపోయే ప్రమాదం ఉండేది. క్రీ.శ. 1000లో భారతదేశానికి వ్యతిరేకంగా మహ్మద్ దోపిడీ, విధ్వంసకరమైన యుద్ధాన్ని ప్రారంభించినపుడు ఉత్తర భారతంలో సైనిక సమతుల్యం (అటు ఇటుగా ఉన్న) ఘోరంగా దెబ్బతింది. అప్పటి నుండి క్రీ.శ.1025 వరకు అతడు ఇలాంటి 17 దండయాత్రలు జరిపి కనౌజ్, సౌరాష్ట్ర లాంటి సుదూర ప్రాంతాలను సైతం స్వాధీనం చేసుకున్నాడు.

హిందూకుష్ పర్వత శ్రేణుల చుట్టూ విస్తరించి ఉన్న భూభాగాలను పాలించిన హిందూషాహీ వంశం ఘజనీల ఒత్తిడిని తొలుత ఎదుర్కొంది. అప్పటికీ ఘజనీల రాజ్యం మహ్మద్ తండ్రి పాలనలోనే ఉంది. అయితే హిందూషాహి వంశానికి చెందిన రాజులు 25 ఏళ్లపాటు ఘజనీలను ప్రతిఘటించగలిగారు. అయితే చివరకు వారు లొంగిపోయారు. ఒకప్పుడు అత్యంత బలవంతులుగా ఉన్న కనౌజ్ గుర్జర ప్రతిహారులు కూడా అనతికాలంలోనే మూల్యం చెల్లించుకున్నాడు. ఖజురహో చండేలాలు, గ్వాలియర్ రాజ్‌పుత్ర పాలకులు కూడా ఓడిపోయారు. వారి ఖజానాలు లూటీ అయ్యాయి. తన దండయాత్రకు ఆటంకంగా ఉన్న ముల్తాన్ రాజ్య ముస్లిం పాలకుడిని కూడా మహ్మద్ వదలలేదు. థానేశ్వర్, మధుర, కనౌజ్‌లలో తమ పవిత్రస్థలాల విధ్వంసం, దోపిడీ హిందువులను ప్రత్యేకంగా కలవరపరిచాయి. ఈ వ్యవస్థాగత దండయాత్రలకు చివరి అంకంగా మహ్మద్ గుజరాత్‌లోని కథియావార్ దక్షిణ తీరంపై సోమ్‌నాథ్ వద్ద వెలసిన ప్రసిద్ధ శివాలయంపై దాడి చేశాడు. ఎడారి గుండా సాహసోపేతంగా సైన్యాలను తరలిస్తూ క్రీ.శ.1025లో మహ్మద్ ఈ ఆలయానికి చేరుకున్నారు. చారిత్రక నివేదికల ప్రకారం దేవాలయాన్ని పరిరక్షిస్తూ సుమారు 50,000 మంది హిందువులు తమ ప్రాణాలను కోల్పోయారు. మహ్మద్ తన స్వహస్తాలతో శివలింగాన్ని ధ్వంసం చేశాడు. తర్వాత సుమారు రెండు కోట్ల బంగారు దినార్లతో (6.5 టన్నుల బంగారం) అతడు ఎడారి గుండా తిరిగి వెళ్లాడని చెబుతారు. అయితే ఈ తిరుగు ప్రయాణంలో ఘజ్ని సైనికులు చాలా వరకు మరణించారు.

### మహ్మద్ దండయాత్రల ఉద్దేశం, స్వభావం :

మహ్మద్ చర్యలను వివరించడానికి చరిత్రకారులు సాధారణంగా ఇబ్బంది పడతారు. ముఖ్యంగా భారతదేశంలో సామ్రాజ్య స్థాపనకు అతడు నామమాత్రపు ఆసక్తిని కూడా

ప్రదర్శించలేదు. తన ధీరత్వం, అందుబాటులో ఉన్న వనరులతో ఇక్కడ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయడం అతడికి అంత కష్టమైన కార్యమేమి కాదు. కొందరు చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం మహ్మద్ తన మధ్య ఆసియా సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసుకోవడానికి భారతదేశాన్ని నిధుల గనిగా వినియోగించుకొన్నాడు. అయితే అతడు తన స్వంత రాజ్యాన్ని కూడా భారతదేశంలాగే నిర్లక్ష్యం చేశాడు. తిరుగుబాట్లు బయల్దేరినపుడే అతడు తన సామ్రాజ్యంపై దృష్టి సారించేవాడు. అతడి పట్టపగ్గాల్లేని దోపిడీతో లబ్ధి పొందిన ఏకైక ప్రాంతం రాజధాని నగరమైన ఘజ్ని మాత్రమే. ఘజ్నిని సమకాలీన నగరాల్లో అత్యంత వైభవోపేతంగా తీర్చిదిద్దాడు. ఆస్థానంలో ఎందరో విద్వాంసులు, కవులు అతడి చుట్టూ మూగేవారు. వారిలో 'షానామా' అనే చారిత్రక గ్రంథాన్ని రచించిన ఫిరదౌసి, భౌగోళిక శాస్త్రవేత్త అల్‌బిరూని ప్రధానమైన వారు. ఐరోపా వ్యాపారుల రాకకు చాలా ముందే అల్–బిరూని మధ్యయుగ భారతదేశం యొక్క సమగ్రమైన చిత్రపటాన్ని తయారు చేశాడు. కేవలం హిందువులు, ఇతర అవిశ్వాసులపైనే మహ్మూద్ తన ఛాందసవాదాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించలేదు. అతడు అంతే స్థాయిలో ముస్లిం, దైవధిక్కారులను కూడా హత్య చేశాడు. ఆ విధంగా అతడు ఇస్మాయిలీ తెగకు చెందిన ముల్తాన్ పాలకుడు దౌద్‌పై రెండుసార్లు దాడి చేశాడు. ముల్తాన్‌పై రెండవసారి దండయాత్ర జరిపిన సందర్భంగా అతడు స్థానిక ముస్లింలు ఎందరినో హత్య చేశాడు. ఎందుకంటే సనాతనవాద ఇస్లాం వైపు తిరిగి వస్తామన్న హామీని వారు నిలబెట్టుకోలేదు.

**అతడి దండయాత్రల ప్రభావం :**

మహ్మద్ గురించి ఎవరు ఏమి అనుకున్నా భారతీయ చరిత్రపై చెరగని ముద్ర వేసిన అతికొద్ది మంది వ్యక్తులలో అతడు ఒకడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే అతడి స్వంత నైపుణ్యం, ధీరత్వం వల్లే గొప్ప సైనిక విజయాలు సమకూరలేదు. క్రీ.శ.1000 నాటికి ఉత్తర భారతంలో రాజకీయ పరిస్థితి పదవీకాంక్ష గల విదేశీ ఆక్రమణదారునికి ఎంతో అనుకూలంగా ఉండేది.

ఉత్తర, ఈశాన్య, మధ్య భారత రాజ్యాల మధ్య నిరంతరంగా జరిగిన యుద్ధాలు వాటిని బలహీనంగా మార్చాయి. మహ్మూద్ దండయాత్రలను అడ్డుకునే శక్తిగల ప్రబలమైన రాజ్యం 11వ శతాబ్దపు తొలి దశకాల్లో ఉత్తర భారతంలో ఏదీ ఎదగలేదు. ఆ కాలపు ప్రబలమైన భారతీయ రాజ్యం మహ్మద్ సాహస యాత్రలకు చాలా దూరంగా ఉండేది. చోళులు అతడి దండయాత్రలను కనీసం గుర్తించే అవకాశం కూడా ఉండేదికాదు. మహ్మద్ మరణం తర్వాత భారతదేశం వందేళ్లపాటు విదేశీ ఆక్రమణల నుండి ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత మరోసారి ఆఫ్ఘనిస్తాన్ నుండి భారతమైదాన ప్రాంతాల్లోకి కొత్త ఆక్రమణదారులు దూసుకువచ్చారు. ఈ వందేళ్ల కాలంలో భారత పాలకులు తమ మధ్య అగాధాలను పూడ్చుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు.

3

# ఘోరీలు - ఢిల్లీ సుల్తాను రాజ్యం

## ఘోరీ దండయాత్రలు

### పరిచయం

క్రీ.శ. 1151లో ఘజ్నిని ధ్వంసం చేసిన మహమ్మద్ ఘోరి విజయాలలో ఢిల్లీ సుల్తాను రాజ్యం మూలాలు దాగి ఉన్నాయి. అతడు 1157లో ఘజనీలను పంజాబ్‌కు తరిమికొట్టాడు. ఘజనీలను పూర్తిగా పెకలించివేయడానికి ఘోరి 1186లో సింధూ లోయలోకి సైన్యాలతో తరలివచ్చాడు. మార్గమధ్యంలో అతడి సైన్యాలు ముల్తాన్ (1175), సింధ్ (1182), పెషావర్, లాహోర్ (1186) నగరాలను స్వాధీనం చేసుకున్నాయి. 1190లో అతడు రాజస్థాన్‌లోని భటిండాను ఆక్రమించడం రాజ్‌పుత్ పృథ్వీరాజ్ చౌహాన్‌తో వరుసగా యుద్ధాలకు దారి తీసింది. చౌహాన్‌ను చివరగా 1192లో అతడు ఓడించాడు. గంగా లోయకు వెళ్లే పశ్చిమ మార్గాలపై రాజ్‌పుత్రుల నియంత్రణను దెబ్బతీయడంతో ఘోరీ సైన్యాలు తూర్పు దిశలో కదిలాయి. 1200లో భక్తియార్ ఖల్జీ ఎట్టకేలకు బెంగాల్‌లో లక్ష్మణసేనను ఓడించాడు. మహమ్మద్ ఘోరి 1206లో మరణించాడు. అతడికి అత్యంత విశ్వాస పాత్రుడైన మామ్లూక్ సైనికాధికారి కుతుబుద్దీన్ ఐబక్ (ఢిల్లీ గవర్నర్) తనను తాను స్వతంత్రునిగా ప్రకటించుకున్నాడు. తర్వాత ఢిల్లీ సుల్తాను రాజ్యంగా ఉమ్మడిగా గుర్తించబడిన పాలకశ్రేణులలో అతడి వంశం మొట్టమొదటిది. ఢిల్లీని తమ నియంత్రణలోకి తిరిగి తెచ్చుకోవాలని ఘోరీ, ఘజనీలు చేసిన ప్రయత్నాలను చివరకు 1211–1236 సంవత్సరాల మధ్య ఢిల్లీ సుల్తాను ఇల్తుమిష్ తిప్పికొట్టాడు.

### ఘోరీ సామ్రాజ్య ప్రస్థానం :

క్రీ.శ. 12వ శతాబ్దంలో భారతదేశంపై పట్టు కోసం సాగిన తుదిపోరు ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియాలలో సంభవించిన కొన్ని ప్రధానమైన సంఘటనల తర్వాతనే సాధ్యమైంది. 1151లో ఘజ్ని నగరం పూర్తిగా నాశనమైంది. ఎన్నో అద్భుత కట్టడాలు, మసీదులతో వెలిగిపోయిన ఆ నగరం దోపిడీ దహనాలకు గురైంది. పశ్చిమ ఆఫ్ఘనిస్తాన్‌లోని ఘోరీ పాలకులు ఈ అంతర్గత పోరు నుండి కొత్త నాయకులుగా ఎదిగారు. 12వ శతాబ్దం మధ్యలో మధ్య ఆసియాలో మరో కొత్త శక్తి ఆవిర్భవించింది. ఇరాన్ కేంద్రంగా ఖ్వారిజ్మ్ సామ్రాజ్యం ఏర్పడింది. ఈ సామ్రాజ్యానికి ఎనలేని ప్రాబల్యం సమకూరడంతో మధ్య ఆసియాలో ఘోరీల రాజ్యకాంక్షకు

తీవ్ర విఘాతం కల్గింది. ముయిజుద్దీన్ ముహమ్మద్ బిన్ సామ్ 1173లో సింహాసనాన్ని అధిష్టించాడు. అతడిని ముహమ్మద్ ఘోరీగానే ఎక్కువగా గుర్తిస్తారు. క్రీ.శ.1175లో ముహమ్మద్ ముల్తాన్‌ను ఆక్రమించాడు. 1186లో అతడు ఘజ్నీ మహ్మద్ చివరి వారుసుడిని లాహోర్‌లో తుదముట్టించాడు. తదుపరి దండయాత్రకు పంజాబ్‌ను స్థావరంగా మార్చుకున్న ముహమ్మద్ భారత భూభాగాన్ని సాధ్యమైనంత ఎక్కువగా స్వాధీనం చేసుకోవాలన్న తన లక్ష్యం వైపు కదిలాడు.

మహ్మద్ ఘజ్నీ లాగే అతడు కేవలం దేశాన్ని దోచుకోవాలని మాత్రమే భావించలేదు. ఇక్కడ పాలన కొనసాగించాలని పట్టుదలతో వ్యవహరించాడు. క్రీ.శ. 1178లో గుజరాత్ చాళుక్య పాలకునితో జరిగిన యుద్ధంలో అతడు అంతగా విజయవంతం కాలేదు. అయితే 1191, 1192లో పశ్చిమోత్తర ఢిల్లీ వైపుగల తరాయిన్ వద్ద రెండు నిర్ణయాత్మకమైన యుద్ధాలను పోరాడాడు. భారత దేశ చరిత్రలో అంతకుముందే ఈ ప్రాంతంలో మహా సంగ్రామాలు జరిగాయి. తర్వాత కూడా అనేక పోరాటాలు జరిగాయి. తొలి తరాయిన్ యుద్ధంలో పృథ్వీరాజ్ చౌహాన్ నేతృత్వంలోని రాజ్‌పుత్ సైనిక కూటమి విజయం సాధించింది. అయితే మరుసటి సంవత్సరంలో ముహమ్మద్ ఘోరీ అశ్వాలపై సవారీ చేసే 10,000 మంది విలుకాండ్రతో తిరిగి వచ్చినప్పుడు అతడు పృథ్వీరాజ్‌తోపాటు అతడి సైన్యాన్ని ధ్వంసం చేశాడు. ఈ నిర్ణయాత్మక పోరులో నెగ్గిన తర్వాత ముహమ్మద్ దాదాపు ఉత్తర భారత భూభాగమంతటిని కొద్ది సంవత్సరాలలోనే స్వాధీనం చేసుకున్నాడు. క్రీ.శ. 1193లో అతడు గహడవాలా వంశాన్ని ఓడించి కనౌజ్, వారణాసిలను స్వాధీనం చేసుకున్నాడు. అక్కడ ధ్వంసం చేసిన ఆలయాల పునాదులపై మసీదులను నిర్మించాడు. అనతి కాలంలోనే అతడు గ్వాలియర్, అజ్మేర్, అనహిల్వారా (గుజరాత్ రాధాని)లను స్వాధీనం చేసుకున్నాడు. ఈ విధంగా రాజపుత్ర ప్రాబల్యం గల రాజ్యాలన్నీ పతనమయ్యాయి. ఈ విజయాలకు చాలా వరకు బానిస సైనికాధికారి అయిన కుతుబుద్దీన్ ఐబక్ కారకుడయ్యాడు. ముహమ్మద్ ఐబక్‌ను ఢిల్లీలో వైస్రాయ్‌గా నియమించాడు.

అయితే ఈశాన్య భారతం మాత్రం ముహమ్మద్ భక్తియార్ ఖిల్జీ అనే యువసేనాపతి వశమైంది. అతడు సైన్యంలో శీఘ్రగతిన అగ్రస్థానానికి ఎగబాకాడు. ఖిల్జీ బీహార్‌ను ఆక్రమించి నలంద విశ్వవిద్యాలయాన్ని ధ్వంసం చేశాడు. 1202లో బెంగాల్ రాజు లక్ష్మణసేనను ఓడించాడు. బెంగాల్‌పై దాడి ఎంత వేగంగా సాగిందంటే ఖిల్జీ సైన్యాలు తన కోటను ముట్టడించే సమయానికి లక్ష్మణసేన భోజనం చేస్తున్నాడు. భారత్‌లో ఇస్లామిక్ పాలనకు బెంగాల్ ఉపకేంద్రంగా మారింది. ఢిల్లీలోని మహారాజులు, చక్రవర్తుల ఆదేశాలను అది ఎన్నోసార్లు ధిక్కరించింది. తొలి నుండి ఇదే పరిస్థితి కొనసాగింది. భక్తియార్ ఖిల్జీ దాదాపు తన స్వంత ప్రభుత్వాన్నే ఇక్కడ నడిపాడు. అతడు అస్సాంను కూడా ఆక్రమించాలని ప్రయత్నించాడు. కాని యుద్ధాలలో తీవ్రంగా నష్టపోవడంతో వెనుక్కు తగ్గాడు.

ఉత్తర భారతదేశంలో ముహమ్మద్ అపరిమిత అధికారాన్ని దక్కించుకున్నాడు. అయితే కాశ్మీర్‌ను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాడు. మధ్య ఆసియాలో కూడా అతడు

ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. అక్కడ ఖ్వారిజ్మ్ పాలకుడు ప్రబలమైన శక్తిగా ఎదిగి ముహమ్మద్ సైన్యాన్ని 1205లో ఓడించాడు. తర్వాతి సంవత్సరంలో సింధూ నది వద్ద ముహమ్మద్ హత్యకు గురయ్యాడు. అతడి విశాలమైన సామ్రాజ్యం పతనం అంచుకు చేరుకుంది. హిందూ రాకుమారులు మరోసారి తిరుగుబాటు చేశారు. గ్వాలియర్, రణథంబోర్ రాజ్యాలను దక్కించుకున్నారు. తన ప్రభువు అయిన ముహమ్మద్ మరణం తర్వాత కుతుబుద్దీన్ ఐబక్ నిర్ణయాత్మక చర్య తీసుకొని ఘోరీల నుండి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడు.

## బానిస పాలకుల నియంత్రణలో ఢిల్లీ సుల్తాను రాజ్యం

### పరిచయం

**త**న తోటి తుర్కు అధికారుల ఆమోదంతో కుతుబుద్దీన్ ఐబక్ భారతదేశంలో తుర్కు రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. అతడి వారసునిగా అరామ్ బక్ష్ పీఠమెక్కాడు. కాని బక్ష్‌ను 1211లో ఐబక్ అల్లుడైన ఇల్తుమిష్ గద్దె దించాడు. క్రీ.శ.1229లో బాగ్దాద్ అబ్బాసిద్ ఖలీఫా ప్రతినిధి ఒకరు ఇల్తుమిష్‌ను అధికారికంగా గుర్తించి అన్నిలాంఛనాలతో పట్టాభిషేకం నిర్వహించాడు. కుతుబుద్దీన్ సహచరులతో జరిగిన యుద్ధాలలో గెలుపొందిన తర్వాతే అతడికి ఈ గుర్తింపు లభించింది. గొప్ప పోరాట వీరులైన ఈ సహచరులు పశ్చిమోత్తర భారతదేశాన్ని నియంత్రించేవారు. ఇల్తుమిష్ రాజ్‌పుత్‌ల ప్రతిఘటనను కూడా ఎదుర్కోవలసి వచ్చింది. అతడు గ్వాలియర్, రణథంబోర్‌లను ఆక్రమించినా అనేక మంది ఇతర రాజ్‌పుత్ నాయకులు (ఉదాహరణకు : ఉదయ్‌పూర్ వద్ద నాగ్దా గెహ్లోట్‌లు, దక్షిణ ఆగ్రాలో బుండీ చౌహాన్లు) ఇల్తుమిష్‌ను విజయవంతంగా ధిక్కరించారు. క్రీ.శ.1236లో తన మరణానికి కొద్ది ముందు అతడు బెంగాల్‌ను తన నియంత్రణలోకి తెచ్చుకున్నాడు. బీహార్‌లోని భక్తియార్ ఖిల్జీ అనుచరులను ఓడించిన తర్వాతే ఇది సాధ్యమైంది.

రాజ్య పరిధిలో అంతర్గత సమస్యలతోపాటు ఇల్తుమిష్ తన రాజ్యాన్ని మంగోలుల నుండి కాపాడుకోవలసి వచ్చింది. అప్పటికే దేశంలోకి మంగోలులు పెద్ద ఎత్తున జొరబడ్డారు. యుద్ధంలో ఓడిన ఖ్వారిజ్మ్‌షా కుమారుడిని వెదుక్కుంటూ ఛంగీజ్‌ఖాన్ క్రీ.శ. 1221లో సింధూ తీరానికి చేరుకున్నాడు. ఛంగీజ్‌ఖాన్ ఖ్వారిజ్మ్‌షాపై దాడి చేసినప్పుడు ఎవరి పక్షం వహించకుండా జాగ్రత్త పడడంవల్లే ఇల్తుమిష్ మంగోలులపై విజయం సాధించగలిగాడు. ఎందుకంటే ముస్లింగా ఇల్తుమిష్ సహాయాన్ని ఖ్వారిజ్మ్‌షా అర్థించే అవకాశం ఎక్కువగా ఉండేది. పంజాబ్‌లో కొన్ని సైనిక దళాలను వదలి ఛంగీజ్‌ఖాన్ తిరుగుముఖం పట్టాడు. ఈ సైన్యాలు ఢిల్లీ సుల్తాను రాజ్యానికి 13వ శతాబ్దమంతటా పక్కలో బల్లెంలా మారాయి. అయితే మంగోలు తెగల కంటే సుల్తాన్లు, వారి సైన్యాలు యుద్ధతంత్రంలో పై చేయిని సాధించాయి. హిందూ రాకుమారులతో పోల్చితే ఢిల్లీ సుల్తాన్లు రాజ్య పరిరక్షణలో ఎంతో నైపుణ్యంతో వ్యవహరించారు. భారతదేశాన్ని సమర్థవంతంగా రక్షించుకోవాలంటే కొత్త తరహా యుద్ధతంత్రం, కొత్త పరికరాలు అవసరం.

కాని ఇవేవీ హిందూ పాలకుల వద్ద ఉండేవి కావు. ఇల్తుమిష్ మరణం తర్వాత మూడు దశాబ్దాలపాటు సేనాపతులు, గవర్నర్లు, బానిసలు, సుల్తాన్ వారసుల మధ్య తీవ్రమైన అంతర్యుద్ధం చెలరేగింది. ఇల్తుమిష్ కుమార్తె రజియా రాజ్యాన్ని మూడేళ్లపాటు పాలించింది. సమకాలీన నివేదిక 'తబాకత్–ఎ–నాసిరి' ఆమెను పరిణతి చెందిన పాలకురాలిగా, సమర్థురాలైన సైనిక నేతగా వర్ణిస్తుంది. "పాలకుడికి అవసరమైన ఉన్నత లక్షణాలన్నీ ఆమెలో ఉండేవి. ఇన్ని లక్షణాలున్నప్పటికీ ఆమె తలరాత వేరుగా రాసిపెట్టబడింది. కారణం ఆమె మగాడిగా జన్మించలేకపోవడమే." సంస్థానాధీశులు ఆమెను తప్పించారు. వారిలో ఒకరి సహాయంతో పీఠాన్ని తిరిగి పొందాలని ప్రయత్నించినప్పుడు రజియాను హత్య చేశారు.

తదుపరి ఘర్షణల్లో ఇల్తుమిష్ బానిసలైన నలభై మంది ఒక వర్గంగా ఏర్పడి తమ ప్రాబల్యాన్ని రోజు రోజుకూ పెంచుకొన్నారు. చివరకు వారిలో ఒకడైన బాల్బన్ అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. అప్పటికి ఇల్తుమిష్ కుటుంబంలో పురుషులందరూ చనిపోయారు. కొత్త సుల్తాను బాల్బన్ తీవ్ర చర్యలకు ప్రసిద్ధి పొందాడు. అంతకు ముందు అతడు విరోధులైన రాజ్‌పుత్రులను అణచివేశాడు. ఇప్పుడు తన వర్గంలోని నలభై మందిని హత్య చేయించాడు. తర్వాత మంగోలులకు వ్యతిరేకంగా రక్షణ చర్యలను చేపట్టాడు. క్రీ.శ. 1279లో బాల్బన్ కుమారుడు ముహమ్మద్ మంగోలు సైన్యాలను ఓడించాడు. ఢిల్లీ నుండి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని బెంగాల్ సుల్తాన్‌గా పీఠమెక్కిన ఒక తుర్కుఅధికారిని కూడా బాల్బన్ హత్యచేశాడు. బాల్బన్ వారసులు అప్పటినుండి క్రీ.శ. 1338 వరకు బెంగాల్‌ను పాలించారు. ఆ తర్వాత బెంగాల్ మరోసారి స్వతంత్ర రాజ్యంగా మారింది.

**ఢిల్లీ సుల్తాను రాజ్యపటిష్టతకు ఇల్తుమిష్ కృషి :**

ఇల్తుమిష్‌ను సాధారణంగా బానిస రాజ్య వ్యవస్థాపకునిగా గుర్తిస్తారు. ఈ రాజ్యాన్ని పటిష్టం చేయడానికి ఐబక్ ఎంతోకాలం బ్రతకలేదు. తన ప్రభువు అంతకుముందు సాధించిన విజయాలను ఇల్తుమిష్ బలోపేతం చేశాడు. సుల్తాను రాజ్యానికి ఒక అధికార స్వరూపాన్ని ఇచ్చాడు. తొలి నుండి తన ప్రత్యర్థులను అవమానపరుస్తూ, కొత్తగా దండయాత్రలను చేపడుతూ అతడూ జీవితంలో అనునిత్యం తీరిక లేకుండా వ్యవహరించాడు. అతడి ప్రయత్నాలు మంచి ఫలితాలను సాధించిపెట్టాయి. కొన్ని దూరపు రాజ్యాలు మినహా ఉత్తర భారత ప్రాంతమంతటిని తన రాజ్యంలో విలీనం చేయడంలో అతడు కృతార్థుడయ్యాడు. మరణానంతరం ఒక పటిష్టమైన రాజ్యాన్ని అతడు తన వారసులకు వదలి వెళ్లాడు. ఇల్తుమిష్ బలహీనమైన పాలకుడిగా ఉండి ఉంటే ఉత్తర భారతంలో ముస్లిం దండయాత్రలన్నీ కేంద్రీకృత నాయకత్వం లేకుండా చిన్న చిన్న స్వతంత్ర రాజ్యాలుగా మిగిలిపోయి ఉండేవి. రాకుమారులు స్వతంత్రంగా తమ తమ రాజ్యాలను పాలించేవారు. ఆక్రమణదారులను వ్యక్తిగతంగా వ్యతిరేకించే శక్తి రాజ్‌పుత్ నాయకులకు ఉండడంతో ఈ చిన్న రాజ్యాలు కూడా చాలా వరకు అంతరించిపోయే అవకాశమే ఎక్కువగా ఉండేది.

భారతదేశంలో శైశవ దశలో ఉన్న ముస్లిం రాజ్యాలను పరిరక్షించిన ఘనత ఇల్తుమిష్‌కు దక్కుతుంది. ఈ రాజ్యాలన్నింటినీ విలీనం చేసి ఒక సమగ్రమైన సుల్తాను రాజ్యంగా తీర్చిదిద్దిన ఇల్తుమిష్ అనువంశిక రాచరిక కుటుంబాన్ని కూడా ఏర్పాటు చేశాడు. అతడి గొప్ప విజయాలలో ఇది ఒకటి. సుల్తాను రాజ్య ప్రత్యేకతను చాటి మధ్య ఆసియా సామ్రాజ్యంతో తెగతెంపులు చేసుకొని ఛంగీజ్ ఖాన్ బారి నుండి దానిని కాపాడుకోవడం చాలా కష్టమైన కార్యం అయినా తన దూరదృష్టి, నైపుణ్యంతో అతడు అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. అతడి సామర్థ్యమే అతడికి ప్రత్యేకమైన, పవిత్రమైన రాజ్య హక్కును అందించింది. 1229 లో ఖలీఫా నుండి లభించిన ఆమోదం అతడి వంశం, రాజ్యం సంతరించుకున్న స్థాయిని కేవలం అధికారికంగా మాత్రమే ఖరారు చేసింది.

బలమైన పాలకునిగా తనను తాను నిరూపించుకోవడంతో ఇల్తుమిష్ తన కుమార్తె రజియాను వారసురాలిగా నియమించాడు. ఆమె సమర్థవంతమైన పాలకురాలైనప్పటికీ ఒక అబిసినియా బానిసపై ఆమె చూపిన అపారమైన అనురాగం,  మరీ ముఖ్యంగా ఆమె మహిళ కావడంతో సంస్థానాధీశులు రజియాను తరిమికొట్టారు. ఆమెను తప్పించడం బట్టి చూస్తే అనువంశిక రాచరిక వ్యవస్థ అంటూ ఏదీ లేదని రుజువు అవుతుంది. నసీరుద్దీన్ మహ్మద్‌తో సహా ఇల్తుమిష్ వారసులందరూ చేతగానివారు. నసీరుద్దీన్ చనిపోయినపుడు మగ వారసులెవ్వరినీ వదలి వెళ్లలేదు. దాంతో అతడి మహామంత్రి బాల్బన్‌ను సింహాసనం ఎక్కించారు. బాల్బన్ తొలుత తుర్కు బానిసగా ఉండేవాడు.

**బాల్బన్ పాత్ర:** 1266లో నసీరుద్దీన్ మహ్మద్ మరణం తర్వాత బాల్బన్ సుల్తాన్ అయ్యాడు. నసీరుద్దీన్ 20 ఏళ్ల పాలనలో బాల్బన్ వజీరుగా (మహామంత్రి) వ్యవహరించాడు. అప్పుడు అతడి సహాయకుడిగా, అంటే దాదాపు పాలకునిగా ఉన్నాడు. ఈ కాలంలో అతడు రాజ్యాన్ని ఎన్నో ఆపదల నుండి కాపాడి పరిపాలనా వ్యవహారాలలో అపారమైన అనుభవాన్ని గడించాడు. ఆ విధంగా అతడు రాజుగా బాధ్యతలు స్వీకరించినపుడు రాజ్యం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిపై దృష్టి సారించాడు. పరిపాలనా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేశాడు. అరాచక శక్తులను అణచివేయడంలో, సామ్రాజ్యాన్ని మంగోలు సైన్యాల నుండి పరిరక్షించడంలో సఫలమయ్యాడు.

పరిపాలనను సంస్కరించే క్రమంలో అతడు ఢిల్లీ సింహాసన ప్రతిష్టను పెంచే చర్యలు తీసుకున్నాడు. రాజుకు ఉన్న దైవప్రాప్తాన్ని విశదీకరించి, అతడు భూమిపై దేవుని ప్రతినిధి అనే సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాడు. “పాలకుని ఉన్నత హోదా, దైవశక్తి ప్రజల విధేయతను చూరగొంటుంది,” అని బాల్బన్ ప్రకటించాడు. అయితే ప్రజల విధేయతను, సాన్నిహిత్యాన్ని పొందాలంటే రాజు తన బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించాల్సిఉంటుందని, అప్పుడే అతడికి ఆ హోదా సార్థకమవుతుందని కూడా పేర్కొన్నాడు. రాజు నిర్వర్తించాల్సిన కర్తవ్యాలు: (1) మత పరిరక్షణ, షరియ (ఇస్లామిక్ సూత్రాలు) నిబంధనల అమలు (2) అనైతిక, పాపకార్యాలను

నిరోధించడం (3) సజ్జనులను ఉన్నత పదవులలో నియమించడం, (4) న్యాయాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయడం. ఈ బాధ్యతల నిర్వహణలో బాల్బన్ ఎక్కడా రాజీపడలేదని చెప్పడం ఇక్కడ అనవసరం. అతడి వ్యక్తిగత జీవితం ఎలాంటి దుర్వ్యసనాలకు లోను కాలేదు. రాజుగా అతడు మద్యాన్ని ముట్టకుండా సాత్విక జీవితాన్ని గడిపాడు. అతడి న్యాయసిద్ధాంతం ఉన్నతమైనది. తప్పుచేసినవారు సామాన్యులైనా, రాచరిక కుటుంబీకులైనా అందరినీ సమానంగా శిక్షించేవాడు.

రాజు అధికారాలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో భాగంగా బాల్బన్ ఒక అద్భుతమైన దర్బారును నిర్వహించేవాడు. పర్షియా పాలకుల ఆస్థానాలను పోలి ఉండే ఈ దర్బారులో అతడు పర్షియా రాచమర్యాదలను, సాంప్రదాయాలను ప్రవేశపెట్టాడు. అజానుబాహులు, భీకర స్వరూపం కలిగిన రాచరిక సంరక్షకులు తమ ఆయుధాలను ధగధగ మెరిపిస్తూ రాజు చుట్టూ వలయంలా ఏర్పడి అతడికి రక్షణ కల్పించేవారు. సిజ్దా (మోకరిల్లడం), పాయ్‌బోస్ (రాజు పాదాలకు నమస్కరించడం) ఆచారాన్ని కూడా అతడు ప్రవేశపెట్టాడు. రాజును గౌరవించే క్రమంలో ఈ ఆచారాన్ని పాటిస్తారు. అతడు ఎంత హుందాగా వ్యవహరించేవాడంటే తన వ్యక్తిగత సేవకుల ముందు కూడా పూర్తి వస్త్రాధారణతోనే కనబడేవాడు. అతడు ఎన్నడూ గట్టిగా నవ్వలేదు, పరిహాసమాడలేదు. తన దర్బారులో కూడా తన సమక్షంలో చిద్విలాసాలను, నవ్వులాటను ఎప్పుడూ అనుమతించలేదు. గంగా-యమున పరివాహక ప్రాంతంలో శాంతిభద్రతలను పునరుద్ధరించడం, మేవాతిల దాడుల నుండి రాజధానిని రక్షించడంపై అతడు తొలుత దృష్టి సారించాడు. అరాచకులైన మేవాతిలు రాజధాని భద్రతకు ముప్పుగా పరిణమించారు. పగలువారు వ్యాపారులు, యాత్రికులను దోచుకొని చిత్రహింసలు పెట్టేవారు. రాత్రిళ్లు రాజధానిలోని ఏదో ఒక ప్రాంతంలో దోపిడీకి పాల్పడేవారు. మేవాతిలపట్ల సుల్తాన్ నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాడు. బందిపోటు ముఠాలను తీవ్రంగా అణచివేసి వాటిని అడవులకు× తరమికొట్టాడు. వారి దుష్ట పన్నాగాల నుండి రాజధానిని రక్షించడానికి బాల్బన్ బలమైన సైనిక స్థావరాలను నిర్మించి వాటిలో ఆఫ్ఘన్ సైన్యాలను నియమించాడు. అలాగే అతడు గంగా-యమున ప్రాంతంలో దోపిడీదొంగలను అణచివేశాడు. కాంపిల, పటియాలా, భోజ్‌పూర్‌లోని బందిపోట్ల స్థావరాలపై స్వయంగా దాడులు నిర్వహించాడు వారి ప్రాబల్యాన్ని అణచివేశాడు. అక్కడ అరాచక పరిస్థితులను సరిదిద్దడానికి ఆఫ్ఘన్ సైన్యాలను మోహరించాడు. ఈ చర్యల ప్రతిఫలంగా ఈ ప్రాంతంలో శాంతి నెలకొంది. రహదారులు వ్యాపారులు, యాత్రికులకు సురక్షితంగా మారాయి.

శాంతిభద్రతలను పునరుద్ధరించిన తర్వాత బాల్బన్ పాలనా యంత్రాంగాన్ని, రాజ్య సైనిక నిర్వహణను ప్రక్షాళన చేసే కార్యక్రమాన్ని ప్రారంభించాడు. రాజు నియంతృత్వానికి చహల్‌గని (40 మంది ఉన్నతాధికారుల వర్గం) పెద్ద అటంకిగా ఉందని అతడు త్వరగానే గ్రహించాడు. ఈ సంస్థానాధీశులు రాజును తమలో ఒకనిగా మాత్రమే పరిగణించేవారు.

రాజు ఉన్నతాధికారాన్ని గుర్తించడానికి వారు సిద్ధపడలేదు. ఈ ధిక్కారాన్ని బాల్బన్ ఏ మాత్రం సహించలేకపోయాడు. ఈ వర్గాన్ని అణచివేయాలన్నదే అతడి రాజకీయ విధానంగా మారింది. ఇందుకోసం అతడు తుర్కు యువ అధికారులను కీలక పదవుల్లో నియమించాడు. నేరం ఏ స్థాయిలో ఉన్నప్పటికీ సంస్థానాధీశులను అతడు కఠినంగా శిక్షించాడు. అలాగే గూఢాచార వ్యవస్థను ఏర్పాటు చేసి వారి కదలికలపై నిఘా ఉంచాడు. ముఖ్యమైన సమాచారాన్ని అందించడంలో విఫలమయ్యే వేగులను బాల్బన్ కఠినంగా శిక్షించేవాడు.

రాజ్యాన్ని బలోపేతం చేయడం కోసం బాల్బన్ సైన్యాన్ని ప్రక్షాళన చేశాడు. పాత, కొత్త ఆశ్విక, పదాతి దళాలను నిజాయితీపరులు, ధీరులైన మాలిక్‌ల నియంత్రణలో ఉంచాడు. గంగా యమున ద్వినది ప్రాంతంలో 2,000 మంది ఆశ్వికులకు ప్రదానం చేసిన భూములపై విచారణ జరిపించాడు. భూములను తొలుత పొందిన వారు చాలా మంది చనిపోయి ఉన్నారు లేదా వృద్ధాప్యంలో మగ్గుతూ ఉన్నారు. వారి వారసులు భూములపై వచ్చే ఆదాయాన్ని అనుభవిస్తూ ఉన్నారు. సైనిక సేవ చేయనప్పటికీ భూములను అట్టిపెట్టుకున్నారు. క్రమబద్ధ సైన్యంలో చేరాల్సిందిగా బాల్బన్ ఆ యువకులను ఆదేశించాడు. సైనిక సేవకు యోగ్యులు కాని వృద్ధులకు, విధవలు, వారి పిల్లలకు, అనాధలకు అతడు పెన్షన్లు మంజూరు చేశారు.

బాల్బన్‌కు బలమైన సైన్యం ఉన్నప్పటికీ అతడి హయాంలో ఒక్క దండయాత్ర కూడా నమోదు కాలేదు. సరిహద్దులో మంగోలు సైన్యాల బెడదను నివారించడంలోనే అతడి పాలనా కాలమంతా గడిచిపోయింది. మంగోలు దాడులు నిరంతర ప్రక్రియగా మారాయి. వారు పంజాబ్, సింధ్ ప్రాంతాలలో విధ్వంసం సృష్టించారు. వారిని ఎదుర్కోవడానికి సుల్తాన్ ఎల్లప్పుడూ రాజధానిలోనే మకాం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరిహద్దు భద్రతపై నిరంతరం దృష్టి సారించాల్సివచ్చింది. లాహోర్ పాత కోటను పునఃనిర్మించాలని బాల్బన్ ఆదేశాలు జారీ చేశాడు. షేర్ ఖాన్ సంకార్ నేతృత్వంలో ఒక బలమైన సైన్యాన్ని అక్కడ నియమించాడు. షేర్ ఖాన్ బ్రతికి ఉన్నంతకాలం అతడి ధీరత్వం మంగోలు సైనికుల గుండెల్లో దడ పుట్టించేది. షేర్ ఖాన్ మరణించినపుడు బాల్బన్ అతడి ఇద్దరు కుమారులు ముహమ్మద్, బుగ్రా ఖాన్‌లను సరిహద్దు ప్రాంతాల గవర్నర్లుగా నియమించాడు. ముహమ్మద్ ముల్తాన్ గవర్నర్‌గా వ్యవహరించాడు. అలాగే బుగ్రాఖాన్ సమన, సునామ్ ప్రాంతాల బాధ్యతను తీసుకున్నాడు. వీరి ఉమ్మడి సైన్యాలు 1279లో పంజాబ్‌పై దండయాత్రకు వచ్చిన మంగోలులను దారుణంగా ఓడించాయి. ఆ విధంగా మంగోలు సైన్యాల బెడద తప్పి సరిహద్దు సురక్షితంగా మారింది.

బాల్బన్ మరణం తర్వాత అతడి మనవడు కైకూబాద్ సింహాసనమెక్కాడు. అతడు విలాస పురుషుడు. ఆ సమయంలో సంస్థానాధీశులు రెండు వర్గాలుగా చీలి పోయారు. ఒకటి తుర్కు వర్గం, మరొకటి ఖిల్జీ వర్గం. ఖిల్జీనాయకులు తమ ప్రత్యర్థులను అంతమొందించారు. కైకూబాద్ తన స్వంత రాజమందిరంలో హతమయ్యాడు. ఖిల్జీ

సంస్థానాధీశుడు జలాలుద్దీన్ 1290లో జలాలుద్దీన్ ఫిరోజ్ బిరుదుతో పీఠమిక్కాడు. ఆ విధంగా బానిస వంశానికి చెందిన పాలకులందరూ ఎంతో కొంత ముద్ర వేసి వెళ్లారు. అయితే రాజుల అనువంశిక వారసులు మాత్రం ఎలాంటి ఘనత చూపలేకపోయారు. పాలనాబాధ్యతలను శక్తిమంతుడైన బానిస చేపట్టే ఈ సాంప్రదాయాన్ని ఇస్లామిక్ ప్రపంచంలో ఒక అరుదైన గౌరవంగా భావించేవారు. అందులో ఎలాంటి అభ్యంతరకరమైన విషయం లేదు. ఎందుకంటే ఇస్లామిక్ సమాజం వర్గాలు, కులాలుగా చీలి ఉండేది కాదు. ఎంతైనా ఇస్లాం, ఇస్లామిక్ సామ్రాజ్యం శీఘ్రగతిన విస్తరించడానికి కారణం ఆ మతాన్ని ఎలాంటి అపోహలకు పోకుండా స్వీకరించిన ముస్లిమేతరులే. వ్యక్తిగత సామర్థ్యమే గీటురాయిగా ఉండేది.

# అల్లావుద్దీన్ ఖిల్జీ

## దండయాత్రలు, సంస్కరణ చర్యలు

**పరిచయం:**

క్రీ.శ. 1286లో బాల్బన్ మరణించిన కొద్ది సంవత్సరాలలోపే ఖిల్జీలనే తుర్కు కుదురుకు చెందిన ఒక సభ్యుడు సింహాసనం కోసం జరిగిన అంతర్గత పోరులో అజేయునిగా నిలిచాడు. ఈ ఖిల్జీ సంస్థానాధీశుడు జలాలుద్దీన్ ఖిల్జీ వంశాన్ని స్థాపించాడు. ఖిల్జీ వంశం క్రీ.శ. 1290 నుండి 1320 వరకు మాత్రమే పాలించగలిగింది. అనతికాలంలోనే అతడు తన అల్లుడైన అల్లావుద్దీన్ ఖిల్జీ చేతిలో హత్యకు గురయ్యాడు. అల్లావుద్దీన్ 1296లో గద్దెనెక్కాడు. ఢిల్లీ సుల్తానుల్లో అత్యంత శక్తిమంతునిగా, గొప్పవాడిగా అల్లావుద్దీన్ చరిత్రలో నిలిచిపోయాడు. అతడు దక్షిణ భారతంపై దాడి చేశాడు. తన రాజ్యాన్ని మంగోలుల నుండి కాపాడాడు. పాలనా సంస్కరణలు ఎన్నింటినో అమలుచేశాడు. అలా తన దండయాత్రలకు వనరులను సమకూర్చుకున్నాడు. ఢిల్లీ సుల్తాను రాజ్యం ఏర్పడిన తర్వాత వందేళ్ల వరకు అది ఉత్తర భారత భూభాగానికే పరిమితమై ఉండేది. అంతకంటే మించి పంజాబ్ చాలా వరకు మంగోలుల నియంత్రణలో ఉండేది. మరోవైపు బెంగాల్ సాధారణంగా స్వతంత్రంగానే వ్యవహరించేది. కాని ఇపుడు అల్లావుద్దీన్ క్రీ.శ. 1300లో దండయాత్రలను పెద్ద ఎత్తున చేపట్టాడు. భారతదేశంపై తన ప్రాబల్యాన్ని ఆశ్చర్యకరమైన రీతిలో పెంచుకున్నాడు. అతడు రెండవ అలెగ్జాండర్ (సికందర్) కావాలని కోరుకున్నాడు. అతడి నాణేలు, సామూహిక ప్రార్థనల్లో ఈ ఆకాంక్ష ప్రస్ఫుటమయ్యేది.

ఢిల్లీ సుల్తాన్‌లలో ఖిల్జీ నిస్సందేహంగా గొప్పవాడు. ఎందుకంటే అతడు పరిపూర్ణమైన నియంతృత్వాన్ని స్థాపించాడు. తుర్కు కులీనులు, ఉలేమా, హిందూ భూస్వాములు, వ్యాపార సముదాయం, ప్రజలను తన అధికారానికి తలొగ్గేలా చేశాడు. సైనికవాదాన్ని శిఖర స్థాయికి తీసుకెళ్లాడు. దృఢచిత్తం గల ఒక సార్వభౌముడు ప్రభుత్వ, సామ్రాజ్య విస్తరణ రంగాల్లో సైన్యం సహాయంతో ఏమి సాధించగలడో అతడు నిరూపించాడు. వ్యక్తులను అంచనా వేయడంలో అతడు సిద్ధహస్తుడు. సరైన వ్యక్తులను ఎంపిక చేయడమే అతడి విజయరహస్యం. సార్వభౌముని గౌరవానికి ఎలాంటి భంగం వాటిల్లకూడదని అతడు నిర్ధారించాడు. ఆ విషయంలో ఎక్కడా

రాజీ పడలేదు. అయితే ఇతరుల సలహాలను ఆమోదించడం తన హోదాకు తగని పనిగా అతడు ఎన్నడూ భావించలేదు. సుదీర్ఘ చర్చ, సమాలోచన తర్వాత అతడు నిర్ణయం తీసుకునేవాడు. ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత పర్యవసానాలు గురించి ఆలోచించకుండా దానికే కట్టుబడి ఉండేవాడు.

**రాజత్వంపై అతడి సిద్ధాంతం:**

సింహాసనంపై పూర్తి పట్టు సాధించిన తర్వాత అల్లావుద్దీన్ బాల్బన్ రాజత్వ సిద్ధాంతాన్ని పునరుద్ధరించాడు. దానిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాడు. బాల్బన్‌లాగా అతడు కూడా రాజును దేవుని ప్రతినిధిగా భావించేవాడు. అతడి సిద్ధాంతం ప్రకారం రాజు కోరికే చట్టం. ఎందుకంటే ఇతరుల కంటే రాజుకు మేధస్సు ఎక్కువగా ఉంటుంది. "రాజత్వం ఎలాంటి బంధుత్వాన్ని గుర్తించదు" అన్న నానుడిని అతడు నమ్మేవాడు. తన రాజ్యంలోని ప్రజలందరూ రాజుకు సేవకులు లేదా పాలితులై ఉండాలి. రాజ్య విధానాలను రూపొందించడం లేదా అమలు చేయడంలో తనను ఏ వ్యక్తిలేదా వర్గం కాని ప్రభావితం చేయడానికి అతడు అనుమతించలేదు. అయితే సంస్థానాధీశులను సేవకులుగా మార్చివేశాడు. వారి పదవులు సుల్తాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేశాడు. ప్రభుత్వ వ్యవహారాల్లో ఉలేమాల జోక్యం సహించబోనని అతడు ఢిల్లీ సుల్తాన్ రాజ్య చరిత్రలో తొలిసారిగా ప్రకటించాడు. రాజ్య సంక్షేమం విషయంలో ఏది మంచో ఏది చెడో మతగురువుల కంటే తనకే బాగా తెలుసునని అతడు భావించాడు. అయితే లౌకిక రాజ్య సూత్రాన్ని అల్లావుద్దీన్ పాటించాడని లేదా ముస్లింగా వ్యవహరించడం మానివేశాడని ఇక్కడ అర్థం చేసుకోరాదు. తన సార్వభౌమత్వాన్ని నిర్ధారించుకునేందుకు ఖలీఫా ఆమోదాన్ని పొందాల్సిన అవసరం లేదని అల్లావుద్దీన్ భావించాడు. అందుకే ఆమోద పత్రం కోసం అతడు అభ్యర్థించలేదు. అయినప్పటికీ అతడు ఖలీఫా సహాయకునిగా వ్యవహరించాడు. ఖలీఫాను రాజకీయ ప్రముఖునిగా గౌరవించడానికి అతడు అలా చేయలేదు. కేవలం ఖలీఫత్ సిద్ధాంతాన్ని సజీవంగా ఉంచడానికే అలాంటి ప్రతీకాత్మక చర్యను తీసుకున్నాడు. ఉన్నతవర్గాన్ని నియంత్రించడానికి ఖిల్జీ అనేక చర్యలు చేపట్టాడు. పరస్పర భేటీలను, సామూహిక విందులను నిషేధించాడు. సుల్తాను అనుమతి లేకుండా వియ్యం కుదుర్చుకోరాదని ఆదేశించాడు. అన్ని రకాల మత్తు పానీయాలను నిషేధించాడు. విందువినోదాలలో క్షుద్ర రాజకీయాలను చర్చించే అవకాశాలన్నింటినీ అడ్డుకున్నాడు. రాజుకు వ్యతిరేకంగా ఎవరూ కుట్ర పన్నకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఆ విధంగా అల్లావుద్దీన్ సంస్థానాధీశులను బానిసల స్థాయికి క్రమంగా దిగజార్చి వారిపై బానిస వ్యవస్థ పరిస్థితులను రుద్దాడు.

**అల్లావుద్దీన్ దండయాత్రలు:**

సింహాసనాన్ని చేజిక్కించుకోవడానికి ముందే అల్లావుద్దీన్ దేవగిరికి చెందిన యాదవరాజును ఓడించి అతడి ప్రసిద్ధమైన కోటను స్వాధీనం చేసుకున్నాడు. ఔరంగాబాద్ సమీపంలో ఎత్తైన రాతికొండపై నిర్మితమైన ఆ కోట శత్రు దుర్భేద్యంగా పేరుగాంచింది. క్రీ.శ. 1298లో అతడు గుజరాత్‌ను ఆక్రమించాడు. 1301, 1303లలో రణథంబోర్, చిత్తోర్ రాజ్‌పుత్ర పాలకుల తలలు వంచాడు. మాల్వాలోని మాండు, చందేరిలను 1305లో స్వాధీనం

చేసుకున్నాడు. రెండేళ్ల తర్వాత అతడు మరోసారి దేవగిరిపై దాడి చేసి అక్కడి పాలకుడి నుండి కప్పం వసూలు చేశాడు. అంతకుముందు జరిగిన యుద్ధంలో ఓడిపోయిన దేవగిరి రాజు తన మాటను నిలబెట్టుకోకపోవడంతో అల్లావుద్దీన్ రెండవ సారి అతడిపై దాడి చేశాడు. రాజును యుద్ధబందీగా ఢిల్లీకి తీసుకెళ్లాడు. అయితే కప్పం క్రమంతప్పకుండా చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో దేవగిరి పాలకుడికి సింహాసనాన్ని తిరిగి అప్పగించాడు.

క్రీ.శ 1309లో అల్లావుద్దీన్ దక్షిణాది పాలకుల నుండి నిధులు, ఏనుగులను స్వాధీనం చేసుకునే లక్ష్యంతో దండయాత్రను ఆదేశించాడు. 'తారీఖ్ ఎ ఫిరోజ్ షాహి' అనే గ్రంథంలో ఇందుకు సంబంధించిన వర్ణన ఉంది. ఈ దండయాత్ర తొలి లక్ష్యం కాకతీయుల రాజధాని అయిన వరంగల్. క్రీ.శ 1304లో ఓరుగల్లు కోటపై జరిగిన దాడి విఫలమైనప్పటికే ఈ సారి గొప్పసేనాని అయిన మాలిక్ కఫూర్ (ఇతడు గుజరాత్‌కు చెందిన హిందూ బానిస. ఇతడు ఇస్లాం మతాన్ని పుచ్చుకున్నాడు) అల్లావుద్దీన్ కోసం వరంగల్‌ను స్వాధీనం చేసుకున్నాడు. యాదవ రాజు లాగే కాకతీయ పాలకుని రాజ్యాన్ని కూడా పునరుద్ధరించారు. మాలిక్ కఫూర్ పెద్దమొత్తంలో యుద్ధకానుకలను ఢిల్లీకి మోసుకెళ్లాడు. వాటిని తరలించడానికి వెయ్యి ఒంటెలు అవసరమయ్యాయి.

క్రీ.శ. 1310లో మాలిక్ కఫూర్ దక్షిణంలో మరింత లోతుకు చొచ్చుకుపోయాడు. యాదవ పాలకుని సహాయంతో హోయసల రాజధాని ద్వారసముద్రను ముట్టడించి స్వాధీనం చేసుకున్నాడు. హోయసల రాజు మూడవ బల్లల ఆ సమయంలో మదురై పాండ్యులతో యుద్ధంలో మునిగి ఉన్నాడు. రాజధానికి తిరిగివచ్చిన తర్వాత అతడు కూడా యాదవ, కాకతీయ పాలకుల్లాగా కప్పం చెల్లించడానికి అంగీకరించాడు. ఈ తర్వాత మాలిక్ కఫూర్ పాండ్య రాజ్యాన్ని ఆక్రమించి దాని రాజధాని మదురైని తగులబెట్టాడు. శ్రీరంగం లాంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను దోచుకున్నాడు. చివరకు 612 ఏనుగులతో పాటు భారీ యుద్ధ కానుకలతో అతడు ఢిల్లీకి పయనమయ్యాడు. ఈ దక్షిణాది దండయాత్ర కేవలం 11 మాసాలలోపు పూర్తయింది.

దక్షిణ రాజ్యాలపై దండయాత్రలు జరిగిన సమయంలో అల్లావుద్దీన్ ఉత్తర సరిహద్దులలో మంగోలు సైన్యాలను నిలువరించాడు. 1296–97లో పశ్చిమోత్తర భారత దేశంలో మంగోలులు యథేచ్ఛగా దోపిడికి పాల్పడారు. కాని 1299లో ఛంగీజ్ ఖాన్ వారసుడైన కుత్లుగ్ ఖ్వాజా 2,00,000 మంది సైనికులతో తరలి వచ్చాడు. ఢిల్లీ సుల్తాను రాజ్యాన్ని లొంగదీసుకోవాలన్న అతడి లక్ష్యాన్ని అల్లావుద్దీన్ నీరుగార్చాడు. నాలుగేళ్ల తర్వాత అల్లావుద్దీన్ చిత్తోర్ నుండి తిరిగి వస్తున్నపుడు అతడి దళాలు చాలా వరకు ఓరుగల్లును స్వాధీనం చేసుకోవడంలో తలమునకలై ఉన్నాయి. అదే అదునుగా 1,20,000 మంది ఆశ్వికులతో దండయాత్రకు వచ్చిన మంగోలులు ఢిల్లీ వీధులలో బీభత్సం సృష్టించారు. అయితే సిరి వద్ద గల అల్లావుద్దీన్ సైనిక స్థావరాన్ని మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయారు. రెండు మాసాలలోపే మంగోలులు వచ్చినట్లే వచ్చి మాయమయ్యారు. 1306–07లలో జరిగిన మంగోలు దాడులను కూడా ఖిల్జీ తిప్పికొట్టాడు. యుద్ధతంత్రం, ప్రతీకార విధ్వంసక చర్యలలో అల్లావుద్దీన్ మంగోలులకు సమానంగా వ్యవహరించేవాడు. వేలాది మంది మంగోలు యుద్ధఖైదీలను ఢిల్లీ నగర వీధుల్లో ఏనుగులతో తొక్కించి చంపించాడు. ఇదంతా సుల్తాను

దర్బారు ప్రత్యక్షంలో జరిగింది. మంగోలు సాంప్రదాయంలో మృతుల శిరస్సులతో ఢిల్లీ ప్రధాన ద్వారం బయట త్రిభుజ ఆకారాన్ని లేపాడు.

## అల్లావుద్దీన్ సంస్కరణల స్వభావం, ఉద్దేశ్యం:

సమర్థవంతమైన పాలన కారణంగానే అల్లావుద్దీన్ అద్భుతమైన విజయాలను చాలా వరకు పొందగలిగాడు. అతడి పూర్వీకులందరూ తమ పాలనను సైనికశక్తి, కొన్ని ముఖ్యమైన పట్టణాలు, కోటలపై నియంత్రణ ఆధారంగా కొనసాగించారు. గ్రామీణ ప్రాంతం, వ్యవసాయ ఉత్పత్తి సాంప్రదాయబద్ధమైన స్థానిక అధికారుల (పాలకుల) నియంత్రణలోనే ఉండేవి. ముఖ్యంగా గ్రామ పెద్దలు స్థానిక పరిపాలనా బాధ్యతలను నిర్వహించేవారు. వీరిపైనే సుల్తాన్లు ఆధారపడేవారు. వీరిని మధ్యవర్తులుగా నియమించి గ్రామీణ ప్రజానీకాన్ని నియంత్రించేవారు. ఈ స్థానిక మధ్యవర్తుల పెత్తనం, ప్రత్యక్ష లేదా పరోక్ష పాలనను అల్లావుద్దీన్ ప్రధానసమస్యగా పరిగణించాడు. పాలనావ్యవహారాల్లో ఉన్న ఈ ఆటంకాన్ని తొలిగించాలని నిర్ణయించాడు. ఒక విద్వాంసునితో సమాలోచన సందర్భంగా ఈ సమస్యను అల్లావుద్దీన్ విశదీకరించాడు. “ఖుత్లు, ముకద్దమ్‌లు మేలుజాతి గుర్రాలపై స్వారీచేస్తారు. ఖరీదైన వస్త్రాలు ధరిస్తారు. పర్షియా బాణాలను విసురుతారు. తమలో తాము కలహించుకుంటారు. వేటకు వెళతారు. ఇదంతా నేను కళ్లారా చూశాను. గ్రామాలనుండి ఖుత్లు తమ ప్రత్యేక వాటాను వసూలు చేస్తారు. విందులు ఏర్పాటు చేసి మద్యం సేవిస్తారు. వీరిలో చాలా మంది పన్ను ఏమాత్రం చెల్లించరు. ఒత్తిడి తెచ్చినాసరే, తేకపోయినా సరే ప్రభుత్వ వాటాను చెల్లించడానికి ముందుకురారు. అలాగే నా అధికారుల పట్ల  ఏమాత్రం గౌరవం ప్రదర్శించరు.”

తన ఆస్థానంలో తొలుత కుట్రలు, తిరుగుబాట్లు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిఘటనలు సంభవించిన నేపథ్యంలో అల్లావుద్దీన్ సమస్య మూలాలను పరిష్కరించడానికి పాలనాసంస్కరణలను ప్రవేశపెట్టాడు. విశాలమైన సైన్యాన్ని పోషించడంతోపాటు, రాజధానికి నిరంతర ఆహారధాన్యాల సరఫరాను కొనసాగించే ఉద్దేశ్యంతో కూడా ఈ సంస్కరణలు అమలయ్యాయి. అర్హతలేని సంస్థానాధీశులు, సామ్రాజ్య అధికారుల నుండి భూములను స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ గ్రామాలను కూడా రద్దు చేశారు. రెవెన్యూను (ఖరజ్) కేంద్ర ప్రభుత్వమే నేరుగా వసూలు చేయడం మొదలుపెట్టింది. మద్యం అమ్మకాలు, సేవనాన్ని పూర్తిగా నిషేధించారు. ఆస్థాన ప్రముఖులు విందులు లేదా వ్యక్తిగత భేటీలు నిర్వహించకుండా చర్యలు తీసుకున్నారు. వేగులను ప్రతిచోటా నియమించాడు. సుల్తాను ఆదేశాలను ధిక్కరించే వారిపై వీరు సమాచారాన్ని చేరవేసేవారు. సాగులో ఉన్న భూమి అంతటిని మళ్లీ సర్వే చేసి అన్ని గ్రామీణ వర్గాలకు సమానంగా పన్ను విధించాలని అల్లావుద్దీన్ ఆదేశించాడు. సాధారణంగా ప్రభుత్వ వాటా వ్యవసాయ దిగుబడిలో 50 శాతంగా ఉండేది. మేత భూములపై కూడా ప్రత్యేకపన్ను (చరి) విధించారు. అయితే పేద ప్రజలపై మరే ఇతర పన్ను విధించరాదని కూడా అల్లావుద్దీన్ ఆదేశించాడు. అతడి అధికారులు హిందూ మధ్యవర్తుల పట్ల కిరాతకంగా వ్యవహరించేవారు. మంగోలు సైన్యాల నిరంతర దండయాత్రల వల్ల రాజ్యంలో బలమైన సైన్యాన్ని సర్వసన్నద్ధంగా ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ వనరులకు తగ్గట్టు సైనికులను కొత్తగా భర్తీ చేయాలంటే సైనికుల వేతనాన్ని తగ్గించక తప్పలేదు. అలాగే నిత్యావసర సరుకుల

ధరలను కనిష్ట స్థాయిలో ఉంచాలని అల్లావుద్దీన్ ఆదేశించాడు. తక్కువ వేతనం ఉన్న సైనికులు తమ అవసరాలను తీర్చుకునే విధంగా సరుకుల ధరను తగ్గించి వేశారు. అందుకు తగిన ఉత్తర్వులను జారీ చేశారు.

## అల్లావుద్దీన్ సైనిక మార్కెట్ సంస్కరణలు:

సామ్రాజ్య నిర్మాత అయిన అల్లావుద్దీన్ తన సైన్యాన్ని విస్మరించజాలడు. తన పాలన తొలి సంవత్సరాలలో సైన్యాన్ని ప్రక్షాళన చేయాలని అతడు పట్టుదలతో వ్యవహరించాడు. తొలుత సైనిక బలగాల జాబితను సమగ్రంగా నిర్వహించాలని సూచించాడు. తర్వాత అశ్వాలపై ముద్ర వ్యవస్థను ప్రవేశ పెట్టాడు. జాబితలో నాసిరకం అశ్వాలను చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నాడు. సైనికుడి వ్యక్తిగత వివరాలతో కూడిన నివేదిక (చెహ్రా)ను రూపొందించాడు. దేశంలోని వివిధ ప్రాంతాలలో సైనిక బలగాలను మోహరించాడు. అయితే రాజధాని ఢిల్లీ ఒక బలమైన సైనిక దళం సుల్తాను ప్రత్యక్ష నియంత్రణలో పోరాటానికి సర్వసన్నద్ధంగా ఉంచాడు. ఢిల్లీ పాలకులందరిలో అల్లావుద్దీన్‌కే అత్యంత విశాలమైన సైన్యం ఎప్పుడూ అందుబాటులో ఉండేది. తన రాచరిక భద్రతాదళ సిబ్బందికి నగదు రూపంలో వేతనం చెల్లించిన తొలి సుల్తాన్ కూడా అల్లావుద్దీనే. సైనికుల వేతనం కనీస స్థాయిలోనే ఉండేది. అయితే అల్లావుద్దీన్ తన సైన్యాన్ని సంతృప్తికరంగా ఉంచడంలో సఫలమైనట్లు బోధపడుతోంది. ఈ కారణంగానే అతడు నిత్యావసర సరుకుల ధరలను చాలా తక్కువ స్థాయిలో నిర్ణయించాడు. మార్కెట్‌ను నియంత్రించాడు. అలాగే ఇతర ఆర్థిక చర్యలను కూడా తీసుకున్నాడు. సైనికుల ప్రయోజనం కోసమే ఈ సంస్కరణలు అమలయ్యాయి. సుల్తాన్ తన సైనికుల సంక్షేమానికి ఎలాంటి ప్రాధాన్యతనిచ్చాడో దీనిని బట్టి అర్థమవుతుంది. తన సామ్రాజ్య కాంక్షను తీర్చుకోవడానికి అలాగే రాజ్యాన్ని పరిరక్షించడానికి అతడు సైన్యంపైనే ఎక్కువ ఆధారపడ్డాడు.మార్కెట్‌ను నియంత్రించడానికి అతడు ఎన్నో శాసనాలను రూపొందించాడు. వీటి నిబంధనల కారణంగా జీవన వ్యయం చాలావరకు తగ్గింది. తొలుత అతడు ఆహారధాన్యాల ధరను స్థిరీకరించి వాటిని కనిష్ట స్థాయికి తగ్గించాడు. తర్వాత ధాన్యం మార్కెట్‌ను స్థాపించాడు. ఈ మార్కెట్లను రెండు రకాల వ్యాపారులు నిర్వహించేవారు. మొదటి రకం వారు ఢిల్లీలో శాశ్వత దుకాణాలు కలిగిన వారు. వీరిని చిల్లర వ్యాపారులు లేదా పంపిణీదారులుగా పరిగణించవచ్చు రెండవ రకం వారు సంచార వ్యాపారులు. వీరు ఢిల్లీకి ధాన్యం తీసుకొచ్చి స్థానిక వ్యాపారులకు విక్రయించేవారు. అలాగే ప్రజలకు కూడా నేరుగా ఆహార ధాన్యాలను అమ్మేవారు. ఆహార ధాన్యాల ధరను కనిష్టస్థాయిలో నిర్ధారిస్తూ ఉత్తర్వులు వెలువడడంతో ఈ వ్యాపారులు ఢిల్లీకి రావడం మానుకున్నారు. ఒకవేళ ఢిల్లీకి వచ్చి తిండిగింజలను విక్రయించినా వారికి లాభాలు నామమాత్రంగానే దక్కేవి. దీనితో వ్యాపారులంతా షాహ్నా ఎ మండీ (మార్కెట్ సూపరింటెండెంటు) వద్ద తమను తాము నమోదు చేసుకోవాలని, మార్కెట్ అధికారి పరిధిలోని గ్రామాలలోనే నివసించాలని అల్లావుద్దీన్ శాసనం జారీ చేశాడు. గంగా-యమున తీరప్రాంతాలు, రాజధాని సమీపంలోని ఇతర ప్రాంతాలలో వ్యాపారులకు తగిన లాభం వచ్చేలా ధాన్యగింజలను సేకరించడంలో తోడ్పాటు అందించాలని అధికారులను అతడు ఆదేశించాడు.

ప్రకృతీ వైపరీత్యాలకు విరుగుడుగా సుల్తాను ప్రభుత్వ ధాన్యాగారాలను స్థాపించాడు. ఈ ధాన్యాగారాలలో తిండిగింజలను అత్యవసర పరిస్థితుల కోసం నిల్వ ఉంచేవారు. సాధారణ సమయాల్లో ప్రజలు తమకు తోచినంత మేరకు ధాన్యలను కొనుగోలు చేసే వెసులుబాటు ఉండేది. అయితే కరువు లేదా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తిండి గింజలను రేషన్ పద్ధతిలో అమ్మేవారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తమ కుటుంబానికి సరిపడ గింజలను మాత్రమే కొనుగోలు చేయడానికి అనుమతించేవారు. ఒకవేళ ఎవరైనా అవసరానికి మించి కొనుగోలు చేస్తే అతడిని కఠినంగా శిక్షించేవారు. ఆ రోజులలో రేషన్ కార్డులు లేకపోవడంతో మార్కెట్‌కు వెళ్లిన ప్రతి ఒకరికి తగిన పరిమాణంలో గింజలు అమ్మేవారు. ఈ రేషనింగ్ వ్యవస్థ ఒక వినూత్న ఆలోచన. బరాని ప్రకారం ఈ నియంత్రణల వల్ల కనీసం ఢిల్లీలో మాత్రం కరువు ఏర్పడలేదు. తిండి గింజల మార్కెట్‌తో పాటు సైనికులకు అవసరమైన ఇతర వస్తువుల కోసం ప్రత్యేకమార్కెట్లను సుల్తాన్ ఏర్పాటు చేశాడు. వీటిలో వస్త్రాలు, పండ్లు, మిఠాయిలు, మసాల దినుసులు, పాదరక్షలు, ఆయుధాలు, గుర్రాలను విక్రయించేవారు. వీటిని కూడా ధాన్యగింజల మార్కెట్ లాగే నిర్వహించేవారు. ఇలాంటి సమగ్రమైన మార్కెట్ నియంత్రణ వ్యవస్థ సమర్థులైన అధికారుల పర్యవేక్షణ లేనిదే విజయవంతమయ్యేది కాదు. షాహ్‌నా-ఎ- మండీ అనే మార్కెట్ సూపరింటెండెంటు ఉండేవాడు. మార్కెట్‌లో జరిగే ప్రతి క్రయవిక్రయానికి అతడే బాధ్యుడు. అతడికి సర్వాధికారాలు ఉండేవి. బరీద్‌లు, మునయ్యాలు అనే కిందిశ్రేణి మార్కెట్ అధికారులు కూడా సుల్తాన్‌కు నివేదికలు పంపేవారు. మునయ్యాలు ధరలు, తూకాలు, కొలతలను తనిఖీ చేసేవారు. మార్కెట్‌లో సదుపాయాలను పర్యవేక్షించేవారు. సుల్తాన్‌కు నివేదికలను క్రమంగా పంపేవారు. బరీద్‌లు రహస్య నివేదికలను అందించేవారు. వారు కూడా తమ నివేదికలను నేరుగా సుల్తాన్‌కు పంపేవారు. ఆ విధంగా సుల్తాన్ మూడు విభిన్న వర్గాల నుండి నివేదికలను అందుకుంటూ మార్కెట్‌పై గట్టినిఘా ఉంచేవాడు. ఈ కారణంగా జమాబందీ, వ్యాపార కార్యకలాపాలలో అధికారులు నిజాయితీగా వ్యవహరించేవారు.

అల్లావుద్దీన్ మార్కెట్ నియంత్రణపై చర్చను ముగించేముందు రెండు అంశాలపై వివరణ ఇవ్వవలసి ఉంటుంది. ఒకటి: రాజ్య అవసరాల మేరకే మార్కెట్ నియంత్రణను చేపట్టారా లేదా అందరికీ మేలు చేయాలన్న తలంపుతో సంస్కరణలను తీసుకువచ్చారా? రెండు: ఈ ఆర్థికపరమైన చర్యలు కేవలం ఢిల్లీ నగరానికే పరిమితమయ్యాయా లేదా సామ్రాజ్యమంతటికీ వర్తించాయా? తొలి అంశానికి వెళితే ఇంతకు ముందు చర్చించినట్లు అల్లావుద్దీన్ మార్కెట్ నియంత్రణ చర్యలకు కారణం రాజకీయ అవసరాలే కాని ప్రజల సంక్షేమం కాదు. సైనికుల వేతనాన్ని తగ్గించి ఖరారు చేయడంతో అతడు ఇతర నిత్యావసర సరుకులు కూడా తక్కువ ధరకు అందుబాటులో ఉండి జీవన వ్యయం కనిష్టంగా ఉండాలని కోరుకున్నాడు. ఆ విధంగా సైనికులు తక్కువ వేతనం ఉన్నా తగిన జీవన ప్రమాణాలను పాటించగలరని అతడు భావించారు. సైనికులు, ప్రభుత్వాధికారులతో పాటు సామాన్యప్రజలు కూడా ఈ చర్యల వల్ల ప్రయోజనం పొందిన మాట వాస్తవమే. అయితే ఇది కేవలం యాదృచ్ఛికంగా సంభవించిన పరిణామం.

రెండవ అంశానికి వస్తే సుల్తాను ప్రధానంగా సైన్యం సౌలభ్యం కోసమే ధరలను నియంత్రించాడు. సైన్యం సామ్రాజ్యమంతటా విస్తరించి ఉండేది కనక సమాన స్థాయిలో వేతనాలు లభించేవి. దీనిని బట్టి రాజధానితో పాటు ముఖ్యమైన ప్రాంతీయ పట్టణాలు లేదా ప్రాంతీయ రాజధానులలో ధరల నియంత్రణ ఉండేదని లేదా ప్రభుత్వం సైనికావసరాల కోసం ఢిల్లీలోనే అన్ని వస్తువులను కొనుగోలు చేసి వాటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేదని భావించాలి.

## అల్లావుద్దీన్ రెవెన్యూ సంస్కరణలు :

తుర్కు పాలక వంశంలో రెవెన్యూ సంస్కరణలపై దృష్టి సారించిన తొలి పాలకుడు కూడా అల్లావుద్దీనే. గంగా-యమున లోయలో భూమి కేటాయింపులను అతడు పునరుద్ధరించాడు. ఈ భూములను సంస్థానాధీశులు, ప్రభుత్వ అధికారులు, ఇతర వ్యక్తులు కానుకలు, విరాళాలు లేదా బహుమానాల రూపంలో రాజ్యం నుండి స్వీకరించేవారు. ఇలాంటి వ్యక్తుల ఆధీనంలోని అన్ని రకాల భూములను పునరుద్ధరించి వాటిని రాజ్య భూములుగా మార్చాలని (ఖలీసా) అల్లావుద్దీన్ ఆదేశించాడు. అయితే అన్ని భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని భావించలేము. ఎందుకంటే అల్లావుద్దీన్ హయాంలో భూములను కేటాయించే వ్యవస్థను పూర్తిగా ఉపసంహరించలేదు.

మరో ప్రత్యేక శాసనం ద్వారా సుల్తాను భూమి శిస్తును దిగుబడిలో 50 శాతంగా నిర్ధారించాడు. వ్యవసాయ దిగుబడిని అంచనా వేయడానికి ఒక క్రమబద్ధ పద్ధతిని రూపొందించాడు. అతడు ప్రవేశపెట్టిన ఏకీకృత కొలత వ్యవస్థ కింద పేద, ధనిక వర్గాల ఆధీనంలోని భూమి అంతటినీ 50 శాతం పన్ను పరిధిలోకి చేర్చారు. ఈ చర్య కారణంగా భూస్వాములు, జమీందార్లు అందరూ రైతులతో సమానంగా హోదా పొందారు. వారి అదనపు ఆదాయం (ప్రత్యేక వాటాల రూపంలో) నిలచిపోయింది. పన్నును నగదు, ధాన్యరూపం రెండింటిలో స్వీకరించేవారు. అయితే రాజ్య ధాన్యగారాలలో ఆహార నిల్వలను సేకరించాలని సుల్తాన్ భావించడంతో రాజధాని సమీపంలోని సారవంతమైన ప్రాంతాల నుండి ధాన్యరూపంలోనే ప్రభుత్వ వాటాను స్వీకరించారు.

ఇస్లామిక్ చట్టం ప్రకారం రాజ్యానికి యుద్ధ కానుకలలో ఐదోవంతు భాగం తీసుకునే హక్కు వుంది. మిగతా(4/5) భాగాన్ని సైనికులు పంచుకోవాలి. కాని ప్రభుత్వ ఖజానాను నిండుగా ఉంచాలని కోరుకున్న అల్లావుద్దీన్ ఈ నియమాన్ని పక్కన పెట్టాడు. తన ప్రజలు సంపన్నులుగా ఎదగడం అతడికి ఇష్టముండేది కాదు. ఫలితంగా రాజ్యానికి యుద్ధకానుకలలో 4/5 భాగం, సైనికులకు 1/5 భాగం దక్కేవి. విశాలమైన వ్యవసాయ ప్రాంతాలను ప్రభుత్వ భూములుగా (ఖలీసా) మార్పు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం తన ఆదాయాన్ని పూర్తిగా గ్రహించే చర్యలను చేపట్టాల్సి వచ్చింది. ఇంకోవైపు ప్రభుత్వ ఆధీనంలోని భూములు పెరగడంతో కిందిస్థాయి రెవిన్యూ ఉద్యోగుల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. వీరిలో ఎక్కువశాతం అవినీతిపరులు, దోపిడీదారులు. ఈ లోపాలను సవరించడానికి అల్లావుద్దీన్ దీవాన్ ఎ ముస్తఖరజ్

అనే శాఖను ఏర్పాటు చేశాడు. కలెక్టర్లు చెల్లించాల్సిన బకాయిలపై విచారణ జరిపి వాటిని వసూలు చేసే బాధ్యత ఈ శాఖపై ఉండేది. ఆమిల్, కార్కూన్ అనే రెవెన్యూ అధికారులు బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైతే సుల్తాన్ వారిని కఠినంగా శిక్షించేవాడు. రెవెన్యూ శాఖలోని పట్వారీలు, ఇతర అధికారులలో అవినీతిని నిర్మూలించడానికి కూడా చర్యలు తీసుకున్నాడు.

## అల్లావుద్దీన్ సంస్కరణల ప్రభావం:

బరాని తాను రచించిన తారిఖ్-ఎ-ఫిరోజ్ షాహి గ్రంథంలో పేర్కొన్న పై అల్లావుద్దీన్ సంస్కరణలు భారతదేశంలో ఆధునిక కాలానికి పూర్వం చేపట్టిన పాలనా సంస్కరణలపై అద్భుతమైన వర్ణనలను అందిస్తాయి. కేంద్రీకృత పరిపాలనను ఏర్పాటుచేయడానికి మార్కెట్ శక్తులతో నేరుగా జోక్యం చేసుకోవడానికి ఒక మధ్యయుగ భారతదేశ పాలకుడు చేసిన వ్యవస్థాగత ప్రయత్నం ఇదొక్కటే. ఈ చర్యలన్నింటిని స్థూలంగా విశ్లేషిస్తే అల్లావుద్దీన్ నియంత్రణల కింద వ్యవసాయం కాని వ్యాపారవాణిజ్యాలు కాని అభివృద్ధి చెందడం అసాధ్యమని బోధపడుతుంది. అయితే వ్యవసాయ, వాణిజ్యాభివృద్ధి రెండూ అల్లావుద్దీన్ లక్ష్యాలు కూడా కావు. అతడి దృష్టిలో రాజ్యం ప్రధాన అవసరం అయిన భారీ సైన్యాన్ని కలిగి ఉండడమే. దాని సహాయంతో మంగోలు దండయాత్రలను తిప్పి కొట్టడంతో పాటు దేశంలోని స్వతంత్రపాలకులను లొంగదీసుకోవాలని అతడు భావించాడు. అల్లావుద్దీన్ హయాంలో జరిగినన్ని మంగోలు దాడులు మరే సుల్తాన్ హయాంలో జరగలేదు. అలాగే అతడి పాలనకాలంలో చేపట్టినన్ని దండయాత్రలు మరే ఢిల్లీ సుల్తాన్ హయాంలో చేపట్టలేదు. అది కూడా భారీస్థాయిలో. ఈ నేపథ్యంలో అల్లావుద్దీన్ రాజ్యవిధానాన్ని ఆకళింపు చేసుకోవడం ఆసక్తికరమైన విషయమే. రాజ్య హితంలోనే పాలకుడు అన్ని నిర్ణయాలు తీసుకోవాలన్నదే అతడి విధానం. ఇందులో ఇస్లామిక్ సూత్రాలను పాటించాలన్న వాదనను కూడా అతడు తిరస్కరించాడు. ఒక విద్వాంసునితో మాట్లాడుతూ అల్లావుద్దీన్ ఇలా అన్నాడు : "శాస్త్రాలను లేదా పవిత్ర గ్రంథాన్ని చదవకపోయినా నేను ముసల్మాన్ జాతికి చెందిన ముసల్మాన్‌ను. వేలాది మంది హతులయ్యే ప్రమాదం ఉన్న తిరుగుబాటును నిరోధించడానికి నేను రాజ్య హితంలో ఉండే, ప్రజాప్రయోజనాలను కాపాడే ఆదేశాలనే జారీ చేస్తాను. మనుషులు సలహాలను పట్టించుకోరు. అగౌరవంగా ప్రవర్తిస్తూ నా ఆదేశాలను ధిక్కరిస్తారు. అపుడు వారిని దారిలో పెట్టడానికి నేను కఠినంగా వ్యవహరిస్తాను. అయితే ఇది చట్టబద్ధమో కాదో నాకు తెలియదు. రాజ్యానికి ఏదైతే మంచిదో లేదా అత్యవసర పరిస్థితిలో ఏదైతే తగిన పరిష్కారమో దానిని నేను ఆదేశిస్తాను"

ఈ పరిస్థితుల నేపథ్యంలో ఒకవేళ అతడి సంస్కరణలు, నియంత్రణలు సైన్యం, రాజ్యం ప్రయోజనాలకు ఉద్దేశించినవైతే అందులో ఆశ్చర్యపోవలసిన విషయం ఏమీ లేదు. కనుక ఒక సమర్థుడైన సేనానిగా, ఒక పట్టుదల కలిగిన పాలకునిగా అల్లావుద్దీన్ భారతీయ పాలకులలో అగ్రభాగాన నిలబడతాడు. పరిపాలన విషయంలో అతడు చేతల మనిషి. కొత్త కొత్త విధానాలను అమలు చేశాడు. ఒక కొత్త ఆలోచన తట్టడం సాధ్యమేకాని అల్లావుద్దీన్ అలాంటి ఆలోచనను ఆచరణలో పెట్టి దానిని పూర్తి చేసే సామర్థ్యంగల వ్యక్తి.

# మహమ్మద్ తుగ్లక్
# వినూత్న ప్రయోగాలు
### పరిచయం:

అల్లావుద్దీన్ వారసులుగా అతడి ఇద్దరు కుమారులు, ఖుస్రూఖాన్‌లు పాలించారు (ఖాన్ ఒక నిమ్నజాతి హిందువు. అతడు ఇస్లాం మతాన్ని పుచ్చుకున్నాడు). వీరిలో ఒక్కరు కూడా సహజ మరణం పొందలేదు. క్రీ.శ. 1320లో అధికారాన్ని హస్తగతం చేసుకున్న గియాసుద్దీన్ తుగ్లక్ తన చివరి పేరుతో ఒక వంశాన్ని స్థాపించాడు. అతడి తండ్రి బాల్బన్ కిందపని చేసిన ఒక తుర్కు బానిస అతడి తల్లి ఒక జాట్ మహిళ. మరోసారి స్వాతంత్ర్యం ప్రకటించుకున్న వరంగల్, అలాగే బెంగాల్‌పై గియాసుద్దీన్ సైనిక చర్యలు చేపట్టాల్సి వచ్చింది. ఈ రెండు రాజ్యాలను నియంత్రించడం ఎప్పుడూ కష్టంగానే ఉండేది. బెంగాల్ నుండి తిరిగివచ్చిన తర్వాత అతడు ఒక ప్రమాదంలో మృతి చెందాడు. అతడి మొదటి కుమారుడు పాలనాపగ్గాలను చేపట్టాడు. తన పాలన తొలి సంవత్సరాలలో ముహమ్మద్ తుగ్లక్ సామ్రాజ్య విస్తరణ సాంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ విషయంలో  అల్లావుద్దీన్ కంటే ఎక్కువగా విజయం సాధించాడు. దక్షిణాది పాలకులను లొంగదీసుకోవడంతోనే అల్లావుద్దీన్ సంతృప్తి పడితే, ముహమ్మద్ వారి రాజ్యాలను స్వాధీనం చేసుకోవాలని కూడా భావించాడు. రాకుమారునిగా అతడు వరంగల్‌పై రెండు సార్లు దాడులు నిర్వహించి రెండవ సారి విజయం సాధించాడు. సింహాసనం అధిష్టించాక అతడు కంపిళిని ఆక్రమించాడు (ఈ ప్రాంతంలోనే తర్వాతి కాలంలో విజయనగర రాజ్యం స్థాపించబడింది). ఆ సమయంలోనే అతడు హొయసల రాజ్యంలోని ఉత్తర భాగాన్ని కూడా స్వాధీనం చేసుకున్నాడు.

తన విశాలమైన సామ్రాజ్యాన్ని కేంద్రీకృత రాజధాని నుండి పాలించాలనే ఉద్దేశ్యంతో తుగ్లక్ పాత యాదవ రాజ్య రాజధాని అయిన దేవగిరికి సమీపంలోని దౌలతాబాద్ వద్ద కొత్తరాజధానిని నిర్మించాడు. రాజధాని తరలింపుతో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను వర్ణించిన బరాని కథనాలను మహమ్మద్ తుగ్లక్ కాలంలో పర్యటించిన ప్రముఖ ఆఫ్రికన్ యాత్రికుడు ఇబ్న్‌బట్టుటా సమర్పించిన సమగ్రమైన నివేదిక పూర్తిగా ధృవీకరించింది. కేంద్రీకృతంగా అందుబాటులో ఉండే రాజధానిని ఏర్పాటు చేయడం సబబే అయినా ఆ మొత్తం వ్యవహారం దారుణంగా విఫలమైంది. చివరకు అతడు ఢిల్లీకి చేరుకోవడంతో దానిని బలహీనతగా పరిగణించారు. దక్షిణంలో మరోమారు స్వతంత్ర రాజ్యాలు ఎదగడం ప్రారంభించాయి. క్రీ.శ.1334లోమదురై గవర్నర్ స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. తనను తాను మబార్ సుల్తాన్‌గా నియమించుకున్నాడు. రెండేళ్ల తర్వాత విజయనగర సామ్రాజ్యానికి పునాదులు పడ్డాయి. క్రీ.శ.1338లో బెంగాల్ కూడా స్వతంత్ర రాజ్యంగా ఏర్పడింది. మధ్యభారతంలో 1347లో బహమనీ సుల్తాను రాజ్యం ఉద్భవించింది. భారత చరిత్రలోని పాత ప్రాంతీయ కేంద్రాలు మరోసారి నిర్దిష్టంగా రూపుదిద్దుకున్నాయి. ఔరంగజేబ్ మరణించిన నాలుగు

శతాబ్దాలకు ఈ ప్రాంతీయ కేంద్రాలుగా నిర్ధిష్టమైన రాజ్యాలుగా (రాష్ట్రాలు) తుదిసారి ఏర్పడ్డాయి. అల్లావుద్దీన్ ఆదర్శంగా తీసుకొని తుగ్లక్ కూడా తన విస్తరణ విధానానికి మద్దతుగా ఆర్థిక, పాలన సంస్కరణలను ప్రారంభించాడు. ప్రత్యక్ష పాలనవ్యవస్థను అతడు అన్ని ప్రాంతాలకు విస్తరింప చేశారు. అప్పుడే టోకెన్ కరెన్సీ (ప్రతీకాత్మక ద్రవ్యం) ఆలోచన అతడికి తట్టింది. అంతవరకు భారతీయ నాణేల ప్రాథమిక విలువ స్థిరంగా ఉండేది. అయితే ఇపుడు మహమ్మద్ రాగి నాణేలను మారకద్రవ్యంగా ప్రవేశపెట్టాడు. ఈ నాణేల మూల విలువ తక్కువ కావడంతో నకిలీ నాణేల ముద్రాపకులు భారీ లాభాలను గడించారు. సమకాలీన నివేదికల ప్రకారం "ప్రతి నివాసం ముద్రణాలయంగా మారింది." ఈ అనాలోచిత ప్రయోగాన్ని ప్రవేశపెట్టిన మూడేళ్లలోపే అతడు మారకద్రవ్యాన్ని ఉపసంహరించుకోవలసి వచ్చింది

**అతడి వ్యక్తిత్వ స్వభావం:**

రాజ్య విధానాలు, పాలనా సూత్రాలకు కొత్త దిశానిర్దేశాన్ని ఇవ్వడానికి సాహసోపేతమైన ప్రయోగాలు చేపట్టిన పాలకునిగా నేడు మహమ్మద్ తుగ్లక్‌ను ఎక్కువగా గుర్తిస్తారు. కొన్ని విధాలుగా చూస్తే తన కాలపుప్రముఖ పాలకుల్లో అతడు ఒకడు. మతం, తత్త్వశాస్త్రాలలో అతడు బాగా ఆసక్తి చూపేవాడు. ఆయా గ్రంథాలను కూడా అధ్యయనం చేశాడు. నిశితమైన విమర్శ, ఉదారవాద చింతన కల మహమ్మద్ కేవలం ముస్లిం సన్యాసులతోనే కాకుండా హిందూ యోగులు, జైన సంతులతో కూడా సమాలోచనలు జరిపాడు. దీనిని సనాతనవాద ముస్లిం పెద్దలు జీర్ణించుకోలేకపోయారు. అతడు 'నాస్తికుని'గా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు.

కుటుంబ నేపథ్యంతో నిమిత్తం లేకుండా అర్హత ఆధారంగా ఉన్నత పదవులను భర్తీ చేయడానికి కూడా అతడు వెనుకాడలేదు. అయితే దురదృష్టవశాత్తు తొందరపడి నిర్ణయాలు తీసుకునేవాడు. అతడికి ఓపిక కూడా చాలా తక్కువ. ఈ కారణంగా అతడు చేపట్టిన ఎన్నో ప్రయోగాలు విఫలమయ్యాయి. అదృష్టంలేని ఆదర్శవంతునిగా అతడు మిగిలిపోయాడు. రాజధానిని ఢిల్లీ నుండి దౌలతాబాద్‌కు తరలించడం, గంగా-యమున ప్రాంతంలో పన్నును పెంచడంతో సహా ఎన్నో రెవెన్యూ సంస్కరణలను ప్రవేశపెట్టడం, గంగా-యయున ప్రాంతంలో వ్యవసాయ సంస్కరణలు, కొన్ని మారకద్రవ్య సంస్కరణలు (రాగి నాణేల చెలామణి), పాలకవర్గంలో కొత్త శక్తులను ప్రవేశపెట్టడం అతడు చేపట్టిన వినూత్న ప్రయోగాలలో ముఖ్యమైనవి.

**రాజధాని తరలింపు:**

పాలనా పగ్గాలు చేపట్టిన కొద్ది కాలానికే ముహమ్మద్ తీసుకున్న అత్యంత వివాదాస్పదమైన నిర్ణయం రాజధాని నగరాన్ని ఢిల్లీ నుండి దౌలతాబాద్ లేదా దేవగిరికి

(1327) తరలించడం. మౌలికంగా రెండు కారణాల వల్ల ఈ తరలింపుకు ప్రయత్నించాడు. మొదటిది, సామ్రాజ్యం గణనీయంగా విస్తరించడం. ఉత్తర ప్రాంతంలో దూరంగా ఉన్న ఢిల్లీ నుండి సామ్రాజ్యమంతటినీ నియంత్రించడం కష్టంగా మారింది. రెండవది, దక్కను ప్రాంతాన్ని తాజాగా స్వాధీనం చేసుకోవడం. ఎక్కడో దూరంగా ఉన్న ఢిల్లీ నుండి ఆ ప్రాంతాన్ని నియంత్రించడం సాధ్యం కాదు. ఎందుకంటే సామంత రాజులు కప్పం ఎగవేసేందుకు ఏదో ఒక మార్గాన్ని అన్వేషించేవారు. వారిని వదిలించుకొని ముస్లిం గవర్నర్లను నియమిస్తే వారు కూడా స్వాతంత్ర్యం కోసం కుట్ర పన్నడం మొదలుపెట్టారు. అందుకే దక్కనుపై తదేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సుల్తాన్ గ్రహించాడు.

అయితే కొందరు సమకాలీన, చివరకు ఆధునిక రచయితలు కూడా ఇతర కారణాలను ముందుంచారు. అవేవీ అంత విశ్వసనీయంగా కనిపించవు. ఒక సమకాలీన రచయిత ప్రకారం ఢిల్లీవాసులను ఉమ్మడిగా శిక్షించే ఉద్దేశ్యంతో సుల్తాన్ వారిని దేవగిరికి తరలివెళ్లాలని ఆదేశించాడు. మరో సమకాలీన చరిత్రకారుని ప్రకారం ఢిల్లీవాసులందరికీ సుల్తాను శాస్తి చేయాలనుకున్నాడు. కొందరు వ్యక్తులు సుల్తాన్‌కు పరుష పదజాలంతో లేఖలు రాశారన్న అనుమానం ఉందని పేర్కొన్నాడు. మరో రచయిత కథనం ప్రకారం సుల్తాను మధ్య, ఉన్నత వర్గాలను నాశనం చేయాలనుకున్నాడు. అందుకే భారీ స్థాయిలో నిర్వాస ప్రక్రియను ఆదేశించారు. అయితే ఈ కథనాలన్నింటికీ ఎలాంటి ఆధారం లేదు. ఎందుకంటే ఢిల్లీ ఎప్పుడూ పూర్తిగా ఖాళీ కాలేదు. ముద్రణ లాంటి ముఖ్యమైన కార్యాలయాలన్నీ ఢిల్లీలోనే కొనసాగాయి.

ఒక ఆధునిక చరిత్రకారుడు రాజధాని తరలింపుపై మరో సూచన చేశాడు. పశ్చిమోత్తర భారత దేశం నుండి మంగోలు దండయాత్రలు కొనసాగుతున్న దృష్ట్యా సుల్తాన్ తన రాజధానిని సురక్షితమైన ప్రాంతానికి తరలించాలనుకున్నాడు అని చెప్పారు. అయితే అల్లావుద్దీన్, బాల్బన్‌లు రాజధాని అందుబాటులో ఉండడంవల్లే తమరాజ్య సరిహద్దులను కాపాడడంలో సఫలమయ్యారు. ఒకవేళ రాజధాని సురక్షితమైన ప్రాంతానికి తరలించబడి ఉంటే ఉత్తర భారతమంతా ఆక్రమణదారుడి వశమయ్యేది. అన్నింటికంటే ముఖ్యమైన విషయం, మహమ్మద్ తుగ్లక్ కాలం నాటికి మంగోలుల నుండి బెడద చాలా వరకు తగ్గిపోయింది. మరోవైపు సామ్రాజ్యంపై పూర్తి నియంత్రణ సాధించాలంటే వేర్వేరు ప్రాంతాలలో రాజధానులు ఉండాలని సుల్తాన్ కోరుకొని ఉంటాడు. ఇందుకోసం అతడు ఎందరో ఉన్నతాధికారులు, సేనానులు, సూఫీసంతులను దౌలతాబాద్‌కు మకాం మార్చాలని ఆదేశించాడు. మిగతా జనాభాను తరలించడానికి ఎలాంటి ప్రయత్నం జరగలేదు. సుల్తాన్ దేవగిరిలో ఉన్నప్పుడు ఢిల్లీలో నాణేలు ముద్రణ కావడం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

ప్రజల సౌకర్యార్థం ఢిల్లీనుండి దౌలతాబాద్ వరకు ఉన్న రహదారిని మరమ్మతు చేయడం, దారి పొడవునా విశ్రాంతి గృహాలను నిర్మించడం లాంటి ఎన్నో చర్యలను సుల్తాన్

తీసుకున్నప్పటికీ ప్రజలు అనేక ఇబ్బందులకు గురి కావలసి వచ్చింది. అయితే కొన్నేళ్ల తర్వాత దౌలతాబాద్‌ను విడిచివెళ్లాలని సుల్తాన్ నిర్ణయించాడు. ముఖ్యంగా ఢిల్లీ నుండి దక్షిణ రాజ్యాలను నియంత్రించలేనట్లే, ఉత్తర భారతాన్ని దౌలతాబాద్ నుండి నియంత్రించడం కష్టమని అనతికాలంలోనే గ్రహించడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఈ చర్య సుల్తాన్‌కు సర్వత్రా అపఖ్యాతిని తెచ్చింది. విమర్శకులు అతడిని క్రూరుడు, ముందుచూపు లేని నియంతగా నిందించడంతోనే సంతృప్తి చెందలేదు. తుగ్లక్‌ను పిచ్చివానిగా ఆరోపించడం వరకూ వెళ్లారు. ఈ పథకాన్ని విజయవంతం చేయడానికి సుల్తాన్ నిధులను భారీగా వెచ్చించాల్సి వచ్చింది. అయితే అది దారుణంగా విఫలమై ప్రజలలో వ్యతిరేకతను సృష్టించింది. ఢిల్లీ ప్రతిష్ట కూడా దిగజారిపోయింది. వేలాది మంది ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు. ధనిక కుటుంబాలు దివాళా తీశాయి.

అయితే ఈ భారీ వలస కొన్ని దీర్ఘకాలిక ప్రయోజనాలను కూడా కలిగించిందని మనం ఒప్పుకోవాలి. సమాచార వ్యవస్థ మెరుగుపడడంతో ఉత్తర, దక్షిణ భూభాగాలు మరింత దగ్గరయ్యాయి. మతపెద్దలతో సహా ఎంతో మంది వ్యక్తులు దౌలతాబాద్‌లోనే స్థిరపడిపోయారు. తుర్కులు తమతో పాటు ఉత్తర భారతానికి తీసుకొచ్చిన సాంస్కృతిక, మత, సామాజిక సిద్ధాంతాలను దక్కనులో వ్యాపింపచేయడానికి వీరు సాధనంగా మారారు. ఇది ఉత్తర, దక్షిణ భారతాల మధ్య ప్రత్యేకించి దక్షిణ భారతంలో సాంస్కృతిక సమ్మేళనమనే కొత్త ప్రక్రియకు నాంది పలికింది.

**రెవెన్యూ, వ్యవసాయ సంస్కరణలు:**

భూమిశిస్తు, వ్యవసాయానికి సంబంధించి సుల్తాన్ అనేక సంస్కరణలను ప్రవేశపెట్టాడు. వీటిలో కొన్ని చర్యలు తీవ్ర ప్రతిఘటనకు దారి తీస్తే చాలా వరకు ఉపయోగకరంగానే పరిణమించాయి. ప్రాంతీయ వజీర్లు, ఖజానా అధికారులు వ్యయ- ఆదాయ నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి క్రమం తప్పకుండా పంపాలని అతడు నొక్కి చెప్పాడు. జమాబందీలను సమగ్రంగా విశ్లేషించి బకాయిలు మిగలకుండా చర్యలు తీసుకునేవారు. అయితే కొందరు అధికారులు బకాయిలను అట్టిపెట్టుకుంటే వారిని కఠినంగా శిక్షించేవారు. రైతు నుండి భూమి శిస్తు వసూలు చేసే ప్రక్రియ పాత పద్ధతిలోనే కొనసాగినా ఒక ముఖ్యమైన మార్పు వచ్చింది. 'సెంచూరియన్' అనే కొత్త అధికారిని నియమించి అతడి ద్వారా భూమి శిస్తు బకాయిలన్నీ రాబట్టి భవిష్యత్‌లో బకాయిలు పేరుకుపోకుండా చూసేవారు. ఈ అధికారులు ముకద్దమ్, చౌదరీల పనితనాన్ని పర్యవేక్షించేవారు.

రెవెన్యూ సంస్కరణలలో ముఖ్యమైన చర్య గంగా-యమున ప్రాంతంలో పన్నును పెంచడం. సుల్తాను క్రూరత్వం, రక్తపిపాసం వల్లే ఈ చర్య తీసుకున్నాడని బరాని పేర్కొన్నాడు.

తర్వాతి చరిత్రకారులు కూడా ఇదే కథనంతో ఏకీభవించి ఈ చర్యను తీవ్ర పదజాలంతో ఖండించారు. అయితే అందుబాటులో ఉన్న గణాంకాలను నిశితంగా అధ్యయం చేస్తే గంగా–యమున ప్రాంతంలో సారవంతమైన భూములు ఉండడంవల్లే సుల్తాన్ భూమి శిస్తును పెంచాలని నిర్ణయించాడని తెలుస్తుంది. పన్నును కనిష్టస్థాయిలో ఉంచితే హిందూ భూస్వాములు సంపన్నులుగా, స్వతంత్రులుగా మారే అవకాశముండేది. అందుకే రాజ్య భద్రతకు తక్కువ పన్ను అరిష్టదాయకమని భావించి ఉంటాడు. తన రాజ్య పరిధిలోని భూములనుండి అల్లావుద్దీన్ 50 శాతం దిగుబడిని పన్నుగా డిమాండ్ చేశాడు. పంట దిగుబడిలో 50 శాతం కోరడం కొత్తేమీ కాదని మహమ్మద్ కూడా నమ్మి ఉంటాడు. సాధారణ పరిస్థితులలో ఈ చర్య ప్రజలపై నామమాత్రపు ప్రభావాన్ని చూపి ఉంటుంది. కాని ఆ సమయంలో ఎన్నో పరిస్థితులు ప్రజా పీడనకు దారితీసి ప్రజలలో ఆగ్రహజ్వాలలు రేకెత్తించాయి. తిరుగుబాటు శక్తులకు నిలయంగా గంగా–యమున ప్రాంతం అపవాదును మూట గట్టుకుంది. ఆ శక్తులే అగ్నికి ఆజ్యం పోశాయి.

అలాంటి పరిస్థితులలో సాధారణంగా మినహాయింపులను అనుమతించేవారు. అయితే రాజ్యం తమకు ఏ మాత్రం మినహాయింపు ఇవ్వకపోవడమే కాకుండా సాధారణ శిస్తు కంటే మరింత ఎక్కువగా కోరుతోందన్న భావనకు రైతులు వచ్చారు. ఫలితంగా రాచరిక అధికారులు కఠిన వైఖరిని అవలంబించినపుడు రైతులు వారిపై దాడి చేసి కొందరిని చంపి వేశారు. అనేక మంది రైతులు భూములను ఎండబెట్టే విధానాన్ని అవలంబించి అడవులలో నివసించడం మొదలు పెట్టారు. ఈ పరిణామాలను సుల్తాన్ దృష్టికి తీసుకెళ్ళినపుడు తిరుగుబాటుదారులను అణచివేయడానికి స్వయంగా కదలివెళ్ళాలని నిర్ణయించాడు. ఎందుకంటే గంగా–యమున ప్రాంతంలో వ్యవసాయ పనుల స్తంభనతోపాటు రహదారులపై పట్టపగలు దోపిడీలు రాజధానిలో కరువును సృష్టించడమే కాకుండా సార్వభౌముని ప్రతిష్టనుకూడా దిగజార్చాయి. దోపిడీ ముఠాలు, తిరుగుబాటు దళాల నాయకులను సుల్తాన్ సైన్యాలు హతమార్చాయి. సాధారణ రైతులపై వ్యవసాయాన్ని పునరుద్ధరించేలా ఒత్తిడి పెంచాయి. జరిగిన దానిని బరాని వక్రీకరించి అనవసరంగా అతి చేసి చూపాడు. అయితే తిరుగుబాటుదారులపట్ల బాల్బన్, అల్లావుద్దీన్‌లు వ్యవహరించిన తీరుతో పోల్చితే మహమ్మద్ చేపట్టిన చర్యలు ఉదారంగానూ, చివరకు మానవీయంగానూ కనిపిస్తాయి.

వ్యవసాయ రంగంలో అతడు దీవాన్–ఎ–కోహి అనే కొత్త శాఖను ఏర్పాటు చేశాడు. వ్యవసాయ సంబంధిత వ్యవహారాలను పర్యవేక్షించడం ఈ శాఖ బాధ్యత. గంగా–యమున ద్వినది ప్రాంతంలో వ్యవసాయాన్ని విస్తరించి మెరుగు పరిచేందుకు మరో కొత్త పథకాన్ని ప్రారంభించాడు. పునరుద్ధరణ, పునరావాసానికి ద్వినది ప్రాంతంలోని ఒక నిర్మానుష్య భాగాన్ని ఎంపికచేశాడు. కొత్త శాఖ ఈ ప్రాంత అభివృద్ధిని చేపట్టాల్సి ఉండేది. ఈ ప్రాంతాన్ని అనేక

అభివృద్ధి మండలాలుగా విభజించారు. రైతులు ఉన్నత శ్రేణి పంటలు వేసేలా ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఉదాహరణకు బార్లీ స్థానంలో గోధుమలను సాగు చేయాలని రైతులను ప్రోత్సహించారు. అయితే అధికారులు అవినీతిపరులుకావడం, అనుభవం లేకపోవడంతో ఈ పథకం కూడా విఫలమైంది. ఆ విధంగా ప్రతికూల పరిస్థితులు, అవినీతిపరులు, అవిధేయులైన రైతుల కారణంగా వ్యవసాయరంగ సంస్కరణలు, రెవెన్యూ సంస్కరణలు తీసుకురావడానికి తుగ్లక్ చేపట్టిన అనేక చర్యలు విఫలమయ్యాయి. అయినప్పటికీ ఆకలితో అలమటిస్తున్న లక్షలాది మంది ప్రజల బాధలను దూరం చేయడానికి, కరువు తీవ్రతను సాధ్యమైనంత త్వరగా తగ్గించడానికి ప్రభుత్వ ఖజానా నుండి కోట్లాది టంకాలను ఖర్చు చేసిన ఘనత అతడికే దక్కుతుంది.

**మారక ద్రవ్య సంస్కరణలు :**

సామ్రాజ్య పరిధిలో మారకద్రవ్య సంస్కరణలను కూడా గణనీయంగా తీసుకువచ్చారు. ప్రతి నాణేన్ని మంచి నక్కాషి, చక్కటి రూపంలో తీర్చిదిద్దారు.దుగాని అనే కొత్త నాణేన్ని ప్రవేశపెట్టారు. చిన్న నాణేలను భారీ పరిమాణంలో ముద్రించారు. అలా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూశారు. ఈ కాలంలో సుల్తాన్ తీసుకువచ్చిన మరో సంస్కరణ ప్రతీకాత్మక ద్రవ్యాన్ని (token currency) ప్రవేశపెట్టడం. 14వ శతాబ్దంలో భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వెండి కొరత ఏర్పడింది. 1330లో రాగి నాణేలను ప్రవేశపెట్టాలని సుల్తాన్ నిర్ణయించాడు. వీటి విలువను కూడా వెండి తనకాతో సమానంగా నిర్ధారించాడు. ప్రతీకాత్మక ద్రవ్యం అనే ఆలోచన దేశంలో కొత్తది కావడంతో సాధారణ ప్రజలతోపాటు వ్యాపారులను వాటి విలువ గురించి ఒప్పించడం కష్టంగా మారింది. కొందరు నకిలీ నాణేలను ముద్రించకుండా నివారించగలిగి ఉంటే ముహమ్మద్ ప్రభుత్వం ఈ విషయంలో విజయం సాధించే అవకాశం అప్పటికే ఉండేది. అందులో ప్రభుత్వం సఫలమైంది కూడా. కాని అప్పటికే మార్కెట్‌లో కొత్త నాణేలు విలువ గణనీయంగా పడిపోయింది. రాగి నాణేలస్థానంలో వెండి నాణేలను చెల్లించిన ఘనత కూడా సుల్తాన్‌కే దక్కుతుంది. చివరగా కొత్త నాణేలను ఉపసంహరించాలని అతడు నిర్ణయించాడు. ఈ విధంగా అనేక మంది ప్రజలు తమ కొత్త నాణేలను వెండి నాణేలతో మార్చుకున్నారు. అంతిమంగా సుల్తాన్ ఒక్కడే నష్టపోగా మిగతా ప్రజలంతా రాజ్య ఖజానాతో చాలా వరకు ధనికులయ్యారు.

**పాలకవర్గ పునఃవ్యవస్థీకరణ :**

మహమ్మద్ తీసుకున్న మరో సాహసోపేత నిర్ణయం పాలకవర్గంలో కొత్త శక్తులను ప్రవేశపెట్టడం. చహల్‌గని తుర్కులు (బాల్బన్ చర్యల కారణంగా) పతనం కావడం, ఖిల్జీలు అధికారంలోకి రావడంతో పాలకవర్గంలో వివిధ జాతులకు చెందిన ముస్లింలు ప్రవేశించారు.

ఇందులో భారతీయ ముస్లింలు కూడా ఉన్నారు. ఈ ప్రక్రియను మహమ్మద్ మరో అడుగు ముందుకు తీసుకెళ్లాడు. పాలకవర్గ కుటుంబాలకు చెందని వ్యక్తులను ప్రోత్సహించడమే కాకుండా వారికి ముఖ్యమైన పదవులను కూడా కట్టబెట్టాడు. వీరంతా మతం మార్చుకున్న భారతీయుల సంతానమే. అలాగే కొందరు హిందువులను కూడా పాలకవర్గంలో చేర్చుకున్నాడు. ఎంతో మంది విదేశీయులను కూడా అతడు పాలకవర్గంలోకి ఆహ్వానించాడు. వారిలో చాలా మంది అతడి ఆస్థానానికి వచ్చారు. వీరంతా నిరక్షరాస్యులని, విధుల నిర్వహణలో అసమర్థులని భావించడానికి ఎలాంటి కారణం కనిపించదు. అయితే పాత రాచరిక కుటుంబాలు ఈ పరిణామాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి.

**తుగ్లక్ ప్రయోగాల రాజకీయ ప్రభావం:**

అనుత్పాదక, నిష్ప్రయోజనమైన ప్రయోగాలు ప్రజలలో ఆగ్రహజ్వాలలను రేకెత్తించడం సహజం. అవి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. సుల్తాన్‌ను వారు ద్వేషించడం మొదలుపెట్టారు. ప్రాంతీయ పాలకులు అసంతృప్తి జ్వాలలను రేపడంలో ముందున్నారు. ఈ కారణంగా కేంద్ర పాలనపై బహిరంగ తిరుగుబాట్లు పుట్టుకొచ్చాయి. సామ్రాజ్యం విచ్ఛిన్నం కావడానికి ఈ పరిస్థితులు పునాదులు వేశాయి. సుమారు 23 ప్రాంతీయ రాజ్యాలు గల ఈ విశాలమైన సామ్రాజ్యంలో సుల్తాన్ ఆధిపత్యానికి కేవలం ఉత్తర భారతం, గుజరాత్‌లలో మాత్రమే ఎదురు ఉండేది కాదు. సాధారణంగా సుల్తాన్ ఎప్పుడూ విజయాలనే సాధిస్తూ తిరుగుబాటుదారులను దారుణంగా అణచివేసేవాడు. అయితే ఒకే సమయంలో అతడు అన్ని చోట్ల ప్రత్యక్షం కాలేడు కదా! ఫలితంగా బెంగాల్, దక్కను, మైసూరు, తెలంగాణ ప్రాంతాలను సామ్రాజ్యం శాశ్వతంగా కోల్పోయింది. కొత్త రాజ్యాలైన విజయనగర, బహమనీలు ఆవిర్భవించాయి. అంతరిస్తున్న తన ప్రాబల్యాన్ని బలోపేతం చేసేందుకు సుల్తాన్ ఈజిప్టుకు చెందిన అబ్బాసిద్ ఖలీఫా నుండి ప్రామాణిక పత్రాన్ని పొందాడు. నాణేలపై తన పేరును తొలగించి ఖలీఫా పేరును చొప్పించాడు. అయితే ఇదేదీ సుల్తాన్ అధికారాన్ని బలోపేతం చేయలేదు. నిజానికి సింహాసనంపై అతడి హక్కును ఎవరూ సవాలు చేయలేదు. సుల్తాన్ అవలంబించిన విధానాలే ప్రజలలో అసంతృప్తిని రేపాయి.

సుల్తాన్ విజయాలు, వైఫల్యాలపై అభిప్రాయాలు వేర్వేరుగానే మిగిలిపోతాయి. తనజీవిత పర్యంతమూ అతడు సవాళ్లను ఎదుర్కొన్నా అసంతృప్తితో తన బాధ్యతలను విస్మరించలేదన్న విషయాన్ని ఇక్కడ నొక్కి చెప్పాల్సిన అవసరంలేదు. సామ్రాజ్య విచ్ఛిన్నానికి, తదుపరి పతనానికి అతడు కారకుడయ్యాడన్నది కూడా నిజం కావచ్చు. అయితే పరిస్థితులను ఎవరూ నియంత్రించలేరు. అతడు ప్రతికూల అంశాలన్నెంటినో ఎదుర్కోవలసి వచ్చింది. ముహమ్మద్ భారీ పథకాలు మానవ సామర్థ్యానికి మించి ఉండేవికావు. సుల్తాన్ అలాగే అచేతనుడు, తర్కరహితుడు కూడా కాదు. అతడికి లోపించిందల్లా ముందుచూపే. తన యుగానికి

అతడు చాలా ముందున్నాడని చెప్పవచ్చు. పాక్షికసనాతనవాద విధానాన్ని లౌకిక రాజ్యాంగా మార్చే ప్రయత్నంలో అతడు ఉలేమా, ఇతర ఛాందసవాద శక్తులు, ప్రజలలో వ్యతిరేకతను కొనితెచ్చుకున్నాడు. అలాగే వారిని సంస్కరించడాన్నీ ప్రయత్నించి మరింత వ్యతిరేకతను కొని తెచ్చుకున్నాడు. ఈ ప్రక్రియలో అతడు రాజ్య కుడిభుజాన్ని అచేతనం చేయడమే కాకుండా ఘర్షణలను రేకెత్తించాడు. ఈ ఘర్షణలకు అతడే బలైపోయాడు. అతడి సామ్రాజ్యమూ నశించింది.

# ఫిరోజ్ తుగ్లక్

**పరిచయం:**

**ఢి**ల్లీ సుల్తాన్‌లలో చివరి ప్రముఖుడు ఫిరోజ్ షా. ఇతడు ముహమ్మద్ తుగ్లక్‌కు సోదరుని వరుసవాడు. 1351లో పాలనా పగ్గాలను చేపట్టాడు. సుమారు 37 ఏళ్ల పాటు సుదీర్ఘంగా పాలించాడు. ఉత్తర భారత రాజ్యంగా ఢిల్లీ సుల్తాను సామ్రాజ్యాన్ని ఫిరోజ్ మరోమారు పునరుద్ధరించాడు. కాని మధ్య, దక్షిణ భారత ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడానికి ఎలాంటి ప్రయత్నం చేయలేదు. అయితే బెంగాల్‌పై నియంత్రణ సాధించేందుకు ప్రయత్నించాడు. కాని 1353-54, 1359లలో అతడు చేపట్టిన సైనిక చర్యలలో ఒరిస్సాపై విజయం మినహా మిగతా అన్నీ విఫలమయ్యాయి. క్రి.శ. 1362లో అతడు సింధ్, గుజరాత్‌లపై దండయాత్రలు జరిపాడు. కాని అవి దారుణంగా విఫలమయ్యాయి. దాదాపు ఆరు నెలల వరకు సుల్తాన్ గురించి ఢిల్లీకి ఎలాంటి సమాచారం లభించలేదు. అతడు ఎడారిలో చనిపోయి ఉంటాడని అందరూ భావించారు. ఈ ఆపత్‌కాలంలో ఢిల్లీ తన విధేయుడైన జహాన్ ఖాన్ నియంత్రణలో ఉండడం ఫిరోజ్ షా అదృష్టమనే చెప్పాలి. జహాన్ ఖాన్ ఇస్లాం మతాన్ని పుచ్చుకున్న తెలంగాణ ప్రాంత హిందువు.

మసీదులు, కోటలు, వ్యవసాయ కాలువలను ఫిరోజ్ పెద్ద సంఖ్యలో నిర్మింపచేశాడు. తన రాజధానిలోని బహుళ అంతస్తు కోట అయిన ఫిరోజ్‌షా కోట నేటికీ సజీవంగా ఉంది. దూర ప్రాంతాల నుండి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తీసుకువచ్చిన రెండు అశోక స్తంభాలను అతడు కోట ప్రాంతంలో పాతించాడు. ఈ స్తంభాలపై ఉన్న శాసనాలను అర్థం చేసుకోవడానికి అతడు బ్రాహ్మణులను సంప్రదించాడు. ప్రాచీన లిపిని బ్రాహ్మణులు కూడా చదవలేకపోయారు. తన పూర్వీకుల్లాగే ఫిరోజ్ కూడా కొన్ని సంస్కరణలను తీసుకువచ్చాడు. చిత్రహింసలను అతడు నిషేధించాడు. జిజ్యా నుండి అంతవరకు మినహాయింపు పొందిన బ్రాహ్మణులను ఆ పన్ను పరిధిలోకి చేర్చాడు. ప్రాంతీయ రాజ్యాలు ఇస్లాం మతాన్ని స్వీకరించిన బానిసలను తనకు పంపాలని అతడు ఆదేశించాడు. ఢిల్లీ చుట్టుపక్కల ఇస్లాంమతాన్ని పుచ్చుకున్నవారికి కానుకలు ఇవ్వాలని సూచించాడు. రాజధాని పరిసరాలలో ఉన్న విధేయ ముస్లింల మద్దతును కూడగట్టేందుకు ఈ విధానాన్ని ఉద్దేశ్యపూర్వకంగా అమలు చేసినట్లు కనబడుతుంది.

## ఫిరోజ్ పాలన స్వభావం:

ఫిరోజ్‌షా తుగ్లక్ ఒక గొప్ప సేనాని కాని, ఒక పోరాట వీరుడు కాని కాదు. మధ్యయుగ భారతదేశంలో విజయవంతమైన పాలకునికి ఉండాల్సిన ఈ లక్షణాలు అతడికి కొరవడ్డాయి. రాజ్యకాంక్ష, ధీరత్వం, కరుకుదనం అతడిలో లోపించాయి. మరోవైపు అతడు స్వాభావికంగా మతవిలువలను పాటించే వ్యక్తి. ఇతరులకు కీడు తలపెట్టే చర్యలు తీసుకునే వాడు కాదు. ఆ విధంగా సామ్రాజ్యాన్ని బలోపేతం చేయడంలో అతడు అసమర్థునిగా మిగిలిపోయాడు. తన పాలితుల సంక్షేమానికి అతడు చేసిన కృషిని విశ్లేషిస్తే మనం అతడిని మెచ్చుకోక ఉండలేము. న్యాయవర్తనం, సహృదయం గల పాలకునిగా తన రాజ్య ప్రజానీక బాధలను దూరం చేయడంలో అతడు తీసుకోని చర్య అంటూ ఏదీ లేదు. అతడి హయాంలో శాంతి, సిరిసంపదలు వెల్లివిరిసాయి.

మహమ్మద్ తుగ్లక్ పాలన నిరంతర సైనిక కార్యకలాపాలతో కొనసాగింది. కాని ఫిరోజ్ యుద్ధం అనే ఆలోచన నుండే తప్పుకునేవాడు. మహమ్మద్ దుందుడుకు చర్యలతో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించడానికి ప్రయత్నించాడు. తమకు పరిహారం అందిందని, తాము సంతృప్తిపడ్డామనే అంగీకార లేఖలను అతడు బాధితులనుండి తీసుకున్నాడు. ఈ లేఖలను (పత్రాలను) అతడు దివంగత సుల్తాన్ సమాధి వద్ద ఉంచాడు. మానవ కోణం నుండి చూస్తే ఇది నిజంగా ఉదాత్తమైన చర్యే అయినా రాజత్వ విజ్ఞత లేదా రాజనీతిజ్ఞతను ప్రతిబింబించదు.

## రెవెన్యూ సంస్కరణలు:

ఖురాన్ ఆమోదం లేని వాణిజ్య పన్నులు, ఇతర అన్యాయమైన పన్నులన్నింటినీ ఫిరోజ్ రద్దు చేశాడు. ఖురాన్ నిబంధనల ప్రకారం అతడు కేవలం నాలుగు రకాల పన్నులను మాత్రమే విధించాడు. అవి ఖరజ్, ఖమ్స్, జకాత్, జిజ్యా. ఖరజ్ భూమి శిస్తు. వ్యవసాయ భూమి దిగుబడిలో మూడో వంతును పన్నుగా వసూలు చేసేవారు. ఖమ్స్ అంటే యుద్ధ కానుకలలో ఐదోవంతు. ధనికముస్లిం ఆస్తిలో రెండున్నర శాతాన్ని జకాత్‌గా స్వీకరించి నిర్ధారిత మత కార్యక్రమాలపై వెచ్చించేవారు. ముస్లిమేతరులపైనే జిజ్యాను విధించేవారు. తర్వాతి కాలంలో ఫిరోజ్ నీటిపారుదల పన్నును (షిర్బ్) కూడా విధించాడు. దిగుబడిలో పది శాతం వాటాగా ఈ పన్నును నిర్ధారించాడు. తమ భూములను సాగు చేయడానికి రాజ్య కాలువల నుండి నీటిని వాడుకునే వారి నుండే ఈ పన్నును వసూలు చేసేవారు. ఈ విధంగా వ్యాపారులు పన్నుల భారం నుండి తప్పించుకున్నారు. వ్యవసాయదారులు కూడా చాలా వరకు మినహాయింపు పొందారు. రాజ్య బకాయిలు మినహా మిగతా ఏదీ ఆశించవద్దని సుల్తాన్ ప్రభుత్వ అధికారులకు సూచించాడు. అధికారులు అదనంగా వసూలు చేయడానికి ప్రయత్నిస్తే వారిని కఠినంగా శిక్షించేవాడు. ఈ ఉదాత్తమైన చర్యల ప్రభావం అనతికాలంలోనే స్పష్టంగా గోచరించింది. ప్రతి ప్రాంతంలోనూ సిరిసంపదలు వెల్లివిరిసాయి.

**ప్రజాపనులు, సంక్షేమం:**

ప్రజా పనులకు ఫిరోజ్ ప్రసిద్ధిగాంచాడు. ఈ ప్రజాపనులు చేపట్టేందుకు అతడు 'దివాన్ ఎ ఖైరత్' అనే శాఖను ఏర్పాటు చేశాడు. కొత్త నగరాలెన్నింటినో నిర్మించాడు. వాటిలో ముఖ్యమైనవి ఫతేబాద్, హిస్సార్, ఫిరోజ్‌పూర్ (బదౌన్ సమీపంలో), జాన్‌పూర్, ఫిరోజాబాద్. సుల్తాన్ ఐదు వ్యవసాయ కాలువలను కూడా తవ్వించాడు. యమున నది నుండి 150 మైళ్ల దూరంలో ఉన్న హిస్సార్‌కు తవ్వించిన కాలువ అన్నింటికన్నా పెద్దది. సట్లెజ్‌నదిని ఘాగ్రాతో కలిపే కాలువ 96 మైళ్ల పొడవు కలది. మరో రెండు కాలువలు ఘాగ్రా, యమున నదుల నుండి ఫిరోజాబాద్‌కు తవ్వించబడ్డాయి. హాంసి ప్రాంతానికి సాగునీటిని మరో కాలువ అందించేది. సాగునీటి అవసరాల కోసం, యాత్రికుల ప్రయోజనం కోసం సుల్తాన్ 150 బావులను కూడా తవ్వించాడని సర్ ఓల్స్లే హైగ్ పేర్కొన్నారు. సుమారు 59 జలాశయాలు, 40 మసీదులు, 30 కళాశాలలు, 20 రాజభవనాలు, 100 యాత్రినివాసాలు, 30 చెరువులు 100 వైద్యశాలలు, 100 సార్వజనిక స్నానఘట్టాలు తదితర ప్రజాపనులను కూడా సుల్తాన్ పూర్తి చేశాడని ఫెరిష్టా ప్రశంసించాడు. ఢిల్లీ సమీపంలో అతడు 1,200 ఉద్యానవనాలను పెంచాడు. అల్లావుద్దీన్ హయాంలో ఏర్పాటు చేసిన 30 పాత ఉద్యానవనాలను పునరుద్ధరించాడు.దయాహృదయం గల పాలకునిగా అతడు నేర చట్టాలు తీవ్రతను తగ్గించాడు. చిత్రవధలను, శిక్షగా అంగచ్ఛేదనను నిషేధించాడు. ఉపాధి కల్పన శాఖను తెరచి నిరుద్యోగులకు వారి అర్హతలను బట్టి ఉద్యోగాలను కల్పించాడు. పేద ముస్లింలకు వారి కమార్తెల వివాహం జరిపేంచేందుకు ఆర్థిక సాయాన్ని అందించే ఒక ప్రత్యేక విరాళాల కేంద్రాన్ని కూడా ప్రారంభించాడు. పేదలకు వైద్య సేవలందించేందుకు ఉచిత వైద్యశాలలను ప్రారంభించాడు. అందులో వైద్యం, మందులతో పాటు రోగులు, వారి సహాయకులకు భోజనాన్ని ఉచితంగా అందించేవారు. విద్యను కూడా పోషించాడు. విద్వాంసులకు ఉదారంగా ఆర్థిక సహాయం అందించాడు. ఎన్నో మదరసలను స్థాపించి పేదలకు విద్యను ఉచితంగా అందించారు. అతడి హయాంలోనే బరాని, అఫీఫ్‌లు తమ ప్రసిద్ధగ్రంథాలను రచించారు. సుల్తాన్ తానే స్వయంగా ఫు1తుహత్-ఎ-ఫిరోజ్‌షాహీ అనేగ్రంథాన్ని రచించాడు.

**సైనిక సంస్కరణలు:**

భూస్వామ్య వ్యవస్థ ఆధారంగా ఫిరోజ్ తన సైన్యాన్ని పునః సమీకరించాడు. రాచరిక భద్రతా సిబ్బందికి కూడా ఇక్తాల వ్యవస్థను పునరుద్ధరించాడు. అతడి సైన్యంలోని క్రమబద్ధ సైనికులు భూముల రూపంలో వేతనాలు పొందేవారు. తాత్కాలిక సైనికులకు నేరుగా ఖజానా నుండి వేతనాలు చెల్లించేవారు. ఈ రెండు పద్ధతులలో వేతనాలు పొందని వారికి తాత్కాలిక పద్ధతిపై భూములను సమకూర్చేవారు. రాజధానిలోని దళారులు ఇలాంటి భూములను వాటి విలువలో మూడోవంతుకు కొనుగోలు చేసి జిల్లాలలో సగం ధరకు విక్రయించేవారు. ఆ విధంగా ఎలాంటి కష్టం లేదా ప్రయత్నం చేయకుండానే ఈ దళారులు ధనాన్ని అర్జించేవారు.

సైనికుడు వయస్సు మీరితే లేదా సేవకు పనికి రాకుండాపోతే అతడి కుమారుడు సైన్యంలో భర్తీ అయ్యేలా నిబంధనలను మార్చాడు. ఒకవేళ వృద్ధ సైనికునికి కుమారుడు లేకపోతే అల్లుడు అతడి స్థానాన్ని భర్తీ చేయవచ్చు. అల్లుడు కూడా లేకపోతే అతడి బానిసను ప్రతినిధిగా పంపవచ్చు. సైన్యాన్ని అనువంశిక సంస్థగా తయారు చేయడం దాని సామర్థ్యాన్ని తగ్గించడమే అవుతుంది. రాజ్యసైన్యం అత్యంత విశాలమైన సంస్థగా ఉండేది. అందులో 90,000 మంది ఆశ్వికులు, సంస్థానాధీశులు అందించే కిరాయి సైనికులు ఉండేవారు. అయితే అది బలహీనంగా ఉండేది. సైనిక విజయాలను సాధించే సామర్థ్యం దానికి లోపించింది. సుల్తాన్ బానిస వ్యవస్థను కూడా ప్రోత్సహించాడు. తనకు బానిసలను కానుకగా పంపాలని అతడు తన అధికారులను కోరాడు. బానిసల సంఖ్య 1,80,000కు చేరుకుంది. వీరిలో 40,000 మంది సుల్తాన్ నియంత్రణలో విధులు నిర్వహించారు.

**ఫిరోజ్ పాలనపై అంచనా:**

ఢిల్లీ సుల్తాన్ రాజ్య ముఖ్యమైన పాలకుల్లో ఫిరోజ్ చివరివాడు. ఎందుకంటే అతడి మరణం తర్వాత కేంద్ర అధికారం నామమాత్రంగా కూడా ఉండేది కాదు. దేశం వివిధ రాజ్యాలు, ప్రాంతాలుగా విడిపోయింది. పదేళ్ల తర్వాత అంటే 1398లో తైమూర్ భారతదేశాన్ని ఆక్రమించాడు. అప్పటికే అంతరిస్తున్న తుర్కు ఆఫ్ఘన్ ప్రాబల్యాన్ని చావుదెబ్బతీశాడు. ఇలాంటి దుస్థితి దాపురించడానికి ఫిరోజ్‌షా కారణమని అనేకమంది ఆధునిక చరిత్రకారులు నిందించారు. ఎలాంటి కార్యకలాపాలు లేక అతడి సైన్యం నిస్తేజమైంది. ఎలాంటి సైనిక విజయాలను నమోదు చేయక అది పాలకుని ప్రతిష్టను దెబ్బతీసింది. కేవలం పాలకుని అధికారం, ధీరత్వం ఆధారంగా రాజ్యాలు ఏర్పడి, బలపడే ఆ రోజులలో ఫిరోజ్ అచేతనంగా (సైనికపరంగా) ఉండి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశాడు. ఇది అతడి సామ్రాజ్యాన్ని బలహీనం చేసింది. అయితే బలమైన వారసులు అతడి తర్వాత పాలన చేపట్టి ఉన్నట్లయితే సామ్రాజ్య విచ్ఛిన్న పతనాలను నివారించి ఉండేవారు. అతడి వారసులు బలహీనులు, అసమర్థులైనపుడు ఫిరోజ్‌ను ఎలా నిందించగలము? అయితే పాలకుని సుకార్యాలు ఎల్లప్పుడూ సజీవంగా ఉండి అతడికి మరణానంతరం కూడా ఖ్యాతిని ఆర్జించి పెడతాయి. ఏ ప్రాతిపదికన తీసుకున్నా ఫిరోజ్ మంచి పాలకునిగా మిగిలిపోతాడు. తన రాజ్య ప్రజల సంక్షేమానికి అతడు అవిరళ కృషి చేశాడు.

## ఢిల్లీ సుల్తాన్ రాజ్య పతనం

**పరిచయం:**

**క్రీ.**శ. 1388లో ఫిరోజ్ మరణించిన తర్వాత ఢిల్లీ సుల్తాన్ రాజ్యం అనతి కాలంలోనే విచ్ఛిన్నమైంది. రాజధానిలోని రెండు వేర్వేరు స్థావరాల నుండి అతడి ఇద్దరు బంధువులు వారసత్వ పోరును కొనసాగించారు. ఈలోగా దాదాపు ప్రాంతీయ గవర్నర్లందరూ స్వతంత్ర

పాలకులుగా అనధికార హోదాను పొందారు. చివరకు 1398లో భారత్‌పై కడలి తరంగంలా వచ్చిపడిన తైమూర్ సైన్యాలు సుల్తాన్ రాజ్యాన్ని రూపుమాపాయి. తైమూర్ ఢిల్లీ నగరాన్ని దోచుకొని విధ్వంసం సృష్టించాడు. మూడు రోజులపాటు తైమూర్ సైనికులు దేశ రాజధానిలో మారణహోమం సృష్టించి ప్రజలను దోచుకున్నారు. హిందూ జనాభా అంతటిని కడతేర్చారు. ముస్లింలను ప్రాణాలతో వదలిపెట్టినా వారి ఆస్తులను మాత్రం దోచుకున్నారు. ఈ తుర్కు పోరాట వీరుల ఆకృత్యాలు తైమూర్‌ను సైతం దిగ్భ్రాంతికి గురి చేశాయి. ఈ ఘోర కృత్యాలకు తాను ఏ మాత్రం బాధ్యుడిని కానని, అందుకు తన సైనికులను నిందించాలని తైమూర్ తన జీవిత చరిత్రలో రాశాడు. తైమూర్ వెనుదిరిగి వెళ్లిన తర్వాత ఢిల్లీ కొంతకాలంపాటు నిర్మానుష్యంగా ఉండిపోయింది. తైమూర్ దండయాత్ర జరిగిన 15 సంవత్సరాలకు ఢిల్లీ సుల్తాను రాజ్యం పూర్తిగా అంతరించింది. గుజరాత్, మాల్వా, జౌన్‌పూర్, స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడ్డాయి. పశ్చిమంలో ముల్తాన్, సింధ్ నగరాలు తైమూర్ వారసులు, వంశస్థుల నియంత్రణలో ఉండిపోయాయి. క్రీ.శ.1414 నుండి సయ్యిద్‌ల నేతృత్వంలో మరో మారు ఢిల్లీ సుల్తాను రాజ్యం కొనసాగినా దాని ప్రాబల్యం ద్వినది ప్రాంతానికే పరిమితమైంది. క్రీ.శ.1451లో ఆఫ్ఘన్ లోధిల తెగకు చెందిన బహ్‌లూల్ లోధి ఢిల్లీలో కొత్త వంశాన్ని స్థాపించాడు. ఆ వంశం మరో మారు ఉత్తర భారత భూభాగమంతటిపై నియంత్రణ సాధించింది.

### ఢిల్లీ సుల్తాన్ రాజ్య పతన స్వభావం, క్రమం :

ఫిరోజ్‌షా మరణం తర్వాత అతడి వారసుల మధ్య అంతర్యుద్ధం సంభవించింది. అనేక ప్రాంతాల గవర్నర్లు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. చివరకు ఢిల్లీ చుట్టూ ఉన్న చిన్న ప్రాంతమే తుగ్లక్ పాలకుల చేతిలో మిగిలింది. తర్వాత 1398లో ఉత్తర భారతం మధ్య ఆసియా సైన్యాల ప్రతాపాన్ని మరోసారి రుచి చూసింది. ఈసారి ఆ సైన్యాలకు తుర్కు నాయకుడు తైమూర్ సారథ్యం వహించాడు. మహ్మద్ ఘజ్నిలాగా అతడి ఉద్దేశం ఉత్తర భారతంపై దాడి చేసి యుద్ధ కానుకలతో తిరిగి వెళ్లడమే. తైమూర్ సైన్యాలు ఢిల్లీపై దండెత్తాయి. నగరాన్ని దోచుకోవడమే కాకుండా అక్కడి ప్రజలను ఊచకోత కోశాయి. తమ పని పూర్తయిన తర్వాత స్వస్థలమైన సమర్‌ఖండ్‌కు తిరిగి వెళ్లాయి.

తుగ్లక్ వంశం 1413లో పతనమైంది. స్థానిక గవర్నర్ ఒకరు ఢిల్లీని స్వాధీనం చేసుకున్నాడు. తననుతాను సుల్తాన్‌గా ప్రకటించుకొని సయ్యద్ వంశాన్ని (1414-51) స్థాపించాడు. ఈ వంశం స్వల్పకాలం మాత్రమే పాలించగలిగింది. మరో వంశమైన లోధికి రాజ్యాన్ని జారవిడుచుకుంది. లోధి వంశం కూడా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం ద్వారానే వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ సుల్తాన్ రాజ్యాన్ని పునరుద్ధరించి దానిని బలోపేతం చేసేందుకు లోధిలు సాధ్యమైనంత కృషి చేశారు. తిరుగుబాటు గవర్నర్లను నియంత్రించడానికి ప్రయత్నించారు. జౌన్‌పూర్ రాజ్యంతో సుదీర్ఘ పోరు తర్వాత దానిని లొంగదీసుకున్నారు. లోధిల్లో అత్యంత శక్తిమంతుడైన పాలకుడు సికందర్‌లోధి. అతడు గంగాలోయను పశ్చిమ బెంగాల్ వరకు నియంత్రించాడు. లోధిలలో చివరి వాడైన ఇబ్రహీంను ఆఫ్ఘన్ సంస్థానాధీశులు వ్యతిరేకించారు. చివరకు వారు బాబర్‌తో కుట్ర పన్ని 1526లో అతడిని గద్దె దించడంలో

సఫలమయ్యారు. ఢిల్లీ సుల్తాను రాజ్య ప్రభావం క్షీణించడంతో ఉపఖండంలోని వివిధ ప్రాంతాలలో కొత్త రాజ్యాలు ఏర్పడ్డాయి. ఇవన్నీ సుల్తాను రాజ్యంలో ప్రాంతీయ కేంద్రాలుగా ప్రారంభమై క్రమంగా స్వాతంత్ర్యాన్ని దక్కించుకున్నాయి. పశ్చిమ భారతంలో గుజరాత్, మాల్వా రాజ్యాలు ఉండేవి. అహ్మదాబాద్ నగరాన్ని కనుగొన్న అహ్మద్‌షా గుజరాత్‌రాజ్య ప్రాబల్యాన్ని పెంచడంలో కూడా ప్రధాన పాత్రను పోషించాడు. హోషంగ్ షా పాలనలో మాల్వా స్వాతంత్ర్యం పొందింది. అతడు కోట బురుజు నగరమైన మాండును నిర్మింపచేశాడు. గుజరాత్, మాల్వా రాజ్యాలు నిత్యం ఘర్షణ పడుతూ బలహీనమయ్యాయి. రాజపుత్ర రాజ్యాలైన మేవార్, మార్వార్ విషయంలో కూడా ఈ పరిణామమే సంభవించింది. సుల్తాన్ రాజ్యంతోనే కాకుండా రాజపుత్ రాజ్యాలు తమతోతాము కలహించుకునేవి అనడానికి ఇదో ఉదాహరణ మాత్రమే. బికానేర్ లాంటి అనేక రాజ్యాలు రాజస్థాన్‌లో ఇదే కాలంలో ఏర్పడ్డాయి.

తూర్పు ప్రాంతంలో జౌన్‌పూర్, బెంగాల్ ప్రముఖ్య రాజ్యాలుగా ఎదిగాయి. షర్కీలు జౌన్‌పూర్ రాజ్యాన్ని ఏర్పాటు చేసి సుదీర్ఘ కాలం పరిపాలించారు. ఢిల్లీని స్వాధీనం చేసుకోవాలని వారు కాంక్షించారు. అయితే వారి ప్రయత్నాలు సఫలం కాలేదు. తర్వాత కాలంలో జౌన్‌పూర్ హిందీ సాహిత్యం, అధ్యయనానికి ముఖ్యమైన కేంద్రంగా ఎదిగింది. వివిధ వంశాలకు చెందిన రాజులు బెంగాల్‌ను పాలించారు. వారిలో ప్రధానంగా తుర్కులు, ఆఫ్ఘన్లు ఉండేవారు. కాని తర్వాత ఒక అబిసనీయుడు సింహాసనాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఈ రాజులందరూ స్థానిక సంస్కృతిని పెంచి పోషించడమే కాకుండా బెంగాలీ భాషను కూడా ప్రోత్సహించారు.

దక్కను, దక్షిణ భారతదేశంలో బహమని, విజయనగర రాజ్యాలు ఆవిర్భవించాయి. దక్కనుపై ఢిల్లీ పాలకుల నియంత్రణ సన్నగిల్లడంతో పై రాజ్యాలు ఒకేసారి వెలిశాయి. ముఖ్యంగా మహమ్మద్ తుగ్లక్ పాలన అంతిమ దిశలో ఇవి ఏర్పాటయ్యాయి. సుల్తాన్‌పై తిరుగుబాటు చేసిన ఇద్దరు సుల్తాన్ రాజ్య అధికారులు ఈ రెండు రాజ్యాలను ఏర్పాటు చేయడం యాదృచ్ఛికమే. ఈ రెండు శక్తివంతమైన రాజ్యాలు ఉత్తర ప్రాంతంలోని రాజ్యాలవలే నిరంతరం కలహించుకొని చివరకు అంతరించాయి.

ఈ కాలంలో కాశ్మీర్ రాజ్యంకూడా వెలుగులోకి వచ్చింది. కాశ్మీర్ సుల్తాన్‌లలో ప్రముఖుడు జైన్–ఉల్–ఆబిదిన్. ఇతడు 'బుద్‌షా'గా ప్రసిద్ధుడు. 15వ శతాబ్దంలో ఇతడు పాలించాడు. పార్సీ, సంస్కృత భాషల్లో పాండిత్యాన్ని ప్రోత్సహించాడు. ఈ విధంగా ఢిల్లీ సుల్తానుల అధికారం బలహీనం అయ్యేకొద్దీ సుల్తాన్ సామ్రాజ్య పరిధిలోని ప్రాంతాలలో అనేక రాజ్యాలు ఆవిర్భవించాయి.

### సుల్తాన్ రాజ్య పతనానికి కారణాలు :

మధ్య యుగాలలో ఆయా సామ్రాజ్యాల పతనం దాదాపు ఒకే తరహా కారణాలు పోగుపడటం వల్ల సంభవించింది. బలహీనమైన వారసులు, ప్రాంతీయ గవర్నర్ల తిరుగుబాట్లు, సైన్యం సామర్థ్యం క్షీణించడం, విదేశీ ఆక్రమణలు, పాలక చక్రవర్తి అసమర్థత. చివరి కారణం ప్రముఖంగా ప్రస్తావించబడింది. ఎందుకంటే మధ్యయుగాలలో సామ్రాజ్యాల ఐక్యత ప్రధానంగా

పాలకుని వ్యక్తిత్వంపైనే ఆధారపడి ఉండేది. సామ్రాజ్య ప్రత్యక్ష పాలన కొన్ని జిల్లాలకు మించి ఉండేది కాదు. మధ్యయుగాలలో చట్టం కంటే వ్యక్తిత్వాన్నే ఎక్కువగా గౌరవించేవారన్న వ్యాఖ్యానాలు కూడా ఉన్నాయి. కనక సుల్తాన్ సామ్రాజ్య పతనంలో ఫిరోజ్‌షా బాధ్యత కూడా గణనీయంగా ఉంది. పతన ప్రక్రియను వేగిరపరచింది ఫిరోజ్ షాయే. మహమ్మద్ తుగ్లక్ పాలన చివరి భాగంలోనే రాజ్యపతనానికి బీజం పడింది.

రాజ్య పతనానికి మరో ముఖ్య కారణం పాలకవర్గం అమాంతంగా విస్తరించడమే. తుర్కు పాలనాధికారులు శాంతి కాముక విలాసపురుషులుగా దిగజారారు. కుతుబుద్దీన్, ఇల్తుమిష్, బాల్బన్, అల్లావుద్దీన్ తదితర వ్యక్తులను 14వ శతాబ్దం అందించలేదన్నది ఇక్కడ ప్రధానాంశం. అలాంటి శక్తిమంతులైన నాయకులు లేకపోవడం, దిగజారిన సంస్థానాధీశుల రాజ్యకాంక్ష కారణంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో తిరుగుబాటు సంభవించి సుల్తాన్ సామ్రాజ్యం అంతర్గతంగా బలహీనమైంది. ఫిరోజ్ ఉదారవైఖరి కూడా పాలక వర్గం గణనీయంగా విస్తరించడానికి దోహదపడింది. ఈ విషయంలో అతడు అల్లావుద్దీన్‌కు పూర్తి భిన్నంగా వ్యవహరించాడు.

ఒక్క పరిపాలనా కేంద్రం నుండే పాలించడానికి సాధ్యపడని విధంగా సామ్రాజ్యం విస్తరించింది. దక్కను తిరుగుబాటును మహమ్మద్ తుగ్లక్ కొరకరానికొయ్యగా అభివర్ణించాడని చెబుతారు. ఈ తిరుగుబాటే అంతిమంగా సుల్తాన్ రాజ్య పతనానికి కారణమైంది. ఆ విషయానికి వస్తే అల్లావుద్దీన్ కాలం నుండి కూడా తిరుగుబాట్లు సంభవించి రాజ్య ఖజానాను ఖాళీ చేశాయి. దురదృష్టవశాత్తు ఫిరోజ్‌షా అంతర్గతంగా బలహీనమవుతున్న సామ్రాజ్యాన్ని సమైక్యంగా నిలబెట్టగల పాలనా దురంధరుడు కూడా కాదు.

నాల్గవ కారణం 1398లో తైమూర్ జరిపిన దాడి. మరణశయ్యపై ఉన్న రాజ్యాన్ని అతడు చావు దెబ్బ తీశాడు. అప్పటికే సుల్తాన్ సైన్యం ప్రమాదకరమైన రీతిలో బలహీనమైంది. అందుకు ఫిరోజ్ అనుసరించిన విధానాలే కారణం. తన అనుచిత ఉదారత్వం కారణంగా అతడు సైనిక సంస్థను అవినీతి కూపంగా,విలాసాల కేంద్రంగా మార్చివేశాడు. ఒక దశలో అతడు సైన్యంలో వారసత్వ నియామకాలను అమలు చేస్తూ ఉత్తర్వులను జారీచేశాడు. పైగా ఆశ్విక దళ పర్యవేక్షణ అవినీతి కారణంగా నిర్వీర్యమైందన్న విమర్శలు కూడా ఉన్నాయి.

సుల్తాన్ రాజ్యం విచ్ఛిన్నానికి దారి తీసిన ఐదవ కారణం రాజపుత్ర పాలకులు అవలంబించిన తిరుగుబాటు వైఖరే. సుల్తాన్ రాజ్యం కొనసాగినంత కాలం రాజపుత్రలను పూర్తిగా అణచివేయ లేకపోయారు. విచిత్రమేమిటంటే రణథంబోర్ లాంటి కంచుకోటలను నియంత్రణలోకి తెచ్చుకోవడానికి సుల్తాన్‌లకు వందేళ్లు పట్టాయి. స్థానిక అధికారులు బలహీనంగా, అసమర్థంగా వ్యవహరించిన ప్రతిచోట రాజపుత్రలు తిరుగుబాటు చేశారు. వారిని అణచివేయడంలో సుల్తాన్‌ల వైఫల్యానికి ప్రధానంగా జనాభా విభజనను కారణంగా

చూపవచ్చు. ముస్లింలు పెద్దసంఖ్యలో ఉండేవారు కాదు. అవసరాలరీత్యా స్థానిక పాలనా బాధ్యతలను స్థానికులకే అప్పగించాల్సి వచ్చింది. స్థానిక పరిపాలనను హిందూ సముదాయం సాంప్రదాయ పద్ధతులలో నిర్వహించింది. రాజ్య నియంత్రణ నిర్దిష్టంగా కొన్ని కోటలు, సైనికస్థావరాలకే పరిమితమైంది.

ఆరవ కారణం బానిసవ్యవస్థ. ఇక్తాదారులు, ముక్తీలు పన్నులను పూర్తిగా చెల్లించే బదులు ఫిరోజ్ షాకు బానిసలను సరఫరా చేశారు. ఫలితంగా రాజ్య ఆదాయం తగ్గిపోయి నిర్వహణ వ్యయం పెరిగిపోయింది. సుమారు 1,80,000 మంది బానిసలను రాజ్యం పోషించాల్సి వచ్చింది. ఫిరోజ్ షా ఉదాసీనత వల్ల సంభవించిన ఆర్థిక సంక్షోభం సుల్తాన్ రాజ్య పతనంలో భౌతికపరమైన కారణంగా నిలుస్తుంది. చివరగా మంగోలు సైన్యాల నిరంతర దాడులు రాజ్య విచ్ఛిన్నానికి పాక్షికంగా తోడ్పడ్డాయి. పౌర వ్యవహారాల నుండి సైనికపరమైన వ్యవహారాలపై దృష్టి మరల్చిన ఈ దాడులు రాజ్య ఖజానాపై తీవ్రమైన భారం మోపాయి. ఆ విధంగా సుల్తాన్ రాజ్యంలో సామాజిక రాజకీయ ఆర్థిక రంగాలలో అంతర్గత క్షీణ ప్రక్రియను మంగోలు దాడులు బయటి నుండి మరింత వేగిరపరచడంతో సుల్తాన్ రాజ్యం పతనమైంది.

4

# ప్రాంతీయ వంశాలు

## విజయనగర సామ్రాజ్యం

### పుట్టుపూర్వోత్తరాలు- సంగమ పాలకులు :

సంగమ వంశానికి చెందిన హరిహర, బుక్కలు విజయనగర సామ్రాజ్యాన్ని 1336లో స్థాపించారు. వీరు తొలుత కాకతీయ పాలకుడు రెండవ ప్రతాపరుద్రుని సేవలో ఉండేవారు. అయితే 1323లో కాకతీయ రాజ్యాన్ని ముస్లింలు ఆక్రమించడంతో వారు ఆధునిక కర్ణాటలోని కంపిళి రాజ్యానికి వలస వెళ్లి అక్కడ మంత్రులయ్యారు. ఒక ముస్లిం తిరుగుబాటుదారునికి ఆశ్రయం కల్పించారన్న విషయమై కంపిళి రాజ్యాన్ని మహమ్మద్ తుగ్లక్ స్వాధీనం చేసుకోవడంతో ఈ ఇద్దరు సోదరులను బంధించి ఇస్లాం మతానికి మార్చారు. కంపిళి రాజ్యంలో తిరుగుబాట్లను అణచివేసే బాధ్యతను వారికి అప్పగించారు. తొలుత సుల్తాన్ కోసం కంపిళిపై ఆధిపత్యం సాధించిన తర్వాత ఈ ఇద్దరు సంగమ సోదరులు హిందూ మతాన్ని తిరిగి పుచ్చుకున్నారు. ఇందులో వీరికి విద్యారణ్య అనే రుషి సహాయపడ్డాడు. అనతికాలంలోనే వీరు స్వాతంత్ర్యం ప్రకటించుకొని తుంగభద్ర దక్షిణ తీరం వెంబడి ఒక కొత్త నగరాన్ని నిర్మించారు. దానినే విజయనగర లేదా విద్యానగర అని పిలుస్తారు.

### ఆరంభ సమస్యలు- విస్తరణ:

ద్వారసముద్ర హోయసల పాలకుడు, మదురై సుల్తాన్ ఇద్దరితో ఈ శైశవ రాజ్యం వేగాల్సి వచ్చింది. మదురై సుల్తాన్ హోయసల పాలకుని ఓడించి అతడిని హత్య చేయించాడు. హోయసల రాజ్యం రద్దు కావడంతో హరిహర, బుక్కల తమ చిన్న రాజ్యాన్ని విస్తరించుకునే అవకాశం లభించింది. 1346 నాటికి హోయసల రాజ్యమంతా విజయనగర పాలకుల నియంత్రణలోకి వచ్చింది. అయితే విజయనగర పాలకులు, మదురై సుల్తాన్‌ల మధ్య వైరం సుమారు నాలుగు దశాబ్దాలపాటు కొనసాగింది. 1377లోనే మదురై సుల్తాన్ రాజ్యం పూర్తిగా పతనమైంది.

**విజయనగర - బహమని సంఘర్షణ :**

కృష్ణ–తుంగభద్ర ద్వినది ప్రాంతం లేదా రాయచూర్ ద్వినది ప్రాంతం, తూర్పు తీరంలోని కృష్ణా–గోదావరి పరివాహక ప్రాంతం మరాఠ్వాడా గ్రామీణ ప్రాంతాలపై నియంత్రణకోసం ఇరురాజ్యాలు తీవ్రంగా ఘర్షణ పడ్డాయి. ముఖ్యంగా పశ్చిమ తీరంలోని కొంకణ్ ప్రాంతంపై ఆధిపత్యం సాధించేందుకు నిరంతర పోరాటం చేశాయి. 1367లో ఈ ఘర్షణ భారీ స్థాయిలో మొదలైంది. అప్పుడు ఒకటవ బుక్క విజయనగరను పాలిస్తున్నాడు. అతడు వివాదాస్పదమైన తుంగభద్ర ద్వినది ప్రాంతంలోని ముద్కల్ కోటపై దాడి చేయడంతో ఇరు రాజ్యాల మధ్య శత్రుత్వం మొదలైంది. బహమని సుల్తాన్ ముద్కల్‌ను తిరిగి స్వాధీనం చేసుకున్నా పాత ప్రాంతాలను పునరుద్ధరిస్తూ ఇరు రాజ్యాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. తర్వాత రెండవ హరిహర నేతృత్వంలో విజయనగర సామ్రాజ్యం తూర్పుతీరంవైపు విస్తరణ విధానాన్ని కొనసాగించింది. ఈ నూతన విస్తరణ విధానం ఫలితంగా విజయనగర సామ్రాజ్యం కొత్త వివాదాలను సృష్టించింది. బహమని, వరంగల్ రాజ్యాల మధ్య సైనిక కూటమికి కారణమైంది. ఈ రాజ్యాలు సుమారు 50 ఏళ్ల పాటు సంకీర్ణ రాజ్యాలుగా వ్యవహరించాయి. అయితే రెండవ హరిహర ఆ రెండు రాజ్యాల ధాటిని తట్టుకొని నిలబడగలిగాడు. పశ్చిమ తీరంలో బహమని రాజ్యం నుండి బెల్గాం, గోవాలను స్వాధీనం చేసుకోవడంలో సఫలమయ్యాడు.

దేవరాయల కాలంలో ఇరు రాజ్యాల మధ్య మరోసారి వివాదం చెలరేగింది. ఒకటవ దేవరాయ పాలన తుంగభద్ర పరీవాహక ప్రాంతంపై ఆధిపత్యపోరుతో ప్రారంభమైంది. బహమని పాలకుడు ఫిర్‌జ్ షా అతడిని ఓడించారు. విజయనగరం భారీ మొత్తంలో పరిహారాన్ని చెల్లించాల్సి వచ్చింది. అయితే కృష్ణ–గోదావరి డెల్టా ప్రాంతంపై ఆధిపత్య సమస్య బహమని, విజయనగర, ఒరిస్సా రాజ్యాల మధ్య ఘర్షణలకు దారి తీసింది. ఆంధ్ర రెడ్డి రాజ్యంలో వారసత్వ వివాదం తలెత్తడంతో ఒకటవ దేవరాయ వరంగల్ రాజ్యంతో చేతులు కలిపి రెడ్డి రాజ్యాన్ని రెండుగా విభజించి పంచుకున్నారు. బహమని రాజ్య శిబిరం నుండి వరంగల్ ఫిరాయించడంతో దక్కను ప్రాంతంలో సైనిక సమతుల్యం మారిపోయింది. ఒకటవ దేవరాయ బహమని రాజ్యాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీయడమే కాకుండా కృష్ణానది వరకు విస్తరించిన ఆ రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు. సంగమ వంశంలో గొప్ప పాలకుడు రెండవ దేవరాయ. తన సైన్యాన్ని బలోపేతం చేయడం కోసం అతడు ఎందరో ముస్లింలను సైన్యంలో భర్తీ చేశాడు. వారి నుండి విలువిద్య నేర్చుకోవాలని హిందూ సైనికులకు సూచించాడు. తన కొత్త సైన్యంతో అతడు బహమనీలతో మూడు భీకర యుద్ధాలను చేశాడు. అయితే అంతిమంగా తమ తమ ప్రాంతాలకు పరిమితం కావాలని రెండు రాజ్యాలు ఒప్పందం చేసుకున్నాయి.

**మలితరం సంగమ పాలకులు, సాళువ పాలకులు**

రెండవ దేవరాయ మరణం తర్వాత విజయనగర సామ్రాజ్యంలో గందరగోళం నెలకొంది. సింహాసనం కోసం వారసులు మధ్య అంతర్యుద్ధాలు జరిగాయి. ఎందరో సామంతులు ఈ ప్రక్రియలో స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. పాలకులు విలాసాల్లో మునిగితేలుతూ రాజ్య వ్యవహారాలను నిర్లక్ష్యం చేశారు. కొంత కాలం తర్వాత సాళువ నరసింహ అనే మంత్రి

సింహాసనాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఆ విధంగా సంగమ వంశం నశించి సాళువ వంశం స్థాపించబడింది. సాళువ నరసింహ అంతర్గత భద్రతను పునరుద్ధరించి సామ్రాజ్యాన్ని కట్టుదిట్టంగా ఉంచాడు.

**తుళువలు- కృష్ణదేవరాయ:**

సాళువ వంశం కూడా స్వల్పకాలంలో పతనమైంది. వీర నరసింహ తుళువ వంశాన్ని స్థాపించాడు. నరసింహ వారసునిగా అతడి సోదర వరుస అయిన కృష్ణదేవరాయ సింహాసనాన్ని అధిష్టించాడు. సైనిక, ఇతర విజయాల కారణంగా కృష్ణదేవరాయను (1509-29) విజయనగర పాలకులందరిలో గొప్పవాడిగా కీర్తిస్తారు. కృష్ణదేవరాయ నాలుగు తక్షణ సవాళ్లను ఎదుర్కొన్నాడు. తొలుత ఉమ్మతూరుకు చెందిన తిరుగుబాటు నాయకుడు గంగరాయ మైసూరు ప్రాంతంపై రాయ ఆధిపత్యాన్ని ప్రశ్నించడం మొదలుపెట్టాడు. రెండవది, ఒరిస్సా గజపతి పాలకులు తూర్పు జిల్లాలను స్వాధీనం చేసుకున్నారు. మూడవది, బహమని రాజ్యం వివిధ రాజ్యాలుగా చీలిపోయినప్పటికీ ఉత్తరం నుండి బీజాపూర్ ముస్లిం పాలకుల నుండి ముప్పు నిరంతరంగా కొనసాగింది. చివరగా పోర్చుగీసుల పెరుగుతున్న ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తమ వార్షిక దాడిలో భాగంగా బహమని సైన్యాలు విజయనగర ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాయి. వాటిని తరిమికొట్టడం కృష్ణదేవరాయ ప్రథమ కర్తవ్యంగా మారింది. దివానీ యుద్ధంలో ముస్లిం సైన్యాలను సంపూర్ణంగా ఓడించాడు. పారిపోతున్న శత్రుసైన్యాలను, ముఖ్యంగా యూసుఫ్ ఆదిల్‌షా నేతృత్వంలోని బలగాలను కృష్ణ వెంబడించాడు. కోవిలకొండ వద్ద ఆదిల్‌షా ఎదురొడ్డి పోరాడాడు. ఈ ఘర్షణలో అతడు ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం దేవరాయ రాయచూరు ద్వినది ప్రాంతంపై దాడి చేసి రాయచూరు కోటను స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత గుల్బర్గ బయల్దేరి సుల్తాన్ మహ్మూద్ మంత్రి అయిన అమీర్ బరీద్‌ను ఓడించాడు. బీదర్‌ను కూడా స్వాధీనం చేసుకొని మహ్మూద్‌ను విడుదల చేశాడు. ఆ కారణంగా కృష్ణ "యవన రాజ్య స్థాపనాచార్య" అనే బిరుదును పొందాడు.

కాలికట్ రాజు జమోరిన్‌కు వ్యతిరేకంగా తమకు యుద్ధంలో సహకరిస్తే బహమనీలకు వ్యతిరేకంగా పోరాటం చేయడంలో విజయనగరకు సహాయం అందిస్తామని పోర్చుగీసు గవర్నరు అల్బుకర్క్ వర్తమానం పంపించాడు. అరబ్, పర్షియన్ గుర్రాలను కేవలం విజయనగరానికే సరఫరా చేస్తామని కూడా హామీ ఇచ్చాడు. అయితే కృష్ణ ఈ ఒప్పందాన్ని పూర్తిగా అంగీకరించలేదు. దేవను కలిసిన రెండవ పోర్చుగీసు దూత తమకు భక్తల్ వద్ద కోట నిర్మించుకునేందుకు అవకాశమివ్వాలని కోరాడు. తన దౌత్యంలో అతడు విజయం సాధించాడు. 1510 చివరలో గవర్నరు అల్బుకర్క్ గోవాను స్వాధీనం చేసుకున్న తర్వాతే ఈ ఒప్పందం కుదిరింది.

పెనుగొండపై దాడితో గంగరాయతో యుద్ధం మొదలైంది. అంత వరకు పెనుగొండ గంగరాయ నియంత్రణలో ఉండేది. ఉమ్మతూరు, శివసముద్రం (గంగరాయ ప్రధాన స్థావరం)ను స్వాధీనం చేసుకునే క్రమంలో గంగరాయ హత్యకు గురయ్యాడు. స్వాధీనం చేసుకున్న ప్రాంతం శ్రీరంగపట్నం రాజధానిగా ప్రాంతీయ కేంద్రంగా ఏర్పడింది.

తూర్పు తీరప్రాంత జిల్లాలు ఒరిస్సా గజపతి పాలకుడు ప్రతాపరుద్ర నియంత్రణలో ఉండేవి. వరుస యుద్ధాలలో కృష్ణ ఒరిస్సా పాలకుని సైన్యాలను ఓడించి తెలంగాణా ప్రాంతమంతటిని స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత ఉత్తరాంధ్రపై దృష్టి సారించాడు. రాజమహేంద్రవరం నగరాన్ని తొలిగా స్వాధీనం చేసుకున్నాడు. తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన్నప్పటికీ విజయనగర సైన్యం పొత్నూరు-సింహాద్రి వరకు తన జైత్రయాత్రను కొనసాగించింది. అక్కడ కృష్ణ విజయ స్థూపాన్ని నిర్మించి తన రాజధానికి వెనుదిరిగి వెళ్లాడు. కృష్ణ సైన్యం కళింగ రాజ్యంపై దాడి చేసి రాజధాని కటక్ సమీపాన చేరుకుంది. ప్రతాపరుద్ర శాంతి ఒప్పందాన్ని కోరుకున్నాడు. తన కుమార్తెను కృష్ణకిచ్చి వివాహం చేస్తానని ముందుకు వచ్చాడు. పెద్ద మనస్సుతో వ్యవహరించిన కృష్ణదేవరాయ కృష్ణానది ఉత్తరాన ఉన్న ప్రాంతాన్ని ప్రతాపరుద్రునికి తిరిగి అప్పగించాడు.

ఈలోగా ఇస్మాయిల్ ఆదిల్ షా (యూసుఫ్ షా వారసుడు) రాయచూర్‌ను తిరిగి స్వాధీనం చేసుకొని రెండవ వివాదానికి కారణమయ్యాడు. రాయచూర్ యుద్ధంలో ఇస్మాయిల్ సంపూర్ణంగా ఓటమి పాలయ్యాడు. కృష్ణా నదిని దాటుకొని తన ప్రాణాలను దక్కించుకున్నాడు. శాంతి ఒప్పందం కుదిరేలోగా విజయనగర సైన్యాలు గుల్బర్గను ధ్వంసం చేశాయి. గుల్బర్గలో మహ్మద్ బహమని కుమారులను కృష్ణ విడిపించి వారిలో పెద్దవాడిని సుల్తాన్‌గా నియమించాడు. మిగతా వారిని తనతోపాటు విజయనగర తీసుకెళ్లాడు.

### అంతిమ పతనం - అరవీడు వంశం :

కృష్ణదేవరాయ మరణం తర్వాత అతడి బంధువుల మధ్య వారసత్వ పోరు జరిగింది. అచ్యుతదేవ, వెంకటల అసమర్థ పాలన తర్వాత సదాశివరాయ సింహాసనాన్ని అధిష్టించాడు. అయితే వీరందరి పాలనా కాలంలో అధికారమంతా రామరాజు చేతుల్లోనే ఉండేది. అతడు కృష్ణదేవరాయకు అల్లుడు. రామరాజు ముస్లిం పాలకుల మధ్య వైరాన్ని ప్రోత్సహించాడు. పోర్చుగీసుతో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకొని బిజాపూర్ పాలకునికి గుర్రాల సరఫరాను నిలిపి వేయించాడు. వరుస యుద్ధాలలో అతడు బిజాపూర్ పాలకుడిని పూర్తిగా ఓడించాడు. తర్వాత బిజాపూర్ పాలకునితో జతకట్టి గోల్కొండ, అహ్మద్‌నగర్ రాజ్యాలను ఘోరంగా ఓడించాడు. అయితే అతడి శత్రువులందరూ కలిసి 1565లో తాళికోట సమీపంలోని బన్నిహట్టి వద్ద జరిగిన యుద్ధంలో విజయనగర సామ్రాజ్యాన్ని కోలుకోలేని విధంగా దెబ్బ తీశారు. ఈ యుద్ధాన్ని రాక్షస తంగడి యుద్ధమని కూడా పిలుస్తారు. రామరాజును బంధించి వెంటనే వధించారు. అరవీడు వంశం కింద ఈ సామ్రాజ్యం వందేళ్లపాటు కొనసాగినప్పటికీ దాని సరిహద్దులు క్రమంగా కుదించుకుపోయాయి. దక్షిణ భారత రాజకీయ వ్యవహారాలలో రాయ తన ఉన్నత స్థానాన్ని కోల్పోయాడు.

### ఇతర ప్రాంతీయ వంశాలు

**బహమనీలు :** హసన్ గంగూగా ప్రసిద్ధుడైన అల్లావుద్దీన్ హసన్ బహ్మన్ షా (1347-58) గుల్బర్గ రాజధానిగా బహమని రాజ్యాన్ని స్థాపించాడు. అతడి అసలు పేరు ఇస్మాయిల్ ముఖ్. ఒకటవ ముహమ్మద్ షా (1358-77) హసన్ సమీప వారసుడు. తాజుద్దీన్

ఫిరోజ్ షా (1398–1422)ను బహమనీలలో గొప్ప పాలకునిగా పరిగణిస్తారు. అహ్మద్ షా వలీ (1422–35) రాజధానిని గుల్బర్గ నుండి బీదర్‌కు తరలించాడు. అతడి హయాంలో బహమనీ రాజ్య గుల్బర్గ దశ అంతరించి బీదర్ నుండి రెండవ దశ మొదలైంది. 1463–1481 మధ్య మూడవ ముహమ్మద్ షాకు మహ్మూద్ గవాన్ వకీల్‌గానే కాకుండా వజీరుగా కూడా వ్యవహరించాడు. బహమనీ రాజ్యానికి అతడు పునఃవైభవం తీసుకువచ్చాడు. కొంకణ్, గోవా, కృష్ణ–గోదావరి డెల్టాను స్వాధీనం చేసుకొని బహమనీ రాజ్యాన్ని నలువైపులా విస్తరింపచేశాడు. అతడి పరిపాలనా సంస్కరణలవల్ల పాలకవర్గం, ప్రాంతీయ గవర్నర్లపై సుల్తాన్ నియంత్రణ బలపడింది. అయితే గవాన్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత ఇతర సంస్థానాధీశుల్లో అసంతృప్తిని రేపింది. ముఖ్యంగా దక్కనీవంశీయులు అఫాకీల (పశ్చిమాసియా నుండి కొత్తగా వలస వచ్చిన వారు) ఎదుగుదలను సహించలేకపోయారు. వీరంతా గవాన్‌కు వ్యతిరేకంగా కుట్ర పన్నారు. సుల్తాన్‌కు ద్రోహం చేశాడన్న నెపంపై అతడికి మరణశిక్ష విధించారు. గవాన్ మరణానంతరం బహమనీ రాజ్యం అనతి కాలంలోనే విచ్ఛిన్నమై పతనమైంది.

**బహమనీ చీలిక రాజ్యాలు :** మాలిక్ అహ్మద్ బ్రహీ అహ్మద్‌నగర్‌లో నిజాం షాహీ (1490–1633) వంశాన్ని స్థాపించాడు. తర్వాత వారిని షాజహాన్ జయించి తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. బీజాపూర్ ఆదిల్ షాహీలను (1490–1686) యూసుఫ్ ఆదిల్ షా కనుగొన్నాడు. బిజాపూర్ వద్ద ఆదిల్‌షాహీ పాలకుల్లో ఒకడైన మహమ్మద్ ఆదిల్‌షా ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద గోపురమైన గోల్ గుంబజ్‌ను నిర్మించాడు. అందులో ప్రతిధ్వనుల మంటపం కూడా ఉంది. ఈ రాజ్యాన్ని చివరగా ఔరంగజేబ్ ఆక్రమించి మొగల్ సామ్రాజ్యంలో విలీనం చేశాడు. బెరార్ ఇమాద్ షాహీల వంశం (1490–1574) ఫతుల్లా ఖాన్ ఇమాద్–ఉల్–ముల్క్‌తో ప్రారంభమైంది. తర్వాత ఈ రాజ్యాన్ని అహ్మద్‌నగర్ నిజాంషాహీ పాలకులలో ఒకరు తన రాజ్యంలో విలీనం చేసుకున్నాడు. గోల్కొండ కుతుబ్ షాహీ (1518–1687) వంశాన్ని కులీ కుతుబ్‌షా (1518–43) స్థాపించాడు. అతడు సుప్రసిద్ధమైన గోల్కొండ కోటను నిర్మించాడు. మరో కుతుబ్ షాహీ పాలకుడు మహమ్మద్ కులీ కుతుబ్‌షా అందరిలో గొప్పవాడు. అతడే హైదరాబాద్ నగరాన్ని నిర్మింపచేశాడు. అలాగే ఆ నగరంలో చారిత్రక కట్టడమైన చార్మినార్‌ను నిర్మించాడు. ఈ రాజ్యాన్ని ఔరంగజేబ్ స్వాధీనం చేసుకున్నాడు. బీదర్‌కు చెందిన బరీద్ షాహీలు (1528–1619) అలీ బరీద్ పాలనతో వెలుగులోకి వచ్చాడు. ఈ రాజ్యాన్ని బిజాపూర్ ఆదిల్ షాహీలు స్వాధీనం చేసుకున్నారు.

## బెంగాల్ వంశాలు

**ఖిల్జీలు :** 1206లో భక్తియార్‌ఖిల్జీని అలీ మర్దాన్ ఖిల్జీ హత్య చేయడంతో బెంగాల్‌లో ఖల్జీ పెద్దల మధ్య అంతర్యుద్ధం జరిగింది. అయితే గియాసుద్దీన్ ఐవాజ్ ఖల్జీ (1213–27) రాజ్యంలో శాంతి భద్రతలను పునరుద్ధరించి రాజధానిని దేవ్‌కోట్ నుండి చారిత్రక నగరమైన లక్నౌతి (గౌర్)కి బదిలీ చేశాడు. ఢిల్లీకి బహిరంగ సవాలు విసురుతూ సుల్తాన్ బిరుదును సైతం స్వీకరించాడు. దీంతో ఇల్తుమిష్ బెంగాల్‌పై దాడి చేసి గియాసుద్దీన్‌ను ఓడించాడు.

**మామ్లూక్‌లు :** తర్వాతి 60 ఏళ్ల వరకు (1227–87) బెంగాల్‌ను 15 మందికి తక్కువ కాకుండా తెగ నాయకులు పాలించారు. వారిలో ఢిల్లీ నుండి పంపబడ్డ పది మంది

మామ్లూక్‌లు ఉన్నారు. ముగీసుద్దీన్ తుగ్రిల్ (1268-81) మామ్లూక్‌లలో చివరివాడు, అందరిలో గొప్పవాడు. అతడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని బాల్బన్‌ను రెచ్చగొట్టాడు. అతడికి వ్యతిరేకంగా బాల్బన్ రెండు సైన్యాలను పంపాడు. తొలి సైనిక దాడి విఫలమైనా బాల్బన్ స్వయంగా నేతృత్వం వహించిన రెండవ సైన్యం ఫలితం సాధించింది. బెంగాల్ బాల్బన్ చివరి కుమారుడైన బుగ్రాఖాన్ నియంత్రణలోకి వచ్చింది. అతడు బాల్బన్ హయాం (1281-87) చివరలో బెంగాల్ గవర్నర్‌గా వ్యవహరించాడు.

**బాల్బన్ కుటుంబం :** 1287లో బాల్బన్ మరణం తర్వాత బుగ్రా సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించి నసీరుద్దీన్ మహమ్మద్ అనే బిరుదును పొందాడు. బాల్బన్ వారసునిగా ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించిన కైకుబాద్ బుగ్రా స్వాతంత్ర్యాన్ని గుర్తించాడు. ఈ బాల్బన్ కుటుంబం (బుగ్రా, అతడి వారసులు) బెంగాల్‌ను 1328 వరకు స్వతంత్రంగా పాలించింది. గియాసుద్దీన్ తుగ్లక్ బెంగాల్‌పై దాడి జరిపి ఢిల్లీ ఆధిపత్యాన్ని పునరుద్ధరించాడు. అయితే పదేళ్ల తర్వాత (1339) బెంగాల్ మరోసారి స్వతంత్ర రాజ్యంగా మారింది. అప్పుడు ఫక్రుద్దీన్ ఢిల్లీ పాలకుడైన మహమ్మద్ బిన్ తుగ్లక్ ఆధిపత్యాన్ని ఎదిరించి ఫక్రుద్దీన్ ముబారక్ షా అనే బిరుదును పొందాడు.

**ఇల్యాస్ షాహీలు :** షమ్షుద్దీన్ ఇల్యాస్ షాహీ వంశాన్ని స్థాపించాడు. ఈ వంశం కొన్ని విరామాలతో 1538 వరకు బెంగాల్‌ను పాలించింది. షంషుద్దీన్ ఇల్యాస్‌షా (1345-58) బెంగాల్ ప్రాంతాన్నంతటినీ ఒకే పాలన కిందికి తీసుకువచ్చాడు. చివరకు ఫిరోజ్ షా తుగ్లక్‌కు ఏ దారి లేకపోవడంతో అతడితో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నాడు. సికందర్ షా (1358-89) కూడా ఫిరోజ్ తుగ్లక్ ప్రయత్నాలను 1359లో వమ్ము చేశాడు. దాని తర్వాత సుమారు రెండు శతాబ్దాలపాటు బెంగాల్‌కు ఢిల్లీ నుండి ఎలాంటి ముప్పు ఏర్పడలేదు. తదుపరి సుల్తాన్ గియాసుద్దీన్ ఆజం షా (1389-1409) చైనాకు రాయబారిని పంపాడు. చిట్టాగాంగ్ ఓడరేవు నుండి ఆగ్నేయ ఆసియా దేశాలతో వాణిజ్య సంబంధాలను కొనసాగించాడు. గియాసుద్దీన్ వారసుని కాలంలో దినాజ్‌పూర్‌కు చెందిన ఒక బ్రాహ్మణ జమీందారు రాజా గణేష్ 1415లో గద్దెను దక్కించుకున్నాడు. అయితే 1442లో పాత ఇల్యాస్ షాహీ వంశం పునరుద్ధరించబడింది.

1487లో ఇల్యాస్ షాహీ వంశాన్ని అబిసినియా బానిసలు మరోసారి గద్దె దించారు. షాహ్‌జాదా బరక్‌షా నేతృత్వంలో ఈ తిరుగుబాటు జరిగింది. బెంగాల్ స్వతంత్ర ముస్లిం పాలకులలో గొప్పవాడిగా పరిగణించబడే అల్లావుద్దీన్ హుసేన్‌షా (1493-1519) అబిసినియన్లను తప్పించి ఇల్యాస్ షాహీ వంశాన్ని పురుద్ధరించాడు. తన పొరుగు రాజ్యాలన్నింటిపై అతడు విజయం సాధించాడు. కామరూప (కమత) అహోంలు, ఒరిస్సాలను కూడా అతడు ఓడించాడు. అతడి పాలనలోనే చైతన్య బెంగాల్, ఒరిస్సాలలో వైష్ణవ మతాన్ని బోధించాడు. అతడి దయార్ద్ర పాలనలో ఎందరో కవులు, రచయితలు బెంగాలీ భాషలో రచనలు చేశారు. నుస్రత్ షా (1519-32) బాబర్‌తో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నాడు. బాబర్ అప్పుడు తూర్పు ప్రాంతాలపై దండయాత్రకు వచ్చాడు. తన తండ్రిలాగే షా కూడా పరమత సహనాన్ని పాటించాడు. బెంగాలీ సాహిత్యాన్ని పోషించాడు. గియాసుద్దీన్ మహ్మూద్ షా (1532-38) పాలన బెంగాల్‌లో హుమాయూన్, షెర్‌షాల మధ్య సంఘర్షణను చవి చూసింది. చివరకు అది ఇల్యాష్ షాహీ వంశ పతనానికి దారి తీసింది. 1538 షెర్‌షా

గౌర్‌ను స్వాధీనం చేసుకున్నాడు. బెంగాల్‌లో ఆఫ్ఘన్ పాలనకు నాంది పలికాడు. 1574లో అక్బర్ దండయాత్రతో వారి పాలన కూడా అంతరించింది.

**అస్సాం వంశాలు :**

**కమత ఖెన్లు :** బ్రాహ్మణత్వం పొందిన గిరిజనులు వీరు. 15వ శతాబ్దంలో కమతను బలమైన రాజ్యంగా తీర్చిదిద్దారు. ఈ వంశంలో బహుశా చివరి పాలకుడైన నీలాంబర కమతాపూర్ రాజధానిగా (పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహార్ సమీపంలో) విశాలమైన ప్రాంతాలను పాలించాడు. అయితే అతడిని ఎట్టకేలకు గద్దె దించారు. అతడి రాజ్యాన్ని బెంగాల్ పాలకుడు అల్లావుద్దీన్ హుసేన్ షా (15వ శతాబ్దం చివరలో) స్వాధీనం చేసుకున్నాడు.

**కోచ్ పాలకులు :** కోచ్ తెగకు చెందిన విషసింహ 1515లో తనను కమత పాలకునిగా ప్రకటించుకున్నారు. అయితే ఈ వంశానికి చెందిన గొప్ప పాలకుడు మాత్రం నారాయణ్. ఇతడి పాలనలో కమత రాజ్యం ఉన్నత శిఖరాలకు చేరుకుంది. అయితే దురదృష్టవశాత్తు రాజు, పాలక వర్గాల మధ్య విభేదాలు ఏర్పడి రాజ్యం రెండుగా (1570) వీడిపోయింది : ఒకటి కూచ్‌బెహార్, రెండవది కూచ్ హాజో. 1639లో పశ్చిమ భాగం (కూచ్ బెహార్) మొగల్‌ల ఆధిపత్యంలోకి వచ్చింది. తూర్పుభాగం (కూచ్ హాజో) అహోంల నియంత్రణలోకి వెళ్లింది.

**అహోంలు :** మంగోలు షాన్ తెగకు చెందిన అహోంలు బ్రహ్మపుత్ర లోయకు ఉత్తర బర్మా నుండి ప్రవేశించి అక్కడి తూర్పు ప్రాంతంలో (13వ శతాబ్దం మొదట్లో) ఒక కొత్త రాజ్యాన్ని స్థాపించారు. సుఖాప వారి నాయకుడు. అయితే సుఖంగ్‌పా పాలనలోనే పొరుగు రాజ్యమైన కమతాకు విఘాతం కల్గిస్తూ అహోం రాజ్యం విస్తరించింది. 15వ శతాబ్దం మొదట్లో సుదంగ్‌పా పాలనలో అహోం సమాజంపై బ్రాహ్మణిక ప్రభావం పెరిగింది. అహోం పాలకుల్లో గొప్పవాడైన సుహంగ్ ముంగ్ (1497-1539) బెంగాల్ సుల్తాన్‌ల దండయాత్రలను తిప్పికొట్టాడు. అహోం సమాజం అత్యంత వేగంగా హిందూకరణ చెందడమే కాకుండా (సుహంగ్‌ముంగ్ హిందూ పేరైన స్వర్గ నారాయణ్‌ను పొందాడు) శంకరదేవ బోధించిన వైష్ణవ సారం కూడా గణనీయంగా వ్యాప్తి చెందడం ఇతడి పాలనలోని ముఖ్య లక్షణాలు. భౌగోళికంగా ఒంటరిదైన అహోం రాజ్యం ఉత్తర భారత రాజకీయాలకు చాలా దూరంగా ఉండేది. అందుకే మూడు కారణాలచేత అది ప్రత్యేకతను సంతరించుకొంది. ఒకటి అహోంలు కొత్త జాతిపరమైన అంశాన్ని చొప్పించారు. బ్రాహ్మణిక హిందూ మతానికి లొంగిపోయారు. మూడవది, 'బురంగీ'లు అనే వారి చారిత్రక నివేదికలకు భారత ప్రాంతీయ భాషలలో సమాంతరాలు ఏవీ లేవు.

**ఒరిస్సా వంశాలు**

**తూర్పు గంగాలు :** అనంతవర్మన్ చోడ గంగా (1076-1148) తన రాజ్యాన్ని బెంగాల్‌లోని గంగానది ముఖద్వారం నుండి దక్షిణంలో గోదావరి తీరం వరకు విస్తరించాడు. భువనేశ్వర్‌లో ప్రఖ్యాతి గాంచిన లింగరాజ ఆలయాన్ని, పూరిలో జగన్నాథ ఆలయాన్ని నిర్మించాడు. ఒరిస్సా తర్వాతి ముఖ్య పాలకుడు ఒకటవ నరసింహ (1238-64) ముస్లిం పాలకుల నుండి బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. కోణార్క్‌లో ప్రసిద్ధమైన

సూర్య దేవాలయాన్ని నిర్మించాడు. అతడి మరణంతో తూర్పు గంగా వంశ వైభవం కూడా అంతరించింది. గంగా పాలకుల్లో ఒకడైన మూడవ భానుదేవ హయాంలో ఒరిస్సా తొలుత బెంగాల్ ఇల్యాస్‌షా, తర్వాత ఫిరోజ్‌షా తుగ్లక్‌ల దండయాత్రలను చవి చూసింది.

**సూర్యవంశ గజపతులు :** చివరి తూర్పుగంగా పాలకుని కింద మంత్రిగా పని చేసిన కపిలేంద్ర (1435–67) సూర్యవంశి వంశాన్ని స్థాపించాడు. ఈ వంశం ఒరిస్సాను వందేళ్ళపాటు పాలించింది. పురుషోత్తం పాలన (1467–97) కొన్ని పరాజయాలను చవి చూసింది. ప్రతాపరుద్ర (1497–1540) ఒరిస్సా హిందూ పాలకుల్లో అత్యంత శక్తిమంతుడు. అయితే బెంగాల్ పాలకుడు అల్లావుద్దీన్ హుసేన్, విజయనగర రాజు కృష్ణదేవరాయ చేతుల్లో ఓడిపోయాడు.

అల్లావుద్దీన్ పూరి వరకు దూసుకు వచ్చి అక్కడి ఆలయాన్ని ధ్వంసం చేశాడు. కృష్ణదేవరాయ 'గజపతి సప్తాంగ హరణ' అనే బిరుదును పొందాడు. అయితే ప్రతాపరుద్రుని పేరు తూర్పు భారత మత చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది. చైతన్యతో అతడి స్నేహం, వైష్ణవ మతంపట్ల అతడి ఆరాధన కారణంగా అతడు ఎంతో కీర్తిని గడించాడు.

**ఇతర వంశాలు :** గజపతిలను భోయిలు (1542–59) గద్దె దించారు. భోయిల నాయకుడు గోవింద విద్యాధర భోయి కులానికి చెందిన వాడు. భోయిలను ముకుంద హరిచంద్రన్ (1559–68) ఓడించాడు. అతడు ఒరిస్సాను ముస్లిం ఆక్రమణదారుల నుండి పరిరక్షించడానికి ప్రయత్నించాడు. అయితే అతడి మరణం తర్వాత ఒరిస్సాను బెంగాల్ రాజు సులేమాన్ స్వాధీనం చేసుకున్నాడు. 1592లో చివరగా అక్బర్ ఆ రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నాడు.

**జౌన్‌పూర్ షర్కీలు :** జౌన్‌పూర్ (ఉత్తరప్రదేశ్)ను ఫిరోజ్ షా తుగ్లక్ కనుగొన్నాడు. తన సమీప వంశస్థుడైన జౌనాఖాన్ (మహమ్మద్ బిన్ తుగ్లక్)పేరిట ఆ నగరాన్ని నిర్మించాడు. ఫిరోజ్ మరణం తర్వాత జౌన్‌పూర్ స్వాతంత్ర్యం ప్రకటించుకున్న ప్రాంతీయ రాజ్యాలలో మొదటిది. నపుంసకుడైన మాలిక్ సర్వర్ (1394–99) ఖ్వాజా జహాన్ అనే బిరుదుతో మహ్మూద్ (చివరి తుగ్లక్) ద్వారా గవర్నర్‌గా నియమితుడయ్యాడు. అయితే తైమూర్ దండయాత్ర అనంతరం అతడు ఢిల్లీపై తిరుగుబాటు చేశాడు. మహ్మద్ నుండి సుల్తాన్–ఉస్–షర్క్ అనే బిరుదును పొందడం కారణంగా అతడి వంశం షర్కీ వంశంగా పిలవబడింది. మాలిక్ సర్వర్ తర్వాత ముబారక్ (1399–1402), ఇబ్రహీం (1402–40), మహ్మూద్ (1440–57), మహమ్మద్ (1457–58), చివరగా హుసేన్ షా (1450–1505) జౌన్‌పూర్ పాలించారు. హుసేన్ షా బహ్లుల్ లోధితో జీవన్మరణ పోరాటం చేశాడు. కాని లోధి 1483–84 లో జౌన్‌పూర్‌ను స్వాధీనం చేసుకోవడంలో సఫలమయ్యాడు. అయితే షర్కీ రాజ్యాన్ని సంపూర్ణంగా ఢిల్లీ సుల్తాన్ సామ్రాజ్యం పరిధిలోకి తెచ్చిన వ్యక్తి సికందర్ లోధి. బెంగాల్ సుల్తాన్ రాజ్య పరిధిలోని స్థావరం నుండి తన రాజ్యాన్ని తిరిగి దక్కించుకునేందుకు హుసేన్ షా తుది వరకు ప్రయత్నించాడు.

## కాశ్మీర్ వంశాలు

**షాహ్ మీర్‌లు :** సింహదేవ (1286–1323), ఉదయనదేవ (1323–39)ల తర్వాత హిందూ పాలక వంశాన్ని షాహ్ మీర్ అంతమొందించాడు. అతడు ఒక ముస్లిం సైనిక సాహసి. కాశ్మీర్‌లో ముస్లిం పాలనకు బాటలు వేశాడు. అతడు సుల్తాన్ షంషుద్దీన్ (1339–42) అనే బిరుదును పొందాడు. షాహ్‌మీర్‌లుగా పరిగణించబడిన అతడి వారసులు పదహారు మంది కాశ్మీర్‌ను దాదాపు (1339–1561) రెండు శతాబ్దాలకు పైగా పాలించారు. కాశ్మీర్ ఔరంగజేబ్‌గా ప్రసిద్ధుడైన సికందర్ (1389–1413) కాశ్మీరు సమాజంలో మత, సామాజిక పరివర్తనను తీసుకువచ్చాడు. హిందువులను విచక్షణా రహితంగా వేటాడాడు. తైమూరు సైన్యాలతో భారతదేశానికి వచ్చిన మధ్య ఆసియా, పర్షియా వలసదారులు కాశ్మీరులో పెద్ద సంఖ్యలో స్థిరపడ్డారు. సికందర్ వారిని ఉదారంగా పోషించాడు.

కాశ్మీరు అక్బర్‌గా ప్రసిద్ధుడైన జైన్–ఉల్–ఆబిదిన్ (1420–70) సికందర్ హిందువులపై చేసిన తప్పిదాలను సరిచేసిన ఘనతను దక్కించుకున్నాడు. అంతకు ముందు ధ్వంసమైన ఆలయాలను పునఃనిర్మించి మరమ్మతులు చేయించాడు. అలాగే న్యాయ చట్టాలను మెరుగు పరచి ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించాడు. పార్సీ, సంస్కృత, టిబెట్, ఇతర భాషలలో మంచి ప్రావీణ్యం ఉన్న ఆబిదిన్ మహాభారతం, కల్హణుడి రాజతరంగిణిని పార్సీలోకి అనువాదం చేయించాడు. రాజతరంగిణిని పూర్తి చేసిన జొనరాజ, శ్రీవర అనే కవులు అతడి ఆతిథ్యాన్ని పొందారు. చివరి షాహ్ మీర్‌లు బలహీనులు. పాలకవర్గాల చేతిలో కీలు బొమ్మలుగా మారారు. చక్, మక్రీ వర్గాలుగా విడిపోయిన సంస్థానాధీశులు రాజకీయ ఆధిపత్యం కోసం పోరాడారు.

**చక్ వర్గీయులు :** చక్ వర్గీయులు 1540లోనే అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అయితే షాహ్‌మీర్‌లు నామమాత్రపు పాలకులుగా ఉంచి వజీర్లుగా వారు ఆధిపత్యం చెలాయించాడు. 1561లో తమ ముసుగును విడనాడి ప్రత్యక్ష పాలనకు శ్రీకారం చుట్టారు. నసీరుద్దీన్ మహమ్మద్ గాజి షా అనే బిరుదుతో ఒక చక్ వర్గీయుడు పాలనా పగ్గాలను చేపట్టాడు. అతడి తర్వాత ఐదుగురు చక్‌లు పాలించారు. వారిలో చివరి వాడైన నసీరుద్దీన్ మహమ్మద్ యూసుఫ్ బాద్ షా గాజిని 1586లో ఓడించి కాశ్మీర్ రాజ్యాన్ని మొగల్ సామ్రాజ్యంలో అక్బర్ విలీనం చేశాడు.

## రాజస్థాన్ రాజపుత్రులు :

**మేవార్ :** నాగ్డా రాజధానిగా గెహ్లాట్ వంశ పాలనలో మేవార్ రాజ్యం కొనసాగింది. మేవార్ పాలకుల్లో ఒకడైన జైత్రసింగ్ (1213–61) ఇల్తుమిష్ నేతృత్వంలో ఢిల్లీ నుండి జరిపిన దండయాత్రలను విజయవంతంగా ప్రతిఘటించాడు. అయితే నాగ్డా ధ్వంసం కావడంతో చిత్తోర్‌ను కొత్త రాజధానిగా ఏర్పాటు చేయవలసి వచ్చింది. రతనసింగ్ నష్టజాతకుడు. అతడు 1303లో అల్లావుద్దీన్ ఖిల్జీ దండయాత్రను ఎదుర్కోవడమే కాకుండా తన రాజధానిని కూడా కోల్పోయాడు. ఫలితంగా పాలకుల వారసత్వంలో మార్పువచ్చింది. గెహ్లాట్ వంశానికి చెందిన పెద్ద శాఖను అధికారం నుండి తప్పించి మలితరం శాఖకు చెందిన సిసోడియాలు పాలనా పగ్గాలను చేపట్టారు.

తొలి సిసోడియా పాలకుడు మేవార్‌లో కొంత భాగాన్ని నియంత్రించాడు. మిగతా భాగం ఢిల్లీసుల్తానుల నియంత్రణలో కొనసాగింది. అయితే రాణా హమ్మీర్ (1314–78) ఈ భాగాన్ని తిరిగి దక్కించుకున్నాడు. అతడు సిసోడియా పాలకుల్లో ముఖ్యమైన వాడు. రాణా కుంభకరణ్ (1438–68) బహుశా అందరిలో గొప్ప పాలకుడు. సమకాలీన శిలాశాసనాలు, ఏకలింగ మహాత్మ్య అనే సాహిత్య కృతి అతడి సైనిక విజయాల గురించి గొప్పగా వివరిస్తాయి. తన పొరుగు రాజపుత్ర రాకుమారులపైనేకాకుండా మాల్వా, గుజరాత్ సుల్తాన్‌లపై కూడా అతడు నిరంతరం పోరాడాడు. ఎన్నో ఆలయాలను నిర్మించాడు. అయితే అతడి హయాంలో నిర్మించబడిన అద్భుత కట్టడం మాత్రం చిత్తోర్ సమీపంలోని కీర్తి స్తంభం. మాల్వాపై విజయానికి ప్రతీకగా అతడు ఆ స్తంభాన్ని నిర్మించాడు.

రాణా సంగ్రామ్ సింగ్ (1509–28) అద్వితీయమైన వ్యక్తి. అతడిని సంగా అని పిలిచేవారు. తన దేహంపై 80కిపైగా గాయాలు, ఒక కాలు, ఒక కన్ను, ఒక చేయిని కోల్పోయి "సగం సైనికునిగా" వర్ణించబడిన సంగా అద్వితీయమైన సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించాడు. ఇబ్రహీం లోఢితో జరిగిన అనేక ఘర్షణల్లో అతడు మంచి విజయాలను సాధించాడు. బాబర్ తన స్మృతులలో ప్రస్తావించిన హిందూ రాజులలో విజయనగర పాలకుని తర్వాతి స్థానంలో సంగ్రామ్ పేరును ఉంచాడు. అయితే బాబర్‌ను ఓడించాలన్న సంగ్రామ్ ప్రయత్నం ఖాన్వా యుద్ధం (1527)లో అతడి ఘోర పరాజయానికి దారి తీసింది. వివిధ కారణాలవల్ల మేవార్‌ను స్వాధీనం చేసుకోవడానికి బాబర్ వెనుకాడినా అక్బర్ మాత్రం ఆ రాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించడంలో విఫలమయ్యాడు. చివరకు జహంగీర్ హయాంలోనే (1615) మేవార్ మొగల్ ఆధిపత్యాన్ని గుర్తించింది.

**మార్వార్ :** 13వ శతాబ్దపు మధ్య దశకాలలో రథద సింహ నేతృత్వంలో మార్వార్ రాథోర్‌లు అధికారంలోకి వచ్చారు. అయితే మార్వార్ అసలు చరిత్ర చుండ (1384–1423) కాలం నుండి మొదలవుతుంది. అతడు మాన్డోర్ వద్ద అధికారాన్ని స్థాపించాడు. చుండా వారసునిగా అతడి మనవడు జోధ (1438–89) అధికారం చేపట్టాడు. అతడు జోధ్‌పూర్ కోటను నిర్మించి ఆ నగరాన్ని తనరాజధానిగా మార్చాడు. అయితే మార్వార్ గొప్ప పాలకుడు మాత్రం నిస్సందేహంగా మాల్దేవ్ (1532–62) ఒక్కడే. అతడి పాలనలో రాథోర్‌ల అధికారం శిఖర స్థాయికి చేరుకుంది. అతడు షేర్‌షాతో ఘర్షణ పడ్డాడు. షేర్ షా ఈ రాథోర్ నాయకునితో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నాడు.

**ఇతర రాజపుత్ర రాజ్యాలు :** తర్వాతి కాలంలో జైపూర్ రాజ్యంగా అవతరించిన అంబర్‌ను సూర్యవంశానికి చెందిన కచ్‌వాహాలు పాలించారు. దాని పుట్టుక ధుంధర్ ప్రాంతంలో జరిగింది. పదవ శతాబ్దం చివరలో దానిని దుల్లారాయ్ స్థాపించాడు. దుల్లా కుమారుడు వారసుడైన కాకిల్ దేవ 1037లో అంబర్ కోటను స్వాధీనం చేసుకున్నాడు. మీనాలను ఓడించిన తర్వాత ఆ ప్రాంతాన్ని తన రాజధానిగా మార్చుకున్నాడు. అంబర్ చరిత్ర తొలినాళ్లలో అది మేవార్ నియంత్రణలో ఉండేది. అయితే కేవలం 14వ శతాబ్దంలోనే రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. మళ్లీ మొగల్ కాలంలోనే ఆ రాజ్యం తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుంది. అంబర్ పాలకుల్లో ఒకడైన భారామల్ అక్బర్ ఆధిపత్యాన్ని స్వచ్ఛందంగా అంగీకరించాడు.

తన కుమారుడు, మనవడు (భగవాన్‌దాస్, మాన్‌సింగ్)లతోపాటు మొగల్ సామ్రాజ్య విస్తరణ, ఆధిపత్యానికి చాలా వరకు తోడ్పడ్డాడు.

బికానేర్ రాజ్యాన్ని రాథోర్‌లలోని ఒక చిన్న వర్గం పాలించింది. దాని వ్యవస్థాపకుడు బికా (1464–1504). అతడు మార్వార్ జోధా ఐదవ కుమారుడు.అతడు ఉత్తర రాజస్థాన్‌లో బికానేర్ నగరాన్ని కూడా నిర్మించాడు. ఆ నగరమే అతడి రాజధానిగా కొనసాగింది. అతడి వారసులు నర, లుమకర్ణ ఆ రాజ్యాన్ని రాజస్థాన్‌లోకెల్లా శక్తివంతమైన రాజ్యంగా తీర్చిదిద్దారు. జైసల్మేర్ రాజ్యాన్ని కొద్ది వరకు పాత వంశమైన భట్టీలు పాలించారు. వారు ఎన్నో కాలువలను తవ్వించారు. ఆలయాలను నిర్మించారు. వారి పాలన సుమారు నాలుగు శతాబ్దాలపాటు కొనసాగింది. రణథంబోర్ రాజ్యాన్ని పృథ్వీరాజ్ చౌహాన్ (12వ శతాబ్ది) వంశానికి చెందిన వారు పాలించారు. రణథంబోర్ చౌహాన్లలో ప్రముఖుడు హమ్మీర్‌దేవ. అతడు 1283 నుండి 1301 వరకు పాలించాడు. అయితే చివరి చౌహాన్లను హదా వంశీయులు గద్దె దించారు. హదా పాలకులు మొగల్ కాలంలో ప్రముఖులుగా ఎదిగారు.

**గుజరాత్ వంశం :**

చివరి తుగ్లక్ పాలకుల కింద గవర్నర్‌గా పని చేసిన జఫర్‌ఖాన్ 1407–08లో ముజఫర్ షా అనే బిరుదును సంతరించుకున్నాడు. ఒకటవ అహ్మద్–షా (1411–42) అహ్మదా బాద్ నగరాన్ని స్థాపించాడు. గుజరాత్ రాజధానిగా ఈ నగరం అనహిల్వారా స్థానాన్ని ఆక్రమించింది. అయితే గుజారత్ సుల్తానులలో గొప్పవాడు మాత్రం ఒకటవ మహ్మద్‌షా (1458–1511). ఇతడిని ఎక్కువగా 'బేగర్హా' అని గుర్తిస్తారు. ఎందుకంటే అతడు గిర్నార్, చంపానేర్ అనే శక్తివంతమైన రెండు రాజపుత్ర కోటలను స్వాధీనం చేసుకున్నాడు. అతడు అపర కుంభకర్ణుడిగా కూడా ప్రసిద్ధిగాంచాడు. అతడి పాలనలోనే గుజరాత్ రాజ్య కీర్తి ప్రతిష్టలు ఉన్నత స్థాయికి చేరుకున్నాయి. వర్థిమా (ఇటాలియన్), బార్బోసా (పోర్చుగీసు) లు రాసిన గ్రంథాలలో అతడి గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యానాలు కనిపిస్తాయి. గుజరాత్ సుల్తాన్‌లలో అత్యంత చురుకుగా వ్యవహరించిన చివరి వ్యక్తి బహదుర్ షా (1526–37). అతడు మాల్వాను ఆక్రమించి తన రాజ్యంలో కలుపుకున్నాడు. చిత్తోర్‌ను ధ్వంసం చేశాడు. అతడి పాలన కాలం చివరిలో హుమాయూన్ గుజరాత్‌పై దండెత్తి అందులో కొంత ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అయితే హుమాయూన్ ఉపసంహరించుకున్న తర్వాత బహదుర్ తాను కోల్పోయిన ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఒక ఓడపై పోర్చుగీసు అధికారులతో చర్చ జరుపుతుండగా వాగ్వివాదాలు తలెత్తడంతో ఘర్షణ జరిగింది. ఆ తోపులాటలో అతడు ఓడపై నుండి సముద్రంలో జారిపడి జలసమాధి అయ్యాడు. అతడి వారసులు సంస్థానాధీశులు చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరించారు. గుజరాత్ రాజ్యాన్ని పతనం చేయడానికి అక్బర్‌కు ఎంతో కాలం పట్టలేదు.

**మాల్వా వంశాలు :**

**ఘోరీలు :** చివరి తుగ్లక్‌ల కాలంలో మాల్వా స్వతంత్ర రాజ్యంగా ఆవిర్భవించింది. 1401–02లో దిలావర్ ఖాన్ ఘోరి స్వాతంత్ర్యాన్ని పొందాడు. అతడి రాజధాని ధార్

అయినప్పటికీ మాండు కోటను బలోపేతం చేయడం మొదలుపెట్టాడు. దానిని రక్షణ కేంద్రంగా తీర్చిదిద్దాడు. తర్వాతి పాలకుడు ఆల్ప్ ఖాన్. అతడు హోషంగ్ షా (1406-35) అనే బిరుదుతో పాలన సాగించాడు. మాండును తన కొత్త రాజధానిగా మార్చుకున్నాడు. అలాగే హోషంగాబాద్ అనే కొత్త పట్టణాన్ని నిర్మించాడు. అయితే అతడి కుమారుడు, వారసుడైన ముహమ్మద్‌షా (1435-36) అసమర్థుడు. అందుకే అనతి కాలంలోనే పదవిని పోగొట్టుకున్నాడు.

**ఖిల్జీలు :** ఈ వంశ వ్యవస్థాపకుడు ఒకటవ మహ్మద్ ఖిల్జీ (1436-69) మాల్వా సుల్తాన్ అందరిలో అత్యంత శక్తిమంతుడు. అతడి పాలనాకాలంలోనే మాల్వారాజ్య భౌగోళిక విస్తరణ ఉన్నత స్థాయికి చేరుకుంది. ఖిల్జీ వంశంలో చివరి పాలకుడైన రెండవ మహ్మద్ ఖిల్జీ (1511-31) బలహీనుడు. మేదిని రాయ్ అనే రాజపుత్ కొన్నేళ్లపాటు ప్రధాన పాత్రను పోషించాడు. 1531లో గుజరాత్ పాలకుడు బహదూర్‌షా మాండును స్వాధీనం చేసుకున్నాడు. తర్వాతి 30 ఏళ్ల కాలంలో (1531-61) మాల్వా ఎన్నో రాజకీయ మార్పులకు లోనైంది. చివరకు 1561లో అక్బర్ ఈ రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అప్పుడు బజ్‌బహదూర్ పాలకుడిగా ఉన్నాడు. ఇతడు ఇస్లాం షా సుర్ కింద మాల్వా గవర్నర్‌గా పని చేసిన సుజాత్ ఖాన్ కుమారుడు.

**ఖాన్‌దేశ్ ఫారుకీలు :** ఖాన్‌దేశ్ వ్యవస్థాపకుడు మాలిక్ రాజా ఫారుకీ (1389-99) తొలుత ఫిరోజ్ షా తుగ్లక్ కింద ఈ ప్రాంత గవర్నర్‌గా వ్యవహరించాడు. ఫిరోజ్ మరణం తర్వాత అతడు స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. అతడి వారసులు ఖాన్ అనే బిరుదును తమ పేర్లకు జోడించడంతో వారి రాజ్యం ఖాన్‌దేశ్‌గా ప్రాచుర్యం పొందింది. నసీర్‌ఖాన్ (1399-1437) అసిర్‌గఢ్ అనే బలమైన కోటను ఒక హిందూ నాయకుడి నుండి స్వాధీనం చేసుకున్నాడు. నసీర్ మరణం తర్వాత ఖాన్‌దేశ్ ప్రాబల్యం అతడి ఇద్దరి వారసుల బలహీనమైన పాలన వల్ల మరింత దిగజారింది. రెండవ ఆదిల్ ఖాన్ (1457-1503) సమర్థుడైన పాలకుడు కావడంతో గోంద్వానా, గఢ్-మండల హిందూ పాలకులపై తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు. ఫరూకీ వంశానికి చెందిన చివరి పాలకులు అసమర్థులు. చివరకు 1601లో ఖాన్‌దేశ్‌ను అక్బర్ తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు.

## మదురై వంశాలు :

**పాండ్యులు :** మాలిక్ కఫూర్ దండయాత్ర దోపిడీ, దహనం తప్ప మరొకటి కాదు. అయితే ఈ దాడి అనంతరం పాండ్య రాకుమారుల మధ్య జరిగిన వారసత్వ పోరు వారి పాలనను బలహీనపరిచింది. మిత్ర రాజ్యమైన హోయసల సహాయంతో వీర పాండ్య తన రాజ్య ప్రతిష్ఠను కొంత వరకు పునరుద్ధరించగలిగాడు. అయితే అతడి రాజ్యం అనతికాలంలోనే సవాళ్లను ఎదుర్కొంది. చివరి సవాలు 1323లో వచ్చింది. అపుడు ఔనాఖాన్ మదురై స్వాధీనం చేసుకున్నాడు. అయితే మదురై స్వాధీనమైనంత మాత్రాన పాండ్య వంశం పూర్తిగా పతనం కాలేదు. అనేక మంది పాండ్య రాజుల శిలాశాసనాలు, ముఖ్యంగా 1315-1411 కాలానికి సంబంధించిన శాసనాలు ఆధునిక తమిళనాడులోని వివిధ ప్రాంతాలలో బయటపడ్డాయి.

**మదురై సుల్తాన్లు :** తుగ్లక్ స్వాధీన ప్రాంతమైన మాబర్‌కు మదురై రాజధాని అయ్యింది. జలాలుద్దీన్ అహ్సాన్ షా (1334-40) అనే గవర్నరు మహమ్మద్ బిన్ తుగ్లక్ సమస్యల్లో

ఉండగా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడు. అతడి పాలనలో ముఖ్యఘటన మదురై రాజ్యాన్ని మొరాకో యాత్రికుడు ఇబ్న్ బట్టుట సందర్శించడమే. తర్వాతి సుల్తాను గియాసుద్దీన్ దమన్ షా (1340–44) ద్వారసముద్ర హోయసల పాలకుడు మూడవ వీర బల్లలను ఓడించి చంపాడు. అయితే ఈ విజయ ఫలాలు సుల్తాన్ కంటే విజయనగర పాలకునికే ఎక్కువ దక్కాయి. సమకాలీన చరిత్రకారుడు అఫీఫ్ ప్రకారం సుల్తాన్ హత్యకు గురికాగా అతడి రాజ్యం బికన్ (ఒకటవ బుక్క) అనే విజయనగర పాలకుని నియంత్రణలోకి వచ్చింది.

## లోఢీలు (1451-1526)

**బహ్‌లుల్ (1451–89) :** ఢిల్లీని స్వాధీనం చేసుకోవాలన్న షర్కీ సుల్తాన్ ప్రయత్నాన్ని బహ్‌లుల్ విజయవంతంగా అడ్డుకున్నాడు. ముల్తాన్ పాలకుడిని లొంగదీసుకున్నాడు. అయినా అతడు మరణించే సమయానికి లోఢీ సుల్తాను రాజ్యం పంజాబ్ నుండి బీహార్ సరిహద్దుల వరకు బలంగా పాతుకుపోయింది.

**సికందర్ (1489–1517) :** నిజాంఖాన్ సికందర్ అనే బిరుదును పొందాడు. జౌన్‌పూర్ పాలకుడు హుసేన్ షా షర్కీని అణగదొక్కాడు. పొరుగు ప్రాంతంలో రాజ్‌పుత్ర తిరుగుబాట్లను నీరుగార్చాడు. బీహార్‌ను కూడా స్వాధీనం చేసుకున్నాడు. 1506 నుండి 1517 వరకు సుల్తాన్ తన శక్తియుక్తులన్నింటిని గ్వాలియర్ రాజ్యాన్ని (తోమర్ పాలకుడు రాజా మాన్‌సింగ్) స్వాధీనం చేసుకోవడానికి ధారపోశాడు. అయితే కేవలం చందేరిని మాత్రమే స్వాధీనం చేసుకోగలిగాడు. గ్వాలియర్, మాల్వా రాజ్యాలు స్వతంత్రంగానే ఉండిపోయాయి. ఆఫ్ఘన్ తెగ నాయకులను దూరం చేసుకోకుండా సికందర్ సుల్తాన్ రాజ్య ప్రతిష్ఠను పెంచాడు. అతడు వ్యవసాయరంగ అభివృద్ధిలో కూడా ఎక్కువగా ఆసక్తి చూపాడు. అతడు గజ్–ఎ–సికందరీ అనే 32 అంకెల కొలమానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ పద్ధతిలో వ్యవసాయ భూములను కొలత వేశారు. అయితే ఈ వ్యవస్థను కేవలం ఖలీసా (ప్రభుత్వ) భూములకే పరిమితం చేశారు. అలాగే మార్కెట్ ధరలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాడు. మార్కెట్‌ను నియంత్రించడానికి అల్లావుద్దీన్ బలాన్ని ప్రయోగిస్తే సికందర్ మాత్రం బుజ్జగింపుల ద్వారా ఆ కార్యాన్ని పూర్తి చేశాడని చెబుతారు.

**ఇబ్రహీం (1517–26) :** సుల్తాన్ ఆధిపత్యాన్ని ఆదిలోనే పరిమితం చేయడానికి ఆఫ్ఘన్ నాయకులు నడుం బిగించాడు. తన సోదరుడు జలాల్‌ను జౌన్‌పూర్ ప్రాంతానికి స్వతంత్ర పాలకునిగా నియమించేలా వారు ఇబ్రహీంపై ఒత్తిడి తెచ్చారు. ఈ ఇద్దరు సోదరుల మధ్య అంతర్యుద్ధం మొదలై జలాల్ నిర్బంధం, హత్యతో ముగిసింది. ఈలోగా అంతర్యుద్ధం మేవార్ పాలకుడు రాణా సంగాకు మంచి అవకాశాన్ని అందించింది. అతడు లోఢీ నియంత్రిత ప్రాంతాలను ఆగ్రా సమీపంలోని బయానా వరకు స్వాధీనం చేసుకున్నాడు. ఈ ఆక్రమణను అవకాశంగా తీసుకొని లోఢి సంస్థానాధీశులు సుల్తాన్‌కు వ్యతిరేకంగా కుట్ర పన్ని భారతదేశంపై దండెత్త రావలసిందిగా బాబర్‌కు ఆహ్వానం పంపారు.

## పోర్చుగీసుల రాక

15వ శతాబ్దపు చివరి దశకాలలో వచ్చిన భౌగోళిక ఆవిష్కరణలు వివిధ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అలాగే ప్రపంచ చరిత్రలో

ముఖ్యమైన పర్యవసానాలకు దారి తీశాయి. వ్యాపారతత్వం, సాహస యాత్రల కారణంగా కొత్త ప్రాంతాలు, కొత్త మార్గాలను అన్వేషించగలిగారు. సుదూరపు భూభాగాలను కూడా అంతర్జాతీయ వాణిజ్యం పరిధిలోకి చేర్చారు. సముద్రయానాలను పోర్చుగీసు నావికులు చాలా ముందుగా చేపట్టారు. రాకుమారుడు హెన్రీ (ఇతడిని హెన్రీ, ది నావిగేటర్ అని పిలుస్తారు) పోర్చుగల్‌లో నౌకాయాన శిక్షణా కేంద్రాన్ని స్థాపించి ఆఫ్రికా, భారత దేశానికి ఎన్నో బృందాలను పంపాడు. బార్తోలోమ్యూ డయాజ్ 'కేప్ ఆఫ్ గుడ్‌హోప్'ను 1487లో చేరుకోగా, 17 మే 1498లో వాస్కోడగామా భారతదేశానికి కొత్త సముద్ర మార్గాన్ని కనుగొని ప్రముఖ ఓడరేవు కేంద్రమైన కాలికట్‌కు చేరుకున్నాడు.

కాలికట్‌పై అడుగుపెట్టిన వాస్కోడగామాకు అక్కడి పాలకుడు జమోరిన్ స్నేహపూర్వక స్వాగతం పలికాడు. వాస్కో సిఫార్సుపై అల్వరేజ్ కాబ్రెల్‌ను లిస్బన్ నుండి సముద్ర మార్గం ద్వారా భారతదేశానికి పంపారు. పోర్చుగీసులు చట్టబద్ధమైన వాణిజ్య కార్యకలాపాలకు పరిమితం కాకుండా తూర్పు జలాలపై ఆధిపత్యం సాధించాలని బలంగా ఆకాంక్షించారు. బలప్రయోగం ద్వారా ఇతర దేశాల వ్యాపారులను తూర్పు దేశాల నుండి వాణిజ్య ప్రయోజనాలు పొందకుండా అడ్డుకున్నారు. అలా వారు తొలుత అరబ్ వ్యాపారులను ఎదుర్కొన్నారు. తీర ప్రాంతంలో అరబ్ ఓడలను అడ్డుకున్నారు. ఈ పరిణామాలు కాలికట్ పాలకునికి ఆగ్రహం తెప్పించాయి. ఆ రాజ్య ఆదాయం చాలా వరకు అరబ్‌లతో వ్యాపారంపైనే ఆధారపడి ఉండేది. తమ వంతుగా పోర్చుగీసు వ్యాపారులు, అధికారులు రాజకీయ కుట్రలలో పాలుపంచుకోవడం మొదలుపెట్టారు. కాలికట్ పాలకుని శత్రువులతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. వీరి మిత్రులలో కొచిన్ పాలకుడు ముఖ్యమైనవాడు.

**పోర్చుగీసుల ప్రాబల్యం :** భారతదేశంలో పోర్చుగీసుల చరిత్రలో 1505 సంవత్సరం ఒక నూతన శకానికి నాంది పలికింది. తమ స్థానాన్ని పదిలం చేసుకోవడం కోసం పోర్చుగీసు రాజు నాలుగేళ్ల పదవీకాలంతో భారతదేశంలో గవర్నరును నియమించాలని నిర్ణయించుకున్నాడు. ఈ పదవికి ఫ్రాన్సిస్కో డ అల్మైడా నియమితుడయ్యాడు. ఖిల్వ, అంజిదివ, కణ్ణనూర్, కొచిన్‌లలో కోటలు నిర్మించాలనే స్పష్టమైన సూచనలతో రాజు అతడిని నియమించాడు. ద్వీప కల్పంలో ముస్లిం శక్తులతో సంఘర్షణలు అతడి పదవీ కాలంలో నిరంతరంగా కొనసాగాయి.

అయితే అల్మైడా భారత తీరప్రాంతంలో భూభాగాలను స్వాధీనం చేసుకోవడం కంటే నౌకాదళ సామర్థ్యాన్ని పెంచడంపైనే దృష్టి సారించాలని నిర్ణయించాడు. సముద్ర జలాలపై దృష్టి సారించాలనే అతడి విధానాన్ని బ్లూవాటర్ పాలసీ అంటారు. గవర్నరుగా తన పదవీకాలంలో సంభవించిన ప్రధాన ఘటన 1508లో ఈజిప్టు నౌకాదళం చేతిలో పోర్చుగీసులు ఓటమి పాలు కావడం. అయితే అతడు గోవా నుండి ఈజిప్టు దళాన్ని (1509లో) వెనక్కి పంపడంలో విజయం సాధించాడు.

అమిత సాహసాన్ని ప్రదర్శించిన అల్ఫోన్సో డ అల్బుకరేక్ (గవర్నరు) భారతదేశంపై పోర్చుగీసుల ప్రాబల్యానికి గట్టి పునాదులు వేశాడు. తన పూర్వపు అధికారుల వలె కాకుండా అతడు వాణిజ్య అవసరాల కోసం కొన్ని ముఖ్యమైన పట్టణాలను స్వాధీనం చేసుకోవాలని ఆకాంక్షించాడు. వాటినిప్రత్యక్షంగా పాలించాలని కోరుకున్నాడు. అలాగే స్థానికులతో వివాహ సంబంధాలను ప్రోత్సహించి కొన్నిఎంపిక చేసిన జిల్లాలను వలసవాద కేంద్రాలుగా మార్చాలని

భావించాడు. భారత భూభాగంపై కీలకమైన ప్రాంతాలలో కోటలను నిర్మించి పోర్చుగీసుల ప్రాబల్యాన్ని విస్తరించాలని అతడు ప్రణాళికలు సిద్ధం చేశాడు. చివరగా పోర్చుగల్, దాని చక్రవర్తి ప్రాబల్యాన్ని గుర్తించేలా అతడు స్థానికులను, ఇతర వ్యాపారులను లోబరచుకున్నాడు. 1510లో గోవాను స్వాధీనం చేసుకోవడంలో సఫలమయ్యాడు. ఈ ప్రాంతం తర్వాతి కాలంలో పోర్చుగీసులకు భారతదేశంలో ప్రధాన కేంద్రంగా మారింది.

అల్బుకరేక్ మరణం తర్వాత కూడా పోర్చుగీసుల ప్రాబల్యం పెరుగుతూ పోయింది. 1534లో హుమాయూన్ గుజరాత్ పాలకుడు బహదుర్ షాతో తలపడినపుడు షా బస్సీన్ ద్వీపాన్ని పోర్చుగీసులకు అప్పగించి వారి మద్దతును పొందాడు. అలాగే డయూలో పోర్చుగీసులను అడుగుపెట్టనిచ్చాడు. అదే సంవత్సరంలో వారు గోవాలో ఫ్యాక్టరీని స్థాపించేందుకు అనుమతి పొందారు. అల్బుకరేక్ వారసులు డయూ, దమన్, సల్సేట్, బస్సీన్, చౌల్, బొంబాయి (పశ్చిమ తీరం), సాన్‌టోమ్, హుగ్లీ (తూర్పు తీరం)లలో పోర్చుగీసు స్థావరాలెన్నింటినో స్థాపించారు.

పదహారవ శతాబ్దం మధ్యభాగంలో పోర్చుగీసులు ఆసియా దేశాల ఓడలు, నావలపై స్పష్టమైన ఆధిపత్యాన్ని సాధించారు. ప్రధాన భూభాగంపై ఎన్నో కీలక స్థావరాలను కైవసం చేసుకున్నారు. వాణిజ్య, రవాణా కార్యకలాపాలను ఈ స్థావరాల నుండి నియంత్రించారు. దీనికి అంతర్జాతీయ వాణిజ్యంలో స్పైస్ ఐలాండ్స్, పర్షియన్ తీర ప్రాంతాల కలయిక తోడైంది. ఈ ప్రాంతాలపై పోర్చుగీసులు అమితాసక్తిని ప్రదర్శించారు. 1515లో వారు ఆర్మూజ్, మలక్కాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ విధంగా వారు పర్షియన్ ఎడారి, స్పైస్ ఐలాండ్స్, భారతదేశాలలో త్రైపాక్షిక వాణిజ్యాన్ని ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు.

పోర్చుగీసు నావికా దళం 'ఎస్టాడో ద ఇండియా' అనే పేరును సంతరించుకుంది. ఉపఖండం విదేశీ వాణిజ్యం విషయానికి వస్తే పోర్చుగీసు కంపెనీ ఆకాంక్షలు, కార్యకలాపాలు ఎన్నో వ్యవస్థాగత ఆవిష్కరణలకు ప్రాతినిధ్యం వహించాయి. ముఖ్యమైన వ్యాపార వస్తువులు, మిరియాలు, ఇతర మసాలా దినుసులపై పోర్చుగీసు రాజ్య గుత్తాధిపత్యాన్ని సంపూర్ణంగా ప్రవేశపెట్టారు. 1506 నుండి డామ్ మాన్యుయెల్ లిస్బన్ మసాలా దినుసుల వ్యాపారాన్ని పోర్చుగీసు పాలకుని గుత్తాధిపత్యంగా మార్చివేశాడు.

భారతదేశంలో పోర్చుగీసులు ఒక నూతన సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. సముద్ర మార్గాలను సంపూర్ణంగా నియంత్రించే హక్కును, భారత రాజ్యాలు, ఆసియా సామ్రాజ్యాల సముద్ర వాణిజ్యాన్ని నియంత్రించే హక్కును తమకే ఇవ్వాలని వాదించారు. ఆసియా శక్తుల బలహీనమైన నావికా దళాలు పోర్చుగీసు విధానాలకు ఎంతో సహకరించాయి. ఈ ప్రక్రియలో వారు నౌకాదళ ఆధిపత్యాన్ని సంపాదించుకున్నారు. అలాగే వ్యాపార, ప్రయాణ సంరక్షణ స్థాయిని ప్రవేశపెట్టారు. ఒకవైపు ఆసియా వ్యాపారులు, ఓడల నుండి కప్పం డిమాండ్ చేస్తే మరో వైపు ఐరోపాతో ప్రత్యక్ష వాణిజ్య నిర్వహణకు (భూ మార్గాన) రక్షణ వ్యయాన్ని చెల్లించారు. తొలి అంశంలో వారు పాసుల విధానాన్ని అమలు చేశారు. తమకు సంబంధం లేని దేశాలకు సరుకులను తరలించే భారతీయ,ఇతర ఆసియా దేశాల ఓడలు పోర్చుగీసు వైస్రాయ్ (గోవా) నుండి అనుమతి పత్రాలను పొందాలని నిబంధన విధించారు. రవాణాకు సిద్ధంగా ఉన్న ఉత్పత్తులను జప్తు చేయకుండా ఉండాలంటే ఈ అనుమతి పత్రాలను తప్పని సరిగా పొందాల్సి

ఉంటుందని తేల్చిచెప్పారు. ఈ అధికారం పోర్చుగీసులకు ఆసియా సముద్ర జలాలపై పాక్షిక రాజకీయ నియంత్రణను అందించింది.

**పోర్చుగీసుల పతనం :** సుమారు వందేళ్లపాటు 'ఎస్టాడో ద ఇండియా' భారత వాణిజ్యంపై గుత్తాధిపత్యాన్ని చెలాయించింది. అయితే అనతి కాలంలోనే ఇతర ఐరోపా దేశాల విశాలమైన, ప్రత్యక్ష వ్యాపార భాగస్వామ్యం కారణంగా సవాళ్లను ఎదుర్కొంది. భారతదేశంలో పోర్చుగీసుల ప్రాబల్యం క్షీణించడానికి అనేక కారణాలను గుర్తించారు. ఐరోపా కోణం నుండి పరిశీలిస్తే పోర్చుగల్ స్పెయిన్‌లో అంతర్భాగమైంది. అపుడు స్పెయిన్ రాజుగా రెండవ ఫిలిప్ ఉన్నాడు.

భారతదేశంలో పోర్చుగల్ ప్రయోజనాలను కాపాడేందుకు స్పెయిన్ ఏ మాత్రం ఆసక్తి చూపలేదు. ఫలితంగా పోర్చుగీసులు ఈస్ట్ ఇండీస్‌లో ఎన్నో స్థావరాలను కోల్పోయారు. డచ్ వ్యాపారులు వారిని అంబోయినా నుండి తరిమివేశారు. అలాగే 1640లో మలక్కా, 1656లో సిలోన్‌లను డచ్‌లు స్వాధీనం చేసుకున్నారు. 1662లో ఆర్మూజ్‌ను ఇరాన్ హస్తగతం చేసుకుంది.

చిన్న దేశం కావడంతో పోర్చుగల్ తన సుదూర వాణిజ్యాన్ని ఎల్లకాలం కొనసాగించడంలో విఫలమైంది. భారతదేశం, తదితర ప్రాంతాలలో దక్కించుకున్న విశాలమైన స్థావరాలను శాశ్వతంగా నియంత్రించేందుకు తగిన వనరులు ఆ దేశానికి లేకపోయాయి. వాస్తవానికి హిందూ మహాసముద్రం, బ్రెజిల్‌లలో ఆర్జించిన ఆదాయాన్ని తన స్వంత అవసరాల కోసం వ్యయం చేయాల్సి వచ్చింది. పోర్చుగల్ రాచరిక ఆస్థానం నియంతృత్వ వైఖరి అవలంబించడంతో అక్కడి వ్యాపారులకు కనీస స్థాయిలో కూడా రాజకీయ ప్రాబల్యం దక్కలేదు. వారు ఎంతో సంపన్నమైన ఇంగ్లాండ్, హాలెండ్ లాంటి దేశాలతో పోటీ పడలేకపోయారు.

ఐరోపాలో ఇలాంటి పరిస్థితి ఉంటే భారతదేశంలో కూడా పోర్చుగీసుల పరిస్థితి అంత సంతృప్తికరంగా ఉండేది కాదు. భారత వాణిజ్యం నుండి వారు భారీ ఆదాయాన్ని సమకూర్చుకున్నప్పటికీ వారి విధానాలు దీర్ఘకాలంలో ప్రతికూల పరిస్థితులను సృష్టించాయి. పోర్చుగీసులు అవలంబించిన మత విధానం అందులో ముఖ్యమైనది. మత వ్యవహారాల్లో వారు సనాతనవాదాన్ని ప్రదర్శించారు. ఇతర మతాలపట్ల సహనం పాటించలేకపోయారు. బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారు. 'క్రైస్తవం లేదా ఖడ్గం' అనే ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు ఉంచారు. బలవంతపు మార్పిడులు మెస్టికోలు అనే కొత్త జాతి ప్రజలను సృష్టించాయి. యూరోపియన్లు, భారతీయులకు పుట్టిన సంతానం వీరు.

17వ శతాబ్దంలో డచ్, ఆంగ్లేయుల ప్రాబల్యం పెరగడంతో భారతదేశంలో పోర్చుగీసుల నియంత్రణకు తెరపడిందని చెప్పవచ్చు. పోర్చుగీసు కంపెనీకి భిన్నంగా ఈ కంపెనీలు జాతీయ సంస్థలు. ఉమ్మడి వాటాల ఆధారంగా అవి ఏర్పడ్డాయి. సముద్ర ఎగువ జలాలలో కూడా డచ్, ఇంగ్లాండ్ ఓడలు పోర్చుగీసు ఓడల కంటే ఉన్నతంగా ఉండేవి.

5

# మొగల్ సామ్రాజ్యం

## బాబర్

**నేపథ్యం :**

14వ శతాబ్దంలో మంగోలు సామ్రాజ్యం చీలిపోయిన తర్వాత తైమూర్ ఇరాన్, తురాన్‌లను మరోసారి సమైక్యపరిచాడు. ఏక పాలనను స్థాపించాడు. 1404లో తైమూర్ మరణించినా అతడి మనవడు షారుఖ్ మిర్జా తన సామ్రాజ్యంలోని విశాల భాగాన్ని నిలుపుకోవడంలో సఫలమయ్యాడు. అయితే తైమూరిద్‌ల ప్రాబల్యం వేగంగా క్షీణించింది. తైమూరిద్ రాజ్యాల మధ్య 15వ శతాబ్దం మలి భాగంలో జరిగిన అంతర్యుద్ధాలే అందుకు కారణం. ఈ పరిస్థితి రెండు కొత్త శక్తుల ఆగమనానికి బాటలు వేసింది. ఉత్తర దిశ నుండి మంగోలు తెగ అయిన ఉజ్బేక్‌లు ఆక్సియానా నదిని దాటుకొని ముందుకు వచ్చారు. ఉజ్బేక్‌లు ముస్లింలుగా మారి ఉన్నారు. అయితే వారిని తైమూరిద్‌లు చిన్న చూపు చూశారు. వారిని ఆటవికులుగా పరిగణించారు. పశ్చిమంలో సఫావిద్‌ల వంశం (ఇది కొత్త వంశం) ఇరాన్‌ను నియంత్రించడం ప్రారంభించింది. సఫావిద్‌లు షియా తెగకు చెందిన వారు. ఇతర తెగల ముస్లింలను వేటాడడం మొదలుపెట్టారు. మరోవైపు ఉజ్బేక్‌లు సున్నీ వర్గానికి చెందిన వారు. ఆ విధంగా ఈ రెండు శక్తుల మధ్య రాజకీయ ఘర్షణ మత వైషమ్యాల రంగును సంతరించుకుంది. ఇరాన్‌కు పశ్చిమాన ఒట్టోమన్ తుర్కుల ప్రాబల్యం విస్తరించసాగింది. వారు తూర్పు ఐరోపాతోపాటు ఇరాన్, ఇరాక్‌లను కూడా స్వాధీనం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఆ విధంగా 16వ శతాబ్దంలో ఈ మూడు మహాసామ్రాజ్యాల మధ్య సంఘర్షణకు రంగం సిద్ధమైంది.

1494లో ట్రాన్స్-ఆక్సియానా ప్రాంతంలోని ఫర్ఘన అనే చిన్న రాజ్యానికి బాబర్ పాలకుడయ్యాడు. ఉజ్బేక్‌ల నుండి పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టని తైమూరిద్ రాజకుమారులు తమలో తాము కలహించుకోవడంలో నిమగ్నమయ్యారు. బాబర్ కూడా తన మామ నుండి సమర్‌ఖండ్‌ను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించాడు.ఆ నగరాన్ని రెండుసార్లు హస్తగతం చేసుకున్నా రెండు సందర్భాల్లో తన పట్టును స్వల్ప కాలంలోనే కోల్పోయాడు. బాబర్ రెండవసారి

దండెత్తినపుడు అతడిని నిలువరించేందుకు ఉజ్బేక్ నాయకుడు షైబానీఖాన్‌ను రప్పించారు. ఖాన్ బాబర్‌ను ఓడించాడు, కాబుల్ వైపు ఉపసంహరించుకునేలా ఒత్తిడి పెంచాడు. కాబుల్ నగరాన్ని 1504లో బాబర్ స్వాధీనం చేసుకున్నాడు. తర్వాతి 14 ఏళ్ల వరకు అతడు తన మాతృభూమిని ఉజ్బేక్‌ల నుండి దక్కించుకోవడానికి అవకాశం కోసం వేచి చూశాడు. సమర్‌ఖండ్‌ను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు మరో ప్రయత్నం చేశాడు. ఈసారి ఇరానీ బలగాల సహాయం తీసుకున్నాడు.

అతడిని సమర్‌ఖండ్ పీఠంపై కూర్చోబెట్టినా ఇరానీ సేనాపతులు రాజ్య వ్యవహారాలను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఈలోగా పరాజయం నుండి త్వరగా కోలుకున్న ఉజ్బేక్‌లు మరోసారి బాబర్‌ను సమర్‌ఖండ్ నుండి తరిమికొట్టారు. బాబర్ మరోసారి కాబుల్‌కు తిరిగి వచ్చాడు. చివరగా ఇరాన్ షా (రాజు) షా ఇస్మాయిల్ స్వయంగా ఒక చారిత్రాత్మక యుద్ధంలో ఓడిపోయాడు. ఒట్టోమన్ సుల్తాన్ అతడి సైన్యాలను తుదముట్టించాడు. దీంతో ట్రాన్స్ – ఆక్సియానాపై ఉజ్బేక్‌లకు సంపూర్ణ నియంత్రణ దక్కింది. ఈ పరిణామాలన్నీ చివరకు భారతదేశం వైపు దృష్టిసారించేలా బాబర్‌ను ప్రభావితం చేశాయి.

బాబర్ కాబుల్, కాందహార్, బదఖ్షాన్ ప్రాంతాలపై పాలన సాగించినా తన సైనిక వ్యయానికి తగిన వనరులను సమకూర్చుకోలేకపోయాడు. నిజానికి కొన్ని సరిహద్దు ప్రాంతాలలో సైనిక నిర్వహణ, పాలనా వ్యయం ఆదాయం కంటే ఎక్కువగా ఉండేది. ఈ పరిమిత వనరులతో బాబర్ తన బేగ్‌లు, కుటుంబ సభ్యులకు సరైన వసతులను సమకూర్చలేకపోయాడు. అలాగే కాబుల్‌పై ఉజ్బేక్‌లు దాడి చేస్తారన్న ఆందోళన కూడా ఉండేది. భారతదేశం సురక్షిత ప్రాంతంగా ఉండగలదని, అక్కడి నుండి ఉజ్బేక్‌లకు వ్యతిరేకంగా సైనిక దాడులను కొనసాగించవచ్చని బాబర్ ఒక నిర్ధారణకు వచ్చాడు.

**భారతదేశంపై దండయాత్ర :**

1518–19లో ఒక విఫలయత్నం తర్వాత బాబర్ మరోసారి 1520–21లో సింధూ నదిని దాటి వచ్చాడు. భారతదేశానికి ద్వంద్వ ద్వారాలుగా ఉన్న భిరా, సియాల్కోట్‌లను సునాయసంగా స్వాధీనం చేసుకున్నాడు. లాహోర్ మరోసారి అతడి నియంత్రణలోకి వచ్చింది. కందహార్‌లో తిరుగుబాటు వచ్చిందని సమాచారం అందకుండా ఉండి ఉన్నట్లయితే అతడు ఇంకా ముందుకు కదిలేవాడే. ఈ సమయంలోనే పంజాబ్ గవర్నర్ దౌలత్ ఖాన్ నుండి అతడికి రాయబారం అందింది. భారతదేశంపై దాడి చేసి ఇబ్రహీం లోధిని తప్పించాలని దౌలత్ ఖాన్ బాబర్‌ను ఆహ్వానించాడు. అదే సమయంలో మేవార్ రాణా సంగా నుండి కూడా బాబర్‌కు వర్తమానం అంది ఉండొచ్చు. మొత్తం భారతదేశాన్ని కాకున్నా కనీసం పంజాబ్ ప్రాంతాన్ని ఆక్రమించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని రాణా సూచించి ఉంటాడు. 1525లో పెషావర్ వద్ద ఉన్నప్పుడు దౌలత్‌ఖాన్ తన విధేయతను మరోసారి మార్చుకొని

మొగల్ సైనికులను సియాల్కోట్ నుండి తరిమి వేశాడని, ఇప్పుడు లాహోర్‌పై దండెత్తడానికి బయల్దేరాడన్న సమాచారాన్ని బాబర్ అందుకున్నాడు.

అయితే బాబర్ తన విస్తారమైన సైన్యంతో ఎదురుపడగానే దౌలత్ ఖాన్ సైన్యం చెల్లాచెదురైంది. దౌలత్ ఖాన్ లొంగిపోవడంతో బాబర్ అతడిని క్షమించాడు. ఆ విధంగా కేవలం మూడు వారాల వ్యవధిలోనే బాబర్ పంజాబ్ విధాతగా మారాడు.

ఢిల్లీ పాలకుడు సికందర్ లోఢితో పోరు అనివార్యమైంది. బాబర్ అందుకు సిద్ధమై ఢిల్లీవైపు కదిలాడు. 1526లో తొలి పానిపట్ యుద్ధం జరిగింది. ఇబ్రహీం ఇక్కడ బాబర్‌ను పెద్ద సైన్యంతో తలపడ్డాడు. పానిపట్ నగరంలో ఒక సైనిక బలగాన్ని విడచి వెళ్లడం ద్వారా బాబర్ తన అవకాశాలను మెరుగుపరచుకున్నాడు. గోతులు తవ్వి వాటిని చెట్లు మొక్కలతో కప్పడం ద్వారా రక్షణ చర్యలను పటిష్టం చేసుకున్నాడు. యుద్ధరంగంలో ముందుండి తన సైన్యాన్ని నడిపించాడు. రక్షణ కవచాలు అమర్చిన రథాలతో ముందుకు దూసుకుపోయాడు. ఈ కవచాలపై సైనికులు తమ తుపాకులను ఉంచి మందుగుండును పేల్చే సౌకర్యం ఉండేది. ఈ పరికరాన్ని బాబర్ ఒట్టోమన్ లేదా రూమి పరికరమని పిలిచాడు. దీనిని ఒట్టోమన్లు ఇరాన్ షా ఇస్మాయిల్‌తో జరిగిన చారిత్రక యుద్ధంలో సమర్థవంతంగా ఉపయోగించారు. బాబర్ ఇద్దరు ఒట్టోమన్ సైనిక నిపుణుల సేవలను కూడా వినియోగించుకున్నాడు. వీరు మందుగుండును పేల్చడంలో ఆరితేరిన వారు. బాబర్ ఏర్పాటు చేసుకున్న ప్రబలమైన రక్షణ చర్యలపై ఇబ్రహీం లోఢికి ఎలాంటి అంచనా ఉండేది కాదు. సాధారణంగా మధ్య ఆసియా సైన్యాలు పాటించే సాంప్రదాయ సంచార యుద్ధాన్నే బాబర్ సైన్యాలు కూడా అనుసరిస్తాయని అతడు భావించి ఉంటాడు. అవసరం బట్టి వేగంగా ముందుకు దూసుకెళ్లడమో లేదా అంతే వేగంగా ఉపసంహరించుకోవడమో మధ్య ఆసియా సైన్యాల వ్యూహంగా ఉండేది. సుమారు ఏడెనిమిది రోజుల పోరాటం తర్వాత ఇబ్రహీం సైన్యాలు ఘోరమైన యుద్ధం కోసం బయటికి వచ్చాయి. బాబర్ సైనిక శక్తిని చూసి లోఢి సైన్యాలు తొలుత సంశయించాయి. ఇబ్రహీం తన బలగాలను పునఃసమీకరిస్తుండగా బాబర్ సైన్యంలోని రెండు చిట్ట చివరి దళాలు ఇబ్రహీంసైన్యాలను ఒకపక్క నుండి, వెనుక నుండి ముట్టడించాయి. బాబర్ ఫిరంగిదళం ముందు నుండి తమ ఫిరంగులను సమర్థవంతంగా ఉపయోగించింది. ఆశ్చర్యమేమిటంటే బాబర్ తన స్మృతుల్లో ఇబ్రహీం గజదళం గురించి ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. ఇబ్రహీంకు ఆ దళాన్ని రంగంలో దించే అవకాశమే లభించలేదని దీనిని బట్టి అర్థమవుతుంది.

భారతదేశ చరిత్రలో తొలి పానిపట్ యుద్ధాన్ని అత్యంత నిర్ణయాత్మక యుద్ధాలలో ఒకటిగా పరిగణిస్తారు. అది లోఢి అధికారం నడ్డి విరిచింది. ఢిల్లీ, ఆగ్రా వరకు విస్తరించి ఉన్న ఉత్తర భారత భూభాగమంతా బాబర్ నియంత్రణలోకి వచ్చింది. ఇబ్రహీం ఆగ్రాలో దాచి పెట్టిన ఖజానాలు బాబర్‌కు ఆర్థిక సమస్యల నుండి ఊరట కలిగించాయి. జౌన్‌పూర్ వరకు విస్తరించి ఉన్న సారవంతమైన, సంపన్నమైన ప్రాంతం కూడా బాబర్‌కు చేరువలో ఉండింది. అయితే బాబర్ రెండు యుద్ధాలను చేపట్టాల్సి వచ్చింది. ఒకటి మేవార్ రాణా సంగాపై, రెండోది తూర్పు ప్రాంత ఆఫ్ఘన్లపై. ఆ తర్వాతే అతడు ఈ ప్రాంతంపై తన ఆధిపత్యాన్ని

స్థాపించగలిగాడు. పానిపట్ యుద్ధంలో విజయం సాధించిన తర్వాత బాబర్ బహుముఖ సమస్యలను ఎదుర్కొన్నాడు. భారతదేశంలో సుదీర్ఘ పోరాటానికి అతడి బేగ్‌లు సంసిద్ధంగా లేరు. వేసవి ముంచుకురావడంతో వారి సందేహాలు మరింత పెరిగాయి. అయితే విశాలమైన సామ్రాజ్యం స్థాపించాలంటే భారతదేశమొక్కటే వనరులను సమకూర్చగలదని బాబర్‌కు తెలుసు. ఇక్కడి సంపదతో తన బేగ్‌లను సంతృప్తి పరచవచ్చని భావించాడు. అందుకే అతడో గట్టి నిర్ణయాన్ని తీసుకున్నాడు. భారతదేశంలోనే కొనసాగాలన్న తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా తేల్చిచెప్పాడు. కాబుల్‌కు తిరిగి వెళ్లదలచిన బేగ్‌లకు సెలవు మంజూరు చేశాడు. దీంతో సమస్యలన్నీ సమసిపోయాయి.

తనతో తాడోపేడో తేల్చుకోవాలని సిద్ధమైన రాణా సంగాను బాబర్ యుద్ధానికి ఆహ్వానించాడు. గంగా లోయలో ఒక బలమైన సామ్రాజ్యాన్ని బాబర్ స్థాపించడం రాణాకు ముప్పుగా పరిణమించింది. అతడు కూడా ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని యోచించాడు. మరోవైపు రాణా తమ ఒప్పందాన్ని ఉల్లంఘించాడని బాబర్ నిందించాడు. సంగా తనను భారతదేశానికి ఆహ్వానించాడని, ఇబ్రహీంకు వ్యతిరేకంగా చేపట్టే యుద్ధంలో తనకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చాడని, అయితే తాను ఢిల్లీ, ఆగ్రాలను స్వాధీనం చేసుకున్నా అతడు ఎలాంటి చర్య తీసుకోలేదని బాబర్ చెప్పాడు. ఇబ్రహీం సోదరుడు మహమ్మద్ లోఢితోపాటు అనేక మంది ఆఫ్ఘన్లు సంగా చుట్టూ చేరారు. ఒక వేళ సంగా విజయం సాధిస్తే ఢిల్లీ గద్దెను తిరిగి దక్కించుకోవచ్చనే ఆశతో వారు సంగాకు మద్దతునిచ్చారు. కొంత ప్రాబల్యం ఉన్న రాజపుత్ర పాలకులందరూ రాణాకు మద్దతుగా సైన్యాలను పంపారు. రాణా ఖ్యాతి, బయానా లాంటి సరిహద్దు మొగల్ స్థావరాలపై అతడు సాధించిన తొలి విజయాలు బాబర్ సైనికులను ఆందోళనకు గురి చేశాయి. వారి మనోస్థైర్యం దెబ్బతింది.

సైనికులను ఉత్తేజపరచడానికి బాబర్ సంగాతో యుద్ధాన్ని జిహాద్‌గా (పవిత్ర యుద్ధం) ప్రకటించాడు. యుద్ధానికి ముందు అతడు మద్యపాన పాత్రలను ఒలకబోయించాడు. మద్యపాన సీసాలను ధ్వంసం చేసి తాను పవిత్రమైన మహమ్మదీయుడినని నిరూపించజూపాడు. తన ఆధీనంలోని ప్రాంతాలన్నింటిలో మద్యం క్రయవిక్రయాలను నిషేధించాడు. ముస్లింలపై కస్టమ్ సుంకాలను రద్దు చేశాడు.

ఖాన్వా యుద్ధం (1527) భీకరంగా సాగింది. ఈ యుద్ధంలో కూడా బాబర్ సైన్యాలు సంఖ్యాపరంగా సంగా నేతృత్వంలోని సంకీర్ణ సైన్యాలకు అధమ స్థాయిలో ఉన్నా బాబర్ యుద్ధ వ్యూహాలు, సాంకేతిక పరిజ్ఞానం సంగా కంటే ఉన్నతంగా ఉండేవి. బాబర్ ఎడమ వైపు దళాలపై సంగా తీవ్రమైన దాడులు చేసి ఆ రక్షణ వలయాన్ని ఛేదించినంత పని చేశాడు. అయితే మొగల్ ఫిరంగులు, తుపాకులు భారీ ప్రాణ నష్టాన్ని కలిగించాయి. సంగా సైన్యాలు క్రమంగా వెనక్కు నెట్టబడ్డాయి. ఈ దశలో బాబర్ కేంద్ర స్థానంలో ఉన్న తన సైనికులను ఎదురు దాడికి దిగాలని ఆదేశించాడు. ఫిరంగులు వారి వెంట కదిలాయి. అలా సంగా సైన్యాలపై వారు అల్లుకుపోయారు. భారీ ఊచకోత తర్వాత సంగా సైన్యాలు ఓడిపోయాయి. సంగా తప్పించుకున్నాడు. బాబర్‌తో మళ్లీ యుద్ధం చేయడానికి సన్నాహాలు ప్రారంభించాడు.

అయితే అతడిని స్వంత రాచరిక వంశీయులే విషం ఇచ్చి చంపారు. రాణా చర్యలు ప్రమాదకరమైనవని, ఆత్మహత్యా సదృశ్యమని ఈ పాలక వంశీయులు భావించే అతడిని అంతమొందించారు. ఆ విధంగా రాజస్థాన్ అందించిన గొప్ప యోధుడు మరణించాడు. అతడి మరణంతో ఆగ్రా వరకు సరిహద్దులతో కూడిన సమైక్య రాజస్థాన్ రాజ్యాన్ని ఏర్పాటు చేయాలన్న ఆకాంక్షకు తీవ్ర విఘాతం కలిగింది.

ఢిల్లీ–ఆగ్రా ప్రాంతంలో ఖాన్వా యుద్ధం తర్వాత బాబర్ పట్టు మరింత బలపడింది. ఆగ్రాకు తూర్పున ఉన్న కోటలను వరుసగా స్వాధీనం చేసుకొని బాబర్ తన ప్రాబల్యాన్ని మరింత విస్తరించాడు. అలాగే హసన్‌ఖాన్ మేవాతి నుండి అళ్వార్ రాజ్యంలోని ప్రధాన భూభాగాలను ఆక్రమించాడు. తర్వాత మాల్వాలో చందేరికి చెందిన మేదిని రాయ్‌పై సైనిక చర్యకు నాయకత్వం వహించాడు. రాజపుత్ యోధులు చివరికంటా పోరాడారు. వారి మహిళలు జౌహర్‌ను పాటించారు (ఉమ్మడి సతి). చందేరి బాబర్ వశమైంది. ఈ ప్రాంతంలో తదుపరి చర్యలను బాబర్ నిలిపివేశాడు. కారణం తూర్పు ఉత్తర ప్రదేశ్‌లో ఆఫ్ఘన్ల కార్యకలాపాలు పెరిగిపోవడమే. ఆఫ్ఘన్ల గతంలో ఓడినా వారు మొగల్ పాలనను మాత్రం అంగీకరించడానికి సిద్ధపడలేదు. తూర్పు ఉత్తరప్రదేశ్ అప్పటికీ ఆఫ్ఘన్ నాయకుల ఆధీనంలో ఉండేది. వారు తమ విధేయతను ఇబ్రహీం లోధి సోదరుడు మహ్మద్ లోధికి ప్రకటించారు. లోధి బీహార్‌కు చేరుకున్న తర్వాత ఆఫ్ఘన్లు అతడిని తమ నాయకునిగా ఎన్నుకున్నారు. అతడి నాయకత్వంలో తగిన సైనిక బలాన్ని సమకూర్చుకున్నారు.

ఈ ప్రమాదాన్ని బాబర్ ఏ మాత్రం విస్మరించలేకపోయాడు. అందుకే 1529 తొలినాళ్లలో ఆగ్రాకు బయల్దేరాడు. బెనారస్ వద్ద గంగానదిని దాటిన తర్వాత అతడు ఆఫ్ఘన్లు, బెంగాల్ నస్రత్‌షాల ఉమ్మడి సైన్యాలను ఎదుర్కొన్నాడు. శత్రు సైన్యాలు వెనక్కి తగ్గేలా ఒత్తిడి తీసుకురాగలిగినప్పటికీ బాబర్ ఎలాంటి నిర్ణయాత్మక విజయాన్ని సాధించలేకపోయాడు. మధ్య ఆసియాలో రాజకీయ,సైనిక పరిణామాలపై ఆందోళనతో బాబర్ ఆఫ్ఘన్లతో ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించాడు. బీహార్‌పై ఆధిపత్యానికి లోపభూయిష్టమైన హక్కును ముందుకు తెచ్చాడు కాని ఆ రాజ్యాన్ని చాలా వరకు ఆఫ్ఘన్లకే వదిలి వెళ్లాడు. ఆ తర్వాత ఆగ్రాకు తిరిగి చేరుకున్నాడు. కొంత కాలం తర్వాత కాబుల్‌కు ప్రయాణిస్తూ మార్గమధ్యంలో లాహోర్ వద్ద బాబర్ మరణించాడు. తన సైనిక జీవితాన్ని అలా ముగించాడు. బాబర్ భారత ఆగమనానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. అతడు కొత్త రాజ్య సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. సింహాసన బలం, ప్రతిష్ట ఆధారంగా రాజ్యం ఉండాలని, మత, వర్గ వైషమ్యాలకు తావివ్వరాదని, సంస్కృతిక–కళలను జాగ్రత్తగా పోషించాలని అతడు ప్రతిపాదించాడు.

## హుమాయూన్

**ఆరంభ సమస్యలు :** తన 30వ ఏట 1530లో హుమాయూన్ బాబర్ వారుసునిగా పీఠం ఎక్కాడు. బాబర్ వదలి వెళ్లిన లెక్కలేనన్ని సమస్యలను అతడు ఎదుర్కోవలసి వచ్చింది. పరిపాలనా అప్పటికీ బలపడలేదు. వనరులు నామమాత్రంగానే ఉన్నాయి. ఆఫ్ఘన్లు పూర్తిగా అణచివేయబడలేదు. భారతదేశం నుండి మొగల్ పాలకులను తరిమి కొట్టాలనే కృతనిశ్చయంతో

వారు ఉన్నారు. చివరగా సోదరుల మధ్య సామ్రాజ్యాన్ని పంచే తైమూరిద్ సాంప్రదాయం కూడా ఒకటి ఉండేది. సోదరులను బాగా చూసుకోవాలని బాబర్ హుమాయూన్‌కు సలహా ఇచ్చాడు కాని శైశవ దశలో మొగల్ సామ్రాజ్యాన్ని విభజించాలని మాత్రం కోరలేదు. అలా చేసినట్లయితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదని బాబర్‌కు తెలుసు.

హుమాయూన్ సింహాసనాన్ని అధిష్టించే సమయంలో మొగల్ సామ్రాజ్యంలో కాబుల్, కాందహార్ అంతర్భాగంగా ఉండేవి. అలాగే బదఖ్‌షాన్‌పై పాక్షిక నియంత్రణ ఉండేది. కాబుల్, కాందహార్ నగరాలు హుమాయున్ సోదరుడు కమ్రన్ ప్రత్యక్ష నియంత్రణలో ఉండేవి. అయితే వెనుకబడిన ప్రాంతాలైన ఈ నగరాలతో అతడు సంతృప్తి చెందలేదు. అందుకే లాహోర్, ముల్తాన్‌లపై దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్నాడు. అంతర్యుద్ధాన్ని ఎట్టి పరిస్థితుల్లో ప్రారంభించకూడదని భావించిన హుమాయూన్ మరో దారి లేక కమ్రన్ ఆధిపత్యాన్ని అంగీకరించాడు. అందుకు బదులుగా హుమాయూన్ నాయకత్వాన్ని కమ్రన్ గుర్తించాడు. అవసరమైనప్పుడు సైనిక సహకారం అందిస్తానని హామీ ఇచ్చాడు.

ఈ అంతర్గత సమస్యలతోపాటు తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ఆఫ్ఘన్ల ప్రాబల్యాన్ని కూడా హుమాయూన్ ఎదుర్కోవలసి వచ్చింది. గుజరాత్ పాలకుడు బహదుర్ షా నుండి కూడా ఆగ్రా ప్రాంతానికి ముప్పు ఏర్పడింది. ఈ రెండు సవాళ్లలో మొదటి దానినే హుమాయూన్ తొలుత స్వీకరించాడు. 1532లో దౌరా అనే ప్రాంతంలో అతడు ఆఫ్ఘన్ సైన్యాలను ఓడించాడు. తూర్పు ఉత్తర ప్రదేశ్‌లోని జౌన్‌పూర్ రాజ్యాన్ని బలహీనపరిచాడు. ఈ విజయం తర్వాత అతడు చునార్ కోటను స్వాధీనం చేసుకున్నాడు. ఆగ్రా, తూర్పు రాజ్యాల మధ్య భూ, నదీ మార్గాలను ఈ కోట నియంత్రించేది. తూర్పు భారతదేశానికి అది ప్రధాన ద్వారంగా ఉండేది.

ఆ కోటను అప్పటికి షేర్ ఖాన్ అనే ఆఫ్ఘన్ నాయకుడు ఆక్రమించి ఉన్నాడు. అతడు ఆఫ్ఘన్ సర్దార్లలో అత్యంత శక్తిమంతునిగా ఎదిగి ఉన్నాడు. చునార్ ముట్టడి నాలుగు నెలలపాటు కొనసాగిన తర్వాత కోటను తనకు వదిలివేయాలని షేర్‌ఖాన్ హుమాయూన్‌ను వేడుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా మొగల్ పాలకులకు విధేయునిగా ఉంటానని వాగ్దానం చేశాడు. తన కుమారులలో ఒకరిని హుమాయూన్‌తోపాటు బందీగా పంపాడు. గుజరాత్ బహదుర్ షా ప్రాబల్యం, ఆగ్రా సమీపంలో అతడి కార్యకలాపాలు హుమాయూన్‌ను కలవరపరిచాయి. చునార్ ముట్టడిని మరో నాయకునితో కొనసాగించరాదని నిర్ణయించాడు. అలా చేస్తే సైన్యాన్ని విభజించినట్లవుతుందని భావించాడు.

**గుజరాత్‌పై సైనిక ఉద్యమం :** బహదుర్ షా సమర్థుడైన, రాజ్యకాంక్ష కలిగిన పాలకుడు. అతడు మాల్వాను ఆక్రమించి ఉన్నాడు. తర్వాత రాజస్థాన్‌పై దృష్టి సారించి చిత్తోర్‌ను ముట్టడించాడు. అయితే పరిస్థితిని అంచనా వేయడానికి హుమాయూన్ గ్వాలియర్‌లో పాగా వేసినపుడు బహదుర్ షా మొగల్‌ల జోక్యానికి జడిసి రాణాతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. చిత్తోర్ కోటను రాణాకు వదలివేశాడు. అయితే బహదుర్ షా సంయమనం పాటించలేకపోయాడు. తన దర్బారులో లోధి సంబంధీకులకు ఆశ్రయం కల్పించడంతోనే

సంతృప్తి చెందని షా హుమాయూన్ దగ్గరి బంధువులైన కొందరు తిరుగుబాటుదారులను బహిరంగంగా ఆహ్వానించాడు. చివరగా అతడు చిత్తోర్‌ను మరోసారి ముట్టడించాడు. అదే సమయంలో ఇబ్రహీం లోధి బంధువు తార్తర్ ఖాన్‌కు ఆయుధాలను, సైనికులను సమకూర్చాడు. తార్తర్ ఖాన్ ఆగ్రాను స్వాధీనం చేసుకొని ఉత్తర, తూర్పు భారతంలో తిరుగుబాట్లను రెచ్చగొట్టాలని యోచించాడు.

తార్తర్ ఖాన్ సవాలును హుమాయూన్ అవలీలగా అధిగమించాడు. మొగల్ సైన్యాలు ఎదురు పడగానే తార్తర్‌ఖాన్ సైన్యాలు కరిగిపోయాయి. బహదుర్ షా నుండి ముప్పును శాశ్వతంగా తొలగించుకోవాలనే ధృడ నిశ్చయంతో హుమాయూన్ మాల్వాపై దాడి చేశాడు.

అతడు చాలా జాగ్రత్తగా, నెమ్మదిగా ముందుకు కదులుతూ చిత్తోర్, మాండుల మధ్య ఉన్న ఒక కీలకమైన స్థావరాన్ని ఆక్రమించాడు. అలా మాల్వా నుండి బహదుర్ షా సరఫరాలను నిలిపివేశాడు. తర్వాత జరిగిన యుద్ధంలో హుమాయూన్ తగిన సైనిక నైపుణ్యాన్ని, వ్యక్తిగత ధీరత్వాన్ని ప్రదర్శించాడు. బహదుర్ షా మొగల్‌లను నేరుగా ఎదుర్కోవడానికి సాహసించలేదు. తన స్థావరాన్ని వదలి మాండుకు పారిపోయాడు. హుమాయూన్ అతడిని వేటాడాడు. ఒక చిన్నసైనిక బృందంతో అతడు మాండు కోటను అధిరోహించాడు. కోటను అధిరోహించిన ఐదవ వ్యక్తి హుమాయూనే. బహదుర్ షా మాండు నుండి చంపానేర్, తర్వాత అక్కడి నుండి అహ్మదాబాద్‌కు, చివరగా కథియావార్‌కు పారిపోయాడు. ఆ విధంగా సంపన్న రాజ్యాలైన మాల్వా, గుజరాత్‌లతోపాటు, గుజరాత్ పాలకులు మాండు, చంపానేర్‌లలో పోగు చేసిన భారీ ఖజానా హుమాయూన్‌కు దక్కాయి.

అయితే పై రాజ్యాలను మొగల్ పాలకులు ఎంత త్వరగా దక్కించుకున్నారో అంతే త్వరగా కోల్పోయారు. విజయం తర్వాత హుమాయూన్ గుజరాత్ రాజ్యాన్ని తన సోదరుడు అస్కరికి అప్పగించి విశ్రాంతి కోసం మాండు వెళ్లిపోయాడు. గుజరాత్‌లో ప్రధాన సమస్య ఏమిటంటే అక్కడి ప్రజలు గుజరాతి పాలనతో ప్రగాఢ అనుబంధాన్ని పెంచుకున్నారు. అనుభవం లేకపోవడంతో అస్కరి సరైన పాలనాచర్యలు తీసుకోలేకపోయాడు. మరోవైపు మొగల్ అధికారుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ప్రజా ఉద్యమాలు, బహదుర్ అనుయాయుల సైనిక కార్యకలాపాలు, బహదుర్ షా తన ప్రాబల్యాన్ని పునరుద్ధరించుకోవడంతో అస్కరి తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. మాండులో మకాం చేసి ఉన్న హుమాయూన్‌ను కలవకుండా ఆగ్రా తిరిగి వెళ్లాలని నిర్ణయించాడు. అస్కరి వ్యూహంపై సరైన అంచనా లేని హుమాయూన్ మాల్వాను వదలి తన సోదరుని వెంబడించాడు. ఇద్దరి మధ్య అపోహలు తొలగిపోవడంతో ఆగ్రాకు కలిసి బయల్దేరి వెళ్లారు. ఈలోగా మొగల్‌లు మాల్వా, గుజరాత్ రాజ్యాలు రెండింటినీ కోల్పోయారు.

గుజరాత్ దండయాత్ర ఘోర వైఫల్యంగా మిగిలిపోలేదు. మొగల్ సామ్రాజ్యానికి కొత్త ప్రాంతాలు దఖలు పడనప్పటికీ మొగల్ పాలనకు గుజరాత్ రాజు బహదుర్ షా నుండి పొంచి ఉన్న ముప్పు శాశ్వతంగా తొలగిపోయింది. పోర్చుగీసులతో చర్చల సందర్భంగా చెలరేగిన ఘర్షణలో గుజరాత్ షా ఓడపై నుండి సముద్రంలో జారిపడి మరణించడంతో గుజరాత్ వైపు నుండి ఉన్న నామమాత్రపు ముప్పు కూడా తొలగిపోయింది.

**షేర్‌ఖాన్‌తో సంఘర్షణ :** గుజరాత్ దండయాత్రలో హుమాయూన్ మునిగి ఉన్నప్పుడు షేర్‌ఖాన్ తన ప్రాబల్యాన్ని మరింత పెంచుకున్నాడు. బీహార్‌కు మకుటంలేని మహరాజుగా మారాడు. అన్ని ప్రాంతాలకు చెందిన ఆఫ్ఘన్లు అతడి చుట్టూపోగయ్యారు. మొగల్‌ల పట్ల విధేయతను కొనసాగిస్తూనే అతడు వ్యూహాత్మకంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. భారతదేశం నుండి మొగల్‌లను తరిమివేయడానికి యుద్ధ వ్యూహాలు పూర్తయ్యాయి. అతడు బహదుర్ షాతో సన్నిహిత సంబంధాలను కొనసాగించాడు. అంతకు ముందు షా ఆఫ్ఘన్లకు భారీ సబ్సిడీలను అందించి ఉన్నాడు. ఈ వనరులతో షేర్ ఖాన్ సైనికులను భారీ సంఖ్యలో భర్తీ చేసుకొని ఒక బలమైన, సమర్థవంతమైన సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. హుమాయూన్ ఆగ్రాకు చేరుకున్న తర్వాత షేర్‌షా ఈ సైన్యాన్ని బెంగాల్ పాలకుడిని ఓడించడానికి, అతడి నుండి భారీ కప్పాన్ని వసూలు చేయడానికి వినియోగించుకున్నాడు.

కొత్త సైన్యాన్ని సమకూర్చుకున్న తర్వాత హుమాయూన్ షేర్‌షాపై సైనిక చర్యను ప్రారంభించాడు. 1537 చివరి నాటికి చునార్ కోటను ముట్టడించాడు. తన సరఫరాలకు ముప్పు తేగల ఆ కోటను ఇతరుల నియంత్రణలో ఉంచడం ప్రమాదకరమని హుమాయూన్ భావించాడు. అయితే కోటను ఆఫ్ఘన్లు బలంగా పరిరక్షించారు. కోటను స్వాధీనం చేసుకోవడానికి హుమాయూన్‌కు ఆరు మాసాలు పట్టింది. ఈలోగా షేర్‌ఖాన్ రెండోసారి బెంగాల్‌ను ఆక్రమించి దాని రాజధాని గౌర్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఆ విధంగా షేర్‌షా హుమాయూన్ ఎత్తులను చిత్తు చేశాడు. తగుసన్నాహాలు చేయకుండా షేర్‌ఖాన్‌ను ఎదుర్కోవడం అసాధ్యమని హుమాయూన్ గ్రహించాడు. హుమాయూన్ తన యుద్ధ క్షేత్రాన్ని పొరపాటుగా ఎంచుకుని, సంకట స్థితిలో పడిపోయాడు. నదిని దాటుకొని తన ప్రాణాలను తృటిలో తప్పించుకున్నాడు.

1539లో చౌసా వద్ద పరాజయం తర్వాత మొగల్ రాచరిక కుటుంబంలో సంపూర్ణ ఐక్యత ఒక్కటే వారి సామ్రాజ్యాన్ని కాపాడే పరిస్థితి ఏర్పడింది. ఆగ్రా వద్ద కమ్రన్ నాయకత్వంలో సుమారు 10,000 మంది సైనికులు గల దళం వచ్చి ఉంది. అది యుద్ధ తంత్రంలో ఆరితేరిన పోరాట వీరులతో నిండి ఉండేది. అయితే హుమాయూన్ నాయకత్వంపై విశ్వాసం కోల్పోయిన కమ్రన్ అతడికి అండగా సైనికులను పంపడానికి ఇష్టపడలేదు. మరోవైపు సైనిక కమాండ్‌ను కమ్రన్‌కు అప్పగించడానికి హుమాయూన్ అంగీకరించలేదు. అలా చేస్తే కమ్రన్ ఢిల్లీ గద్దెను దక్కించుకుంటాడన్న అనుమానంతోనే హుమాయూన్ తన పావులను కదిపాడు. తన సైన్యంతో లాహోర్‌కు తిరిగి వెళ్లాలని కమ్రన్ నిర్ణయించే వరకు ఇద్దరు సోదరుల మధ్య అపోహలు తారాస్థాయిలో కొనసాగాయి.

హుమాయూన్ స్వల్ప వ్యవధిలో సమీకరించిన సైన్యం షేర్‌షా సైన్యానికి సమ ఉజ్జీగా నిలవలేకపోయింది. కనౌజ్ యుద్ధం (1540) భీకరంగా సాగినా మొగల్‌లు ఓడిపోయారు. ఈ యుద్ధం షేర్‌ఖాన్, మొగల్‌ల మధ్య వివాదాన్ని శాశ్వతంగా పరిష్కరించింది. హుమాయూన్

ఇప్పుడు రాజ్యంలేని రాకుమారుడిగా మారాడు. కాబుల్, కాందహార్ నగరాలు క్రమన్ ఆధీనంలో ఉండిపోయాయి. అతడు సింధ్, తదితర పొరుగురాజ్యాలలో తదుపరి రెండున్నర ఏళ్లపాటు గమ్యం లేకుండా తిరిగాడు. తన రాజ్యాన్ని దక్కించుకోవడానికి ఎన్నో వ్యూహాలను సిద్ధం చేశాడు. అయితే సింధ్ పాలకులు కాని, మార్వార్ శక్తిమంతుడు మాల్దేవ్ కాని అతడికి మద్దతునివ్వడానికి ముందుకు రాలేదు. ఘోరమేమిటంటే అతడి స్వంత సోదరులే అతడిపై ఎదురు తిరిగారు. అతడిని నిర్బంధించాలనో, హత్య చేయాలనో ప్రయత్నించారు.

ఈ కష్టాలన్నింటినీ హుమాయూన్ ఎంతో ధైర్యంతో, నేర్పుతో ఎదుర్కొన్నాడు. ఈ కాలంలో అతడు తన స్వంత వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకున్నాడు. ఎట్టకేలకు అతడు ఇరాన్ రాజు కొలువులో ఆశ్రయం పొందారు. అతడి సహాయంతో 1545లో కాబుల్, కాందహార్‌లను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. 1555లో సుర్ సామ్రాజ్యం చీలిపోయిన తర్వాత హుమాయూన్ ఢిల్లీని స్వాధీనం చేసుకోగలిగాడు. ఈ విజయ ఫలాలను అనుభవించడానికి అతడు ఎంతో కాలం జీవించలేకపోయాడు. ఢిల్లీలోని ఓ గ్రంథాలయం మెట్ల నుండి జారి పడి మరణించాడు. ఆ విధంగా హుమాయూన్ సంపదల నుండి దారిద్ర్యానికి, దారిద్ర్యం నుండి సంపదలకు ప్రస్థానం కొనసాగించాడు.

## సుర్ మధ్యంతర పాలన

మాల్వా, రాజస్థాన్‌లలోని దాదాపు అన్ని భూభాగాలను షేర్ షా ఆక్రమించాడు. మాల్వా అప్పుడు బలహీనంగా, గందరగోళంలో ఉండి షేర్‌షాను నామమాత్రంగా కూడా ప్రతిఘటించలేకపోయింది. అయితే రాజస్థాన్‌లో పరిస్థితులు వేరుగా ఉండేవి. మార్వార్ పాలకుడు మాల్దేవ్ 1532లో గద్దెనెక్కిన తర్వాత రాజస్థాన్‌లోని పశ్చిమ, ఉత్తర ప్రాంతాలను తన నియంత్రణలోకి తెచ్చుకున్నారు. హుమాయూన్, షేర్‌ఖాన్‌ల మధ్య యుద్ధం జరుగుతున్నప్పుడు మాల్దేవ్ తన ప్రాబల్యాన్ని మరింత పెంచుకున్నాడు. అయితే 1544లో అజ్మేర్, జోధ్‌పూర్‌ల మధ్య ఉన్న సామెల్‌లో రాజపుత్ర, ఆఫ్ఘన్ సైన్యాలు తలపడ్డాయి.

రాజస్థాన్‌పై దండయాత్ర సందర్భంగా షేర్‌షా అచితూచి వ్యవహరించాడు. అప్పటికే రాజపుత్రులు కూడా బాబర్–రాణా సంగాల మధ్య జరిగిన యుద్ధం నుండి అనేక గుణపాఠాలను నేర్చుకొని తమ నైపుణ్యాన్ని మెరుగు పరచుకున్నారన్నది సుస్పష్టం. కట్టుదిట్టంగా ఉన్న షేర్‌షా సైనిక స్థావరాలపై దాడి జరపడానికి రాజపుత్‌లు నిరాకరించారు.

ఒక నెల రోజులు వేచిచూసిన తర్వాత మాల్దేవ్ తన సైన్యాన్ని ఉన్నట్లుండి జోధ్‌పూర్‌కు ఉపసంహరించాడు. సమకాలీన రచయితల ప్రకారం ఇదంతా షేర్‌షా వ్యూహంలో భాగంగానే జరిగింది. మాల్దేవ్ స్థావరం సమీపంలో రాజపుత్ర సేనాపతులను ఉద్దేశించిన ఉత్తరాలను వెదజల్లి వారి విధేయతపై మాల్దేవ్‌కు అనుమానం వచ్చేలా షేర్‌షా వ్యూహం పన్నాడు. ఈ పన్నాగం పారడంతో మాల్దేవ్ తన సైన్యాన్ని వెనక్కి తీసుకున్నాడు. అయితే మాల్దేవ్ తాను చేసిన పొరపాటును చాలా ఆలస్యంగా గ్రహించాడు. కొందరు రాజపుత్ర సర్దార్లు ఉపసంహరించుకోవడానికి నిరాకరించారు. ధైర్యంగా పోరాడుతూ నేలకొరిగారు.

సామెల్ యుద్ధం రాజస్థాన్ భవితను తిరగరాసింది. ఇప్పుడు షేర్‌షా అజ్మేర్, జోధ్‌పూర్‌లను ఆక్రమించి మాల్దేవ్‌ను ఎడారిలోకి పారిపోయేలా చేశాడు. తర్వాత మేవార్‌వైపు కదిలాడు. ప్రతిఘటించే శక్తి లేకపోవడంతో రాణా చిత్తోర్ కోట తాళాలను షేర్‌షాకు స్వయంగా పంపించాడు. అనంతరం మౌంట్ ఆబు వరకు షేర్‌షా సైనిక స్థావరాలను నెలకొల్పాడు. ఆ విధంగా పది నెలల స్వల్ప వ్యవధిలోనే అతడు రాజస్థాన్ అంతటినీ స్వాధీనం చేసుకున్నాడు. అతడు చివరగా కలింజర్‌తో పోరాడాడు. ఆ బలమైన కోట బుందేల్‌ఖండ్‌కు కీలకంగా ఉండేది. కోట ముట్టడి సమయంలో ఫిరంగు పేలి షేర్‌షా తీవ్రంగా గాయపడ్డాడు. కోట స్వాధీనమైందన్న వార్త విన్న తర్వాత అతడు (1545) కన్నుమూశాడు.

షేర్‌షా వారసునిగా అతడి రెండవ కుమారుడు ఇస్లాం షా గద్దెనెక్కాడు. అతడు 1552 వరకు పాలించాడు. ఇస్లాం షా సమర్థుడు, గొప్పసేనాని. అయితే అతడి శక్తియుక్తులు చాలా వరకు తన సోదరుల, ఇతర ఆఫ్ఘన్ సర్దార్ల తిరుగుబాట్లను అణచివేయడానికే సరిపోయాయి. ఈ తిరుగుబాట్లతోపాటు మొగల్‌ల నుండి సరికొత్త దాడిని ఎదుర్కోవలసి వస్తుందన్న ఆందోళన వల్ల ఇస్లాం షా తన సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు ప్రయత్నించలేదు. యుక్త వయస్సులో అతడి మరణం అతడి వారసుల మధ్య అంతర్యుద్ధానికి దారి తీసింది. భారతదేశంలో కోల్పోయిన సామ్రాజ్యాన్ని తిరిగి దక్కించుకునేందుకు ఈ అంతర్యుద్ధ పరిస్థితి హుమాయూన్‌కు మంచి అవకాశాన్ని కల్పించింది. ఇలాంటి అవకాశం కోసమే అతడు ఏళ్లపాటు వేచి చూశాడు. 1555లో జరిగిన రెండు భీకర యుద్ధాలలో అతడు ఆఫ్ఘన్లను ఓడించి ఢిల్లీ, ఆగ్రాలను తిరిగి స్వాధీనం చేసుకొని మొగల్ సామ్రాజ్యాన్ని పునరుద్ధరించాడు.

## అక్బర్ (1556-1605)

**పట్టాభిషేకం :** పంజాబ్‌లో ఆఫ్ఘన్లకు వ్యతిరేకంగా సైనిక చర్యలో నిమగ్నమై ఉన్న సమయంలో అక్బర్ తన తండ్రి మరణవార్తను అందుకున్నాడు. బైరం ఖాన్ అక్బర్‌కు వెంటనే పట్టాభిషేకం చేయించినప్పటికీ అతడి పరిస్థితి ప్రమాదకరంగా ఉండేది. ఆఫ్ఘన్లు ఆగ్రా–బయానా ప్రాంతం నుండి మొగల్‌లను తరిమికొట్టారు. ఢిల్లీని హేము స్వాధీనం చేసుకున్నాడు. రెండవ పానిపట్ యుద్ధం (1556)లో హేము అక్బర్‌పై విజయం అంచున ఉన్నాడు. అంతలోనే హేము కంటికి బాణం తగలడంతో పరిస్థితి మారిపోయింది. అది చూసిన సైన్యం కూడా కకావికలై పరుగులు తీసింది. అక్బర్ బోధకునిగా ఇరాన్ విద్వాంసుడు అబ్దుల్ లతీఫ్‌ను నియమించిన తర్వాత బైరం పరిపాలనను పటిష్టం చేశాడు. అక్బర్ తరఫున పాలించిన వానిగా (వకీలుగా) బైరం ఎనలేని ప్రాధాన్యతను సంతరించుకున్నాడు. ఇది భరించలేని 'అత్కా ఖయాల్' అనే అక్బర్ సంబంధీకుల బృందం బైరంకు వ్యతిరేకంగా కుట్ర పన్నింది. 1560 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అక్బర్ స్వతంత్రంగా పాలించాలని ఆకాంక్షించాడు. అదే సమయంలో సవతి తల్లి మహం అనఘ అక్బర్‌ను ఆగ్రా నుండి ఢిల్లీకి తరలించడంలో సఫలమైంది. అక్కడి నుండి అక్బర్ మక్కా తీర్థయాత్రకు వెళ్లాల్సిందిగా బైరం ఖాన్‌ను ఆదేశిస్తూ లేఖ రాశాడు. అయితే ఆస్థాన రాజకీయాలు బైరంను తిరుగుబాటుకు ప్రేరేపించాయి. చివరికి అతడు లొంగిపోయినపుడు అక్బర్ తీర్థయాత్ర కొనసాగించాల్సిందిగా

ఆదేశించాడు. 1561లో దురదృష్టవశాత్తు బైరంఖాన్ ఒక ఆఫ్ఘన్ జాతీయుని చేతిలో గుజరాత్‌లోని పాటన్ వద్ద హత్యకు గురయ్యాడు. అయితే అతడి నాలుగేళ్ల కుమారుడు అబ్దుర్ రహీంను మొగల్ ఆస్థానానికి తీసుకువచ్చారు.

**అక్బర్ దండయాత్రలు :** ఆక్రమణ, విస్తరణకు సంబంధించి అక్బర్ ఆకాంక్షలు ఇతర సామ్రాజ్యవాదులకు భిన్నంగా ఉండేవి కావు. అతడు ఆగ్రా నుండి గుజరాత్ వరకు, ఆగ్రా నుండి బెంగాల్ వరకు, తదుపరి అస్సాం సరిహద్దుల వరకు విస్తరించి ఉన్నఉత్తర భారతదేశాన్ని ఆక్రమించాడు. తర్వాత పశ్చిమోత్తర సరిహద్దును బలోపేతం చేసి దక్కను ప్రాంతాన్ని లొంగదీసుకోవడానికి బయల్దేరాడు. 1561లో బజ్ బహదుర్ నుండి మాల్వాను స్వాధీనం చేసుకున్నాడు. 1564లో గఢ్‌కటంగ, గోంద్వానాలను ఆక్రమించాడు. గఢ్‌కటంగ పాలకురాలు రాణి దుర్గావతి, ఆమె కుమారుడు బీర్ నారాయణ్ యుద్ధరంగంలో మొగల్‌లతో పోరాడుతూ మరణించారు. 1572-73లో గుజరాత్ స్వాధీనమైంది. ఈ విజయాన్ని పురస్కరించుకొని అక్బర్ ఫతేపూర్ సిక్రి వద్ద బులంద్ దర్వాజాను నిర్మించాడు. 1574-76లలో బీహార్, బెంగాల్, 1581లో కాబుల్ (కమ్రన్ నుండి), 1586లో కాశ్మీర్, బలూచిస్తాన్, 1591లో సింధ్, 1592లో ఒరిస్సా, 1595లో కాందహార్, చాంద్‌బీబీ నుండి అహ్మద్‌నగర్‌లోని కొంత భాగాన్ని, 1593-1601 మధ్య ఖాన్‌దేశ్‌లను స్వాధీనం చేసుకున్నాడు

కాబుల్‌ను స్వాధీనం చేసుకోవడానికి అబ్దుల్లా ఖాన్ ఉజ్బేక్ చేస్తున్న ప్రయత్నాలను విఫలం చేసేందుకు 1585లో అక్బర్ పశ్చిమోత్తర సరిహద్దుకు తరలివెళ్లాడు. 1598లో అబ్దుల్లా మరణం వరకు అక్బర్ అక్కడే పాగా వేశాడు. ఆ ప్రాంతంలో 14 ఏళ్లపాటు ఉన్న అక్బర్ హసన్ అబ్దుల్ వద్ద గల తన స్థావరం నుండి మూడు సైనిక బృందాలను సామ్రాజ్య విస్తరణ లక్ష్యంపై పంపాడు. ఒక బృందం కాశ్మీర్‌కు వెళ్లగా రెండో బృందం బలూచిస్తాన్‌కు బయల్దేరింది. మూడో బృందం ఆఫ్ఘన్ తెగలను, ఆఫ్ఘన్ మత ఉద్యమమైన రౌషనియాలను అణచివేయడానికి వెళ్లింది.

రౌషనియాలు, ఆఫ్ఘన్ తెగలపై తొలి పోరాటాలు విఫలమయ్యాయి. 1586లో అక్బర్ విధేయుడు బీర్బల్ (బ్రాహ్మణుడు)ను యూసుఫ్‌జాయ్‌లు హత్యచేశారు. కాశ్మీర్ దండయాత్రకు బయల్దేరిన రాజా భగవాన్ దాస్ కాశ్మీర్ చివరి పాలకుడైన యూసుఫ్‌ఖాన్‌ను లొంగిపోయేలా ఒప్పించాడు. అయితే అక్బర్ అతడు విధించిన షరతులను అంగీకరించడానికి నిరాకరించాడు. అందుకు ప్రత్యామ్నాయంగా యూసుఫ్‌ఖాన్, అతడి కుమారుడిని నిర్బంధించాడు. అక్బర్ పంపిన సైన్యం 1586లో కాశ్మీర్‌ను ఆక్రమించింది. ఆ రాజ్యాన్ని కాబుల్ ప్రాంతానికి సర్కారుగా మార్చారు. బలూచిస్తాన్‌కు వెళ్లిన సైన్యం అక్కడి నాయకులను లొంగిపోయేలా ఒప్పించింది. 1590-91లో సింధ్ కూడా స్వాధీనమైంది.

అక్బర్ పాలన తొలినాళ్లలో ఇరాన్ షా కాందహార్‌ను స్వాధీనం చేసుకున్నాడు. దాంతో అక్బర్ ప్రముఖ సేనాని అబ్దుర్ రహీం ఖాన్-ఎ-ఖానమ్ నేతృత్వంలో ఒక సైన్యాన్ని పంపాడు. కాందహార్ గవర్నర్ లొంగిపోయాడు. ఆ ప్రాంతం మొగల్ సామ్రాజ్యంలో

అంతర్భాగమైంది. సింధ్, బలూచిస్తాన్, కాబుల్, ఆపై కాశ్మీర్ నుండి హిందూకుష్ పర్వతశ్రేణుల వరకు విస్తరించిన మొగల్ సరిహద్దులు భారతదేశ చరిత్రలో ఎన్నడూ ఎరుగని విధంగా సురక్షిత సరిహద్దులుగా మిగిలిపోయాయి. అక్బర్‌లాగా మరే మధ్యయుగ భారత పాలకుడు ఇంతటి విశాలమైన సరిహద్దులను నియంత్రించలేదు.

అంబర్‌కు చెందిన రాజా భార్‌మల్ కచ్‌వాహా తన మొదటి కుమార్తెను అక్బర్‌కిచ్చి వివాహం చేశాడు. రాజా భగవాన్ దాస్ (రాజా భార్‌మల్ వారసుడు), మాన్‌సింగ్ (రాజా భార్‌మల్ పెంపుడు కొడుకు) లు సామ్రాజ్య వ్యవస్థలో ఉన్నత పదవులను పొందారు.ఒకటి తర్వాతి ఒకటిగా అన్ని రాజపుత్ర రాజ్యాలు అక్బర్‌కు దాసోహమయ్యాయి. అయితే మేవార్ రాణాలు మాత్రం మొగల్ ఆధిపత్యాన్ని ధిక్కరిస్తూనే ఉన్నారు. ఎన్నో పరాజయాలను చవి చూసినప్పటికీ రాణాలు మొగల్ సామ్రాజ్యాన్ని ప్రతిఘటించారు. ముఖ్యంగా హల్దీఘాటి యుద్ధం (1576)లో రాణా ప్రతాప్‌ను మాన్‌సింగ్ నేతృత్వంలోని మొగల్ సైన్యం ఘోరంగా ఓడించింది.

**పాలనా చర్యలు:** అక్బర్ హయాంలో కేంద్ర ప్రభుత్వ స్వరూపం, నిర్వహణలో ముఖ్యమైన మార్పులెన్నో వచ్చాయి. అనేక రంగాలలో షేర్‌షాకు అక్బర్ వారసుడైనప్పటికీ కేంద్ర ప్రభుత్వ నిర్మాణ, నిర్వహణా విషయాలలో అతడు షేర్‌షాకు ఏవిధంగాను రుణపడిలేడు. తన మంత్రుల అధికారాలు, బాధ్యతలను నిర్దిష్టంగా నిర్ధారించాడు. ఢిల్లీ, తుర్కు, పర్షియా సుల్తాన్‌ల సాంప్రదాయాలను కొద్దిపాటి మార్పులతో కొనసాగించాడు. ముఖ్యంగా భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాట్లు చేసి బాధ్యతలను, పాలనాస్వరూపాన్ని నిర్ధారించాడు. ఢిల్లీ సుల్తాను ఒక నాయబ్‌సుల్తాన్‌ను కలిగి ఉన్నట్లే, అబ్బాసిద్ ఖలీఫాలు వజీరును కొనసాగించినట్లే అక్బర్ కూడా వకీలును పెట్టుకున్నాడు. ఇతర మంత్రులందరి కంటే వకీలుకు చాలా ప్రాధాన్యత ఉండేది. ఎందుకంటే వకీలుకు మంత్రుల పనితీరును పర్యవేక్షించే, నియంత్రించే హక్కు ఉండేది. అక్బర్ తొలి వకీలు బైరంఖాన్ ఎంత శక్తిమంతుడంటే అతడు సార్వభౌముడిని సంప్రదించకుండానే తనకు తోచిన పనిచేసేవాడు. అయితే మునిమ్ ఖాన్ నియామకం తర్వాత సిద్ధాంతపరంగా వకీలు రాజకీయ ఆధిపత్యం కొనసాగినప్పటికీ, ఆచరణలో ఆర్థిక శాఖ అధిపతి అయిన వజీరు లేదా దీవాన్ వకీలుకు సమాన ప్రతిద్వందిగా ఎదిగాడు. ఇంకా చెప్పాలంటే వకీలు కంటే ఎక్కువ అధికారాన్ని చెలాయించాడు. కేంద్రంలోని ఇతర ముఖ్య అధికారులలో మీర్ బక్షీ, ఖాన్-ఎ-సమాన్, సద్ర్-ఉస్-సుదుర్ (సద్ర్-ఎ-జహాన్), కాజీ-ఉల్-కజత్ (ప్రధాన కాజీ) ఉన్నారు.

అక్బర్ అధికారంలోకి వచ్చే నాటికి ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం రాజ్యాలను (ప్రాంతీయ) పాలించేందుకు వ్యవస్థాగత ప్రయత్నమేదీ జరగలేదు. రాజపుత్రులతో యుద్ధాలు, మంగోలు దాడులు, తిరుగుబాట్లు ఢిల్లీ సుల్తాన్‌ల కేంద్ర ప్రభుత్వాన్ని తీరిక లేకుండా చేశాయి. ప్రాంతాలను సరైన రీతిలో పాలించే అవకాశమే లేకుండాపోయింది. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రక్షాళన చేయడంలో లేదా పునర్వ్యవస్థీకరించడంలో అక్బర్ షేర్‌షాకు ఏ విధంగా రుణపడి ఉండనట్లే ప్రాంతీయ ప్రభుత్వాలను పునర్వ్యస్థీకరించడంలో కూడా అతడు తన సొంత తెలివిపై ఆధారపడాల్సి వచ్చింది. తన సామ్రాజ్యాన్ని విస్తారమైన రాష్ట్రాలుగా (సమాన విస్తీర్ణంలో)

విభజించాలని అక్బర్ నిర్ణయించాడు. సహజ సిద్ధమైన సరిహద్దులు, పాలనా సౌలభ్యం ఆధారంగా రాష్ట్ర ప్రాంతీయ ప్రభుత్వాలను ఏర్పరిచాడు. ఈ రాష్ట్రాలు కూడా కేంద్ర ప్రభుత్వ నిర్మాణాన్ని పోలి ఉండేవి. 1580 నాటికి ఉత్తరభారత ప్రాంతాన్ని అతడు దాదాపుగా స్వాధీనం చేసుకున్నాడు. 1573-1581ల మధ్య ముఖ్యమైన సంస్కరణలెన్నింటినో ప్రవేశపెట్టాడు. అందులో రాష్ట్రాల నిర్వహణ ప్రధానమైనది.

1581లో అతడు తన సామ్రాజ్యాన్నంతటినీ 12 సుబా లేదా రాష్ట్రాలుగా విభజించాడు. వాటిని ఆయా ప్రాంతాలు లేదా ఆ ప్రాంతంలోని ముఖ్యమైన పట్టణం పేరుతో నామకరణం చేశాడు. ఈ 12 సుబాలు : కాబుల్, లాహోర్, ముల్తాన్, ఢిల్లీ, ఆగ్రా, అజ్మేర్, అలాహాబాద్, అవధ్, బీహార్, బెంగాల్, మాల్వా, గుజరాత్. ఆ విధంగా దక్కను దండయాత్ర వరకు సుబాల సంఖ్య 12 వద్ద నిలిచిపోయింది. అయితే కొత్త ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడంతో ఈ సుబాల వైశాల్యం గణనీయంగా పెరిగింది. దక్కను దండయాత్ర తర్వాత మరో మూడు సుబాలు-ఖాన్‌దేశ్, బెరార్, అహ్మద్‌నగర్‌లు - ఏర్పడి సుబాల సంఖ్య 15కు చేరుకుంది. జహంగీర్ హయాంలో ఈ సంఖ్య 19కి పెరిగింది. దక్కను ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకున్న ఔరంగజేబ్ సుబాల సంఖ్యను 21కి పెంచాడు. ప్రతి సుబాకు అధిపతిగా ఒక గవర్నర్ ఉండేవాడు. అక్బర్ కాలంలో అతడిని సిపహ్‌సాలార్ అని పిలిచేవారు. అయితే అతడి వారసుల హయాంలో గవర్నరును సుబాహ్‌దార్ లేదా నాయీమ్ అని పిలిచేవారు. దీవాన్, బక్షీ, కాజీ, సద్ర్, ముహ్తసిబ్ తదితర అధికారులు కూడా ప్రతి రాష్ట్రంలో ఉండేవారు. కేంద్ర ప్రభుత్వ అధికారులవలే వీరు కూడా తమ పరిధిలో విధులు నిర్వహించేవారు. వారి హోదాల పేర్లు కూడా కేంద్ర హోదాలతో పోలి ఉండేవి.

**సులహ్-ఎ-కుల్ విధానం :** అక్బర్ మతపరమైన అన్వేషణలో ఆయా మతాల సిద్ధాంతాలు, ఆచార వ్యవహారాల విశ్లేషణ, సమీక్ష అంతర్భాగంగా ఉండేవి. ప్రధానంగా ఇస్లాం, హిందూ, జైన, బౌద్ధ, జొరాస్ట్ర, క్రైస్తవ మతాలపై అధ్యయనం జరిగేది. హిందూ, జైన, జొరాస్ట్ర, క్రైస్తవ మత సిద్ధాంతాల పట్ల అక్బర్ ఆకర్షితుడయ్యాడు. అలాగే సూఫీబోధనలపట్ల కూడా ఆసక్తి చూపాడు. తన ఆధ్యాత్మిక తపనలను ఏ ఒక్క మతం తీర్చడంలేదని అతడు నిర్ధారించుకున్నాడు. అన్ని మత సముదాయాలలో శాంతిని, సోదరభావాన్ని (సులహ్-ఎ-కుల్) పెంపొందించాడు. ఆచరణలో ఉన్న అన్ని మతాలలోని మంచిని తీసుకొని ఎలాంటి లోపాలు లేని మత విధానాన్ని రూపొందించే సాధ్యాసాధ్యాలను పరిశీలించాడు.

ఈ లక్ష్యంలో భాగంగా అతడు 1582 మార్చిలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. విభిన్న మతాలకు చెందిన బోధకులను, ఆస్థాన పెద్దలను, అధికారులను ఆహ్వానించాడు. చర్చలు ప్రారంభించాల్సిందిగా కోరాడు. ఏది నిజమైన, ఉన్నతమైన మతమో తేల్చాలని సూచించాడు. సమావేశంలో పాల్గొన్న ప్రతి సభ్యుడు ఇతర మతాలలోని లోపాలను ఎత్తి చూపారు. ఆ విధంగా ఏ మతమూ ఆదర్శవంతమైనది కాదని నిరూపితమైంది.

ఎన్ని మతాలున్నాయో అంతే సంఖ్యలో వర్గాలు కూడా ఉన్నాయని అప్పుడు అక్బర్ గుర్తు చేశాడు. వాటిని ఒకే ఛత్రం కిందికి తీసుకురావలసిన అవసరాన్ని నొక్కి చెప్పాడు. అయితే ఈ ప్రక్రియను ఒక మతంలోని మంచి గుణాలను కోల్పోకుండా పూర్తి చేయాలని,

అదే సమయంలో మరో మతంలోని ఉన్నతమైన విలువలను అదనంగా చేర్చాలని సూచించాడు. చక్రవర్తి సూచనకు ప్రతిస్పందనగా మత బోధకులు ఒక పరిష్కార మార్గాన్ని ముందుంచారు. సామ్రాజ్యమంతటికీ దైవాలు, ధార్మిక కార్యక్రమాలు, త్యాగాలు, నిబంధనలు, విలువలు, ఆధ్యాత్మిక చింతనలను చక్రవర్తే నిర్ధారించి ఒక సంపూర్ణమైన సర్వజనీన మతాన్ని ఏర్పాటు చేయాలన్నదే దాని సారాంశం.

అయితే అంబర్‌కు చెందిన రాజా భగవాన్ దాస్ ఇలా అన్నాడు : "హిందువులు, ముసల్మాన్‌లిద్దరికీ చెడు మతం ఉందని నేను నమ్మడానికి సిద్ధంగా ఉన్నాను. కాని కొత్త మతం ఏదో దాని అభిప్రాయం ఏమిటో చెబితే దానిని నేను నమ్మగలను." "నాకు తెలిసినంత వరకు హిందు, ఇస్లాం తప్ప మరో మతం ఆచరణలో ఉన్నట్లు తెలియదు" అని మాన్‌సింగ్ పేర్కొన్నాడు. దీనిని బట్టి వారు శక్తివంతమైన రాజపుత్ పాలక వంశం తరపున మాట్లాడి ఉంటారు తప్ప మొత్తం హిందూ సమాజం పక్షాన కాదని బోధపడుతుంది. భగవాన్ దాస్ ఒక కీలక అంశాన్ని లేవనెత్తాడు; కొత్త మతం యొక్క నిర్వచనం ఏమిటని ప్రశ్నించాడు. అక్బర్ దానిని నిర్వచించలేదు. అనిర్వచనీయమైన మతాన్ని ప్రజలపై రుద్దాలని కూడా ప్రయత్నించలేదు. "నాకే సరైన మార్గదర్శకత్వం లేనప్పుడు నేను ఇతరులకు మార్గదర్శకునిగా ఎలా నిలవగలను?" అని అక్బర్ పేర్కొన్నాడు. అయినప్పటికీ అతడు సులహ్-ఎ-కుల్ విధానాన్ని అమల్లోకి తెచ్చాడు. అధికారికంగా ఆ విధానాన్ని తౌహీత్-ఎ-ఇలాహీ(దైవ ఏకోపాసనము) అని పిలిచేవారు. ఏ దివ్యవాణి దానికి స్ఫూర్తిగా నిలవలేదు. దానికి సనిర్వచిత మతశాస్త్రం కాని తత్త్వశాస్త్రం కాని లేవు. ఒక శక్తివంతమైన దైవంలో నమ్మకం ఉంచాలని ఆ విధానం కోరింది. అంటే హిందు మత సంస్కరణ, ప్రగాఢమైన జొరాస్ట్ర ప్రభావం కలిగిన దైవత్వాన్ని బోధించింది.

సాధారణంగా అయితే అది నియంత్రిత చర్చి వ్యవస్థ కాదు. దానికి దేవాలయంకాని, మసీదు కాని లేదా పూజకు ప్రత్యేకమైన స్థలం కాని, మత గ్రంథాలు కాని లేవు. దాదాపుగా అది ఒక వ్యవస్థ (ఆర్డర్) అని చెప్పవచ్చు. అక్బర్ ఆ వ్యవస్థకు నాయకుడు. అబుల్ ఫజల్ దాని ప్రధాన పురోహితుడు. అక్బర్‌ను పరిపూర్ణమైన వ్యక్తి (ఇన్సాన్-ఎ-కామిల్)గా పరిగణించే వారు.

తన అనుచరుల నుండి జీవితం, ఆస్తి, గౌరవం, మతాన్ని త్యజించగల సంసిద్ధతను అక్బర్ కోరుకున్నాడు. సభ్యత్వం ఐచ్ఛికంగా ఉండేది. అందులో రెండు రకాల సభ్యులు ఉండేవారు. తొలి వర్గంలో 18 నుండి 19 మంది సభ్యులు ఉండేవారు. వారిలో బీర్బల్ ఒక్కడే హిందువు. అక్బర్ పట్ల వారి విధేయత ఎలాంటి హద్దు ఉండేది కాదు. రెండవ వర్గానికి చెందిన సభ్యుల సంఖ్య విస్తారంగా ఉండేది. పది నైతిక సూత్రాలతో కూడిన నియమావళి ఒకటి ఉండేది. (1) ఉదారత్వం - దయార్ద్ర హృదయం, (2) క్షమాగుణం - అణుకువ, (3) ఐహిక సుఖాలకు దూరంగా ఉండడం, (4) భౌతిక బంధనాల నుండి విముక్తికి ఆకాంక్ష, (5) వ్యక్తిగత చర్యల పర్యావసానాలపై ధ్యానం, (6) మంచి పనులు చేయాలన్న ఆకాంక్ష, (7) మధుర స్వరం - చల్లటి మాట, (8) ఇతరులపట్ల గౌరవంగా వ్యవహరించడం, (9) సృష్టించబడిన జీవాలతో తెగతెంపులు - దైవంతో అనుబంధం, (10) దైవానుగ్రహం,

దైవంతో మమేకం కావడానికి మనసును (ఆత్మ) లగ్నం చేయడం. సామాజిక సంస్కరణ కోసం కొన్ని సూత్రాలను ప్రతిపాదించారు. ఉదాహరణకు విధవల పునఃవివాహం, బాల్య వివాహాల నిర్మూలన, ఏకపత్నీవ్రతాన్ని పెంపొందించడం, జూదం, మద్యపానాన్ని నియంత్రించడం మొదలైనవి. ప్రతి సభ్యుడు రోజూ మూడుసార్లు ప్రార్థించాలి : సూర్యోదయం, మధ్యాహ్నం, సూర్యాస్తమయం.

''ఈ నిబంధనల పూర్తి సారాంశం హిందూ, జైన,పార్సీ ఆచారాలను పెంపొందించడమే. అదే సమయంలో మౌలిక ఇస్లాం సాంప్రదాయాలను సానుకూలంగా అడ్డుకోవడం లేదా నిరుత్సాహ పరచడం దాని ఉద్దేశం," అని చెప్పినప్పుడు విన్సెంట్ స్మిత్ తప్పుగా అర్థం తీశాడు. బదౌని దానిని మతంగా పరిగణించినా అబుల్ ఫజల్ ఆ అంశంపై మౌనం వహించాడు. దైవం యొక్క సమైక్యతలో విశ్వాసాన్ని పక్కన పెడితే ఆ విధానానికి నిర్ధారిత మతాలకు చెందిన ఏ ఒక్క ప్రధాన లక్షణం లేదు. దానికో ప్రవక్తగాని, మత గ్రంథం కాని లేవు. అక్బర్ దాని నాయకుడు మాత్రమే. తాను రెండవ ప్రవక్తనని అతడుఎప్పుడూ వాదించలేదు. "నైతిక హేతుబద్ధత" అనే సిద్ధాంతాన్ని అతడు ఆచరించాడు. మత, వర్గ వైషమ్యాలు తన పాలితులను ప్రత్యర్థి సముదాయాలుగా మార్చకూడదనే లక్ష్యంతోనే అక్బర్ ఈ విధానాన్ని అవలంబించాడు. అయితే కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు జరిగిన తొందరపాటు చర్యగా దానిని పరిగణించవచ్చు. ఆ కాలపు పరిస్థితులకు భిన్నంగా దానిని రూపొందించారు. అక్బర్ జీవిత కాలంలో ఆ వ్యవస్థ కేవలం కొన్ని వేల సంఖ్యలోనే సభ్యులను ఆకర్షించగలిగింది. సామ్రాజ్యానికి మూలస్తంభాలుగా నిలిచిన భగవాన్‌దాస్, మాన్‌సింగ్ లాంటి వ్యక్తులను కూడా ఆకర్షించడంలో అది విఫలమైంది. అక్బర్ మరణం తర్వాత ఆ వ్యవస్థ కాలగర్భంలో కలిసిపోయింది. అక్బర్ ఒక వేళ నియంతగా వ్యవహరించి ఉంటే తన సామ్రాజ్య పరిధిలోని ప్రజలపై కొత్త మతాన్ని బలవంతంగా రుద్ది ఉండేవాడు. సత్యాన్వేషి, శాంతి కాముకునిగా అతడు ఒక కొత్త విప్లవాన్ని తీసుకురావాలని ప్రయత్నించాడు. అయితే అప్పటి యుగం అందుకు ప్రతిబంధకంగా నిలిచింది.

## జహంగీర్ (1605-27)

**పట్టాభిషేకం – నూర్ జహాన్ :** రాకుమారుడు సలీం సింహాసనాన్ని అధిష్టించి 'జహంగీర్' అనే బిరుదుతో పాలించాడు. జహంగీర్ అంటే ప్రపంచాన్ని జయించిన వాడని అర్థం. అక్బర్ రూపొందించిన సులహ్–ఎ–కుల్ విధానాన్ని అతడు కొనసాగించాడు. వాణిజ్య, వర్తకాలపై స్థానిక పన్నులను మినహాయించాడు. అలాగే పరిశ్రమలకు రాయితీలు కల్పించాడు. గురు, ఆది వారాల్లో పశువుల వధను నిషేధించాడు. లౌకికవాద ఆస్థానం ప్రాముఖ్యతను పెంచడానికి కృషిచేశాడు. 1611లో మెహరున్నీసాను జహంగీర్ వివాహమాడాడు. ఆమె షేర్ ఆఫ్ఘన్ విధవ. బెంగాల్ గవర్నర్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో అతడు మరణించాడు. జహంగీర్‌తో వివాహం జరిగిన తర్వాత మెహరున్నీసా నూర్ మహల్ (రాజప్రసాదం వెలుగు) అనే బిరుదును పొందింది. తర్వాత నూర్ జహాన్ (ప్రపంచ జ్యోతి)గా ప్రసిద్ధమైంది. ఆమె తండ్రి ఇతిమాద్ ఉద్ దౌలా అంతకు ముందు సంయుక్త దీవాన్‌గా నియమితుడయ్యాడు. తన

కుమార్తె చక్రవర్తిని వివాహమాడిన తర్వాత అతడు వజీరుగా పదోన్నతి పొందాడు. నూర్‌జహాన్ సోదరుడు మిర్జా అబుల్ హసన్ 'అసఫ్‌ఖాన్' అనే బిరుదును పొంది ఖాన్-ఎ-సమన్‌గా నియమితుడయ్యాడు. 1612లో అసఫ్‌ఖాన్ కుమార్తె అర్జుమంద్ బాను బేగం (తర్వాత ముంతాజ్ మహల్) జహంగీర్ మూడవ కుమారుడు రాకుమారుడు ఖుర్రమ్‌ను వివాహం చేసుకుంది. నూర్‌జహాన్ పేరుతో నాణేలు కూడా ముద్రితమయ్యాయి. 1622 నుండి జహంగీర్ ఆరోగ్యం క్షీణించడంతో నూర్ జహాన్ పాలనా వ్యవహారాలను పూర్తిగా నియంత్రించడం మొదలుపెట్టింది. జహంగీర్ ఆమె వర్గీయుల చేతిలో కీలుబొమ్మగా మారిపోయాడు.

**దండయాత్రలు - తిరుగుబాట్లు :** మహారాణా ప్రతాప్ వారసుడు అమర్‌సింగ్‌ను దారికి తెచ్చేందుకు జహంగీర్ దౌత్యనీతిని, యుద్ధాన్ని సమానంగా ప్రయోగించాడు. మొగల్-మేవార్ సంబంధాలలో కొత్త దశ మొదలైంది. ఇద్దరు పాలకులు పరస్పర అవగాహనతో శాంతి ఒప్పందాన్ని (1615) కుదుర్చుకున్నారు.

మేవార్ తర్వాత దక్కను ప్రాంతం జహంగీర్‌కు ప్రధాన సమస్యగా మారింది. అయితే అహ్మద్‌నగర్‌కు చెందిన మాలిక్ అంబర్ (ఇతడు హబ్షీ లేదా అబిసినియా బానిస) గెరిల్లా యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేశాడు. మొగల్ దండయాత్రలను వరుసగా తిప్పికొట్టాడు. 1606లో జహంగీర్ కుమారుడు ఖుస్రో తిరుగుబాటు చేశాడు. అయితే అతడిని ఓడించి నిర్బంధించారు. ఖుస్రో శ్రేయోభిలాషి గురు అర్జున్ (ఐదవ సిఖ్ గురువు)ను శిరచ్ఛేదం చేశారు. తర్వాత ఖుస్రోను గుడ్డివానిగా మార్చివేశారు. సింహాసనంపై హక్కును చాటుకోవడానికి అవకాశం ఇవ్వకూడదనే లక్ష్యంతో అతడి కళ్లను పీకి వేశారు. 1621లో బుర్హాన్‌పూర్ వద్ద ఖుర్రం నియంత్రణలో ఖుస్రో మరణించాడు.

షేర్ ఆఫ్ఘన్, నూర్‌జహాన్‌ల కుమార్తె లాడిలిబేగంను వివాహం చేసుకున్న కారణంగా జహంగీర్ చివరి కుమారుడు షహ్‌ర్యార్‌కు సింహాసనాన్ని అధిష్టించే అవకాశమున్నా అతడు అసమర్థునిగా మిగిలిపోయాడు. కాందహార్‌ను ఇరానీయులు స్వాధీనం చేసుకోవడానికి బయల్దేరినపుడు వారిని అడ్డుకునే బాధ్యతలను ఖుర్రంకు అప్పగించారు. అయితే ఖుర్రం అందుకు నిరాకరించాడు. ఫలితంగా షహ్‌ర్యార్‌కు ఆ బాధ్యతలను అప్పగించారు. ఏ ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఖుర్రం తిరుగుబాటు చేసి తన బలగాలతో ఆగ్రాకు బయల్దేరాడు. 1622-24 మధ్య జరిగిన అంతర్యుద్ధంలో అసఫ్‌ఖాన్ ఖుర్రంను సమర్థించాడు. చివరకు ఖుర్రం లొంగిపోవడంతో అతడిని క్షమించి వదిలివేశారు.

జహంగీర్ రెండవ కుమారుడు పర్వేజ్, మహాబత్ ఖాన్ అనే సేనాని ఖుర్రం తిరుగుబాటును అణచివేయడంలో కీలక పాత్ర పోషించారు. అయితే వారు ఇప్పుడు నూర్‌జహాన్‌కు పోటీదారులుగా మారారు. మహాబత్‌ను బెంగాల్ గవర్నర్‌గా బదిలీ చేశారు. అవిధేయులైన జాగీర్దార్లు, జమీందార్లను వెలివేసిన తర్వాత సామ్రాజ్యానికి దక్కిన ఆస్తుల వివరాలను తెలియజేయాల్సిందిగా మహాబత్‌ను ఆదేశించారు. తన పతనం ఖాయమని మహాబత్ గ్రహించాడు. 1625లో అతడు చక్రవర్తిని, అతడి శిబిరాన్ని తన నియంత్రణలోకి తీసుకున్నాడు. నిర్బంధంలో ఉంటూనే నూర్‌జహాన్ మహాబత్‌కు వ్యతిరేకంగా అసమ్మతిని కూడగట్టింది. అదే

సమయంలో తనను నూర్‌జహాన్ బారి నుండి కాపాడినందుకు కృతజ్ఞతలని జహంగీర్ మహాబత్‌తో నాటకమాడాడు. తన దళాలను పర్యవేక్షిస్తానని ఒప్పించాడు. సైనిక వందనాన్ని స్వీకరించిన తర్వాత బలగాల సారధ్యాన్ని జహంగీర్ తిరిగి దక్కించుకున్నాడు. దీనితో మహాబత్ ఖాన్ పారిపోయాడు.

### జహంగీర్ మరణం, వారసత్వ పోరు :

జహంగీర్ ఆరోగ్యం క్షీణిస్తుండడంతో అందరి దృష్టి అతడి వారసునిపై మళ్లింది. 1627లో కాశ్మీర్‌లోని భీంబర్ వద్ద చక్రవర్తి మరణించాడు. అతడి మృతదేహాన్ని ఖననం చేసేందుకు భీంబర్ నుండి లాహోర్‌కు తరలించారు. షాహ్‌దారా ప్రాంతంలోని దిల్‌సుఖ ఉద్యానవనంలో అతడి స్మారక స్థూపాన్ని నిర్మించారు. తన ఆత్మకథ అయిన తుజుక్–ఎ–జహంగీరిలో జహంగీర్ తన తాగుడు వ్యసనం గురించి ప్రస్తావించాడు. అతడి ఆత్మకథ మంచి సమాచారాన్ని అందిస్తుంది. జహంగీర్ ప్రశ్నించే తత్వాన్ని, ప్రకృతి పట్ల అతడికున్న ఆరాధ్యభావాన్ని ఆ రచన అద్దం పడుతుంది. జహంగీర్ మరణంతో వారసత్వ పోరు అనివార్యమైంది. యుద్ధానికి సిద్ధం కావలసిందిగా షహ్‌ర్యార్‌కు నూర్‌జహాన్ కబురు పంపింది. వెంటనే ఆగ్రాకు తరలిరావాలని సూచిస్తూ అసఫ్‌ఖాన్ ఖుర్రం వద్దకు దూతలను పంపాడు. ఈలోగా జహంగీర్‌కు ప్రీతిపాత్రుడైన దావర్‌బక్ష్ (ఇతడు ఖుస్రో కుమారుడు)ను చక్రవర్తిగా అసఫ్‌ఖాన్ సింహాసనంపై కూర్చోబెట్టాడు. షహ్‌ర్యార్ కూడా తాను చక్రవర్తినని ప్రకటించుకున్నా అతడిని అసఫ్‌ఖాన్ ఓడించి నిర్బంధించాడు. అలాగే దానియల్ ఇద్దరు కుమారులను కూడా ఖైదు చేశాడు. అప్పటికే పర్వేజ్ మరణించి ఉండడంతో ఖుర్రం తనను తాను షాజహాన్‌గా ప్రకటించుకున్నాడు. ఖుర్రం ఆగ్రా చేరుకొనే లోగా దావర్ బక్ష్, షహ్‌ర్యార్, దానియల్ ఇద్దరు కుమారులను తలనరికి చంపివేశారు. పాలక వంశంలోని పోటీదారులందరినీ గుంభనంగా హత్య చేయడంతో షాజహాన్‌కు రాచరిక కుటుంబం నుండి ముప్పు పూర్తిగా తొలగిపోయింది.

## షాజహాన్ (1627-58)

**సైనిక కార్యలాపాలు :** బుందేలాలతో షాజహాన్ యుద్ధం విరామం లేకుండా కొనసాగింది. జహంగీర్ హయాంలో అబుల్ ఫజల్‌ను హత్య చేయడం ద్వారా బీర్‌సింగ్ బుందేలా చక్రవర్తికి అత్యంత సన్నిహితునిగా మారాడు. బీర్‌సింగ్ మరణం తర్వాత అతడి కుమారుడు జుఝర్ పాలనా వారసత్వం పొందాడు. జుఝర్, అతడి కుమారుడు విక్రమజిత్ మొగల్‌లపై తిరుగుబాటు చేశారు. అయితే సామ్రాజ్య సైన్యాలు వారిని నిరంతరంగా వేటాడాయి. చివరికి తండ్రీ కొడుకులిద్దరినీ ముట్టడించి చంపివేశాయి. పర్వత ప్రాంతాలలో సుదీర్ఘ యుద్ధాలను కొనసాగించే సామర్థ్యం మొగల్ సైన్యాలకు కొరవడడంతో ట్రాన్స్–ఆక్సియానాను స్వాధీనం చేసుకోవాలన్న షాజహాన్ ఆశలు నీరుగారాయి.

1639–1647 మధ్య జరిగిన యుద్ధాలలో మొగల్ సైన్యాలు సుమారు ఐదువేల మంది సైనికులను కోల్పోయాయి. షాజహాన్ వాస్తవ పరిస్థితులను గ్రహించి తన పూర్వీకుల రాజ్యాన్ని తిరిగి దక్కించుకోవాలన్న లక్ష్యాన్ని వదులుకున్నాడు.

షాజహాన్ సామ్రాజ్యవాద విధానాలు దక్కనులో ఎక్కువగా విజయవంతమయ్యాయి. అప్పటికే మాలిక్ అంబర్ మరణించి ఉన్నాడు. సామ్రాజ్యసేవలో షాజహాన్ ఎంతో మంది మరాఠా నాయకులను చేర్చుకున్నాడు. వారిలో ప్రముఖుడు షాజీ భోంస్లే. మాలిక్ అంబర్ కుమారుడు ఫత్‌ఖాన్ నిజాం షాహీ పాలకుల మద్దతునుకూడగట్టడంలో విఫలమయ్యాడు. ఫలితంగా అతడు మొగల్ సైన్యాలకు లొంగిపోయాడు. 1636లో షాజహాన్ మరోసారి దౌలతాబాద్‌లో మకాం వేశాడు. అహ్మద్‌నగర్ రాజ్యం మొగల్ సైన్యాలను తట్టుకోలేకపోయింది. చివరకు తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది. బీజాపూర్, గోల్కొండ రాజ్యాలు చక్రవర్తితో శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఖాన్‌దేశ్, బెరార్, తెలంగాణా, దౌలతాబాద్‌లు మొగల్ రాష్ట్రాలుగా మారాయి.

తొలి వైశ్రాయ్ ఔరంగజేబ్ ఈ నాలుగు ప్రాంతాలను 1636 నుండి 1644 వరకు నియంత్రించాడు. అతడి తర్వాత ఆరుగురు వైశ్రాయ్‌లు పని చేసినా వారి పదవీ కాలం చాలా పరిమితంగా ఉండేది. 1652లో దక్కను వైశ్రాయ్‌గా ఔరంగజేబ్ రెండవసారి నియమితుడయ్యాడు. మాలిక్ అంబర్ నిర్మించిన ఖిర్కీ నగరాన్ని మొగల్ దక్కనుకు రాజధానిగా చేసి దానిపేరును ఔరంగాబాద్‌గా మార్చాడు.అయితే దక్కనులో వసూలు చేయబడిన భూమి శిస్తు భారీ సైన్యాన్ని పోషించేందుకు ఏ మాత్రం సరిపోలేదు. కొండలతో దట్టంగా ఉండే ఈ ప్రాంతాన్ని కాపాడుకోవాలంటే భారీ సైన్యం తప్పనిసరి. వనరుల సమస్యపై షాజహాన్, ఔరంగజేబ్‌ల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు 'ఆదాబ్–ఎ–ఆలంగిరి'గా గుర్తింపు పొందాయి.

**వారసత్వ పోరు :** 1657లో షాజహాన్ ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించడంతో సామ్రాజ్యం అంతర్యుద్ధంలోకి (1657–59) జారిపోయింది. షాజహాన్ నలుగురు కుమారులు దారాషికో (రాకుమారుడు), షుజా (బెంగాల్ గవర్నర్), ఔరంగజేబ్ (దక్కను గవర్నర్), మురాద్‌బక్ష్ (మాల్వా, గుజరాత్ గవర్నర్)ల మధ్య వారసత్వ పోరు కొనసాగింది. వారి తోబుట్టువుల్లో జహానారాబేగం దారాకు మద్దతు తెలపగా రోషనారా ఔరంగజేబ్ పక్షాన నిలిచింది. మరో చెల్లెలు గౌహానారా మురాద్ కోసం గూఢాచారిగా పని చేసింది.

షాషుజా, ఔరంగజేబ్‌లు ఒప్పందం కుదుర్చుకున్నారు. మురాద్ కూడా ఔరంగజేబ్‌కు దగ్గరయ్యాడు. షాజహాన్ అనారోగ్యం గురించి తెలుసుకున్న తర్వాత వీరి మధ్య రహస్య సంభాషణలు మరింత ఎక్కువయ్యాయి. 1657 నవంబరు నాటికి షాజహాన్ కోలుకున్నా ఈ విషయాన్ని నమ్మడానికి రాకుమారులు నిరాకరించారు. దారా కబంధహస్తాల నుండి షాజహాన్‌ను విముక్తి చేసేందుకు యుద్ధాన్ని ప్రకటించారు. మురాద్ తనను తాను చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. బెంగాల్‌లో షుజా స్వాతంత్ర్యాన్ని ప్రకటించాడు. షుజా బనారస్‌కు చేరుకున్నప్పుడు అతడిని దారా కుమారుడు సులేమాన్ ఓడించాడు.

అయితే ఔరంగజేబ్ తన పావులను జాగ్రత్తగా కదిపాడు. 1658 మొదట్లో అతడు ఔరంగాబాద్ నుండి బయల్దేరి ఉజ్జయిన్ సమీపంలోని దీపాల్‌పూర్ వద్ద మురాద్‌ను

కలుసుకున్నాడు. వారి సైన్యాలు ధర్మాత్ వద్ద పాగా వేశాయి. మహారాజ జస్వంత్ సింగ్ నేతృత్వంలోని సామ్రాజ్య సైన్యాలు అప్పటికే ఉజ్జెయిన్‌కు చేరుకున్నాయి. ఇద్దరు రాకుమారులు ఆగ్రా వైపు కదలకుండా చూడటం సామ్రాజ్య సైన్యాల లక్ష్యం. తదుపరి జరిగిన యుద్ధంలో రాకుమారులు పైచేయిని సాధించారు. రాజపుత్రులు పారిపోయారు. ఇప్పుడు దారా ఆగ్రా సమీపంలోని సమూగఢ్‌కు తన సైన్యంతో కదిలాడు. అయితే అతడి వ్యూహం విఫలం కావడంతో ఆగ్రాకు పారిపోయాడు. ఆగ్రాను ముట్టడించిన తర్వాత ఔరంగజేబ్ షాజహాన్ ఆహ్వానాలను తిరస్కరించాడు. యమున నది నుండి నీటి సరఫరాను కూడా నిలిపివేయడంతో ఆగ్రాలో నెలకొన్న దీన స్థితిని వివరిస్తూ షాజహాన్ ఔరంగజేబ్‌కు లేఖ రాశాడు. చివరకు నగర ద్వారాలను తెరిపించాడు. ఆ తర్వాత చక్రవర్తిని జనానాకు పరిమితం చేశారు. దారాను అవిశ్వాసిగా ముద్ర వేసిన ఔరంగజేబ్ అతడిని చంపే వరకు చక్రవర్తిని కలవడానికి నిరాకరించాడు.

దారాను వెంబడిస్తూ ఔరంగజేబ్, మురాద్ సైన్యాలు ఢిల్లీకి చేరుకున్నాయి. అయితే మార్గ మధ్యంలో ఔరంగజేబ్ మోసపూరితంగా వ్యవహరించి మురాద్‌ను బందీగా తీసుకొని అతడికి మరణశిక్ష విధించాడు. ఆ తర్వాత ఢిల్లీకి చేరుకొని దారాను వెళ్లగొట్టాడు. ఢిల్లీలో ఔరంగజేబ్ 'ఆలంగిర్' అనే బిరుదుతో సింహాసనాన్ని అధిష్ఠించాడు. దారా కోసం వేటను తీవ్రతరం చేశాడు. అయితే తన ఆధిపత్యానికి షుజానుండి ముప్పు ఏర్పడింది. షుజా తన సైన్యంతో అలహాబాద్‌కు బయల్దేరాడు. ఆగ్రాను స్వాధీనం చేసుకోవడమే అతడి లక్ష్యం. 1658లో జరిగిన ఖాజ్వా యుద్ధంలో షుజా సైన్యం పతనమైంది. ఈ ఓటమితో షుజా తన ప్రాణాలు దక్కించుకునేందుకు అనుచరులతో కలిసి బెంగాల్ వైపు పరుగుతీశాడు. అయితే మీర్ జుమ్లా నాయకత్వంలోని, సామ్రాజ్య సైన్యాలు అతడిని వేటాడాయి. 1660లో బెంగాల్‌కు స్వస్తి పలికిన షుజా తన కుటుంబంతో అరాకన్‌కు ఓడలో తరలిపోయాడు.

ఈలోగా జైసింగ్ దారాను అసమాన ప్రతిభతో వేటాడాడు. బోలాన్ పాస్‌కు బయల్దేరిన దారాను అతడి ఆఫ్ఘన్ అధికారి మాలిక్ జివాన్ కుట్రపన్ని జైసింగ్‌కు అప్పగించాడు. దారాను ఢిల్లీకి తీసుకువచ్చి మతద్రోహం (రిద్దా లేదా ఇర్తిదాద్) నేరంపై మరణశిక్ష విధించారు. 1659లో తాను రచించిన మాజ్మా-ఉల్-బహ్రెయిన్‌లో ఇస్లాం, హిందూ మతాలు కవల సోదరులని పేర్కొన్నందుకే దారాను కఠినంగా శిక్షించారు. 1666లో షాజహాన్ మరణించాడు. నిర్బంధంలో అతడి సంరక్షణ బాధ్యతలను చివరి వరకు జహానారా చూసింది. అతడి మృతదేహాన్ని తాజ్‌మహల్‌లోని ముంతాజ్ మహల్ సమాధి పక్కన పూడ్చిపెట్టారు.

## ఔరంగజేబ్ (1658-1707)

**సంస్కరణలు :** తొలుత కొన్ని పరిపాలనా మార్పులను మాత్రమే ఔరంగజేబ్ ప్రవేశపెట్టాడు. ఉన్నతాధికారాలు గల మన్సబ్‌దార్(ఇవాజ్‌వాజి) ముహ్తాసిబ్‌గా నియమితుడయ్యాడు. షరియా నిబంధనలను(నైతిక పరివర్తనపై) అమలు చేయడం ఇతడి బాధ్యత. అంటే మద్యపాన సేవనం, మత్తు మందుల వాడకం, చట్ట వ్యతిరేక పనులు, వ్యభిచారం వంటి అవలక్షణాలను అరికట్టే బాధ్యత ముహ్తాసిబ్‌పై ఉండేది. అలాగే సున్నీచట్టాలను అమలు

చేయడం, షియా ఆచారాలను అణచివేయడం, నైతిక సంస్కరణలను ప్రవేశపెట్టడం కూడా అతడి విధుల్లో అంతర్భాగమయ్యాయి. చివరగా 1699లో వారికి హిందూ దేవాలయాలను ధ్వంసం చేసే బాధ్యతను అప్పగించారు. పార్సీల ప్రధాన పండుగ నౌరోజ్‌ను సామ్రాజ్యమంతటా నిషేధించారు. కలిమాను నాణేలపై ముద్రించడం ఆపి వేశారు. ఆ పవిత్ర పదాలను అవిశ్వాసులు, మతద్రోహులు అపవిత్రం చేయకుండా నిరోధించేందుకే ఈ చర్యను తీసుకున్నారు.

1658-81ల మధ్య ఉత్తర భారతంలో ఔరంగజేబ్ పాలన అక్బర్ విధానమైన సహజీవనాన్ని క్రమంగా పక్కన పెట్టింది. అతడి తొలి నిబంధనలు ముస్లింలకు ఊరట కలిగించేందుకు, పట్టణ పన్నులను తగ్గించేందుకు ఉద్దేశించబడినవి.ముస్లిం వ్యాపారులకు అన్ని దిగుమతులపై వాటి విలువలో రెండున్నర శాతాన్ని కస్టమ్‌సుంకంగా 1665లో నిర్ధారించారు. అదే హిందూ వ్యాపారుల విషయంలో అయితే పన్నును ఉత్పత్తుల విలువలో ఐదు శాతంగా నిర్ధారించారు.రెండేళ్ల తర్వాత ముస్లింలపై అన్ని పన్నులను రద్దు చేశారు. 1669లో దేవాలయాలు, హిందూ విద్యా సంస్థలను ధ్వంసం చేయాల్సిందిగా సాధారణ శాసనం వెలువడింది. బనారస్‌లోని ప్రసిద్ధ విశ్వనాధ ఆలయాన్ని, మధురలోని కేశవరాయ్ ఆలయాన్ని శిథిలాలుగా మార్చివేశారు. 1679 ఏప్రిల్‌లో హిందువుల నిరసనల మధ్య జిజ్యాను పునరుద్ధరించారు.

**దండయాత్రలు - తిరుగుబాట్లు :** ఔరంగజేబ్ పాలనలోని తొలి పదేళ్లు సైనిక, రాజకీయ పరంగా గొప్ప విజయాలను సాధించాయి. చిన్న చిన్న తిరుగుబాట్లను వెనువెంటనే అణచివేశారు. ఛత్రసల్ కొన్నేళ్లు విధేయుడిగా ఉన్నా అతడు కూడా శివాజీలాగా బుందేల్‌ఖండ్‌లో విముక్తి ఉద్యమానికి నాయకునిగా మారాడు. 1661 నాటికి మీర్ జుమ్లా కూచ్‌బెహార్‌ను స్వాధీనం చేసుకున్నాడు. బ్రహ్మపుత్ర వరకు సైనిక దాడులను నిర్వహించాడు.తర్వాతి సంవత్సరంలో గఢ్‌గావ్ (గౌహతి సమీపంలో)అనే అహోంల రాజధానిలో ప్రవేశించాడు. అహోంల సైన్యం మొత్తం పారిపోయినా అది సాగించిన గెరిల్లా పోరాటం, కరువు మొగల్ సైన్యంపై తీవ్ర ప్రభావం చూపాయి. చివరకు అనారోగ్యంపాలైన మీర్ జుమ్లా అహోం రాజుతో శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. ఢాకాకు వెళుతూ మార్గమధ్యంలో మరణించాడు.

ఔరంగజేబ్ సాధించిన తొలి విజయాలు తర్వాతి కాలంలో ఎదుర్కొన్న వైఫల్యాలు కారణంగా మసకబారిపోయాయి. మధుర ఫౌజ్‌దార్ అబ్దున్‌నబీ సాగించిన ఘోరకృత్యాలు మధుర, ఆగ్రాల చుట్టూ నివసిస్తున్న జాట్‌లను తిరుగుబాటుకు రెచ్చగొట్టాయి. గోక్లా అనే జమీందారు రైతులకు నాయకత్వం వహించి ఫౌజ్‌దార్‌ను చంపివేశాడు.చక్రవర్తే స్వయంగా ఆ ప్రాంతానికి తరలివచ్చి తిరుగుబాటును తాత్కాలికంగా అణచివేశాడు. 1669లో గోక్లాను నిర్బంధించి హత్య చేశారు. అయితే అనతి కాలంలోనే జాట్‌లు తమ విద్రోహచర్యలను పునరుద్ధరించారు. భరత్‌పూర్ సమీపంలోని సింసనిలో జాట్ కోటను రాజారామ్, అతడి కుమారుడు చూరామణ్ బలోపేతం చేశారు. ఆగ్రా, ఢిల్లీ చుట్టూ ఉన్న ప్రాంతాలలో వారు నిర్భయంగా దాడులు నిర్వహించారు. చివరకు సికందర వద్ద ఉన్న అక్బర్ సమాధినికూడా

తవ్వి గుప్త నిధుల కోసం అన్వేషించారు. 1672లో సత్నామీ తిరుగుబాటు వచ్చింది. ఒక రైతుకు, సైనికునికి మధ్య జరిగిన చిన్న ఘర్షణతో ఈ ఉద్యమం రాజుకుంది. సత్నామీలు స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే సామ్రాజ్య సైన్యం ఈ తిరుగుబాటును అణచివేసింది.

సిఖ్‌ల తొమ్మిదవ గురువు గురు తేఘ్ బహదూర్ తన ప్రవచనాలతో మొగల్ పాలకులను ఇబ్బంది పెట్టాడు. 1675లో హసన్ అబ్దల్ వద్ద చక్రవర్తి మకాం చేసినపుడు తేఘ్ బహదూర్‌ను శిరచ్ఛేదం చేశారు.ఈ హత్య ఢిల్లీ కాజీ ఆదేశాలపై జరిగింది. సిఖ్‌ల పదవ గురువు గురు గోబింద్ మత సిద్ధాంతాలను అన్వయించి సైనిక చర్యను సమర్థించాడు.

తాను ప్రతిపాదించిన మత సిద్ధాంతాలకు అనుగుణంగా సిఖ్ మతాన్ని పుచ్చుకునే వారిని ఖాల్సాగా గుర్తించి సింహ్ అనే బిరుదును అందించాడు. సిఖ్‌ల కంచుకోట అయిన ఆనంద్‌పూర్‌కు ఒక మొగల్ సైనిక దళం సరఫరాలను నిలిపివేసింది.గురు కోటను ఖాళీ చేశాడు. అయితే అతడి ఇద్దరు కుమారులను వజీర్‌ఖాన్ చాలా పాశవికంగా హత్య చేశాడు. సర్హింద్ ఫౌజ్‌దార్ చేసిన ఈ ఆకృత్యాన్ని ఖండిస్తూ గురు చక్రవర్తికి లేఖ రాశాడు. ఔరంగజేబ్ మరణం వరకు సిఖ్‌లు, సామ్రాజ్య సైన్యాల మధ్య ఘర్షణలు నిరంతరంగా కొనసాగాయి.

అయితే అన్నింటి కంటే తీవ్రమైన ముప్పును ఔరంగజేబ్ 1678లో ఎదుర్కొన్నాడు. అప్పుడు మహారాజా జస్వంత్ సింగ్ పశ్చిమోత్త గిరిజన ప్రాంతాలలో మరణించాడు. అతడికి వారసులు ఎవరూ లేరు.అయితే గర్భవతి అయిన ఒక రాణి అతడి మరణానంతరం అజీత్ సింగ్‌కు జన్మనిచ్చింది. సర్వోన్నత అధికారిగా ఔరంగజేబ్ మహారాజా ఆస్తిని స్వాధీనం చేసుకొని మార్వార్ ప్రాంతమంతటినీ ఖలీసాగా ప్రకటించాడు. జస్వంత్ బంధువైన ఇంద్రసింగ్ రాథోర్‌ను జోధ్‌పూర్ రాజుగా నియమించాడు. అజీత్‌సింగ్ ఢిల్లీలో నిర్బంధంలో ఉన్నప్పటికీ దుర్గాదాస్ నేతృత్వంలో రాథోర్‌లు అతడిని విడిపించుకొని మార్వార్‌కు తీసుకెళ్లారు. మహారాణా రాజ్‌సింగ్ (మేవార్) జస్వంత్ ప్రధానరాణి రాణి హదితో చేతులుకలిపి అజీత్ సింగ్ వారసత్వాన్ని సమర్థించాడు.

1679లో చక్రవర్తి తన నాల్గవ కుమారుడు అక్బర్‌ను మార్వార్‌పై దండెత్తాల్సిందిగా ఆదేశించాడు. అయితే ఆ రాకుమారుడు అందుకు భిన్నంగా 1681లో రాజ్‌పుత్రుల సహాయంతో తనను తాను చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. తన కుమారుని తిరుగుబాటుతో ఖంగుతిన్న ఔరంగజేబ్ అతడికి వ్యతిరేకంగా సైన్యాన్ని తీసుకెళ్లాడు. దుర్గాదాస్ శిబిరంలో అక్బర్ పేరుతో ఉన్న నకిలీ లేఖలను వెదజల్లి రాజ్‌పుత్రులను అక్బర్ నుండి దూరం చేశాడు. రాజ్‌పుత్రులు అర్ధరాత్రి అక్బర్‌ను ఒంటరిగా వదిలి వెళ్లారు. మార్వార్‌కు తప్పించుకున్న అక్బర్ అక్కడినుండి శివాజీ కుమారుడు శంభాజీ ఆస్థానంలో శరణుపొందాడు. ఈలోగా రాజ్‌సింగ్ కుమారుడు జైసింగ్ చక్రవర్తితో సయోధ్యను కుదుర్చుకున్నాడు.

**దక్కను విధానం :**

1681 సెప్టెంబరులో దక్కనుకు బయల్దేరిన ఔరంగజేబ్ ఆ తర్వాత ఉత్తర భారతదేశానికి ఎన్నటికీ తిరిగి రాలేదు. దక్కనులో నెలకొన్న వాస్తవిక పరిస్థితులను గ్రహించడంలో

అతడు విఫలమయ్యాడు. కొంకణ్‌లో ఉత్తరాన, దక్షిణాన ఉన్న భూభాగాలలో శివాజీ ఒక స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. మరాఠాలను నియంత్రించడానికి ఔరంగజేబ్ బిజాపూర్‌ను ఆక్రమించాలని నిర్ణయించాడు. అప్పుడు సికందర్ ఆదిల్ షా బిజాపూర్ పాలకునిగా ఉన్నాడు. 1686లో బిజాపూర్ స్వాధీనం కావడంతో ఆదిల్ షాహీ వంశం పతనమైంది. దానిని మొగల్ రాష్ట్రంగా మార్చివేశారు. అక్కడ గవర్నర్‌ను నియమించాడు. ఇప్పుడు గోల్కొండ పాలకుడు అబుల్ హసన్ కుతుబ్‌షా వంతువచ్చింది. రాకుమారుడు మువజ్జమ్‌ను గోల్కొండపై దాడి చేయాల్సిందిగా ఔరంగజేబ్ ఆదేశించాడు. మొగల్‌ల ఆక్రమణకు కారకులయ్యారంటూ పాలక వంశీయులు అక్కన్న, మాదన్నలను హత్య చేశారు. అయితే మువజ్జమ్‌ను ద్రోహిగా ఖరారు చేస్తూ స్వయంగా ఔరంగజేబ్ రంగంలో దిగాడు. రాకుమారుడిని నిర్బంధించాడు. 1687లో ఒక ద్రోహి అయిన ఆఫ్ఘన్ కోట ద్వారాలను మొగల్ సైన్యాల కోసం బార్లా తెరిచాడు. అనతి కాలంలో గోల్కొండ మొగల్ సైన్యాల వశమైంది. శంభాజీని నిర్బంధించి సంగమేశ్వర్ వద్ద హత్య చేశారు. అతడి కుమారుడు సాహూతో సహా కుటుంబ సభ్యులందరినీ బందీగా తీసుకున్నారు. ఔరంగజేబ్ సాహూకు 7,000 మన్సబ్‌ను కట్టబెట్టి అతడిని బాగానే చూశాడు. అయితే మరాఠా గెరిల్లాల సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేశాడు. దక్కనులో పరిస్థితి దిగజారింది. బిజాపూర్, గోల్కొండల నుండి స్వాధీనం చేసుకున్న యుద్ధ కానుకలు చక్రవర్తికి తాత్కాలిక ఉపశమనాన్ని కల్గించాయి. ప్రభుత్వ నిల్వలను వ్యయం చేయాల్సిన దుస్థితి తప్పింది. అయితే దక్కను యుద్ధాల చివరి దశకు సరిపడ నిధులు మాత్రం సమకూరలేదు.

మొగల్ సైనిక యంత్రాంగం ప్రతిష్ట దక్కనులో మరాఠాల గెరిల్లా పోరాటంవల్ల, ఉత్తర భారతదేశంలో జమీందార్ల తిరుగుబాట్ల వల్ల అడుగంటింది. మొగల్ సైన్యానికి సేవలందించిన భీంసేన్ 17వ శతాబ్దం చివరలో మరాఠాల ఆవిర్భావంపై వాస్తవిక విశ్లేషణను అందించాడు. 1707లో తన 89వ ఏట ఔరంగజేబ్ మరణించడంతో గొప్ప మొగల్ పాలకుల శకం ముగిసింది. మతమౌఢ్యం, అలౌకిక విధానాలు ఔరంగజేబ్ వైఫల్యాలకు కారణమని చెబుతారు.

అయితే తీవ్ర సంక్షోభానికి దారి తీసిన కారణం మాత్రం దక్కనులో సమస్యలను వాస్తవిక దృష్టితో పరిశీలించకపోవడమే. రాకుమారుడు అక్బర్ తిరుగుబాటు తర్వాత ఔరంగజేబ్ తన ముగ్గురు కుమారులను ఎన్నడూ విశ్వసించలేదు. షాజహాన్ తన జీవిత చరమాంకంలో ఎదుర్కొన్న సమస్యలను గుర్తు తెచ్చుకొని ఔరంగజేబ్ చాలా కంగారు పడేవాడు. మరాఠాలను సర్వనాశనం చేయడం కంటే తన కుమారుల ఎత్తుగడలను చిత్తు చేయడంపైనే అతడు ఎక్కువ దృష్టిని కేంద్రీకరించాడు.

### ఔరంగజేబ్ మత విధానం

1707 ఔరంగజేబ్ మరణం తర్వాత మొగల్ సామ్రాజ్య విచ్ఛిన్న ప్రక్రియ ఊపందుకుంది. తన 49 ఏళ్ల సుదీర్ఘ పాలనలో తండ్రి నుండి వారసత్వంగా పొందిన

సామ్రాజ్యాన్ని అన్ని దిశలలో విస్తరించేందుకు ఔరంగజేబ్ చాలా కృషి చేశాడు. అయితే అతడు కొనసాగించిన సైనిక దండయాత్రలు – మరీ ముఖ్యంగా దక్కనులో – సామ్రాజ్య వనరులపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చాయి. రైతాంగంపై పన్ను భారం ఎక్కువైంది. రాజకీయ సామంతులు చక్రవర్తి నియంత్రణ నుండి విముక్తి కావడం మొదలుపెట్టారు. అయితే చాలా వరకు ఔరంగజేబ్ అవలంబించిన మత విధానాలను అతడి వైఫల్యాలకు ఒక ప్రధాన కారణంగా పేర్కొంటారు. ఔరంగజేబ్ విధానాలను క్లుప్తంగా పరిశీలించడం ఎంతైనా అవసరం. అతడి పాలనా స్వభావాన్ని అర్థం చేసుకోవడానికే కాకుండా హిందూ ముస్లింల మధ్య ఉన్న సంబంధాలను అంచనా వేయడానికి కూడా ఈ అధ్యాయనం అవసరం. అలాగే చరిత్రలు ఎలా రాస్తారు, మెజారిటీ, మైనారిటీ అన్నభావనలు ఎలా ఏర్పడతాయి, అవి రాజకీయ పదకోశంలో ఎలా అంతర్భాగమవుతాయన్న ప్రశ్నలు అడగడం కూడా చాలా అవసరం.

1658లో పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ఔరంగజేబ్ ఒక సంవత్సరం వ్యవధిలోనే ముహ్తసిబ్‌లను నియమించాడు. సార్వజనిక నీతి సూత్రాలను అమలు చేసే ఈ అధికారులు ప్రతి పెద్ద నగరంలోనూ ఉలేమా వర్గాల నుండి ఎంపిక చేయబడ్డారు. ప్రతి చోట షరియా లేదా ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయడంపై అతడు ఆసక్తి చూపాడు. ఇస్లాం నిబంధనలకు విరుద్ధమైన మద్యపానం, జూదం లాంటి నీతిబాహ్యమైన చర్యలను బహిరంగ ప్రదేశాలలో నిషేధించాలని ఆదేశించాడు.

అయితే ఆదిలోనే అతడో సమస్యను ఎదుర్కొన్నాడు.తన స్వంత తండ్రి పట్ల అతడు వ్యవహరించిన తీరుపై ప్రశ్నలు ఉదయించాయి. తండ్రిని నిర్బంధించాడన్న ముద్రగల పాలకుడు నీతిమంతుడు లేదా నిజమైన విశ్వాసిగా తనను తాను ఎలా నిరూపించుకోగలడు? ఫలితంగా తన అధికారానికి హిజాజ్‌లోని పవిత్ర భూముల నుండి గుర్తింపును కోరుకున్నాడు. ఆ పవిత్ర భూముల మహాపోషకుడయ్యాడు. ఖురాన్‌ను అధ్యయనం చేయడానికి అతడు ఏడు సంవత్సరాలు వెచ్చించాడని కూడా చెబుతారు. తన పూర్వీకుల వలె కాకుండా అతడి పాలన నిరాడంబరంగా కొనసాగింది. అక్బర్, షాజహాన్‌ల హయాంలో నిర్మాణకళకు దక్కిన ప్రాధాన్యత ఔరంగజేబ్ పాలనలో నిరాదరణకు గురైంది. ఆస్థాన సంగీత విద్వాంసులను కూడా అతడు తొలగించాడు.

ఔరంగజేబ్ హిందూ పాలితుల దృష్టికోణం నుండి చూస్తే అతడి విధానాలు 1668–69 నుండి తీవ్ర ప్రభావం చూపడం మొదలుపెట్టాయి. 1668లో హిందూ మత జాతరలను నిషేధించారు. తదుపరి సంవత్సరంలో హిందూ ఆలయాల నిర్మాణాన్ని, చివరకు మరమ్మతులను నిషేధించారు. 1669లో చక్రవర్తి దర్శనాన్ని కూడా రద్దు చేశారు. 1679లో ముస్లిమేతరులపై జిజ్యాను పునరుద్ధరించడం వరకూ వెళ్లాడు. ఒక చారిత్రక ఆధారం ప్రకారం ఎర్రకోట సమీప ప్రాంతంలో హిందువుల ప్రతిఘటనను అణచివేయడానికి గజదళాన్ని మోహరించారు. జిజ్యాను వ్యతిరేకిస్తూ హిందువులు అప్పుడు పెద్ద ఎత్తున ఉద్యమించారు. చారిత్రక సాక్ష్యాన్ని పరిశీలిస్తే ఔరంగజేబ్ మత విధానం హిందువుల పట్ల వివక్ష చూపిందని చెప్పడంలో ఎలాంటి సందేహం ఉండదు. సిఖ్‌లు, ఇతర ముస్లిమేతరులను శత్రుభావంతో చూశారు. ఏమైనప్పటికీ సమకాలీన ఆధారాల నుండి అనేక సాక్ష్యాలను ముందుకు తీసుకొచ్చారు. అయితే చారిత్రక నివేదనలో వాటిని పొందుపరచడం అనవసరం.

హిందువులను బలవంతంగా మత మార్పిడులకు గురి చేశారని అనేక మంది చరిత్రకారులు పేర్కొన్నప్పటికీ మతమార్పిడి ఏ స్థాయిలో జరిగిందన్న విషయమై సాక్ష్యం చాలా పరిమితంగా లేదా నామమాత్రంగా ఉండడం ఆశ్చర్యం కలిగించే విషయం. అసలు మత మార్పిడిని అధికారిక విధానంగా అమలు చేశారా లేదా వాటిని కేవలం ప్రోత్సహించారా అన్న విషయం కూడా స్పష్టం కాలేదు.

కుల వివక్ష ఇనుప సంకెళ్ల మధ్య నలిగే అసంఖ్యాక హిందువులకు మత మార్పిడి ఇప్పటి లాగే అప్పుడు కూడా ఆకర్షణీయంగా కనిపించి ఉండవచ్చు. ఔరంగజేబ్ అందించిన ప్రోత్సాహకాలు ఏమిటన్న విషయం కూడా స్పష్టం కాలేదు. ఒక వేళ విద్వాంసులు వాదించినట్లు అతడు ప్రోత్సాహకాలే కనక అందించి ఉంటే అవి నేటి ఆధునిక లౌకికవాద రాజకీయ నాయకులు తమ నియోజకవర్గ ప్రజలకు అందించే తాయిలాలకు భిన్నంగా ఉండి ఉంటాయి. హిందూ ఆలయాలు, విగ్రహాల విధ్వంసకారునిగా ఔరంగజేబుకు ఉన్న ముద్ర మాటేమిటి? దక్కనులో హిందూ ప్రార్థనా మందిరాలను ఎప్పుడో కాని కూల్చివేయలేదు. ఈ ప్రాంతంలో ఔరంగజేబ్ విస్తృతంగా దండయాత్రలు నిర్వహించినా దేవాలయాలను పెద్ద ఎత్తున ధ్వంసం చేసిన దాఖలాలు ఎక్కడా కనిపించవు. ఉత్తర భారత భూభాగంలో కొన్ని ఆలయాలను నిస్సందేహంగా కూల్చి వేశారు. అయితే అందుకుగల నిర్దిష్ట కారణాలను నిర్ధారించడానికి విస్తృత అధ్యయనం అవసరం. అలాంటి ఒక దేవాలయం ప్రసిద్ధ కేశవరాయ్ ఆలయం (మధుర). అయితే ఇక్కడ ఔరంగజేబ్ ప్రతీకార భావనతోనే ఎక్కువగా వ్యవహరించినట్లు కనబడుతోంది. ఎందుకంటే ఆ ప్రాంతంలోలోని జాట్‌లు మొగల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిపి ఉన్నారు.

తన పూర్వీకుల వలే ఔరంగజేబ్ కూడా హిందూ దేవాలయాలకు భూదానాలు చేశాడు. అలహాబాద్‌లోని సోమేశ్వర్‌నాథ్ మహదేవ్ ఆలయం, బనారస్‌లోని జంగంబాడి శివాలయం, గౌహతిలోని ఉమానంద్ ఆలయం అందుకు ఉదాహరణలు. కేవలం రాజకీయ అవసరాల కోసమే ఈ భూదానాలను చేసి ఉన్నట్లయితే దేవాలయాల విధ్వంసాన్ని కూడా రాజకీయ కోణం నుండి ఎందుకు పరిగణించకూడదు? ఈ విషయాన్ని ఉద్దేశపూర్వక విధానమని ఎందుకు భావించాలి? పైగా ఇటీవలి అధ్యయనంలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. షాజహాన్ హయాంలో 24.5 శాతం ఉన్న హిందూ అధికారులు ఔరంగజేబ్ పాలన నాల్గవ దశాబ్దంలో 33 శాతానికి పెరిగారు. అలాగే సున్నీ వర్గానికి చెందిన ఔరంగజేబ్ హిందు లేదా ముస్లిం రాజ్యాల్లాగే షియా రాజ్యాలైన బిజాపూర్, గోల్కొండల పట్ల కూడా కఠినంగా వ్యవహరించాడు. ముస్లిం సముదాయ ప్రయోజనాలను పరిరక్షించడంతోపాటు వాటిని మరింత విస్తరించడానికి ఉలేమాల ప్రత్యేక అధికారాలను పునరుద్ధరించడానికి ఔరంగజేబ్ పై చర్యలు తీసుకొని ఉంటాడని స్పష్టంగా చెప్పగలము. అయితే హిందువులు, షియాలు, ఇతరుల పట్ల అతడు తీసుకున్న చర్యలు విభిన్న విశ్లేషణకు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి.

6

# శివాజీ, పేష్వాల నాయకత్వంలోని మరాఠాలు

**పరిచయం:**

మహారాష్ట్రి - ప్రాకృత భాషల నుండి ఆవిర్భవించిన మరాఠీ 10వ శతాబ్దం నుండి ఈ ప్రాంత ప్రజల వాడుక భాషగా ఉంది. కాలక్రమంలో మహారాష్ట్ర అనే పదాన్ని ఈ ప్రాంతాన్ని వర్ణించడానికి ఉపయోగించారు. అపరాంత, విదర్భ, ములక, అస్మక, కుంతల అనే ప్రాంతాల కలయికే మహారాష్ట్ర. నాగ, ముండ, భిల్ అనే తెగ సముదాయాలు ఈ ప్రాంతంలో జీవించాయి. ప్రాచీన కాలంలో ఈ ప్రాంతాన్ని దండకారణ్య అని కూడా పిలిచేవారు. ఈ తెగలతోపాటు ఆర్యులు, సాకాలు, హునాలు ఉత్తర భారతం, విదేశాల నుండి భూ, సముద్ర మార్గాల ద్వారా వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. దక్షిణం నుండి వచ్చిన ద్రవిడులు ఇక్కడ వలసవాద కేంద్రాలను స్థాపించారు. మరాఠాలుగా ఉమ్మడిగా గుర్తింపు పొందిన వర్గంతో కలిసిపోయారు. 17వ శతాబ్దం మధ్య దశకాల నుండి 19వ శతాబ్దం తొలి దశకాల వరకు మహారాష్ట్ర రాజకీయ వ్యవహారాలలో మరాఠాలు ప్రధాన పాత్రను పోషించారు. చారిత్రక అవసరాల కోసం మరాఠీ మాట్లాడే ప్రజలందరినీ ఉమ్మడిగా గుర్తించేందుకు మరాఠా అనే పదాన్ని ఉపయోగించినా వాస్తవానికి అది ఒక ప్రత్యేక సముదాయాన్ని సూచిస్తుంది. ఈ సముదాయం మధ్యయుగాల నుండి మహారాష్ట్ర రాజకీయ రంగాన్ని శాసించింది.

ఈ మరాఠాలు ఎవరు? మహారాష్ట్రకు చెందిన మరాఠీ మాట్లాడే సముదాయ పుట్టుపూర్వోత్తరాలను ఖచ్చితంగా గుర్తించలేము. అసలు ఆ పదం మహారాష్ట్ర నుండి వచ్చిందా లేదా నివాసితుల వల్ల ఆ భూమికి ఆ పేరు వచ్చిందా అని తేల్చడం కూడా కష్టం. మరాఠాల పుట్టుకపై రిస్లే ప్రతిపాదించిన స్కైతో-ద్రవిడియన్ సిద్ధాంతాన్ని నేడు తిరస్కరించినప్పటికీ మరాఠాల అన్ని వర్గాల్లోనూ తొలి తెగ అంశాలు ఇమిడి ఉన్నాయన్న విషయాన్ని మాత్రం కాదనలేము. మరాఠా కుదురులు చాలా వరకు ప్రతీకాత్మమైనవి. ఖండోబా (ఖడ్గ పిత్రువు), భవానీ (దైవమాత) మరాఠాల ఆరాధ్యదైవాలు. అల్-బెరూని (1030), ఇబ్న్ బట్టుట (1340)ల

కథనాలలో మరాఠాలకు సంబంధించిన వర్ణనలు కనిపిస్తాయి. అయితే 17వ శతాబ్దంలో శివాజీ నేతృత్వంలోనే మరాఠాలు రాజకీయంగా ప్రాముఖ్యతను సంతరించుకున్నారు.

అదృష్టం కొద్దీ మరాఠాలు ఎదిగారని గ్రాంట్ డఫ్ లాంటి చరిత్రకారులు కొట్టి పారేస్తే జస్టిస్ రణడే లాంటి వారు మరాఠాల ఆవిర్భావం వారి నాయకుల కఠిన శ్రమవల్లే సాధ్యమైందని చెబుతారు. మరాఠా నాయకులు అంతకు ముందు దక్కను సుల్తాన్‌ల సైనిక సేవలో ఉండేవారు.

భోంస్లే, జాదవ్, నింబల్కర్, మోరే, మాణే, ఘాట్గే, ఢాఫ్లే, సావంత్, షిర్కే, మహాదిక్, మోహితే లాంటి మరాఠా నాయకులు అహ్మద్‌నగర్ నిజాం షాహీలు, బిజాపూర్ ఆదిల్‌షాహీల సేవలో ఉంటూ సైనిక, పాలనా వ్యవహారాలలో అద్భుతమైన శిక్షణ పొందారు. మాలోజీ భోంస్లే (1552–1606) తన చిన్న ఆశ్విక దళంతో నిజాం షా సేవలోచేరాడు. అతడి కుమారుడు షాహ్‌జీ (1599–1664) నిజాం షా, ఆదిల్ షాలకు సేవలందించి ప్రముఖ మరాఠా నాయకునిగా ఎదిగాడు. షాహ్‌జీ కుమారుడు శివాజీ మరాఠా రాజ్యాన్ని స్థాపించాడు. అతడు 1630 ఫిబ్రవరి 19న శివ్‌నేర్ కోటలో జన్మించాడు. ఆచరణలో స్వతంత్రమైన తన పూణె, సుపా జాగీరును షాహ్‌జీ శివాజీకి వారసత్వంగా మిగిల్చాడు. శివాజీ (1630–80) మావ్లా, కోంకణ్, దేశ్ ప్రాంతాలలో మరాఠా నాయకులను సమీకరించి ఒక చిన్న రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. సమర్థవంతమైన పౌర, సైనిక పరిపాలనతో రాజ్యాన్ని స్థిరీకరించాడు. తన రాజ్యంలో అన్ని మతాలు, వర్గాలను చోటు కల్పించడానికి అతడు పరమత సహనమే విధానాన్ని అవలంబించాడు. తొలి మరాఠా ఛత్రపతి (పాలకుడు) శివాజీ శివరాయ్ హన్ అనే బంగారు నాణేన్ని తన పట్టాభిషేకం (1674) నాడు ఆవిష్కరించాడు. తన 50వ ఏట (1680 ఏప్రిల్ 5) అతడి అకాల మరణంతో రాజకీయ శూన్యత ఏర్పడింది.

శివాజీ కుమారుడు శంభాజీ (1657–89) తన తొమ్మిదేళ్ల స్వల్ప పాలనాకాలంలో స్థానిక పోరుకు తోడు సిద్దీలు, పోర్చుగీసు, మొగల్‌ల నుండి దాడులను ఎదుర్కొన్నాడు. 1689లో మొగల్ సైనికుల చేతిలో అతడు హత్యకు గురి కావడంతో మరాఠా ప్రాంతంలో దేశభక్తి భావం బలపడింది. మరాఠాలు శంభాజీ సోదరుడు రాజారామ్ (1670–1700) నాయకత్వంలో ఔరంగజేబ్ సామ్రాజ్య సైన్యంతో నిరంతరంగా పోరాడారు. 1707లో తాను మరణించే వరకు ఔరంగజేబ్ మరాఠాల ఆధిపత్యాన్ని అణచివేయడానికి విఫలయత్నాలు చేశాడు. రాజారామ్ విధవ తారాబాయి తన కుమారుడు రెండవ శివాజీ (1700)ని ఛత్రపతిగా ప్రకటించింది. అయితే శంభాజీ కుమారుడు షాహు (1707) మొగల్ నిర్బంధం నుండి విడుదలై మరాఠా నాయకుల మద్దతును కూడగట్టడంతో మహారాష్ట్రలో అంతర్యుద్ధం మొదలైంది. తారాబాయి పన్హాలా (కోల్హాపూర్) వద్ద వేరే గద్దెను ఏర్పాటు చేసింది. అంతఃపుర తిరుగుబాటుతో రెండవ

శివాజీ గద్దె దిగాడు. రాజారామ్ రెండవ కుమారుడు శంభాజీ–2ను కోల్హాపూర్ రెండవ ఛత్రపతిగా తారాబాయి ప్రకటించింది. 1731లో కుదిరిన వార్నా ఒప్పందంతో షాహు ఈ రాజ్యాన్ని చివరకు గుర్తించాడు.

**శివాజీ రాకకు ముందు మరాఠాలు :**

అహ్మద్‌నగర్ నిజాం షాహీలు, బిజాపూర్ ఆదిల్ షాహీల పాలన కింద మహారాష్ట్రలోని చాలా భూభాగం ఉండేది. ఈ రెండు రాజ్యాలు మహారాష్ట్రను ఉమ్మడిగా పంచుకున్నాయి. ఈ రెండు పాలక వంశాలు అలౌకిక దృక్పథంతో తమ పాలితులను అణచివేశాయి. రెండు రాజ్యాలు పరస్పరం కలహించుకోవడంతో మరాఠా ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మహారాష్ట్రలో జాగీర్లు కలిగిన దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు చాలా మంది ఉండేవారు. వారు తమ జాగీర్లపైనే దృష్టి సారిస్తూ తమ ప్రాంత ప్రజల సంక్షేమాన్ని విస్మరించారు. అంతర్గత కలహాల వల్ల ప్రజలు మరింత ఇబ్బందికి గురయ్యారు. ప్రతిచోటా అరాచకత్వం నెలకొంది. ఆ విధంగా మహారాష్ట్ర ప్రజలు ఈ అణచివేతతో విసిగిపోయారు.

భారతదేశంలో మరాఠాల ప్రాబల్యం పెరగడానికి శివాజీ ఎంతో కృషి చేశాడన్నది వాస్తవం. అయితే అతడు రాజకీయ తెరపైకి వచ్చిన సమయంలో పరిస్థితులు అందుకు పూర్తిగా అనుకూలంగా ఉన్న మాట కూడా వాస్తవమే. ఈశ్వరీ ప్రసాద్ ప్రకారం : "కాని శివాజీ ఎదుగుదలను మరాఠా చరిత్రలో ప్రత్యేక దృగ్విషయంగా పరిగణించకూడదు. శివాజీ వ్యక్తిగత ధీరత్వంతోపాటు దక్కను రాజ్య భౌగోళిక పరిస్థితి కూడా అంతే ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. అన్ని మతాల సంగమమైన ఈ ప్రాంతంలో ప్రజలు 15,16వ శతాబ్దాలలో కొత్త ఆశలు, ఆకాంక్షలను పెంచుకున్నారు." మరాఠా ప్రాంత ప్రత్యేక భౌగోళిక లక్షణాలు మరాఠాలలో ప్రత్యేక సామర్థ్యాలను పెంచి వారిని భారతదేశంలోని ఇతర ప్రజలకు భిన్నంగా నిలిపాయి.

బయటి ఆక్రమణదారుల నుండి పర్వత ప్రాంతం మరాఠాలకు రక్షణ కల్పించింది. మరాఠాలను భీకర యుద్ధ వీరులుగా తీర్చిదిద్దింది. వర్షపాతం తక్కువ కావడం, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో మరాఠాలలో స్వయం పోషణ, కఠిన శ్రమ స్ఫూర్తి పెంపొందింది. ఈ అర్హతలు లేకుండా ఉన్నట్లయితే వారు ఆకలిచావులకు గురయ్యేవారు. వారి మొండితనమే వారిని విజయపథంలో నిలిపింది.పర్వత ప్రాంతాలలో చిన్న చిన్న బృందాలుగా మరాఠాలు యుద్ధానికి పాల్పడితే క్రమబద్ధ మొగల్ సైన్యం దుర్భర పరిస్థితిని ఎదుర్కొంది. పర్వత ప్రాంతం గెరిల్లా యుద్ధం నిర్వహించడానికి మరాఠాలకు బాగా అనుకూలించింది. కొండల్లోని మార్గాలు, రాతి నిర్మాణాలు రక్షణ కవచాలుగా మారాయి.

**మరాఠా సర్దార్లు :**

తెరపైకి శివాజీ రాకముందే మరాఠాలు సైనిక, పాలనా రంగాలలో శిక్షణ పొందారు. బేణి ప్రసాద్ ప్రకారం "గెరిల్లా యుద్ధంలో ఆరితేరిన మాలిక్ అంబర్ మరాఠా జాతీయత

నిర్మాతలలో ముందు వరుసలో నిలుస్తాడు." గెరిల్లా యుద్ధతంత్రాన్ని మరాఠాలు దక్కనులోని ముస్లిం రాజ్యాలలో నేర్చుకున్నారు. ఈ రాజ్యాల్లోని రెవెన్యూ శాఖలలో మరాఠాలు పని చేసేవారు. కొందరిని ముస్లిం పాలకులు మంత్రులుగా కూడా నియమించారు. రాజ్‌రాయ్ కుటుంబానికి చెందిన మురార్‌రావు, మదన్ పండిత్ లాంటి వారు గోల్కొండ రాజ్యంలో మంత్రి పదవులను వరుసగా నిర్వహించారు. బిజాపూర్‌లో నార్సోకాలే, యేసు పండిత్ లాంటి ప్రముఖులు ఉన్నత సేవలను అందించారు. అహ్మద్‌నగర్ పాలకులు దౌత్యపరమైన విధుల కోసం బ్రాహ్మణ రాయబారులను నియమించారు.

తొలుత బహమనీ రాజ్యంలో మరాఠా సిలేదార్లు, బార్గీలు నియమితులయ్యారు. తర్వాత ఏర్పడిన ఐదు రాజ్యాలలో కూడా వీరు సేవలు అందించారు. ఆ విధంగా సైనిక, పాలనా వ్యవహారాలలో దక్కిన శిక్షణ మరాఠాలకు విద్య, అధికారం, సంపదను తెచ్చి పెట్టింది. మరాఠా జాగీర్దార్లు షాహ్‌జీ భోంస్లే, మురార్‌రావ్ జోగ్దేవ్‌లు అహ్మద్‌నగర్, బిజాపూర్ రాజకీయాలలో ప్రముఖ పాత్రను పోషించారు. జహంగీర్, షాజహాన్ హయాంలో ఈ పరిణామం సంభవించింది. భక్తి ఉద్యమం దేవునిపట్ల విధేయతను ప్రచారం చేసినట్లే మరాఠా సర్దార్లు ధీరత్వమనే సాంప్రదాయాన్ని నెలకొల్పారు. ఈ కాలంలో అరాచక పరిస్థితులు నెలకొన్నాయి. ఆదిల్‌షాహీ, నిజాం షాహీ రాజ్యాలు నిరంతర పోరులో మునిగిపోయాయి. ఈ యుద్ధాలలో అవి మరాఠా సర్దార్ల సైన్యాలను వినియోగించాయి. మరాఠా సర్దార్లందరికీ వ్యక్తిగత సైన్యాలు ఉండేవి. అలాంటి ఒక సర్దారు తన సైన్యంతో సుల్తాన్ వద్దకు వెళితే సుల్తాన్ అతడికి ఉపాధి కల్పించడంతోపాటు తన రాజ్య సర్దారుగా నియమించేవాడు. కొన్నిసార్లు వారికి జాగీర్లను కూడా కట్టబెట్టేవాడు. అలాంటి జాగీరును పొందే సర్దారు తనను తాను రాజుగా పరిగణించుకునేవాడు.

అహ్మద్‌నగర్, బీజాపూర్ ఆస్థానాలలో ప్రముఖ సర్దార్లు ఎందరో ఉండేవారు. వారిలో ముఖ్యులు సింధ్‌ఖేడ్‌కు చెందిన జాధవ్‌లు, ఫల్టన్‌కు చెందిన నింబల్కర్‌లు, ముధోల్ ఘోర్పాడేలు, జావలి మోరేలు, వెరుల్ భోంస్లేలు. సింధ్‌ఖేడ్ జాధవ్‌లు దేవగిరి యాదవులు తమ పూర్వీకులని వాదించేవారు. శివాజీ తల్లి జిజాబాయి సింధ్‌ఖేడ్‌కు చెందిన లాఖుజీ జాధవ్ కుమార్తె. ఈ సర్దార్లందరూ పరాక్రమవంతులు. అయితే ఒకరినొకరు బద్ధశత్రువులుగా పరిగణించేవారు. అందరూ ఏకమై తమ ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన వీరికి ఎన్నడూ తట్టలేదు. ఫలితంగా వారి ధీరత్వం, పోరాట పటిమ అన్నీ ఇతరుల ప్రయోజనాలను నెరవేర్చాయి. అయినప్పటికీ వారు యుద్ధ స్ఫూర్తిని కొనసాగించారు. ముఖ్యంగా యువతలో ఈ స్ఫూర్తి నెలకొంది. వారి కుటుంబాలలో ఎందరో ప్రముఖ సేనానులు జన్మించారు, తమ యుద్ధ సాంప్రదాయాన్ని కొనసాగించారు.

ప్రముఖ కుటుంబాలలో వెరుల్ భోంస్లేలు అసమాన ధైర్య సాహసాలను కనబరిచారు. బాబాజీ భోంస్లేకు ఇద్దరు కుమారులు. మాలోజీ పెద్దవాడు, విఠోజీ చిన్నవాడు. బాబాజీకి వెరుల్ గ్రామంలో పాటిల్ హక్కులు ఉండేవి. మాలోజీ, విఠోజీ ఇద్దరూ పరాక్రమవంతులు. సాయుధ మరాఠా సైనికులు వారి కింద పని చేసేవారు. అరాచక పరిస్థితులలో మొగల్ చక్రవర్తి నిజాం షాపై దాడి చేశాడు. మాలిక్ అంబర్ నిజాం షా ముఖ్యమంత్రిగా ఉండేవాడు. ఈ ఇద్దరు సోదరులు అంబర్ దృష్టిని ఆకర్షించారు. అతడి సూచనపై షా వారికి పూణె, సూపా పరగణాలను జాగీరుగా కట్టబెట్టాడు. మాలోజీ భార్య ఉమాబాయి నింబల్కర్ కుటుంబానికి చెందిన మహిళ. వీరికి షాహ్‌జీ, షరీఫ్‌జీ అనే ఇద్దరు కుమారులు కలిగారు. మాలోజీ ఇందాపూర్ వద్ద యుద్ధంలో మరణించినపుడు షాహ్‌జీకి ఐదేళ్లు. పిల్లలను, జాగీరును సంరక్షించిన విఠోజీ షాహ్‌జీ కోసం లాఖుజీ జాధవ్ కుమార్తె జిజాబాయ్‌ని అడిగాడు. ఈ ప్రతిపాదనను జాధవ్ అంగీకరించడంతో షాహ్‌జీ, జిజాబాయ్‌ల వివాహం ఆడంబరంగా జరిగింది.

మాలోజీకి ప్రదానం చేసిన జాగీరును నిజాంషా షాహ్‌జీకి బదిలీ చేశాడు. షాహ్‌జీని నిజాంషా ఆస్థానంలో ఎంతో గౌరవంగా చూసేవారు. నిజాం షా రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవడానికి మొగల్‌లు ప్రయత్నించినపుడు మాలిక్ అంబర్‌తో కలిసి షాహ్‌జీ తీవ్రంగా ప్రతిఘటించాడు. అయితే తర్వాతి కాలంలో నిజాంషా రాజ్యంలో అనిశ్చితి ఏర్పడింది. పరిస్థితిలో మార్పు రాకపోవడంతో విసిగిపోయిన షాహ్‌జీ నిజాం షా రాజ్యాన్ని వదలి బిజాపూర్ ఆదిల్ షా పక్షాన చేరాడు. ఆదిల్ షా అతడికి 'సర్ లష్కర్' అనే బిరుదును ప్రదానం చేశాడు. ఈలోగా నిజాంషా రాజ్యంలో ముఖ్యమైన పరిణామాలెన్నో సంభవించాయి. మాలిక్ అంబర్ మరణించాడు, ఆ రాజ్యం దయనీయమైన పరిస్థితుల్లో ఉండిపోయింది. అదే సమయంలో షాజహాన్ ఆ రాజ్యంపై దాడి చేశాడు. ఈ కీలక దశలో షాహ్‌జీ మరోసారి నిజాంషా కొలువుకు తిరిగి వచ్చాడు.

**శివాజీ జీవితం - సైనిక విజయాలు :**

షాహ్‌జీ భోంస్లే, జిజాబాయి దంపతులకు శివాజీ జన్మించాడు. 1637లో పూణే జాగీరును తన తండ్రి నుండి వారసత్వంగా పొందాడు. 1647లో తన సంరక్షకుడు దాదాజీ కొండదేవ్ మరణించిన తర్వాత శివాజీ తన జాగీరుపై సంపూర్ణ ఆధిపత్యం సాధించాడు. అయితే బిజాపూర్ నుండి రాయ్‌గఢ్, కొండన, తోర్నాలను ముందే (1645–47) స్వాధీనం చేసుకున్నాడు. 1656లో చందారావు మోరే నుండి జావ్లీ ప్రాంతాన్ని ఆక్రమించడంతోనే అతడి సైనిక విజయాల పరంపర మొదలైంది. జావ్లీని స్వాధీనం చేసుకోవడంతో శివాజీకి మావ్లా ఎగువ ప్రాంతాలపై ఆధిపత్యం లభించింది. మావ్లీ పదాతి దళాలు అతడి సైన్యంలో బలమైన భాగమయ్యాయి. 1657–58 మధ్య అతడు ఆదిల్ షాహీ ప్రాంతాలపై దాడి చేశాడు.

శివాజీ కలలు గన్న స్వరాజ్ ఏ విధంగా సాకారం కానుందో సుల్తాన్ ఆదిల్‌షా అంచనా వేయగలిగాడు. తీవ్ర ఆందోళనతో నిస్సహాయునిగా మిగిలిపోయాడు. ప్రతి రోజూ ఏదో ఒక కోట లేదా ప్రాంతమో శివాజీ వశమైందన్న సమాచారాన్ని సుల్తాన్ అందుకునే వాడు. సుల్తాన్ పెంపుడు తల్లి ఆలియా బేగం స్వయంగా తానే దర్బారును నిర్వహించింది. బిజాపూర్‌లోని ప్రముఖ నాయకులంతా ఆ దర్బారుకు హాజరయ్యారు. దర్బారుకు హాజరైన వారినుద్దేశిస్తూ ఆలియా బేగం ఒక సవాలు విసిరింది : "శివాజీని బంధించి ఇక్కడికి తీసుకురాగలిగిన వారు మీలో ఎవరైనా ఉంటే అందుకు గుర్తుగా ఇక్కడికి వచ్చి పాన్‌ను స్వీకరించండి." ఒక వెండి కంచంలో ఆమె పాన్‌ను ఉంచింది.ఒక ఏడు అడుగుల అజానుబాహుడు లేచి నిలబడి ఆ పాన్‌ను స్వీకరించాడు. అతడే అఫ్జల్ ఖాన్. పఠాన్ అయిన అఫ్జల్‌ఖాన్ పరాక్రమంతుడు. అతడు క్రూరుడు, మోసకారి కూడా కావడంతో ఎన్నో విజయాలను సాధించాడు. అతడికి మద్దతుగా 25,000 మంది సైనికుల బలగాన్ని సుల్తాన్ పంపాడు.

శివాజీ ఆరాధ్యదైవమైన భవానీని నాశనం చేయడానికి అఫ్జల్ ఖాన్ తొలుత తుల్జాపూర్‌కు బయల్దేరాడు. తన కోటలు, అడవుల మాటున శివాజీ సురక్షితంగా ఉన్నంత వరకు అతడిని ఓడించడం సాధ్యం కాదని ఖాన్‌కు బాగా తెలుసు. దేవాలయాన్ని విధ్వంసం చేసే కార్యక్రమాన్ని మొదలుపెడితే, ఆవులను చంపివేస్తే, మహిళలను అవమానపరిస్తే శివాజీ మైదాన ప్రాంతాలలోకి వచ్చి తనతో పోరాడతాడని అతడు ఆశించాడు. జావ్లీ అడవుల్లో నూతనంగా నిర్మించిన ప్రతాప్‌ఘడ్ కోటను వదలి వెళితే తనను ఖాన్ చుట్టు ముడతాడని శివాజీ తెలుసుకున్నాడు. దాంతో ప్రతాప్‌ఘడ్‌కు తరలివెళ్లాలని అతడు నిర్ణయించాడు. ఆ ప్రాంతానికి అఫ్జల్ ఖాన్‌ను రప్పించి అతడితో పోరాడాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. కోటను వదలి తనను మైదాన ప్రాంతంలో ఎదుర్కోవాలని ఖాన్ కోరుకున్నాడు. తన సైన్యమంతటినీ ప్రతాప్‌ఘడ్ కోట ఎదుట మైదాన ప్రాంతంలో స్థిరపరిచాడు. అయితే శివాజీ, అఫ్జల్ ఖాన్ లిద్దరూ శాంతిపూర్వకంగా కలిసి ఒక నిర్ణయానికి రావాలని అంగీకరించారు. రక్షణ సిబ్బంది ఎవరూ వెంట లేకుండా ఇద్దరు కలుసుకోవాలని కూడా అంగీకారం కుదిరింది. నేతాజీ, తానాజీ, కానోజీ, మరి కొందరు విధేయులు తమ బలగాలతో కోట నుండి దిగి వచ్చి మెరుపు దాడి కోసం అడవుల్లో కాపు కాశారు. కోట నుండి ఫిరంగి పేలిన వెంటనే ఈ బలగాలు శత్రువు సైన్యాలపై పడి విధ్వంసం సృష్టించాలని స్పష్టమైన సూచనలు ఇవ్వబడ్డాయి.

శివాజీ కోట విడిచి అఫ్జల్ ఖాన్‌ను కలవడానికి వెళ్లాడు. మార్గమధ్యలో వారు కలుసుకోవలసి ఉంది. ఖాన్ తన బాహువులను చాపగా శివాజీ కూడా ముందుకు వచ్చి అతడిని కౌగిలించుకున్నాడు. ఉన్నట్లుండి ఒక పదునైన కత్తిని లాగి శివాజీపై దాడి చేయడానికి ఖాన్ ప్రయత్నించాడు. ఖాన్ కౌగిలి నుండి త్వరగా వేరుపడిన శివాజీ తన పులి పంజాలను

ఖాన్ పొత్తికడుపులో దూర్చాడు. ఖాన్ పారిపోవడానికి ప్రయత్నించాడు. అయితే శివాజీ అతడి తలను నరికివేశాడు.

శివాజీ సైనికులు వెంటనే స్పందించి ఖాన్ బలగాలపై చిరుతల్లా దాడి చేసి వాటినిపూర్తిగా మట్టికరిపించారు. అఫ్జల్‌ఖాన్‌ను చంపిన వీరునిగా శివాజీ ఖ్యాతి నలువైపులా పాకింది. అయితే విజయగర్వంతో శివాజీ ఉదాసీనంగా వ్యవహరించలేదు. ఈ విజయాన్ని అనుకూలంగా మార్చుకొని అతడు ఇతర ప్రాంతాలకు వెళ్లి బిజాపూర్ కోటలు కొన్నింటిని స్వాధీనం చేసుకున్నాడు. దీంతో ఆందోళనకు గురైన సుల్తాన్ మరో సేనాని నేతృత్వంలో 70,000 మంది సైనికులు గల పెద్ద బలగాన్ని శివాజీని ఓడించేందుకు పంపాడు. సిద్ది జౌహర్ అనే ఆ సేనాని శివాజీని నిర్బంధించడానికి తీవ్రంగా కృషి చేసినప్పటికీ విఫలమయ్యాడు. తర్వాత సుల్తాన్ శివాజీపై దాడి చేసే సహసాన్ని కూడగట్టలేకపోయాడు.

అయితే శివాజీ మరో ముప్పును ఎదుర్కోవలసి వచ్చింది. మొగల్ గవర్నర్ షయిస్తా ఖాన్ శివాజీపై దాడి చేయాలని నిర్ణయించాడు. ఔరంగజేబ్ పట్టాభిషేక వార్షికోత్సవ రోజున శివాజీ రాయ్‌గడ్ నుండి బయల్దేరి రెండు వేల మంది సైనికులతో కలిసి పూనా నుండి రెండు మైళ్ల దూరాన స్థావరం ఏర్పాటు చేసుకొన్నాడు. పూనా సమీపంలోని లాల్ మహల్ వద్ద షయిస్తాఖాన్ తిష్టవేశాడు.(ఈ ప్రాంతంలోనే శివాజీ పెరిగి పెద్దవాడయ్యాడు) శివాజీ బాల్యమిత్రుడు బాబాజీ ఒకచిన్న బలగంతో మొగల్ స్థావరం వైపు కదిలాడు. అతడి వెనుకనే మరో చిన్న బృందంతో శివాజీ బయల్దేరాడు. లాల్‌మహల్ శివార్లలోని ద్వారాల వద్దకు శివాజీ నేరుగా వెళ్లాడు. అక్కడి నుండి షయిస్తా ఖాన్ శయన మందిరానికి చేరుకున్నాడు. శివాజీ, అతడి బృందం లోపలికి చొచ్చుకుపోయారు. ఆ సమయానికే లాల్ మహల్ అరుపులతో దద్దరిల్లుతోంది. శత్రువు లోపలికి ప్రవేశించాడని హాహాకారాలు మొదలయ్యాయి. షయిస్తా ఖాన్ భార్యలు ఖాన్‌ను పరదా మాటున దాచేశారు. శివాజీ తన ఖడ్గాన్ని ఝుళిపించాడు. ఈ వేటుతో ఖాన్ తన మూడు వ్రేళ్లను కోల్పోయాడు. అతడు కిటికీ నుండి కిందికి దూకేశాడు. అప్పటికే మొగల్ సైన్యం లాల్ మహల్‌ను చుట్టుముట్టింది. ఈ తీవ్ర గందరగోళంలో శివాజీ, అతడి అనుచరులు తప్పించుకున్నారు. శివాజీ కొండ ఎలుక కాదని, అతడో పరాక్రమంతుడని ఈ సంఘటనతో శత్రువులకు తెలిసి వచ్చింది. ఔరంగజేబ్ ఈ తీవ్ర అవమానాన్ని భరించలేక పోయాడు. చివరకు శిక్షగా షయిస్తాఖాన్‌ను బెంగాల్ గవర్నర్‌గా బదిలీ చేశాడు.

ఒక స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసి దానిని సమర్థవంతంగా పరిపాలించాలంటే శివాజీకి చాలా నిధులు అవసరమయ్యాయి. మొగల్‌ల నుండి ఈ వనరులను కొల్లగొట్టాలని అతడు నిర్ణయించాడు. ఆ రోజుల్లో సూరత్ కుబేరుల నగరంగా ఉండేది. అందుకే శివాజీ ఆ నగరంపై దాడి చేసి దానిని పూర్తిగా దోచుకున్నాడు. ఔరంగజేబ్ సహనం అంతటితో నశించింది.

శివాజీని అంతమొందించడానికి ఒక 'సింహాన్ని' పంపాలని నిర్ణయించాడు. ఈ బాధ్యత కోసం రాజా జయ్‌సింగ్‌ను ఎంపిక చేశాడు. గొప్పయోధుడు, తెలివైన సేనాని అయిన జయ్‌సింగ్ దక్షిణానికి భారీ సైన్యంతో బయల్దేరి వెళ్లాడు. బీజాపూర్ సుల్తాన్‌ను తన పక్షాన తీసుకున్న తర్వాత జయ్‌సింగ్ పురంధర్ కోటలో శివాజీని ముట్టడించడంలో సఫలమయ్యాడు. ఫలితంగా 1665లో పురంధర్ ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం శివాజీ తన 23 కోటలను (35 కోటలలో) వాటి చుట్టూ ఉన్న ప్రాంతాలతో సహా మొగల్‌లకు అప్పగించాలి. అందుకు ప్రతిఫలంగా మొగల్‌లు శివాజీకి బీజాపూర్ ప్రాంతాలపై ఉన్న హక్కును గుర్తిస్తారు. అలాగే శివాజీ కుమారుడికి 5,000 మన్సబ్ ప్రదానం చేశాడు.

తర్వాత 1666లో ఔరంగజేబ్‌ను కలుసుకునేందుకు శివాజీ ఆగ్రా చేరుకున్నాడు. అయితే శివాజీ పట్ల చక్రవర్తి అవమానకర రీతిలో ప్రవర్తించాడు. కోపంతో శివాజీ ఆస్థానం వదలి వెళ్లాడు. శివాజీని నిర్బంధించాలని ఔరంగజేబ్ ఆదేశించాడు. ఉన్నట్లుండి 'అనారోగ్యం' పాలైన శివాజీ ఫకీర్లు, బాబాలకు మిఠాయిలు పంచడం మొదలు పెట్టాడు. పట్టణంలోని ధనికులకు కానుకలు పంపాడు. వీటికి ఔరంగజేబ్ అనుమతించాడు. రోజులాగే మిఠాయిలను తీసుకెళ్లే బుట్టలను లోనికి తీసుకువచ్చారు. అనారోగ్యంతో విశ్రాంతి తీసకుంటున్న శివాజీ ఉన్నట్లుండి ఎగిరి ఒక బుట్టలో దాక్కున్నాడు. అతడి కుమారుడు శంభాజీ కూడా మరో బుట్టలో ఒదిగిపోయాడు. సేవకులు ఆ బుట్టలను మూసివేసి బయటికి తీసుకెళ్లారు. ఎంతో కాలం నుండి ఈ వ్యవహారాన్ని చూస్తున్న గస్తీ సిబ్బంది బుట్టల్లో మిఠాయిలు తప్ప మరొకటి ఉండదని భావించి ఎలాంటి తనిఖీలు నిర్వహించలేదు. దారిలో శివాజీ, శంభాజీలు సమర్థ్ రాందాస్ స్థాపించిన మఠంలో విశ్రాంతి తీసుకున్నారు.

ఆగ్రా నుండి తప్పించుకోగలిగిన శివాజీ తర్వాతి మూడేళ్లు (1666-69) దాదాపు మౌనంగా ఉండిపోయాడు. 1670లో సూరత్‌ను రెండవసారి దోచుకోవడం ద్వారా మొగల్‌లతో వైరాన్ని పునరుద్ధరించాడు. తన పాత కోటలు, ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి అతడు దాదాపు నాలుగేళ్లపాటు సైనిక దాడులు నిర్వహించాడు. 1674లో రాయ్‌గఢ్ వద్ద అతడు పట్టాభిషేకం పొందాడు. 'హైందవ ధర్మోద్ధారక్' అనే బిరుదును సాధించాడు. కాశి నుండి వచ్చిన ప్రముఖ పండితుడు గంగాభట్ట శివాజీకి కిరీటం తొడిగాడు. ధర్మశాస్త్రాల ప్రకారం ఈ ప్రమాణ స్వీకారం (రాజ్యాభిషేకం) జరిగింది. బీజాపూర్ సుల్తాన్, ఆంగ్లేయులు శివాజీని స్వతంత్ర పాలకునిగా గుర్తించి కానుకలను పంపారు. తర్వాత గోల్కొండ కుతుబ్ షాహీలతో చేతులు కలిపిన శివాజీ బీజాపూరి కర్ణాటకలో (1676-79) దండయాత్ర చేపట్టాడు. జింజీ, వెల్లోర్ తదితర ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. అయితే కొత్త ప్రాంతాలను కుతుబ్‌షాతో పంచుకోవడానికి నిరాకరించాడు. 1680లో శివాజీ మరణించాడు.

**శివాజీ వారసులు :**

శివాజీ పెద్ద కుమారుడు శంభాజీ (1680–89), చిన్నకుమారుడు రాజారామ్‌ల మధ్య వారసత్వ పోరు జరిగింది. అంతర్యుద్ధంలో గెలుపొందిన శంభాజీ రాజారామ్‌ను నిర్బంధించాడు. అలాగే ఔరంగజేబ్‌పై తిరుగుబాటు చేసిన మొగల్ రాకుమారుడు అక్బర్‌కు తన ఆస్థానంలో రక్షణ కల్పించాడు. అయితే తన తండ్రిని గద్దె దించడంలో అక్బర్ విఫలమయ్యాడు. ప్రాణాలను దక్కించుకోవడానికి పర్షియాకు పారిపోయాడు. చివరకు మొగల్ సేనాని ముకరబ్ ఖాన్ శంభాజీని సంగమేశ్వర వద్ద నిర్బంధించి హత్య చేశారు. తర్వాత విడుదలైన రాజారామ్ (1689–1700) రాయగఢ్‌లోని కొందరు మంత్రుల సహాయంతో గద్దెనెక్కాడు. 1689లో అతడు రాయ్‌గడ్ నుండి జింజీకి పారిపోయాడు. జింజీ 1698 వరకు అతడి స్థావరంగా కొనసాగింది. మొగల్ సైన్యాలు రాయ్‌గఢ్‌ను స్వాధీనం చేసుకొని శంభాజీ భార్యను కొడుకు (షాహు)ను నిర్బంధించారు. 1698లో జింజీ మొగల్ సైన్యాల వశంకావడంతో రాజారామ్ తొలుత విశాల్‌ఘడ్‌కు తప్పించుకున్నారు. జింజీ పతనం తర్వాత మరాఠా రాజధానిగా మారిన సతారాలో రాజారామ్ మరణించాడు. రాజారామ్ వారసునిగా అతడి మైనర్ కుమారుడు రెండవ శివాజీ తన తల్లి తారాబాయి సంరక్షణలో పీఠమెక్కాడు. ఆమె 1703లో బెరార్, 1706లో బరోడా, ఔరంగబాద్‌లపై దాడి చేసింది. షాహు (1707–49)ను మొగల్ చక్రవర్తి బహదుర్ షా విడుదల చేసినపుడు అతనికి, తారాబాయికి మధ్య (1707–14) అంతర్యుద్ధం జరిగింది. తారాబాయి సైన్యాన్ని ఖేడ్ యుద్ధంలో షాహు ఓడించాడు. సతారాను స్వాధీనం చేసుకున్నాడు. 1714లో తారాబాయి తుది యుద్ధంలో ఓడిపోయింది. షాహు ఆమెను నిర్బంధించాడు. అయితే మరాఠా రాజ్యంలోని దక్షిణ భాగం కోల్హాపూర్ రాజధానిగా రాజారామ్ వారసుల పాలనలో (రెండవ శివాజీ, రెండవ శంభాజీ) కొనసాగింది. షాహు పాలనలో పేష్వాగిరి ఆవిర్భవించింది. పేష్వాలు మరాఠా రాజ్యాన్ని ఫెడరల్ సూత్రం ఆధారంగా ఒక పెద్ద సామ్రాజ్యంగా తీర్చిదిద్దారు.

**పేష్వాగిరి - ఫెడరల్ ప్రభుత్వం**

ఔరంగజేబ్ మరణించిన తర్వాత శివాజీ రాజ్యం ఫెడరల్ సామ్రాజ్యంగా త్వరితగతిన పరివర్తన చెందింది. పేష్వా అనే అనువంశిక ప్రధాన మంత్రి ఈ అధికారిక వ్యవస్థకు నాయకుడిగా వ్యవహరించాడు. మహారాష్ట్ర అప్పటికీ వెనుకబడిన ప్రాంతంగా ఉండేది. అయితే భారతదేశంలోని మిగతా ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి.

అందుకే సామ్రాజ్యాన్ని విస్తరించాలని పేష్వాలు నిర్ణయించారు. కాని విస్తరణ చాలా వేగంగా చోటు చేసుకోవడంతో సేనాపతులను నియంత్రించడం చాలా కష్టంగా మారింది. 1761లో మూడవ పానిపట్ యుద్ధం జరిగే వరకు ఈ విస్తరణను అనేక రూపాలలో చేపట్టారు.

పూణా స్థావరంగా కల పేష్వాలకు సేనాపతులు చౌత్ (కప్పం–ఆదాయంలో నాల్గవ వంతు)ను పంపేవారు. సేనాపతులకు స్వస్థలంలో భూములను అప్పగించేవారు. వారు అనుచితంగా ప్రవర్తిస్తే ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేవారు. షాహు కాలం నుండి మరాఠాచరిత్ర దృష్టి సాంప్రదాయ రాచరికం నుండి పేష్వాల ఆవిర్భావానికి మారింది. ఆచరణలో పాలకుడైన పేష్వా మరాఠా రాజ్య స్వరూపాన్ని పూర్తిగా మార్చివేశాడు. ఆ రాజ్యం ప్రసిద్ధ మరాఠా సంకీర్ణ సామ్రాజ్యంగా అవతరించింది.

**తొలి ముగ్గురు పేష్వాలు :**

**బాలాజీ విశ్వనాథ్ (1713–20) :** ఈ నూతన పాలన ఆవిర్భావం బాలాజీ విశ్వనాథ్ ఎదుగుదలతో ముడిపడి ఉంది. 1680లో శివాజీ మరణించిన తర్వాత మరాఠా చరిత్రలో ప్రముఖంగా కనిపించే వ్యక్తి బాలాజీ విశ్వనాథ్.అధికార వర్గాల్లో అతడు అత్యంత వేగంగా ఎదిగి చివరకు స్థానిక పరిపాలకుడయ్యాడు. క్రీ.శ. 1713లో అతడిని షాహు పేష్వాగా నియమించాడు. పేష్వాగా నియమితుడైన వెంటనే అతడు మొగల్‌ల చెర నుండి షాహు తల్లిని విడిపించాడు. మరాఠా ప్రాంతాల నిజమైన పాలకునిగా షాహును మొగల్ సామ్రాజ్యం గుర్తించడం వెనుక అతడికృషి ప్రముఖంగా ఉంది. ఆ విధంగా మరాఠాలు ఖాన్‌దేశ్, బెరార్, కర్ణాటక జిల్లాలను తిరిగి దక్కించుకున్నారు. మొగల్‌లతో సుదీర్ఘ పోరు కూడా ముగిసింది. దక్కను సుబాలలో చౌత్, సర్దేశ్‌ముఖిని వసూలు చేసే అధికారాన్ని మొగల్ పాలకులు మరాఠాలకు అప్పగించారు. అయితే పరస్పర సహకార ఒప్పందం వల్లే ఈ ఏర్పాటు సాధ్యమైంది.మరాఠాలు 15,000 అశ్వాలతో కూడిన సైన్యాన్ని సామ్రాజ్యసేవకు సిద్ధంగా ఉంచడంతోపాటు మొగల్‌లకు వార్షిక కప్పాన్ని, దక్కనులో శాంతిని సమకూర్చాల్సి వచ్చింది. మొగల్‌ల సర్వాధికారాన్ని ఇప్పుడే తొలిసారి గుర్తించారు. మరాఠా రాజకీయాలలో వచ్చిన మార్పును ఈ పరిణామాలు సూచిస్తాయి.

**ఒకటవ బాజీరావ్ (1720-40) :**

బాలాజీ కుమారుడు ఒకటవ బాజీరావ్ పేష్వాగా బాధ్యతలు స్వీకరించడంతో ఆ పదవికి ఉన్న అనువంశిక లక్షణం బయటపడింది. అతడు మొగల్‌ల పట్ల కఠినవైఖరిని అవలంబించాడు. మొగల్ పునాదులను దెబ్బతీయాలని భావించాడు. అందుకు అనుగుణంగా అతడు విలాస వైభోగాల విధానాన్ని క్రియాశీలంగా అమలు చేశాడు. కృష్ణ నుండి సింధూ వరకు విస్తరించి ఉన్న మరాఠా సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని ఆకాంక్షించాడు. ఈ లక్ష్యంలో తొలి ప్రయత్నంగా అతడు సామ్రాజ్య సరిహద్దులను మాల్వా, గుజరాత్‌లకు విస్తరించాడు. ఈ ప్రయత్నం కొందరు మరాఠా నాయకులకు నచ్చలేదు. బాజిరావు, తింబక్‌రావ్ ఘోర్పాడే (ముఠానాయకుడు)ల మధ్య బహిరంగ యుద్ధం జరిగింది. ఇందులో తింబక్ రావ్ ఓడిపోయి హత్యకు గురయ్యాడు. బాజీ రావ్ తీసుకున్న ఈ చర్య దక్కనులోని ఇతర పాలకులను, నిజాంను

భయభ్రాంతులకు గురి చేసింది. మరాఠాలతో రాజీ కుదుర్చుకోవడానికి నిజాం ముందుకు వచ్చాడు. తన విస్తరణ విధానంలో భాగంగా బాజీరావ్ రాజ్‌పుత్ర ప్రాంతాలపై దృష్టి సారించాడు. అయితే వారితో యుద్ధం చేసే బదులు స్నేహ ఒప్పందాలను కుదుర్చుకున్నాడు. అంబర్, బుందేల్‌ఖండ్ పాలకులతో మైత్రిని పెంచుకున్నాడు. 1731లో అతడు ఏకంగా ఢిల్లీపైనే గురిపెట్టాడు. మరాఠాలు ప్రమాదకర రీతిలో ఉత్తర భారతానికి విస్తరిస్తుండడంతో మొగల్ చక్రవర్తి నిజాంను ఒప్పించి మరాఠాలపై యుద్ధానికి తెరతీశాడు. అయితే ఈ యుద్ధంలో నిజాం భోపాల్ వద్ద ఓడిపోయాడు. మాల్వా చుట్టూ ఉన్న ప్రాంతాలను కోల్పోయాడు. పోర్చుగీసుల నుండి సల్సేట్, బస్సీన్ ప్రాంతాలను కూడా మరాఠాలు స్వాధీనం చేసుకున్నారు. శివాజీ మరణం తర్వాత బాజీరావ్‌ను అత్యంత విజయవంతమైన మరాఠా నాయకునిగా ముద్ర పొందాడు. అయితే అతడి అకాల మరణం ఎన్నో సమస్యలను అపరిష్కృతంగా విడిచి వెళ్లింది. అతడి వారసుల పాలనలో జాగీరు వ్యవస్థ పునరుద్ధరించడం వల్ల భూస్వామ్య వైఖరులు అన్నిచోట్లా పాతుకుపోయాయి. ఈ భూస్వామ్య ధోరణులు రాజ్య విభజనకు దారి తీశాయి. గైక్వాడ్‌లు, హోల్కర్లు, భోంస్లేలు, సింధియాలు చిన్నచిన్న రాజ్యాలుగా విడిపోయారు.

**బాలాజీ బాజీరావ్ (1740-61) :** బాజీరావ్ మరణం తర్వాత అతడి కుమారుడు బాలాజీ బాజీరావ్ తదుపరి పేష్వాగా బాధ్యతలు స్వీకరించాడు. అతడు సైనిక యంత్రాంగంలో అనేక మార్పులు తీసుకువచ్చాడు. శివాజీ పాత సిద్ధాంతాలను పూర్తిగా విస్మరించాడు. తన అధికారాన్ని పెంచుకునేందుకు అతడు సైన్యంలో కిరాయి సైనికులను భర్తీ చేశాడు. ఆక్రమిత ప్రాంతాలలో కిరాయి మూకలకు పూర్తి స్వేచ్ఛనివ్వడం అతడు చేసిన పొరపాటు. ఈ కిరాయి సైనికులు రాజ్యానికి సహకరించడం మాని ప్రజలను దోచుకోవడం మొదలుపెట్టారు. అన్నింటి కంటే మించి వారు మరాఠా జాతీయవాద భావాన్ని పూర్తిగా సమాధి కట్టారు. ఉత్తర ప్రాంతంలో హోల్కర్, రఘునాథరావులు మరాఠా ఆధిపత్యాన్ని స్థాపించాలని బలంగా ఆకాంక్షించారు. ఇందులో భాగంగా మరాఠాలు ఢిల్లీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. పంజాబ్ ప్రాంతానికి కూడా అర్రులు చాచారు. పంజాబ్‌పై మరాఠాలు దాడి చేయడంతో అబ్దలి రెచ్చిపోయాడు. 1759లో అతడు మరాఠాలపై దాడి చేశాడు. రాజపుత్ర, సిఖ్, ఇతర ప్రాంతీయ పాలకుల సహాయాన్ని కూడగట్టడంలో మరాఠాలు విఫలమయ్యారు. అబ్దలీ సైన్యాల చేతిలో ఓటమి పాలయ్యారు. ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి మరాఠాలు సదాశివరావ్‌ను కూడా పంపారు. అయితే అది అర్థంలేని చర్యగా మిగిలిపోయింది. అక్కడ స్వాధీనం చేసుకోవడానికి ఎలాంటి ధనరాశులు లేవు. హోల్కర్, జాట్‌ల పట్ల అనుచితంగా వ్యవహరించడంవల్ల పేష్వా వారితో వైరాన్ని కొని తెచ్చుకున్నాడు. దీని తర్వాత మరాఠాలు మరోసారి అబ్దలీ నేతృత్వంలోని సైన్యాలను ఎదుర్కొన్నారు. అప్పటికే అతడు అలీఘడ్‌ను స్వాధీనం చేసుకున్నాడు.

**మూడవ పానిపట్ యుద్ధం (1761) :** భారతదేశ చరిత్రలో స్థూలంగా,మరాఠాల చరిత్రలో ప్రత్యేకంగా ఈయుద్ధం కొత్త శకాన్ని ఆవిష్కరించింది. భారతదేశంలో మరాఠాల ఆధిపత్యానికి ఈ యుద్ధం తెరదించింది. చివరకు వారి రాజ్యం ముక్కలైపోయింది. పతనావస్థలో ఉన్న రాజ్యాన్ని భూస్వామ్య శక్తులు మరింత కొల్లగొట్టారు. పానిపట్ వద్ద జరిగిన యుద్ధంలో మరాఠా సైన్యాలు తుడిచి పెట్టుకుపోయాయి. సంపదపరంగా, మానవ వనరుల పరంగా తీవ్రంగా నష్టపోయాయి. ఈ యుద్ధంలో మరాఠా సైన్యం ఓడిపోవడానికి అనేక కారణాలు, వివరణలను ఇచ్చారు. ఆఫ్ఘన్ల సైనిక బలం మరాఠాల కంటే ఎన్నోరెట్లు ఎక్కువగా ఉండేది. యుద్ధంలో వారు ఉపయోగించిన పద్ధతులు, ఆయుధాలు ఉన్నతమైన నాణ్యత కలిగినవి. మరోవైపు మరాఠాలు సాంప్రదాయ పద్ధతుల్లో యుద్ధం కొనసాగించారు. వారి సైనిక శక్తి కూడా పరిమితంగా ఉండేది. యుద్ధం ఉత్తర భారతదేశంలో జరగడంతో వారు తమ సైన్యాన్ని పూర్తిగా యుద్ధక్షేత్రానికి పంపలేకపోయారు. సరైన వసతులు, వస్తువులు కూడా లేకపోవడంతో మరాఠా సైన్యం ఘోరంగా దెబ్బతింది.

మూడవ పానిపట్ యుద్ధం మరాఠాలపై తీవ్రమైన ప్రభావం చూపింది. మరాఠా సామ్రాజ్యవాద దిశను మార్చివేసింది. సదాశివరావుతో సహా మరాఠా నాయకులందరూ యుద్ధరంగంలో నేలకొరిగారు. యుద్ధరంగంలో మరాఠాల ఓటమిని జాతీయ విపత్తుగా పోల్చవచ్చు. మహారాష్ట్రలో తమ సభ్యులను కోల్పోని కుటుంబం అంటూ లేదు. కొన్ని కుటుంబాలు తమ ఇంటి పెద్దలనే కోల్పోయాయి. ఒక తరం నాయకులందరూ ఒకే దెబ్బకు రాలిపోయారు. సైనిక, వనరుల పరంగా తీవ్ర నష్టాలే కాకుండా పానిపట్ యుద్ధంలో ఓటమి చూపిన నైతిక ప్రభావం మరీ విస్తారంగా ఉంది. భారతీయులకు మరాఠాల బలహీనత తెలిసి వచ్చింది. పేష్వా స్థాయి, మరాఠా సామ్రాజ్యబలం తగ్గిపోయింది. అయితే గొప్ప దార్శనికుడు అయిన మాధవరావ్ పగ్గాలు చేపట్టిన తర్వాత మరాఠాలు ఉత్తర భారతంలో తాము కోల్పోయిన కీర్తి కొంత వరకు దక్కించుకోగలిగారు. మాధవరావ్ నాల్గవ పేష్వా. ఏదేమైనా మూడవ పానిపట్ యుద్ధం భారత దేశ భవితను నిర్ధారించింది. ఈ తీవ్ర సంఘర్షణలో మరాఠాలు, ముస్లింలు పరస్పరం బలహీనపర్చుకున్నారు. ఆంగ్లేయుల ఆధిపత్యానికి మంచి అవకాశం కల్పించారు. అప్పుడే ప్రాబల్యం సంతరించుకుంటున్న బ్రిటీషు అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భారతదేశంలో తమ బలాన్ని మరింత పెంచుకోవడంతోపాటు అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు.

# 7

# మొగల్ సామ్రాజ్య పతనం ప్రాంతీయ రాష్ట్రాల ఆవిర్భావం

**పతనం వెనుక కారణాలు :**

సుమారు 150 ఏళ్లపాట్లు క్రమంగా విస్తరించిన తర్వాత మొగల్ సామ్రాజ్యం విచ్ఛిణ్ణ దిశలో పయనించింది. సామ్రాజ్యం ఎంత బలంగా, ఘనీకృతంగా ఉండేదంటే అది విచ్ఛిన్నం కావడానికి 50 ఏళ్లు పట్టింది. పూర్తిగా విచ్ఛిన్నమై పతనమైనా దాని నామమాత్రపు సార్వభౌమత్వం మరో 100 ఏళ్లు కొనసాగింది. 1857 తిరుగుబాటు తర్వాతే చివరి తైమూరిద్ చక్రవర్తిని తప్పించి అతడి కిరీటాన్ని బ్రిటీషు పాలకునికి తొడిగారు. ఈ మహా సామ్రాజ్య పతనానికి అనేక కారణాలు, శక్తులు తోడ్పడ్డాయి.

**సాధారణ కారణాలు :**

మొగల్ సామ్రాజ్య ప్రజలలో రాజకీయ జాతీయవాద స్ఫూర్తి ఉండేది కాదు. ఎందుకంటే ఆ సమయంలో భారతదేశం కాని మొగల్ సామ్రాజ్యం కాని ఆధునిక దేశాన్ని నిర్దేశించే శక్తులను కలిగి ఉండేది కాదు.

దేశంలోని సాంస్కృతిక ఐక్యతకు దోహదపడే అంశాలు,శక్తులు శతాబ్దాల తరబడి కొనసాగినా ప్రజలలో తాము ఒక దేశానికి చెందిన వారమన్న భావన ఉండేది కాదు. కనక ఒక దేశం కోసం జీవించడమో లేదా మరణించడమో అన్న ఆలోచన వెలుగులోకి రాలేదు. అందుకు భిన్నంగా ప్రజలు వ్యక్తులకు, తెగలకు, కులాలకు, మత వర్గాలకు విధేయులుగా ఉండేవారు. ఆ కాలంలో ఉన్న అపాటి ఐక్యత కూడా పై నుండి బలమైన పాలకులు రుద్దినదే. మొగల్ వంశం క్షీణించడంలో సంస్థానాధీశులు రాజ్యసేవ కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యతనిచ్చారు. స్వయం ప్రతిపత్తిగల రాజ్యాలను ఏర్పాటు చేసి సామ్రాజ్య సమైక్యతకు నేరుగా తూట్లు పొడిచారు. చివరకు సామ్రాజ్యంపై తిరగబడిన వారు కూడా (ఉదాహరణకు మరాఠాలు, జాట్‌లు, రాజ్‌పుత్రులు వగైరా) తమ ప్రాంతీయ, తెగ లేదా వ్యక్తిగత అధికారాలను బలోపేతం చేయడంపైనే దృష్టి సారించారు. భారతదేశమనే రాజ్యం కోసం పోరాడాలని లేదా దాని సమైక్యత కోసం పాటుపడాలన్న ఆలోచన ఈ పాలకుల్లో ఉండేదు కాదు.

అనువంశిక నియంతృత్వంలోని సహజ లోపాలు కూడా పతనానికి తోడ్పడ్డాయి. అనువంశిక నియంతృత్వంలో అధికారం ఒకసారి ఎప్పుడో అసమర్థుల చేతికి దక్కడం ఖాయం. ఔరంగజేబ్ మరణం తర్వాత బలహీన పాలకులు వారసత్వం చేపట్టారు. వారు సామ్రాజ్య విచ్ఛిన్న ప్రక్రియను వేగవంతం చేశారు. కేంద్రీకృత ప్రభుత్వానికి కాని నిర్దిష్టమైన బలహీనతలు ఉంటాయి. భారతదేశం వంటి విశాల రాజ్యాన్ని కేవలం ఒకే ఒక్క అధికార కేంద్రం నుండి సమర్థవంతంగా పాలించడం చాలా కష్టం. రాజధాని ఉన్న చోట స్థానికులు సాధారణంగా కేంద్ర ప్రభుత్వంలో మెజారిటీ పదవులు దక్కించుకుంటారు. ఒక్కసారి తిరుగుబాటు సుదీర్ఘంగా కొనసాగితే దానిని అణచివేయడం చాలా కష్టం. తిరుగుబాటు ధోరణులను అరికట్టడానికి తరచూ బదిలీలు చేపట్టేవారు. అయితే ప్రజలలో శాంతిని, సౌభాగ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన నిగూఢ స్థానిక పరిజ్ఞానాన్ని సేకరించే అవకాశాన్ని ఈ బదిలీలు నిర్మూలించాయి.

చివరగా, మత సంస్కరణ వేత్తల ప్రభావం కూడా పరోక్షంగా సామ్రాజ్య విచ్ఛినానికి తోడ్పడింది. మతాన్ని రక్షించుకోవడం కోసం రాజకీయ, సైనిక శక్తిని దక్కించుకోవలసిన అవసరం ఉందని సిఖ్ గురువులు పంజాబ్ ప్రాంతంలో నొక్కి చెప్పారు. అలాగే దక్కనులో మహారాష్ట్ర ధర్మాన్ని సంరక్షించాలంటే రాజకీయ సార్వభౌమత్వం దక్కించుకోవాలని రాందాస్ ప్రబోధించాడు. సత్నామీ, మహద్వీ, రౌషనీయ తదితరులు కూడా తిరుగుబాటు స్ఫూర్తిని రగిలించి స్వాతంత్ర్య లేదా స్వయంపాలన ఆకాంక్షలను ప్రోత్సహించారు.

**ప్రత్యేక కారణాలు :** మొగల్ సామ్రాజ్య పతనాన్ని ఔరంగజేబ్ శక్తివంతమైన పాలనతో ముడిపెట్టలేము. ఒక విశాల సామ్రాజ్యాన్ని ఔరంగజేబ్ వారసత్వంగా పొందాడు. అయినప్పటికీ అతడు విస్తరణ విధానాన్ని అవలంబించి దానిని శిఖర దిశకు తీసుకెళ్లాడు. సామ్రాజ్య భౌగోళిక సరిహద్దులను అమాంతంగా పెంచాడు. అందుకు సైనికులను, వనరులను భారీగా వెచ్చించాడు. ఆచరణలోకి వస్తే అప్పటి సమాచార, సంచార వ్యవస్థ, దేశం యొక్క ఆర్థిక, రాజకీయ నిర్మాణంవల్ల ఒక స్థిరమైన కేంద్రీకృత అధికార కేంద్రాన్ని దేశంలోని అన్ని ప్రాంతాలపై ఏర్పాటు చేయడం కష్టంగా మారింది. కనక సిద్ధాంతపరంగా దేశమంతటినీ ఒక కేంద్ర రాజకీయ అధికార వ్యవస్థ కింద చేర్చాలన్న ఔరంగజేబ్ లక్ష్యం సమర్థనీయమే కాని ఆచరణాత్మకమైనది కాదు. ఔరంగజేబ్ వైఫల్యానికి మౌలిక కారణం రాజనీతిజ్ఞత లేకపోవడమే. ప్రాంతీయ పాలన (స్వయంపాలన) కోసం మరాఠాలు చేసిన డిమాండ్‌ను ఆమోదించడానికి అతడు సిద్ధపడలేదు. శివాజీ, ఇతర మరాఠా నాయకులు బలమైన శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, వారిని అణిచివేయడం కష్టమన్న నిర్దిష్ట వాస్తవాన్ని గ్రహించలేకపోయాడు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు అక్బర్ రాజ్‌పుత్‌లతో చేతులు కలిపాడు. ఔరంగజేబ్‌ను కూడా మరాఠా నాయకులతో మైత్రిని ఏర్పరచుకోవాలని సూచించి ఉంటారు. అయితే మరాఠాలను అణచివేయడానికి అతడు మొగ్గు చూపాడు.

రాజ్‌పుత్ర రాజ్యాలతో సంఘర్షణ కూడా తీవ్ర పర్యవసానాలకు దారి తీసింది. గతంలో బలమైన సైన్యాలు గల రాజ్‌పుత్ రాజ్యాలతో స్నేహపూర్వక సంబంధాలు ఉండడం మొగల్ సామ్రాజ్యానికి బలమైన పునాదిగా ఉండేది. తొలుత ఔరంగజేబ్ కూడా వారితో

మంచి సంబంధాలను కొనసాగించాడు. మార్వార్ పాలకుడు జస్వంత్‌సింగ్, అంబర్ పాలకుడు జయ్‌సింగ్‌లకు సామ్రాజ్యంలో ఉన్నత పదవులను కట్టబెట్టాడు. అయితే రాజ్‌పుత్ర పాలకులతో ఔరంగజేబ్ యుద్ధాలు సామ్రాజ్యాన్ని మరింత బలహీనపరచి వేర్పాటువాదాన్ని ప్రోత్సహించాయి. సామ్రాజ్య అధికారానికి గుండెకాయ అయిన ఢిల్లీకి పొరుగునే సత్నామీలు, జాట్‌లు, సిఖ్‌లు తిరుగుబాట్లు ఔరంగజేబ్ రాజకీయ ప్రాబల్యానికి సవాలు విసిరాయి. ఈ తిరుగుబాట్లలో పాల్గొన్న ప్రజల సంఖ్య అంత పెద్దగా లేకపోయినప్పటికీ అవి ప్రాధాన్యత కలవి. ఎందుకంటే రైతాంగం వెన్నెముకగా ఆ ఉద్యమాలకు ప్రజామద్దతు విశాలంగా ఉండేది.

ఔరంగజేబ్ సనాతనవాదం, హిందువుల పట్ల అతడి విధానం మొగల్ సామ్రాజ్య సుస్థిరతను తీవ్రంగా దెబ్బతీశాయి. అక్బర్, జహంగీర్, షాజహాన్‌ల పాలనలో మొగల్ సామ్రాజ్యం ప్రాథమికంగా లౌకిక రాజ్యంగా ఉండేది. పరమత సహనమే విధానం ఆధారంగా సామ్రాజ్యానికి సుస్థిరత చేకూరింది. ఈ విధానానికి ప్రత్యేక నిదర్శనం మొగల్ రాజపుత్ర పాలకుల మధ్య స్నేహ సంబంధాలే. ఈ విధానాన్ని తిరగరాయడానికి ఔరంగజేబ్ ప్రయత్నించాడు. అందులో భాగంగా జిజ్యాను పునరుద్ధరించాడు. ఉత్తర భారతదేశంలో ఎన్నో ఆలయాలను నేలమట్టం చేయించాడు. హిందువులపై కొన్ని ఆంక్షలను విధించాడు. ఈ విధంగా అతడు హిందువులను వేరు చేయడానికి, మొగల్ సమాజాన్ని చీల్చడానికి, మరీ ముఖ్యంగా హిందూ, ముస్లిం ఉన్నత వర్గాల మధ్య అగాధాన్ని పెంచడానికి చర్యలు తీసుకున్నాడు. అయితే మొగల్ ప్రాబల్యం క్షీణించడంలో ఔరంగజేబ్ అవలంబించిన మత విధానం యొక్క పాత్రను అనవసరంగా సాగదీయకూడదు. ఈ విధానాన్ని అతడు కేవలం తన పాలన చరమాంకంలోనే అవలంబించాడు. ఆ విధానాన్ని అతడి వారసులు చాలా త్వరగా విడనాడారు.

వారసత్వ యుద్ధాలు కీలక పాత్రను పోషించాయి. అపరిష్కృత సమస్యలెన్నింటినో ఔరంగజేబ్ వదలి వెళ్లడం, అతడి మరణం తర్వాత చెలరేగిన అంతర్యుద్ధాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. వారసత్వ నియమమంటూ ఏదీ లేకపోవడంతో చక్రవర్తి మరణం తర్వాత మొగల్ వంశంలో ఎప్పుడూ వారసత్వ పోరు తలెత్తేది. 18వ శతాబ్దంలో ఈ అంతర్యుద్ధాలు మరింత తీవ్రతను, విధ్వంసక స్వరూపాన్ని సంతరించుకున్నాయి. ఆస్తి, ప్రాణ నష్టం అపారంగా జరిగేది. అంతకంటే మించి ఈ అంతర్యుద్ధాలు సామ్రాజ్య పరిపాలనా వ్యవస్థను బలహీనపరిచాయి. చివరి మొగల్ చక్రవర్తుల బలహీన వ్యక్తిత్వాలు కూడా సామ్రాజ్య విచ్ఛినానికి కారణమయ్యాయి. తరచూ వారసత్వ పోరు సంభవించకుండా ఆ సమస్యను అధిగమించడానికి ఒక సమర్థుడైన, దూరదృష్టి కలిగిన, చురుకైన పాలకుడు సింహాసనాన్ని అధిష్టించాల్సి ఉంది. దురదృష్టవశాత్తు బహదూర్ షా స్వల్ప పాలన తర్వాత ఎందుకూ పనికిరాని వారు, మనోబలం లేనివారు, విలాస జీవితాన్ని కోరుకునే వారు పాలకులుగా అవతారమెత్తారు. అదే సమయంలో ఈ ఒక్క కారణానికి అంతగా ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం లేదు. ఔరంగజేబ్ బలహీనుడు కాదు, తెలివిలేని వాడు అంతకంటే కాదు. ఇక్కడ అతడి వ్యక్తిత్వం కాదు కాని అతడు అవలంబించిన విధానాలే మౌలిక పరిస్థితులకు భిన్నంగా ఉన్నాయి.

మొగల్ పాలక వంశ స్వరూపం, లక్షణం స్పష్టంగా దిగజారాయి. అంతకుముందు సామ్రాజ్య బలానికి సంస్థానాధీశులు ఒక పునాదిగా ఉండేవారు. పాలకవర్గం సావధానంగా సమర్థవంతంగా, విధేయంగా ఉండి ఉంటే చక్రవర్తి బలహీనతను కూడా అధిగమించే అవకాశం ఉండేది. కాని పాలకవర్గ నైతిక వర్తనం కూడా క్షీణించింది. చాలా మంది సంస్థానాధీశులు తమ స్థాయికి మించిన విలాస జీవితాన్ని గడిపారు. అయితే సంస్థానాధీశులందరూ అసమర్థులుగా, బలహీనులుగా మారలేదు. 18వ శతాబ్దంలో అనేక మంది ఉత్సాహవంతులు, శక్తిమంతులు, సమర్థులైన అధికారులు ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నారు. అయితే వీరు సామ్రాజ్యానికి ప్రయోజనాలు కల్పించలేదు. తమ స్వంత ప్రయోజనాల కోసం పాటు పడుతూ, తమలో తాము కలహించుకుంటూ రాజ్య, సమాజ సేవను విస్మరించారు.

మొగల్ సామ్రాజ్య పతనానికి తర్వాతి ముఖ్య కారణం ప్రజల కనీస అవసరాలను తీర్చలేకపోవడమే. 17, 18వ శతాబ్దాలలో రైతుల పరిస్థితి మరింత దిగజారింది. అక్బర్ తర్వాత భూమి శిస్తు భారం పెరుగుతూనే పోయింది. అంతకు మించి సంస్థానాధీశులను జాగీర్ల నుండి తరచూ బదిలీ చేయడం కూడా గొప్ప కీడుగా దారి తీసింది. జాగీర్దార్లుగా తమ స్వల్ప పదవీ కాలంలో వారు సాధ్యమైనంత ఆదాయం జాగీరు నుంచి దక్కించుకోవడానికి ప్రయత్నించారు. రైతుల నుండి మరీ ఎక్కువగా ఆశిస్తూ వారిని కిరాతకంగా అణచివేశారు. కొన్నిసార్లు అధికారిక నిబంధనలను పక్కన పెట్టి ఈ దౌర్జన్యాలకు పాల్పడేవారు. ఔరంగజేబ్ మరణం తర్వాత వేలాన్ని ఎక్కువగా పాడేవ్యక్తికి భూమి శిస్తు వసూలును అప్పగించే ఇజారాదారీ అనే సాంప్రదాయం ఖలీసా, జాగీరు భూములు రెంటింటిలోనూ సర్వసాధారణమైపోయింది. ఈ ప్రక్రియలో రెవెన్యూ రైతులనే (ఇజారాదారు) కొత్త వర్గం ఆవిర్భవించింది. వీరి దోపిడీ స్థాయికి పరిమితులే ఉండేవికావు. ఈ పరిణామాలన్నీ వ్యవసాయరంగంలో సంక్షోభాన్ని, క్షీణతను సృష్టించాయి. రైతాంగం దారిద్ర్యంలో కూరుకుపోయింది.

తన పాలనా, సైనిక శక్తి క్షీణించకుండా ఉండి ఉన్నట్లయితే మొగల్ సామ్రాజ్యం సుదీర్ఘ కాలం కొనసాగి ఉండేది. 18వ శతాబ్దంలో సామ్రాజ్య సామర్థ్యం చాలా వేగంగా క్షీణించింది. పాలనను నిర్లక్ష్యం చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో శాంతిభద్రతలు క్షీణించాయి. పట్టపగ్గాల్లేని జమీందార్లు కేంద్ర ప్రభుత్వాన్ని బహిరంగంగా ధిక్కరించారు. చివరకు రాచరిక శిబిరం, మొగల్ సైన్యాలు కూడా వ్యతిరేక శక్తుల చేతిలో దోపిడీకి గురయ్యేవి. ఈ క్రమంలో సామ్రాజ్య సైనిక శక్తి ప్రభావితమైంది. 18వ శతాబ్దం సందర్భంగా మొగల్ సైన్యం క్రమశిక్షణ, పోరాట పటిమను కోల్పోయింది. ఆ విధంగా సైన్యం చాలా బలహీనమైంది. పదవీ కాంక్షగల ప్రాంతీయ నాయకులు, సంస్థానాధీశులను ఏ మాత్రం నియంత్రించ లేకపోయింది. విదేశీ ఆక్రమణ నుండి సామ్రాజ్యాన్ని సంరక్షించే సామర్థ్యాన్ని కోల్పోయింది. వరుసగా వచ్చిన విదేశీ దండయాత్రలు మొగల్ సామ్రాజ్యాన్ని చివరి దెబ్బ తీశాయి. నాదిర్ షా, అహ్మద్ షా అబ్దలీ జరిపిన దాడులు సామ్రాజ్య వనరులను హరించివేశాయి. ఉత్తర భారతదేశంలో పరిశ్రమ, వాణిజ్యం నాశనమయ్యాయి. మొగల్ సామ్రాజ్య సైనిక శక్తి దాదాపు ధ్వంసమైంది.

## చివరి మొగల్ పాలకుల కాలంలో పతన దశ (1707-1857)

ఔరంగజేబ్ మరణం తర్వాత అతడి ముగ్గురు కుమారుల మధ్య జరిగిన వారసత్వ పోరులో విజయం సాధించిన బహదుర్ షా (1707–12) మొగల్ సింహాసనాన్ని అధిష్టించాడు. కొంత కాలం తర్వాత అతడు ఒకటవ షా ఆలం అనే బిరుదును పొందాడు. అతడి పాలనా కాలంలో మొగల్–సిఖ్‌ల మధ్య మంచి సంబంధాలు కొనసాగాయి. గురుగోబింద్ సింగ్‌ను మొగల్ సామ్రాజ్య సేవలో తీసుకున్నారు. అయితే గోబింద్ మరణం తర్వాత సిఖ్‌లు మరోసారి మొగల్ పాలనపై తిరుగుబాటు చేశారు. బందా బహదూర్ వారికి నాయకత్వం వహించాడు. తన సేవలోకి ఛత్రసల్, చూరామణ్‌లను తీసుకోవడం ద్వారా బహదూర్ షా చివరికి బుందేలా, జాట్‌లతో కూడా సయోధ్యను కుదుర్చుకున్నాడు. అతడి హయాం చివరలో షాహును విడుదల చేశాడు. ఆ తర్వాత షాహు, తారాబాయిల మధ్య మరాఠా అంతర్యుద్ధం జరిగింది.

బహదుర్ షా నలుగురు కుమారుల మధ్య మరోసారి వారసత్వ పోరు జరిగింది (1712–13). ఇందులో జహందర్ షా జుల్ఫికార్ ఖాన్ మద్దతులో విజయం సాధించాడు. జుల్ఫికార్ రాజును సంస్థానాధీశులు ఎన్నుకునే ప్రక్రియను ప్రవేశపెట్టాడు. 1713లో జహందర్‌ను అతడి బంధువు ఫరూఖ్ సియర్ ఓడించాడు. ఫరూఖ్ సియర్ రాజ్యాభిషేకం (1713–19)లో అబ్దుల్లా ఖాన్, హుసేన్ అలీఖాన్ అనే సయ్యిద్ సోదరులు కీలక పాత్ర పోషించారు. అయితే అనతి కాలంలోనే చక్రవర్తి, సయ్యిద్ సోదరుల మధ్య సంఘర్షణ మొదలైంది. అబ్దుల్లా ఖాన్ వజీరుగా, హుసేన్ అలీ మీర్ బక్షీగా వ్యవహరించేవారు. అయితే ఈ సంఘర్షణ చివరకు ఫరూఖ్ హత్యకు దారి తీసింది. చక్రవర్తిని సయ్యిద్ సోదరులే హత్య చేశారు. బహదుర్ షా మనవడు రఫి–ఉద్–దజారత్ సింహాసనాన్ని అధిష్టించాడు.

రఫి మరణం తర్వాత ముహమ్మద్ షా (1719–48) సయ్యిద్ సోదరుల సహకారంతో పీఠమెక్కాడు. 1720లో కొందరు సంస్థానాధీశులు కుట్ర పన్ని సయ్యిద్ సోదరులను హత్య చేశారు. ముహమ్మద్ షా పాలనలో ఎన్నో స్వతంత్ర రాజ్యాలు ఏర్పడ్డాయి. 1717లో ముర్షీద్ కులీ ఖాన్ బెంగాల్ రాజ్యాన్ని స్థాపించాడు. 1722లో సాదత్ ఖాన్ బుర్హాన్–ఉల్–మాలిక్ అవధ్‌ను, 1724లో నిజాం–ఉల్–ముల్క్ హైదరాబాద్‌ను, 1725లో సాదుతుల్లా ఖాన్ కర్ణాటక రాజ్యాలను ఏర్పాటు చేశారు. 1738–39 మధ్య నాదిర్ షా భారతదేశంపై దాడి చేసి ఢిల్లీని స్వాధీనం చేసుకున్నాడు. మరో వైపు మొగల్ పాలకులు సింధూ నదికి పశ్చిమాన ఉన్న ప్రాంతాలను, కోహినూర్ వజ్రాన్ని, నెమలి సింహాసనాన్ని నాదిర్ షాకు కోల్పోయారు.

అహ్మద్ షా (1748–54) పాలనలో భారతదేశం అహ్మద్ షా అబ్దలీ (ఇతడు ఆఫ్ఘన్ పాలకుడు. అంతకుముందు నాదిర్ షాకు సేనాపతి) నుండి తొలి దాడిని ఎదుర్కొంది (1748). అహ్మద్ షా వజీరు ఇమాద్–ఉల్–మాలిక్ చక్రవర్తిని అంధునిగా మార్చి సింహాసనంపై రెండవ ఆలంగిర్‌ను కూర్చోబెట్టాడు. అయితే రెండవ ఆలంగిర్ (1754–59)ను కూడా ఇమాద్–ఉల్–మాలిక్ హత్య చేశాడు. రెండవ షా ఆలం (1759–1806) తన తండ్రి నుండి వారసత్వం స్వీకరించినప్పటికీ వజీరు నుండి ప్రాణభయం ఉండడంతో రాజధానికి దూరంగా

కొన్నేళ్లు గడిపాడు. బక్సార్ యుద్ధం (1764)లో ఓటమి, 1803లో బ్రిటీషు దళాలు ఢిల్లీని స్వాధీనం చేసుకోవడం అతడి హయాంలో చోటు చేసుకున్న ముఖ్య పరిణామాలు.

1806లో అతడు బ్రిటీషు నిర్బంధంలో మరణించాడు.రెండవ అక్బర్ (1806-37) కాలంలో బ్రిటీష్ ఆధిపత్యం మరింత స్థిరమైంది. రెండవ బహదుర్ షా (1837-62)ను 1857 తిరుగుబాటు తర్వాత రంగూన్ జైలుకు పంపారు. 1862లో అతడు నిర్బంధంలోనే తుది శ్వాస విడిచాడు.

## కొత్త ప్రాంతీయ రాజ్యాలు :

భారతదేశంలో మొగల్ సామ్రాజ్యం ఏర్పడినప్పటి నుండి అక్కడా ఇక్కడా తిరుగుబాట్లు సంభవించాయి. అయితే ఔరంగజేబ్‌కు ముందు చక్రవర్తులు అధిగమించలేని తిరుగుబాటు ఒక్కటి కూడా రాలేదు. ఔరంగజేబ్ పాలన కాలం నుండి తిరుగుబాట్లు మొగల్‌ల ఆధిపత్యాన్ని ఆయా ప్రాంతాలలో దెబ్బ తీశాయి. ఇక అతడి మరణం తర్వాత ప్రతి ప్రాంతం ఒకటొక్కటిగా స్వతంత్ర హోదాను పొందింది. 1765 నాటికి మొగల్ చక్రవర్తికి నిర్దిష్టమైన సామ్రాజ్యమంటూ లేకుండా పోయింది. కొన్ని ప్రాంతాలలో కొత్త నాయకుల నేతృత్వంలో కొత్త రాజకీయ శక్తులు ఎదిగాయి. మరికొన్ని ప్రాంతాలలో చక్రవర్తి నియమించిన వ్యక్తులే అతడి అధికారాన్ని ధిక్కరించి స్వతంత్రంగా పాలించడం మొదలుపెట్టారు.

## బెంగాల్ రాజ్యం (1717-72)

ముర్షీద్ కులీ ఖాన్ (1717-27)ను తొలుత ఔరంగజేబ్ బెంగాల్ దీవాన్‌గా (1700) నియమించాడు. 1713లో అతడు నాయబ్ సుబాదార్‌గా, తర్వాత 1717లో సుబాదార్‌గా ఫరూఖ్ సియర్ పాలనలో నియమితుడయ్యాడు. 1700 నుండి ముర్షీద్ దాదాపుగా స్వతంత్రంగా పాలించినా 1717లో అధికారికంగా గుర్తింపు పొందాడు. (1700-07 మధ్య బహదుర్ షా కుమారుడు అజీం, 1707-13 మధ్య ఫరూఖ్ సియర్‌లు బెంగాల్ గవర్నర్‌గా పని చేశారు) 1719లో అతడికి ఒరిస్సా గవర్నర్‌గిరి కూడా లభించింది. తన రాజధానిని ఢాకా నుండి ముర్షీదాబాద్‌కి తరలించిన తర్వాత అతడు క్రమంగా స్వయం ప్రతిపత్తిని సంతరించుకున్నాడు. అయితే అదే సమయంలో మొగల్ చక్రవర్తికి కప్పం చెల్లించాడు. షుజా-ఉద్-దీన్ (1729-39) ముర్షీద్ అల్లుడు. ముర్షీద్ విధానాలు, సంస్కరణలను అతడు కొనసాగించాడు. 1713లో షుజాకు బీహార్ గవర్నర్‌గిరి కూడా లభించింది. (అప్పటి నుండి బెంగాల్ నవాబులు బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతాలను పాలించారు) సర్ఫరాజ్ ఖాన్ (1739-40) (షుజా కుమారుడు)ను బీహార్ డిప్యూటీ గవర్నర్ అలీవర్దీఖాన్ 1740లో హత్య చేశాడు.

చక్రవర్తి ముహమ్మద్ షాకు రెండు కోట్ల రూపాయలు చెల్లించిన ఫర్మానా పొందడం ద్వారా అలీవర్దీఖాన్ (1740-56) తన పాలనకు చట్టబద్ధతను తెచ్చుకున్నాడు. అతడి హయాంలో మరాఠాలు బెంగాల్ ప్రాంతాలపై వరుసగా దాడులు చేశారు. రఘుజీ భోంస్లేతో ఒప్పందం కుదుర్చుకొని ఒరిస్సాలోని ఒక ప్రాంత ఆదాయాన్ని అతడు మరాఠాలకు చెల్లించాడు. అలాగే

బెంగాల్ చౌత్‌గా 12 లక్షల రూపాయలను సాలీనా చెల్లించాడు. ఆంగ్లేయులు తమ హద్దులు మీరకుండా అతడు జాగ్రత్తలు తీసుకున్నాడు. కలకత్తా, చంద్రనగర్‌లలో ఇంగ్లీష్, ఫ్రాన్స్ వ్యాపారులు తమ ఫ్యాక్టరీలను బలోపేతం చేయకుండా అడ్డుకున్నాడు. అతడి మరణానికి ముందే వారసత్వం సమస్య ఏర్పడింది. తన చివరి కుమార్తె కుమారుడు సిరాజ్-ఉద్-దౌలాను అతడు వారసునిగా ఎంపిక చేశాడు. 1746లో అలీవర్దీ ఖాన్ చక్రవర్తికి కప్పం చెల్లించడానికి నిరాకరించాడు.

సిరాజ్-ఉద్-దౌలా (1756-57) కలకత్తా బ్రిటీషు గవర్నర్‌కు లేఖలు రాసి అదనపు స్థావరాలను తొలిగించాల్సిందిగా కోరాడు. రాజ్య వ్యతిరేక చర్యలను నిలిపివేయాలని సూచించాడు. అపుడు నవాబు కావాలనిఉత్సాహపడిన షౌకత్ జంగ్‌కు బ్రిటీషు అధికారులు మద్దతునిస్తూ వచ్చారు. అలాగే షౌకత్ పక్షాన నిలబడిన రాజా దుల్లభ్ కుటుంబానికి రక్షణ కల్పించారు. సిరాజ్ ఆదేశాలను పాటించడానికి బ్రిటీషు అధికారులు నిరాకరించినపుడు అతడు కాసీంబజార్‌లోని ఫ్యాక్టరీని (జూన్ 4, 1756), తర్వాత కలకత్తా (జూన్ 20)ను స్వాధీనం చేసుకున్నాడు. ఆంగ్లేయులు ఫుల్తాకు పారిపోయారు. సిరాజ్ ముర్షీదాబాద్‌కు తిరిగి వచ్చాడు. కలకత్తాను మాణిక్‌చంద్ నియంత్రణలో ఉంచాడు. అప్పుడే 'బ్లాక్ హోల్' (Block Hole) ఉదంతం జరిగిందని చెప్తుతారు. ఈ ఉదంతం 1756 జూన్ 20న జరిగిందని చెబుతారు. అయితే దీనిపై వివాదాలున్నాయి. ఏదేమైనా ఆ ఘటనకు ఇపుడు సిరాజ్‌ను వ్యక్తిగతంగా బాధ్యుడిని చేయడంలేదు. దీని తర్వాత సిరాజ్ యుద్ధంలో షౌకత్ జంగ్‌ను హత్య చేశాడు. జంగ్ అప్పటికే మొగల్ చక్రవర్తి (రెండవ ఆలంగిర్) నుండి బెంగాల్ గవర్నర్‌గా తనను నియమిస్తూ ఒక ఫర్మానాను పొందాడు. కొందరు బెంగాల్ నాయకులు, బ్రిటీషు దళాల సహాయంతో బెంగాల్ గద్దెను దక్కించుకోవాలని కుట్ర పన్నుతూ వచ్చాడు.

కొంత కాలం తర్వాత బ్రిటీషు అధికారులు నవాబ్ ఆస్థానంలోని కొందరు ప్రముఖులతో కలిసి కుట్ర పన్నారు. మీర్ బక్షీ మీర్ జాఫర్, కలకత్తా సర్వాధికారి మాణిక్‌చంద్, కలకత్తాకు చెందిన సంపన్న వ్యాపారి ఓమిచంద్, బెంగాల్ ప్రముఖ బ్యాంకరు జగత్‌సేఠ్, దుర్లభ్, ఖాదీం ఖాన్ అనే ఆస్థాన ప్రముఖులు ఈ కుట్రలో భాగస్వాములయ్యారు.

కల్నల్ క్లైవ్,అడ్మిరల్ వాట్సన్ నేతృత్వంలోని ఒక బలమైన దళం మద్రాసు నుండి బెంగాల్‌కు (14 డిసెంబర్, 1756) చేరుకుంది. 1757 జనవరి 2న ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా కలకత్తాను స్వాధీనం చేసుకుంది. అనంతరం 1757లో అలీనగర్ సంధి కుదిరింది. కలకత్తాను అలీనగర్‌గా మార్చారు. నవాబ్, బ్రిటీషు అధికారి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. అయితే సిరాజ్ వ్యతిరేకించినప్పటికీ బ్రిటీషు దళాలు ఫ్రెంచి వ్యాపారుల నుండి చంద్రనగర్‌ను స్వాధీనం చేసుకున్నాయి. మరో అడుగు ముందుకు వేసి సిరాజ్ వ్యతిరేకులతో కుట్రపన్ని (10 జూన్, 1757) అతడిని తొలగించారు. ఈ సమయంలోనే క్లైవ్ ఓమిచంద్‌ను సంతృప్తి పరచడానికే వాట్సన్ సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. దళారీగా వ్యవహరించినందుకు తనకు రాజ్య ఆదాయంలో ఎక్కువ వాటా కావాలని ఓమిచంద్ కోరుకున్నాడు. ఫలితంగా ప్లాసీ యుద్ధం (23 జూన్, 1757) జరిగింది. మీర్ జాఫర్, రాయ్ దుర్లభ్‌లు ఈ సందర్భంగా ద్రోహానికి పాల్పడితే మోహన్‌లాల్, మీర్ మదన్‌ల నేతృత్వంలోని ఒక చిన్న బలగం అసమాన

ధైర్యసాహసాలను ప్రదర్శించింది. నవాబు సైన్యాలు యుద్ధరంగం వదలి పారిపోగా సిరాజ్ తప్పించుకున్నాడు. పదవీచ్యుతుడైన నవాబ్‌ను త్వరగానే నిర్బంధించారు. మీర్ జాఫర్ కుమారుడు మీరాన్ నవాబ్‌ను హత్య చేశాడు.

బ్రిటీషు వారికి ఎంతోరుణపడిన కొత్త నవాబ్ మీర్ జాఫర్ (1757–60) వారికి బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో స్వేచ్ఛా వాణిజ్యానికి అనుమతి ఇచ్చాడు. అదనంగా 1.77 కోట్ల రూపాయలను కలకత్తాపై దాడికి పరిహారంగా చెల్లించాడు. బ్రిటీషు అధికారులకు ఖరీదైన కానుకలు సమర్పించుకున్నాడు. అతడి పాలనలో భారతదేశ సంపద బ్రిటన్‌కు తరలిపోయింది. 24 పరగణాల జమీందారిని బ్రిటీషు వారికి అప్పగించాడు. డచ్‌లను బ్రిటీషు వారి స్థానంలో నియమించేందుకు అతడు విఫలయత్నాలు చేశాడు. అయితే 1759లో బెదేరా వద్ద డచ్ సైన్యాలను బ్రిటీషు వారు ఓడించాడు. జాఫర్ స్థానంలో అతడి అల్లుడు మీర్ ఖాసింను (1760–63) నియమించారు. ఇలా రెండవసారి రాజును నియమించడంతో ఆంగ్లేయులు వివిధ రూపాల్లో లబ్ధిపొందారు. మీర్ ఖాసీం వారికి బుర్ద్వాన్, మిడ్నాపూర్, చిట్టాగాంగ్ జమీందారీని, 29 లక్షల రూపాయలను ప్రదానం చేశాడు. తన స్థానాన్ని పదిలం చేసుకోవడానికి అతడు అనేక రెవెన్యూ, సైనిక సంస్కరణలను ప్రవేశపెట్టాడు. సార్వభౌమ అధికారం కోసం బ్రిటీషు, నవాబ్‌ల మధ్య సంఘర్షణ మొదలైంది. 1762లో తన రాజధానిని ముర్షీదాబాద్ నుండి మొంగిర్‌కు మార్చిన తర్వాత అతడు దస్తక్‌ల దుర్వినియోగాన్ని ఆపడానికి ప్రయత్నించాడు. (దస్తక్‌లంటే బ్రిటీషు కంపెనీ అధికారులకు ఇచ్చిన స్వేచ్ఛా అనుమతి పత్రాలు) 1763లో భారత వ్యాపారులు ప్రయోజనాలను కాపాడడానికి అంతర్గత వ్యాపారంపై అన్ని సుంకాలను రద్దు చేశాడు. ఈ చర్య బ్రిటీషు వారిని తీవ్ర ఆగ్రహానికి గురి చేసింది.

బ్రిటీష్ అధికారులు మీర్ జాఫర్‌ను తొలగించారు. అయితే మీర్ ఖాసీం పోరాటం చేయకుండానే ఓటమిని అంగీకరించలేదు. బక్సార్ యుద్ధం బ్రిటీషు దళాలు, ముగ్గురు మిత్రుల సంకీర్ణ సైన్యాల మధ్య (అక్టోబరు 22, 1764) జరిగింది. మీర్ ఖాసీం, అవధ్‌కు చెందిన షుజ–ఉద్–దౌలా, రెండవ షా ఆలం సైన్యాలు మేజర్ హెక్టర్ మన్రో నేతృత్వంలోని బ్రిటీషు దళాల చేతిలో ఓడిపోయాయి. 1765లో మీర్ జాఫర్ మరణించినపుడు అతడి కుమారుడు నజ్మ్–ఉద్–దౌలా (1765–72) నవాబ్‌గా ఎన్నికయ్యాడు. అతడు బ్రిటీషు అధికారుల చేతిలో కీలుబొమ్మగా ఉండిపోయాడు. ఈ కాలంలో ప్రభుత్వం ద్వంద్వ పాలనా వ్యవస్థగా మారింది. 1772లో నజ్మ్–ఉద్–దౌలాకు భారీ మొత్తంలో పెన్షన్ చెల్లించి ఈస్ట్ ఇండియా కంపెనీ, పాలనను తన ప్రత్యక్ష నియంత్రణలోకి తీసుకుంది.

### అవధ్ రాజ్యం (1722-1856)

ముహమ్మద్ షా (మొగల్ చక్రవర్తి) సాదత్ ఖాన్ బుర్హాన్–ఉల్–ముల్క్ (1722–1739)ను అవధ్ గవర్నర్‌గా నియమించాడు. 1722లో సాదత్‌ఖాన్ ఒక స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. రెవెన్యూ, సైనిక సంస్కరణలను చేపట్టి అవధ్ రాజ్యాన్ని ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేశాడు. ఉద్యోగాల నియామకంలో అతడు హిందువులు, మహమ్మదీయులను సమానంగా చూశాడు. నాదిర్ షా దాడి చేసినపుడు సాదత్ ఖాన్‌ను

ఢిల్లీకి పిలిపించారు. 1739లో అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు కారణాలు స్పష్టం కాలేదు. అతడి వారసుడు సఫ్దర్‌జంగ్ (1739-54) మొగల్ సామ్రాజ్యంలో వజీరుగా నియమితుడయ్యాడు. 1748లో అతడికి మొగల్ చక్రవర్తి అలహాబాద్ రాష్ట్రాన్ని కూడా అప్పగించాడు. 1748 నుండి అవధ్ నవాబ్‌లు నవాబ్ వజీర్లుగా పిలవబడ్డారు. ఎందుకంటే సఫ్దర్‌తోపాటు అతడి వారసులు అవధ్ నవాబ్‌గిరితోపాటు మొగల్ సామ్రాజ్య వజీరుగా కూడా కొనసాగారు. రోహిల్లా, జాట్, మరాఠాలతో యుద్ధాలు చేసి సఫ్దర్ తన రాజ్య సరిహద్దులను విస్తరించాడు.

సఫ్దర్ కుమారుడు షుజా-ఉద్-దౌలా (1754-75) అవధ్ నవాబ్‌గా,మొగల్ సామ్రాజ్య వజీరుగా బాధ్యతలు స్వీకరించాడు. 1764లో బక్సార్ యుద్ధంలో పాల్గొన్నాడు. పర్యవసానంగా అలహాబాద్, కారా ప్రాంతాలను కోల్పోయాడు. అలాగే బ్రిటీషు వారికి భారీగా కప్పం చెల్లించాడు. వారితో సైనిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. వారెన్ హేస్టింగ్స్‌ను కలిసి 1773లో బనారస్ ఒప్పందాన్ని పూర్తి చేశాడు. అందులో భాగంగా కారా, అలహాబాద్‌లను నవాబ్‌కు విక్రయించారు. నవాబ్ సంరక్షణ కోసం బ్రిటీషు దళాలను అవధ్‌లో ఉంచారు. ఈ ఏర్పాటు కోసం నవాబ్ బ్రిటీష్ వారికి సబ్సిడీని చెల్లించాల్సి వచ్చింది. బ్రిటీషు సహాయంతో అతడు రోహిల్లాలను ఓడించి (1774) రోహిల్‌ఖండ్‌ను అవధ్ రాజ్యానికి జతపరిచారు.

అసఫ్-ఉద్-దౌలా (1775-1797) ఫైజాబాద్ ఒప్పందంపై (1775) సంతకం చేశాడు. కొత్త నవాబ్‌కు ఈ ఒప్పందం భారంగా మారింది. అతడి అప్పులు పెరిగిపోగా ఆదాయం మాత్రం తగ్గిపోయింది. 1775లో అతడు రాజధానిని ఫైజాబాద్ నుండి లక్నోకు తరలించాడు. అతడి హయాంలో అవధ్ బేగమ్‌లతో (అసఫ్ తల్లి, అమ్మమ్మలను) నవాబ్ వజీరు వారెన్ హేస్టింగ్స్ ప్రోద్బలంతో అవమానకర రీతిలో వ్యవహరించాడు. వారి నుండి భారీ మొత్తాలను రాబట్టాడు. వజీర్ అలీ (1797-98) వారసునిగా సాదత్ ఖాన్ పీఠమెక్కాడు. తర్వాతి పాలకుడు సాదత్ అలీ నవంబర్ 1801లో లార్డ్ వెలస్లీతో భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. అప్పటికే నవాబ్ తన రాజ్యంలోని సగభాగాన్ని మిత్ర సైన్యాల పోషణార్థం కోల్పోయాడు. ఫిబ్రవరి 1856లో అవధ్‌ను లార్డ్ డల్‌హౌసి స్వాధీనం చేసుకున్న తర్వాత అవధ్ చివరి పాలకుడు వాజిద్ అలీషాకు పెన్షన్ చెల్లించి కలకత్తాకు తరలించారు.

## హైదరాబాద్ రాజ్యం (1724-1949) :

నిజాం-ఉల్-ముల్క్ (1724-48) అసలు పేరు చింకూలిచ్ ఖాన్. అయితే చక్రవర్తి ఫరూఖ్ సియర్ అతడి 'ఖాన్-ఎ-దౌరాన్', తదుపరి 'నిజాం-ఉల్-ముల్క్' అనే బిరుదులను ప్రదానం చేశాడు. అతడు 1713-15 మధ్య దక్కను వైస్రాయ్‌గా తొలిసారి, 1720-22 మధ్య రెండవసారి పని చేశాడు. ఆ తర్వాత అతడిని ముహమ్మద్ షా మొగల్ సామ్రాజ్య వజీరుగా (1722-24) నియమించాడు. అయితే మొగల్ దర్బారు రాజకీయాలతో విసుగెత్తిపోయి చక్రవర్తి అనుమతి లేకుండానే దక్కనుకు (1724) ప్రయాణమయ్యాడు. ఆ విధంగా నిజాం హైదరాబాద్ రాజ్యాన్ని (1724) స్థాపించాడు. నిజాంను శిక్షించే సామర్థ్యం లేకపోవడంతో మొగల్ చక్రవర్తి దక్కను గవర్నర్‌గా ప్రకటించి (1725) నిజాంకు అసఫ్

ఝూ అనే బిరుదును ప్రదానం చేశాడు. చక్రవర్తి సార్వభౌమత్వాన్ని గుర్తించినా నిజాం స్వతంత్రంగానే వ్యవహరించాడు. అసంతుష్టులైన సంస్థానాధీశులను అణచివేసి రాజ్యంలో శాంతిభద్రతలను నెలకొల్పాడు. దొంగతనాలు, దోపిడీలను పూర్తిగా అరికట్టాడు. అలాగే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను పునరుద్ధరించాడు. రైతులు, వృత్తికారులకు ప్రోత్సహకాలు అందించాడు. అయితే దోపిడీ, విధ్వంసం సృష్టించే మరాఠాలను నియంత్రించే విషయంలో అతడు పాక్షికంగానే విజయవంతమయ్యాడు.

అతడి సమీప వారసులు నాసిర్‌జంగ్ (1748–50), ముజఫర్ జంగ్ (1750–51), సలాబత్ జంగ్ (1751–60). అయితే వీరు ఫ్రెంచి లేదా ఆంగ్లేయుల చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరించారు. చివరికి అధికారిక చరిత్రకారులు కూడా వారిని నిజాంలుగా గుర్తించలేదు. ఇతర నిజాంలు నిజాం అలీ (1760–1803), సికందర్ ఝూ (1803–29), నసీర్–ఉద్–దౌలా (1829–57), అఫ్జల్–ఉద్–దౌలా (1857–69), మహబత్ అలీఖాన్ (1869–1911), ఉస్మాన్ అలీఖాన్ (1911–49)

## కర్ణాటక రాజ్యం (1725-1801)

దక్కనులో కర్ణాటక ప్రాంతం ఒకప్పుడు మొగల్ సుబాగా ఉండేది. సాదతుల్లా ఖాన్ ఈ ప్రాంతాన్ని ఒక స్వతంత్ర రాజ్యంగా మార్చుకున్నాడు (1725). అర్కాట్‌ను రాజధానిగా చేశాడు. అతడి వారసునిగా దోస్త్ అలీ నవాబ్ అయ్యాడు. 1740లో అతడు మరాఠాల చేతిలో హతమయ్యాడు. దాంతో దోస్త్ అలీ కుమారుడు సఫ్దర్ అలీ నవాబయ్యాడు. ఇతడిని కూడా ఒక బంధువు హత్య చేశాడు. పర్యావసానంగా కర్ణాటక వ్యవహారాల్లో నిజాం జోక్యం చేసుకున్నాడు. 1743లో అన్వరుద్దీన్ కర్ణాటక నవాబ్‌గా నియమితుడయ్యాడు. 1749లో అన్వరుద్దీన్‌ను హత్య చేసి చందాఖాన్ నవాబ్ అయ్యాడు. ఇందుకు ఫ్రెంచి సైన్యాల సహాయం తీసుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా చందాఖాన్ కూడా ఒక బ్రిటీషు అధికారి చేతిలో హతమయ్యాడు. ఆ బ్రిటీషు అధికారి అన్వర్ కుమారుడు ముహమ్మద్ అలీని 1752లో గద్దెపై కూర్చోబెట్టాడు. చివరగా లార్డ్ వెలస్లీ కర్ణాటక చివరి నవాబ్‌ను పెన్షన్‌తో సాగనంపి 1801లో ఆ రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

## మైసూర్ రాజ్యం (1761-99)

హైదర్ అలీ (1761–82) సైనికునిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. మైసూర్ రాజ్యం హిందూ వడేయార్ వంశం పాలనలో 1565లో స్వాతంత్ర్యాన్ని దక్కించుకుంది. అప్పటికే విజయనగర సామ్రాజ్యం పతనమైంది. దిండిగల్ ఫౌజ్‌దార్‌గా అసమాన ప్రతిభను చూపిన హైదర్‌అలీ ఉన్నత స్థానానికి ఎదిగాడు. పాశ్చాత్య సైన్యాల స్థాయిలో తన సైనికులకు శిక్షణ ఇప్పించాడు. ఆధునిక ఆయుధాగారాన్ని (1755) ఫ్రెంచి సైన్యాల సహకారంతో స్థాపించాడు.

1759లో మరాఠాల దాడి నుండి మైసూర్ రాజధాని శ్రీరంగపట్టణాన్ని సంరక్షించడంలో హైదర్ అలీ విజయంసాధించాడు. ప్రధాన మంత్రి నంజరాజర్ (అతడే అసలైన పాలకుడు. ఒకటవ చిక్కా కృష్ణరాజా నామమాత్రపు అధిపతిగా ఉండేవాడు) హైదర్

అలీకి ఫతే హైదర్ బహదూర్ అనే బిరుదును ప్రదానం చేశాడు. ఎట్టకేలకు నంజరాజర్‌ను పదవి నుండి తప్పించిన హైదర్ అలీ 1761లో అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. అయితే కృష్ణరాజాను న్యాయబద్ధమైన పాలకునిగా గుర్తించాడు. తర్వాత అతడు కూర్గ్, మలబార్, బళ్లారి, గుత్తి, కడప తదితర ప్రాంతాలను మైసూర్ రాజ్య పరిధిలోకి తెచ్చాడు. అలాగే పరిపాలనా సంస్కరణలను అమలు చేసి భారతదేశంలో మైసూర్‌ను ఓ అగ్రరాజ్యంగా తీర్చిదిద్దాడు. ఆంగ్లో-మైసూర్ తొలి రెండు యుద్ధాలు అతడి నేతృత్వంలోనే జరిగాయి. చివరకు క్యాన్సర్ వ్యాధి బారిన పడి హైదర్ అలీ మరణించాడు.

టిపు సుల్తాన్ (1782-99) తన తండ్రి హైదర్‌వారసత్వాన్ని స్వీకరించాడు. 1785 వరకు ఆంగ్లేయులతో రెండవ యుద్ధాన్ని కొనసాగించాడు. మూడో ఆంగ్లో-మైసూర్ (1790-92) యుద్ధాన్ని కూడా ఎదుర్కొని నాల్గవ యుద్ధంలో పోరాడుతూ నేలకొరిగాడు (1799). సైనిక ప్రాబల్యానికి ఆర్థిక శక్తే పునాది అని గుర్తించిన ఏకైక భారతీయ పాలకుడు టిపు. విదేశీ నిపుణులను రప్పించి ఆధునిక పరిశ్రమలను స్థాపించడానికి ప్రయత్నించాడు. అనేక పరిశ్రమలకు రాజ్య సహకారాన్ని అందించాడు. ఫ్రాన్స్, టర్కీ, ఇరాన్, పెగులకు రాయబారులను పంపి విదేశీ వాణిజ్యాన్ని అభివృద్ధి పరచడానికి ప్రయత్నించాడు. అయితే ఐరోపా తరహాలో ఒక వ్యాపారం కంపెనీని స్థాపించడానికి అతడు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాని నాణేల కొత్త వ్యవస్థను, కొలతలు, తూనికల కొత్త ప్రమాణాలను, చివరకు కొత్త క్యాలండర్‌ను కూడా విజయవంతంగా అమలు చేశాడు. రెవెన్యూ పరిపాలనా రంగంలో అతడు జాగీర్ వ్యవస్థను రద్దు చేసి రాజ్య ఆదాయాన్ని గణనీయంగా పెంచాడు. పాలేగాళ్ల అనువంశిక ఆస్తులను తగ్గించాడు. చట్టబద్ధం కాని శిస్తులను నిలిపివేయడం ద్వారా రైతుల స్థితిగతులను మెరుగు పరచడానికి ప్రయత్నించాడు. అవసరమైనపుడు రైతులకు పన్ను మినహాయించాడు. ఐరోపా తరహాలో తన పదాతి దళాన్ని పునఃనిర్మించాడు. రెండు డాక్‌యార్డ్‌లను ఏర్పాటు చేసి ఆధునిక నౌకా దళాన్ని నిర్మించాలని ప్రయత్నించాడు.

### పంజాబ్ రాజ్యం (1792-1849)

సిఖ్ గురువుల నేతృత్వంలో సిఖ్ సముదాయం అధికారంలోకి వచ్చింది. అయితే అహ్మద్‌షా అబ్దలీ చేపట్టిన విధ్వంసక దాడుల నేపథ్యంలో ముఖ్యంగా 1767లో పంజాబ్ అంతటా గందరగోళం నెలకొంది. 12 సమాఖ్యలుగా ఏర్పడి పాలన సాగించడంతో శాంతి భద్రతలు మెరుగయ్యాయి. ఈ సమాఖ్యను మిస్ల్ అంటారు. సుకర్‌చాకియా మిస్ల్ నాయకునికి రంజీత్ సింగ్ (1792- 1839) వారసుడు. 1792లో అతడు మైనర్ బాలునిగా నాయకత్వాన్ని స్వీకరించాడు. మైనర్‌గా ఉన్నంత వరకు అతడికి తల్లి సంరక్షకురాలిగా వ్యవహరించింది. 1796లో రంజీత్ సింగ్ పాలకునిగా సంపూర్ణ బాధ్యతలను చేపట్టాడు. లాహోర్ (1799)ను ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన జమన్‌షా సహాయంతో స్వాధీనం చేసుకున్నారు. 1802లో అమృత్‌సర్‌ను ఆక్రమించాడు. అక్కడ స్వర్ణ దేవాలయానికి స్వర్ణ గోపురాన్ని జతచేశాడు. 1799లో లోహోర్

మహారాజాగా బిరుదాంకితుడయ్యాడు. సట్లెజ్ నదికి పశ్చిమాన ఉన్న సిఖ్ మిస్ల్‌లపై క్రమంగా పట్టు సాధించాడు. 1806లో లుధియానాను స్వాధీనం చేసుకున్నాడు.

భారతదేశంలో ఫ్రెంచి ప్రాబల్యానికి అడ్డుకట్ట వేసే లక్ష్యంతో బ్రిటీషు అధికారులు రంజీత్‌సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకునేందుకు చార్ల్స్ మెట్‌కాఫ్ అనే వ్యక్తిని రాయబారిగా పంపారు. ఒకవైపు బ్రిటీషు దళాలు ముందుకు సాగుతుండగా మరో వైపు మెట్‌కాఫ్ తన చాతుర్యంతో రంజీత్ సింగ్‌ను నిష్క్రియాపరుడిని చేశారు. బ్రిటీషు జోక్యం లేకుండానే తాను అన్ని వైపులా దండయాత్రలు చేపడతానని అతడు సిఖ్ నాయకుడికి నమ్మించాడు. అయితే బ్రిటీష్ దళాల మోహరింపు, కొందరు సిఖ్ నాయకులు వారి రక్షణ ఛత్రం కిందికి చేరగలరనే ఆందోళనతో రంజీత్ సింగ్ బ్రిటీషు అధికారులతో అమృత్‌సర్ ఒప్పందాన్ని (ఏప్రిల్25,1809) కుదుర్చుకున్నాడు. ఈ దీర్ఘకాలిక స్నేహ ఒప్పందం ప్రకారం సట్లెజ్‌కు ఉత్తరాన ఉన్న ప్రాంతాలన్నింటిపై రంజీత్‌సింగ్ ఆధిపత్యాన్ని కంపెనీ గుర్తించింది. రంజీత్ సింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత కలిగిన పాలకుని హోదాను కల్పించింది. సట్లెజ్ ఎడమ ఒడ్డుపై సిఖ్ బలగాలను మోహరించేందుకు (అంతర్గత భద్రత కోసం మాత్రమే) అనుమతించింది. కాంగ్రా (1809), అట్టోక్ (1813), ముల్తాన్ (1818), కాశ్మీర్(1819), పెషావర్(1823) తదితర ప్రాంతాలను ఆక్రమించడంతో పాటు అఫ్ఘనిస్తాన్‌కు చెందిన షా ఘుజానుండి కోహినూర్ వజ్రాన్ని రంజీత్ సింగ్ సేకరించాడు. 1814లో ఘుజాకు రక్షణ కల్పించాడు. కోహినూర్ వజ్రాన్ని మొగల్‌ల నుండి నాదిర్‌షా దోచుకుపోయాడు. తర్వాత అది అహ్మద్‌షా అబ్దలీ చేతికి దక్కింది. అబ్దలీ వంశీయుడైన షాఘుజా దానిని తన నియంత్రణలోకి తీసుకున్నాడు. రెండవ ఆంగ్లో-సిఖ్ యుద్ధం తర్వాత బ్రిటీషు వారు ఆ వజ్రాన్ని దక్కించుకున్నారు. దానిని ఇంగ్లాండ్‌కు తరలించారు. ఇప్పటికీ ఆ వజ్రం లండన్ మ్యూజియంలో ఉంది. రంజీత్ సింగ్ లార్డ్ ఆక్లాండ్ (గవర్నర్ జనరల్), షా ఘుజాలతో 1838లో త్రైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. ఒప్పందం ప్రకారం వారి సంకీర్ణ సైన్యాలు ఆఫ్ఘనిస్తాన్‌పై దండెత్తి ఘుజాను సింహాసనంపై కూర్చోపెట్టాలి. అయితే తొలి ఆఫ్ఘన్ యుద్ధం (1838-42) సమయంలో తన ప్రాంతం గుండా బ్రిటీషు సైన్యాల తరలింపును రంజీత్‌సింగ్ అనుమతించలేదు.

రంజీత్‌సింగ్ ఐరోపా వాసుల సహాయంతో తన సైన్యాన్ని పునఃవ్యవస్థీకరించాడు. సిఖ్‌లనే కాకుండా గుర్ఖా, బిహారీ, పఠాన్, పంజాబీ ముస్లింలను కూడా తన సైన్యంలో భర్తీ చేశాడు. ఫిరంగి మందుగుండు తయారీ కేంద్రాలను స్థాపించాడు. అలా ఆసియాలో తనసైన్యాన్ని రెండవ అతిపెద్ద శక్తిగా తీర్చిదిద్దాడు. అప్పుడు బ్రిటీషు బలగాలదే పైచేయిగా ఉండేది. సమర్థులైన హిందువులు, ముస్లింలను, మంత్రులుగా, సేనానులుగా నియమించాడు. అతడి వారసులు ఖరక్‌సింగ్, నౌనిహాల్ సింగ్, షేర్ సింగ్, దలీప్‌సింగ్.

**ఆఫ్ఘన్లు :**

1739 తొలుతలో నాదిర్ షా ఢిల్లీని స్వాధీనం చేసుకొని దోచుకున్నాడు. భారీ సంపదతో పర్షియాకు తిరిగి వెళ్లాడు. కోహినూర్ వజ్రాన్ని, బంగారు నెమలి సింహాసనాన్ని కూడా వెంట తీసుకెళ్లాడు. అయితే ఈ సమయం నుండి అతడిని నిరుత్సాహం వెంటాడింది.

కోపం ప్రతీకారంగా మారింది. చివరగా విచక్షణ కోల్పోయాడు. 1747లో హత్యకు గురైనప్పుడు తన కాలపు అత్యంత ద్వేషించబడిన వ్యక్తిగా నాదిర్ షా మిగిలాడు. అతడి హత్యతో పర్షియా విచ్ఛిన్నమైంది. సమస్యలు మొదలై కాజర్ వంశం ఆవిర్భావంతో కొలిక్కి వచ్చాయి. ఎప్పుడూ హింసాత్మకంగా ఉండే ఆఫ్ఘన్లు విడిపోయి కొత్త రాజ్యాన్ని స్థాపించారు. నాదిర్ షా భారత దండయాత్ర నిర్దిష్ట ఫలితం కాబుల్‌ను శాశ్వతంగా కోల్పోవడమే.

అహ్మద్‌షా అబ్దలీలో ఆఫ్ఘన్లు ఒక గొప్ప నాయకుడిని చూసుకున్నారు. భారత మైదాన ప్రాంతాలలో రాజకీయ అనిశ్చితి నెలకొనడంతో అతడు ఈ ప్రాంతంపై దృష్టి సారించాడు. లేనిపక్షంలో ఎడారి ప్రాంతమైన ఆఫ్ఘనిస్తాన్‌లో అస్థిరమైన ప్రజలకు నాయకునిగా కొనసాగేవాడు. బాబర్ లాగా అతడికి ఆక్రమించే సామర్థ్యం ఉండేది. అయితే బాబర్‌కు భిన్నంగా అతడికి రాజకీయ చాతుర్యం, ఆక్రమణను సుస్థిరం చేసుకునే సామర్థ్యం కొరవడింది. బాబర్ పర్షియా, తుర్కిస్తాన్‌ల నుండి సాహసికులను, వారితోపాటు ఆఫ్ఘన్ నాయకులను సంపూర్ణంగా వినియోగించాడు. చాలా కాలం వరకువారు మత ఛాందసవాదానికి దూరంగా మెలిగారు. విభిన్న ప్రజలు జాతులతో కలయిక, సంబంధాలను కొనసాగించారు. మొగల్‌లు వృత్తిపరంగా రాజులు. వారి అధికారులు సహజ సిద్ధమైన సామ్రాజ్యవాదులు. కాని ఆఫ్ఘన్లు అస్థిర స్వభావం గలవారు. ఛాందసవాద గుణం ఉన్న కొండ తెగలకు చెందిన వారు. వారికి దాడి చేయడమే తప్ప ప్రజలతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం తెలియదు. ఒక కార్యం కోసం వారు ప్రాణాలు అర్పించగలరు. కాని అందుకోసం రాజీపడలేరు.

భారత్‌పై దండెత్తాలని అహ్మద్‌షా అబ్దలీ చేసిన తొలి ప్రయత్నం 1748లో సర్హింద్ వద్ద విఫలమైంది. మొగల్ సామ్రాజ్యం చురుకుగా కొనసాగి ఉంటే సింధూ నదికి తూర్పున ఉన్న అబ్దలీ గురించి ఎవరూ విని ఉండేవారు కాదు. కాని అదే సంవత్సరంలో చక్రవర్తి ముహమ్మద్ షా మరణించాడు. అహ్మద్ షా మొగల్ పీఠమెక్కాడు. అతడి నామమాత్రపు నియంత్రణలో ఢిల్లీలో అసమ్మతి చెలరేగింది. అంతర్గత పోరును తనకు అనుకూలంగా మార్చుకోవడానికి అహ్మద్ షా అబ్దలీ వెంటనే పావులు కదిపాడు. 1749లో అతడు మరోసారి ప్రత్యక్షమయ్యాడు. కాని లాహోర్ గవర్నర్ అతడిని ధనంతో కొనేశాడు. 1751-52లో మరోసారి దండెత్తి నాలుగు నెలల ముట్టడి తర్వాత లాహోర్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఈసారి సామ్రాజ్య ప్రభుత్వమే స్వయంగా అతడిని కొనుగోలు చేసింది. ముల్తాన్, పంజాబ్‌లను అతడికి దఖలు పరిచింది.

1756 నాటికి సామ్రాజ్యం అంతర్యుద్ధం, రాజకీయ హత్యల కారణంగా మరింత బలహీనమైంది. ఈసారి అహ్మద్ షా ఢిల్లీని దోచుకున్నాడు. రోహిల్లా నాయకుడు నజీబ్ ఖాన్‌ను (నజీబ్-ఉద్-దౌలా) కొత్త చక్రవర్తికి సంరక్షకునిగా నియమించాడు. స్థానిక శక్తులన్నీ ఒక్కటై దక్కను నుండి మరాఠా సైన్యాలను రప్పించాయి. ఉత్తర భూభాగంలోని ముస్లిం ప్రపంచంలో సైనిక సమతుల్యాన్ని సాధించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి.

1759లో అహ్మద్ షా ఐదవసారి భారత భూభాగంలో అడుగుపెట్టాడు. ఈసారి మొగల్ సైన్యాలు కాకుండా మరాఠాల నేతృత్వంలోని హిందూ సైన్యాలను ఎదుర్కొన్నాడు.

తర్వాతి 18 నెలల కాలంలో సాగిన ఎత్తులు, పై ఎత్తులు చివరకు 1761 జనవరి 14న మూడవ పానిపట్ యుద్ధంగా రూపుదాల్చాయి.

తెలివైన కదలికలతో అహ్మద్ షా మరాఠా సైన్యాలను వాటి దక్షిణ స్థావరం నుండి వేరు చేశాడు. అచేతనంలో నిస్పృహకు లోనైపుడు, ఆహార సరఫరాలు నిలిచిపోయినపుడు మరాఠాలను యుద్ధానికి రెచ్చగొట్టాడు. ఈ యుద్ధంలో సాధించిన అమోఘమైన విజయం హిందుస్తాన్‌ను అతడి పాదాల చెంత చేర్చింది. మరాఠాలు విచ్ఛిన్నమయ్యారు. గందరగోళంలో జారిపోయారు. మొగల్ నాయకులు విడిపోయారు. వారికి నామమాత్రపు అధికారమే ఉండేది. అప్పటికీ ఎంతో దూరంగా ఉన్న ఈస్ట్ ఇండియా కంపెనీ బెంగాల్‌కే పరిమితమైంది. కాని ఈ క్షణంలో అబ్దలీ సైన్యాలు జీతాల కోసం అర్రులు చాచారు. కాబుల్‌కు తిరిగి వెళ్లాలని పట్టుబట్టారు. బాబర్ వెంట వచ్చిన మొగల్ బేగ్‌ల తెగింపు వారిలో కొరవడింది. అలాగే బాబర్ రోజులలో ఉన్న సంపన్న భారతదేశం ఇప్పుడు ఆర్థికంగా పతనమై ఉంది.

బలహీనమైన సామ్రాజ్యం వద్ద చెప్పుకోదగ్గ నిధులు కొరవడ్డాయి. ఢిల్లీ అఫ్ఘన్ సైనికులకు జీతాలను అందించలేకపోయింది. అహ్మద్ షా తన పరువును దక్కించుకోవడానికి షా ఆలంను తన తొత్తుగా చక్రవర్తి పీఠంపైకూర్చోబెట్టాడు. అతడికి సహాయంగా నజీబ్-ఉద్-దౌలాను మంత్రిగా నియమించాడు. నిజానికి అతడు సామ్రాజ్యాన్ని వదులుకున్నాడు. భారతదేశంలో అతడి ప్రాంతాలు పంజాబ్, సింధ్‌లకే పరిమితమయ్యాయి. అతడు ఢిల్లీకి ఎన్నడూ తిరిగి రాలేదు. తర్వాతి 50 ఏళ్లకు అతడి స్వంత రాజ్యమే చీలిపోయింది.

8

# మధ్యయుగ వంశాల ప్రాంతీయ పాలనాక్రమం

| స్థాపన/కాలం | వంశం | మూలాధారం - పరిధి |
| --- | --- | --- |
| **ఆంధ్రప్రదేశ్** | | |
| 1000–1300 | కాకతీయులు | వరంగల్–తెలంగాణ–కోస్తా |
| 1500–1600 | కుతుబ్‌షాహీలు | గోల్కొండ–తెలంగాణ–కోస్తా |
| **బెంగాల్** | | |
| 750–1170 | పాలులు | గౌడా–ఒరిస్సా–బెంగాలు |
| 1000–1200 | సేనులు | నవద్వీప–విజయపుర |
| 1200–1700 | ఇల్యాస్ షాహీలు | ఢాకా |
| 1500 | హుసేన్‌షాహీలు | ఢాకా |
| 1700 | నవాబ్‌లు | ముర్షీదాబాద్ |
| **గంగా పరివాహక ప్రాంతం** | | |
| 500–800 | పుష్యపుభూలు | స్థానీశ్వర–ఉజ్జయినీ–ఒరిస్సా |
| 700–1150 | గుర్జర ప్రతిహారులు | ఉజ్జయినీ – గుజరాత్–పంజాబ్, |
| 800–1300 | చండేలాలు | ఖుజరహే–అవధ్–గోరఖ్‌పూర్ |
| 1000–1200 | గహడవాలాలు | కాశీ–కన్యకుబ్జ–అవధ్ |
| 1162–1206 | ఘజ్నవీదులు | లాహోర్–ఘజిని–మధ్యఆసియా |
| 996–1118 | ఘురీద్‌లు | ఆఫ్ఘనిస్తాన్–ఉత్తర భారతదేశం |
| 1206–1526 | ఢిల్లీ సుల్తాన్‌రాజ్యం | ఉత్తరం–గుజరాత్–దక్కన్–బెంగాల్ |
| 1527–1707 | మొగల్ సామ్రాజ్యం | కాబుల్–ఢిల్లీ–గుజరాత్–దక్కన్ |
| 1540–1555 | సుర్‌వంశం | బెంగాల్–పంజాబ్ |
| **గుజరాత్** | | |
| 900–1200 | చాళుక్యులు | అనహిలపాటక |
| 1500 | జాంషాహీలు | ఔరంగాబాద్ |

**కర్ణాటక**

| | | |
|---|---|---|
| 500–750 | చాళుక్యులు | వతాపి–నర్మద–గుంటూరు |
| 1000–1340 | హొయసలవంశం | ద్వారసముద్రం |
| 1336–1672 | విజయనగర | రాయచూర్–మైసూర్–రెండు తీరాలు |
| 1500–1600 | ఆదిల్‌షాహీలు | బీజాపూర్ |
| 1500–1831(1947) | వాడేయార్ | మైసూర్ ప్రాంతం |

**కాశ్మీర్**

| | | |
|---|---|---|
| 620–850 | కర్కోటులు | శ్రీనగర్–కాబుల్ |
| 900–1300 | లోహారాలు | శ్రీనగర్–కాశ్మీర్ |
| 1339–1561 | షామీర్‌లు | శ్రీనగర్–కాశ్మీర్ |
| 1561–1586 | చక్‌లు | శ్రీనగర్–కాశ్మీర్ |

**కేరళ**

| | | |
|---|---|---|
| 300–1100 | చేర వంశం | కొళ్లం –త్రివేంద్రమ్ |
| 1700–– | జమోరిన్‌లు | కాలికట్ |
| 1700–– | ట్రవంకోర్ | త్రివేంద్రమ్ |

**మహారాష్ట్ర**

| | | |
|---|---|---|
| 600–900 | రాష్ట్రకూటులు | విదర్భ(ఎల్లోరా)–దక్కను |
| 800–1300 | యాదవులు | దేవగిరి |
| 1300–1500 | బహమనీలు | గుల్బర్గ – దక్కను |
| 1500–1600 | నిజాం షాహీలు | అహ్మద్‌నగర్ |
| 1600–1818 | మరాఠాలు | పూణే–మాల్వా–నాగ్‌పూర్ |

**ఒరిస్సా**

| | | |
|---|---|---|
| 300–1400 | గంగాలు | కటక్–భువనేశ్వర్ |
| 1300–1500 | గజపతులు | జజ్‌నగర్ |

**రాజస్థాన్**

| | | |
|---|---|---|
| 800–1300 | పరమారులు | ఉజ్జయినీ–ధారా (మాల్వా) |
| 900–1100 | చౌహాన్లు | అజయమేరు –సాకంబరి |
| 1200–1750 (1948) | రాఠోర్లు | జోధ్‌పూర్–మండూర్ |
| 1300–1700(1948) | సిసోడియాలు | ఉదయ్‌పూర్–చిత్తోర్ |

**తమిళనాడు**

| | | |
|---|---|---|
| 300–900 | పల్లవులు | వేంగి–కంచిపురం–తంజావూరు |
| 600–1300 | పాండ్యులు | మదురై–తంజావూరు–కంచిపురం |
| 800–1200 | చోళులు | తంజోర్–కన్యాకుమారి–శ్రీలంక |
| 1336–1672 | విజయనగర | విజయనగర–కర్నాటక–ఆంధ్ర–తమిళనాడు |
| 1600 | నాయకులు | మధురై–జింజి– తంజావూరు |

# II

# రాజకీయ వ్యవస్థ - ప్రభుత్వం

9

# సాధారణ అధ్యయనం

**ద్విదశ భూస్వామ్యవ్యవస్థ :**

**క్రీ.** శ. 750 నుడి 1200 వరకు విస్తరించి ఉన్న తొలి మధ్యయుగాలలో రాజకీయ వ్యవస్థ స్వభావంలో మార్పు వచ్చిందని చరిత్రకారులు సూచించారు. కారణం: ప్రాంతీయశక్తుల పెద్దసంఖ్య, సార్వభౌమ అధికారం లేకపోవడం, రాజకీయ చరిత్రపై వెలువడ్డ సాంప్రదాయ కథనాలు రాజులు, సామంతుల మధ్య సంబంధాలలో మార్పును సూచిస్తే మార్క్సిస్టు విద్వాంసులు తొలి మధ్యయుగాలలో రాజకీయ వ్యవస్థలో నిర్మాణపరమైన మార్పులు భారీగా వచ్చాయని విశ్లేషించారు. ప్రాచీన చారిత్రక రాజకీయ వ్యవస్థకు ఎంతో భిన్నంగా ఈ కాలంలో వికేంద్రీకరణ, విచ్ఛిన్న ప్రక్రియ సంభవించింది. మార్క్సిస్టు చారిత్రకవాదం ప్రకారం తొలి మధ్యయుగ రాజకీయ వ్యవస్థకు ఉన్న వికేంద్రీకరణ స్వభావాన్ని మెచ్చుకోవలసి ఉంటుంది, దానిని విశ్లేషించి ఆ కాలపు విశాల నిర్మాణ నేపథ్యంలో కేంద్రీకృతం చేయాల్సి వుంటుంది. అంటే భారతీయ భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావం, దాని ఘనీకరణను అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థ నిర్మాణం రెండు దశలలో సాగిందని మార్క్సిస్టులు పేర్కొన్నారు. ఉన్నత స్థాయి నుండి మోపబడిన భూస్వామ్య వ్యవస్థ, క్షేత్రస్థాయి నుండి ఆవిర్భవించిన భూస్వామ్య వ్యవస్థ ఈ రెండు దశలను సూచిస్తాయి. తొలి దశ ప్రాథమికమైనది. ఇందులో రాజుకు అతడి సామంతులు, స్వయంప్రతిపత్తిగల నాయకులతో ప్రత్యక్ష సంబంధాలు ఉండేవి. భూస్వాములు లేదా భూములు కలిగిన పెద్ద రైతులు మధ్యవర్తి వర్గంగా ఉండేవారు. రెండవ దశ చాలా క్లిష్టమైనది. ఈ దశలో గ్రామీణ భూ యజమానులు శక్తిమంతులైన దళారులుగా ఎదిగారు (రాజుకు రైతులకు మధ్య) మార్క్సిస్టుల ప్రకార నాలుగు నుండి పదిహేడవ శతాబ్దం వరకు సాగిన ఈ రెండవ దశలో సామంతులు జాగీర్దార్లుగా ఎదిగారు. ఫలితంగా పరిపాలనా వికేంద్రీకరణ జరిగింది. సముదాయ ఆస్తి, భూస్వామ్య ఆస్తిగా మారింది. భారతీయ చరిత్ర శాస్త్రంపై జరుగుతున్న చర్చలకు ఈ దశ చాలా ఆసక్తికరమైనది, ప్రాధాన్యత కలది.

క్రీ.శ. నాలుగు నుండి 17వ శతాబ్దాల మధ్య సామాజిక, సాంస్కృతిక జీవనంలో ప్రధానమైన మార్పులు ఎన్నో వచ్చాయి. ఈ మార్పులను కొందరు మధ్యయుగ కారణాలుగా పరిగణిస్తారు. భారతదేశ నేపథ్యంలో భూస్వామ్య వ్యవస్థ, మధ్యయుగతత్వాల మధ్య పోలికను ఈ కారకాలు సూచిస్తాయి.

తొలి మధ్యయుగాలలో చేసిన భూదానాలలో ప్రాథమిక సాక్ష్యాన్ని వెదికే ప్రయత్నం జరిగింది. ఈ శాసనాలను తొలుత వంశ చరిత్రను పునఃనిర్మించడానికి వాడుకున్నారు. ఇపుడు పరిశోధకుల దృష్టి శాసనాల ఆచరణ అంశంవైపు మళ్లింది. అగ్రహారాల నిర్దిష్ట నిర్మాణాన్ని అది నమోదు చేసింది. అగ్రహారాలంటే పన్ను రహిత భూములు లేదా గ్రామాలు, వీటిని ప్రధానంగా మత గురువులు, మఠాలకు దానం చేశారు. గ్రామాలలో ఒక వ్యక్తిగత బ్రాహ్మణుడికి లేదా బ్రాహ్మణుల బృందానికి లేదా మతసంస్థకు భూములను దానం చేసేవారు. రెవెన్యూ సూచికలు అసంఖ్యాకం కావడంతో శాసనాలు సాధారణంగా పన్నులను పీడ లేదా భారం లేదా చిత్రహింసగా ఎందుకు గుర్తించాయో అర్థం చేసుకోవచ్చు. తామ్ర ఫలకాలలో ఆర్థికేతర అంశాలు (ఉదహరణకు విష్టి లేదా బలవంతపు శ్రమ) కూడా చోటు చేసుకున్నాయి. భూదానాలు చేసిన వారు కేవలం పన్ను వసూలు చేసే హక్కులనే కాక మరెన్నో పాలనా, న్యాయపరమైన హక్కులను కూడా అనుభవించారని చెబుతారు. భూదానాలను స్వీకరించిన వారు భూస్వామ్య మధ్యవర్తులుగా (స్వామి లేదా భూ యజమాని) ఎదిగారు. పాలకుడు (మహీపతి), నిజమైన రైతాంగం (కర్షక లేదా కృష్యమానక)ల మధ్య భూస్వామ్య వర్గం ఏర్పడింది. ఈ వర్గం పాలకుడు, రైతులను నష్టాలకు గురిచేసి భౌతికపరమైన లాభాలెన్నింటినో దక్కించుకుంది.

తెలివైన కలయిక, విశ్లేషణతో (క్షేత్రస్థాయి పురావస్తు సమాచారం) పట్టణ ప్రాంతాలు పెద్ద ఎత్తున క్షీణించాయని నిర్ధారణకు వచ్చారు. తొలుత గంగా లోయలో ఆ తర్వాత ఉప ఖండ మంతటిలో పట్టణాలు పతనమయ్యాయి. ఇండో-రోమన్ వాణిజ్యం క్షీణించడంతో సుదూర వ్యాపారం, నాణేల ఆధారిత ఆర్థిక వ్యవస్థ తొలి చారిత్రక యుగాలలో ధ్వసంమైంది. పట్టణ స్తంభన, ఆర్థిక స్తంభన సమాంతరంగా జరిగాయి. పరిస్థితి ఎంత దిగజారిందంటే రాజ్య అధికారులకు నగదు రూపంలో వేతనాలు కూడా చెల్లించలేకపోయారు. ప్రత్యామ్నాయ ఏర్పాటుగా వారికి భూములను కట్టబెట్టారు. లౌకిక భూస్వాములు ఈ కాలంలో వృద్ధిలోకి వచ్చారు. అప్పటికే భూములు దానంగా స్వీకరించిన మతగురువులు ఎందరో వున్నారు. ఈ పరిణామాల స్థూల ఫలితం సామంతులు భూస్వాములుగా అనూహ్యమైన రీతిలో ఎదగడమేనని చెబుతారు. తొలి మధ్యయుగ గ్రంథాల నుండి సేకరించిన సాక్ష్యం ప్రకారం వివిధ స్థాయిలలో సామంతులు ఎదిగారు. విభిన్నమైన రాజకీయ, ఆర్థిక హక్కులను అనుభవించారు. హర్షచరిత్ర, రాజతరంగణి లాంటి చారిత్రక గ్రంథాలు, మానసోల్లాస, అపరిజాతప్రిచ్ఛ లాంటి వాస్తు శాస్త్ర గ్రంథాలు ఈ మేరకు తగిన సాక్ష్యాలను అందిస్తాయి. సామంతులు వాస్తవానికి రాజకీయ

వ్యవహారాలు నియంత్రించారని చెబుతారు. ఫలితంగా సార్వభౌమత్వం చీలిపోయి, రాజకీయ వికేంద్రీకరణ జరిగింది.

రాజకీయ రంగంలోని తీవ్ర పరిస్థితులు ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని మార్చడానికి దోహదపడ్డాయి. అంతవరకు చురుకుగా ఉన్న నగదు–ఆధారిత ఆర్థిక వ్యవస్థ, స్వయం సమృద్ధి పరిమితమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందింది. ఈ వ్యవస్థలో సాగుదారులు పరాధీన రైతులుగా దిగజారారు. రైతులను అస్రిత హాలిక లేదా బద్ధహాల అనేవారు. సోమదేవుని యశస్తిలకచంపు లాటి జైన గ్రంథాలు, ఉన్నత సంస్కృత భాష పద్య గ్రంథాలైన రామచరితం (సంధ్యాకరనందిన్), సుభాషిత రత్నకోశలను సాక్ష్యాలుగా తీసుకొని ఆ కాలపు రైతుల కటిక దారిద్ర్యాన్ని అంచనావేశారు. భూస్వామ్య స్వభావం కలిగిన ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అనేక కష్టాలను అనుభవించారు. కొన్నిసార్లు నిరాశనిస్పృహలతో భూస్వామిపై తిరుగుబాటు చేశారు. (తిరుగుబాట్లు మధ్యలోనే ఆగిపోయేవి). లేదంటే దోపిడీదార భూస్వామి ప్రభావ ప్రాంతం నుండి పారిపోయారు.

ఈ చారిత్రక గ్రంథాలు, రాతప్రతులు భారత భూస్వామ్య వ్యవస్థ విద్వాంసులకు మంచి సమాచారాన్ని అందించాయి. దాంతో వారు ఆ కాలంలో ఆర్థిక పతనం గణనీయంగా జరిగిందని, అదే సమయంలో రాజకీయ వ్యవస్థ చీలిపోయిందన్న నిర్ధారణకు వచ్చారు. ప్రతిహార, పాలా–సేన, రాష్ట్రకూట రాజ్యాలలోని పరిస్థితులు భారతీయ భూస్వామ్య రాజకీయ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ, సమాజానికి చిహ్నాలని భావిస్తారు.

**మూడు దశల భూస్వామ్య వ్యవస్థ:**

అయితే కొందరు విద్వాంసులు భారతీయ భూస్వామ్య వ్యవస్థ మూడు దశల నిర్మాణాన్ని ప్రతిపాదించారు. భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావ కాలాన్ని క్రీ.శ. 300–600 సంవత్సరాలుగా నిర్ధారించారు. వ్యవస్థ 600–1000 సంవత్సరాల మధ్య అభివృద్ధి చెంది పరిపక్వతను సాధించింది. 1000 నుండి 1200 సంవత్సరాల మధ్య పతాకస్థాయికి చేరుకొని పతనం వైపు పయనించింది. వంశాలు మారినా వాటి వెలుపల, వాటికి సంబంధం లేకుండా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులు భారత సమాజంలో ఎన్నో చోటు చేసుకున్నాయని ఈ అధ్యయనం నొక్కిచెప్పింది. వెయ్యేళ్లపాటు భారత సమాజం ఎలాంటి మార్పులు లేకుండా ఉండిపోయిందన్న వాదనను ఈ అధ్యయనం సవాలు చేసింది. గ్రామీణ సముదాయాలు, ఆసియా తరహా ఉత్పత్తి, ప్రాచ్య నిరంకుశత్వం అనే లక్షణాలతో భారత సమాజం స్తంభించిపోయిందన్న వాదనను తిప్పికొట్టింది. తొలిగా చర్చించిన నమూనాకు భిన్నంగా భూస్వామ్య వ్యవస్థ మూడు దశలలో వికసించిందన్న భావనను కల్గించింది. కేవలం ఉత్తర భారతదేశం నుండి సేకరించిన సాక్ష్యాల ఆధారంగానే ఈ సిద్ధాంతాన్ని రూపొందించినా,

భారత భూస్వామ్య వ్యవస్థ సమర్థకులు దీనిని అఖిల భారత దృగ్విషయంగా పరిగణిస్తారు. అయితే ప్రాంతీయ భిన్నత్వాలు ఉన్నాయని అంగీకరిస్తారు. కాని ఇటీవల అధ్యయనాలు క్రీ.శ. 1000 తర్వాత, ముఖ్యంగా క్రీ. 1100 నుండి ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని నిర్ధారించాయి.

**అస్థిర రాజ్యం:**

అయితే భారతీయ భూస్వామ్య వ్యవస్థ సిద్ధాంతం ఎలాంటి సవాళ్లు ఎదుర్కోకుండా ముందుకు సాగలేదు. సిద్ధాంత, అనుభవ వాద కారణాలతో భూస్వామ్య వ్యవస్థ నిర్మాణంలోని అనేక లోపాలను గుర్తించారు. ఐరోపా చరిత్ర శాస్త్రాన్ని భారతదేశ తొలి మధ్యయుగాల పరిస్థితులకు అన్వయించారని మార్క్సిస్టు చరిత్రకారులను విమర్శించారు. అందుకు భిన్నంగా విమర్శకులు అస్థిర రాజ్యాన్ని ప్రతిపాదించారు. దక్షిణ భారతంలో చోళుల కాలం నుండి విజయనగర సామ్రాజ్య చివరి రోజుల వరకు ఇలాంటి వ్యవస్థ అమల్లో ఉండేదని చెప్పారు. ఇది చీలిపోయిన భూస్వామ్య ఆర్థిక వ్యవస్థకు పూర్తి భిన్నంగా ఉందని వాదించారు. ఆంగ్లేయుల ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రాబల్యం పెంచుకునేవరకు ఈ అస్థిర రాజ్యం కొనసాగింది. ఈస్ట్ ఇండియా కంపెనీ తన పట్టును పెంచుకోవడంతో అది పతనమైందని చెబుతారు.

సైద్ధాంతిక నిర్మాణం కూడా చోళ రాజ్యానికి ఉన్న పూర్వపు స్వభావాన్ని తిరస్కరిస్తుంది. బైజాంటిన్ రాచరికం లాగా ఇక్కడ కూడా అత్యంత శక్తిమంతుడైన రాజు ఉన్నత స్థాయిలో ఉండేవాడని, క్షేత్రస్థాయిలో స్థానిక పరిపాలనా సంస్థలు చురుకుగా ఉండేవని చోళ రాజ్యం గురించి గతంలో వివరించారు. అయితే శిలాశాసనాలు, నాడుల ప్రాధాన్యతను ఆధారంగా చేసుకుని ఈ అస్థిర రాజ్య ప్రతిపాదకులు కొత్త సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. 'నాడు'లనేవి సామాజిక, వ్యవసాయ నిర్వహణకు ప్రాథమిక కేంద్రాలని, వీటి ఆధారంగానే చోళుల అస్థిర రాజ్యం కొనసాగిందని చెప్పారు. కొన్ని గ్రామాల సమూహమే ఒకనాడు. అవి స్థానిక కేంద్రాలుగా పనిచేసేవి. స్థానిక కేంద్రంగా తన పాత్ర వల్ల నాడును పరిపాలనకు మూల కేంద్రంగా చూపారు. మరోవైపు ఈ సిద్ధాంత సూత్రీకరణ చెప్పేదేమిటంటే చోళ రాజ్య కేంద్ర అధికారానికి రెవెన్యూ సంపాదనపై నామ మాత్రపు నియంత్రణ కూడా ఉండేది కాదు.

మరో అడుగు ముందుకు వేసి చోళ సైన్యాల అపరిమితమైన శక్తిని కూడా ప్రశ్నించారు. అది కిరాయి సైన్యాల సమూహమే అయి ఉంటుందన్న భావనతోనే ఈ వాదన చేశారు. క్రమబద్ధ సైన్యం లక్షణాలు చోళ సైన్యానికి ఉండేవి కావని చెప్పారు. చోళుల దండయాత్రలు, వారి నావికాదళ దాడులను వనరుల సమీకరణ కోసం జరిపిన కార్యకలాపాలుగా పరిగణించారు. చోళులకు దోపిడీ స్వభావం ఉండేదని చెప్పారు. కావేరి డెల్టా వెలుపల చోళ పాలకునికి నామమాత్రపు అధికారిక నియంత్రణ కూడా లేదని ఈ సిద్ధాంతవేత్తలు పేర్కొన్నారు. అయితే చోళులు తమ రాజ్య పరిధిలోని మధ్యవర్తులను, శివారు ప్రాంతాలను ఎలా నియంత్రించారు?

వారి అభిప్రాయం మేరకు దీనిని అలంకార ప్రాయమైన సార్వభౌమత్వంతో సాధించారు. చోళ పోషకుల పేరిట నిర్మితమైన భారీ ఆలయాలు అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

**సమైక్య రాజ్యం:**

తొలి మధ్యయుగాల భారతదేశంపై ఈ చర్చలు, విభిన్న దృక్పథాలు మన అవగాహనను మరింత పెంచాయి. రాజకీయ చరిత్రపై ఆసక్తి ఏర్పడడం అందుకో నిదర్శనం. ఈ కాలపు స్థితిగతులపై ఎన్నో ప్రచురణలు బయటికిరావడం కూడా ఈ ఆసక్తి ఫలితమే. వివిధ ప్రాంతాల పాలకుల ధైర్య సాహసాలను వివరించడం కంటే ఇది ఎంతో క్లిష్టమైన పని. సమకాలీన సామాజిక–ఆర్థిక, మత–సాంస్కృతిక పరిస్థితుల నుండి వేరుగా చూడలేని రాజకీయ ప్రక్రియకు ప్రతి రూపమే రాజ్యమని ఇది సూత్రీకరిస్తుంది. అస్థిర రాజ్యం, భూస్వామ్య రాజకీయ వ్యవస్థ ప్రతిపాదకుల మధ్య తీవ్రమైన వ్యత్యాసాలున్నా ఒక్క విషయంలో మాత్రం వారు ఏకీభవించారు. మధ్యయుగ రాజకీయ వ్యవస్థలో సమైక్య శక్తులు కొరవడ్డాయని ఇరువురూ నొక్కి చెప్పారు. ఈ కారణంగా తొలి మధ్యయుగాల రాజకీయ వ్యవస్థను ప్రత్యామ్నాయ దృష్టికోణం నుండి పరిశీలించే అవకాశం లభించింది. కేవలం కేంద్రీకరణ, వికేంద్రీకరణ శక్తుల మధ్య సాగిన పోరుగా తొలి మధ్యయుగాలను ఈ దృక్పథం గుర్తించదు. ఈ మూడవ పంథావాదులను "అలీన చరిత్రకారులు"గా గుర్తిస్తారు. స్థానిక, ప్రాంతీయ శక్తులను భూస్వామ్య, అస్థిర రాజ్య నమూనాలో కాకుండా రాచరిక రాజ్య సమాజ విస్తరణ ఆధారంగా ఈ వర్గం వివరిస్తుంది. రాచరిక రాజ్య సమాజం ఆయా ప్రాంతాలుగా, సముదాయాలుగా విస్తరించింది. అప్పటివరకు ఈ ప్రాంతాలు, సముదాయాలు రాజ్యపూర్వ రాజకీయ వ్యవస్థను అనుభవిస్తూ ఉండేవి.

సరిహద్దు ప్రాంతాలలో వ్యవసాయానికి నోచుకోని భూములతో సహా అన్ని రకాల భూములను మత గురువులకు విస్తృతంగా దానం చేయడంవల్ల వ్యవసాయదారుల సమాజం విస్తరించింది, వికసించింది. వ్యవసాయదారుల నివాసాలు విస్తరణ అనాగరిక సమాజంలో జాతి–వర్ణ సమాజం చొచ్చుకొనిపోవడంతో దగ్గరగా ముడిపడి ఉంది. జాతులుగా అనాగరిక సమాజం పరివర్తన చెందడంతో బ్రాహ్మణిక భక్తి ఉద్యమాలలో తెగదేవతలను కూడా చేర్చుకున్నారు. ఈ భక్తి ఉద్యమాలను కొత్త పాలకవంశాలు పోషించాయి. ఈ ప్రక్రియలో కొన్ని మత వర్గాలు కొన్ని ప్రాంతాలలో కీలక స్థానాన్ని సంపాదించాయి. ఈ మత వర్గాల కీలక స్థానం వారి రాచరిక పోషకులకు కీలకస్థానాన్ని కల్పించింది. ఆ విధంగా ఆలయ నిర్మాణ కార్యక్రమాలను చరిత్రకారులు దుబారా వ్యయంగా పరిగణించలేదు. ఆలయ నిర్మాణం పాలకుల రాజకీయ ఉత్కంఠను, అస్థిరత్వాన్ని కూడా సూచించదు. దక్షిణ భారతంలో లభించిన

చారిత్రక సాక్ష్యాలు చోళ రాజ్య అధికారులు స్థానిక కేంద్రాలలో విధులు నిర్వహించినట్లు గట్టి ఆధారాన్ని అందిస్తాయి. ఈ సాక్ష్యాన్ని చోళుల అస్థిర రాజ్య నిర్మాణ సిద్ధాంతాన్ని ధ్వంసం చేసేందుకు ఉపయోగించారు. చోళ కేంద్ర అధికారం నాడుల వ్యవహారాలలో జోక్యం చేసుకున్నట్లు కనిపిస్తోంది. అధికార యంత్రాంగాన్ని వ్యవస్థీకరించే ప్రయత్నాలు జరిగాయని, కనీసం రెండు సందర్భాల్లో భూమి శిస్తును సమగ్రంగా అంచనా వేసినట్లు బోధపడుతోంది. సమైక్య రాజకీయ వ్యవస్థ అనే భావన మధ్య యుగాల రాజకీయ వ్యవస్థను చీలిపోయిన లేదా అస్థిరమైన వ్యవస్థగా నిర్ధారించడాన్ని వ్యతిరేకిస్తుంది.

10

# తొలి మధ్యయుగ కాలం

**పరిచయం :**

తొలి మధ్యయుగాల కాలంలో రాజకీయ విచ్ఛిన్నంపై ఎక్కువ దృష్టి సారించారు. అలాగే నిరంతర యుద్ధాల గురించి ప్రస్తావించారు. అయితే అలాంటి రాజకీయ పరిస్థితి ప్రతిబింబించిన స్థూల సామాజిక నిర్మాణంపై సమగ్ర అధ్యయనం జరగలేదు. మరో మాటలో చెప్పాలంటే నిరంతర చారిత్రక ప్రక్రియ నుండి ఉద్భవించిన పరిణామంగా ఆ రాజకీయ పరిస్థితిని చూడలేదు. దేశం నలువైపుల నుండి లభించిన చారిత్రక సాక్ష్యంతో మొదలుపెడితే దేశమంతటా వివిధ రకాల సామాజిక, రాజకీయ ఉన్నతవర్గాలు ఆవిర్భవించాయని చాలా తేలికగా గుర్తించవచ్చు. అలాంటి ఉన్నత వర్గాలు భూదానాలతో లబ్దిపొంది ఉంటారు లేదా తమ ప్రాంతాలలో తమ ఉన్నత సామాజిక – రాజకీయ హోదాతో స్థానిక దొరలుగా చెలామణి అయి ఉంటారు.

ఈ కాలపు కీలక వ్యక్తులు సామంతులు, మహాసామంతులు, మండలేశ్వరులు, మహా మండలేశ్వరులు, రాజకులాలు, రాజపుత్రులు, వీరందరూ మౌలికంగా భూస్వాములే కాని స్థానిక భాషల్లో వేర్వేరుగా పిలవబడేవారు. వీరి మధ్య సంబంధ స్వభావాన్ని వేర్వేరుగా నిర్వచించినా రాజ్యంలోని ఆస్థాన వ్యవస్థ హోదాలు ఆ స్వభావాన్ని నిర్ధారించేది. అలాంటి పరిస్థితి సైనిక సాహసికత్వాన్ని ప్రోత్సహించిందని చెప్పడం దాదాపు అనవసరం. పాలక వంశాలు వరుసగా ఏర్పాటు కావడం అందుకు నిదర్శనం. ఈ ప్రక్రియను సమకాలీన రాజకీయ సిద్ధాంతంలో నేరుగా అంగీకరించారు. రాజు అనే సిద్ధాంతానికి అస్థిరమైన నిర్వచనం ఉండేది. తొలిమధ్యయుగ రాజ్యాలు కొన్ని శాశ్వత అధికార కేంద్రాలలో ఏర్పడ్డాయి. మిగతా రాజ్యాలు నిర్మానుష్య ప్రాంతాలలో వెలిశాయి. రాజ్యాలు కూడా బ్రాహ్మణిక సూత్రావళికి లోబడే చట్టబద్ధతను కోరుకున్నాయి.

ఇపుడు ఇతిహాస–పురాణ సాంప్రదాయాన్ని ఎన్నడూలేని విధంగా వాడుకొని గౌరవ ప్రదమైన కుటుంబ చరిత్రను సృష్టించారు. సూర్యుడు లేదా చంద్రుడు లేదా ఒక కాల్పనిక

పురుషునితో సంబంధం ఉన్నట్లుగా ఆయా వంశాల చరిత్రను తిరగరాశారు. సంస్కృత భాషలోనే ఎక్కువగా ఈ రచనలు సాగాయి. తగిన రాజకీయ పరపతి సంపాదించుకోవడానికి పాలకవర్గాలు బ్రాహ్మణులను వాడుకున్నాయి. ముఖ్యంగా పురోహిత వర్గంపై, దేవాలయాలు లాంటి మత సంస్థలపై ఎక్కువగా ఆధారపడ్డాయి. దేవాలయాలను నిర్మించడం ద్వారా ఆయా ప్రాంతాలపై తమ పట్టును పెంచుకున్నాయి. బ్రాహ్మణులు, ఆలయాలకు లభించిన అసంఖ్యాక భూదానాలు ఈ రెండు వర్గాల మధ్య ఉన్న పరస్పర సహకారాన్ని అద్దం పడతాయి. ఉదాహరణకు పల్లవ, చోళ పాలనా కాలాల మధ్య చేయబడిన భూదానాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయి. చోళ నివేదికలను పరిశీలిస్తే వారి రాజ్య పరిధిలో అగ్రహారాలు లేదా బ్రాహ్మదేయాలు (బ్రాహ్మణులే ఎక్కువగా ఉండే గ్రామాలు) అన్నివైపులా విస్తరించి ఉన్నట్లు బోధపడుతుంది. అలాంటి గ్రామాలలో స్థానిక సమావేశాల (సభలు) నివేదికలు బ్రాహ్మణులకు మత వ్యవహారాలు ఒక్కటే వ్యాపకం కాదని నిరూపిస్తాయి. మరో తరహా భూదానాలు దేవదానాలు. అవి ఆలయాన్ని గ్రామీణ ప్రాంతాలలోనే కాకుండా కొన్ని సందర్భాల్లో పట్టణ ప్రాంతాలలో కూడా కార్యకలాపాలకు కీలక కేంద్రంగా మార్చివేశాయి. అంటే, మత సాంస్కృతిక, వ్యాపార కార్యకలాపాలకు దేవాలయమే కీలక కేంద్రంగా ఉండేది. ఈ కాలపు రాజకీయ సంఘటనంలో వచ్చిన ముఖ్యమైన మార్పులను స్మృతి గ్రంథాలలోని సమకాలీన వ్యాఖ్యానాల నుండి తెలుసుకోవచ్చు. “రాజు” అనే అంశంపై, ముఖ్యంగా ఆ పద నిర్వచనంపై సమగ్రంగా చర్చ ఉంది. కొన్ని నిర్వచనాలు రాజుకు దఖలు పడిన కొత్త, విశాలమైన అధికారాలను తెలియచేస్తాయి. రాజధర్మాలకు సంబంధించి విజ్ఞానేశ్వర ఇలా రాశాడు: “ఈ ధర్మం మరో కులానికి చెందిన వ్యక్తికీ వర్తిస్తుందని గుర్తించాలి. ఆ వ్యక్తి తన ప్రాంతాన్ని, జిల్లాను, తదితర వాటిని సంరక్షించే బాధ్యత కలవాడై ఉండాలి.” “రాజ్యాభిషేక ఉత్సవాలు, ఇతర రాచరిక ఆడంబరాలు నిజంగా అలంకార ప్రాయమైనవి. స్థానిక ఆచారాలు, కుటుంబ అవసరాలకు అనుగుణంగా రాజును గద్దె మీద కూర్చోబెట్టడమే ఉత్తమం” అని మరో రచయిత ప్రకటించాడు.

రాజత్వాన్ని, సైద్ధాంతికంగా నిర్ధారించబడ్డ విధులతో ముడిపెట్టడానికి ఆయా సిద్ధాంతకర్తలు నిత్యం ప్రయత్నించడాన్ని బట్టి చూస్తే ఆ కాలపు అరాచక లేదా అస్థిర పరిస్థితులలో ఒక రాజకీయ స్థిరత్వాన్ని కొనసాగించాలని వారు ప్రయత్నించినట్లు బోధపడుతుంది. రాజకీయ అధికారాన్ని సంతరించుకున్న రాచరిక కుటుంబాల సంఖ్య విపరీతంగా పెరిగినా, వారి అధికార నిర్మాణం గత నమూనాలను ఎక్కువగా అనుసరించినా స్మృతి సిద్ధాంతకర్తలు మాత్రం క్షత్రియులకు నిర్ధారిత విధులతో కూడిన సామాజిక వ్యవస్థ కొనసాగాలని కోరుకున్నారు. అయితే అదే సమయంలో రాజకీయ అధికార సమీకరణ ప్రక్రియ సైనిక విజయాలకు అదనపు అర్హతను ప్రసాదించింది. రాచరిక ప్రశస్తులలో రాచరిక దండయాత్రలకు సంబంధించిన వర్ణనలు ఆ వంశ చరిత్ర అంతటా మూసధోరణిలో సాగుతాయి. ఒక రాజ్యం అంతరించడం అక్కడి

రాజుకు సంబంధించిన వ్యక్తిగత విషయంగా మారిపోయింది. మేధతిథి ఒక కొత్త క్షత్రియ విలువను ప్రతిపాదించారు. "రాచరిక అంతిమ లక్ష్యం రాజు దండయాత్రల కోరిక తీరడం, ఏకధృవ రాజకీయ ఆధిపత్యాన్ని నెలకొల్పడం" అని మేధతిథి పేర్కొన్నాడు.

అలాంటి విలువలు చాలా వరకు వివిధ స్థాయిగల రాజకీయ నిర్మాణం నుండే పుట్టుకొచ్చాయి. ఆ నిర్మాణంలో వివిధ హోదాలలో ఉన్న వారి మధ్య ఆ విలువలు పోటీ భావనను పెంపొందించాయి. 12వ శతాబ్దపు కృతి 'అపరాజిత పరీక్ష' కనీసం ఆరు సామంత వర్గాలను వర్గీకరించింది. రాజకీయ నిర్మాణంలో దిగువన ఉన్న ఇతర వర్గాల గురించి, వారి హోదా గురించి మరికొన్ని గ్రంథాలు ఉల్లేఖించాయి. సామంతుల హోదా, స్థాయి వారి ప్రాంతాల వైశాల్యం బట్టి లేదా భూమి శిస్తును బట్టి, సైనిక ధీరత్వం బట్టి ఉండేది. ఇలాంటి నిర్మాణంలో వ్యక్తిగతంగా పైకి ఎదగాలంటే ఆడంబరమే ప్రధాన మార్గమైంది. ఈ పరిస్థితిలో రాజు హోదా నిర్మాణంలో సమతుల్యాన్ని పాటించడంపై ఆధారపడి ఉండేది. అయితే అనేక వంశాల పతన చరిత్రను పరిశీలిస్తే అలాంటి సమతుల్యాన్ని పాటించడం ఎప్పుడోగాని సాధ్యంకాలేదని, పాటించినా అది స్వల్పకాలమే కొనసాగిందని బోధపడుతుంది. తొలి మధ్యయుగాల కాలం భారత సమాజంలో భారీ నిర్మాణ మార్పులను చవిచూసిందని తరచుగా నొక్కి చెబుతుంటారు. ఆర్థిక వ్యవస్థ గ్రామీణీకరణ అయ్యింది. అసంఖ్యాక భూదానాలు సమాజంలో భూస్వామ్య వ్యవస్థ లక్షణాలను ప్రోది చేశాయి. వాణిజ్యం క్షీణించింది, పట్టణ కేంద్రాలు నాశనమయ్యాయి. పాత పారిశ్రామిక మండళ్లు తక్కువ జాతి ఉపకులాలుగా ప్రాధాన్యత లేని హోదాకు కుదించుకుపోయాయి. అనేక ఆధారాలు మనకు అందించే ముఖ చిత్రం ఏమిటంటే రాజ్యానికి గరిష్ట స్థాయిలో రెవెన్యూ అందించగలిగే విధంగా విస్తారమైన గ్రామీణ సమాజం సంఘటితమైంది. ఈ రాజకీయ నిర్మాణం వ్యవసాయేతర కార్యకలాపాలకు చాలా వరకు తక్కువ పాత్ర ఉండేది. అయినప్పటికీ ప్రాంతాల ఆవిర్భావ ప్రక్రియ పూర్తి విరుద్ధంగా ఈ ప్రక్రియ సంభవించింది. ఈ కాలపు ప్రాంతాలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉండేవి. కాని వాటికి పూర్వపు జానపద యూనిట్లతో ఎప్పుడూ పోలిక ఉండేది కాదు.

ప్రాంతాల ఆవిర్భావం కేవలం రాజకీయ ప్రక్రియ మాత్రమే కాదు, అది ఒక సాంస్కృతిక ప్రక్రియ కూడా. ఈ కాలపు ప్రాంతాలను వేరు చేసే కారణాలను గుర్తించడం సాధ్యం కాకపోయినా కనీసం కులం, భాషల యొక్క ప్రాంతీయ నేపథ్యాన్ని గుర్తించవచ్చు. సాంస్కృతిక విలీనం, వృత్తుల మార్పిడి కారణంగా కులాలు ఏర్పడ్డాయి. ఈ ప్రక్రియను విశ్లేషిస్తే తప్ప ఒక ప్రాంత సాంస్కృతిక చలనాల సూచికను ప్రతిపాదించడం సాధ్యం కాదు. ఇలాంటి చలనాలే ప్రాంతీయ భాషల అభివృద్ధి క్రమ స్థాయిలలో కూడా గుర్తించవచ్చు. సంస్కృతం అధికార భాషగా కొనసాగినా ఒక ప్రాంతానికి అనువుగా ఉడే భాషనే సమాచారాన్ని మంచి సాధనంగా వాడారు. ప్రాంతీయ భాషను ప్రోత్సహించాలన్న తపన ఎంతవరకు వెళ్లిందంటే రామాయణ, మహాభారత గ్రంథాలను సైతం స్థానికీకరించారు.

### రాజపుత్రుల రాజకీయ వ్యవస్థ - పరిపాలన

ఈ కాలంలో రాజ్‌పుత్ పాలకుల ప్రాబల్యాన్ని అనేక మార్గాలలో పరిమితం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. చాలా ఉదంతాల్లో కొన్ని ఎంపిక చేయబడిన కుటుంబాల నుండి అనువంశికత ఆధారంగా మంత్రులను ఎంపిక చేసేవారు. మంత్రులకు ఎంత ప్రాధాన్యత ఉండేదంటేరాజు వారి సలహాను అట్టే తిరస్కరించే అవకాశం ఉండేది కాదు. అలాగే పాలక కుటుంబంతో వివాహ సంబంధాలు ఉన్న భూస్వామ్య దొరలు పెద్ద సంఖ్యలో ఉండేవారు. స్థానిక, కేంద్ర ప్రభుత్వాలలో ఈ దొరలకు ప్రత్యేక హోదాలు, అధికారాలుండేవి. వారిని ఏ పాలకుడు విస్మరించేవాడు కాదు. ఈ పరిస్థితి కూడా పాలకుడి అధికారాన్ని కుదించివేసేది. చివరగా, పవిత్ర శాస్త్రాలకు అనుగుణంగా పాలించాలనే నిబంధన ఉండడంతో పాలకుడు తన ఇష్టానుసారంగా శాసనాలను జారీ చేయలేకపోయాడు. ఆ విధంగా ఈ కాలపు ఉత్తర భారత పాలకులు భూస్వామ్య సముదాయాలకు చెందిన అనువంశిక నాయకులు. కనుక వారు తలచుకున్నప్పటికీ రాచరిక నియంతలుగా వ్యవహరించలేకపోయారు.

దైవ హక్కు సిద్ధాంతం, సామాజిక ఒడంబడిక సిద్ధాంతాల కలపోతగా సార్వభౌమత్వం ఉండేది. ఒకవైపు ప్రజలు, రచయితలు పాలకుడిని విష్ణువు పాక్షిక అవతారంగా పరిగణిస్తే మరోవైపు ప్రజా ప్రతినిధులే రాజును ఎన్నుకొని అతడికి సార్వభౌమత్వం ప్రసాదించారని చెబుతారు. పాలకుని సహజ విధి ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా పాలించడమే. ప్రజల విధి అతడికి విధేయులుగా, విశ్వాస పాత్రులుగా ఉండడం. ఆ విధంగా సార్వభౌమత్వానికి ఆధారం పాలకుడు, పాలితుల మధ్య ఒడంబడికగా ఉండేది. కనక వారసత్వం తొలి సంతానం మౌలిక ఆధారాలుగా సార్వభౌమత్వం ఉన్నప్పటికీ, ప్రజల అంగీకారం, మత వేడుకలు వారసత్వ మార్పునకు ఒక నైతిక, ఆధ్యాత్మిక లక్షణాన్ని ఆపాదించాయి.

ఈ కాలంలో ఉత్తర భారతంలో, ముఖ్యంగా రాజపుత్ర పాలకులో, వారసత్వానికి సంబంధించి ఒక నిర్దిష్టమైన చట్టం ఉండేది. సాధారణంగా రాజుకు వారసునిగా అతడి పెద్ద కుమారుడు గద్దెనెక్కేవాడు. ఎందుకంటే వారు తొలి సంతానం సూత్రాన్ని పాటించేవారు. ఒకవేళ అతడు తన తండ్రి కాలంలోనే యుక్త వయస్సుకు ఎదిగితే అతడిని అధికారికంగా రాకుమారునిగా లేదా వారసునిగా ప్రకటించేవారు. అతడిని యువరాజే అని పిలిచేవారు. ఒకవేళ సంతానం (వారసుడు)లేకుండానే పాలకుడు మరణిస్తే కుటుంబ సంప్రదాయం ప్రకారం రాజ్యం పాలకవంశానికి సమీప కుటుంబమైన రాచరిక కుటుంబ పెద్దకు దక్కేది. ఫలితంగా ఆ కాలపు రాజకీయ వ్యవస్థలో వివాదాస్పద వారసత్వానికి అవకాశం చాలా తక్కువగా ఉండేది. రాజు అధికారాలు సిద్ధాంతపరంగా సంపూర్ణంగా ఉన్నా ఆచరణలో చాలా పరిమితంగా ఉండేవి. భూస్వామ్య దొరల హోదాలు హక్కులు, ఇష్టాఇష్టాలు రాజు ప్రాబల్యాన్ని పరిమితం చేసేవి. భూభాగమంతటిపై రాజుకు సిద్ధాంతపరమైన యాజమాన్యం ఉండడంతో భూస్వామ్యదొరల

ప్రాంతాలకు అతడి గుర్తింపు అవసరం. అయితే రాజు యొక్క ఈ అధికారం సామాజిక ఆచారాల కారణంగా నామమాత్రంగా ఉండేది. ఫ్యూడల్ దొరల వారసత్వ హక్కులను ఈ ఆచారాలు గుర్తించేవి. అలాగే రాజ్యమంతటా శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత రాజుపై ఉన్నా, ఆచరణలో భూస్వామ్య దొరలకు వారి వారి ప్రాంతాలలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. రాజ్యపాలనలో రాజుకు సహాయకులుగా మంత్రులుండేవారు. యువరాజు, పట్టమహిషి (రాణి)లు కూడా పాలనలో సహాయపడేవారు. మంత్రి మండలిలో ముఖ్యమంత్రి (మహామంత్రి), మరెందరో మంత్రులు ఉండేవారు. వారిలో ప్రధాన పురోహితుడు, జ్యోతిష్కుడు, బ్రాహ్మణులు కాగా మిగతా పదవులపై భూస్వామ్య దొరలకు గుత్తాధిపత్యం ఉండేది. వీరు చాలా వరకు క్షత్రియ కులానికి చెందినవారు. కొన్నిసార్లు ఒకే కుటుంబానికి చెందినవారు పదవులన్నిటినీ దక్కించుకునేవారు. ఆ విధంగా వైశ్యులు, సూద్రులకు మంత్రిమండలిలో సాధారణంగా చోటు లభించలేదు.

పరిపాలనావసరాల కోసం రాజ్యాన్ని కేంద్ర ప్రాంతం, జాగీర్లుగా విభజించేవారు. కేంద్ర ప్రాంతాన్ని రాజు నేరుగా పాలిస్తే, జాగీర్లపై భూస్వాములకు ప్రాబల్యం ఉండేది. కేంద్ర ప్రాంతం భుక్తి లేదా రాష్ట్రగా విభజించబడేది. వీటికి వైస్రాయ్‌లను నియమించేవారు. విషయ అనే ప్రాంతం విషయపతి కింద, చివరగా గ్రామం గ్రామపతి కింద ఉండేది. జాగీర్లలో భూస్వాముల పాలన కూడా ఇలాంటి వ్యవస్థనే కలిగి ఉండేది. అయితే ఈ కాలంలో భూస్వాముల ప్రాబల్యం కారణంగా ఉత్తర భారతదేశంలో గ్రామ స్వయంపాలన బలహీనపడింది. అదే సమయంలో దక్షిణ భారతంలో చోళుల కింద స్థానిక పాలన బలంగా ఉండేది.

రాజు వ్యక్తిగత సైన్యంతోపాటు భూస్వామ్య దొరలు అందించే కిరాయి సైన్యాలు రాజ్య సైన్యంగా ఉండేవి. వాస్తవానికి ఇలాంటి బలహీనతే సైన్యంలో అనైక్యతను పెంపొందించింది. సైన్యంలో పదాతిదళం, ఆశ్విక దళం, యుద్ధ గజాలు ఉండేవి. అయితే ఆశ్విక దళం అంత విస్తారంగా ఉండేదికాదు. గుర్రాలు కూడా ఉన్నత జాతికి చెందినవి కావు. అన్నింటికంటే మించి సైనిక సేవ ఆచరణలో రాజపుత్రుల గుత్తాధిపత్యంగా మారిపోయింది.

ఫలితంగా తమ రాజ్య రక్షణలో తోడ్పడే అవకాశాన్ని 90శాతానికి పైగా ప్రజలు కోల్పోయారు. సైనిక నియంత తమ భూములను (రాజ్యాన్ని) ఆక్రమించినా గట్టిగా ప్రతిఘటించలేకపోయారు. విదేశీ సైన్యాలు దేశంపై దండెత్తడానికి వచ్చినపుడు ఈ వ్యవహారమే తుర్కు, ఆఫ్ఘన్, మొగల్, చివరకు బ్రిటీష్ సామ్రాజ్యాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేసింది.

ప్రాచీన కాలంతో పోలిస్తే మధ్యయుగాల తొలి దశలో పన్నుల భారం విపరీతంగా పెరిగిపోయింది. ఎందుకంటే రాచరిక కుటుంబం, ఆస్థాన వ్యయాలు పెరిగిపోవడంతోపాటు సైనిక వ్యయం పెరుగుతూనే పోవడంతో (తరచు యుద్ధాల కారణంగా) నిధులను

సమీకరించడానికి పాలకులు భూమి శిస్తును పెంచుతూ పోయారు. ఫలితంగా పన్ను చెల్లింపుదారులపై భారం విపరీతంగా పెరిగింది. భారతదేశంలో రాజ్యం యొక్క కీలక విధి ప్రజలకు న్యాయం అందించడం. అయితే ఈ కాలపు పాలకులు ఆ ధర్మానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. భుక్తిలలో దండనాయక్ ఉండేవారు. అతడు న్యాయస్థానాలు, పోలీసు, కారాగారాలను ఏకకాలంలో నియంత్రించేవారు. అయితే న్యాయస్థానాలను ప్రత్యేకంగా నియంత్రించిన వ్యక్తి గురించి ఎలాంటి వర్ణన లేదు. ఫలితంగా, కుల, గ్రామ పంచాయతీలు వివాదాలను చాలా వరకు పరిష్కరించినట్లు బోధపడుతుంది.

ఈ కాలంలో రాజకీయ వ్యవస్థ సైనికతత్వం, భూస్వామ్య వ్యవస్థ, దైవ హక్కులుగల రాచరిక కుటుంబం సమ్మేళనంగా ఉండేది. పాలకుల ప్రధాన లక్ష్యం ప్రజా సంక్షేమం కంటే సైనిక కీర్తిని దక్కించుకోవడమేనని తెలుస్తోంది. కనుక పాలకులు ప్రజలలో తమ పట్ల గౌరవాన్ని, భయాన్ని పెంచారు. కాని అభిమానాన్ని, కృతజ్ఞతాభావాన్ని పొందలేకపోయారు. పౌర, సైనిక నియామకాలు సాధారణంగా బ్రాహ్మణులకు, క్షత్రియులకే పరిమితమయ్యాయి. ఈ కారణంగా మిగతా ప్రజలు రాజకీయ వ్యవహారాల పట్ల ఉదాసీనంగా ఉండిపోయారు. పాలకుడు విదేశీయుడైనా భారతీయుడైనా అతడికి పన్నులు చెల్లించడానికి సిద్ధపడ్డారు. అంటే పన్నుల భారాన్ని మౌనంగానే భరించారు.

## రాష్ట్ర కూటుల రాజకీయ వ్యవస్థ - పరిపాలన

ఒకవైపు గుప్తులు, మరో వైపు చాళుక్యులు (బదామి) అనుసరించిన సిద్ధాంతాలు, ఆచారాల ఆధారంగానే రాష్ట్ర కూటుల రాజకీయ వ్యవస్థ, పరిపాలన కొనసాగింది. ఎప్పటిలాగే సార్వభౌముడు (చక్రవర్తి) పరిపాలనా వ్యవస్థలో అగ్రభాగాన ఉండేవాడు. అలాగే సాయుధ బలగాలకు కమాండర్ – ఇన్–చీఫ్‌గా ఉండేవాడు. రాజకీయ వ్యవహారాలు, న్యాయ పాలనకే కాకుండా సాంస్కృతిక జీవనానికి కూడా సామ్రాజ్య దర్బారు కీలక కేంద్రంగా ఉండేది. రాజు వ్యక్తిత్వంతోపాటు రాజు పదవిని దైవ స్వరూపాలుగా పరిగణించేవారు. కొన్ని మత సూత్రాల ప్రకారం రాజు దేవుళ్ల ప్రతిరూపం. వివిధ దైవాల లక్షణాలను రాజు సంతరించుకుంటాడు. ఆకాలపు సిద్ధాంతవేత్తలు రాజు పట్ల పూర్తి విధేయతను, విశ్వాసాన్ని చూపాలని నొక్కి చెప్పడానికి బహుశా ఒక కారణం అప్పటి అభద్రతా భావమే అయి ఉండవచ్చు. రాజుల మధ్య, రాజులు సామంతుల మధ్య యుద్ధాలు తరచూ జరిగేవి. తమ రాజ్యాలలో శాంతి భద్రతలను కాపాడటానికి రాజులు ప్రయత్నిస్తే ఆచరణలో వారి నిర్దిష్ట నియంత్రణ చాలా పరిమిత ప్రాంతానికే విస్తరించి ఉండేది.

వారసత్వం విషయానికి వస్తే తొలి సంతానం అనే నిబంధన అమల్లో ఉన్నా దానిని ఎప్పుడూ ఖచ్చితంగా పాటించలేదు. పెద్ద కుమారుడు చిన్న కుమారునితో పోరాడిన ఉదంతాలు ఎన్నో వున్నాయి. పెద్ద కుమారులు చాలాసార్లు వారసత్వ పోరులో ఓడిన సందర్భాలూ ఉన్నాయి.

ఆ విధంగా ధృవ, నాల్గవ గోవింద తమ అన్నలను గద్దెదించారు. కొన్నిసార్లు పాలక చక్రవర్తి తన పెద్ద కుమారుడిని లేదా ఇష్టమైన కుమారుడిని యువరాజుగా ప్రకటించేవాడు. అలాంటి సందర్భంలో యువరాజు రాజధానిలో ఉండి పాలనలో రాజుకు సహాయకుడిగా ఉండేవాడు. తర్వాతి సంతానాన్ని ప్రాంతీయ గవర్నర్లుగా నియమించేవారు. ప్రభుత్వ పదవుల్లో ఎప్పుడోగాని రాకుమార్తెలను నియమించేవారు కాదు. ఒకటవ అమోఘవర్ష కుమార్తె చంద్రబేలబ కొంతకాలంపాటు రాయచూర్ ద్వినది ప్రాంతాన్ని పాలించిన ఉదంతం ఒకటి ఉంది.

రాజుకు ఎంతో మంది మంత్రులు సలహా ఇచ్చేవారు. మంత్రులు సాధారణంగా ఉన్నత కుటుంబాలకు చెందినవారు. వారికి పదవి కూడా వారసత్వంగానే దక్కేది. కేంద్ర ప్రభుత్వంలో అనేక శాఖలు ఉండేవని మనకు తెలుసు కాని ఖచ్చితంగా ఏ సంఖ్యలో ఉండేవో, అవి ఎలా పని చేసేవో మనకు తెలియదు. చారిత్రక, సాహిత్య ఆధారాల ప్రకారం ఒక విదేశీ వ్యవహారాల మంత్రి, రెవెన్యూ మంత్రి, కోశాధికారి, సేనాపతి, ప్రధాన న్యాయమూర్తి, పురోహితుడు ఉండేవారు. ఒక మంత్రికి ఒకటి కంటే ఎక్కువ పదవులను కట్టబెట్టే అవకాశం ఉండేది. మంత్రులలో ప్రధానమంత్రిపైనే రాజు ఎక్కువగా ఆధారపడేవాడు. పురోహితుడిని మినహాయిస్తే మిగతా మంత్రులంతా అవసరమైతే సైనిక దాడులు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలి. రాచరిక కుటుంబ అధికారుల గురించి కూడా ప్రస్తావన ఉంది.

ప్రత్యక్ష పాలన, పరోక్ష పాలన ఉన్న ప్రాంతాలలో రాష్ట్ర కూట సామ్రాజ్యం ఏర్పాటై ఉండేది. పరోక్షపాలన గల ప్రాంతాలను సామంతులు పూర్తిగా నియంత్రించేవారు. వీరు రాజుకు విధేయత ప్రకటించి నిర్ధారిత కప్పాన్ని చెల్లించేవారు. యుద్ధ సమయాల్లో సామ్రాజ్య సైన్యానికి కిరాయి సైనికులను పంపేవారు. కొన్నిసార్లు తిరుగుబాటు రాకుండా చూసేందుకు సామంతుడి కుమారుడిని రాజధానిలో ఉంచుకునేవారు. ప్రత్యేక సందర్భాల్లో సామంతులు రాజు దర్బారుకు హాజరు కావడం తప్పనిసరిగా ఉండేది. కొన్నిసార్లు రాజు లేదా రాకుమారులకు తమ కుమార్తెను ఇచ్చి వివాహం చేసేవారు. అయితే ఈ సామంతులు స్వతంత్రంగా వ్యవహరించడానికే ఎక్కువగా మొగ్గు చూపేవారు. కనుక రాజుతో వారు తరచుగా యుద్ధానికి దిగేవారు. ఆ విధంగా రాష్ట్రకుటులు కర్ణాటకు చెందిన వేంగి, గంగాల సామంతులతో పోరాడాల్సి వచ్చింది.

మరోవైపు ప్రత్యక్ష పాలన ఉన్న ప్రాంతాలను రాష్ట్ర, విషయ (జిల్లా), భుక్తి (తాలుకా) చివరగా గ్రామాలుగా విభజించేవారు. రాష్ట్రకు రాష్ట్రపతి నాయకునిగా ఉండేవాడు. అతడు భూమి శిస్తును వసూలు చేయడంతోపాటు సైన్యం సహాయంతో శాంతి భద్రతలను పరిరక్షించేవాడు. విషయకు విషయపతి ఉండేవాడు. అతడు తన పరిధిలో రాష్ట్రపతిలాగే విధులు నిర్వర్తించేవాడు. అయితే భుక్తికి ఎవరు అధిపతిగా ఉండేవారో మనకు తెలియదు. కాని అతడు కూడా తన పరిధిలో దాదాపు ఇలాంటి విధులే నిర్వహించేవాడని బోధపడుతోంది.

ఈ అధికారులకు భూదానాలతో జీతాలు చెల్లించేవారని తెలుస్తోంది. ఈ ఆచారం అధికారులు, అనువంశిక సామంతులు, ఇతర భూస్వాముల మధ్య రేఖలను చెరిపివేసేది. గ్రామం పాలనకు ప్రాథమిక యూనిట్‌గా ఉండేది. గ్రామ పెద్ద, గ్రామ అకౌంటెంట్ స్థానిక పాలన అందించేవారు. వీరు కూడా పదవులను వారసత్వంగా పొందేవారు. గ్రామ పరిధిలో శాంతి భద్రతలను కాపాడే బాధ్యత గ్రామ పెద్దపై ఉండేది. అందుకు అతడు స్థానిక సాయుధులను వినియోగించేవాడు. అలాగే నగదు లేదా వస్తు రూపంలో అతడు పన్ను వసూలు చేసేవాడు. వాటిని రాచరిక ఖజానా, ఆహార భండాగారాలకు తరలించేవారు. భూదానాల నివేదికను నిర్వహించడంతో గ్రామ పెద్దకు జమాబందీ అధికారి తోడ్పడేవాడు. ఈ ఇద్దరు గ్రామ అధికారులకు కూడా పన్ను రహిత భూములను కేటాయించడం ద్వారా జీతాలు చెల్లించేవారు. వీరు కాకుండా గ్రామ కమిటీలు కూడా స్థానిక పాఠశాలలు, చెరువులు, ఆలయాలు, రహదారులను నిర్వహించేవి. గ్రామ పెద్ద పూర్తి సహకారంతో ఈ కమిటీలు పనిచేసేవి. అందుకు ప్రతిఫలంగా రెవెన్యూలో వాటా దక్కించుకునేవి. సాధారణ సమస్యలు, వివాదాలను ఈ కమిటీలే పరిష్కరించేవి. పట్టణాలలో కూడా ఇలాంటి కమిటీలే ఉండేవి. వ్యాపార మండళ్ల అధిపతులు కమిటీలలో సభ్యులుగా ఉండేవారు. పట్టణాలు, వాటి పరిసర ప్రాంతాలలో శాంతి భద్రతలను కాపాడే బాధ్యత కోష్టపాలపై ఉండేది.

నాడ్గగవుండాలు లేదా దేశ గ్రాముకాలు అనే అనువంశిక అధికారుల ఎదుగుదలను రాష్ట్రకుటుల పరిపాలన యొక్క ముఖ్య లక్షణంగా పేర్కొనవచ్చు. తర్వాతి కాలంలో మహారాష్ట్రలో దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు నిర్వహించిన బాధ్యతలనే వీరు కూడా నిర్వహించి ఉండవచ్చు. ఈ పరిణామం సమాజం, రాజకీయాలపై ముఖ్యమైన ప్రభావం చూపింది. ఈ అనువంశిక శక్తుల అధికారం పెరిగే కొద్దీ గ్రామ కమిటీలు బలహీనమయ్యాయి. కేంద్ర పాలకుడు కూడా వారిపై తన అధిపత్యాన్ని, నియంత్రణను కొనసాగించడం కష్టంగా మారింది. ప్రభుత్వం భూస్వామీకరణ అయ్యిందని చెప్పడంలోని అర్థం ఇదే.

## చోళ రాజకీయ వ్యవస్థ - పరిపాలన:

### పరిపాలనా విభాగాలు - నిర్మాణాలు:

తమ రాజ్య పరిధిలోని వివిధ ప్రాంతాలలో భిన్నమైన నియంత్రణా వ్యవస్థలను చోళులు అభివృద్ధి పరిచారు. చోళ, పాండి మండలాలలో వలనాడును నాడుల సమూహంగా ఒక పెద్ద పాలనా విభాగంగా తీర్చిదిద్దారు. క్రీ.శ. 1003 నాటికి రెవెన్యూ సర్వేలు, అంచనాలు పూర్తయిన తర్వాతే వలనాడులు ఏర్పడ్డాయి. వలనాడుకు నదులు లాంటి సహజ సరిహద్దులు ఉండేవి. వలనాడు ఏర్పాటుతో నాడులు చీలిపోయాయి. ఒకనాడుకు చెందిన గ్రామాలను మరో నాడుకు బదిలీ చేశారు. నాడు పరిధి నుండి బ్రాహ్మదేయ, దేవదాన గ్రామాలను తొలగించారు. మరోవైపు వలనాడు పథకంతో సామంత్రులను ప్రవేశపెట్టారు. ఈ కొత్త రెవెన్యూ

విభాగం రైతు ప్రాంతమైన నాడు సమైక్యతను, సమగ్రతను చాలా వరకు అస్థిరపరిచింది.

వివిధ మండలాలలో ఉన్న ఉపప్రాంతీయ వైరుధ్యాలకు అనుగుణంగా తమ పాలనా సంస్థలను నిర్మించడం ద్వారా చోళులు నిజమైన రాజకీయ నియంత్రణను సాధించారు. తొండై మండలంలో పూర్వపు కొట్టం లేదా విశాలమైన మేత – వ్యవసాయ ప్రాంతాన్ని పరిరక్షించారు. తంకూరు లేదా తనియుర్‌ను ఈ ప్రాంతంలో ఒక భిన్నమైన రెవెన్యూ యూనిట్‌గా శాస్త్రీయంగా ఉపయోగించడం బట్టి చూస్తే చోళులు నియంత్రణ కోసం విభిన్నమైన ఉప వ్యవస్థను ఏర్పాటు చేశారని బోధపడుతుంది. కొంతవరకు చోళ ప్రత్యక్ష పాలన ఉన్న ప్రాంతాలలో కూడా తనియుర్‌లు కనిపిస్తాయి. మేజర్ బ్రహ్మదేయ, దేవాలయం – దాని పరిసరాల్లోని నివాస గృహాలను కలిపి తనియుర్‌ను అభివృద్ధి పరిచారు. వాటిలో అనేక చిన్న గ్రామాలు, రెవెన్యూ గ్రామాలు, చివరకు హస్తకళల ఉత్పత్తి కేంద్రాలను సైతం అంతర్భాగం చేశారు. తనియుర్, పాలకుడి ప్రభుత్వం మధ్య రెవెన్యూ లావాదేవీలు నేరుగా జరిగేవి. పెరిలామయి నాడు అనే కొత్త రకం నాడు తనియుర్‌ల చుట్టూ ఆవిర్భవించింది. ఈ తనియుర్‌లు పట్టణ కేంద్రీకరణకు కూడా కీలకమయ్యాయి. పట్టణ పాలనకు సంబంధించి వివిధ అంచెల అధికార వ్యవస్థను సృష్టించి కీలక బాధ్యతలను నిర్వహించాయి. వలనాడు, పెరిలామయినాడు, తనియుర్ వ్యవసాయ ప్రాంతాలు, రెవెన్యూ సంఘటనాలను నిర్వచించాయి, అలాగే పునఃనిర్వచించాయి. చోళుల రాజకీయ అధికారం ఈ ప్రక్రియకు దోహదపడింది.

పాండి మండలంలో పూర్వపు అధికార నిర్మాణాలు అలాగే కొనసాగినా తంప్రాపర్ణి లోయలోని తేమ ప్రాంతాలలో వ్యవసాయ విస్తరణ, నిర్వహణ గణనీయంగా పెరగడంతో అవి కూడా చాలా వరకు మెరుగుపడ్డాయి. నియంత్రణకు మరో వ్యవస్థగా సైనిక స్థావరాలు ఉండేవి. వాటిని (నీలైప్పడై) కీలకప్రాంతాలలో ఏర్పరిచేవారు. కొంగుమండలం లాంటి ప్రాంతాలలో దేవాలయ భూములు, ఆస్తుల పరిరక్షణకు కూడా సైనిక బలగాలను మోహరించేవారు. ఇలాంటి ప్రాంతాలు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు కీలక స్థావరాలుగా ఉండేవి. మండలం అన్న సిద్ధాంతమే వినూత్నమైనది. రాజ్య పరిధిలోని ప్రాంతాలన్నింటినీ పునర్ఘటించి, మండలాలుగా పునః వ్యవస్థీకరించారు. ఆ విధంగా ఒక చోళ–పాండ్యను పాండ్య ప్రాంతాన్ని పాలించేందుకు నియమించారు. ప్రాంతాల నియంత్రణ కోసం మండలముదలిలను నియమించారు. మండలాలలో వివిధ అధికారిక చర్యలు, ఆర్థికపరమైన నియంత్రణ కొనసాగినట్లు అదనపు సహాయక సాక్ష్యాన్ని పన్ను అంశాల పంపిణీ, వాటి వ్యవధులు అందిస్తాయి.

చోళ రాజకీయ వ్యవస్థలో తక్కువశ్రేణి సామంతులు మరో మధ్యతరగతి స్థాయిని ప్రతిబింబిస్తారు. చోళుల అధికారాన్ని బలోపేతం చేయడంలో వారు గణనీయమైన పాత్రను పోషించారు. ముఖ్యంగా తొలి దశలో చోళులు తమ పాలనను సుస్థిరం చేసుకోవడానికి ఈ

వర్గంపై ఎక్కువగా ఆధారపడ్డారు. శక్తిమంతుడైన కులనాయకులతో వివిధ షరతులతో కూడిన ఒప్పందాలు కుదుర్చుకున్న చోళులు వారికి రెవెన్యూ వ్యవహారాల్లో స్థానిక స్వయంప్రతిపత్తిని కల్పించారు. అందుకు ప్రతిఫలంగా ఆ నాయకులు పాలకునికి సైనిక సహకారం అందించారు. అలాగే వ్యాపార రంగ విస్తరణకు చేయూతనిచ్చారు. పాలకులు దండయాత్ర తర్వాత కొందరు నాయకులకు అధికారాన్ని తిరిగి అప్పజెప్పారు. స్థానిక నియంత్రణ కోసం, పాలకునికి సహాయం అందించడం కోసం కొత్త వారిని సైతం తయారుచేశారు. ఈ కొత్త నాయకులకు పౌర, సైనిక సేవ వ్యవధులను నిర్ధారించారు. వారికి పోలిసింగ్ అధికారులను (పడికవళ్) అప్పగించారు. సాంప్రదాయ దృష్టి కోణంలో వారు సామంతులు. అస్థిర రాజ్యంలో వారు స్థానిక నాయకులు. వీరికి రైతు నేపథ్యం ఉండేది లేదా పాత కుల– తెగ నాయకుల వారసత్వం ఉండేది. అయితే వాస్తవం ఏమిటంటే చోళుల పాలన మధ్యకాలం నుండి వీరంతా నివేదికల నుండి మాయమయ్యారు. అప్పుడు చోళ రాజ్యంలో వలనాడులు ఆవిర్భావంలోకి వచ్చాయి. 12వ శతాబ్ది చివరలో సామంతులు మరోసారి తమ ప్రాబల్యాన్ని దక్కించుకొని చోళులకు తీవ్రమైన రాజకీయ ముప్పుగా పరిణమించారు. తమలో తాము సంకీర్ణాన్ని ఏర్పాటు చేసుకోవడం ద్వారా లేదా చోళులకు సాంప్రదాయ ప్రత్యర్థులతో లేదా కొత్త నాయకులతో మైత్రి కుదుర్చుకోవడం ద్వారా సామంతులు చోళుల ఆధిపత్యానికి సవాలుగా మారారు.

**చోళుల పన్ను వ్యవస్థ:**

సాంప్రదాయ బద్ధంగా పల్లవులు, చోళుల పాలనలో ఒక ఉత్తమ సంచాలిత పన్ను వ్యవస్థ ఉండేదని చరిత్రకారులు భావిస్తారు. చోళుల నివేదికలలో తరచుగా ప్రస్తావించే 'పురవువరి తిణైక్కలం' అంటే శాశ్వత రెవెన్యూ శాఖ అని, వరిపోట్టగం భూ కేటాయింపులు, భూమి హక్కుల నివేదిక అని పరిగణిస్తారు. అందులో పన్నులను కూడా నమోదు చేసేవారు. విచారణ, అధ్యయనం తర్వాత నివేదికలను ఎప్పటికప్పుడు తాజా పరిచే వారని చెబుతారు. అయితే కేంద్ర పన్నులు, స్థానిక పన్నుల మధ్య వ్యత్యాసాన్ని సమగ్రంగా నిర్ధారించేవారు. స్థానిక పన్నులను స్థానిక సంస్థలు వసూలు చేసేవి. కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు మద్దతు తెలపడానికి (పన్నులు వసూలులో) ఎప్పుడూ సిద్ధంగా ఉండేది. కేంద్ర అధికారులు వసూలు చేసిన భూమి శిస్తుల గురించి చాలా తక్కువగా ప్రస్తావన ఉన్నా అస్థిర రాజ్య ప్రతిపాదకులు స్థానిక సంస్థల నుండి కేంద్రానికి ఎలాంటి పన్నుల ప్రవాహాన్ని గుర్తించరు. అయితే పన్ను అంశాల భౌగోళిక పంపిణీ, నేపథ్యాన్ని విశ్లేషిస్తే కడమయి అనే భూమి పన్ను స్థిరీకరించబడినట్లు బోధపడుతుంది. భూమికి సంబంధించి ఇతర చిన్న పన్నులు కూడా ఉండేవి. సేకరణ పద్ధతులు, నిల్వ, నిధుల బదిలీ (స్థానిక సంస్థల నుండి కేంద్ర ప్రభుత్వానికి)లను వివిధ స్థాయిలలో ఏర్పాటు చేసిన ధాన్యాగారాల వద్ద సూచనలను బట్టి తెలుసుకోవచ్చు. సభ, నగరం రాజ్యంతో నేరుగా రెవెన్యూ వ్యవహారాలను తేల్చుకునేవి. వలనాడు, నాడు, గ్రామ స్థాయిల నుండి కేంద్రానికి నిధులు,

ధాన్యం సరఫరా అయ్యేవి. వ్యవసాయేతర పన్నులు కాలక్రమంలో పెరిగి చోళుల పాలన చివరి దశలో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. పెరిగిన ఈ రకం పన్నులు హస్తకళా కృతుల ఉత్పత్తి, వాణిజ్య కార్యకలాపాలలో వచ్చిన గణనీయమైన అభివృద్ధిని సూచిస్తాయి.

స్థానిక పన్ను సేకరణ పద్ధతులు, ఆదాయాన్ని ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలో తిరిగి పెట్టుబడిగా పెట్టడంవల్ల కేంద్ర వసూళ్లు, పునఃపంపిణీ సమస్యలు తలెత్తలేదు. కనక రాజ్యం ద్వారా నిధుల సమీకరణను వనరుల పునఃపంపిణీ ప్రక్రియ నుండి వేరుగా చూడలేము. రాజ్య నిర్మాణంలోని సమైక్య శక్తులకు, ముఖ్యంగా బ్రాహ్మదేయ, దేవాలయాలకు వనరులను పునఃపంపిణీ చేసేవారు. అయితే అస్థిర రాజ్య సిద్ధాంతం ఈ ప్రక్రియను గుర్తించడంలో విఫలమైంది. రాజ్య నిర్మాణాన్ని రాజ్య విధుల నుండి వేరు చేసి చూడడంవల్లే సిద్ధాంతం వనరుల పునఃపంపిణీని గుర్తించలేకపోయింది. అలాగే "దోపిడీ రాజకీయాలు" అన్న సిద్ధాంతానికి కూడా ఇదే విషయం వర్తిస్తుంది. రాజ్యం, ఆయా ప్రాంతాల మధ్య ఉన్న పరస్పర సహకార ఏర్పాట్లను ఆ సిద్ధాంతం విస్మరిస్తుంది. అలాగే వ్యాపార, వాణిజ్య వ్యవహారాలలో రాజ్యం చూపిన అత్యుత్సాహాన్ని రెండవ వనరుల ఆధారంగా కూడా గుర్తించలేదు. చోళుల యుద్ధతంత్రం ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికేనని ఆ సిద్ధాంతం పేర్కొంది. బలవంతపు దాడులతో స్వేచ్ఛగా పారే నిధులను చోళులు కొల్లగొట్టేవారని నిందిస్తుంది. సముద్రాంతర యుద్ధాలు కూడా వ్యాపార ప్రయోజనాలను విస్తరించేందుకు చేపట్టిన విధానంలో అంతర్భాగం కాదని చెబుతుంది. వాణిజ్యం ద్వారా సమకూరే విలాస వస్తువులను రాచరిక కుటుంబం, దేవాలయాలే ఎక్కువగా వినియోగించేవి. రాచరిక ఓడరేవుల్లోని ఆచారాలు, అక్కడ విదేశీ ఏజెంట్లు ఉపస్థితి, చైనాకు రాయబారాలు కూడా రెండవ వనరుల ఆధారాన్ని దక్కించుకోవడానికి ఉద్దేశించినవే.

**చోళుల అధికార యంత్రాంగం:**

సామ్రాజ్య స్థాయిలో చోళ రాజ్యాన్ని బైజాంటిన్ రాచరికంతో పోల్చే సాంప్రదాయ వైఖరి ఎన్నో శిలా శాసనాలను పరిశీలించింది. అందులో 'అధికారి', ఇతర ఉన్నత హోదాగల వ్యక్తులను ప్రస్తావించారు. వీరు శక్తివంతమైన అధికారస్వామ్యానికి ప్రాతినిధ్యం వహించారని శిలాశాసనాలలో పేర్కొన్నారు. వివిధ స్థాయిలలో సంఘటితమైన అధికార గణం పూర్తి సామర్థ్యం కలగదని ప్రస్తావించారు. స్థానిక అధికారులకు ఈ కేంద్రీకృత అధికార యంత్రాంగం భిన్నమైనది. ముఖ్యంగా గ్రామీణ అధికారులు, స్థానిక పెద్దలకు పూర్తి భిన్నమైనది. అస్థిర రాజ్య ప్రతిపాదకులు ఇలాంటి శక్తివంతమైన అధికార యంత్రాంగం ఉండేదన్న విషయాన్ని అంగీకరించరు. అధికారి, మువేందవేళన్ లాంటి హోదాలన్నీ శక్తివంతులైన స్థానిక పెద్దలు, దొరలనే సూచిస్తాయని వాదిస్తారు. వీరికి రాజు లేదా కేంద్ర ప్రభుత్వంతో అంత ప్రాధాన్యతగల సంబంధాలు ఏవీ లేవని చెబుతారు. ఆయా నాడులలో రైతుల (పెద్ద రైతులు) రాజకీయ భుజంగా ఈ పెద్దలు

వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ వైఖరిలో వచ్చిన కొన్ని మార్పులు చోళ రాజ్యం తేలికపాటి అధికార యంత్రాంగాన్ని కలిగి ఉండేదని అంగీకరించాయి.

ఇటీవల అనుభవవాద అధ్యయనాలు పదవి, హోదాలను సూచించే పదాల మధ్య తేడాలను స్పష్టంగా గుర్తించాయి. కేంద్ర, స్థానిక అధికారుల మధ్య అధికారులు, స్థానిక నేతల మధ్య తేడాను గుర్తించాయి. అందుకు రెవెన్యూ పాలనలోని వివిధ స్థాయిలలో అధికారులు సంఘటనను సాక్ష్యంగా చూపాయి. నడవళన్ లాంటి బిరుదులు గల స్థానిక నాయకులు (వీరికి నాడుపై చెప్పుకోదగ్గ నియంత్రణ ఉండేది) కేంద్ర ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవారు. ఆరాయన్ చివరి పదంగా వివిధ సామంతులకు ప్రదానం చేసిన బిరుదులు రెవెన్యూ శాఖ, సైన్యంలో వారి హోదాలను సూచిస్తాయి. మువేందవేళన్, బ్రహ్మరాయ బిరుదులు సమాన హోదా కలిగిన అధికారులకు ప్రధానం చేసేవారు. వీరికి రాజుకు సన్నిహిత సంబంధాలుండేవి. రాచరిక అధికారులుగా వారు స్థానిక ప్రాంతం, రాజు మధ్య ప్రధాన రాజకీయ వారధిగా ఉండేవారు. అయితే అలాంటి బిరుదాంకితులు లేదా ఆధిపత్య శక్తులు వ్యవసాయదారుల నేపథ్యం నుండి కూడా ఎదిగి ఉండవచ్చు.

దురదృష్టవశాత్తు సైనిక నిర్వహణకు సంబంధించిన సాక్ష్యం చాలా స్వల్పంగా ఉంది. కనుక ఈ విషయంపై విభిన్నమైన అభిప్రాయాలు వెలువడ్డాయి. ఈ కారణంగానే కేంద్ర సాయుధ బలగాల సంస్థ అంటూ ఒకటి ఉండేది కాదని అస్థిర రాజ్య సిద్ధాంత కర్తలు పేర్కొన్నారు. కనుక చోళ సైనిక బలగాలు విభిన్న యుద్ధ సమూహాల కలయిక అని అందులో అన్ని రకాల కిరాయి సైన్యాలు ఉండేవని భావిస్తారు. కుడి చేయి (వలంగాయ్) ఎడమచేయి (ఇడంగాయ్) లాంటి పేర్లతో స్థానిక కిరాయి సైన్యాలు తమ కార్యకలాపాలు కొనసాగించాయని చెబుతారు. ఇలాంటి సైన్యాలలో రైతులు, వివిధ కులాలకు చెందిన అస్థిర యువకులు ఉండేవారు. ఈ అభిప్రాయం ప్రకారం సైనిక బలగాలకు రాచరిక బిరుదులు వాటి హోదా కంటే రాజకీయ మొగ్గును సూచిస్తాయి. క్రమబద్ధ సైన్యంలో వారి శాశ్వత హోదాను అవి ఏ మాత్రం ప్రతిబింబించవు. అందుకే రెజిమెంట్లుగా వాటిని వర్ణించడం ఆమోదయోగ్యం కాదని చెబుతారు. అలాగే శిలాశాసనాలలో నౌకాదళ దండయాత్రల ప్రస్తావనను పక్కనబెడితే అస్థిర రాజ్య నమూనా చోళుల సముద్రాంతర దాడులను ఆ స్థాయి నౌకా బృందమని, వాటిలో సైనికులను తరలించారని, అంతే తప్ప దానిని శాశ్వత నౌకాదళంగా పరిగణించదు.

అయితే అస్తిర రాజ్య నమూనా అందించిన పై చిత్రాన్ని ఇపుడు సవాలు చేస్తున్నారు. ఎందుకంటే వీరభోగ, పడైపత్రుదానాలు, నీలైపుడై (సైనిక స్థావరాలు) రెండూ రాచరిక సైన్యం ఉనికికి బలమైన సాక్ష్యాలు అందిస్తాయి. కనీసం 12వ శతాబ్దం వరకు అయినా ఈ సైన్యం కొనసాగిందని చెబుతాయి. పడై ముద్దళి, నాయగం అనే సైనికాధికారులు కూడా శిలా శాసనాల ద్వారానే వెలుగులోకి వచ్చారు. పెరుందారం, సిరుతారం అనే శ్రేణులు ఎడమచేయి వెలైక్కరర్

సైనిక విభాగాలలో సర్వసాధారణంగా ఉండేవి. క్రమబద్ధ సైన్యానికి ఇది మరో ఉదాహరణ. రాచరిక సైనిక దండయాత్రలకు స్థానిక పెద్దలు తమ సైన్యాలను పంపారనడంలో ఎలాంటి సందేహంలేదు.

**దక్షిణ భారత గ్రామ వ్యవస్థ:**

దక్షిణ భారతంలో తరచూ రాజకీయ మార్పుల మధ్య జీవనాన్ని, సాంప్రదాయాన్ని కొనసాగించిన సంస్థ గ్రామమే. గ్రామీణ సంస్థల కీలక హోదాను దక్షిణ భారతదేశమంతటా లభించిన శిలా శాసనాలు బలపరుస్తాయి. గ్రామ స్థాయిలో స్వయం ప్రతిపత్తి స్థాయి చాలా ఉన్నతంగా ఉండేది. గ్రామ వ్యవహారాలలో రాచరిక అధికారుల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేది. పరిపాలకులు, నియంత్రణదారుల కంటే సలహాదారులు, పరిశీలకులుగానే వారు గ్రామ సమావేశాలకు హాజరయ్యేవారు.

దక్షిణ భారతదేశంలో మూడు రకాల గ్రామాలు ఉండేవి. మొదటి రకం గ్రామంలో వివిధ కులాలకు చెందిన ప్రజలు నివాసం ఉండేవారు. భూమిశిస్తు రూపంలో రాజుకు పన్నులు చెల్లించేవారు. గ్రామాలు చాలా వరకు ఈ రకానికి చెందినవే. రెండవ రకం గ్రామం బ్రహ్మదేయ లేదా అగ్రహారాలు. ఈ గ్రామాలను బ్రాహ్మణులకు కేటాయించేవారు. అలాంటి గ్రామాలలో ప్రజలు దాదాపు అందరూ బ్రాహ్మణ కులానికి చెందినవారే. ఇది చాలా తక్కువ సంఖ్యలో ఉన్నా బాగా సంపన్నమైనవి. పన్నుల నుండి మినహాయింపు లభించడం వల్లే ఈ గ్రామాలు సంపన్నంగా ఉండేవి. మూడవ రకం గ్రామాలు దేవదాన గ్రామాలు. వీటిని దేవాలయాలకు దానం చేశారు. ఈ గ్రామాలు తొలిరకం గ్రామాలుగానే వ్యవహరించేవి. కాకపోతే ఆదాయమంతా దేవాలయానికి విరాళంగా దక్కేది. రాజ్యం కాకుండా ఆలయ అధికారులే పన్ను రాబట్టేవారు. పల్లవుల కాలంలో తొలి రెండు రకాల గ్రామాలు ఎక్కువగా ఉండేవి. అయితే చోళుల పాలనలో మూడవ రకం గ్రామం జనామోదం పొందాయి. అప్పుడు ఆలయాలు ప్రజా జీవితానికి కేంద్రంగా ఉండేవి.

గ్రామాల్లాగా మూడు రకాల సాధారణ సభలు ఉండేవి. సాధారణ గ్రామంలో పన్ను చెల్లించే నివాసితులతో కూడిన ఉర్ ఉండేది. సభలో సభ్యత్వం బ్రాహ్మణులకే పరిమితమయ్యేది. ఇది ఎక్కువగా బ్రాహ్మదేయ గ్రామాలలో కనిపించేది. నగరం వాణిజ్య కేంద్రాలైన పట్టణాలు, నగరాలలో సాధారణంగా ఉండేది. కొన్ని గ్రామాలలో ఉర్, సభ రెండూ కనిపించేవి. చాలా విస్తారంగా ఉన్న గ్రామాలలో రెండు ఉర్‌లు ఉండేవి. సభల పనితీరు స్థానిక పరిస్థితులను బట్టి వేర్వేరుగా ఉండేది. గ్రామంలోని పన్ను చెల్లింపుదారు లందరికీ ఉర్‌లో సభ్యత్వం ఉన్నప్పటికీ ఆచరణలో పాత సభ్యులే కీలక పాత్ర పోషించేవారు. కొందరు పెద్దలు కలసి ఒక చిన్న కార్యనిర్వాహక మండలిని ఏర్పరిచేవారు. ఉర్‌కు ఒక కార్యనిర్వాహక మండలి ఉండేది. దానిని అలుంగనం అని పిలిచేవారు. దాని సభ్యత్వ బలం, ఎంపిక తీరు స్పష్టంగా తెలియదు. సభకు క్లిష్టమైన యంత్రాంగం ఉండేది.

వరియం అనే కమిటీల ద్వారా సభ తన కార్యకలాపాలను నిర్వహించేది. రెండు కార్యనిర్వాహక మండళ్లు స్వల్ప సభ్యత్వం కలిగి ఉండేవి. ప్రత్యేక నిధుల కోసం వివిధ పరిమాణం గల కమిటీలు ఏర్పడేవి.

ఉర్, సభ కార్యనిర్వాహక, ఇతర కమిటీలకు ఎన్నికను లాట్‌ల ద్వారా నిర్వహించేవారని తెలుస్తోంది. అయితే అవసరమైనప్పుడల్లా ఉర్, సభల రాజ్యాంగాన్ని, పనితీరును సవరించేవారు. ఉత్తరమేరూర్ శిలాశాసనం (ఒకటవ పరాంతక పాలన – 10వ శతాబ్దం) స్థానిక సభ పనితీరు, ఏర్పాటు గురించి వివరాలు అందిస్తుంది. ఆస్తి, విద్య, నిజాయితీ లాంటి అర్హతలనే కాకుండా మతిస్థిమితం లేకపోవడం, అవినీతి లాంటి అనర్హతలను కూడా ప్రస్తావించింది. ఇతర శాసనాలు కూడా దాదాపు ఇదే సమాచారాన్ని అందిస్తాయి. అయితే వాటిలో కొన్ని మార్పులు ఉన్నాయి. సభ సాధారణంగా ఆలయం ఆరుబయట సమావేశమవుతుంది. ఆయా గ్రామాల సభల మధ్య సహకారం, ముఖాముఖి కూడా ఉండేది.

తొలుత సభలు ప్రభుత్వానికి లేదా ఆలయానికి చెల్లించడానికి నిమిత్తం భూమి శిస్తును అంచనా వేసిన మేరకు వసూలు చేసేవి (అంచనా వ్యక్తిగతంగా లేదా ఉమ్మడిగా ఉండేది). రెండవది, సభలు నీటి కాలువ నిర్మాణం లాంటి ప్రత్యేకమైన పనులకు అదనపు పన్నును వసూలు చేసేవి. మూడవది, అవి విరాళాలు, పన్నులకు సంబంధించిన నివేదికలను నిర్వహించేవి. నాల్గవది, అది కౌలు పరిమితి, నీటి పారుదల హక్కులు లాంటి వ్యవసాయ పరమైన వివాదాలను పరిష్కరించేవి. విశాల సభలు జీతభత్యాలు గల అధికారుల చిన్న బృందాన్ని కలిగి ఉండేవి. అయితే సాధారణ సభలలో పనులను చాలా వరకు స్వచ్ఛందంగా చేసేవారు.

# 11

# ఢిల్లీ సుల్తాను రాజ్య రాజకీయ వ్యవస్థ-పరిపాలన

**రాజకీయ సిద్ధాంతాలు - ఆలోచనలు:**

భారతదేశంలో తుర్కులు స్థాపించిన రాజ్యం, ప్రభుత్వం ఇస్లామిక్ రాజకీయ సిద్ధాంతాలు, సంస్థల మధ్య ఒకవైపు, రాజపుత్ర ప్రభుత్వ వ్యవస్థలో మరోవైపు మధ్యేమార్గంగా ఉండేవని చెబుతారు. భారతీయ రాజకీయ వ్యవస్థలాగే ముస్లిం రాజకీయాలకు మతపరమైన పునాది ఉంది. ఖురాన్‌లో పేర్కొన్న విధంగా ఇస్లామిక్, సమాజం, ప్రభుత్వాన్ని నిర్వహించాలని ముస్లింలు నమ్ముతారు. కాలం గడిచే కొద్దీ ఖురాన్ ఆదేశిక సూత్రాలు ప్రజా జీవితం, ప్రభుత్వ విధుల నిర్వహణకు ఏ మాత్రం సరిపోలేదు. అందుకే మహమ్మద్ ప్రవక్త ప్రవచనాల (హదీస్)ను వేర్వేరు పరిస్థితులకు వేర్వేరుగా అన్వయిస్తూ సమస్యలను పరిష్కరించడం మొదలు పెట్టారు. అలాగే ఢిల్లీ సుల్తాన్‌లే స్వయంగా తమ పేరిట జవాబిత్ అనే నిబంధనావళిని రూపొందించి పరిపాలనను సాఫీగా సమర్థవంతంగా నడిపారు.

ఢిల్లీ సుల్తాన్‌లు, ఖలీఫా మధ్య సంబంధ స్వరూపం చాలా ఆసక్తికరమైనది. భారతదేశంలో తుర్కు సుల్తాన్‌లు స్వతంత్రంగా వ్యవహరించినప్పటికీ తమను తాము ఇస్లామిక్ ప్రపంచంలో ఒక భాగంగా పరిగణించేవారు. అందుకే చాలా మంది ఖలీఫాను చట్టబద్ధమైన పాలకునిగా గుర్తిస్తూ తమను తాము అతడి ప్రతినిధులుగా ప్రకటించుకునేవారు. ఖుత్బా (శుక్రవారం ప్రార్థన)లో ఖలీఫా పేరును ప్రస్తావించేవారు. నాణెంపై అతడి ముద్రను చేర్చేవారు. ఖలీఫాకు తమ అనుబంధాన్ని (సేవకులుగా) సూచిస్తూ బిరుదులను పొందేవారు. ఇందుకు విరుద్ధంగా ముగ్గురు పాలకులు తమ సొంత ప్రాముఖ్యతను చాటుకున్నారు. ప్రవక్త తర్వాత అత్యంత ముఖ్యమైన పదవి రాజత్వమేనని, తాను దేవుని నీడనని బాల్బన్ తరచూ పేర్కొనేవాడు. ఇదే పంథాను మహమ్మద్ తుగ్లక్ కూడా అనుసరించాడు. బాల్బన్ ఖుత్బాలో ఖలీఫా పేరును ప్రస్తావించినప్పటికీ మహమ్మద్ తుగ్లక్ మాత్రం ఖలీఫా పేరును ఎక్కడా ప్రస్తావించలేదు. అయినా ఇద్దరికీ తమను తాము ఖలీఫాగా ప్రకటించుకునే ధైర్యం కొరవడింది. అలా చేసిన ఏకైక వ్యక్తి ముబారక్ ఖిల్జీ.

అలాగే కేవలం ముగ్గురు సుల్తాన్‌లే ఖలీఫా నుండి మంసూర్ లేఖను పొందడానికి ప్రయత్నించారు. వారిలో ప్రథముడు ఇల్తుమిష్ తర్వాత ముహమ్మద్ తుగ్లక్ ఉలేమాను మచ్చిక చేసుకోవడానికి ఈజిప్టుకు చెందిన అబ్బాసిద్ ఖలీఫా నుండి అనుమతి పత్రాన్ని పొందాడు. తర్వాత ఫిరోజ్ తుగ్లక్ మంజూరు పత్రం కోసం ప్రయత్నించి దానిని సాధించాడు. ఈ వ్యవహారానికి అసలు నేపథ్యం సుల్తాన్ స్థాయిని సాధారణ ముస్లింలలో బలోపేతం చేయడమే. ముస్లిం రాజ్యాలతో సమాన స్థాయిలో దౌత్యపరంగా సంబంధాలు కొనసాగించడానికి కూడా ఖలీఫా నుండి అనుమతి పత్రాన్ని పొందారు. ముస్లింలు సాధారణంగా ఈ విషయాన్ని సుల్తాన్ విధిగా పరిగణించారు. ఖలీఫా పట్ల గౌరవాభిమానాలు చూపాల్సిన బాధ్యత సుల్తాన్‌పై ఉందని భావించారు. ఖలీఫా ప్రతినిధిగా ప్రకటించబడిన సుల్తాన్‌ను వ్యతిరేకించడం పవిత్ర చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని భావించారు. అయితే ఖలీఫాకు సుల్తాన్‌ల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారాన్ని మాత్రం ఈ ఏర్పాటు కల్పించలేదు. అలాగే సుల్తాన్‌ల నుండి అతడు ఎలాంటి కప్పం, కానుకలను పొందలేదు.

తుర్కులు లేదా ఆఫ్ఘన్‌లలో వారసత్వానికి ఖచ్చితమైన నిబంధన అంటూ ఏదీ ఉండేది కాదు. ఇస్లామిక్ సూత్రాల ప్రకారం పాలకుడికి ఉండాల్సిన అర్హతలు: అతడు వయోజన పురుషుడై ఉండాలి. అతడికి ఎలాంటి శారీరక వైకల్యం ఉండకూడదు. ఇస్లాంలో విశ్వాసం ఉన్న స్వేచ్ఛాయుత ముస్లిం అయి ఉండాలి. మత సిద్ధాంతాల పట్ల పూర్తిగ అవగాహన ఉండాలి. అతడిని ప్రజలు ఎన్నుకోవాలి. ఈ సూత్రాల పట్ల అవగాహన ఉన్నా సుల్తాన్‌లు మాత్రం ఆచరణలో వాటిని పాటించలేదు. రాజపుత్రుల పంథాలో వారు వారసత్వ రాచరికాన్ని స్థాపించడానికి ప్రయత్నించారు.

అయితే వారి ప్రయత్నాలు శాశ్వత పరిష్కారాలకు దారితీయలేదు. ఆ దిశగా వారు గణనీయమైన పావులు కదిపినప్పటికీ శాశ్వత ఫలితాన్ని మాత్రం సాధించలేకపోయారు. సుల్తాన్‌ల ఆచారం ఆధారంగా వారసత్వ సిద్ధాంతాన్ని రూపొందించడం కూడా సాధ్యం కాదు. మహిళ అయినప్పటికీ రజియాను గద్దెను ఎక్కించారు. ముహమ్మద్ తుగ్లక్ విషయంలో మైనారిటీ వయస్సు ప్రతిబంధకం కాలేదు. బానిసత్వం పోకముందే కుతుబుద్దీన్ ఐబక్ అధికారాన్ని గుర్తించారు. పక్షపాతం ఉన్నప్పటికీ కైకూబాద్ సుల్తాన్‌గా కొనసాగారు. తనకు షరియ (ఇస్లామిక్ చట్టం) గురించి ఏమీ తెలియదని అల్లావుద్దీన్ ఖిల్జీ నిర్మొహమాటంగా అంగీకరించాడు. అయితే ఈ అనర్హత కారణంగా అతడు పాలనకు పనికిరాడని ఎవ్వరూ చెప్పలేదు. ఎన్నిక విషయానికి వస్తే ఇస్లాంలో అది ఎన్నడూ జరగలేదు. కొందరు పెద్దలు కలిసి మద్దతునిస్తే దానినే ప్రజల ఎన్నికగా పరిగణించేవారు. ఇలాంటి వినూత్న ఎన్నికను ఇల్తుమిష్; గియాసుద్దీన్ తుగ్లక్, ఫిరోజ్ తుగ్లక్‌ల విషయంలో ప్రయోగించారు. సాధారణంగా చివరి పాలక చక్రవర్తి తన వారసుడిని నియమిస్తాడు. కొన్ని సందర్భాలలో అతడి ఆకాంక్షను విస్మరించి ప్రభుత్వాన్ని మరో వ్యక్తికి అప్పజెప్పారు. దీనిని బట్టి సుల్తాన్ రాజ్య కాలంలో నిర్దిష్టమైన వారసత్వ నిబంధన అంటూ ఏదీ ఉండేది కాదని నిర్ధారించవచ్చు. చివరి పాలకుని కుటుంబం నుండే సాధారణంగా వారసుడిని ఎంపిక చేశారు. అయితే ఎవరైనా బల ప్రయోగంతో అధికారాన్ని హస్తగతం చేసుకుంటే అతడి పట్ల విధేయత ప్రకటించడానికి ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు.

## రాజకీయ సంస్థలు - ఆచారాలు

## కేంద్ర పరిపాలనా వ్యవస్థ:

రాజకీయ, న్యాయ, సైనిక అధికారమంతా సుల్తాన్ చేతిలోనే ఉండడం వల్ల ఢిల్లీ సుల్తాన్ రాజ్యంలో సుల్తాన్ పదవే అత్యంత ప్రధానమైనది. రాజ్య పరిరక్షణ, భద్రతకు సుల్తానే బాధ్యుడు. ఆ విధంగా అతడు పరిపాలనకు కూడా బాధ్యుడే. సైనిక బలగాలకు అతడు సర్వోన్నతాధికారి. చట్టాలు, ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కూడా అతనిదే. ఈ విధిని నిర్వహించడానికి అతడు న్యాయమూర్తులను నియమించాడు. అలాగే సర్వోన్నత న్యాయస్థానంగా వ్యవహరించాడు. అయితే అనేక కారణాలవల్ల సుల్తాన్ ప్రాబల్యం కొంతవరకు పరిమితమైంది. తొలుత కొత్త నియమాలు, నిబంధనల రూపకల్పనలో అతడి అధికారాన్ని కుదించివేశారు. ఉలేమాల సలహాను తోసిరాజని ఏ పాలకుడు రాజ్యాన్ని పాలించలేడు. అల్లావుద్దీన్ ఖిల్జీ, ముహమ్మద్ తుగ్లక్‌లిద్దరే ఉలేమాలను ధిక్కరించి పాలించగలిగారు. రెండవది, సంస్థానాధీశుల అధికారాలు, ప్రత్యేక హక్కులు కూడా సుల్తాన్ ప్రాబల్యాన్ని కొంత వరకు హరించివేశాయి. ముఖ్యంగా బలహీనమైన పాలకుడు గద్దె మీద ఉన్నప్పుడు సంస్థానాధీశులు, ఉలేమాలిద్దరూ అతడిపై ఆధిపత్యం ప్రదర్శించేవారు. అయితే బాల్బన్ హయాంలో, అల్లావుద్దీన్ ఖిల్జీ లేదా ముహమ్మద్ తుగ్లక్ పాలనలో ఈ పరిమితులు నిరర్థకంగా మారాయి. వారు తమకు తోచిన విధంగా పాలించారు.

భారతదేశంలో తుర్కు పరిపాలన తొలుత మౌలికంగా సైనికపరమైన పాలనగా సాగింది. దేశాన్ని ఇక్తాలుగా విభజించి సైనిక నాయకులకు అప్పగించారు. ఇక్తాదారులు తమ పరిధిలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ప్రభుత్వానికి బకాయి ఉన్న భూమి శిస్తును వసూలు చేసేవారు. ఒక్కసారి నిధుల సేకరణ పూర్తికాగానే తమ సైనికుల జీత భత్యాలను, రాజ్యసేవకు అవసరమైన సైన్యాన్ని సిద్ధంగా ఉంచేందుకు అయ్యే వ్యయాన్ని అందులో నుంచి మినహాయించేవారు. తమ సొంత ఖర్చులకు కొంత మొత్తాన్ని ఉంచుకునేందుకు వారిని అనుమతించేవారు. మిగతా సొమ్ము, ఒక వేళ మిగిలితే, సుల్తాన్‌కు పంపేవారు. ఆ విధంగా తొలినాళ్లలో తుర్కు పరిపాలనలో సాధారణ పరిపాలన, రెవెన్యూ పరిపాలన మధ్య, అలాగే సైనిక నిర్వహణ మధ్య ఎలాంటి స్పష్టమైన రేఖలు ఉండేవి కావు.

అయితే క్రీ.శ. 13వ శతాబ్దం చివరి నాటికి వినూత్న లక్షణాలు గల ఒక నిర్దిష్టమైన పరిపాలనా వ్యవస్థ అభివృద్ధి చెందింది. కేంద్రంలో సుల్తాన్ పరిపాలనకు ఆద్యునిగా ఉండేవాడు అతడికి నాయిబ్ సుల్తాన్, వజీర్, ఆరిజ్–ఎ–మామలిక్, సద్ర్–ఉస్–సుదుర్, కాజీ–ఉల్–కజత్, అమీర్–మున్షీ, బరీద్–ఎ–మామలిక్ తదితర ఉన్నతాధికారులు పాలనలో సహాయపడేవారు. పాలకుడు బలహీనుడైనప్పుడే నాయిబ్ సుల్తాన్ పదవిని భర్తీ చేసేవారు. కొన్నిసార్లు అల్లావుద్దీన్ లాంటి శక్తివంతమైన పాలకులు సైతం ప్రత్యేక ప్రయోజనంగా ఈ పదవిని సంస్థానాధీశునికి కట్టబెట్టారు. నాయిబ్ ఆచరణలో సుల్తాన్‌కు ఉన్న అధికారా లన్నింటినీ

అనుభవించాడు. ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖలపై సాధారణ నియంత్రణ కలిగి ఉండేవాడు. సాధారణంగా అతడు సమర్థవంతమైన సేనాని, శక్తిమంతుడైన సంస్థానాధీశుడు.

దీవాన్-ఎ-వజారత్ అనే ఆర్థిక శాఖకు వజీరు అధిపతిగా ఉండేవాడు. హోదాలో అతడు సుల్తాన్‌కు తర్వాతివాడు (ఒకవేళ నాయిబ్ సుల్తాన్ లేకుండా). అతడికి శక్తిమంతమైన సహాయకులెందరో ఉండేవారు. వీరిలో ముగ్గురిని ప్రత్యేకంగా ప్రస్తావించవచ్చు. నాయిబ్ వజీర్, ముష్రిఫ్-ఎ-మామలిక్, ముస్తాఫ్-ఎ-మామలిక్.

మొదటి అధికారి వజీర్‌కు ప్రధాన సహాయకునిగా వ్యవహరించేవారు. రెండవ అధికార రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇతర శాఖల నుండి వచ్చే జమాబందీ నివేదికలను సరిచూసేవాడు. మూడవ అధికారి ఈ పద్దులను ఆడిట్ చేసేవాడు. ఒక విధంగా రెండవ అధికారి అకౌంటెంట్ జనరల్‌గా వ్యవహరిస్తే మూడవ అధికారి ఆడిటర్ జనరల్ పాత్రను పోషించాడు. అయితే కొందరు పాలకులు విధుల పంపిణీలో స్వల్ప మార్పులుచేసి అన్ని రకాల వెనెన్యూల ఖాతాను ముష్రిఫ్‌కు అప్పగించారు. ముస్తాఫ్‌కి ప్రభుత్వ వ్యయంపై పర్యవేక్షణ అధికారాన్ని ఇచ్చారు. రక్షణశాఖకు ఆరిజ్-ఎ-మామలిక్ అధిపతిగా ఉండేవాడు. రక్షణశాఖను దీపాన్-ఎ-అర్జ్ అని పిలిచేవారు. ఈ శాఖ అధిపతి హోదాలో వజీర్‌కు తర్వాతి స్థానంలో ఉండేవాడు. అయితే అతడు సైన్యాధ్యక్షుడు కాదు. ఎందుకంటే సుల్తానే స్వయంగా సాయుధ బలగాలను కమాండ్ చేసేవాడు. రక్షణ శాఖ ప్రత్యేక విధి సైనికులను భర్తీ చేయడం, ఆయుధాలను సమకూర్చడం, సైన్యానికి వేతనాలు చెల్లించడం.

సద్ర్-ఉస్-సుదుర్ మత వ్యవహారాల శాఖ దీవాన్-ఎ-రిసాలత్‌కు అధిపతిగా ఉండేవాడు. అతడు విరాళాలకు కూడా బాధ్యునిగా ఉండేవాడు. ఇస్లామ్ సూత్రాలకు అందరూ కట్టుబడి వ్యవహరించేలా చూసే బాధ్యత కూడా అతడిదే. నగదు లేదా భూముల రూపంలో అతడు విరాళాలు చెల్లించేవాడు. మసీదులు, సమాధులు, ఖాన్‌కాహోలు, మదరసలను నిర్వహించే బాధ్యత అతడిపై ఉండేది. విద్వాంసులకు, మత గురువులకు, అనాథలు లేదా వికలాంగులకు జీవన వ్యయం కల్పించేవారు. విరాళాల శాఖ నిధులను కేవలం ముస్లింల సంక్షేమం కోసమే వినియోగించేవారు. ఈ శాఖకు ప్రత్యేక ఖజానా ఉండేది. ధనిక ముస్లింల నుండి విరాళాలను (జకత్) ఈ ఖజానా సేకరించేది. కాజీ-ఉల్-కజత్ లేదా ప్రధాన కాజీ న్యాయ శాఖకు అధిపతి. సాధారణంగా ఒకే వ్యక్తికి ప్రధాన సద్ర్, ప్రధాన కాజీ బాధ్యతలను కేటాయించేవారు. సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో కాజీలను నియమించేవారు. మరీ ముఖ్యంగా ముస్లింల జనాభా గణనీయంగా ఉన్న ప్రాంతాలలో కాజీలను తప్పనిసరిగా నియమించేవారు. షరియా ఆధారంగా కాజీలు పౌర చట్టాలను నిర్ధారించేవారు. హిందువులకు వారి వ్యక్తిగత పౌర చట్టాన్ని అమలుచేసేవారు. గ్రామాలలో పంచాయతీలు, నగరాలలో కులపెద్దలు సమస్యలను పరిష్కరించేవారు. అయితే నేర చట్టం మాత్రం పాలకుడు నిర్ధారించిన నిబంధనల ఆధారంగా అమలయ్యేది.

నివేదికల శాఖ అయిన దీవాన్-ఎ-ఇన్షాకు అమీర్-మున్షీ అధిపతిగా ఉండేవాడు. ఈ శాఖ ద్వారానే సుల్తాన్ ఫర్మాన్‌లు జారీ అయ్యేవి. ఉన్నత స్థాయి ఉత్తర ప్రత్యుత్తరాలను

అమీర్ మున్షీ నిర్వహించేవాడు. సమాచార, గూఢచార శాఖకు బరీద్-ఎ-మామలిక్ అధిపతిగా నియమించేవారు. బరీద్‌లు సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తూ ప్రధాన బరీద్ ద్వారా సుల్తాన్‌కు సామ్రాజ్యంలో జరుగుతున్న సంఘటనల వివరాలను అందించేవారు. అలాగే ఇతర అధికారులు కూడా అనేక మంది ఉండేవారు. కాని వారు తక్కువ ప్రాధాన్యత కలిగిన శాఖలను నిర్వహించేవారు. లేదా ఆ స్థానం, రాచరిక నివాసంతో ముడిపడి ఉండేవారు. పాలకుని వ్యక్తిగత సిబ్బందిగా గుర్తింపు పొందడానికి ప్రయత్నించేవారు.

**ప్రాంతీయ స్థానిక పరిపాలన:**

ప్రాంతీయ (రాష్ట్ర) ప్రభుత్వం విషయానికి వస్తే మొత్తం రాజ్యాన్ని అనేక రాష్ట్రాలుగా, కప్పం చెల్లించే రాష్ట్రాలుగా విభజించారు. కప్పం చెల్లించే రాష్ట్రాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి ప్రయత్నం చేసేవారు కాదు. సామ్రాజ్యభద్రతకు ముప్పు కల్పించనంత వరకు ఈ రాష్ట్రాల జోలికి వెళ్ళేవారు కాదు. సుల్తాన్ పాలనలో ప్రాంతీయ పరిపాలన ఇటు బలంగా అటు సమర్థవంతంగానూ ఉండేది కాదు. తొలి దశలలో సంస్థానాధీశునికి ఇక్తా రూపంలో ఆక్రమించని లేదా పాక్షికంగా ఆక్రమించిన ప్రాంతాన్ని అప్పగించేవారు. అతడిని గవర్నర్‌గా గుర్తించేవారు. తన సాయుధ బలంతో స్వాధీనం చేసుకునే భూభాగాలన్నింటిపై అతడికి ఆధిపత్యం కల్పించేవారు. అయితే తర్వాతి కాలంలో ఇలాంటి ఏర్పాట్లను తొలగించారు. ఆక్రమణ, లొంగుబాటు బాధ్యతలను సుల్తానే స్వయంగా చేపట్టడంతో గవర్నర్ల ప్రాబల్యం క్షీణించింది. తొలి నాళ్లలో గవర్నర్ల బదిలీ అరుదుగా జరిగేది. కాని తర్వాతి కాలంలో గవర్నర్లను స్వేచ్ఛగా బదిలీ చేశారు. గవర్నర్లను నాయిమ్ లేదా వలీ అని పిలిచేవారు. ప్రాంతీయ గవర్నర్ కింద ప్రాంతీయ వజీర్, ఆరిజ్, కాజీలు ఉండేవారు. కేంద్ర అధికారులు లాగే వీరు కూడా తమ ప్రాంత పరిధిలో విధులు నిర్వహించేవారు.

ప్రాంతాలను షిక్‌లుగా, వాటి కింద పరగణాలుగా విభజించారు. షిక్ అనే పరిపాలనా విభాగం షిక్‌దార్ నియంత్రణలో ఉండేది. కొన్ని గ్రామాల సమూహమైన పరగణకు ఆమిల్ అధిపతిగా ఉండేవాడు. పాలనకు మౌలిక యూనిట్‌గా గ్రామం ఉండేది. గ్రామాలకు స్వయం ప్రతిపత్తి ఉన్నత స్థాయిలో ఉండేది. గ్రామంలో ముఖ్యమైన అధికారి గ్రామ పెద్ద లేదా ముకద్దమ్. పై విశ్లేషణతో స్పష్టమయ్యేదేమిటంటే ఢిల్లీ సుల్తాన్ రాజ్యం కింద పరిపాలనా వ్యవస్థకు అంతకుముందు దేశంలో ఉన్న పరిపాలన వ్యవస్థకు చాలా పోలికలు ఉన్నాయి. రెండు వ్యవస్థల్లోనూ కార్యనిర్వహణ, సాయుధ బలగాలు, న్యాయశాఖకు పాలకుడే అధిపతిగా ఉండేవాడు. రెండు వ్యవస్థల్లోనూ పాలకుడికి మంత్రిమండలి సహకరించేది. అలాగే పరిపాలనా నిర్వహణ విషయానికివస్తే క్షేత్ర స్థాయిలో ఎలాంటి వ్యవస్థాగత మార్పులు తీసుకురాలేదు. కనుక ఎప్పటిలాగే ఒకే వర్గానికి చెందిన వ్యక్తులు అదే పద్ధతిలో భూమిశిస్తు వసూలుచేశారు. ఈ కారణంగానే తుర్కులు గ్రామీణ ప్రాంతాలపై తమ ఆధిపత్యాన్ని అంత త్వరగా ఏర్పాటుచేయగలిగారు.

**సైనిక సంఘటనం:**

తుర్కులు సైనిక సంఘటనను ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. ఢిల్లీ సుల్తాన్‌లు తమ సమయాన్ని చాలా వరకు యుద్ధరంగం లేదా సైనిక వ్యూహాల రూపొందించడంలోనే గడిపారు. ఎందుకంటే అంతర్గత తిరుగుబాట్లు, విదేశీ ఆక్రమణలను ఎదుర్కోవడానికి వారు నిరంతరంగా యుద్ధం చేయాల్సి వచ్చేది. ఈ వ్యవహారాల నుండి తీరిక చిక్కితే రాజ్యకాంక్షతో మరిన్ని దండయాత్రలకు సిద్ధమయ్యేవారు. ఆ విధంగా వారి జీవితమంతా సైనిక వాతావరణంలోనే గడిచిపోయింది. దీని ప్రభావం వారి పాలనలోకూడా కనిపిస్తుంది. అందుకే వారి ప్రభుత్వాన్ని మతపరమైన, సైనిక నియంతృత్వమని పేర్కొంటారు. తుర్కులు అభివృద్ధి పరచిన సైనిక సంఘటనం కారణంగా విశాలమైన సైన్యాన్ని నిర్వహించే సామర్థ్యం పాలకులకు దక్కింది. కేంద్ర స్థాయిలోనే సైన్యాన్ని భర్తీచేయడం, సైనికులకు నగదు వేతనాలు చెల్లించడంలో సైన్యం యుద్ధరంగంలో చాలా కాలంపాటు పోరాడగలిగింది. సైన్యానికి ఆధారం ఇక్తా వ్యవస్థ. ఇక్తాల రెవెన్యూను సైనికాధికారులకు అప్పగించి వారి పోషణతోపాటు వారి నియంత్రణలోని రాచరిక దళాలకు వేతనాలు ఇచ్చేవారు.

సమర్థులైన ఢిల్లీ సుల్తాన్‌లందరూ తమ సైన్యాన్ని బలంగా, సమర్థవంతంగా ఉంచడానికి అనేక చర్యలు తీసుకున్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా రక్షణ శాఖను ఏర్పాటుచేసింది బాల్బనే. ఈ శాఖను దీవాన్-ఎ-అర్జ్ అని పిలిచేవారు. దానికి ఆరజ్-ఎ-మామలిక్ అధిపతిగా ఉండేవాడు. బాల్బన్ ఆ తర్వాత అల్లావుద్దీన్ ఖిల్జీ సాయుధ బలగాలకు అమితమైన ప్రాధాన్యత ఇచ్చారు. ఖిల్జీ అశ్వాలకు ముద్ర వ్యవస్థను (దాగ్) కూడా ప్రవేశపెట్టాడు. ఆ విధంగా సైనిక జాబితాలో నాసిరకం జాతికి చెందిన అశ్వాలు ప్రవేశించకుండా అడ్డుకట్టవేశాడు. ప్రతి సైనికుడికి చెందిన సవివరణాత్మక నివేదిక (చెహ్రా)ను నిర్వహించేవారు. సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో సైన్యాన్ని మోహరించేవారు. రాజధానిలో సుల్తాన్‌తోపాటు ఒక బలమైన సైనిక విభాగం ఉండేది. ఢిల్లీ సుల్తాన్‌లందరిలో అల్లావుద్దీన్‌కు విశాలమైన సైన్యం ఎప్పుడూ అందుబాటులో ఉండేది. సైనికులకు నగదు రూపంలో వేతనాలు చెల్లించిన మొదటి సుల్తాన్ కూడా అతడే. అంతకుముందు సైనికులకు వేతనాలు చెల్లించడానికి ద్వినది ప్రాంతంలోని కొన్ని గ్రామాల రెవెన్యూను కేటాయించేవారు. సైనికులు ఆ భూములను వారసత్వ సంపదగా పరిగణించడం మొదలుపెట్టడంతో తమ ఉద్యోగాలను వదులు కోవడానికి సిద్ధపడలేదు. వయోభారం పెరిగినా, శక్తిలోపించినా సైన్యాన్ని మాత్రం వీడలేదు. బాల్బన్ ఈ భూములను వెనక్కి తీసుకోవాలని ప్రయత్నించాడు కాని సైనికుల ఆందోళన, తన పాత మిత్రుడైన ఢిల్లీ కోత్వాల్ సలహా కారణంగా శాసనంలో కొన్ని మార్పులు చేశాడు. అయితే అల్లావుద్దీన్ ఈ కేటాయింపులను పూర్తిగా రద్దుచేశాడు. సైనికులకు నగదురూపంలో వేతనాలు చెల్లించడం మొదలుపెట్టాడు. అల్లావుద్దీన్ సైన్యం సామర్థ్యం కారణంగానే అతడు మంగోలు దండయాత్రలను నిరోధించగలిగాడు. అదే సమయంలో దక్కను ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. ద్విసంఖ్య పద్ధతిలో మహమ్మద్ తుగ్లక్ తన సైన్యాన్ని సంఘటితం చేయడానికి ప్రయత్నించాడు. అతడి కాలంలో 100, 1000 వగైరా సంఖ్యలో కమాండర్లు ఉండేవారని

తెలుస్తోంది. బహుశా అతడు మంగోలుల నుండి ఈ వ్యవస్థను అనుకరించడానికి ప్రయత్నించాడు. మంగోలులు తమ సైన్యాన్ని ద్విసంఖ్య వ్యవస్థ ఆధారంగా నిర్వహించేవారు.

సైన్యంలో పదాతిదళం, అశ్విక దళం, గజ దళం, నీటి వాహకులు, గోతులు తవ్వేవారు అంతర్భాగంగా ఉండేవారు. తుర్కులు, ఆఫ్ఘన్లు ఆశ్వికదళంలో పెద్ద సంఖ్యలో ఉండేవారు. తుర్కు సైన్యానికి ప్రధాన బలం ఆశ్వికదళమే. ఈ దళం ప్రతిష్టాకరమైనది. ఘజనీల కాలంలో హిందువులను పదాతిదళం, అశ్వికదళం రెండింటిలోనూ చేర్చుకున్నారు. తదుపరి కాలంలో సైతం హిందువులు సైన్యంలో భర్తీ అయినా చాలావరకు పదాతి దళానికే పరిమితమయ్యారు. సైనిక ప్రస్థానం సాఫీగా సాగేందుకు ఒక ప్రత్యేక దళాన్ని ఏర్పరిచారు. ఇందులోని వ్యక్తులు రహదారులను శుభ్రంచేసి అడ్డంకులను తొలగించేవారు. బాబర్ రాకకు పూర్వం ఫిరంగులు ఉండేవి కావు. అయితే రాళ్లను విసిరికొట్టడానికి గోపీలను ఉపయోగించే వారు. అల్లావుద్దీన్ హయాంలో వలె కొన్ని సార్లు సైనికులకు నగదు వేతనాలు చెల్లించేవారు. అయితే ఉన్నతాధికారులకు సాధారణంగా వేతనం బదులు ఇక్తాలను కట్టబెట్టేవారు. సాధారణంగా సైనికులు సరిపడ జీతాలను పొందేవారు. యుద్ధం సమయంలో వారికి అదనపు వేతనంగా యుద్ధ కానుకలలో ఐదోవంతు భాగాన్ని అందించేవారు.

**రాజ్య స్వభావం:**

భారతదేశంలో తుర్కు రాజ్యం సైనికపరమైనది, నియంతృత్వం కలది. అందులో సైనిక, రాచరిక శక్తుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. తొలుత తుర్కు ఉన్నత కుటుంబీకులు రాజ్యంలోని ఉన్నత పదవులపై గుత్తాధిపత్యం సాధించడానికి ప్రయత్నించారు. తజిక్‌లు, ఆఫ్ఘన్లు, ఇతర తుర్కుయేతర వలసదారులకు పదవులు దక్కకుండా అడ్డుకున్నారు. తొలుత ఖిల్జీలు, తర్వాత తుగ్లక్‌ల పాలనలో సంస్థానాధీశుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే ఉన్నత పదవికి రాచరిక నేపథ్యమే ప్రధాన అర్హతగా ఉండేది. ఫలితంగా పెద్ద సంఖ్యలో ఉన్న హిందువులు, ముస్లింలకు అవకాశమే లేకుండా పోయింది. అయితే పట్టణాలలో నివసించే ముస్లింలకు సైన్యంలో భర్తీ అయ్యే అవకాశం ఉండేది. అలాగే రాజ్యంలో కిందిస్థాయి ఉద్యోగాలను కూడా దక్కించుకునేవారు. కాని హిందువులు వ్యాపారాన్ని శాసించేవారు. గ్రామీణ ఉన్నత వర్గంగా చలామణి అయ్యేవారు. గ్రామీణ పాలన వారి గుప్పెట్లో ఉండేది. వారి సహకారం లేనిదే రాజ్యం తన విధులను నిర్వహించే అవకాశంలేదు. గ్రామీణ హిందూ ఉన్నత వర్గం, పట్టణ ప్రాంత ముస్లిం పాలకుల మధ్య లోపాయికారి ఒప్పందం ఏర్పడి ఇరు వర్గాలు అధికారాన్ని పంచుకున్నాయి. ఢిల్లీ సుల్తాన్ రాజ్యానికి ఇలాంటి అవగాహన కీలకంగా ఉండేది. హిందు, ముస్లింల మధ్య ఘర్షణలకు మతం రంగు పులిమినా అవి చాలా వరకు లౌకికవాద కారణాల కారణంగానే చోటు చేసుకునేవి. ఉదాహరణకు అధికారం, భూమి కోసం ఇరువర్గాలు తీవ్రంగా పోటీపడి ఘర్షణకు దిగేవి. ఈ లక్ష్యాల సాధన కోసం ముస్లింలు కూడా తమలో తాము కలహించుకున్నారు.

కేవలం సిద్ధాంతపరంగా ఢిల్లీ సుల్తాన్ రాజ్యం ఇస్లామిక్ రాజ్యంగా ఉండేది. అంటే షరియా ఉల్లంఘనలకు సుల్తాన్‌లు అనుమతించలేదు. రాజ్యంలో మతగురువులకు ఉన్నత పదవులు కట్టబెట్టారు. పన్ను రహిత భూములను వారికి అప్పగించారు. అయితే రాజ్య విధానాలను శాసించే అధికారాన్ని మాత్రం సుల్తాన్‌లు మతగురువులకు కేటాయించలేదు. ఉలేమాల సలహాలు, సూచనలను పూర్తిగా పెడచెవిన పెట్టి ఏ సుల్తాన్ పాలించకున్నా రాజ్య వ్యవహారాలలో వారి జోక్యాన్ని అనుమతించలేదు. అలాగే ముస్లిం చట్టం స్థానంలో కొత్త నిబంధనలను రూపొందించే బాధ్యత కూడా సుల్తాన్‌పైనే ఉండేది. ఈ కారణంగానే సమకాలీన చరిత్రకారుడు బరానీ భారతదేశంలో తుర్కుల రాజ్యాన్ని నిజమైన ఇస్లామిక్ రాజ్యంగా గుర్తించడానికి నిరాకరించారు. ప్రాపంచిక లేదా లౌకికవాద విలువల (జహందారి) ఆధారంగా రాజ్యం ఏర్పాటైందని అతడు పేర్కొన్నాడు.

**విజయనగర రాజకీయ వ్యవస్థ - పరిపాలన:**

కృష్ణదేవరాయ రచించిన అముక్తమాల్యదను సమగ్రంగా అధ్యయనం చేస్తే విజయనగర సామ్రాజ్య రాజకీయ వ్యవస్థను అర్థంచేసుకోవచ్చు. రాజు ఉదారతను తప్పనిసరి లక్షణంగా పరిగణించేవారు. నిరంకుశ రాచరిక ఆధారంగా రాజత్వం ఉండేదికాని పాలకులు ఉదారవాద నియంతృత్వాన్ని అనుసరించారు. ప్రజల సంక్షేమం కోసం రాజు పాటుపడాలి, వారి ఫిర్యాదులను వినాలి, వారి సమస్యలను పరిష్కరించాలి. కార్యనిర్వహణ, న్యాయ శాసనాల రూపకల్పన వ్యవహారాలలో అతడికి సంపూర్ణ ఆధిపత్యం ఉండేది. అతడు సర్వోన్నత న్యాయ స్థానంగా వ్యవహరించేవాడు. అలాగే శాసనాలను నిర్ధారించేవాడు. కొన్నిసార్లు అతడికి సహసారథి(కో-రేజెంట్) సహాయపడేవాడు. ఒకటవ హరిహర విషయంలో ఇలాంటి పదవిఉండేది. అయితే అది సాధారణ సూత్రంగా ఉండేది. అనువంశిక సిద్ధాంతం ఆధారంగా వారసత్వం ఉండేది. అయితే శాంతియుతమైన వారసత్వానికి వీలుగా పాలకులు తమ వారసులను ముందుగానే ప్రకటించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాగే గద్దెను చేజిక్కించుకున్న ఉదంతాలు కూడా ఉన్నాయి. వీర నరసింహ గద్దెను దక్కించుకున్నప్పుడు తుళువ వంశం ఏర్పడింది. మైనర్ బాలుడు సింహాసనాన్ని అధిష్టిస్తే అతడికి సంరక్షకుడిని నియమించే ఆచారం కూడా ఉండేది. అమాత్య, గవర్నర్, సేనాని లాంటి ముఖ్యమైన పదవులలో రాచరిక కుటుంబీకులను నియమించేవారు. ఈ విధానాన్ని ఒకటవ హరిహర స్వయంగా మొదలుపెట్టాడు.

పరిపాలనా వ్యవహారాల్లో రాజుకు సహాయపడేందుకు ప్రధానమంత్రి నేతృత్వంలో ఒక మంత్రిమండలి ఉండేది. మంత్రివర్గ నిర్ణయాలు లేదా సలహాలను పాటించాలా వద్దా అనే నిర్ణయాన్ని రాజే స్వయంగా తీసుకునేవాడు. మంత్రులతోపాటు రాజు తనకు అనుకూలమైన వ్యక్తులను కూడా ముఖ్యమైన విషయాలలో సంప్రదించేవాడు. తప్పు చేసే మంత్రులను కఠినంగా శిక్షించేవాడు. ఉదాహరణకు కృష్ణదేవ తన మంత్రి తిమ్మరుసును తీవ్రంగా అణచివేశాడు. మంత్రి కుమారుడు తన సొంత కుమారుడికి విషం ఇచ్చి చంపారనే నేరంపై తిమ్మరుసును

రాయ శిక్షించాడు. కేంద్ర పాలనను అనేక శాఖలుగా విభజించి వాటికి రాచరిక అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు.

రాచరిక భూములు, కప్పం, సామంతులు, గవర్నర్ల నుండి అందే కానుకల రూపంలో ఆదాయ మార్గాలు ఉండేవి. ఓడరేవులు అపారమైన సంపదను సమకూర్చాయి. ఈ రేవుల వద్ద వసూలు చేసే సుంకం, భూమార్గాన వాణిజ్య కార్యకలాపాల నుండి కూడా రాజ్యానికి ఆదాయం లభించేది. వివిధ వృత్తులు, గృహాలు, మార్కెట్లు, లైసెన్సులపై పన్నులు విధించేవారు. పన్నులను నగదు, వస్తు రూపాలలో వసూలు చేసేవారు. జాగ్రత్తగా అధ్యయనంచేసి వ్యవసాయ దిగుబడిని అంచనా వేస్తారు. దాని ఆధారంగా భూమి శిస్తును వసూలు చేస్తారు. శిస్తును వ్యవసాయ భూమి స్వభావం ఆధారంగా వేర్వేరుగా నిర్ధారించేవారు. పంటసాగు, దిగుబడి ఆధారంగా శిస్తును నిర్ధారించేవారు. సాధారణంగా స్థూల దిగుబడిలో ఆరోవంతు భాగాన్ని భూమి శిస్తుగా వసూలు చేసేవారు. కోర్టులు విధించే జరిమానాలు కూడా రాజ్యానికి మంచి ఆదాయాన్ని ఇచ్చేవి. కొన్నిసార్లు పంట దిగుబడిలో సగభాగాన్ని రాజ్యవాటాగా తీసుకునేవారు. పన్నులను రెండు ఖజానాలు నియంత్రించేవి. రోజువారీ ఆదాయ వ్యయాలను చిన్న ఖజానా నియంత్రించేది. పెద్ద ఖజానా సామంతరాజులు, గవర్నర్ల నుండి భారీ, విలువైన కానుకలను అందుకునేది. అముక్తమాల్యదలో సూచించినట్లు రాజ్య ఆదాయాన్ని నాలుగు భాగాలుగా విభజించి వ్యయం చేసేవారు. 1. రాజు వ్యక్తిగత వ్యయం, విరాళాలు, 2. గుర్రాల పోషణ, 3. దండయాత్రలు, 4. సామ్రాజ్య అభివృద్ధి, భద్రత కోసం నిధులను వెచ్చించేవారు. రాజు నిష్పక్షపాతంగా న్యాయాన్ని అమలు చేసేవాడు. అతడు సభకు (సర్వోన్నత న్యాయస్థానం) అధ్యక్షత వహించేవాడు. సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో న్యాయస్థానాలు ఉండేవి. వాటిని వివిధ స్థాయిల అధికారులు నిర్వహించేవారు. ధర్మశాస్త్రాల ఆధారంగా తీర్పులు ఇచ్చేవారు. యాజ్ఞవల్క్య, పరాశరుని స్మృతిలను సంప్రదించి క్లిష్టమైన కేసులను పరిష్కరించేవారు. అలాగే గ్రామ కోర్టులు, కుల పంచాయతీలు, క్షేత్ర స్థాయి సంఘాలు కుల నిబంధనలు, వ్యాపార నిబంధనల ఉల్లంఘనలను పరిష్కరించేవి. శిక్షతో కూడిన విచారణ కూడా అమల్లో ఉండేది. కఠినమైన శిక్షలు విధించేవారు. ఉదాహరణకు నిర్వీర్యం చేయడం, శరీర భాగాలను తొలగించడం, ఏనుగుల పాదాల కింద పడవేయడం సర్వసాధారణంగా జరిగేవి. క్రమబద్ధ పోలీసు వ్యవస్థ, గూఢచారి విభాగాలు ఉండేవి. వేగులు సామ్రాజ్యంలో జరుగుతున్న పరిణామాలను రాజుకు ఎప్పటికప్పుడు తెలియజేసేవారు. ఫలితంగా కుట్రలు కుతంత్రాలు, తిరుగుబాట్లను నివారించగలిగారు.

సామ్రాజ్యం విశాలంగా ఉన్న దృష్ట్యా బలమైన, సమర్థవంతమైన సైన్యాన్ని సమీకరించారు. అందులో పదాతి దళం, గజ, ఆశ్విక దళాలు, ఫిరంగి దళం ఉండేవి. మేలు జాతి గుర్రాలను విదేశీ వ్యాపారుల నుండి కొనుగోలు చేసేవారు. సైన్యంలో వివిధ హోదాలు గల అధికారులు ఉండేవారు. ఉన్నత పదవుల్లో నాయకులు, పాలెగాళ్లు ఉండేవారు. సామ్రాజ్య సైన్యంతోపాటు సామంత రాజులు, భూస్వాములు కిరాయి సైన్యాలు కూడా సైనిక సేవలో పాలు పంచుకునేవి. వాస్తవానికి కొందరు నాడు ప్రభువులు, ముఖ్యంగా బెంగుళూరుకు చెందిన

గౌండులు విదేశీ దండయాత్రల నుండి సామ్రాజ్య సరిహద్దులను రక్షించేవారు. తిరుగుబాటు దారులను కఠినంగా అణచివేసేవారు. విజయనగర చక్రవర్తులు ఇలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో సామ్రాజ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించ గలిగారు. రాచరిక సైన్యంలోని సాధారణ సైనికులకు నగదు వేతనాలు చెల్లించేవారు. అయితే పాలెగాళ్లకు భూములు (అమరం) కేటాయించే వారు.

సామ్రాజ్యాన్ని వివిధ పరిపాలనా విభాగాలుగా విభజించారు. మండలాలు లేదా రాజ్యాలు, నాడులు, స్థలాలు, చివరగా గ్రామాలు పరిపాలనా విభాగాలుగా ఉండేవి. అవసరాన్ని బట్టి మండలాల విస్తీర్ణం మారుతూ ఉండేది. వాటికి గవర్నర్లను నియమించేవారు. అతడిని మండలేశ్వర లేదా నాయక అని పిలిచేవారు.

గద్దెనెక్కిన అవకాశాన్ని కోల్పోయే రాకుమారులను సాధారణంగా గవర్నర్లుగా నియమించేవారు. అయితే సామ్రాజ్య సమైక్యతను, సింహాసనాన్ని గుర్తిస్తామని హామీ ఇచ్చిన తర్వాతే వారికి ఇలాంటి ఉన్నత పదవులను అప్పగించేవారు. వీరి దర్బార్లలో రాచరిక అధికారులను నియమించి తిరుగుబాట్లను నిరోధించేవారు. స్థానిక పరిపాలన వ్యవహారాలలో విజయనగర పాలకులు జోక్యం చేసుకోలేదు. ఫలితంగా స్థానిక సంస్థలకు పూర్తి స్వేచ్ఛ ఉండేది. గ్రామ పెద్ద అయిన గౌండ గ్రామ పరిపాలనా బాధ్యతలను నిర్వహించేవాడు. పరిపాలనా వ్యవస్థలో గ్రామం ప్రాథమిక విభాగంగా ఉండేది.

## సుర్ రాజకీయ వ్యవస్థ - పరిపాలన:

భారతదేశ చరిత్రలో షేర్‌షా, అతడి సుర్ వంశానికి కీలక స్థానముంది. భారతదేశంలో రెండవ ఆఫ్ఘన్ సామ్రాజ్యాన్ని సుర్‌లు కనుగొన్నారు. కనక ఆఫ్ఘన్ల సామాజిక, రాజకీయ వ్యవస్థలకు రెండవసారి పరీక్ష ఎదురైంది. తమ సామర్థ్యాలను, అసమర్థపు చర్యలను వారు ధైర్యంగా ప్రదర్శించారు. సార్వభౌమత్వ సిద్ధాంతాన్ని కొత్తగా ప్రవేశపెట్టారు. రాజకీయ వ్యవస్థలను ప్రక్షాళన చేశారు. కాని సుర్‌ల నిజమైన ప్రాధాన్యత షేర్‌షాను అందించడంలోనే ఉంది. తన దండయాత్రలు, పాలనా సంస్కరణలతో అతడు భారతదేశపు గొప్ప పాలకులు, సామ్రాజ్య నిర్మాతల సరసన చేరిపోయాడు. అతడి పాలనా యంత్రాంగం నమూనాను కొద్దిపాటి మార్పులతో అక్బర్, అతడి వారసులు అనుసరించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ మొగల్ సామ్రాజ్య స్థానాన్ని భర్తీ చేసినప్పుడు పాలనా యంత్రాంగాన్ని దాదాపు అలాగే కొనసాగించింది. ఆ విధంగా షేర్‌షా గొప్పతనం అతడి మరణం తర్వాత శతాబ్దాల తరబడి ఈ దేశ ప్రజలను ప్రభావితం చేసింది. కనుక అతడి పాలనా స్వరూపాన్ని సమీక్షించడం ఎంతైనా అవసరం. తద్వారా మొగల్ వ్యవస్థలను అంచనా వేయడం సులభమవుతుంది.

## కేంద్ర పరిపాలన:

ఆఫ్ఘన్ సాంప్రదాయాలకు అనుగుణంగా షేర్‌షా పాలించాడు. అయితే అతడి సార్వభౌమత్వ సిద్ధాంతం, ఆచరణ ఆఫ్ఘన్ సాంప్రదాయం కంటే తుర్కు ఆచారాన్నే తలపించింది.

బాల్బన్ లేదా అల్లావుద్దీన్ లాగా అతడి ప్రభుత్వం కూడా నిరంకుశమైనది. అయితే తన ప్రభుత్వానికి ఆఫ్ఘన్ సభ నుండే ఆమోదాన్ని పొందాడు. అలాగే అతడి అపారమైన మేధ, నిరంతరం శ్రమించే గుణం వల్ల అతడు అన్ని శాఖలకు సాధారణ విధానాన్ని రూపొందించడమే కాకుండా రోజువారీ పాలనలో దానిని సంపూర్ణంగా అమలు చేశాడు. సమకాలీన చరిత్రకారుడు విభాగాధిపతుల పేర్లను ప్రస్తావించలేదు. సుల్తాన్ నిరంతర పర్యవేక్షణ, నియంత్రణ కారణంగా అధికారులకు ప్రత్యేక ప్రాధాన్యత కరువైందని దీనిని బట్టి అర్థమవుతుంది.

ఏ వ్యక్తికి వజీరు లేదా ముఖ్యమంత్రి హోదాను కట్టబెట్టడానికి షేర్‌షా బహుశా ఇష్టపడక పోయి ఉండవచ్చు. ఎందుకంటే ఉన్నత పదవులు ఇతరులలో రాగద్వేషాలను రగిల్చి కుట్ర, తిరుగుబాటుకు దారి తీయగలనని అతడికి అనుభవపూర్వకంగా తెలుసు. ఆఫ్ఘన్ నాయకుల విషయంలో ఇలాంటి పరిణామాలు జరగడం మరీ ఎక్కువ. వారి స్వభావం ఎవరినీ లెక్క చేయలేదు. అహంకారంతో విర్రవీగడం వారి సహజగుణం. ఈ కారణంగానే షేర్‌షా శాఖాధిపతుల ప్రభావాన్ని పరిమితం చేసి ఉండవచ్చు. అయితే కేంద్ర ప్రభుత్వాన్ని పునః వ్యవస్థీకరించకముందే అతడు మరణించడం బాధాకరం. అతడు పరిపాలనా వ్యవస్థ కింద భాగం నుండి పైకి ఎదిగాడు. అంటే గ్రామ స్థాయి నుండి సామ్రాజ్యస్థాయికి అతడి ప్రస్థానం కొనసాగింది. పరగణ, సర్కారు స్థాయిలలో కూడా అనుభవం సంపాదించాడు. అయితే ప్రాంతీయ, కేంద్ర ప్రభుత్వాలను ప్రక్షాళన చేయడానికి అతడికి సమయం లభించలేదు. సహస్రామ్, బీహార్ పాలకునిగా అతడు గ్రామ, పరగణ, సర్కార్ పాలనను నిర్ధారించగలిగాడు. కాని ప్రాంతీయ, కేంద్ర ప్రభుత్వ అనుభవం లేకపోవడంతో ఈ విషయంలో ముందడుగు వేయలేకపోయాడు. అతడు మరణించే సమయానికి ప్రాంతీయ, కేంద్ర ప్రభుత్వాలలో సంస్కరణలు ఇంకా ప్రయోగదశలోనే ఉండేవి.

**ప్రాంతీయ పరిపాలన:**

ప్రాంతీయ ప్రభుత్వ నిర్మాణం గురించి స్పష్టమైన సమాచారం లేదు. బహుశా ఈ కారణంగా కొందరు ఆధునిక చరిత్రకారులు షేర్‌షా ప్రాంతీయ ప్రభుత్వాన్ని పూర్తిగా రద్దు చేయాలని భావించాడని అభిప్రాయపడ్డారు. పరగణ, కేంద్ర ప్రభుత్వాల మధ్యలో సర్కార్ కంటే విశాలమైన ప్రభుత్వాన్ని అతడు వ్యతిరేకించి ఉంటాడని చెబుతారు. అయితే ప్రాంతీయ ప్రభుత్వాలు కొనసాగిన మాట వాస్తవమే. దానిని నిర్దిష్టంగా ముందుంచేందుకు సరైన సమాచారం లేదు. ప్రాంతీయ స్థాయిలో అతడు రెండు ప్రయోగాలు చేశాడు. కాని రెండూ అంతగా సఫలం కాలేదు. వాటిని ఇతర ప్రాంతీయ ప్రభుత్వాలకు విస్తరించే స్థాయిలో అవి విజయవంతం కాలేదు. బెంగాల్‌లో తొలిసారిగా పాలనా సంస్కరణల ప్రయోగం జరిగింది. బెంగాల్ గవర్నర్ స్వతంత్రంగా వ్యవహరించడం మొదలు పెట్టడంతో షేర్‌షా అతడి ప్రత్యర్థిని కారాగారం పాలు చేసి బెంగాల్‌ను అనేక పరిపాలనా విభాగాలుగా విభజించాడు. ప్రతి విభాగానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాడు. ఈ అధికారులకు అధిపతులుగా సంస్థానాధీశులు వ్యవహరించాడు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత వీరిపై ఉండేది. వీరిని

ఆమిన్-ఎ-బంగళా అని పిలిచేవారు. డివిజనల్ అధికారులను కేంద్రం నియమించిన వారంతా ఆమిన్-ఎ-బంగళా నియంత్రణలో పని చేసేవారు. ఆ విధంగా ఆమిన్-ఎ- బంగళాలకు కాని, డివిజనల్ అధికారులకు కాని విస్తృత స్థాయిలో అధికారాలు ఉండేవికావు. వీరు తిరుగుబాటు చేసే అవకాశాలను ఆచరణలో ఏ మాత్రం కల్పించలేదు. అలాగే మాల్వాను స్వాధీనం చేసుకున్న తర్వాత షేర్‌షా ఒక సంస్థా నాధీశుడిని ఫౌజ్‌దార్‌గా నియమించాడు. ధార్‌వద్ద కేంద్ర పాలనా స్థావరాన్ని ఏర్పరిచాడు. మాల్వాను నాలుగు విభాగాలుగా విభజించి వేర్వేరు అధికారులకు ఆ ప్రాంతాలను అప్పగించారు. అయితే ఈ ఏర్పాటు చాలా కాలం కొనసాగలేదు. అలాగే రాజస్థాన్, పంజాబ్‌లలో కొందరు అధికారులు గవర్నర్ హోదా కంటే తక్కువ స్థాయి అధికారాలను కలిగి ఉండేవారు. కాని వీరి హోదా షిక్‌దర్-ఎ-షిక్‌దరన్ (సర్కార్ లేదా జిల్లా అధికారి) కంటే ఎక్కువగా ఉండేది. ఈ ఏర్పాటును కూడా ఇతర ప్రాంతాలకు వర్తింపచేయలేదు. బహుశా విశాలమైన, సుదూర రాజ్యాలనే షేర్‌షా విభజించాలని భావించి ఉంటాడు. ఈ అంశంలోకూడా సమతూకాన్ని పాటించలేదు. ఎందుకంటే అలాంటి ప్రాంతాల గవర్నర్‌ల హోదా వేర్వేరుగా ఉండేది.

రెండవ ప్రయోగం డిప్యూటీ గవర్నర్ల నియామకానికి సంబంధించినది. సామ్రాజ్యంలో ఈ ఏర్పాటును సాధారణంగా అమలు చేయలేదు. పంజాబ్‌లో గవర్నర్ కింద ఇద్దరు డిప్యూటీ గవర్నర్లు ఉండేవారు. గవర్నరు లేదా ప్రాంతీయ అధిపతిని నాయిబ్, ఆమిన్ లేదా ఫౌజ్‌దార్ అని విభిన్నపేర్లుతో పిలిచేవారు. వారి అధికారాలు కూడా వేర్వేరుగా ఉండేవి. తన గవర్నర్లందరిపై షేర్‌షా తక్షణమై నిఘా ఉంచాడు. అరాచకాన్ని, శాంతి ఉల్లంఘనను, కేంద్ర శాసనాల అమలులో జాప్యాన్ని లేదా నిర్లక్ష్యాని ఏ మాత్రం సహించలేదు. శక్తిమంతుడైన ఘుజాత్‌ఖాన్ లాంటి గవర్నర్ కూడా షేర్‌షా అంటే హడలిపోయేవాడు. సామ్రాజ్య సేవకు సరిపడ సైన్యాలను తాను సమీకరించలేదని ఫిర్యాదు వెళ్లడంతో ఘుజాత్ వెంటనే చక్రవర్తిని కలిసేందుకు ఢిల్లీ చేరుకున్నాడు. చక్రవర్తి కోరుకుంటే తన సైన్యాన్ని ప్రదర్శిస్తానని ప్రతిపాదించాడు.

**స్థానిక పరిపాలన:**

ప్రాంతానికి (రాష్ట్రానికి) కింది స్థాయిలో సర్కార్ (జిల్లా) ఉండేది. సర్కార్‌ను అనేక పరగణాలుగా విభజించారు. కొన్ని గ్రామాల సమూహంగా పరగణ ఉండేది. ఒక నివాస ప్రాంతానికి చెందిన ప్రజలకు ఆ ప్రాంత శాంతిభద్రతలను పరిరక్షించే బాధ్యతలను అప్పగించే విధంగా షేర్ షా ఒక కొత్త విధానాన్ని ప్రారంభించాడు. గ్రామ పరిపాలనలో గ్రామపెద్దకు కీలక ప్రాధాన్యత ఉండేది. వారికి చట్టబద్ధ హోదాను షేర్‌షా కల్పించాడు. వారి ప్రయోజనాలను పరిరక్షించాడు. చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తూనే గ్రామ పెద్దలకు బాధ్యతలను కూడా అనివార్యం చేశాడు. విధులను సమర్థవంతంగా, సమగ్రంగా నిర్వర్తిస్తేనే అన్ని హక్కులు కల్పించాడు. గ్రామపరిధిలో శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యత గ్రామ పెద్దపై ఉండేది. రాత్రిళ్లు దొంగతనాలు, దోపిడీ, హత్యలను నివారించేందుకు వీధుల్లో గస్తీదళం సంచరించేది. నేరం జరిగితే నిందితులను పట్టుకొని అప్పగించే బాధ్యత గస్తీ దళంపై ఉండేది. అందులో విఫలమైతే వారే స్వయంగా

శిక్షను అనుభవించాల్సి వచ్చేది. ఆఫ్ఘన్ చరిత్రకారుల ప్రకారం ఇలాంటి భద్రతా ఏర్పాట్ల వల్ల నిర్దిష్టమైన శాంతి భద్రతలు నెలకొన్నాయి. పరిస్థితి ఎంత ప్రశాంతంగా ఉండేదంటే ఒక వృద్ధ మహిళ సామ్రాజ్యంలోని ఒక చోట నుండి మరో చోటికి బంగారు నాణేలు తీసుకెళ్లినా ఆమెను నిలువరించే వారు లేదా దోచుకునేవారు ఒక్కరూ ఉండేవారు కాదు. ఒక వేళ ప్రయాణంలో వ్యాపారి మరణిస్తే స్థానిక ప్రజలు వెంటనే ఆ సమాచారాన్ని ప్రభుత్వానికి చేరవేసేవారు. తదుపరి ఆదేశాలు వెలువడేంతవరకు వ్యాపారి సరుకులు, సామాగ్రిని భద్రంగా కాపాలా కాసేవారు. కొంత అతిశయమే అయినప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా షేర్‌షా పాలనలో ప్రజల జీవితం, ఆస్తులు చాలా సురక్షితంగా ఉండేవని బోధపడుతోంది.

అనేక గ్రామాలను కలిపి పరగణను ఏర్పాటు చేశారు. ప్రతి పరగణకు షిక్దర్,ఆమిన్, కోశాధికారి, ఇద్దరు గుమాస్తాలు ఉండేవారు. ఒక గుమాస్తా హిందీ లేదా స్థానిక భాషలో పద్దులను నిర్వహిస్తే మరో గుమాస్తా పార్సీలో నివేదికలు రూపొందించేవాడు. శాంతి భద్రతలు పరిరక్షణ కోసం షిక్దర్ నియంత్రణలో కొందరు సైనికులు ఉండేవారు. రాచరిక పన్నులను వసూలు చేయడంలో షిక్దర్ తన వంతు సహకారాన్ని అందించేవాడు. అవసరమైతే బలప్రయోగం చేసేవాడు. స్థానిక కోర్టును అతడు నిర్వహించేవాడు. ముఖ్యంగా నేర వ్యాజ్యాలపై తీర్పు చేప్పేవాడు దాదాపు ఆధునిక డిప్యూటీ కలెక్టర్ పాత్రను అతడు పోషించేవాడు. ఆమిన్ భూమిశిస్తు వసూలును పర్యవేక్షించేవాడు. సకాలంలో ప్రభుత్వ పన్నులను రాబట్టేవాడు. భూమిశిస్తు శాఖ ఉద్యోగులందరూ అతడి నియంత్రణలో ఉండేవారు. అలాగే అతడు మున్సిఫ్‌గా కూడా వ్యవహరిస్తూ పౌర, రెవెన్యూ వ్యాజ్యాలను పరిష్కరించేవాడు. ఆ విధంగా ఆమిన్ హోదా అత్యంత ప్రధానమైనది. షేర్‌షా అతడిని షిక్‌దర్‌తో సమానంగా ఉంచాడు. తర్వాతి ముఖ్య అధికారి కోశాధికారి లేదా ఫతహ్‌దార్. వసూళ్లన్నీ అతడి నియంత్రణలో ఉండేవి. పరగణ ఆదాయ, వ్యయాల జమాబందీ అతడి వద్ద ఉండేది. షిక్‌దర్, ఆమిన్‌ల తర్వాతి హోదా ఈ అధికారిది. గుమాస్తాలను కార్కున్‌లనేవారు. షేర్‌షా ప్రభుత్వ వ్యవస్థలో పరగణాల పాలన కీలక స్థానాన్ని ఆక్రమించింది. ఈ స్థాయిలో పాలన సమర్థవంతంగా ఉండడం వల్లే సామ్రాజ్యంలో శాంతి, సుసంపన్నత సాధ్యమయ్యాయి. ప్రతి రెండేళ్లకోసారి లేదా అంతకంటే ముందుగానే షేర్‌షా షిక్‌దర్, ఆమిన్‌లను బదిలీ చేసేవాడు. ఆ విధంగా స్థానిక తిరుగుబాటుకు తెర వేశాడు.

కొన్ని పరగణాల బృందంగా సర్కార్ లేదా జిల్లా ఏర్పాటై ఉండేది. సర్కార్‌లో ఇద్దరు ముఖ్య అధికారులు- షిక్‌దర్-ఎ- షిక్‌దరన్ (షిక్‌దర్‌ల నాయకుడు), మున్సిఫ్-ఎ- మున్సిఫన్ (మున్సిఫ్ లేదా ఆమిన్‌ల నాయకుడు)- ఉండేవారు. తొలి అధికారి సర్కార్ అధిపతిగా ఉండేవాడు. తన కింది స్థాయి షిక్‌దర్‌ల పనితీరును పర్యవేక్షించేవాడు. సర్కార్ పరిధిలో శాంతి భద్రతలను పరిరక్షించేవాడు. కేంద్ర, ప్రాంతీయ ఆదేశాలను సమర్థవంతంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకునేవాడు. తన పరిధిలో జరిగే నేర వ్యాజ్యాలన్నింటిని పరిష్కరించేవాడు. షిక్‌దర్‌లను తొలగించే అధికారం మాత్రం అతడికి ఉండేది కాదు. అయితే కింది స్థాయి అధికారుల పనితీరుపై అతడు తనకంటే పై స్థాయిలో ఉన్న అధికారులకు ఫిర్యాదు చేసేవాడు.

తప్పు చేసే షిక్దర్‌లపై చర్య తీసుకోవాలని సిఫార్సు చేసేవాడు. ఇలాంటి పదవుల్లో కేవలం ప్రముఖ అమీర్‌లను మాత్రమే నియమించేవారు. మున్సిఫ్-ఎ-మున్సఫన్‌తో అతడికి సమాన శ్రేణి ఉన్నా హోదాలో మాత్రం మున్సఫన్‌కు దిగువన ఉండేవాడు. మున్సఫన్ పరగణాల ఆమిన్‌ల పనితీరును పర్యవేక్షించేవారు. వారి తీర్పులకు వ్యతిరేకంగా దాఖలయ్యే అప్పీళ్లను పరిశీలించేవాడు. అతడు మౌలికంగా న్యాయాధీశుడు లేదా న్యాయాధికారి.

ఆ విధంగా పరగణ, సర్కార్‌ల స్థాయిలో కొన్ని వినూత్న పరిపాలనా సంస్కరణలను షేర్‌షా ప్రవేశపెట్టాడు. న్యాయపాలనపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించి ప్రజా సంక్షేమానికి, సౌకర్యానికి ప్రాధాన్యతనిచ్చాడు. ప్రభుత్వంలో ద్వంద్వ పాలనా వ్యవస్థను ప్రవేశపెట్టి తిరుగుబాట్లకు తెరదించాడు. స్థానిక సైన్యం, ఆర్థిక వ్యవస్థ రెండూ ఒకరి చేతిలో ఉండడం వల్ల గతంలో తిరుగుబాట్లు తరచుగా సంభవించేవి. షేర్‌షా అధికార విభజనను ప్రవేశపెట్టాడు. సమాన హోదా గల ఇద్దరు అధికారులను ఆయా పరిపాలనా విభాగాలలో నియమించాడు. ఒకరు ఆర్థిక శాఖను నియంత్రిస్తే మరొకరు కార్యనిర్వహణ, సైనిక బాధ్యతలను చేపట్టేవారు. ఇద్దరు అధికారులు పరస్పరం నియంత్రించుకునేవారు, అలాగే సామ్రాజ్యానికి విధేయులుగా ఉండేవారు. చివరగా షేర్‌షా అధికారాన్ని చాలా వరకు కేంద్రీకరించాడు. నియామకాలు, తొలగించే అధికారాలను పూర్తిగా కేంద్రీకరించాడు. చివరకు పరగణ అధికారులను నియమించే లేదా తొలగించే అధికారం కూడా కేంద్ర ప్రభుత్వానికే ఉండేది.

**రెవెన్యూ పరిపాలన :**

రెవెన్యూ పరిపాలన కారణంగా షేర్‌షా హయాం మరింత ప్రసిద్ధిగాంచింది. అతడికి రెండు ప్రధాన లక్ష్యాలు ఉండేవి : 1) రైతాంగ దుస్థితిని నివారించడం, 2) రాజ్య ఆదాయాలను స్థిరీకరించడం. కొలతను అంచనాకు ఆధారంగా చేయాలని భావించాడు. అయితే ఆచరణాత్మక సమస్యల వల్ల కొన్నిసార్లు అతడు తన సాధారణ విధానానికి భిన్నంగా చర్యలు తీసుకోవలసి వచ్చింది. ముల్తాన్ విషయంలో అతడు మినహాయింపు కల్పించాడని మరీ ప్రత్యేకంగా ప్రస్తావించబడింది. కొలతల పద్ధతిని తప్పనిసరి చేయరాదని, పంటలను విభజించే వ్యవస్థనే కొనసాగించాలని షేర్‌షా ముల్తాన్ అధికారులను ఆదేశించాడు. అలాగే ఈ విధానాన్ని రాజస్థాన్, మాల్వాలకు వర్తింపచేయలేకపోయాడు. తన ఐదేళ్ల స్వల్ప పాలనా కాలంలో షేర్‌షా పై రెండు రాజ్యాలను పూర్తిగా స్వాధీనం చేసుకోలేకపోవడం అందుకు కారణం. అయితే ఇతర ప్రాంతాలలో కొలతల పద్ధతిని సాధారణ విధానంగా అమలు చేశారు. పన్నుల విధింపులో బీఘాను ప్రాథమిక యూనిట్‌గా తీసుకున్నారు.

కానుంగోలు పట్వారీలు నిర్వహించే నివేదికల సహాయంతో పన్నుల వసూలుకు నిర్దిష్టమైన ధరలను రూపొందించి అమలు చేశారు. మొత్తం సామ్రాజ్యానికి ఒకే ఒక్క షెడ్యూలు ఉండేది. దిగుబడి ప్రామాణికంగా భూమిని మంచి, మధ్యరకం, నాసిరకంగా విభజించి వ్యవసాయ దిగుబడిని అంచనా వేసేవారు. దిగుబడిలో మూడోవంతు భాగాన్ని ప్రభుత్వ వాటాగా నిర్ధారించేవారు. వసూలు సమయంలో దిగుబడిని నగదు రూపంలో మార్చుకునేవారు. మార్కెట్

రేట్లకు అనుగుణంగా నగదును వసూలు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం ఏ సంవత్సరానికా సంవత్సరం మార్కెట్ ధరలను నిర్ధారించేది. ఆ విధంగా బీఘాపై అద్దె ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి భిన్నంగా, ఒక పంట నుండి మరో పంటకు వేరుగా ఉండేది.

చాలా ప్రదేశాలలో ప్రతి సంవత్సరం రెండు పంటలను పండించేవారు. కనక ప్రభుత్వ రెవెన్యూ రెండు విడతలుగా వసూలయ్యేది. కోత పూర్తయిన వెంటనే పన్నులను వసూలు చేసేవారు. మధ్యవర్తులను పూర్తిగా తప్పించాలని షేర్‌షా భావించాడు. అందుకే భూకేటాయింపుల వ్యవస్థను రద్దు చేయాలని తలపోశాడు. ప్రభుత్వ పన్నుల వసూలుదారుల (ముకద్దమ్‌లు, ఆమిల్‌లు)ను రాచరిక బకాయిల వసూలులో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించాడు. ప్రభుత్వ బకాయిలు పేరుకుపోకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించాడు. సహస్రామ్ పరగణ అధిపతిగా ఉన్నప్పుడు షేర్‌షా రైతులకు పట్టాలను ప్రదానం చేసి కబూలియత్‌లను(యాజమాన్య హక్కుల ఆమోద పత్రాలు) స్వీకరించాడు. వీటి వివరాలను పరగణ కార్యాలయంలో నివేదిక రూపంలో ఉంచేవారు. ఈ సాంప్రదాయాన్ని చక్రవర్తి అయిన తర్వాత కూడా షా కొనసాగించి ఉంటాడని, అందుకే హిందీ లేదా స్థానిక భాష తెలిసిన కార్కున్ (గుమాస్తా)ను నియమించాడని భావిస్తారు.

భూమి శిస్తుతోపాటు రైతులు ఇతర చిన్న చిన్న పన్నులు కూడా చెల్లించేవారు. షేర్‌షా కరవు ఉపశమన ధాన్యాగారాలను స్థాపించాడు. ప్రతి బీఘాకు 200 టంకాల (నాణేలు) విలువైన ధాన్యాన్ని రైతులు ఈ ధాన్యాగారాలకు చెల్లించాలి. ఆ విధంగా వసూలైన గింజలను స్థానిక ప్రభుత్వ గోదాములలో భద్రపరచి ఆపత్ కాలంలో ప్రజలకు చవక గింజల దుకాణాల ద్వారా పంపిణీ చేసేవారు. కొలతలకు జరీబానా, పన్ను వసూలుదారులకు ముహసిలానా చెల్లించాల్సిన బాధ్యత కూడా రైతులపై ఉండేది. ఈ చెల్లింపులను షేర్‌షా నిర్దిష్టంగా నిర్ధారించాడు. స్థానిక అధికారులు అవినీతికి, అణచివేతకు పాల్పడరాదని కఠినంగా హెచ్చరించాడు. సైనిక బలగాలు తమ ప్రయాణం సందర్భంగా పంట పొలాలకు ఎలాంటి నష్టం కలిగించరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాడు. కరవు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో షేర్‌షా రైతులకు పునరావాస రుణాలను కూడా అందజేశాడు.

ప్రతి గ్రామానికి ఓ పట్వారీ ఉండేవాడు. అతడు జమాబందీలను నిర్వహించేవాడు. కౌలుదారుల జాబితాను తయారు చేసేవాడు. ప్రభుత్వ భూములలో అద్దెను జీతభత్యాలు పుచ్చుకునే ప్రభుత్వ దళారులు పట్వారీలు, ముకద్దమ్‌ల మద్దతుతో వసూలు చేసేవారు. జాగీరు ప్రాంతాలలో జాగీర్దార్లు లేదా వారి దళారులు శిస్తును వసూలు చేసేవారు. ప్రతి పరగణకు ఒక కానుంగో ఉండేవాడు. పరగణలో విస్తరించి ఉన్న భూములపై పూర్తి సమాచారం అతడి వద్ద ఉండేది. షేర్‌షా అవలంబించిన భూమి శిస్తు విధానం రైతులు, భూస్వాముల ప్రయోజనాలను పరిరక్షించింది. రైతాంగ దోపిడీని అరికట్టడానికి అతడు ఎంతో ప్రయత్నించాడు. అదే సమయంలో ముకద్దమ్‌లు, జాగీర్దార్ల సాంప్రదాయ హక్కులను రద్దు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అల్లావుద్దీన్ తన హయాంలో ఇలాంటి హక్కులన్నింటినీ రద్దు చేశాడు.

అయితే అనేక దిశలలో అభివృద్ధికి ఇంకా అవకాశముండేది. నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపరచడానికి షేర్‌షా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలాగే లంచగొండితనం, అవినీతిని అరికట్టలేకపోయాడు. మార్కెట్ ధరలను నిర్ధారించేందుకు ప్రామాణికంగా తీసుకునే ప్రాథమిక గణాంకాల విశ్వసనీయతను విశ్లేషించడానికి అతడికి సమయం ఉండేది కాదు. ఇక్తాదారీ వ్యవస్థ దుర్గుణాల గురించి అతడికి అవగాహన ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆ వ్యవస్థను అన్నిచోట్ల రద్దు చేయలేకపోయాడు. ఆఫ్ఘన్ తెగ నాయకులను దూరం చేసుకోకూడదనే ఉద్దేశంతోనే షేర్‌షా అలా వ్యవహరించి ఉంటాడు. అయితే షేర్‌షా సామర్థ్యం మాత్రం శాశ్వత ధరల సూచికను ప్రవేశపెట్టడంలోనే ఉంది. రాజ్యం, రైతాంగాల పరస్పర విధులు, హక్కులను పట్టాలు, కబూలియత్‌ల ద్వారా నిర్వచించాడు. దిగుబడి అంచనాకు కొలత పద్ధతిని ప్రవేశపెట్టాడు. అన్ని వర్గాల ప్రయోజనాలను సమానంగా పరిరక్షించే లక్ష్యంతో అతడి పాలనా విధానాలు కొనసాగాయి. అందరికీ సమన్యాయం అన్నది అతడి మార్గదర్శక సూత్రంగా ఉన్నట్లు బోధపడుతోంది.

**ఇతర పరిపాలనా చర్యలు :**

వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలను అభివృద్ధి పరిచేందుకు షేర్‌షా అనేక చర్యలు తీసుకున్నాడు. తొలుత తన సామ్రాజ్యంలో రవాణా, సంచార వ్యవస్థలను మెరుగుపరచడంపై దృష్టి సారించాడు. పశ్చిమంలో సింధూ నది నుండి బెంగాల్‌లోని సోనార్‌గావ్ వరకు ఉన్న పాత సామ్రాజ్య రహదారి గ్రాండ్ ట్రంక్ రోడ్డును పునరుద్ధరించాడు. ఆగ్రా నుండి జోధ్‌పూర్–చిత్తోర్‌లకు మరో కొత్త రహదారిని నిర్మించాడు. లాహోర్ నుండి ముల్తాన్‌కు ఉన్న రహదారిని ఈ రహదారితో అనుసంధానం చేశాడు. ఆ సమయంలో ముల్తాన్ పశ్చిమ, మధ్య ఆసియాలకు వెళ్లే వ్యాపార బృందాలకు ప్రధాన స్థావరంగా ఉండేది. అలాగే వ్యాపారులు, ప్రయాణీకుల సౌకర్యార్థం అతడు ప్రతి రెండు కోసులకు ఒక సరాయిని నిర్మింపచేశాడు (ఒక కోసు అంటే సుమారు ఎనిమిది కిలోమీటర్లు). సరాయి ఆధునిక లాడ్జి వంటిది. కట్టుదిట్టమైన నిర్మాణం గల ఈ విశ్రాంతి గృహాలలో ప్రయాణికులు రాత్రిపూట బస చేయవచ్చు. అలాగే తమ సరుకులను భద్రపరచుకోవచ్చు. ఈ సరాయిలలో హిందువులు, ముస్లింలకు వేర్వేరు గదులను కేటాయించేవారు. సరాయిల చుట్టూ గ్రామాలను స్థాపించడానికి ప్రయత్నాలు జరిగాయి. ఈ గ్రామాలలో సరాయిల నిర్వహణ కోసం కొన్ని భూములను కేటాయించారు. ప్రతి సరాయికి ఒక గస్తీదారు ఉండేవాడు. అతడి షాహ్‌నా (సంరక్షకుడు) కింద పని చేసేవాడు. షేర్‌షా సుమారు 1700 సరాయిలను నిర్మించాడని చెబుతారు. వాటిలో కొన్ని ఇప్పటికీ ఉన్నాయి. దీనిని బట్టి అవి ఎంత పటిష్టంగా నిర్మాణమయ్యాయో బోధపడుతుంది. అతడు నిర్మించిన రహదారులు, సరాయిలను సామ్రాజ్య కీలక నాడులుగా అభివర్ణించారు. దేశంలో వ్యాపార, వాణిజ్య రంగాల సత్వర ప్రగతికి అవి తోడ్పడ్డాయి. సరాయిలు చాలా వరకు కస్బాలుగా(మార్కెట్–పట్టణాలు) అభివృద్ధి చెందాయి. ఈ కేంద్రాలకు రైతులు పెద్ద సంఖ్యలో

వచ్చి తమ ఉత్పత్తులను విక్రయించేవారు. సరాయిలను తపాలా కేంద్రాలుగా కూడా వినియోగించారు. వీటి ద్వారా షేర్‌షా తన విశాల సామ్రాజ్యంలో జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేవాడు.

అలాగే కొన్ని మారకద్రవ్య సంస్కరణలను కూడా షేర్‌షా ప్రవేశపెట్టాడు. ఈ సంస్కరణల కారణంగా వాణిజ్యం, హస్తకళలు అభివృద్ధి చెందాయి. మిశ్రమ లోహాల స్థానంలో అతడు బంగారు, వెండి, రాగి నాణేలను ముద్రించాడు. అతడి వెండి నాణెం ఎంత స్థిరంగా చెలామణి అయ్యిందంటే అతడి మరణం తర్వాత వందేళ్ల వరకు అది మార్కెట్‌లో కొనసాగింది. సామ్రాజ్యమంతటా ఒకే తరహా తూనికలు – కొలతల పద్ధతిని ప్రవేశపెట్టడంవల్ల వ్యాపార, వాణిజ్యాలు కూడా అభివృద్ధి చెందాయి. వ్యాపార, వాణిజ్య రంగాల అభివృద్ధికి షేర్‌షా కొన్ని ప్రత్యేక చర్యలు కూడా తీసుకున్నాడు. అతడి సామ్రాజ్యంలో కేవలం రెండు చోట్లే సరుకులపై పన్ను విధించేవారు. ఒకటి బెంగాల్‌లో తయారైన ఉత్పత్తులు లేదా బయటి నుండి దిగుమతి చేసుకున్న ఉత్పత్తులపై బీహార్, బెంగాల్ సరిహద్దు అయిన సిక్రిగలీలో పన్ను వసూలు చేసేవారు. రెండవది, పశ్చిమ, మధ్య ఆసియాల నుండి వచ్చే సరుకులపై సింధూ తీరంలో పన్ను విధించేవారు. అంతర్గత రహదారులు, నదీ జలమార్గాలు, పట్టణాలలో వాణిజ్య సుంకం వసూలు చేసే అధికారం ఎవరికీ ఉండేదికాదు. విక్రయం సమయంలో రెండవ సారి సుంకం వసూలు చేసేవారు.

ప్రతి మార్గంలోనూ వ్యాపారులు, వర్తకులకు భద్రతను కల్పించేలా ప్రజలపై ఒత్తిడి తీసుకురావాలని షేర్‌షా తన గవర్నర్లు, ఆమిర్‌లను ఆదేశించారు. వ్యాపారులకు ఎలాంటి హాని జరగకూడదని స్పష్టం చేశాడు. ఒకవేళ వ్యాపారి మరణిస్తే అతడి సరుకులను ఎవరూ స్వాధీనం చేసుకోరాదు. బదులుగా వ్యాపారి రక్తసంబంధీకులకు అవి చేరేలా అన్ని చర్యలు తీసుకోవాలి. రహదారులపై వ్యాపారులు నష్టపోతే స్థానిక గ్రామ పెద్ద, జమీందార్లు బాధ్యత వహించాలని షేర్‌షా ఆదేశించాడు. సరుకులు దొంగతనానికి గురైతే స్థానిక అధికారులు వాటిని వెదికి ఇవ్వాలి లేదా దొంగలు, దోపిడీదారుల స్థావరాలను గుర్తించాలి. ఇందులో విఫలమైతే దొంగలు, బందిపోట్లకు విధించే శిక్షను అధికారులే అనుభవించాల్సి ఉంటుంది.

షేర్‌షా సైనిక పరిపాలన గురించి నిర్దిష్టమైన సమాచారం అందుబాటులో లేదు. అయితే మనకున్న కొద్దిపాటి సమాచారం బట్టి అతడికో బలమైన సైన్యం ఉండేదని తెలుస్తుంది. విశాలమైన సామ్రాజ్యం పరిపాలనను సాఫీగా సాగించడానికి అలాగే విదేశీ దండయాత్రల నుండి సామ్రాజ్యాన్ని రక్షించడానికి విశాలమైన సైన్యం ఉండేది. తెగ నాయకులకు కప్పం చెల్లించే సాంప్రదాయాన్ని రద్దు చేసి సైనికులను నేరుగా భర్తీ చేశాడు. ఔత్సాహికుల స్వభావాన్ని పరిశీలించిన తర్వాత వారిని సైన్యంలో చేర్చుకునేవాడు. ప్రతి సైనికుడి పూర్తి వివరాలతో కూడిన నివేదిక (చెహ్రా) తయారయ్యేది. ఆశ్విక దళంలో ముద్రల వ్యవస్థ (దాగ్)ను ప్రవేశపెట్టి

నాసిరకం జాతి గుర్రాలు సైన్యంలో భర్తీకాకుండా అడ్డుకున్నాడు. ఈ దాగ్ వ్యవస్థను షేర్‌షా అల్లావుద్దీన్ ఖిల్జీ సైనిక సంస్కరణల నుండి అరువు తీసుకున్నట్లు కనబడుతోంది. సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో కంటోన్మెంట్‌లను, బలమైన సైనిక స్థావరాలను షేర్‌షా ఏర్పాటు చేశాడు.

న్యాయపాలనపై షేర్‌షా సమగ్రమైన దృష్టి సారించాడు. ఈ రంగంలో ఎన్నో మెరుగులు తీసుకువచ్చాడు. నేరస్తులను పట్టుకోవడానికి, న్యాయమూర్తులకు ఇతర పద్ధతులలో సహాయ పడేందుకు అతడు పోలీసు బలగాన్ని నియమించాడు. పరగణ, సర్కార్ స్థాయిలో కాజీలను కొనసాగిస్తూ ఇతరఅధికారులకు కూడా న్యాయ అధికారాలను అప్పగించాడు. ముందుగా పేర్కొన్నట్లు పరగణలో మున్సిఫ్ లేదా ఆమిన్, సర్కార్‌లో మున్సిఫ్–ఎ–మున్సఫన్ పౌర, రెవెన్యూ వ్యాజ్యాలను పరిష్కరించేవారు. అలాగే పరగణలో షిక్‌దర్, సర్కార్‌లో షిక్‌దర్–ఎ–షిక్‌దరన్‌లు నేర వ్యాజ్యాలపై తీర్పు చెప్పేవారు. మీర్ అద్ల్ అనే అధికారి కోర్టు ఉత్తర్వులను అమలు పరిచేవాడు. షేర్‌షా, అతడి వారసుడు ఇస్లాం షా స్థానిక అధికారులకు సమగ్రమైన మార్గదర్శక సూత్రాలను జారీచేశాడు. సర్వోన్నత న్యాయస్థానంలో స్వయంగా చక్రవర్తే ఉన్నత న్యాయ ప్రమాణాలను నిలబెట్టేవారు. తన స్వంత ప్రవర్తన ద్వారా ఉన్నత విలువలను నిర్ధారించాడు. స్థూలంగా న్యాయమూర్తులకు సర్వోన్నత న్యాయస్థానం స్ఫూర్తిగా, మార్గదర్శిగా ఉండేది.

12

# మొగల్ రాజకీయ వ్యవస్థ-పరిపాలన

## రాజకీయ సిద్ధాంతాలు-ఆలోచనలు

భారతదేశంలో తైమూరిద్ లేదా మొగల్ వంశస్థాపన జాతీయ, అంతర్జాతీయ రంగాలు రెండింటిలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో శృతి కలిపింది. వీటిలో కొన్ని మార్పులు ప్రపంచ వ్యాప్త ప్రాధాన్యత కలిగిన పరిణామాలుగా రూపాంతరం చెందగా మరికొన్నింటికి ప్రాంతీయ లేదా జాతీయ ప్రాధాన్యత ఉండేది. రాజకీయరంగంలో పూర్తిస్థాయి సార్వభౌమ రాజ్యాలను ఏర్పాటు చేయాలన్న సంకల్పనం సర్వవ్యాపితంగా ఉండేది. దేశం భూభాగం యావత్తు కలిగిన జాతీయ రాజ్యాలను ఏర్పాటు చేసి ప్రపంచ సామ్రాజ్యాలకు కీలక కేంద్రంగా మార్చాలన్న ఆకాంక్ష కూడా ఉండేది. ఇతర ప్రజల స్వాతంత్ర్యాన్ని, అధికారాన్ని హస్తగతం చేసుకొని విశాలమైన సామ్రాజ్యాలను నెలకొల్పాన్నదే పాలకుల ఉద్దేశంగా ఉండేది. భారతదేశానికి చెందిన తైమూరిద్ లేదా మొగల్ రాచరికం రెండు సిద్ధాంతాల నుండి స్ఫూర్తి పొందింది. సంపూర్ణ సార్వభౌమత్వం, సామ్రాజ్యవాద సమైక్యత. చారిత్రక పురుషులుగా ప్రఖ్యాతిగాంచిన కొందరు వ్యక్తుల వారసుల పట్ల ఆసియా, ఐరోపా రెండింటిలోనూ గుడ్డి గౌరవభావం ఉండేది. కనక మనం తొలుత మొగల్ కాలపు రాజకీయ సిద్ధాంతాలను సమగ్రంగా అధ్యయనం చేద్దాము. ఈ సిద్ధాంతాల ఆధారంగానే మొగల్ పరిపాలన కొనసాగింది.

తొలి రాజకీయ సిద్ధాంతం సంపూర్ణ సార్వభౌమత్వం. ఢిల్లీ సుల్తాన్‌లు తమను తాము పూర్తిస్థాయి సార్వభౌములుగా ప్రకటించుకోవడానికి జడిశారు. ఢిల్లీ సుల్తాన్‌లతోపాటు ఇతర ప్రాంతీయ ముస్లిం వంశాలు ఖలీఫాను చట్టబద్ధమైన సార్వభౌమునిగా పరిగణించాయి. సాధారణంగా తాము జారీ చేసే నాణేలలో ఖలీఫా పేరును వాడుకున్నాయి. ఈ నిబంధన తదుపరి మధ్యయుగ కాలం లేదా మొగల్ కాలానికి వర్తించలేదు. బాబర్ తైమూర్ వారసుడు. 1401లో తైమూర్ సమర్‌ఖండ్‌ను దార్–ఉల్–ఖలైఫత్‌గా, తనను తాను దేవుని ఖలీఫాగా ప్రకటించుకున్నాడు. అప్పటి నుండి తైమూరిద్‌లు (తైమూర్ వారసులు) ఉన్నత భావాన్ని పెంచుకున్నారు. అయితే చంగీజ్‌ఖాన్ రాకుమారుని నామమాత్రపు సార్వభౌమత్వం బాబర్ తాత అబూ సయీద్ కాలం నాటి వరకు కొనసాగింది. ఈ సాంప్రదాయానికి అబూ సయీద్

తెర దించాడు. చంగీజ్‌ఖాన్ గద్దెపై యూనుస్‌ఖాన్‌ను ప్రతిష్టించిన సయీద్ అతడిని బాద్షా (ఉన్నత పాలకుడు)అనే హోదాను తన లేఖలో ఉద్ఘాటించాడు. అయితే ఏ తైమూరిద్ పాలకుడు మిర్జా (తైమూర్ వారసుడు) అనే బిరుదును సంతరించుకోలేదు. ఎందుకంటే తైమూర్ రాజ్యాంగపరమైన హోదా కేవలం ఒక మంగోలు రాకుమారుని అమీర్ (సంస్థానాధీశుడు) మాత్రమే. తైమూరిద్ పాలకులు ఇలాంటి హోదాను కలిగినంత కాలం తమ సార్వభౌమత్వాన్ని స్పష్టంగా ఉద్ఘాటించలేకపోయారు. 1507లో ఆసియా తైమూరిద్ పాలకుల్లో బాబర్ ఒక్కడే స్వతంత్రుడు. ఈ కారణంగానే ఆ కాలపు తైమూరిద్ పాలకులందరి కంటే అతడు గొప్పవాడు. ఈ సమయంలో ఉజ్బేక్‌లు, సఫావిద్‌లు, ఒట్టోమన్ తుర్కుల నేతృత్వంలో ఆసియా ఖండంలో బలమైన సామ్రాజ్యాలు ఆవిర్భవించే దశలో ఉన్నాయి. ఈ ముగ్గురు పాలకులు తమ ప్రత్యర్థి సామ్రాజ్యాలపై పూర్తి సార్వభౌమత్వాన్ని, ఆధిపత్యాన్ని కోరుకున్నారు. ఒకప్పుడు బాబర్ పూర్వీకుల సామ్రాజ్య నియంత్రణ ఈ మూడు రాజ్యాల భూభాగాలపై ఉండేది. అందుకే ఆత్మగౌరవం గల బాబర్ లాంటి వ్యక్తి ఇతరులకు తానేమీ తీసిపోనని భావించాడు.

అలాగే మిర్జాల కుట్రలు కుతంత్రాలకు చరమగీతం పాడాలంటే బాబర్ తన రాజ్యాంగ బద్ధమైన ఆధిపత్యాన్ని చాటాల్సిన అవసరం ఉండేది. అందుకే అతడు 1507లో బాద్షా అనే బిరుదును పొందాడు. హుమాయూన్ కూడా తన ఆధిపత్యాన్ని చాటుకొని బాద్షాగా పిలిపించుకున్నాడు. గ్రహాలలో సూర్యుడు ఏ విధంగా ఆద్యుడో రాజు కూడా అతడి సంస్థానాధీశులు, ప్రజలలో అగ్రస్థాయివాడని హుమాయూన్ పేర్కొనేవాడు.

అయితే అక్బర్ తన స్థాయిని మరింత స్పష్టంగా, నిర్దిష్టంగా మార్చుకున్నాడు. 1576 నాటికి అక్బర్ దాదాపు ఉత్తర భారత ప్రాంతాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నాడు. దౌత్యనీతి, సైనిక శక్తి, పరమత సహనం అనే మూడు సూత్రాల ఆధారంగా అతడు విజయాలను కైవసం చేసుకున్నాడు. అందుకే తన సార్వభౌమ హోదా ప్రపంచానికి చాటుకోవడానికి కొత్త పంథాను అవలంబించాడు. బాద్షా అనే బిరుదును ఉంచుకోవడంతోపాటు తర్వాతి ఖలీఫాల ఆచారమైన ఖుత్బాలను తన పేరు మీద చదివించడం మొదలుపెట్టాడు. అలాగే సిజ్దా (మోకరిల్లడం), జమీన్‌బోస్ (సింహాసనం ఎదుట భూమిని ముద్దుపెట్టుకోవడం) లాంటి సాంప్రదాయాలను ప్రవేశపెట్టాడు. ఇదంతా 1579లో జరగబోయే పరిణామానికి నాంది లాంటిది. 1579లో సామ్రాజ్య ఉలేమాలు చక్రవర్తిని ఇమామ్-ఎ-ఆదిల్‌గా ప్రకటించారు. దీని తర్వాత అక్బర్ వారసులందరూ తమను తాము సంపూర్ణ సార్వభౌములుగా పరిగణించాడు. ఇతరుల ఆధిపత్యాన్ని ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఎన్నడూ గుర్తించలేదు. చివరి కీలుబొమ్మ మొగల్ పాలకులు ఈ ప్రతిష్టను కోల్పోయారు. ముహమ్మద్‌షా నాదిర్ షా (పర్షియా రాజు) నుండి కిరీటాన్ని స్వీకరించడమే కాకుండా తాను నాదిర్ షా లాంటి ఉద్ధండుడి స్వహస్తాల నుండి కిరీటాన్ని స్వీకరించినందుకు ఎంతో గర్వపడుతున్నానని నిసిగ్గుగా ప్రకటించాడు. అయితే 16,17 శతాబ్దాలకు చెందిన మొగల్ పాలకులు విదేశీ అధికారాన్ని ఎన్నడూ గుర్తించలేదు.

రెండవ రాజకీయ సిద్ధాంతం సామ్రాజ్యవాదం. ఢిల్లీ సుల్తాన్‌లు తమ భారత భూగాలతో సంతృప్తి చెందారు. ఆఫ్ఘనిస్తాన్, మధ్యఆసియాలకు తమ ఆధిపత్యాన్ని విస్తరించడానికి ఎన్నడూ

ప్రయత్నం చేయలేదు. అయితే మొగల్ ఆకాంక్షలు భారతదేశ భూభాగంతోనే సంతృప్తి పడలేదు. తమ పూర్వీకుల్లో గొప్పవాడైన తైమూర్ అడుగుజాడలలో నడవాలని తలపోశాడు. విశాలమైన మధ్య ఆసియా భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని తపించారు.

కాబుల్, కందహార్ వరకు తమ దృష్టిని పరిమితం చేసినంత కాలం మొగల్ పాలకులకు అన్నీ సవ్యంగా సాగాయి. ఒక్కసారి మరింత ముందుకు వెళ్లాలని నిర్ణయించిన తర్వాత వారు ఎన్నో త్యాగాలను చేయవలసి వచ్చింది. ముఖ్యంగా బాబర్, షాజహాన్‌ల పాలనాకాలంలో ఇలాంటి నష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. దీనిని బట్టి మొగల్ చక్రవర్తులు భారతదేశంలోనే కాకుండా వెలుపల కూడా సామ్రాజ్యాన్ని విస్తరించాలని కాంక్షించారని స్పష్టమవుతుంది.

మూడవ ముఖ్యమైన రాజకీయ సిద్ధాంతం పాలకవంశంపట్ల విధేయత. మొగల్ కాలంలో పాలకులను దైవ ప్రతినిధులుగా వర్ణించడంతోపాటు సార్వభౌముని కుటుంబానికి కూడా అమితమైన ప్రాముఖ్యాన్ని ఆపాదించారు. బాబర్, అతడి వారసులు తమ తైమూరిద్ మూలాలపై గర్వపడేవారు. తైమూర్ ప్రతిష్ట, విజయాలను పంచుకున్నారు. ఈ విషయాన్ని హుమాయూన్ గుజరాత్ పాలకుడు బహదుర్‌షాకు రాసిన ఒక లేఖలో ప్రత్యేకంగా ప్రస్తావించాడు. తైమూర్ వంశ చరిత్రలో కీలక స్థానాన్ని ఆక్రమించాడు. ఆస్థాన చరిత్రలలో అతడి వంశాన్ని తైమూరిద్ వంశంగా వర్ణించారు. ఆచరణలో తైమూరిద్ సాంప్రదాయం ఖురాన్ సురాలతో సమానంగా కాకున్నా దాదాపు అంతటి పవిత్రతను సంతరించుకుంది. ఆ విధంగా వంశంపట్ల ఆరాధ్య భావం మౌఢ్యంగా మారింది. వంశ విజయం గొప్ప పూర్వీకుడి రక్తం ప్రవహిస్తున్నందునే సాధ్యమైందని తరచూ అన్వయించేవారు.

**మొగల్ రాజ్య స్వరూపం :**

మొగల్‌ల నేతృత్వంలో నిరంకుశ రాచరికం ప్రభుత్వ స్వరూపంగా ఉండేది. పాలకుడు లేదా చక్రవర్తి అధికారాలకు ఎలాంటి పరిమితులు ఉండేవి కావు. సాధారణంగా మొగల్ చక్రవర్తులు వర్గ వైషమ్యాలకు దూరంగా ఉన్నారు. కేవలం రాజకీయ, సైనిక సమీకరణల ఆధారంగానే తమ విధానాలను మలచుకున్నారు. కనక వారి నేతృత్వంలో మత గురువుల ప్రభావం క్షీణించింది. షరియాపట్ల అజ్ఞానం ఆధారంగానే అల్లావుద్దీన్ తన లౌకిక వాదాన్ని చాటాడు. అయితే అక్బర్ పాలనలో మతగురువులే స్వయంగా తమ అధికారాలను చక్రవర్తికి ధారపోశారు. షరియాను తనకు తోచిన విధంగా అన్వయించుకునే అధికారాన్ని చక్రవర్తికి ఇచ్చారు. దీంతో అక్బర్ ప్రతిష్ట సహజంగానే ద్విగుణీకృతమైంది. అతడి కాలం నుండి మరోసారి రాజ్య పౌరులందరూ మత, కుల, వర్ణాలతో సంబంధం లేకుండా పౌర, రాజకీయ హక్కులను సమానంగా అనుభవించారు. హిందూ నాయకులు సామ్రాజ్య సేవకులుగా, సమర్థకులుగా మారారు.

హిందూ నాయకుల చేరికతో చక్రవర్తి ప్రాబల్యం మరింత పెరిగింది. ముందులాగే మంత్రుల అధికారాలు దాదాపు ఒకే రకంగా ఉండిపోయాయి. ఒక అనిర్ధారిత వారసత్వ

నిబంధనను ఏర్పరిచారు. పాలక వంశంలోని పెద్ద కుమారునికి అనుకూలంగా ఉన్న వారసత్వ నియమం సాధారణంగా అమలయ్యేది. లేదా పాలకవంశంలో అత్యంత సమర్థుడైన వ్యక్తికి అధికారాన్ని అప్పగించేవారు.

మొగల్ చక్రవర్తి అధికారం కేవలం ఒకే ఒక్క విధంగా పరిమితమైంది. సంస్థానాధీశులతో అతడికి ఉన్న రక్తసంబంధాలే పూర్తి స్థాయి ప్రాబల్యానికి ఆటంకంగా నిలిచాయి. ఢిల్లీ సుల్తాను రాజ్యంలోని పాలకవర్గం దాదాపు పాలకుని సృష్టే. సుల్తాన్ అనుగ్రహం ఉన్నంత వరకూ పాలకవర్గీయులు నియామకాలు, పదోన్నతులు, పదివి కాలపరిమితిని పొందేవారు. సుల్తాన్ గద్దెనెక్కేటపుడు అతడి చుట్టూ మూగే వందిమాగధులు పాత పాలకవర్గ సభ్యులను దారుణంగా అణచివేసేవారు. కనక సుల్తాన్‌తో పోలిస్తే సంస్థానాధీశులు చాలా బలహీనంగా ఉండేవారు. వారికి సాంప్రదాయబద్ధమైన లేదా వారసత్వ హక్కులంటూ ఉండేవి కావు. అయితే మొగల్ కాలంలో ఇలాంటి ఏర్పాటులో మార్పు వచ్చింది. సుదీర్ఘకాలం పాలించడంతో సాంప్రదాయాలు బలపడ్డాయి. సంస్థానాధీశులకు స్థిరత్వాన్ని ఇచ్చి వారిని, వారి హోదాను అమితంగా పెంచింది. తమ రాచరిక కుటుంబ నేపథ్యం వల్ల అనేక మంది సంస్థానాధీశులు ప్రత్యేక గుర్తింపును పొందారు. ఉన్నత పదవులు చాలా వరకు వారికే దక్కేవి. అలాంటి సంస్థానాధీశులు, మరీ ప్రత్యేకంగా రాజ్‌పుత్‌లకు వ్యతిరేకంగా ఏకపక్షంగా చర్య తీసుకోవడం కష్టంగా మారింది. అందుకే సంస్థానాధీశులు, మంత్రుల సలహాకు అమితమైన ప్రాధాన్యత ఇచ్చేవారు. అయితే వీరిని కేవలం సలహాదారులుగా పరిగణించే రాజ్యాంగబద్ధమైన హోదా చక్రవర్తికి అలాగే కొనసాగింది. గతానికి భిన్నంగా పాలక చక్రవర్తి తల్లులు, భార్యలు, సోదరీమణులు పరిపాలనా దిశాదశలపై కొంత వరకు ప్రభావాన్ని చూపారు. హమీదాబాను, మహమ్ అనఘ, సలీమా బేగంలు అక్బర్ కాలంలో, నూర్‌జహాన్ జహంగీర్ కాలంలో, జహానారా షాజహాన్ హయాంలో, జీనతున్నీసా ఔరంగజేబు పాలనలో సార్వజనిక వ్యవహారాలపై తీవ్రమైన ప్రభావం చూపారు.

మొగల్ పాలనలో సార్వభౌముని ప్రత్యేక హక్కులు అసాధారణ రూపం దాల్చాయి. ఢిల్లీ సుల్తానుల వలే రాజ్యాధిపతిగా అతడు ఉన్నత కార్యనిర్వహణ, న్యాయ,శాసన, సైనిక, ఆర్థిక అధికారాలను, ప్రత్యేక హక్కులను చాటుకున్నాడు. అలాగే కొన్ని ప్రత్యేక ప్రయోజనాలను అనుభవించాడు. చక్రవర్తి ముందస్తు అనుమతి లేనిదే సామ్రాజ్యంలోని ఏ ఒక్కరూ ఈ ప్రత్యేక హక్కులను అనుభవించే అవకాశమే ఉండేది కాదు. కొన్ని ప్రత్యేక అధికారాలు కేవలం చక్రవర్తికే పరిమితంగా ఉండేవి. రాజ్యంలో మిగతా ఎవ్వరూ వాటిని ఏ సందర్భంలోనూ అనుభవించే వీలు ఉండేది కాదు. ముఖ్యంగా ఝరోకా–ఎ–దర్శన్ (చక్రవర్తి దర్శనం), బిరుదుల ప్రదానం, ముద్రను నిర్ధారించడం, ఫర్మానాలపై పంజా అద్దడం, శరీర భాగాల ఛేదం, మరణదండన మొదలైనవి చక్రవర్తి వ్యాపకాలు. దీనిని బట్టి రాజ్యంలో చక్రవర్తి హోదా అసమానంగా ఉండేదని బోధపడుతుంది. అతడి పద్ధతులను, ప్రవర్తనను అనుకరించడానికి ఎవరినీ అనుమతించే వారు కాదు. రాజ్యంలో ఉన్నత పదవులు కలిగిన వారు కూడా చక్రవర్తి సమక్షంలో నిలబడి ఉండాల్సిందే. చక్రవర్తి ఒక రాకుమారునిపై ప్రత్యేక అభిమానం కలిగి ఉంటే అతడికి తన సింహాసనం దిగువ ప్రత్యేక ఆసనం వేయించేవాడు.

నిరంకుశ ప్రభుత్వాల యుగమైనప్పటికీ అక్బర్, ఔరంగజేబ్ లాంటి శ్రమపరులు కూడా శాఖాధిపతులు, మంత్రుల సహకారం లేనిదే ప్రభుత్వంలోని వివిధ శాఖల పనులను చక్కబెట్టలేక పోయారు. కాలక్రమంలో అనేక సమస్యలు పుట్టుకొచ్చాయి. వాటిని పరిష్కరించడానికి అనుభవం, సామర్థ్యం ఉన్న వ్యక్తులతో సంప్రదించడం ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. అన్ని విషయాలలోనూ ఇతరులతో సంప్రదించాల్సిన అవసరం మాత్రం ఉండేది కాదు. ఆ విధంగా అన్ని శాఖలకు సలహాదారులు లేదా మంత్రుల బృందం ఒకటి ఉండేది. వారి సహాయంతో చక్రవర్తి కేంద్ర ప్రభుత్వాన్ని నడిపేవాడు. ప్రాంతీయ, స్థానిక ప్రభుత్వాలను పర్యవేక్షిస్తూ నియంత్రించే వాడు. క్రమబద్ధ మంత్రులు, సలహాదారులతోపాటు ఆస్థానం, రాచరిక కుటుంబానికి కొందరు మిత్రులు, అధికారులు, సహచరులు ఉండేవారు. ఇలాంటి వ్యక్తులకు చక్రవర్తితో సన్నిహితంగా మెలిగే అవకాశముండేది. ఫలితంగా వారు గణనీయమైన ప్రభావాన్ని చూపేవారు. అక్బర్ హయాంలో అబుల్ ఫజల్ రాజ్య విధానాన్ని గణనీయంగా ప్రభావితం చేసేవాడు. అధికారికంగా అతడు వజీర్ లేదా వకీల్ లాంటి ఉన్నత పదవులు చేపట్టకపోయినా చక్రవర్తికి అతడి తెలివితేటలు, విధేయతపై అపారమైన నమ్మకం ఉండేది.

## రాజకీయ సంస్థలు, ఆచారాలు

**కేంద్ర పాలన:** అక్బర్ పాలనాకాలంలో కేంద్ర ప్రభుత్వ సంఘటనం, స్వభావంలో ముఖ్యమైన మార్పులు అనేకం చోటు చేసుకున్నాయి, షేర్‌షా ఎన్నో రంగాలలో అక్బర్‌కు ఆద్యుడని పరిగణించినా కేంద్ర ప్రభుత్వ నిర్వహణ విషయంలో అక్బర్ ఎవరి పంథాను అవలంచించలేదు. ఢిల్లీ సుల్తాన్‌ల సాంప్రదాయంలో అతడు తన మంత్రులకు అధికారాలు, బాధ్యతలను నిర్ధారించాడు. ఢిల్లీ సుల్తాన్ నాయిబ్ సుల్తాన్‌ను కలిగి ఉన్నట్లే, అబాసిద్ ఖలీఫాలకు వజీర్ ఉన్నట్లే అక్బర్‌కు కూడా వకీల్ లేదా సంరక్షకుడు ఉండేవాడు. వకీల్ అంటే ప్రతినిధి అని అర్థం. అందుకే ఈ పదవి పొందిన వ్యక్తి చక్రవర్తి పక్షాన లేదా అతడి పేరున సర్వాధికారాలను అనుభవించే అవకాశం ఉండేది. రాజ్యాంగపరంగా వకీల్ మిగతా మంత్రులందరికంటే ఎక్కువ హోదా గలవాడు. ఎందుకంటే మంత్రులను పర్యవేక్షించే, నియంత్రించే హక్కు అతడికి ఉండేది. అక్బర్ తొలివకీల్ బైరమ్‌ఖాన్ ఎంత శక్తిమంతుడంటే చివరికి చక్రవర్తికి నివేదించకుండానే అతడు తనకు ఇష్టమైన రీతిలో నిర్ణయాలు తీసుకునేవాడు. అయితే మునీమ్ ఖాన్ నియామకం తర్వాత సిద్ధాంతపరంగా వకీల్ రాజకీయప్రాబల్యం అలాగే కొనసాగినా ఆచరణలో మాత్రం వజీర్ లేదా దీవాన్ (ఇతడు ఆర్థిక శాఖ అధిపతి) వకీల్‌కు సమీప ప్రత్యర్థిగా ఎదిగారు. కొన్ని సందర్భాల్లో వకీల్‌కు మించిన అధికారాన్ని అనుభవించాడు. తర్వాతి కాలంలో అక్బర్ ఈ పదవిని ఖాళీగా ఉంచారు. లేకుంటే ఒక శక్తిమంతుడైన సంస్థానాధీశుడు వకీల్‌గా ఎదిగి సామ్రాజ్య అంతర్గత సమైక్యతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉండేది. బైరంఖాన్ తర్వాత శక్తిమంతుడైన వకీల్ అసఫ్ ఖాన్ మాత్రమే. అసఫ్ ఖాన్‌కు షాజహాన్ 9000 జాత్‌ల మన్సబ్‌ను కట్టబెట్టాడు. చక్రవర్తితో అసఫ్ ఖాన్‌కు సన్నిహిత సంబంధం

ఉండడంతో వజీరు వకీల్ కు లోబడి పనిచేశాడు. ఆ విధంగా ధీరత్వం, ప్రతిష్ట గల వ్యక్తికి వకీల్ పదవిని సాధారణంగా ఒక బహుమానంలా కట్టబెట్టేవారు. అయితే పరిపాలనా యంత్రాంగమంతటిపై అతడికి పర్యవేక్షణ ఇవ్వడాన్ని హానికరంగా పరిగణించేవారు.

వకీల్ కింద దీవాన్ లేదా వజీర్ ఉండేవాడు. అతడు ఆర్థిక శాఖను నిర్వహించేవాడు. వకీల్ పదవిలో ఎవరినీ నియమించకుంటే వజీరు ప్రధాన మంత్రిగా వ్యవహరించేవాడు. ఈ కారణంగా అతడిని వజీర్ అని కూడా పిలిచేవారు. అయితే వకీల్ ఉన్నపుడు వజీర్‌కు కొన్ని ప్రత్యేక అధికారాలు దక్కేవి. దాంతో అతడు ఇతర మంత్రుల కంటే శక్తిమంతునిగా ఉండేవాడు. అయితే ఈ సందర్భంలో అతడు కేవలం దీవాన్‌గా మాత్రమే వ్యవహరించేవాడు. అతడి విధులను రెండు పద్దుల కింద విభజించవచ్చు:1) పూర్తిగా ఆర్థికపరమైనవి 2) ప్రభుత్వం, చక్రవర్తి మధ్య వారధిగా ఉండటం. తొలి పద్దు కింద అతడి విధులు చాలా విస్తారమైనవి, సమగ్రమైనవి. రెవెన్యూ లేదా వ్యయానికి సంబంధించిన ఏ విషయం కూడా అతడి ప్రత్యక్ష లేదా పరోక్ష నియంత్రణలో ఉండేవి. సామ్రాజ్యంలోని పన్ను సేకరణదారులందరూ అతడి నియంత్రణలో ఉండేవారు. పన్నులశాఖ అధికారులను అతడు నేరుగా నియమించేవాడు లేదా చక్రవర్తితో సంప్రదించి నియామకాలు జరిపేవాడు. నియామకం తర్వాత అధికారులు అతడికి సమగ్ర నివేదికలను పంపేవారు. రెవెన్యూ వసూలు, రెవెన్యూ డిమాండ్, వాస్తవిక వసూళ్లు, మినహాయింపులు, బకాయిలు తదితర విషయాలతో కూడిన సమగ్ర నివేదికలు తయారయ్యేవి. ఈ నివేదికలు సాధారణంగా ప్రాంతీయ దీవాన్ కార్యాలయం ద్వారా దీవాన్‌కు అందేవి. ఈ నివేదికల రూపకల్పనపై తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం అతడి విధి. వివిధ శాఖలకు నిధులను కేటాయించడం దీవాన్ బాధ్యత. రాచరిక ఖజానానుండి చేసే అన్ని చెల్లింపులకు అతడి అనుమతి తప్పనిసరి. అతడి నేతృత్వంలో తప్ప ఎవరూ నిధులను చట్టపరంగా వ్యయం చేసేవారు కాదు. ఆదాయ వ్యయాలపై అతడు ఎల్లప్పుడూ నిఘా ఉంచేవారు. తాజా పరిస్థితిని చక్రవర్తికి ఎప్పటికప్పుడు నివేదించేవాడు. రోజువారీ లేదా నిర్ణీత వ్యవధిలో అతడు చక్రవర్తికి నివేదికలను సమర్పించేవాడు. భూమిశిస్తుకు సంబంధించిన సంస్కరణ చర్యలు, సుంకాలు లేదా ఆర్థిక నిర్వహణకు సంబంధించిన శాసనాలు అతడి కార్యాలయం నుండే వెలువడేవి. శాసనాలను విజయవంతంగా అమలయ్యేలా చూసే బాధ్యత అతడిదే. ఆ విధంగా రాజ్య ఆర్థిక విధాన విజయం లేదా వైఫల్యం చాలా వరకు దీవాన్ పనితీరుపైనే ఆధారపడి ఉండేది.

ఆధునిక ప్రభుత్వంలో ప్రధానమంత్రిలాగా అతడు పరిపాలనా యంత్రాంగానికి, చక్రవర్తికి మధ్య వారధిగా వ్యవహరించేవాడు. ప్రతి శాఖకు చెందిన కార్యక్రమాల వివరాలను నివేదిక రూపంలో అతడికి పంపేవారు. అతడి శాఖ సామ్రాజ్యంలో సార్వజనిక నివేదికల కార్యాలయంగా వ్యవహరించేది. రాచరిక రాకుమారులు, ప్రాంతీయ గవర్నర్లు, ఉన్నత మన్సబ్‌దార్ల నుండి అందే అన్ని వర్తమానాలను అతడు చక్రవర్తి ఎదుట ఉంచేవాడు. చక్రవర్తి సూచనల మేరకు వారికి తిరిగి జవాబులు పంపేవారు. విదేశీ రాకుమారులకు పంపే దౌత్యపరమైన లేఖలను అతడే రూపొందించేవాడు. నియామక, పదోన్నతి, బదిలీ ఉత్తర్వులన్నీ

అతడి కార్యాలయం నుండే వెలువడేవి. ఉత్తర్వులపై దీవాన్ సంతకమే ఉండేది. ప్రాంతీయ గవర్నర్‌తో అతడు నేరుగా పరిచయం పెట్టుకునేవాడు. ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకునేవాడు. నిర్ణీత వ్యవధులలో గవర్నర్ల నుండి నివేదికలను తెప్పించుకునేవాడు. చక్రవర్తిని సంప్రదించిన తర్వాత వారికి తగిన సూచనలు జారీ చేసేవాడు. చక్రవర్తితో దీవాన్ సంబంధాలు చాలా సన్నిహితంగా ఉండేవి. అతడిని విశ్వాసంలోకి తీసుకోకుండా నే చక్రవర్తి విధాన నిర్ణయాలను తీసుకునేవాడు కాదు. వజీరు ప్రభావ పరిధి, అతడి విధుల ప్రాముఖ్యతను ప్రధాన సహాయకుల సంఖ్య, స్వభావం ప్రతిబింబిస్తాయి. వజీర్ సహాయకులు ఈ విధంగా ఉండేవారు.: 1) దీవాన్-ఎ-ఖలీసా: ఇతడు ప్రభుత్వ భూములకు బాధ్యుడు. 2) దీవాన్-ఎ-తన్: ఇతడు జాగీర్లు జీతభత్యాలకు బాధ్యుడు. 3) ముస్తౌఫీ: ఇతడు ఆదాయ వ్యయాలను తనిఖీ చేసేవాడు. 4) వాకియా-నావీలు: వీరు ముఖ్యమైన ఫర్మాన్లు, సంఘటనల నివేదికలను నిర్వహించేవారు. అలాగే వజీరు కార్యాలయానికి అనుబంధంగా ఉండే సామ్రాజ్య నివేదిక కార్యాలయాలకు బాధ్యునిగా ఉండేవారు. 5) ముష్రిఫ్: సచివాలయానికి, జమాబందీల ఆడిటింగ్‌కు ప్రధాన బాధ్యునిగా ఉండేవాడు.

మరో ముఖ్యమైన కేంద్ర మంత్రి ఖాన్-ఎ-సమన్. ఇతడు రాచరిక కార్ఖానాలు లేదా కార్యశాలలకు అధిపతి. తొలినాళ్లలో అతడిని మరీ ముఖ్యునిగా పరిగణించే వారు కాదు. వజీరు సహాయకునిగా మాత్రమే అతడిని గుర్తించేవారు. అయితే అనతికాలంలోనే చక్రవర్తిపై వ్యక్తిగత ప్రభావం చూపే విషయంలో ప్రముఖునిగా ఎదిగాడు. హోదాలో వజీరు తర్వాతి స్థానంలో నిలిచాడు. ఆ సమయంలో రాజ్యానికి వందకుపైగా కార్యశాలలు ఉండేవి. రహదారులు, వంతెనలు, రాజభవనాల నిర్మాణం నుండి రోజువారీ ఉపయోగించే వస్తువులు, విలాస వస్తువుల వరకు ఈ కార్యశాలలు ఉత్పత్తి చేసేవి. ఫ్యాన్సీ ఉత్పత్తులు, అలంకరణ సామాగ్రి, నగలు, వస్త్రాల నిల్వపేటికలు, సైన్యం, కార్యాలయాలకు అవసరమైన పరికరాలు, వస్తువులను ఈ రాచరిక కార్యశాలలు ఉత్పత్తి చేసేవి కూడా. ఈ కార్యశాలలకు ఖాన్-ఎ-సమన్ అధిపతి కావడంతో వాటిపై నియంత్రణ, పర్యవేక్షణ అధికారాలను కలిగి ఉండేవాడు. వీటికి అవసరమైన సిబ్బందిని నియమించి బాధ్యతలను కేటాయించేవాడు. ముడిసరుకుల కొనుగోలు, తయారైన ఉత్పత్తుల నిల్వ, రాజ్య ప్రయోజనాలకు అనుగుణంగా ఉత్పత్తులను వాడడం అతడి విధులలో అంతర్భాగం. రాచరిక నివాస శాఖకు కూడా అతడు అధిపతిగా ఉండేవాడు. ఆస్థానం, రాజభవనాల సిబ్బంది మొత్తాన్ని నియంత్రించేవాడు. ఆస్థానం, అంతఃపురం ఖజానాలు, నిల్వకేంద్రాలు అతడి నియంత్రణలో ఉండేవి. అలాగే కానుకల శాఖ కూడా అతడి నియంత్రణలో ఉండేది. వేర్వేరు వేడుకలలో కానుకలను ప్రదానం చేసేందుకు అవసరమైన సరుకులను సరఫరా చేసే బాధ్యత కూడా అతనిదే. చక్రవర్తి అభిరుచులు, ఇష్టాయిష్టాలను తెలుసుకోవడం, తదనుగుణంగా వస్తువులను సేకరించడం అంత సులభమైన పనికాదు. అయితే సమర్థుడైన ఖాన్-ఎ-సమన్ నుండి ఇలాంటి సామర్థ్యాన్నే ఆశించేవారు. కొన్ని సందర్భాలలో చక్రవర్తికి ఇష్టమైన కానుకలను ఎంపిక చేయడంలో అతడు అమీర్‌లకు సహాయపడేవాడు. ఆ విధంగా సామంతుల మన్నలను అతడు చిరకాలం పొందేవాడు. తన విధులతో ఖాన్-ఎ-సమన్ ఆస్థానంలో గణనీయమైన ప్రభావం చూపేవాడు.

తదుపరి ముఖ్యమైన కేంద్ర మంత్రి మీర్ బక్షీ లేదా వేతనాల చెల్లింపు అధికారి. తొలుత అతడు రక్షణ శాఖకు అధిపతిగా ఉండేవాడు కాని మన్సబ్ వ్యవస్థ ప్రవేశపెట్టిన తర్వాత అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులను సైనిక వేతన జాబితాలో చేర్చారు. ఫలితంగా మీర్‌బక్షీ సామ్రాజ్యమంతటికీ వేతనాల చెల్లింపు అధికారి అయ్యాడు. వేతనాలు, భత్యాలు, సవరింపుల వివరాలను నివేదికల రూపంలో అతడి కార్యాలయం ఉంచేది. మన్సబ్ వ్యవస్థ కింద పని చేసే ప్రతి అధికారి వేతన వివరాలను అతడు తనిఖీ చేసేవాడు. అధికారుల వేతనాలను మంజూరు చేసే సంబంధిత బిల్లులను వజీరుకు పంపేవాడు. ఉద్యోగుల భర్తీ, శిక్షణ, నిర్వహణ, క్రమశిక్షణ వివిధ విభాగాలకు చెందిన సైనికుల వేతనాలకు సంబంధించిన నిబంధనలను అతడు రూపొందించే వాడు. మన్సబ్‌కు నియామకాలు లేదా వారి పదోన్నతికి సంబంధించిన సిఫార్సులను చక్రవర్తికి పంపేవాడు. చక్రవర్తి ఆమోదం తర్వాత నియామకాల జాబితాను నిర్ధారణ కోసం వజీరుకు పంపేవాడు. చివరగా నియమితునికి జాగీర్‌ను కేటాయించేవారు. ఇదే ఏర్పాటు సైనిక సరఫరాలు, చక్రవర్తి పర్యటనలకు కూడా వర్తించేది. గూఢచారి విభాగానికి కూడా మీర్‌బక్షీ అధిపతిగా ఉండేవాడు. అలాగే సామ్రాజ్యంలోని సమాచార కేంద్రాలు అతడి నియంత్రణలో ఉండేవి. గూఢచార అధికారులు(బరీద్‌లు), వార్తా నివేదకులు (వాకియా–నావీలు) ను సామ్రాజ్యంలోని అన్ని ప్రాంతాలలో నియమించేవారు. వారి నివేదికలను ఆస్థానంలో చక్రవర్తి ఎదుట మీర్‌బక్షీ ఉంచేవారు. రహస్య, ఆంతరింగక, ముఖ్య వ్యవహారాలను చర్చించే బృందంలో అతడు సభ్యునిగా ఉండేవాడు. సామ్రాజ్యం విస్తరించడంతో అతడి బాధ్యతలు కూడా తడిసి మోపెడయ్యాయి. దాంతో అతడికి సహాయంగా ముగ్గురు డిప్యూటీలను నియమించారు. ప్రతి రాష్ట్రంలోనూ ఒక బక్షీ ప్రత్యేకంగా ఉండేవారు అయితే వారంతా మీర్ బక్షీ సాధారణ నియంత్రణలో ఉండేవారు.

మత విరాళాల విభాగానికి సద్ర్–ఉస్–సదర్ అధిపతిగా ఉండేవాడు. అతడిని సద్ర్–ఎ–జహాన్ అని కూడా పిలిచేవారు. అక్బర్ హయాం వరకు మొత్తం సామ్రాజ్యానికి ఒకే ఒక సద్ర్ ఉండేవాడు. అయితే తర్వాతి కాలంలో అక్బర్ ప్రాంతాలలో కూడా సద్ర్‌లను నియమించాడు. కేంద్ర సద్ర్‌కు ప్రాముఖ్యతనిచ్చేందుకు అతడికి సద్ర్–ఉస్–సదర్ లేదా సద్ర్–ఎ–జహాన్ అనే బిరుదును ప్రదానం చేశారు. తొలుత ప్రధాన సద్ర్‌ను రాచరిక సేవకునిగా పరిగణించేవారు కాదు. అతడికి ఎలాంటి మన్సబ్ లభించేది కాదు. తర్వాతి కాలంలో అతడు కూడా మన్సబ్ దార్ అయ్యాడు. మతవిరాళాల శాఖ అధిపతిగా అతడు రాజ్య మత విధానాన్ని నియంత్రించేవాడు. జిజ్యా, జకాత్‌ల వసూలుకు చర్యలు తీసుకునేవాడు. ప్రజా విరాళాలు, దేవాదాయ భూములను కూడా నియంత్రించేవాడు. అలాగే మత సంస్థలకు భూములను కేటాయించేవాడు. అతడి ఆధీనంలోని నిధులు, భూములను వితంతువులు, అనాధులు తదితరులకు పునారావాసం కల్పించడానికి వినియోగించేవారు. మత గురువులు, విద్వాంసులు, ఉపాధ్యాయులకు జీవనభృతి, విద్యార్థులకు భృతి, విద్యాసంస్థలు, మసీదులు తదితర వాటికి భూములను చెల్లించేవారు. మసీదుల నిర్వహణకు అతడు సిబ్బందిని నియమించి వారి విధివిధానాలను నిర్ధారించేవాడు. ముహ్తసిబ్ అతడి నియంత్రణలో పని చేస్తూ షరియా నిబంధనలను అమలు చేసేవాడు.

పై శాఖకు అనుబంధంగా న్యాయశాఖ ఉండేది. దీనికి కాజీ–ఉల్– కజత్ అధిపతిగా ఉండేవాడు. మత విరాళాలు, న్యాయశాఖలు సాధారణంగా ఒకే వ్యక్తి పరిధిలో పని చేసేవి. అయితే అతడు నిర్వహించే విధుల స్వభావాన్ని బట్టి అతడిని వేర్వేరు బిరుదులతో పిలిచేవారు. మతవిరాళాల శాఖ అధిపతిగా అతడిని సద్ర్– ఉస్–సదర్ అని, న్యాయశాఖ అధిపతిగా అతడిని కాజీ–ఉల్–కజత్ అని పిలిచేవారు. అలాగే ప్రధాన ముఫ్తీ కూడా ఉండేవాడు. ముఫ్తీ మత చట్టాన్ని అన్వయిస్తే ప్రధాన కాజీ దానిని ఆచరణలో పెట్టేవాడు. ప్రధాన న్యాయమూర్తిగా అతడు స్థానిక, ప్రాంతీయ కాజీలు, ఇతర సిబ్బందిని నియమించేవాడు. పైనపేర్కొన్న అధికారులు, మంత్రులతోపాటు మరెందరో అధికారులు సామ్రాజ్య సేవలో ఉండేవారు.వారి హోదా తక్కువైనప్పటికీ కేంద్రంలో గణనీయమైన ప్రభావం చూపేవారు. ముఖ్యంగా మీర్–ఎ–ఆతిష్ లేదా ఆయుధగార శాఖ అధిపతి. అలాగే గుమాస్తాలు, అకౌంటెంట్లు, ఆడిటర్లు, దూతల సైన్యం ఉండేది.ఈ వ్యవస్థ ప్రత్యేక లక్షణాలలో నివేదికల సమగ్ర నిర్వహణ ప్రధానమైనది. కాగితాలపై అంత సవ్యంగానే ఉన్నట్లు చూపేవారు. వాటి ప్రతులను వజీర్‌కు పంపేవారు. ఆ విధంగా ప్రభుత్వం కాగితంపై ఎంతో సమర్థవంతంగా కనిపించేది. వాస్తవానికి పరిస్థితులు ఎన్నడూ నియమనిబంధనలకు లోబడి ఉండేవి కావు. ముఖ్యంగా చక్రవర్తి అసమర్థునిగా ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి ఏర్పడేది.

మొగల్‌ల కేంద్రం పాలన కనీసం సిద్ధాంతపరంగానైనా ఎంతో సమర్థవంతంగా కనిపిస్తుంది. అందులో మంత్రులు ప్రత్యేక విధులను నిర్వహిస్తూ ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకునే వారు కాదు. పాలకునికి నేరుగా బాధ్యులుగా ఉండేవారు. అయితే ఆచరణలో కొన్ని లోపాలను మనం గుర్తించవచ్చు. అది కూడా పాలకుడు అసమర్థుడైనప్పుడే. కేంద్ర పాలనలోని తీవ్ర లోపం అది ఒకే వ్యక్తిపై ఆధారపడడం. చక్రవర్తి వ్యక్తిత్వంపైనే పాలనా విజయాలు ఆధారపడి ఉండేవి. అలాగే కేంద్రీకరణ పతాక స్థాయిలో ఉండేది,. బాబర్ నుండి ఔరంగజేబ్ వరకు ఉన్న గొప్ప మొగల్‌పాలకులంతా సమర్థులు, ప్రతిభావంతులు. అయినప్పటికీ జహంగీర్ అనారోగ్యం సందర్భంగా చక్రవర్తి ప్రజా వ్యవహారాలకు దూరంగా ఉన్నప్పుడు సమస్యలు పుట్టుకొచ్చాయి. అతడు నూర్‌జహాన్ సేవలను వినియోగించుకోకుండా ఉన్నట్లయితే ఈ సమస్యలు తీవ్ర రూపం దాల్చేవి. అలాగే షాజహాన్ తానే స్వయంగా రాజ్య వ్యవహారాలను చూసినంత కాలం ఎలాంటి సమస్య ఏర్పడలేదు. అయితే దానిపై అతడు మరీ ఎక్కువగా ఆధారపడడం మొదలు పెట్టడంతో వర్గాలు తలెత్తి అసమ్మతి పెరగసాగింది. అలాగే ఔరంగజేబ్ ఉత్తర భూభాగంలో ఉన్నంత వరకు కేంద్ర పాలనా యంత్రాంగం చక్కగా పని చేసింది. అయితే, అతడు దక్కనుకు వెళ్లి అక్కడే స్థిరపడడంతో నియంత్రణ సడలి అరాచకం మొదలైంది.ఔరంగజేబ్ మరణం తర్వాత సార్వభౌముని అసమర్థత, బలహీనత దుష్ప్రభావాలు ప్రస్ఫుటం కావడం మొదలుపెట్టాయి. ఎన్నో శతాబ్దాలుగా కష్టపడి బలోపేతం చేయబడిన సామ్రాజ్యం కొన్నేళ్లకే ముక్కలు చెక్కలు అయ్యింది.

రెండవ విషయం ఏమిటంటే నియామకాల విషయంలో పూర్వపు అనుభవాన్ని ఎప్పుడూ పరిగణలోకి తీసుకోలేదు. కొన్నిసార్లు సమర్థులను ఎలాంటి కారణాలు చూపకుండా

సుదూర ప్రాంతాలకు బదిలీ చేసేవారు. మూడవది మంత్రులను కొన్నిసార్లు దండయాత్రలకు పంపేవారు లేదా ప్రాంతీయ గవర్నర్లుగా బదిలీ చేసేవారు. ఇది శాఖాపరమైన సామర్థ్యాన్ని నిస్సందేహంగా దెబ్బతీసింది. కొత్త మంత్రులు తరచు తమకు ఇష్టమైన వారిని లేదా విధేయులను నియమించేవారు.

ఫలితంగా వారికి సిబ్బంది నుండి పూర్తి సహకారం అందలేదు. ప్రభుత్వ అధికారులకు నిర్దిష్టమైన హోదాలు, ప్రయోజనాలను నిర్ధారించి ఉన్నట్లయితే సమర్థవంతమైన అధికార స్వామ్యం నిర్మితమై ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపేది. బలహీనమైన చక్రవర్తి ఉన్నప్పటికీ పాలన సజావుగా సాగేది. చివరగా, మంత్రులు చాలా ఉన్నతమైన హోదాను అనుభవించారు. అప్పటి వనరులను దృష్టిలో పెట్టుకుంటే వారి జీతభత్యాలు మరీ ఎక్కువగా ఉండేవి. మంత్రులు నియమించిన ఉద్యోగులు సైతం తమ యజమానుల జీవనశైలిని అనుకరిస్తూ, విలాసవంతమైన జీవితం గడిపారు. ఉన్నత హోదాలో ఉన్న వారు ఆడంబరాలకు పోవడం అవసరమేనన్న భావన అప్పట్లో ఉండేది. ఇది సామ్రాజ్య సేవకుల్లో నైతిక పతనానికి దారి తీసి చివరకు సామ్రాజ్య పతనానికి బాటలు వేసింది.

**ప్రాంతీయ పాలన :**

అక్బర్ పాలనలోకి వచ్చేవరకు ఒకనిర్దిష్టమైన ప్రణాళిక మేరకు రాష్ట్రాలను నిర్వహించడానికి వ్యవస్థాగత ప్రయత్నమేదీ జరగలేదు. రాజపుత్రులతో యుద్ధాలు, మంగోలు దండయాత్రలు, తిరుగుబాట్లు ఢిల్లీ సుల్తాన్ల కేంద్ర ప్రభుత్వానికి నిరంతరం వ్యవధి లేకుండా చేశాయి. రాష్ట్రాలను (ప్రాంతాలను) సక్రమంగా నిర్వహించే సమయమే వారికి లభించలేదు. ఆ రోజుల్లో ఒక ముఖ్యమైన అమీర్ ఆధీనంలోని భూభాగాన్ని ప్రాంతంగా పరిగణించేవారు. ఒక ప్రముఖ కోట దానికి అధికార చిహ్నంగా ఉండేది. కనుక ప్రాంతాల సంఖ్య, వాటి విస్తీర్ణం నిరంతరంగా మారుతూ వచ్చాయి. అక్బర్‌కు ముందు షేర్‌షా ఒక్కడే ప్రభుత్వ స్వరూపంలో కొన్ని సమగ్రమైన సంస్కరణలు ప్రవేశపెట్టాడు. అయితే ప్రాంతాల అంతర్గత నిర్వహణలో ప్రభావంతమైన మార్పులు వచ్చిన దాఖలాలు ఏవీ లేవు. కనక కేంద్ర ప్రభుత్వాన్ని పునఃవ్యవస్థీకరించడంలో షేర్‌షాకు అక్బర్ ఏ విధంగానూ రుణపడి లేనట్లే ప్రాంతీయ ప్రభుత్వాల ప్రక్షాళనలో కూడా అతడు తన స్వంత మేధపై ఆధారపడాల్సి వచ్చింది. సామ్రాజ్యాన్ని విశాలమైన ప్రాంతాలుగా విభజించాలని అక్బర్ నిర్ణయించాడు. సహజ సరిహద్దులు, పాలనా సౌలభ్యానికి అనుగుణంగా ప్రాంతాలను ఏర్పరచి అందులో కేంద్రాన్ని పోలిన ప్రభుత్వ వ్యవస్థను ప్రవేశపెట్టాడు. 1580 నాటికి అతడు ఉత్తర భారత భూభాగాన్నంతటిని దాదాపుగా స్వాధీనంచేసుకొని ఉన్నాడు.

1573–81 మధ్య అక్బర్ అనేక ముఖ్యమైన సంస్కరణలను ప్రవేశపెట్టాడు. అందులో ప్రధానమైనది ప్రాంతీయ రాజ్యాల నిర్వహణకు సంబంధించినది. 1581లో తన సామ్రాజ్యాన్ని 12 సుబాలు లేదా ప్రాంతాలుగా విభజించి ఆయా ప్రాంతాల ప్రధాన పట్టణాలు లేదా భూభాగాల పేరున నామకరణం చేశాడు. ఈ 12 సుబాలు; కాబుల్, లాహోర్, ముల్తాన్, ఢిల్లీ, ఆగ్రా,

అజ్మీర్, అలహాబాద్, అవధ్, బీహార్, బెంగాల్, మాల్వా, గుజరాత్. ఆ విధంగా దక్కను దండయాత్ర వరకు ప్రాంతాల సంఖ్య 12కే పరిమితమైంది. అయితే కొన్ని ప్రాంతాలు తాజా ఆక్రమణలవల్ల గణనీయంగా విస్తరించాయి. దక్కను దండయాత్ర తర్వాత ఖాన్‌దేశ్, బెరార్, అహ్మద్‌నగర్‌లు అదనపు ప్రాంతాలుగా చేరాయి. దాంతో ప్రాంతాల సంఖ్య 15కు చేరుకుంది. జహంగీర్ ఈ సంఖ్యలో ఎలాంటి మార్పులు తీసుకురాకుండానే మరణించాడు. షాజహాన్ పాలనలో ప్రాంతాల సంఖ్య 19కి చేరుకుంది. ఔరంగజేబ్ దక్కను ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడంతో సుబాల సంఖ్య 21కి చేరింది.

సామంత రాజ్యాలను సర్కార్లు లేదా పరగణాలుగా గుర్తించేవారు. అయితే ఈ గుర్తింపు వాటి ప్రాముఖ్యతను బట్టి ఉండేది. రాజ్యవిస్తీర్ణాన్ని కూడా పరిగణనలోకి తీసుకునేవారు. ఆ విధంగా అక్బర్ హయాం నుండి సామ్రాజ్యంలోని ప్రతి భాగం ఏదో ఒక ప్రాంతీయ రాజ్యంలో అంతర్భాగంగా ఉండేది. ప్రతి ప్రాంతీయ రాజ్యానికి దాదాపు ఒకే రకమైన ప్రభుత్వ వ్యవస్థ ఉండేది. కాని ఒకే ఒక్క మార్పు ఉండేది. కొన్ని సందర్భాల్లో ఒక వ్యక్తే ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాలకు గవర్నర్‌గా నియమితుడయ్యేవాడు. ఆ విధంగా అక్బర్ కాలం నుండి దక్కను ప్రాంతమంతా ఒకే వైస్రాయ్ కింద ఉంచబడింది. దక్కనులోని మూడు ప్రాంతాలకు వైస్రాయ్ నియంత్రణలో ముగ్గురు డిప్యూటీ గవర్నర్లను నియమించేవారు. ఈ మూడు ప్రాంతాలకు కూడా ఇతర ప్రాంతీయ రాజ్యాల తరహాలోనే పాలనా వ్యవస్థ ఉండేది. ఆ విధంగా పరోక్ష గవర్నర్ల సాంప్రదాయం ప్రారంభమై తర్వాతి కాలంలో ప్రమాదకరమైన పరిణామాలకు దారి తీసింది. దీనిని మినహాయిస్తే ప్రతి ప్రాంతానికి ఏకస్వరూప ప్రభుత్వం ఉండేది.

ప్రతి ప్రాంతీయ రాజ్యానికి ఒక గవర్నర్ ఉండేవాడు. అక్బర్ హయాంలో అతడిని సిపాసాలార్ అనే బిరుదుతో గుర్తించేవారు. అయితే తదుపరి మొగల్ పాలకుల హయాంలో అతడి బిరుదును సుబాదార్ లేదా నాయిమ్‌గా మార్చారు. అతడి ప్రధాన విధులు తన ప్రాంత పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షించడం,కేంద్ర శాసనాలను అమలు చేయడం, రెవెన్యూ వసూళ్లలో తోడ్పాటును అందించడం. అలాగే నేర న్యాయాన్ని కూడా అమలు చేసే బాధ్యత అతడిపై ఉండేది.

తన ప్రాంత పరిధిలోని ముఖ్యమైన వ్యక్తులతో అతడు నిత్య సంబంధాలను కొనసాగించవలసి వచ్చేది. సమర్థులకు పదోన్నతిని సిఫార్సు చేయడం, తిరుగుబాటు జమీందార్లను శిక్షించడం, తన పరిధిలో జరిగే ముఖ్యమైన సంఘటనల వివరాలను కేంద్ర దర్బారుకు నివేదించడం అతడి బాధ్యత. అలాగే తన బలగాలను నిత్యం సమర్థవంతంగా, ఎప్పుడూ సిద్ధంగా ఉంచడం, పేదలు, మత గురువులకు సహాయం అందించడం, వ్యవసాయదారులను పరిరక్షించి వ్యవసాయాన్ని విస్తరించడం అతడి విధుల్లో అంతర్భాగం. మరో ముఖ్యమైన విధి సామంత రాజుల నుండి కప్పం వసూలు చేయడం.

ప్రాంతీయ దీవాన్ ప్రాంతీయ రాజ్యంలో రెండవ ముఖ్యమైన అధికారి. తొలి రోజుల్లో అతడు సుబాదార్‌తో సమానంగా హోదా కలిగి ఉండేవాడు. అయితే సమాన అధికారాలు మాత్రం ఉండేవి కావు. నిజానికి ఈ ఇద్దరు అధికారులు ఒకరిపై ఒకరు నిశితమైన నిఘా

ఉంచాల్సిన అవసరం ఉండేది. దీవాన్ రెవెన్యూశాఖకు బాధ్యునిగా ఉండేవాడు. పన్ను వసూళ్ల కోసం కలెక్టర్లను నియమించేవాడు. అలాగే పౌర వ్యాజ్యాలను పరిష్కరించేవాడు. సామ్రాజ్యదీవాన్ లేదా వజీర్ అతడిని నియమించేవాడు. అందుకే అతడు వారికే నేరుగా బాధ్యత వహించేవాడు. వ్యవసాయ విస్తరణ, ఖజానా నిర్వహణ, నిజాయితీ గలవారిని అమీన్, ఆమిల్‌లుగా నియమించడం, రైతాంగ సంరక్షణ, సరుకుల రవాణాకు ముందస్తు రుణాలివ్వడం, తన శాఖ నివేదికలను క్రమం తప్పకుండా వజీరు కార్యాలయానికి పంపడం ప్రాంతీయ దీవాన్ ఇతర విధులు.

మూడవ ముఖ్య అధికారి బక్షీ. కొన్ని సార్లు ఇతడు ప్రాంతీయ దీవాన్‌కంటే ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకునేవాడు. ఇతడిని మీర్ బక్షీ (కేంద్ర మంత్రి)తో సంప్రదించిన తర్వాత నియమించేవారు. దాదాపు కేంద్ర అధికారి తరహాలోనే ఇతడు తన పరిధిలో బాధ్యతలు నిర్వహించేవాడు. ప్రాంత పరిధిలో సైనిక బలగాల నిర్వహణ, నియంత్రణతోపాటు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను (నిబంధనలను) సైనికులపై అమలు చేసేవాడు. ప్రాంతీయ అధికారుల జీతభత్యాల వివరాలను నమోదు చేసేవాడు. యుద్ధం సమయంలో ప్రతి మన్సబ్‌దారు తన సైన్యాన్ని పూర్తి ప్రమాణాలతో హాజరు పరిచేలా చూసే బాధ్యత కూడా బక్షీదే. అన్ని రకాల లోపాలు అవకతవకలను గమనంలోకి తీసుకొని సంబంధిత వ్యక్తుల నుండి వివరణ కోరేవాడు. సాధారణంగా బక్షీకి వాకియా-నవీ బాధ్యత కూడా అప్పగించేవారు. కనక అతడు ప్రాంతీయ వ్యవహారాలపై కేంద్రానికి క్రమం తప్పకుండా నివేదికలు పంపేవాడు.

ఆ విధంగా అతడు గవర్నర్, దీవాన్‌ల జోరుకు పగ్గాలువేసేవాడు. సుబాదారు, దీవాన్, బక్షీలు సమర్థులై ఉండి తమ విధులను నిజాయితీగా నిర్వర్తిస్తే ప్రాంత వ్యవహారాలు శాంతియుతంగా ఉండేవి. ఎందుకంటే ఆ ముగ్గురు కలిసి ప్రాంత సిబ్బందిని బాధ్యతాయుతమైన పథంలో నడిపించే వారు. ప్రాంతాలలో కాజీ, సద్ర్, ముహ్తాసిబ్ లాంటి ఇతర అధికారులు ఎందరో ఉండేవారు. వీరు కేంద్ర మంత్రులు నిర్వహించే బాధ్యతలను తమ తమ పరిధిలో నిర్వహించేవారు.

**స్థానిక పరిపాలన :**

ప్రతి ప్రాంతం ఎన్నో సర్కార్లుగా విభజితమై ఉండేది. సర్కార్లు సాధారణంగా రెండు రకాలు : చక్రవర్తి నియమించే అధికారుల నియంత్రణలోనివి. చక్రవర్తి నిబంధనలు వీటికి వర్తిస్తాయి. రెండవ రకానికి చెందినవి రాజ్‌పుత్ర రాజ్యాలు లేదా సామంత రాకుమారుల ప్రాంతాలు. ఈ ప్రాంతాలలో ప్రాచీన సాంప్రదాయాలతో కూడిన పాలన ఉండేది. రెండవ రకం ప్రాంతాలను కేవలం నివేదిక కోసమే సర్కార్లుగా వర్ణించేవారు. తొలి రకం సర్కారు పాలనను షేర్‌షా ఏర్పాటు చేసిన పాలనావ్యవస్థ ఆధారంగా పునఃవ్యవస్థీకరించారు. అయితే ఇందులో కూడా మొగల్‌లు కొన్ని ముఖ్యమైన మార్పులు చేశారు. ఇప్పుడు సర్కారు అధిపతిని ఫౌజ్‌దార్‌గా పిలిచారు. ఇతడు ఒక ముఖ్యమైన మన్సబ్‌దార్. చక్రవర్తే స్వయంగా అతడిని నియమించేవాడు. సర్కార్ పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షించే బాధ్యత ఫౌజ్‌దార్‌పై ఉండేది.

కొన్ని అత్యవసర పరిస్థితులలో అతడు సుబాదార్ నుండి మద్దతు పొందే అవకాశం ఉండేది. ఫౌజ్‌దార్ నేతృత్వంలో సైనిక బలగాలు ఉండేవి. శాంతిభద్రతల పరిరక్షణ, ఆంతరంగిక తిరుగుబాట్లను అణచివేయడానికి ఈ బలగాలను వినియోగించే వారు. ఈ లక్ష్యంతోనే అతడు సర్కార్‌ను ఎన్నో కోత్వాల్‌లుగా విభజించాడు. సర్కార్ కోత్వాల్ సాధారణ నియంత్రణలో ప్రతి కోత్వాల్ పని చేసేది. సర్కార్ పరిధిలో పన్నుల సేకరణకు ఆమిల్‌లు, కరోరీలను నియమించేవారు. అయితే వీరు ప్రాంతీయ దీవాన్ సాధారణ నియంత్రణలో వ్యవహరించేవారు. అయినప్పటికీ అవసరమైనప్పుడు వీరికి ఫౌజ్‌దార్ సైనిక సహాయాన్ని సమకూర్చేవాడు. పౌర, రెవెన్యూ, నేర వ్యాజ్యాలను కాజీలు, ఆమిల్‌లు, కోత్వాల్‌లు పరిష్కరించేవారు.

సర్కార్ కింది పరిపాలనా విభాగంగా పరగణ ఉండేది. ఇందులో అనేక గ్రామాలు ఉండేవి. ప్రతి పరగణకు ఒక షిక్‌దర్, ఒక ఆమిన్, ఒక కాజీ, అనేక మంది గుమాస్తాలు, కోశాధికారులు ఉండేవారు. వారి విధులు షేర్‌షాకాలంలో లాగే ఉండేవి. కేవలం ఒక్క మార్పు ఉండేది. ఆమిన్‌కు ఉన్న న్యాయ విధులను కాజీకి బదిలీ చేశారు. అనేక గ్రామాల సమాహారమే ఒక పరగణ. ప్రభుత్వ అధికారులు సాధారణంగా గ్రామీణ ప్రజానీకంతో సమీప సంబంధాలను పెట్టుకోలేదు.

కేవలం పన్నుల సేకరణకే పరిమితమై పంచాయితీల ద్వారా ప్రజలు తమ స్వంత వ్యవహారాలను తేల్చుకునే స్వేచ్ఛను కల్పించారు. పన్నుల సేకరణదారులు ముకద్దమ్‌లు, చౌదరీలు, జమీందార్ల సేవలను వినియోగించుకొని పన్నులను వసూలు చేసేవారు. అలా వారిని విధేయులుగా, సంతృప్తులుగా ఉంచేవారు. దొంగతనం, దోపిడీ, హత్యలను నివారించేందుకు అనువైన ప్రాంతాలలో పోలీసు చౌకీలను ఏర్పాటు చేశారు. దొంగలు, బందిపోట్లు, ఇతర సంఘ వ్యతిరేక శక్తులను నిర్బంధించడానికి పోలీసులు స్థానికుల మద్దతును కూడగట్టేవారు. ఉన్నతాధికారులు అప్పుడప్పుడు పర్యటించి పరిస్థితిని సమీక్షించేవారు. రైతుల విన్నపాలను ఆలకించి వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేవారు లేదా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చేవారు.

సర్కార్, పరగణ, గ్రామాలతోపాటు మహల్‌లు, చక్లాలు, రేవులు, పట్టణాలు, కోటలు, సైనిక శిబిరాలు కూడా స్థానిక పరిపాలన పరిధిలో ప్రస్తావించబడ్డాయి. మహల్‌లు బహుశా పన్నుల సేకరణతో ముడిపడి ఉండవచ్చు. పరగణను అనేక మహల్‌లుగా విభజించి ఉండవచ్చు. పన్నుల సేకరణను వేగవంతం చేయడానికి ప్రతి మహల్‌కు ఒక ప్రత్యేక అధికారిని నియమించి ఉండవచ్చు. షాజహాన్ హయాంలోనే చక్లాలను తొలిసారిగా ప్రస్తావించారు. ఇవి కూడా ఎన్నో మహల్‌లుగా విభజితమై ఉంటాయి. వీటికి కరోరీలనే అధికారులు ఉండేవారు. రేవులను ముత్సద్దీలు నియంత్రించేవారు. సాధారణ పట్టణాలు కొత్వాల్‌ల నియంత్రణలో ఉండేవి. ముఖ్యమైన కోటలు, సరిహద్దు శిబిరాలు ఫౌజ్‌దార్‌ల నియంత్రణలో ఉండేవి.

ప్రాంత, సర్కార్, పరగణ అధికారులను కేంద్ర ప్రభుత్వం నియమించేది. కొన్నేళ్ల వ్యవధి తర్వాత వారిని బదిలీ చేసేవారు. పర్యవేక్షణ, నియంత్రణకు క్రమబద్ధ యంత్రాంగం ఉండేది. రహస్య, సార్వజనిక గూఢాచార సిబ్బంది అధికారుల కార్యకలాపాల గురించి కేంద్రానికి

ఎప్పటికప్పుడు సమాచారం అందించేవారు. అధికారులపై ఫిర్యాదు వెళితే విచారణకు ఆదేశిస్తారు. ఫిర్యాదు నిజమని తేలితే అధికారులను కఠినంగా శిక్షించేవారు. చక్రవర్తి లేదా అతడు నియమించే ప్రత్యేక అధికారులు ప్రాంతాలలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను, ఫిర్యాదులను వినేవారు. కొన్నిసార్లు ప్రజా ప్రతినిధులు కూడా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చేవారు. ఫిర్యాదుల ఆధారంగా హెచ్చరిక, బదిలీ లేదా తొలగింపు ఉత్తర్వులను జారీ చేసేవారు.

ప్రాంతీయ రాజ్యాలలో నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు మొగల్ పాలకులు షేర్‌షా కాలం నాటి డాక్ చౌకీలను మరింత విస్తరించారు. సుదూర ప్రాంతాల నుండి సైతం కేవలం ఆరేడు రోజుల వ్యవధిలో సమాచారాన్ని రాబట్టేవారు. షేర్‌షా ద్వంద్వ పాలన వ్యవస్థను పరగణ, సర్కార్, ప్రాంతాలకు విస్తరింపచేయడం కూడా కేంద్రానికి ప్రాంతాలపై మరింత నియంత్రణను తెచ్చిపెట్టింది.

ఇన్ని జాగ్రత్తలు ఉన్నప్పటికీ, ప్రజలు అసమర్థ పాలన, అణచివేతలను ఎదుర్కొనే వారు. సుబాదార్ లేదా ఫౌజ్‌దార్ స్థానిక వార్తా నివేదికలను వేరే మార్గాల్లో సంతృప్తి పరిస్తే వారు ఈ అధికారుల దుర్మార్గాలను, అవినీతిని కప్పిపుచ్చేవారు లేదా వాస్తవాలను తెరమరుగు చేసేవారు. కేంద్రం చాలా దూరంగా ఉండడంలో నిరంకుశత్వం లేదా అణచివేత సమాచారం రాజధానికి చాలా ఆలస్యంగా అందేది. చాలా సందర్భాల్లో దౌర్జన్య పూర్వకమైన సంఘటనలు జరిగిన తర్వాతే కేంద్రానికి సమాచారం అందేది. సంఘటనా స్థలంలో విచారణకు చాలా సమయం పట్టేది. ఈలోగా ప్రజల అసంతృప్తిని రూపుమాపి పరిస్థితులు సాధారణంగా ఉన్నాయన్న భావనను స్థానిక అధికారులు సృష్టించే అవకాశం ఉండేది. విచారణ సంఘాన్ని కూడా ఏదో ఒక విధంగా లొంగదీసుకొని అనుకూల నివేదికలను సృష్టించే అవకాశం ఉండేది. నేటి ఆధునిక సమాచార, సంచార యుగంలో కూడా ఇలాంటి పరిస్థితులు సాధ్యమైనప్పుడు మధ్యయుగ భారత పరిస్థితులను ఒక్కసారి ఊహించవచ్చు. సిద్ధాంతపరంగా మొగల్ చక్రవర్తులు తిరుగుబాటు, అణచివేత, అన్యాయం, అరాచకాలను నివారించడానికి తగిన ఏర్పాట్లు చేసి ఉండవచ్చు. అయితే ఆచరణలో వ్యవస్థ ఎల్లప్పుడూ సంతృప్తికరంగా పని చేయలేదు. అలాగే కొన్ని ప్రాంతాలకు ఎవరూ వెళ్లలేని పరిస్థితులు ఉండేవి. అలాంటి ప్రాంతాల గవర్నర్లకు సాధ్యమైనంత ఎక్కువగా స్వేచ్ఛను ఇచ్చేవారు. వారితో మెతకగా వ్యవహరించేవారు. ఈ కారణంగా గవర్నర్లు అహంకారంతో ప్రవర్తించేవారు. కాబుల్, బెంగాల్, గుజరాత్, దక్కన్ గవర్నర్లపై తరచూ ఫిర్యాదులు వెళ్లేవి. అయితే చక్రవర్తి, కేంద్ర మంత్రులు అలాంటి ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించి ఉంటే ప్రభుత్వాన్ని నడపడం సాధ్యమయ్యేది కాదు. ఆ విధంగా విశాలమైన సామ్రాజ్యం, సమాచార సాధనాల పనితీరు ప్రాంతాలపై సమర్థవంతమైన నియంత్రణకు ప్రతిబంధకంగా మారాయి.

# మొగల్ రెవెన్యూ పరిపాలన

## పరిచయం

భూమి శిస్తు మధ్యయుగ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉండేది. ఈ ఆధారం నుండే పాలకులు భారీ ఆదాయాన్ని పొందేవారు. రెవెన్యూ పరిపాలన విజయంపై పాలకుల ప్రజాదరణ ఆధారపడి ఉండేది. అందుకే గొప్ప పాలకులందరూ రెవెన్యూ పరిపాలనను సమర్థవంతంగా ఉంచడానికి ప్రయత్నించారు.తైమూరిద్‌లలో అక్బర్ తొలుత ఈ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. అతడు చేసిన ఏర్పాట్లు బ్రిటీష్ పాలన ఏర్పడే వరకు రెవెన్యూ వ్యవస్థను ప్రభావితం చేశాయి. అక్బర్ లేదా అతడి వారసులు భూమి శిస్తు నిర్వహణలో ప్రవేశపెట్టిన సంస్కరణలను సరైన రీతిలో విశ్లేషించాలంటే దానికి సంబంధించిన వివిధ సమస్యలను అధ్యయనం చేయడం సమయోచితంగా ఉంటుంది.

భూమి శిస్తు విధానానికి సంబంధించి ముఖ్యమైన తొలి సమస్య భూమి యాజమాన్యం అంశమే. భూమికి నిజమైన యజమాని అయిన కౌలుదారునికి రక్షణ, భద్రత కల్పించినందుకు ప్రతిఫలంగా పాలకుడు కేవలం శిస్తుకే అర్హుడా? లేదా భూమంతా చక్రవర్తి స్వంతమా? రాచరిక భూమిని వాడుకున్నందుకు కౌలుదారుడు కౌలు చెల్లించాడా? తదుపరి ముఖ్యమైన అంశం పన్ను శాతానికి సంబంధించినది. పన్ను శాతం ఔచిత్యాన్ని నిర్ధారించడానికి ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ముఖ్యంగా భూసారం, వ్యవసాయ భూమి విస్తీర్ణం, పంటల స్వభావం, మార్కెట్ ధరలు,కౌలుదారుని నిర్వహణా వ్యయం, రాజ్య అవసరాలు మొదలైన అంశాలను కొలబద్ధగా తీసుకుంటారు. ఒక్కసారి పన్ను శాతాన్ని నిర్ధారించిన తర్వాత తదుపరి ముఖ్యమైన అంశం అంచనా పద్ధతి. అమలు చేస్తున్న పన్ను శాతం సమర్థనీయమో కాదో నిర్ధారించడానికి ఒక పద్ధతిని రూపొందించడం. అలాగే నగదు రూపంలో పన్ను వసూలు చేయాలా లేదా దిగుబడిలో కొంత భాగాన్ని స్వీకరించాలా అన్నది తదుపరి నిర్ణయం. అలాగే సేకరణకు సరైన సంస్థ ఏదీ? సేకరణ వార్షికమా లేదా రుతువుల వారీగానా? అన్నది తేల్చాల్సి ఉంటుంది.

భూమిని ఖలీసాగా (ప్రభుత్వ భూమి) మార్చడమా లేదా జీతభత్యాలకు ప్రత్యామ్నాయంగా జాగీర్దార్లకు కేటాయించడమా అన్నది కూడా నిర్ధారించాల్సి వచ్చేది. శిస్తును నేరుగా కౌలుదారుల నుండి వసూలు చేయాలా లేదా ప్రభుత్వం, కౌలుదారుని మధ్యజమీందార్, గ్రామపెద్ద, ఇజారాదార్ లాంటి వారు దళారులుగా ఉండాలా? కౌలుదారునితో సంబంధాలు పెట్టుకొనే వారిని కౌలుదారునికి నష్టం కల్గిస్తూ ప్రయోజనాలు చేకూర్చాలా లేక ప్రభుత్వమే తన మధ్యవర్తులకు అవసరమైన వేతనాలు చెల్లించాలా?సాగులో ఉన్న భూమిని కొలవాలంటే ఎవరు కొలవాలి, ఎప్పుడు కొలవాలి, ఏ పద్ధతిలో కొలవాలి? పై కార్యసాధనకు నియమించే సిబ్బందిని క్రియాశీలురుగా, నిజాయితీపరులుగా తీర్చిదిద్దడానికి ఎలాంటిచర్యలు తీసుకోవాలి? ఒక వేళ పంటలు పాక్షికంగా లేదా పూర్తిగా విఫలమైతే పన్నులో మినహాయింపు ఇవ్వాలా?

ఇస్తే ఆ మేరకు నిర్ధారించే హక్కు ఎవరికి ఉంటుంది? డిమాండ్ శాశ్వత ప్రాతిపదికగా ఉండాలా లేకా దానిని కాలానుగుణంగా మారుస్తూ ఉండాలా? బకాయిల విషయంలో రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వాటిని వసూలు చేయడానికి ఏమిచేయాలి? రాజ్య ఆదాయాన్ని పెంచడానికి ఏమి చేయాలి?

## అక్బర్ సంస్కరణలు :

**సంస్కరణలకు కారణాలు :** పై సమస్యలపై అక్బర్ చాలా వరకు నిర్ణయాలు తీసుకున్నాడు. అలా చేయడంలో అతడు రైతాంగ సంక్షేమం, రాజ్య ఆదాయాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చాడు. దీర్ఘకాలిక దృష్టి, ప్రభుత్వంలో అసమాన ప్రతిభావంతులున్నా అక్బర్ భూమి శిస్తు చెల్లింపు సమస్యలన్నింటినీ ఒకేసారి పరిష్కరించలేకపోయాడు. అతడు కొన్ని తప్పులు కూడా చేశాడు. అయితే తప్పులు బయటపడగానే వాటిని సరిదిద్దడానికి అతడు ఎప్పుడూ ఆందోళన చెందేవాడు. అందుకే అతడి సంస్కరణలు సుదీర్ఘకాల విలువను సంతరించుకున్నాయి. అలాగే అతడు ప్రజలలో అమితమైన ఆదరణ పొందాడు. అతడి సంస్కరణలకు దారి తీసిన ముఖ్య కారణాలు:

1. విస్తరణ, అభివృద్ధికివెసులుబాటు కల్పిస్తూ రాజ్య ఆదాయాన్ని నిర్దిష్టంగా, శాశ్వత ప్రాతిపదికన నిర్ధారించాలి.
2. రైతు సంతోషంగా, సంతృప్తికరంగా ఉండి సామ్రాజ్యానికి విధేయునిగా వ్యవహరించాలి.
3. స్థానిక అధికారులు లేదా జాగీర్దార్లను కట్టడి చేసి రైతాంగాన్ని అణచివేత నుండి కాపాడాలి.
4. న్యాయవర్తనం, మినహాయింపుల ఆధారంగా భూమి శిస్తు చెల్లింపుల సమస్యను పరిష్కరించేందుకు ఒక శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వ్యవస్థ సాఫీగా సాగాలి, రాజ్యఖజానాపై భారం కాకూడదు.
5. అవినీతి, దౌర్జన్యానికి తావు లేకుండా అన్ని వర్గాల చట్టబద్ధమైన హక్కులను పరిరక్షించాలి.
6. ప్రతి విషయం స్పష్టంగా, నిస్సందేహంగా ఉండాలి. అలా సరైన గణనాన్ని సాధ్యం చేయాలి.
7. సాధ్యమైనంత వరకు రైతు, ప్రభుత్వాల మధ్యదళారులను నిరోధించాలి. దళారి ఉన్న ప్రతిచోటా అతడి అధికారాలు, విధులను స్పష్టంగా నిర్ధారించి అపోహలకు, అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలి.

**తొలి దశ సంస్కరణలు :** ఆ కాలపు ఆమోదయోగ్యమైన సాంప్రదాయాల ప్రకారం రైతే భూయజమాని అని అక్బర్ అంగీకరించాడు. సార్వభౌమునికి కేవలం పన్ను అడిగే హక్కు మాత్రమే ఉంటుందని చెప్పాడు. రైతును కాపాడి అతడి సంక్షేమానికిపాటు పడడం రాజధర్మం. అందుకే ఒక రైతు బకాయి ఉన్న పన్నును పూర్తిగా చెల్లించడంలో విఫలమైతే అతడిని భూమి నుండి వేరు చేయకూడదు. బకాయి చెల్లించేలా అతడిపైఒత్తిడి మాత్రమే తీసుకురావాలి.

అయితే ఒత్తిడి తేవడానికి అనుసరించిన కొన్ని పద్ధతులు మరీ కఠినంగా ఉండేవి. కాని భూమిని వదలి రైతు పారిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఎందుకంటే అలాంటి అత్యవసర పరిస్థితులలో వేరే రైతులెవ్వరూ ఆ భూమిని సాగు చేయడానికి పూనుకోరు. బకాయిల చెల్లింపునకు విపరీతమైన ఒత్తిడి తీసుకువచ్చి రైతు తన భూమిని వీడిపోయేలా చేయకూడదు. అందుకు బదులుగా తేలికపాటి వాయిదాలలో (ఐదు శాతం) అన్ని బకాయిలను వసూలు చేయాలి.

**జబ్తీ వ్యవస్థ :** అక్బర్ సామ్రాజ్యం విస్తరణ దశలో ఉంది. దానిని సమర్థవంతంగా పాలించడానికి, ముఖ్యంగా రెవెన్యూ వ్యవహారాల్లో, అక్బర్ ప్రయోగాలు చేయడం మొదలుపెట్టాడు. ఆ ప్రయోగాలన్నింటిని (అతడి పాలనాకాలంలోని 24వ సంవత్సరం వరకు) ఉమ్మడిగా జబ్తీలేదా బందోబస్త్ వ్యవస్థగా పరిగణిస్తారు. సామ్రాజ్య సరిహద్దులు విస్తరించే కొద్దీ సామ్రాజ్యమంతటికీ ఏక స్వరూప పన్ను శాతం (షేర్షా పాలనలో కూడా ఇలాంటి వ్యవస్థ ఉండేది) రాను రాను మరీ అన్యాయంగా తయారైంది. చెల్లింపుల విషయంలో ప్రజలు వెనుకాడారు. తమ ప్రాంతంలో మార్కెట్ ధరలు తక్కువగా ఉంటే అధిక శాతంలో ఉన్న పన్నును చెల్లించడానికి వారు సహజంగానే విముఖత చూపేవారు. అందుకే 1565లో అక్బర్ స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ వారి వారి ప్రాంతాలలో ఉన్న ధరలను కేంద్రానికి తెలియజేయాలన్నాడు. ఆ ధరలకు కేంద్ర ఆమోదం పొందిన తర్వాత పన్నును లెక్కించాలని సూచించాడు. ఫలితంగా చాలా ప్రాంతాలలో పన్ను డిమాండ్ తగ్గి రైతులు సంతృప్తి పడ్డారు.ఆ విధంగా ఈ కాలంలో ఏకస్వరూప పన్ను శాతం స్థానంలో స్థానిక పన్ను షెడ్యూళ్లు అనేకం రూపొందాయి.

మూడేళ్ల తర్వాత, అంటే 1568లో, గత సంవత్సరాల గణాంకాల ఆధారంగా ఒక శాశ్వత పన్ను అంచనాను లెక్కించారు. ప్రభుత్వ డిమాండ్ కౌలుదారుని భూమి సమస్తానికి వర్తించినట్లు కనబడుతోంది. ఇది అందరినీ తృప్తి పరచలేదు. ఎందుకంటే దిగుబడిలో తేడాలను లేదా స్థానిక ధరలను అది పట్టించుకోలేదు. సాగులో లేని భూమికి కూడా కౌలుదారుడు శిస్తు చెల్లించాల్సి వచ్చింది. రైతుల వ్యతిరేకత కారణంగా రెండేళ్ల లోపే ఈ వ్యవస్థను రద్దు చేశారు. అందుకే 1570-71లో ముజఫర్ఖాన్, తోడర్మల్లు సరికొత్త మార్పును ప్రవేశపెట్టారు. సగటు దిగుబడికి, తాజా ధరల గణాంకాలను సేకరించాలని ప్రతి పరగణకు చెందిన కానుంగోను ఆదేశించారు. సగటు దిగుబడి ఆధారంగా ధాన్య వాటాను నిర్ధారించారు. ఈ వాటాను మార్కెట్ధరల సగటు ఆధారంగా నగదు రూపంలో మార్చేవారు.ధరల సూచికను ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వమే ఆమోదించాల్సి ఉంటుంది. ఈ ఏర్పాటువల్ల మూడు ప్రయోజనాలు దక్కాయి. (1) అది స్థానిక దిగుబడి ఆధారంగానిర్ధారణ అయ్యేది (2) గత కొన్నేళ్ల దిగుబడిని సగటుగా తీసుకొని దిగుబడిని లెక్కించేవారు (3) ధాన్యవాటాను స్థానిక ధరల సూచిక ఆధారంగా నగదుగామార్చేవారు.

అయితే పదేళ్లపాటు అమలైన తర్వాత ఆచరణాత్మక సమస్యలు వెలుగులోకి రావడంతో ఈ ఏర్పాటును కూడా సవరించాల్సి వచ్చింది. స్థానిక ధరలకు చక్రవర్తి ఆమోదం ఉండాలి.

అతడు రాజధానిలో ఉంటే ఈ విషయాన్ని తొందరగా నిర్ధారించేవారు. స్థానిక అధికారులు సమయానికి గణాంకాలు పూర్తి చేసేవారు. అయితే చక్రవర్తి తరచూ పర్యటనలలో ఉండేవాడు. అలాంటి సమయాలలో అతడి ఆమోదం పొందడానికి చాలా సమయం పట్టేది. కొన్ని సార్లు ధరల జాబితా సరైన గణాంకాలు అందించలేదన్న అనుమానం కూడా వ్యక్తమయ్యేది. ఒక వేళ  విచారణను చేపడితే ధరల ఆమోదం మరింత ఆలస్యమయ్యేది. ఈ ఆలస్యం ఎన్నో సమస్యలకు దారి తీసేది. కొన్నిసార్లు ధరలు పడిపోయేవి. ఇలాంటి సందర్భంలో రైతులు అధిక పన్ను విధింపుపై తీవ్ర నిరసన తెలిపేవారు. కొన్ని సార్లు పన్నుల వసూలు అసాధ్యంగా మారేది. ఎందుకంటే రైతులు ఆలోగా తమ మిగులు ధాన్యాలను విక్రయించి పూర్తిగా ఖర్చుపెట్టేవారు. ఈ కారణంగా అనవసరపు బెదిరింపులు లేదా బకాయిలు పేరుకుపోవడం సంభవించేవి. రెండు సందర్భాల్లోనూ తన తప్పు ఏదీ లేక పోయినా స్థానిక అధికారి సామర్థ్యం, నిజాయితీలపై నీలినీడలు అలుముకొనేవి. ఈ బకాయిలు ప్రభుత్వానికి కూడా ఇబ్బంది కలిగించేవి. అందుకే బకాయిల వసూలును మధ్యలోనే నిలిపివేసేవారు.

**ఇతర సంస్కరణలు:** భూమి శిస్తును అంచనా వేయడానికి అక్బర్ కొలతను ప్రతిపాదించాడు. అందుకు అనుగుణంగా యంత్రాంగాన్ని ఏర్పాటు చేశాడు. అంతకుముందు వ్యవసాయ పొలాలను నారు తాడుతో కొలిచేవారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆ తాడు బిగుసుకుపోయేది లేదా విస్తరించేది. దీని వల్ల రైతులలో ఆందోళన, అసంతృప్తి చెలరేగేవి. కనక చక్రవర్తి కొత్త జరీబ్‌ను వాడాలని ఆదేశించాడు. జరీబ్ అంటే ఇనుపగొలుసులతో జతపరచబడిన వెదురు కట్టెల హారం. దాని పొడవు ఎప్పుడూ స్థిరంగానే ఉండేది. అడుగుల కొలతలో కూడా అతడు మార్పు చేశాడు. ఆ రోజులలో అత్యంత జనరంజకమైన కొలత గజ్–ఎ–సికందరీ. అది 42 అంకెల పొడవు ఉండేది. అయితే వస్త్రానికి కొలతగా గజ్–ఎ–అక్బర్ షాహీ ఉండేది. అది 46 అంకెల పొడవు ఉండేది. సామ్రాజ్యమంతటా కొలతను స్థిరీకరించ డానికి చక్రవర్తి 1586–87లోగజ్–ఎ–ఇలాహీని ప్రవేశపెట్టాడు. అది కేవలం 41 అంకెల పొడవు మాత్రమే ఉండేది. అన్ని కొలతల కంటే అది ప్రామాణికంగా మారింది. పొలాలకు ప్రాథమిక లెక్కింపు విభాగంగా బీఘా ఉండేది.దాని వైశాల్యం 3,600 చదరపుటడుగులు. హిజ్రాశకం ఆధారంగా భూమి శిస్తును సమానంగా వసూలు చేసేవారు. (హిజ్రా శకంలోని 31 ఏళ్లు సూర్య శకంలోని 30 ఏళ్లకు సమానంగా ఉండేవి. వ్యవసాయదారులకు ఇది అన్యాయంగా పరిణమించింది. కనక చక్రవర్తి కొత్త సూర్య శకాన్ని 1584 డిసెంబరు 10 నుండి ప్రవేశపెట్టాడు. ఈ శకాన్ని ఇలాహీ శకంగా పిలిచేవారు. భూమి శిస్తును సూర్య సంవత్సరం ప్రకారం రుతువుల వారీగా వసూలు చేయాలని కూడా అతడు ఆదేశించాడు.

### భూమి వర్గీకరణ:

పన్నుల భారం మరీ ఎక్కువ కాకుండా నిరోధించేందుకు చక్రవర్తి సామ్రాజ్యంలోని వ్యవసాయ భూమిని నాలుగు రకాలుగా వర్గీకరించాడు. భూసారం ఆధారంగా భూములను

వర్గీకరించి తగిన నిష్పత్తిలో కౌలును నిర్ధారించాడు. నాలుగు రకాల భూములు ఇవే: పొలజ్, పరౌతి, చాచర్, బంజర్. ప్రతి సంవత్సరం పంటను సాగు చేసేభూమిని పొలజ్ అనేవారు. ఇలాంటి భూములే రాజ్యానికి వార్షిక ఆదాయంతెచ్చేవి. ఒకటి రెండేళ్ల పాటు వివిధ కారణాలవల్ల సాగుకు నోచుకోని భూమిని పరౌతి అనేవాడు. ఈ తరహా భూములకు వర్తించే నిబంధన ఏమిటంటే ఎప్పుడైతే వాటిని సాగులోకి తెస్తారో వాటి నుండి పొలజ్ భూములతో సమానంగా శిస్తు వసూలు చేయాలి. వరుసగా మూడు, నాలుగేళ్ల పాటు సాగుకు నోచుకోక క్షీణించి పోయే భూములు సాగులోకి వచ్చినా కొన్నేళ్ల వరకు దిగుబడి సాధారణ స్థాయి కంటే తక్కువగా ఇచ్చేవి. అలాంటి భూమిని చాచర్ అనేవారు. ఈ భూమికి నిబంధన ఏమిటంటే ఐదేళ్ల తర్వాతే (సాగులోకి వచ్చాక) పొలజ్‌తో సమానంగా శిస్తు చెల్లించాలి. ఐదు లేదా అంతకంటే ఎక్కువ ఏళ్లుగా సాగుకు నోచుకోని భూమిని బంజర్ అని పిలిచేవారు. ఈ భూమిని తిరిగి సాగులోకి తేవడానికి ప్రత్యేక పన్నును నిర్ధారించారు. పన్ను రాయితీలు ఇవ్వడంలో ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటంటే భూములు నిరుపయోగంగా ఉండకుండా చూడటమే. ఒక వేళ భూములు నిరుపయోగంగా ఉంటే రాజ్యానికి వాటి నుండి ఎలాంటి ఆదాయం ఉండదు. తొలి సంవత్సరాలలో నామమాత్రపు కౌలు ఉండడంతో ఔత్సాహికులు సాగులో లేని భూమిని పునరుద్ధరించేవారు. దీని వల్ల రాజ్యానికి, కౌలుదారులకు కూడా ప్రయోజనం కలిగేది. అన్ని ఏర్పాట్లను పొలజ్‌ను ప్రామాణికంగా తీసుకొని చేశారు. సాధారణ నియమం ఏమిటంటే సగటు ఉత్పాదనలో మూడో వంతు భాగాన్ని భూమి శిస్తుగా వసూలు చేయాలి. ఇక్కడ అక్బర్ షేర్‌షా వ్యవస్థను అవలంబించాడు. ఉత్పత్తి ఆధారంగా భూములను వర్గీకరించి, ధరల జాబితాను రూపొందించడం మొదలైన చర్యలన్నీ షేర్‌షా ప్రవేశపెట్టినవే. షెడ్యూళ్లలో రెవెన్యూ డిమాండ్‌ను దిగుబడి రూపంలోనే చూపారు. అయితే సాధారణంగా అక్బర్ ప్రతి సంవత్సరం కోత సమయంలో ధరల పట్టికను నిర్ధారించి ఆమోదించేవాడు. ఆమోదించిన ధరలను ఆమిల్‌లకు పంపేవారు. వీరు ధాన్యవాటాను ఆమోదిత ధరల ఆధారంగా నగదు రూపంలో మార్చేవారు. దాని ఆధారంగానే పన్నును వసూలు చేసేవారు. కొన్ని ప్రాంతాలలో అయితే రైతులు ధాన్యరూపంలోనే పన్ను చెల్లిస్తానని కోరుకుంటే అతడికి అలాగే అనుమతించేవారు.

**దహ్‌సాలా వ్యవస్థ:** 1579-80లో జబ్తీ వ్యవస్థ స్థానంలో వచ్చిన ఏర్పాటును దహ్‌సాలా వ్యవస్థగా పరిగణిస్తారు. ఈ వ్యవస్థ కింద వివిధ పంటల సగటు దిగుబడిని, అలాగే గత పదేళ్లుగా ఉన్న సగటు ధరలను లెక్కించేవారు. సగటు దిగుబడిలో మూడోవంతు రాజ్య వాటాగా ఉండేది. అయితే రాజ్య డిమాండ్‌ను నగదు రూపంలో పేర్కొనేవారు. గత పదేళ్లుగా ఉన్నధరలను సగటుగా తీసుకొని రాజ్య వాటాను ధన రూపంలో మార్చేవారు. ఆ విధంగా ఒక భీఘా భూమి దిగుబడిలో వాటాను పుట్ల రూపంలో ఇచ్చేవారు. అయితే సగటు ధరల ఆధారంగా రాజ్య డిమాండ్‌ను ప్రతి బీఘాకు రూపాయిలలో నిర్ధారించేవారు. తర్వాతి కాలంలో మరికొంత మార్పు తీసుకువచ్చారు. స్థానిక ధరలనే కాకుండా ఒక రకమైన ఉత్పాదకత ఉన్న పరగణాలను ప్రత్యేక అంచనా మండళ్లుగా (వీటిని దస్తూర్ అనేవారు) విభజించేవారు. ఆ విధంగా రైతులు స్థానిక దిగుబడే కాకుండా స్థానిక ధరల ఆధారంగా కూడా పన్ను చెల్లించాల్సి వచ్చేది.

అన్ని పక్షాలకు దహ్‌సాలా వ్యవస్థ లబ్దిని చేకూర్చింది. ఒక ప్రత్యేకమైన పంటకు ఏ మేరకు పన్ను చెల్లించాల్సి ఉంటుందో రైతుకు ముందుగానే తెలిసిపోయేది. కనక అతడే స్వయంగా లెక్క కట్టి పన్ను వసూలు సయమంలో ఎంత చెల్లించాలో నిర్ధారించుకునే వాడు. ఆమిల్, కౌర్యాన్‌ల పని మరీ సులభమైంది. నాట్లు అయిపోగానే వారు తన పరిధిలోని గ్రామాలలో పర్యటించేవారు. పట్వారీల నివేదికలు ప్రతి పంట విస్తీర్ణాన్ని ముందే నిర్ధారించడంతో వారి పని కేవలం ప్రతి పొలం వద్ద పంటను నమోదు చేసుకోవడానికే పరిమితమయ్యేది. గ్రామం మొత్తం సర్వే పూర్తి చేసిన తర్వాత అంచనా షెడ్యూళ్లకు అనుగుణంగా ప్రతి రైతుకు సంబంధించి పొలం వారీ డిమాండ్‌ను లెక్కించేవారు. ప్రతి గ్రామానికి అంచనా వేసిన వాటాల వివరాలను ప్రాంతీయ దీవాన్‌కు పంపేవారు. ప్రతిరైతుకు వాటా రశీదును సరఫరా చేసేవారు.

లెక్కింపులో ఏవైనా పొరపాట్లు దొర్లితే పన్ను వసూలుకు ముందే వాటిని పసిగట్టి సవరించేవారు. తనకు ఏ మేరకు ఆదాయం లభించగలదో ప్రభుత్వానికి ముందే అంచనా ఉండేది. దాని ఆధారంగా పునఃపంపిణీ, కొత్త పథకాలను నిర్ణయించేది. ఈ వ్యవస్థ కింద తక్కువమంది పన్ను సేకరణదారులు తమ పనిని సమర్ధవంతంగా, అలవోకగా నిర్వహించగలిగారు. ఆ విధంగా రాజ్య వ్యయం గణనీయంగా తగ్గింది.

ఇప్పటి నుండి డహ్‌సాలా వ్యవస్థ ప్రామాణిక అధికార వ్యవస్థగా మారింది. తర్వాతకాలంలో ఈ వ్యవస్థ సామ్రాజ్యమంతటికీ విస్తరింపచేయడానికి ప్రయత్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవస్థలో మార్పు చేయలేని నిర్దిష్టమైన స్వరూపం ఉండేది కాదు. 1589-90 మధ్య ఢిల్లీ-అలహాబాద్ ప్రాంతంలో పంట ఎంత బాగా పండేదంటే ధరలు చాలా వరకు తగ్గాయి. అందుకే ఈ కాలంలో ఈ ప్రాంత కేటాయింపులకు తాత్కాలిక మినహాయింపులు (పన్ను చెల్లింపులో) అందించారు.

ఈ వ్యవస్థను అన్ని ప్రాంతాల్లో అమలు చేయాలని అక్బర్ భావించారు. అయితే అదెప్పుడూ సాధ్యం కాలేదు. ఫలితంగా కొన్ని ప్రాంతాలను మినహాయించి అక్కడి స్థానిక సాంప్రదాయాలను మార్చకుండా అలాగే కొనసాగించాడు. లాహోర్, ముల్తాన్, ఢిల్లీ, ఆగ్రా, అలహాబాద్, అవధ్, బీహార్, అజ్మీర్‌లోని కొంత భాగంతో కూడిన సామ్రాజ్య మధ్య ప్రాంతాన్ని ఈ వ్యవస్థ కిందికి తెచ్చారు. కొండ ప్రాంతాలలో, స్థానిక రాజులు, నాయకుల ప్రాబల్యం ఉన్న భూభాగాలలో దహసాలాను ప్రవేశపెట్టలేకపోయారు. అక్బర్ పాలన చివరి రోజులలో స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను ఈ వ్యవస్థ నుండి మినహాయించారు. ఈ ప్రాంతాలలో పరిస్థితులు ఉత్తర భారతదేశానికి భిన్నంగా ఉండేవి. ముఖ్యంగా కాశ్మీర్, కందహార్, సింధ్, దక్కను ప్రాంతాలు ఈ కోవకు చెందుతాయి. గుజరాత్, అజ్మీర్, బెంగాల్, ఒరిస్సా, మాల్వాలలో స్థానిక జాగీర్దార్లకే ఆధిపత్యం ఉండేది. అంతర్గత నిర్వహణ కోసం కేంద్రం ఈ జాగీర్దార్లకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. కనక ఈ ప్రాంతాలు దహ్‌సాలా వ్యవస్థకు వెలుపల ఉండిపోయాయి. ఖాన్‌దేశ్‌లో గ్రామం యూనిట్‌గా దిగుబడిని అంచనా వేసేవారు. పైన వివరించబడిన సంస్కరణలన్నీ మౌలికంగా ఖలీసా భూములకే వర్తించాయి. అక్కడ రెవెన్యూ నిధులను

జీతభత్యాలు గల ప్రభుత్వ అధికారులకు అప్పగించారు. జాగీరు, మదద్-ఎ- మాష్ లాంటి ఇతర భూములు కూడా ఉండేవి. అక్కడ జాగీర్దార్లే పన్నును వసూలు చేసేవారు. వీరికి కొంత వరకు స్వయం ప్రతిపత్తి ఉండేది. అయితే చక్రవర్తి రెవెన్యూ విధాన విశాల పరిధిలోనే వారు తమ విధులను నిర్వహించేవారు.

**ఆర్థిక సంస్కరణల ప్రాముఖ్యత:**

ముందుగా పేర్కొన్నట్లు ఈ సంస్కరణల ముఖ్య ఉద్దేశం రైతాంగాన్ని తృప్తిపరచడమే. అందుకే స్థానిక అధికారులకు రైతుల సమస్యలను పరిష్కరించాలని విస్తృతమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. తన సంస్కరణల ద్వారా అక్బర్ అవినీతికి అడ్డుకట్టవేశాడు. అధికారులలో నైతిక కర్తవ్యాన్ని పెంచాడు. పన్ను వసూలులో దౌర్జన్యానికి పాల్పడరాదని సూచించాడు. అన్నిరకాల చెల్లింపులకు క్రమబద్ధమైన రశీదులు జారీ చేయాలని, రాజ్య ఖజానాకు నేరుగా పన్ను చెల్లించేలా రైతులను ప్రోత్సహించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాడు. పంట విఫలమైతే రైతులకు పన్నులలో రాయితీ ఇచ్చేవారు. అలాగే బంజరు భూములను సాగులోకి తెచ్చే కౌలుదారులపై నామమాత్రపు పన్ను విధించేవారు. రాజ్యం, రైతాంగానికి ఉమ్మడిగా ప్రయోజనం చేకూర్చే ఉన్నత పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించేవారు. పంటలను మరింత విస్తరించేందుకు రాజ్య సహాయం అందించేవారు. అదనపు పన్నులను చెల్లించాల్సిన బాధ్యత నుండి రైతులను విముక్తి చేశారు. ఆ మేరకు అధికారులకు గట్టి హెచ్చరిక కూడా చేశారు. అయితే కొన్ని ప్రాంతాలలో ఈ కేంద్ర ఆదేశాలను తుంగలో తొక్కారు. రద్దయిన పన్నులు, బాధ్యతలలో జిజ్యా, తీర్థయాత్ర పన్ను, కానుకలు, భత్యాలు, కోశాధికారులు, పన్ను సేకరణదారులు డిమాండ్ చేసే కమిషన్లు, పశువుల గణనకు విధించే పన్ను ఉన్నాయి.

పై సంస్కరణలను విశ్లేషిస్తే శాంతి, సౌభాగ్యం, రైతుల శ్రేయస్సు పట్ల అక్బర్ ఎంత ఆసక్తి చూపాడో అర్థమవుతుంది. అయితే చక్రవర్తి ఆశించిన తీరులో సామ్రాజ్య అధికారులు దయార్ద్ర హృదయంతో వ్యవహరించలేకపోయారు. ఈ కారణంగా అక్బర్ రైతులకు తనకు చేతనైన సహాయం చేయలేకపోయాడు. కరోరీలు, ఆమిల్‌లు, కార్ఖున్‌లపై తీవ్రమైన ఫిర్యాదులు వచ్చాయి. ఉల్లంఘనదారులను తోడర్‌మల్ కఠినంగా శిక్షించాడు. వందలాది మంది అసమర్థులను ప్రభుత్వ ఉద్యోగాల నుండి తొలగించాడు. ఎన్ని శిక్షలు విధించినా, ఎంతగా బుజ్జగించినా అవకతవకలు చివరి వరకు కొనసాగాయి.

**ఇతర గొప్ప మొగల్ పాలకుల కాలంలో పరిస్థితులు:**

జహంగీర్ పాలనలో ప్రభుత్వ అధికారం కొద్దివరకే పెరిగింది. సాధారణ వైఫల్యాల కారణంగా ప్రభుత్వ సామర్థ్యం, ముఖ్యంగా రెవెన్యూ వ్యవస్థ ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొంది. గుజరాత్, బెంగాల్‌లకు దహ్‌సాలా వ్యవస్థను విస్తరించాలని జహంగీర్ ప్రయత్నించాడు. అయితే ఇందులో అతడు సాధించిన విషయం పరిధి, స్వభావాల గురించి ఎలాంటి వివరాలు అందుబాటులో లేవు.

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దహ్‌సాలా అమల్లో ఉన్న ప్రాంతాలలో సైతం తీవ్రమైన మార్పులు, నిలిపివేతలు కొనసాగాయి. గ్రామ పెద్ద లేదా రెవెన్యూ రైతులు (ఇజారాదార్‌లు)తో కలిసి ఉమ్మడి అంచనా వేయడం సాధారణ నియమంగా మారిపోయింది. జాగీర్దార్‌ల అధికారాలు

పెరిగాయి. వారు రైతులపై అణచివేతకు పాల్పడడంతో రైతులు తమ భూములను వదలి పారిపోయారు. సామ్రాజ్య ఆదాయాలు గణనీయంగా తగ్గాయి. పరిస్థితి ఎంత తీవ్ర రూపం దాల్చిందంటే జహంగీర్ తన తండ్రి మిగిల్చిన నిల్వలపై ఆధారపడ్డాడు. జహంగీర్ హయాంలో మొదలైన మరో దుష్ట సాంప్రదాయం ఆల్తంఘా భూములను అనేక మందికి కేటాయించడం. లబ్ధిదారుల నివాస లేదా జన్మ ప్రాంతంలో కేటాయించబడిన ఈ భూములు అనువంశికమైనవి. ఇలాంటి భూములే తర్వాతి కాలంలో జమిందారీలుగా బలపడ్డాయి.

షాజహాన్ నేతృత్వంలోని రెవెన్యూ వ్యవస్థ గురించి తగిన వివరాలు అందుబాటులో లేవు. దహ్‌సాలా వ్యవస్థ అతడి హయాంలో కూడా అభివృద్ధి చెందలేదని బోధపడుతోంది. రాజ్యం, రైతుల మధ్య ప్రత్యక్ష సంబంధం ఉండేది కాదు. జహంగీర్ పాలనలో మొదలైన ఉమ్మడి అంచనా షాజహాన్ హయాంలో సర్వజనీనమైంది. తన సామ్రాజ్య పరిధిలోని పౌరుల సంక్షేమం పట్ల షాజహాన్ ఎంతో శ్రద్ధ చూపేవాడని అనేక తార్కాణాలు ఉన్నాయి. అయితే రెవెన్యూ వ్యవస్థలో అతడు ప్రవేశపెట్టిన మార్పులన్నీ అంతిమంగా ప్రజా ప్రయోజనాలను దెబ్బతీశాయి. అతడి పాలనలో 33 నుండి 50 శాతం వరకు రెవెన్యూ అంచనా రేటును నిర్ణయించేవారు. షాజహాన్ రెవెన్యూ లేదా రాజ్య విధానంలో రైతులకు ప్రయోజనం కల్గించిన ఏకైక అంశం నీటి కాలువల నిర్మాణమే. తన ఆధీనంలోని భూమిని పూర్తిగా సాగుచేసినా లేదా పాక్షికంగానే సాగుచేసినా మొత్తం భూమికి పన్ను చెల్లించాలని రైతులను ఆదేశిస్తూ అతడు రెవెన్యూ విధానంలో మరో మార్పు ప్రవేశపెట్టాడు. ఫలితంగా ప్రజల ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారింది. ఈ కాలంలో కరవులు కూడా సంభవించడంతో ప్రజలు భారీగా నష్టపోయారు.

ఔరంగజేబ్ హయాంలో రెవెన్యూ వ్యవసాయం (ఇజారా వ్యవస్థ), కేటాయింపులు (జాగీర్లు) పెరిగిపోయాయి. వ్యవసాయ, రెవెన్యూ రంగాలలో ఎలాంటి మెరుగుదల రాలేదు. వాస్తవానికి రైతులు పతనం వైపు పయనించారు. అలాగే ఔరంగజేబ్ ప్రభుత్వం ఎదుర్కొన్న ఆర్థిక సమస్యల కారణంగా అంచనా రేటును దిగుబడిలో సగభాగంగా నిర్ధారించారు. సాధారణంగా రెవెన్యూ వ్యవసాయంవైపు మొగ్గు చూపేవారు. ఎందుకంటే దాని వల్ల రాజ్యానికి పన్నుల సేకరణ వ్యయం గణనీయంగా తగ్గేది. రెవెన్యూ వ్యవసాయమంటే భూములను ఒక వ్యక్తికి గుత్తకు ఇవ్వడం లేదా రెవెన్యూ వసూలు చేసే హక్కును కొందరు దళారులకు వేలం పాట ద్వారా కల్పించడం. రెవెన్యూ వ్యవసాయ వ్యవస్థలో పెరుగుదల కారణంగా రాజ్యం, రైతాంగాల మధ్య ప్రత్యక్ష సంబంధం ఆచరణలో దాదాపు పూర్తిగా తెగిపోయింది.

స్థానిక అధికారుల సహాయంతో పట్వారీలు, ముకద్దమ్‌లు, కానుంగోలు, చౌదరీలు రైతులను దోచుకున్నారు. పంట దిగుబడిలో సగభాగాన్ని రైతుకు దూరం చేశారు. ఉన్నతాధికారులను వెనుకేసుకు వచ్చేవారు. రైతాంగానికి అనుకూలంగా ఉండే సామ్రాజ్య శాసనాలను పక్కనపెట్టేవారు. శాసనాలు రైతులకు వ్యతిరేకంగా ఉంటే వాటిని గట్టిగా అమలు చేసేవారు. ఒకవేళ రైతు తన పొలాన్ని సాగు చేయడంలో విఫలమైతే అతడిపై 'ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం' అనే నింద మోపి మొత్తం పన్నును వసూలు చేసేవారు. ఒక వేళ

పంటలు విఫలమయ్యాయని రైతు ఫిర్యాదు చేస్తే అతడి కథనాన్ని అబద్ధంగా పరిగణించేవారు. అతడికి ఎలాంటి మినహాయింపులు ఇచ్చేవారు కాదు. రైతుకు రుణాలు మంజూరు అయితే దళారులు కొంత మొత్తాన్ని దిగమింగేవారు. బకాయిల వసూలుకు వినూత్నమైన పద్ధతులను అవలంబించేవారు. పరిస్థితులను భరించలేక రైతు ఒకవేళపారిపోతే, అతడిని వేటాడి పట్టుకొని తీవ్రంగా శిక్షించేవారు. పొలాలకు తిరిగి వెళ్లేలా బలవంతం చేసేవారు. కనుక చాలా మంది రైతులు దయనీయమైన జీవితాన్ని గడిపారు. తొలుత ఔరంగజేబ్ రైతుల సమస్యలను, బాధలను నిర్మూలించడానికి ప్రయత్నించాడు. అయితే రాజ్య ఆర్థిక సమస్యలు పెరిగిపోవడంతో అధికారులు, దళారులను బాధ్యత, న్యాయమనే పథంలో ఉంచడానికి బదులు స్థానిక అధికారుల నుండి సాధ్యమైనన్నీ వనరులను సేకరించడంపైనే ఔరంగజేబ్ ఆసక్తి చూపాడు. ఈ పరిస్థితులు 18వ శతాబ్దంలో మరింత దిగజారాయి.

భూమి యాజమాన్య సమస్యను పరిష్కరించడంలో మొగల్‌లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని పై అధ్యయం స్పష్టం చేస్తుంది. ఈ సమస్యపై అక్బర్ తగిన దృష్టి సారించాడు. తోడర్‌మల్ లాంటి సమర్థుల సహాయంతో సంతృప్తికరమైన అంచనా వ్యవస్థను రూపొందించగలిగాడు. తర్వాతి తరాలకు కూడా అక్బర్ వ్యవస్థ స్ఫూర్తినిచ్చింది. వ్యవస్థను అమలు చేయడంలో ఎప్పుడైతే ఉదాసీనంగా వ్యవహరించారో అప్పుడు రైతాంగ జీవితమే కాకుండా రాజ్య ఆదాయాలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

## మొగల్‌ల మన్సబ్ వ్యవస్థ :

**వివరణ :** భారతదేశ పరిపాలనా చరిత్రలో మొగల్‌లు ప్రవేశపెట్టిన మన్సబ్ వ్యవస్థ వినూత్నమైన స్థానాన్ని ఆక్రమించింది. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా మొగల్‌లు ఈ వ్యవస్థను భారతదేశంలో ప్రవేశపెట్టారు. క్రమక్రమంగా ఈ వ్యవస్థ సంక్లిష్టంగా తయారైంది. సంస్థానాధీశులు, పౌర, సైనిక పరిపాలన సమ్మేళనంగా ఎదిగింది. ఈ ఏకగవాక్ష వ్యవస్థ కింద సంస్థానాధీశులు, సైనిక నాయకులకు మన్సబ్‌లను కట్టబెట్టారు. (మన్సబ్ అంటేహోదా) వాటిని సంఖ్యాపరంగా గణించారు. వారిని ముఖ్యంగా పౌర, సైనిక పరిపాలనా విభాగాలలో నియమించి ఒక భారీ వ్యవస్థను సృష్టించారు. మన్సబ్ లేని మొగల్ అధికారి ఒక్కరు కూడా ఉండేవారు కాదు. అధికారి హోదాను సూచించడమే కాకుండా అతడి జీతాన్ని మన్సబ్‌లు నిర్ధారించేవి (మన్సబ్‌లు ఉన్న అధికారిని మన్సబ్‌దార్ అని పిలిచేవారు). అలాగే, అశ్వాలు, యుద్ధ పరికరాలతో కూడిన సైనికులను సామ్రాజ్య సేవ కోసం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచాల్సిన బాధ్యత కూడా మన్సబ్‌దార్‌పై ఉండేది.

### అక్బర్ సంస్కరణలు :

మన్సబ్ వ్యవస్థ ఒక స్థిరమైన దృగ్విషయం కాదు, అది సజీవ ప్రగతి. ఒక సంస్థగా అది పెరుగుతూనే పోయింది. సంక్లిష్ట అంశాలు అందులో చేరుతూపోయాయి. వ్యవస్థలో కొన్ని శక్తులు ప్రవేశించడం కొన్నింటిని తొలగించడం ముఖ్యమైన మార్పులను సూచిస్తాయి. కాలక్రమంలో ఈ మార్పులు చేర్పులు జరిగాయి. అయితే ఈ వ్యవస్థ

పుట్టుపూర్వోత్తరాలను మంగోలుల సైనిక నిర్వహణలో వెదికి పట్టుకోవచ్చు. భారతదేశంలో దానిని సమగ్రంగా అభివృద్ధి పరచిన ఘనత అక్బర్ మేధకే దక్కుతుంది. బాబర్, హుమాయూన్‌లు కూడా ఆ దిశలో గణనీయమైన కృషి చేశారు.

అక్బర్ పాలన తొలి దశకంలో సంస్థానాధీశుని సైన్యం, అతడి వేతనం మధ్య ఎలాంటి పోలిక ఉండేది కాదు. బహుశా ఈ కాలంలో, అంతకుముందు గడిచిన సంవత్సరాలలో సైనిక బలగాల సంఖ్యను నిర్దిష్టంగా నిర్ధారించకపోయి ఉండవచ్చు. వేతనాలను కూడా ఇష్టానుసారంగా కేటాయించి ఉండవచ్చు. అయితే తన పాలనలో 11వ ఏట (1566-67) అక్బర్ క్రమబద్ధీకరణ ప్రక్రియను మొదలు పెట్టారు. సైనిక బాధ్యతలను వేతనాలతో సమానంగా ఉండేలా నిర్ధారించేందుకు ప్రయత్నించాడు. తన పాలనలో 18వ ఏట (1573-74) దాగ్ (ముద్రల వ్యవస్థ), చెహ్రా (సైనికుల వివరణ పత్రం)లను ప్రవేశపెట్టాడు. సామ్రాజ్య అధికారుల హోదాను నిర్ధారించాడు. తదుపరి మన్సబ్ అనే పదాన్ని హోదాను సూచించడానికి ఉపయోగించడం మొదలు పెట్టారు. అంతకు ముందు ఆ పదం పదవిని సూచించేది.

అక్బర్ పాలనలో 40వ సంవత్సరం వరకు (1595-96) సంస్థానాధీశులకు కేవలం ఒకే హోదాను ప్రదానం చేసేవారు. ఆ హోదాలు వారి వేతనాన్ని నిర్ధారించేవి. అలాగే వారి మన్సబ్‌లకు సమానంగా అశ్వికులను పోషించాలని సూచించేవి. ఉదాహరణకు 50 మన్సబ్‌ల హోదా ఉన్న అధికారి 50 మంది ఆశ్వికులను కలిగి ఉండాలి. అయితే ఆచరణలో మన్సబ్‌దార్‌లందరూ తమ సంఖ్యకు అనుగుణంగా వేతనాలు రాబట్టినా కేవలం కొందరు మాత్రమే పూర్తిస్థాయి బలగాన్ని సైనిక జాబితాకు చేర్చగలిగారు. ప్రాంతీయ వేతనాలు కూడా ప్రభుత్వానికి పెద్ద నష్టం కలిగించినా అది వాస్తవాన్ని గ్రహించి వ్యవస్థలో మార్పులు చేసింది (1596-97).

ఇప్పుడు ఆశ్వికుల సంఖ్య వాస్తవంగా మన్సబ్ సంఖ్యకు భిన్నంగా ఉండడం ప్రారంభించింది. అప్పటి వరకు అమల్లో ఉన్న ఒక మన్సబ్ ఇప్పుడు మన్సబ్ ఉన్న వ్యక్తికే వర్తించింది. మరోవైపు కొత్త సవార్ సంఖ్యను జతపరిచారు. వీటి ఆధారంగా ప్రాంతీయ ధరలను నిర్ధారించారు. జాత్ అనే పదం పుట్టుపూర్వోత్తరాలు ఇక్కడే ఉన్నాయి. తొలి లేదా వ్యక్తిగత హోదాను జాత్ సూచిస్తే రెండవ హోదాను సవార్ అనే పదం సూచించింది. మన్సబ్‌దార్ పోషించాల్సిన ఆశ్వికుల సంఖ్యను సవార్ సూచిస్తుంది.. అక్బర్ పాలనా కాలంలో 41వ ఏట రచించబడిన అక్బర్ నామా (అబుల్ ఫజిల్ రచయిత) జంట హోదాల గురించి తొలిసారిగా ప్రస్తావిస్తుంది. తదుపరి మన్సబ్‌ను సూచించే సూత్రాలు మారాయి. మన్సబ్ ద్వంద్వ స్వభావాన్ని సంతరించుకుంది. రెండు సంఖ్యలు జాత్, సవార్లను వేర్వేరుగా సూచించాయి.

సంవత్సరంలోనే మన్సబ్‌దార్‌లను మూడు వర్గాలుగా విభజించారు. తొలి వర్గంలో తమ జాత్‌హోదాకు సమానంగా సవార్లను కలిగి ఉన్న మన్సబ్‌దార్‌లను చేర్చారు. రెండవ వర్గంలో తమ జాత్ హోదాకు సగం లేదా అంతకంటే ఎక్కువ మంది సవార్లను కలిగిన ఉన్న మన్సబ్‌దార్‌లను, మూడవ వర్గంలో జాత్‌హోదాకు సగానికి కంటే తక్కువ సవార్లను కలిగిన మన్సబ్‌దార్‌లను చేర్చారు. ఈ వర్గీకరణ ఆశ్విక బలగాన్ని పూర్తిగా నిర్వహించలేని మన్సబ్‌దార్ల అసమర్థతను సూచించింది. వారి సవార్ జీతాల్లో కూడా కోతను విధించారు.

## జహంగీర్ పాలనలో మన్సబ్ వ్యవస్థ :

అక్బర్ పాటించిన మన్సబ్ వ్యవస్థ మౌలిక లక్షణాలను జహంగీర్ అలాగే కొనసాగించాడు. అయితే, అతడు ఒక ముఖ్యమైన ఆవిష్కరణ చేశాడు. ఉపహోదాను తన పాలనలోని 10వ ఏట ప్రవేశపెట్టాడు. దు–అస్ప సహ్–అస్ప అనే రూపంలో ఈ ఉపహోదా ఉండేది. ఈ కొత్త ఉపహోదా సవార్ హోదాకు సంబంధించినది, అందుకే సవార్ హోదాతో కలిపి దానిని పేర్కొనేవారు. ఒక మన్సబ్‌దార్ తన జాత్ హోదా కంటే ఎక్కువ బలగాన్ని కలిగి ఉండాలని చక్రవర్తి ఎప్పుడైనా కోరుకుంటే అతడు మన్సబ్‌దార్ సవార్ హోదాలో కొంత భాగాన్ని దు–అస్ప సహ్ అస్పగా మార్చేవాడు. ఈ ఉపహోదా సిద్ధాంతపరంగా "ఒక ఆశ్వికుడు – రెండు లేదా మూడు ఆశ్వాలు" అనే అర్థాన్ని ఇస్తుంది. ఈ ఉపహోదా కలిగిన వ్యక్తి తన సవార్ల సంఖ్య కంటే రెండింతలు ఎక్కువగా ఆశ్వికులను కలిగి ఉండాలి. ఉదాహరణకు ఒక మన్సబ్‌దారుకు 3000 సవార్ హోదా కలిగి అందులో 1000 సవార్ హోదాను దు–అస్ప సహ్–అస్పగా మారిస్తే అతడు 2,000 మంది ఆశ్వికులను అందుకు అనుగుణంగా కలిగి ఉండాలి. మిగతా 2000 సవార్లకు 2,000 మంది ఆశ్వికులను పోషించాలి. యుద్ధరంగంలో ఉన్న మన్సబ్‌దారులకు ప్రోత్సాహకంగా ఇలాంటి ఉపహోదాను ప్రదానం చేసేవారు. అలాగే కొన్ని సందర్భాలలో చక్రవర్తి ప్రత్యేక అభిమానాన్ని తెలియజేయడానికి అలాంటి గుర్తింపును ఇచ్చేవారు.

## షాజహాన్ పాలనలో మన్సబ్ వ్యవస్థ:

జహంగీర్ వారసుడు షాజహాన్ మన్సబ్ వ్యవస్థలో కొన్ని మార్పులు చేసి అందులో లోపాలను తొలగించాడు తొలిగా అతడు "మూడోవంతు, నాలుగోవంతు" నియమాన్ని ప్రవేశపెట్టాడు. మన్సబ్‌దార్‌ల బాధ్యతలను తగ్గించడానికే ఈ నిబంధనను తీసుకువచ్చాడు. ఈ నిబంధన ప్రకారం ఒక ప్రాంతంలో సేవలు అందిస్తున్న మన్సబ్‌దార్ తన సవార్ హోదాలో మూడోవంతు సంఖ్యకు సమానంగా బలగాన్ని కలిగి ఉండాలి. వేరే ప్రాంతాలలో కేవలం నాలుగోవంతు బలగాన్ని కలిగి ఉండాలి. బల్ఖ్, బదక్షాన్ కాబుల్‌లలో కేవలం ఐదో వంతు బలగాన్ని కలిగి ఉండాలి. అప్పటికే మన్సబ్‌దార్‌లలో అమల్లో వున్న సాంప్రదాయాన్ని ఈ కొత్త నిబంధన చట్టబద్ధం చేసింది.

మన్సబ్‌దార్‌లకు బాధ్యతల నుండి మరింత వెసులుబాటు కల్పించేందుకు నెలసరి వేతనాన్ని కూడా షాజహాన్ ప్రవేశపెట్టాడు. జమ (జాగీర్‌లో అంచనా వేయబడ్డ రెవెన్యూ), హాసిల్ (వాస్తవంగా వసూలైన రెవెన్యూ)ల మధ్య నిష్పత్తిని సూచించేందుకు ఈ ఏర్పాటును ప్రవేశపెట్టారు. జమ కంటే హాసిల్ చాలా తక్కువ ఉన్నట్లు మన్సబ్‌దార్‌లు తరచూ గుర్తించేవారు. అయితే వారి వేతనాలు జమ ఆధారంగానే ఖరారయ్యేవి. ఈ తేడాను, దాని అనివార్యతను గుర్తించిన షాజహాన్ జాగీర్లను హాసిల్ ఆధారంగా వర్గీకరించాడు. ఒకటి ఎనిమిది నెలల జాగీర్, రెండవది ఆరునెలల జాగీర్. అంటే సంవత్సరంలో 12 నెలలకు అంచనా వేసిన రాబడిలో కేవలం ఎనిమిది లేదా ఆరు నెలలకు సంపద ఆదాయాన్ని ఇచ్చే జాగీర్లని వాటి అర్థం. వర్గీకరణకు అనుగుణంగా మన్సబ్‌దార్‌ల సవార్ కోటాను కూడా తగ్గించేవారు.

పై రెండు మార్పులవల్ల బలగాల పరిమాణం కుదించుకుపోవడానికి అనుగుణంగా, అలాగే సమర్థులైన మన్సబ్‌దార్‌లకు ప్రోత్సాహకాలు అందించేందుకు వీలుగా షాజహాన్ దు-అస్పసహ్-అస్పకు ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చారు. ఈ మార్పులన్నీ సిద్ధాంతం, ఆచరణ మధ్య ఉన్న వైరుధ్యాన్ని తొలించడానికి ప్రవేశపెట్టారు. షాజహాన్ వారసుడు ఔరంగజేబ్ నేతృత్వంలో కూడా ఇదే వ్యవస్థ కొనసాగింది.

**మన్సబ్ వ్యవస్థ లక్షణాలు:**

పైన వివరించినట్లు మొగల్‌ల మన్సబ్ వ్యవస్థ ముఖ్య లక్షణాలు ఈ విధంగా ఉన్నాయి. మొదట, అక్బర్ పాలనలో అది ద్వంద్వ హోదాను ప్రతిబింబించింది. జాత్, సవార్ హోదాలో ఈ వ్యవస్థ కింద కొనసాగాయి. జాత్ వ్యక్తిగత వేతనాన్ని, అధికార యంత్రాంగంలో హోదాను సూచించగా, సవార్ ఆశ్వికుల సంఖ్యను, వారికి చెల్లించాల్సిన వేతనాలను నిర్ధారించేది. జహంగీర్ కాలం నుండి దు - అస్ప సిహ్ అస్ప అనే ఉపహోదా సవార్ హోదాకు అదనంగా కొనసాగింది. సవార్ హోదా జాత్ హోదాకు సమానంగా లేదా తక్కువగా ఉండేది. అయితే ఔరంగజేబు పాలనా కాలంలో జాత్ హోదా కంటే సవార్ హోదా ఎక్కువ కలిగిన మన్సబ్‌దార్‌లు అనేకమంది ఉండేవారు. అలాగే జాత్‌హోదా తర్వాతనే సవార్ హోదా నిర్ధారణ అయ్యేది. రెండింటిలో జాత్ హోదాయే ముఖ్యమైనది. చివరగా సవార్ హోదా లేకుండానే జాత్ హోదాఉండేది (ముఖ్యంగా కవులు, చిత్రకారులు, కళాకారుల విషయంలో). అయితే దీనిని చాలా అరుదుగా ప్రదానం చేసేవారు. కాని జాత్ హోదా లేకుండానే సవార్ హోదా ఎన్నడూ ఉండేది కాదు.

రెండవది, మొగల్‌ల కంటే ముందుగా పాలించిన అల్లావుద్దీన్ ఖిల్జీ, షేర్‌షాలు దాగ్, చహ్రేలను ప్రవేశపెట్టారు. ఈ రెండు మన్సబ్ వ్యవస్థలో కీలక లక్షణంగా మారాయి. చక్రవర్తి భౌతికంగా తన ఆశ్వికదళం నాణ్యతను, పరిమాణాన్ని తనిఖీ చేయడానికి పై రెండు ఏర్పాట్లు సహకరించేవి.

ఆ విధంగా అవతకతవకలను నివారించడానికి అవకాశం ఉండేది. అలాగే బలగాల పరిణామం బట్టి హోదాను నిర్ణయించడానికి పై రెండు ఏర్పాట్లు కొలబద్దలుగా ఉండేవి. సైనిక సేవలు (బాధ్యతలు) నుండి మన్సబ్‌దార్‌లు తప్పించుకోకుండా అవి ముందస్తు జాగ్రత్తలుగా పనికివచ్చేవి.

మూడవది, సుమారు 66 రకాల మన్సబ్‌హోదాలు ఉండేవి. అంటే పది మన్సబ్‌లను మొదలుకొని 10,000 దాకా ఈ హోదాలు పెరిగేవి. అక్బరు తరువాత 50 నుంచి 60వేల మన్సబ్‌లను కూడా రాకుమారులకు ఇచ్చేవారు. ఒక వ్యక్తి సైనిక నిర్వహణ సామర్థ్యం, వ్యవస్థ సామర్థ్యాన్ని కాపాడగలిగే వ్యక్తికి చక్రవర్తే స్వయంగా ఈ హోదాను నిర్ణయించేవారు. ఒకే రూపంగల హోదాలను కలిగి వుండే మన్సబ్‌దారులను మూడు వర్గాలుగా విభజించారు. ఆశ్వికుల సంఖ్య ఆధారంగా ఈ వర్గీకరణ ఉండేది. నాల్గవది, ప్రతి మన్సబ్‌దార్ (పెద్ద చిన్న తేడా లేకుండా) సాధారణంగా ఒకరికి ఒకరు స్వతంత్రంగా వ్యవహరిస్తూ నేరుగా చక్రవర్తికే విధేయులుగా ఉండేవాడు.

## మన్సబ్ వ్యవస్థ పనితీరు:

మన్సబ్‌దార్లందరినీ చక్రవర్తే నేరుగా నియమించేవాడు. సాధ్యమైనంత వరకు మన్సబ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు చక్రవర్తి ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావలసిన అవసరం ఉండేది. కొన్నిసార్లు ఉన్నత సంస్థానాధీశులు, రాచరిక కుటుంబానికి చెందిన రాకుమారులు కూడా మన్సబ్‌దార్ పదవికి వ్యక్తులను చక్రవర్తికి సిఫార్సు చేసేవారు. సాధారణంగా వారి సిఫార్సులను ఆమోదించేవారు. భర్తీకి అవసరమైన ముఖ్యమైన అర్హత సామర్థ్యం. బలగాన్ని సమీకరించి నిర్వహించే వ్యక్తిగత సామర్థ్యం అవసరం. అయితే ఉన్నత కుటుంబ నేపథ్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఇచ్చేవారు. తొలుత మన్సబ్ ప్రదానం చేసిన పద్ధతిలోనే పదోన్నతులు కూడా కల్పించేవారు. వివిధ కారణాల వల్ల పదోన్నతులు ఇచ్చేవారు. సైనిక సేవలో అసమాన ప్రతిభ, సామర్థ్యానికి పెద్దపీట వేసేవారు. ఒక విలువైన లేదా అందమైన కానుక కూడా కొందరు సంస్థానాధీశులకు పదోన్నతిని తెచ్చిపెట్టేది. అయితే ఈ విషయం గురించి అంతగా పట్టించుకునేవారు కాదు.

జాత్ హోదాకు వేతనం ప్రధానంగా మన్సబ్‌దార్ వ్యక్తిగత అవసరాలను తీర్చడానికి ఉద్దేశించినది. అంటే అతడి కుటుంబం, వ్యక్తిగత వ్యవస్థను పోషించుకోవడానికి ఈ వేతనం ఉపయోగపడేది. సవార్, దు-అస్ప సిహ్-అస్ప హోదాల వేతనాలు మన్సబ్‌దార్ బలగానికి అయ్యే వ్యయాన్ని తీర్చడానికి ఉద్దేశించినవి.

ఏ అవసరానికైతే వేతనాలు చెల్లిస్తారో దాని ఆధారంగా వివిధ వర్గాల హోదాకు నిర్ధారించిన స్థాయిలు కొన్ని ముఖ్యమైన లక్షణాలను ప్రదర్శిస్తాయి. 1. జాత్ హోదాకు వేతనాన్ని ప్రతి హోదాకు వేర్వేరుగా పేర్కొన్నారు. ఎందుకంటే ఒక హోదా గల జాత్‌కు చెల్లించే వేతనం మరో జాత్ హోదాకు భిన్నంగా ఉండేది. 2. సవార్ హోదాకు వేతనాలు హోదా వారీగా ప్రత్యేకంగా చెల్లించేవారు కాదు. అయితే ప్రతి హోదాకు ఒక ధరను నిర్ణయించేవారు. ఈ వేతనాన్ని హోదాలను హెచ్చించడం ద్వారా నిర్ధారించేవారు. 3. సాధారణ సవార్ హోదాకు రెండింతల వేతనాన్ని దుఅస్ప, సిహ్ అస్పకు చెల్లించేవారు. ఎందుకంటే వీరి బాధ్యతలు ద్విగుణీకృతంగా ఉండేవి. అన్ని హోదాలకు కలిపి వేతనాన్ని జాగీర్ కట్టబెట్టడం ద్వారా (రెవెన్యూ అంచనాకు సమానంగా) చెల్లించేవారు. లేదా నగదు రూపంలో చెల్లించేవారు. తొలి రూపంలోనే వేతనాలు పొందడానికి మన్సబ్‌దార్‌లు మొగ్గు చూపేవారు. అందుకే వేర్వేరు కారణాలున్నాయి.

## మొగల్ పరిపాలనలో మన్సబ్ వ్యవస్థ పాత్ర:

న్యాయ స్థానం మినహా అన్ని ప్రజా సేవలను మొగల్‌ల మన్సబ్ వ్యవస్థ కిందికి చేర్చారు. ఒక మన్సబ్ దార్ సవార్ హోదా సూచించినట్లు సైనిక విధులను నిర్వహించడమే కాకుండా ఏ శాఖలోనైనా పని చేయడానికి సిద్ధమయ్యేవాడు. ఒక వ్యక్తి మన్సబ్‌హోదాకు, అతడి పదవికి నేరుగా సంబంధం లేకపోయినా రెండింటి మధ్య విశాలమైన లావాదేవీలు ఉండేవి. తన శాఖ విధుల నిర్వహణలో చక్రవర్తిని మెప్పించడంలో విఫలమయ్యే మన్సబ్‌దార్‌ను హోదా కుదించడం ద్వారా శిక్షించేవారు. ఆ విధంగా మన్సబ్‌దార్‌లు ఏ విధంగా చూసినా మొగల్ సామ్రాజ్యంలో పాలకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. సమకాలీన ఫ్రెంచి రాచరిక

వ్యవస్థకు భిన్నంగా ఉండేవారు. ఫ్రెంచి వ్యవస్థ పరిపాలనా యంత్రాంగం నుండి పూర్తిగా విడిపోయి ఉండేది.

ఇప్పుడు మన్సబ్ వ్యవస్థ సులక్షణాలు, దుర్లక్షణాల గురించి చర్చిద్దాము. తొలి సులక్షణం ఆ వ్యవస్థ అనువంశికం కాకుండా కేవలం ప్రతిభపై ఆధారపడి ఉండేది. ఆ విధంగా ఎందరో సమర్థులు మన్సబ్ వ్యవస్థలో చేరగలిగారు. రెండవది, మొగల్ పాలకులు బదిలీలు, దాగ్, చెహ్రా లాంటి నియంత్రణా వ్యవస్థలతో స్థానిక బలిమిని, భూస్వామ్య సాంప్రదాయాలను చాలా వరకు నివారించారు. మూడవది, ఈ వ్యవస్థ రాచరికాన్ని బలోపేతం చేసింది. ఎందుకంటే మన్సబ్‌దార్‌లు చక్రవర్తికి నేరుగా రుణపడి ఉండేవారు. దుర్లక్షణాల విషయానికి వస్తే ఇలాంటి ఏకగవాక్ష వ్యవస్థ నిర్వహణ సహజంగానే అనేక సంక్లిష్ట పరిస్థితులకు, చివరకు అసమర్థతకు కూడా దారి తీసింది. పౌర విధుల నుండి సైనిక విధులను సక్రమంగా విభజించలేదు. పౌరులను సైనిక దండయాత్రలకు కూడా పంపడంతో అపార ప్రాణ నష్టం సంభవించింది. తర్వాతి కాలంలో జాగీర్ల బదిలీ ఉదంతాలు తగ్గిపోవడంతో మన్సబ్‌దార్‌లు స్థానికంగా బలపడ్డారు. ఈ పరిణామం 18వ శతాబ్దంలో మొగల్ సామ్రాజ్య విచ్ఛిన్నంలో ప్రధాన పాత్రను పోషించింది.

## మొగల్‌ల జాగీర్ వ్యవస్థ:

## జాగీర్ అర్థం, స్వభావం:

జాగీర్ అంటే విశాలమైన వ్యవసాయ భూముల సమాహారం. వీటిని మన్సబ్‌దార్‌లకు వేతనం స్థానంలో కట్టబెట్టేవారు. వేతనాలకు బదులు ప్రదానం చేసే జాగీర్లను తన్‌ఖ్వా జాగీర్లని పిలిచేవారు. అలాగే వతన్ జాగీర్లు ఉండేవి. ఇవి అనువంశిక ఆస్తులు. వీటిని స్వతంత్ర సామంతులకు అప్పగించేవారు. స్వతంత్ర నాయకులు సామ్రాజ్యసేవలో ఉన్నట్లయితే వారికి తన్‌ఖ్వాజాగీర్లు కూడా అప్పగించేవారు. 1647లో సుమారు 60 శాతం సామ్రాజ్య భూమిని 500 మన్సబ్‌ల కంటే ఎక్కువ హోదా గల 445 మంది మన్సబ్‌దార్‌లకు కట్టబెట్టారని నివేదికలు పేర్కొంటున్నాయి. మొగల్‌ల పాలనలో జాగీర్ భూములకు తోడు ఖలీసా భూములు కూడా ఉండేవి. వీటి ఆదాయాన్ని సామ్రాజ్య ఆస్థానం, చక్రవర్తి వ్యక్తిగత వ్యయం కోసం వినియోగించేవారు. మదద్-ఎ-మాష్ భూముల నుండి లభించే ఆదాయాన్ని మత సంస్థలు, మత గురువులు, విద్వాంసులు, తదితర భక్తులకు వ్యక్తిగత నిర్వహణ కోసం కేటాయించేవారు. కనక మొగల్ కాలపు జాగీర్ ఢిల్లీ సుల్తాన్ రాజ్య ఇక్తాకు సమానంగా ఉండేది.

ఢిల్లీ సుల్తాన్ రాజ్య ఇక్తాలాగే మన్సబ్‌దార్‌కు జాగీర్‌ల కేటాయింపు వంశపారం పర్యమైనదికాదు. మన్సబ్ లేదా అధికారిక హోదా ఉన్నంత వరకే మన్సబ్‌దార్ తన జాగీర్ ఆదాయాన్ని వినియోగించగలడు. అందుకు ప్రతిఫలంగా సామ్రాజ్యానికి సేవ అందించేవాడు. మరో మాటలో చెప్పాలంటే జాగీర్‌దార్‌లు తమ హోదా కోసం చక్రవర్తిపై ఆధారపడేవారు. మొగల్ కాలంలో రాజ్యం, చక్రవర్తిల మధ్య ఆచరణాత్మక వైరుధ్యాలేవీ ఉండేవి కావు. కనుక చక్రవర్తి అనుగ్రహం ఉన్నంత కాలం జాగీర్‌దార్‌లు తమ పదవిలో కొనసాగేవారు. మరోవైపు

జాగీర్‌దార్‌లు తమకు అప్పగించిన భూములపై అనువంశిక పెత్తనం చెలాయించకుండా చర్యలు తీసుకొని మొగల్ చక్రవర్తులు తమ సర్వోన్నత స్థానాన్ని కాపాడుకునేవారు. ఈ దిశగా వారు జాగీర్‌దార్‌లను తరచు బదిలీ చేసే విధానాన్ని అవలంబించారు. ఆ విధంగా జాగీర్ వ్యవస్థ మన్సబ్ వ్యవస్థతో చాలా దగ్గరగా ముడిపడి ఉండేది. వాస్తవానికి అతి ఏకగవాక్ష నియంత్రణ వ్యవస్థ అయిన మన్సబ్ వ్యవస్థలో అంతర్భాగం. జాగీర్‌దార్‌లందరూ మన్సబ్‌దార్‌లని, అయితే మన్సబ్‌దార్ లందరూ జాగీర్‌దారులు కాదన్న విషయాన్ని ఇక్కడ మనం గుర్తుంచుకోవాలి. ఎందుకంటే కొందరు మన్సబ్‌దార్‌లకు జాగీర్లు కేటాయించకుండా నేరుగా నగదు రూపంలో వేతనాలు చెల్లించేవారు.

## జాగీర్దారీ సంక్షోభం దిశ:

జాగీర్దారీ సంక్షోభం అనే పదానికి రెండు అర్థాలున్నాయి. ఒక రకంగా చూస్తే అది జాగీర్ వ్యవస్థలో సంక్షోభాన్ని తలపిస్తుంది. సర్దానాధీనులు అత్యంత లాభదాయకమైన జాగీర్లను దక్కించుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేశారు. అంటే రైతులు, జమిందార్ల నుండి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కోకుండా సునాయాసంగా భూమి శిస్తును రాబట్టగలిగే జాగీర్ల కోసం అధికారులు విశ్వప్రయత్నాలు చేశారు. అయితే విశాలదృష్టితో చూస్తే అది మధ్యయుగ మొగల్ భారతదేశంలో ఆర్థిక, సామాజిక సంబంధాలలో నెలకొన్న సంక్షోభాన్ని ప్రతిబింబిస్తుంది. మరీ ముఖ్యంగా వ్యవసాయ సంబంధాలలో పరిపాలన ఉపరితల నిర్మాణం ఈ సంబంధాలపైనే నిలబడి ఉండేది. మొగల్ సామ్రాజ్యంలోని జాగీర్దారీ లేదా జాగీర్ వ్యవస్థలో సంక్షోభం మధ్యయుగ భారత ఆర్థిక, సామాజిక సంబంధాలతో చాలా దగ్గరగా ముడిపడి ఉండేది. ఇటీవల అధ్యయనంలో తేలినట్లు మధ్య యుగ భారత గ్రామీణ సమాజంపై జమిందార్లు అనే ప్రజలు ఆధిపత్యం వహించేవారు. కులం, వర్గం లేదా తెగ ఆధారంగా సమీకృతమైన రైతులతో వారికి దగ్గరి సంబంధాలు ఉండేవి. ఈ కులం, వర్గం లేదా తెగ పరిమిత భూభాగంలో ఘనీకృతంగా స్థిరపడి గ్రామాలను కులపరమైన నివాససముదాయాలుగా మార్చివేశాయి. సాధారణంగా ఆయుధాలు ధరించి కుల, వర్గ, తెగ పరంగా సమైక్యంగా ఉండే రైతుల నుండి పన్ను వసూలు చేయాల్సిన ఆవశ్యకత బలమైన విచ్ఛిన్న భావాలను సృష్టించింది.

ఈ నేపథ్యంలోనే మొగల్ పాలకుల అధికార యంత్రాంగంలో ప్రత్యేక లక్షణమైన జాగీర్దారీ వ్యవస్థను చూడాల్సి ఉంటుంది. జాగీర్ పరిధిలోని రైతుల నుండి భూమి శిస్తు వసూలు చేసే బాధ్యతను ఈ వ్యవస్థ వ్యక్తిగత సంస్థానాధీశులకు అప్పగించింది. అయితే గ్రామీణ ప్రాంతంలో జమిందార్లనే బలమైన వర్గం లేకపోయి ఉన్నట్లయితే జాగీర్ వ్యవస్థను ఎప్పుడో రద్దు చేసేవారు. భూస్వామ్య సమాజంలో భూమిపై నియంత్రణ సామాజిక ప్రతిష్టకు సంబంధించిన వ్యవహారమన్నది వాస్తవమే. అయితే జమిందారు, జాగీర్ వ్యవస్థ మధ్య గతితార్కిక సంబంధం మౌలికమైనది. దాని ఆధారంగానే మధ్యయుగ భారత సమాజ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు జమిందార్లను రెవెన్యూ వసూళ్ల కోసం వినియోగించుకుంటూనే మరోవైపు వారి అధికారాన్ని ప్రత్యేక హోదాను కుదించి వేయడానికి మొగల్ పాలకులు ప్రయత్నించారు. జమిందార్లలో ఒక చిన్న వర్గానికి మన్సబ్‌లను ప్రధానం చేసి కేంద్ర పరిపాలనా వ్యవస్థకు దగ్గరగా తీసుకువచ్చారు. అయితే విశాల సంఖ్యలో ఉన్న జమిందార్లను స్థానిక

భూమి రెవెన్యూ వ్యవస్థలో అంతర్భాగం చేయడానికి ప్రయత్నించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన యంత్రాంగంలో వారికి స్థానం కల్పించారు.

గ్రామ సమాజం ఆయా వర్గాలుగా విడిపోయి ఉన్నప్పటికీ వ్యవసాయదారులను చాలా వరకు ప్రాచీన కాలం నుండి భూమి యజమానులుగా పరిగణించేవారు. భూమి శిస్తు చెల్లించినంత కాలం వారిని భూముల నుండి వేరు చేయకూడదన్న సాంప్రదాయం కూడా ఉండేది. ఖుద్-కాష్త్‌గా పిలవబడ్డ ఈ వ్యవసాయదారులు (మొగల్ కాలంలో) గ్రామీణ సమాజంలో ఉన్నత వర్గంగా ఉండేవారు. వీరికి వారసత్వ హక్కులు, బాధ్యతలు స్పష్టంగా నిర్ధారించబడి ఉండేవి. ఒక ప్రాంతంలో ఒక గ్రామం లేదా గ్రామాలపై ఉమ్మడి ఆధిపత్యం ఉన్న వర్గానికి సాధారణంగా సమాన కుల, వర్గ, తెగ నేపథ్యం ఉండేది. ఉదాహరణకు పశ్చిమ గంగా లోయలో జాట్‌లు, పశ్చిమ భారతదేశంలో మరాఠాలు. ఇలాంటి వ్యవసాయదారులతో ప్రత్యక్ష సంబంధాలను ఏర్పాటు చేసుకునేందుకు మొగల్ పాలకులు ప్రయత్నించారు. ఉత్పాదకత, పంటల స్వభావం తదితర విషయాలను నిర్ధారించేందుకు ప్రత్యక్ష సంబంధాలపై దృష్టి సారించారు. క్రమంగా రెవెన్యూ పాలనా వ్యవస్థను ఏర్పాటుచేసి దాని ఆధారంగా జమిందార్ల పరిమితిని, పరపతిని నియంత్రించారు.

మొగల్ పాలకుల కింద కేంద్ర అధికారం, ప్రతిష్టలు పెరగడం, వారు పాటించిన న్యాయ వర్తనం కారణంగా కేంద్ర ప్రభుత్వం విశ్వసనీయతను సంతరించుకుంది. వ్యవసాయ దారులతో సహా సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు సమస్యల పరిష్కారానికి స్థానిక జమిందారు లేదా నాయకుని కంటే కేంద్ర ప్రభుత్వం వైపు ఎక్కువగా చూసే పరిస్థితి క్రమంగా ఏర్పడింది. ఈ కారణంగా కేంద్ర ప్రభుత్వం, జమిందార్లు, వ్యవసాయదారుల మధ్య త్రైపాక్షిక సంబంధం క్రమంగా బలపడింది. ఇందులో ఖుద్-కాష్త్ (రైతులు)లదే పై చేయిగా ఉండేది. ఇదే మొగల్ సుస్థిరతకు ఆధారమైంది. ఈ సుస్థిరత 17వ శతాబ్దపు తొలియార్థంలో ప్రత్యేక లక్షణంగా ఉండేది. జమిందార్లు, రైతులు తమ రక్షణ కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం కేంద్రంపై ఆధారపడడం అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం వారిని మెప్పించినంతకాలం ఈ సుస్థిరత కొనసాగింది.

మొగల్‌ల నేతృత్వంలో సర్కార్ (జిల్లా) పరిపాలన, ఫౌజ్‌దారీ వ్యవస్థ బలోపేతం కావడం ఈ ప్రక్రియకు దోహదపడింది. ఢిల్లీ సుల్తాన్‌ల నేతృత్వంలోని ఇక్తాదార్‌లాగా కాకుండా మొగల్ జాగీర్దార్ చాలావరకు అధికారిక బాధ్యతల నుండి దూరంగా ఉండేవాడు. మొగల్ పరిపాలనా వ్యవస్థలో కీలకవ్యక్తి అయిన ఫౌజ్‌దార్ ద్వంద్వ బాధ్యతలను నిర్వర్తించేవాడు. అవసరమైన సందర్భాలలో పన్ను వసూలులో జాగీర్దార్‌కు సైనిక సహాయం అందించడంతోపాటు జాగీర్దార్, అతడి దళారి, జమిందార్ల దోపిడీని అడ్డుకట్ట వేసేవారు. వాకియా-నావీలు (వార్తా నివేదికలు) జాగీర్దార్, ఫౌజ్‌దార్‌లిద్దరిపై ఒక కన్ను వేసి ఉంచేవారు. ఇలాంటి నియంత్రణ-సమతుల్య వ్యవస్థ ప్రాంతీయ, కేంద్ర స్థాయిల వరకు విస్తరించి ఉండేది. ఇదే మొగల్ పరిపాలనా వ్యవస్థ కీలక లక్షణంగా ఉండేది. వివిధ స్థాయిలలో అధికార దుర్వినియోగాన్ని నివారించడానికి ఈ వ్యవస్థను రూపొందించారు.

మధ్యయుగ భారత సమాజ స్వభావం వల్ల పైన వివరించబడిన సున్నితమైన సామాజిక సమతుల్యం అనేక కారణాలతో దెబ్బతినే ప్రమాదం ఎప్పుడూ ఉండేది. కేంద్రంలో అధికారం

కోసం జరిగే తీవ్రమైన సంఘర్షణ, సంస్థానాధీశులలో శత్రుభావం, ప్రాంతీయ నాయకుల నుండి సామ్రాజ్యానికి ముప్పు తదితర విషయాలు చూపే ప్రభావాలు బాగా పరిచయం ఉన్న కారణాలలో కొన్ని. సుస్థిరత కొనసాగిన తొలి యుద్ధంలో కూడా సామాజిక, ఆర్థిక సంక్షోభాలకు చెందిన కొన్ని లక్షణాలు బహిర్గతమయ్యాయి. సంక్షోభం ఆర్థిక, పరిపాలనా పరమైన సంక్షోభ స్వరూపాన్ని సంతరించుకుంది. అంటే రాబడి, వ్యయాల మధ్య తీవ్రమైన ఆగాధం ఏర్పడింది. వివరాలలోకి వెళ్లకుండా ఒక ఉదంతాన్ని మాత్రం గుర్తించగలము. అదేమిటంటే పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే షాజహాన్ ఆర్థిక సంక్షోభాన్ని అధికారికంగా గుర్తించాల్సి వచ్చింది. మన్సబ్‌దార్ల వేతనాలు, విధులను కుదించి వేసేందుకు షాజహాన్ ఎన్నో చర్యలు తీసుకున్నారు. రాబడి అవసరం, దాని లభ్యతల మధ్య తేడాను పూడ్చడానికి మూడో వంతు, నాలుగోవంతు, ఐదో వంతు నిబంధనలను, నెలసరి వేతనాలను ప్రవేశపెట్టాడు. ఈ నిబంధనలను, మార్పులను మన్సబ్ వ్యవస్థలో ప్రవేశపెట్టడానికి దారితీసిన కారణాలపై, ఉన్నతాధికారుల ఆదాయంపై అవి చూపిన ప్రభావంపై బలమైన వివాదం ఉంది. ఇక్కడ వివాదంలోకి వెళ్లదలచుకోలేదు. వ్యవసాయ మిగులులో సంస్థానాధీశుల వాటాను తగ్గించడం వాస్తవానికి ఒక సామాజిక, ఆర్థిక సంక్షోభాన్ని ప్రతిబింబిస్తుంది. సంక్షోభాన్ని పరిపాలనా సాధనాలతో పరిష్కరించడానికి మొగల్‌లు ప్రయత్నించారు. ఇందులో ఎలాంటి అవాస్తవం లేదు.

మొగల్ ప్రభుత్వం, దాని స్థానిక ప్రతినిధుల సామర్థ్యంపైనే రెవెన్యూ వ్యవస్థ పనితీరు ఆధారపడి ఉండేది. స్థానిక స్థాయిలో జమిందార్లు, వ్యవసాయదారులపై తమ ఉన్నతమైన సైనిక బలంతో ఫౌజ్‌దార్, జాగీర్దార్‌లు నియంత్రణ కొనసాగించారు. అయితే షాజహాన్ ప్రవేశపెట్టిన కొత్త విధానాల అమలు కారణంగా మన్సబ్‌దార్ కలిగి ఉండాల్సిన అశ్వాలు, అశ్వికుల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. ఫలితంగా ఫౌజ్‌దార్‌లు జాగీర్‌దార్‌లకు తగిన సైనిక సహాయం అందించలేకపోయారు. రెవెన్యూ వసూళ్లు కూడా ఈ ప్రక్రియలో తగ్గుముఖం పట్టాయి.

## జాగీర్దార్ సంక్షోభానికి దారితీసిన కారణాలు:

పైన పేర్కొన్నట్లు జాగీర్దారీ సంక్షోభానికి మౌలిక ఆధారం మధ్యయుగ భారత సమాజ స్వభావమే. ఈ సమాజం వ్యవసాయాభివృద్ధిని పరిమితం చేసింది. దాని సున్నిత సమతుల్యం అనేక కారణాలవల్ల దెబ్బతినే ప్రమాదం ఎప్పుడూ ఉండేది. కేంద్రంలో వారసత్వ పోరు, సంస్థానాధీశులలో అనైక్యత, ప్రాంతీయ పాలకుల నుండి సామ్రాజ్యానికి సవాళ్లు తదితర కారణాలు తీవ్ర ప్రభావం చూపాయి. ఇలాంటి సామాజిక నిర్మాణంపై ఎదిగిన మొగల్ పాలనా వ్యవస్థ ఆ నిర్మాణం యొక్క సున్నితమైన సమతుల్యం దెబ్బతినడంతో కుప్పకూలిపోయింది. చివరి మొగల్ పాలకుల అసమర్థత కూడా అందుకు పాక్షికంగా దోహదపడింది.

జాగీర్దారీ సంక్షోభాలను పెంచి పోషించడంలో ఇతర అనేక సహకారక కారణాలు కూడా ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది పాలకవర్గ పరిమాణం, దాని డిమాండ్లు విపరీతంగా పెరగడం, సంస్థానాదీశులు, వారి అనుచర వర్గం ఇద్దరూ సామ్రాజ్య రెవెన్యూ వనరులపై ఆధారపడి జీవించేవారు. ఉత్పత్తి చాలా నెమ్మదిగా పెరిగింది. కాని పాలకవర్గ పరిమాణం, డిమాండ్లు, ఆకాంక్షలు గణనీయంగా విస్తరించాయి. 1603లో జహంగీర్ గద్దెనెక్కినపుడు

సామ్రాజ్యంలో మన్సబ్‌దార్ సంఖ్య 2069 కాగా ఔరంగజేబ్ పాలన చివరి భాగంలో ఆ సంఖ్య 11,456కు చేరుకుంది. సంస్థానాధీశుల సంఖ్య ఐదు రెట్లు పెరగగా సామ్రాజ్య రెవెన్యూ ఆధారాలు అదే నిష్పత్తిలో పెరగలేదు. (సామ్రాజ్యం విస్తరించినా). అంతేకాక షాజహాన్ రాచరిక వైభోగం అనే యుగాన్ని ఆవిష్కరించాడు. ఫలితంగా సంస్థానాధీశుల ఆడంబరాలు మరింత ఎక్కువయ్యాయి. సంస్థానాధీశులలో చాలామంది వ్యాపార, వాణిజ్య రంగాలలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాలు పంచుకున్నప్పటికీ వీటి ద్వారా వారికి కేవలం అదనపు ఆదాయం మాత్రమే లభించేది. ప్రధాన ఆదాయ వనరు మాత్రం భూమి నుండి వచ్చేది. అందుకే వారు భూమి నుండి ఆదాయాన్ని పంచుకోవడానికి ప్రయత్నించారు. ఈ ప్రక్రియలో రైతులు, జమిందార్లను పూర్తిగా పిండేశారు. మరో ముఖ్యమైన కారణం దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగ, జమిందార్ల తిరుగుబాట్లు, నిరసనలు. జమిందార్ల పట్ల పరస్పర భిన్నమైన విధానాన్ని మొగల్‌లు అవలంభించారు. అంతర్గత భద్రతకు జమిందార్ల నుండి ముప్పు వాటిల్లగలదని పరిగణిస్తూనే (ఈ కారణంగా వారి ప్రత్యేక హోదాను, అధికారాన్ని కుదించడానికి ప్రయత్నించారు) మరోవైపు వారికి స్థానిక పరిపాలనా బాధ్యతలను అప్పగించారు. రాజపుత్ర, మరాఠా తదితరులకు మన్సబ్‌లను ప్రదానం చేశారు. వారికి రాజకీయ పదవులను కూడా కట్టబెట్టారు. ఆ విధంగా సామ్రాజ్య రాజకీయ ఆధారాన్ని విస్తరించడానికి ప్రయత్నించారు. ఈ ప్రక్రియలో వర్గపరంగా, ప్రాబల్యపరంగా మరింత బలోపేతమైన జమిందార్లు సంస్థానాధీశుల అన్యాయమైన డిమాండ్లను అంగీకరించే పరిస్థితిలో లేరు.

రైతాంగం కూడా (ఖుద్–కాష్తేలు) చాలా సందర్భాల్లో జమిందార్లు, కుల లేదా తెగ నాయకులతో సంబంధాలు నెరిపి వారికి తిరుగుబాట్లలో సహాయం అందించేవారు. ముఖ్యంగా సామ్రాజ్య ఆస్థాన ప్రముఖులను ప్రతిఘటించడంలో వారు జమిందార్లకు మద్దతు తెలిపేవారు. మొగల్ చివరి పాలకుల హయాంలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉండేది. రాజ్యం ఆమోదించిన పద్ధతులలో జాగీర్ల నుండి మరింత ఎక్కువ ఆదాయాన్ని రాబట్టేందుకు సంస్థానాధీశులు చేసిన ప్రయత్నాలు మధ్యయుగ గ్రామీణ సమాజంలోని అంతర్గత వైరుధ్యాలను తెరపైకి తెచ్చాయి. కొన్ని ప్రాంతాలలో రైతాంగ తిరుగుబాట్లు మరికొన్ని ప్రాంతాలలో జమిందార్ల తిరుగుబాట్లు వచ్చాయి. అలాగే ఇంకొన్ని ప్రాంతాలలో ప్రత్యేక రాజ్యాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. పరిపాలన స్థాయిలో పాలకవర్గంలో అసంతృప్తి, వర్గ కుమ్ములాటలు పెరిగిపోయాయి. లాభదాయకమైన జాగీర్లను హస్తగతం చేసుకోవడానికి సంస్థానాధీశులు తీవ్రంగా ప్రయత్నించడంతో మొగల్ పరిపాలనా వ్యవస్థలో అవినీతి మరింత పెచ్చరిల్లింది.

షాజహాన్, ఔరంగజేబ్ లిద్దరూ ఖలీసా భూములను విస్తరించడంతో జాగీర్దారీ సంక్షోభం మరింత తీవ్రమైంది. తరచూ సంభవిస్తున్న యుద్ధాలు, పెరిగిపోతున్న పాలనా వ్యయం ఔరంగజేబు పాలనను తీవ్రంగా ప్రభావితం చేశాయి. జహంగీర్ హయాంలో ఖలీసా భూములు సామ్రాజ్యంలో తొమ్మిదింట ఒక వంతు ఉండగా ఔరంజేబు పాలన నాటికి అవి ఐదింట ఒక వంతుకు చేరుకున్నాయి. ఖలీసా భూములు విస్తరించడంతో పాయి బాకీ భూములు (జాగీర్ల కేటాయింపునకు ఉద్దేశించిన భూములు) కొరత ఏర్పడిందని చెప్పడానికి ఎలాంటి ఆధారం లేకపోయినా ఖలీసా భూములను వేరు చేసిన పద్ధతి తీవ్ర సమస్యలను సృష్టించింది. సామ్రాజ్య అధికారులు ఖలీసా కోసం పరిపుష్టమైన, సునాయాసంగా నిర్వహించగల జాగీర్లపై

దృష్టి సారించగా మన్సబ్‌దారీలు అనుత్పాదక జాగీర్లను నిర్వహించాల్సి వచ్చింది. ముఖ్యంగా రెవెన్యూ వసూళ్లు కష్టంగా ఉన్న ప్రాంతాలలో, జమిందార్లు బలంగా ఉన్న ప్రాంతాలలో, పన్ను చెల్లించడానికి సిద్ధంగాలేని రైతుల ప్రాంతాలలో ఇలాంటి జాగీర్లు ఉండేవి.

జమీందార్ల ప్రాబల్యం, అధికారిత, జాగీర్దార్ల అసమర్థత నాణేనికి రెండు వైపులా ఉన్న రూపాలు. నిర్దిష్ట ఫలితం: భూ యజమానులను సంరక్షించే సామర్థ్యాన్ని జాగీర్దార్లు కోల్పోయారు. చివరి మొగల్ పాలకులు ఈ కారణంగా సామ్రాజ్యానికి పునాది అయిన సామాజిక సమతుల్యాన్ని కాపాడలేకపోయారు. రైతుల సంరక్షణ బాధ్యతకు ప్రఖ్యాతిగాంచిన కేంద్ర ప్రభుత్వం తదుపరి కాలంలో నిర్వీర్యమైపోయింది. జమిందార్ల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయలేకపోయింది. రెవెన్యూ మిగులులో చాలా భాగాన్ని కేంద్రీకృతం చేయలేకపోయింది. ఈ సంక్షోభం కేవలం దక్కను ప్రాంతానికే పరిమితం కాలేదు. (ఇక్కడ మరాఠాలు తిరుగుబాటు పథంలో ఉన్నారు) సంక్షోభం ఉత్తర భారతదేశానికి కూడా విస్తరించింది. అందుకు జాట్, తదితరుల తిరుగుబాట్లే నిదర్శనం. పెరుగుతున్న సామాజిక అసమానతలు పాలనా, ఆర్థికపరమైన సంక్షోభం వల్ల మరింత విస్తరించాయి. ఆ విధంగా జాగీర్ వ్యవస్థ సంక్లిష్టమైన దృగ్విషయం. అది గ్రామీణ సమాజ నిర్మాణం, నిర్వహణ, అలాగే స్థానిక, కేంద్ర స్థాయిలలో మొగల్ పరిపాలనా వ్యవస్థతో దగ్గరగా ముడిపడి ఉంది. జాగీర్ వ్యవస్థ సంక్షోభం 18వ శతాబ్దంలో అధికార యంత్రాంగ వైఫల్యానికి దారితీసింది. పైన పేర్కొన్న సామాజిక, పరిపాలనా అంశాల మధ్య పరస్పర సంబంధాల కారణంగానే సంక్షోభం ముదిరింది.

**మరాఠా పరిపాలన:**

**శివాజీ కృషి:**

శివాజీ రాజ్యానికి అన్ని వైపులా శత్రు రాజ్యాలు ఉండేవి. ఈ రాజ్యాల నుండి నిత్యం సైనిక బెడద ఉండేది. అన్ని ముప్పులను అధిగమించి తన స్వరాజ్‌ను సురక్షితంగా కొనసాగించాలని శివాజీ ఆకాంక్షించాడు. రాజ్యం సుస్థిరంగా, సుదీర్ఘకాలం కొనసాగించాలంటే దానికి మంచి పరిపాలకులు అవసరం. తన స్వరాజ్‌లో అద్భుతమైన అధికార యంత్రాంగాన్ని శివాజీ నెలకొల్పాడు. పరిపాలన సజావుగా సాగేందుకు దానిని ఎనిమిది శాఖలుగా విభజించాడు. ప్రతి శాఖకు ఒక మంత్రిని నియమించాడు. న్యాయ, మతవ్యవహారాలను చూసే మంత్రులు తప్ప మిగతా వారంతా సమర్థులైన యోధులై ఉండాలి.

వ్యక్తులను సరిగ్గా అంచనా వేయడంలో శివాజీ సిద్ధహస్తుడు. ఎంతో జాగ్రత్తగా అతడు తన మంత్రులను ఎంపిక చేశాడు. వారికి జాగీర్లను కట్టబెట్టలేదు. అందుకు బదులుగా వారికి భారీ వేతనాలను చెల్లించాడు. అష్ట ప్రధాన్‌గా ప్రసిద్ధమైన శివాజీ మంత్రివర్గంలో ఎనిమిది మంది మంత్రులు ఉండేవారు. అతడి సైన్యంలో రెండు ప్రధానమైన విభాగాలు ఉండేవి: పదాతి దళం, అశ్విక దళం. సిలేదార్లకు సొంత ఆయుధాలు, అశ్వాలు ఉండేవి. యుద్ధంలో వారు పాలు పంచుకొని తగిన రీతిలో ప్రతిఫలం పుచ్చుకునేవారు. సిద్దీలు,

పోర్చుగీసులు, ఆంగ్లేయులు శివాజీని సముద్రం నుండి వేధించడం మొదలుపెట్టారు. దూరదృష్టితో శివాజీ ఒక నౌకాదళాన్ని ఏర్పాటుచేశాడు. అతడి నౌకాదళం అనేక సందర్భాలలో శత్రువులతో తలపడింది. మరాఠా సైనిక ప్రాబల్యంపై శత్రువులలో గౌరవాన్ని, కలవరాన్ని సృష్టించింది.

ఆ రోజులలో కోటలు రాజ్య సంరక్షణలో బలమైన మద్దతునిచ్చేవి. శివాజీ ప్రత్యేక్ష నియంత్రణలో సుమారు 300 కోటలు ఉండేవి. ఈ కోటలను బాగా సంరక్షించేవారు. ప్రతి కోటలో అనేకమంది అధికారులు ఉండేవారు. ఖిలేదార్, కార్ఖాని, ఫడ్నీస్, ఇతరులు. సైనిక గూఢచార, రహస్య సమాచార సేకరణకు సమర్ధవంతమైన వ్యవస్థ ఉండేది. ఈ విభాగానికి బాహిర్‌జీ నాయక్ అధిపతిగా ఉండేవాడు. శత్రు శిబిరంలో జరిగే ప్రతి విషయాన్ని శివాజీ వేగులు పసిగట్టేవారు. శత్రువు గురించి పూర్తి సమాచారం లేకుండానే శివాజీ ఎలాంటి సైనిక దాడికి సిద్ధమయ్యేవాడు కాదు.

ఒక చురుకైన పరిపాలనా వ్యవస్థను కూడా శివాజీ స్థాపించాడు. రాజ్యాన్ని 12 సుబాలుగా విభజించాడు. సుబాలను పరగణాలుగా విభజించి ప్రతి పరగణకు ఒక హవల్దార్‌ను నియమించాడు. పరగణలో అనేక గ్రామాలు ఉండేవి. ప్రతి గ్రామానికి పాటిల్, కుల్‌కర్ణి అనే అధికారులు ఉండేవారు. పరిపాలన వ్యవహారాలలో శివాజీ హిందువులు, ముస్లింల మధ్య ఎలాంటి భేదం చూపలేదు. తన చుట్టూ సమర్థులను పోగు చేసి వారికి విధులు అప్పగించేవారు. స్వరాజ్ సాధనలో వారి సామర్థ్యాన్ని వినియోగించాడు. రాజ్యానికి అవిధేయులుగా ఉన్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాడు. కుల, మతాలకు అతీతంగా అలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించబడేవారు. ఈ విధంగా శివాజీ మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి నీతివంతమైన పాలనను అందించాడు.

**మరాఠా సమాఖ్య:**

రెండవ పేష్వా ఒకటవ బాజీరావ్ పాలనాకాలంలో మరాఠా సమాఖ్య ఆవిర్భవించింది. సేనాపతి దబోదీ నేతృత్వంలోని మరాఠా క్షత్రియులు వ్యతిరేకత, ఉత్తర, దక్షిణ భారత ప్రాంతాలలో మరాఠాల ప్రాబల్యం గణనీయంగా పెరగడంతో పేష్వా బాజీరావ్ సైనిక సామర్థ్యం ఉన్న తన విధేయులపై ఆధారపడాల్సి వచ్చింది. తన అనుచరులకు విశాలమైన భూభాగాలను కట్టబెట్టాడు. వారిలో ముఖ్యులు రఘుజీభోంస్లే, రాణోజీ సింధియా, మల్హార్ రావ్ హోల్కర్, దామాజీ గైక్వాడ్. ఈ నాయకులు మరాఠా సమాఖ్యను ఏర్పరిచారు. ఒకటవ బాజీరావ్ కాలంలో ఈ సమాఖ్యను పేష్వా గట్టిగా నియంత్రిస్తూ ఢిల్లీ, పంజాబ్‌ల వరకు జైత్రయాత్రను కొనసాగించాడు. మూడవ పానిపట్ యుద్ధంలో పేష్వా సైన్యం ఘోర పరాజయానికి పాలుకావడం, వెనువెంటనే పేష్వా బాలాజీ రావ్ మరణించడంతో వారసత్వ పోరు చెలరేగి పేష్వా నియంత్రణ సడలింది. మరాఠా సమాఖ్యలోని కొందరు నాయకులు పదవీ కాంక్షతో రగిలిపోవడంతో మరాఠా రాజ్యం విచ్ఛిన్న దశకు చేరుకుంది. నాయకుల మధ్య అంతర్గత పోరు, వారి కుట్రలు, వైరాలు (ముఖ్యంగా హోల్కర్, సింధియాల మధ్య) పెరిగిపోవడంతో వారిని సమైక్యంగా నియంత్రించడం అసాధ్యమైంది. ఇది మరాఠా సామ్రాజ్య విచ్ఛిన్నానికి, తదుపరిపతనానికి దోహదపడింది. అంతిమంగా మరాఠా సమాఖ్య లేదా సామ్రాజ్యం తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది.

# III

# ఆర్థిక వ్యవస్థ

13

# తొలి మధ్యయుగ ఆర్థిక వ్యవస్థ

వివిధ రకాల భూ ప్రయోజనాల ఆవిర్భావ ప్రక్రియ ప్రాచీన భారత చరిత్రలో వివిధ దశలలో కొనసాగింది. అయితే తొలి మధ్యయుగ కాలంలో అలాంటి ప్రయోజనాల నిర్మాణం ఎంత వైవిధ్యంగా, సంక్లిష్టంగా మారిందంటే ఆస్తికి ఒక సమగ్రమైన నిర్వచనం దాదాపు అసాధ్యమైంది. విజ్ఞానేశ్వరుని 'లౌకిక స్వత్వవాదం' ప్రకారం ఆస్తికి మూలం ప్రజాగుర్తింపులోనే ఉంది. దానికి శాస్త్రాలు ఏ మాత్రం ఆధారం కావు. అయితే ఇతర రాజ్యాంగ కర్తలు వివిధ రకాల ప్రయోజనాలను గుర్తించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. వాస్తవానికి ఈ కాలపు స్థూల ఆర్థిక నిర్మాణం వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చే గుర్తింపుపై ఆధారపడి ఉండేది. వీరు భూమి నుండి మిగులు దిగుబడిని సాధించేవారు. రాజే స్వయంగా భూ యాజమాన్యాన్ని స్పష్టమైన హక్కుగా చాటుకున్నాడు. చాలా సందర్భాలలో అతడు భూమిపై కొత్త ప్రయోజనాలను సృష్టించాడు. భూదానాల రూపంలో బ్రాహ్మణులు రాచరిక పోషణ పొందేవారు. ఈ కాలంలో మతసంస్థలు కూడా ప్రధాన లబ్ధిదారులుగా ఆవిర్భవించాయి. అయితే రాజు యాజమాన్య సిద్ధాంతం వివిధ బిరుదుల (భూ కేటాయింపులు)తో ఘర్షణలోకి రాలేదు. భూ కేటాయింపులను తాత్కాలిక లేదా శాశ్వత ప్రాతిపదికన ఉంచుకునేవారు. సైనిక సేవకు ప్రతిఫలంగా సామంతులకు భూమిని కేటాయించేవారు. ఒక కులం లేదా కుటుంబానికి, చివరకు అధికారులకు కూడా భూములను కేటాయించేవారు. ఇలాంటి పరిస్థితిలో ఉప కేటాయింపులు సహజం. సామాజిక హోదాకు చిహ్నమైన మత విరాళాలను నామమాత్రపు హక్కులు గల వ్యక్తులు కూడా ప్రదానం చేసేవారు.

ఇలాంటి విభిన్న హక్కులు సహజంగానే వ్యవసాయదారుని హక్కును ప్రభావితం చేయకుండా వదలలేదు. కొందరికి యాజమాన్య హక్కులు ప్రసాదిస్తే పూర్వపు యాజమాన్య హక్కులు హరించుకొనిపోయేవి. చోళ గ్రామీణ ప్రాంతంలో దేవాలయాల భూముల విషయంలో ఇలాంటి ఉదంతాలు అనేకం జరిగాయి. మాజీ కౌలుదారులను బలవంతంగా భూముల నుండి తొలగించి కొత్తవారిని వాటిపై స్థిరపరిచేవారు. విశాలమైన దేవాలయ భూముల నిర్వహణ రైతులను వ్యవసాయ కార్మికులుగా మార్చివేసేది. దేశమంతటా భూస్వామ్య దళారులు పుట్టుకురావడంతో వ్యవసాయదారునికి తన సొంత దిగుబడిలో ఎలాంటి వాటా మిగల్లేదు. దళారులు మిగులును తమ హక్కుగా వసూలు చేసేవారు. పన్ను అంశాలు పెరగడం ఇందుకు సహకరించింది.

భారత భూస్వామ్య వ్యవస్థ చరిత్ర ఉల్లేఖనంలో తొలి మధ్యయుగ కాలం నాటి భౌతిక జీవితం కడు దుర్భరంగా ఉండేదని చాలా గట్టిగా నొక్కి చెప్పబడింది. అయితే ఈ వాదనను సవాలు చేయకుండా వదలిపెట్టలేదు. ఈ యుగం వ్యవసాయ సమాజ విస్తరణను, శీఘ్రగతిని అనూహ్యంగా చవిచూసింది. శాసనాలు, గ్రాంథిక ఆధారాలను వినియోగించి వ్యవసాయంలో ప్రగతిని, పంటల మార్పిడిని, వరి సాగులో అభివృద్ధిని వివరించారు. అందుబాటులో ఉన్న సాక్ష్యం అభివృద్ధి పోకడలను స్పష్టంగా నిర్ధారిస్తాయి. చివరకు భారత భూస్వామ్య వ్యవస్థలో కూడా వ్యవసాయాభివృద్ధి సాధ్యమైందని నిరూపిస్తాయి. రాచరిక శాసనాల ద్వారా మత గురువులు, మత సంస్థలకు భూములను ప్రదానం చేయడం వ్యవసాయ విస్తరణ ఒక సూచిక వంటిది. అంతవరకు సాగులోలేని, మనుషుల జాడలేని ప్రాంతాలు కూడా వ్యవసాయ క్షేత్రాలుగా, గ్రామాలుగా రూపాంతరం చెందాయి. ఇలాంటి భూదానాలకు క్రీ.శ. 930లో శ్రీ చంద్ర (925-75) ప్రాచీన శ్రీహట్ట (సిల్హెట్, బంగ్లాదేశ్)లో జారీ చేసిన శాసనం ఒక మంచి ఉదాహరణ.

విశాలమైన బ్రాహ్మణ నివాస ప్రాంతం (బ్రహ్మపుత్ర) ఈశాన్య భారత దేశంలో ఏర్పాటు కావడం (తొలి మధ్యయుగాల కాలంలో) మరో ప్రధాన సాక్ష్యం. పన్ను మినహాయింపుగల భారీ అగ్రహారాలు పరిపాలనా శాసనాలు, ఉత్తర్వులలో ప్రస్తావించబడ్డాయి. పరిపాలనా పునఃవ్యవస్థీకరణలో భాగంగా మూడు జిల్లాలను కలిపి ఒక విశాలమైన అగ్రహారాన్ని ఏర్పాటుచేశారు. అలాంటి మతపరమైన సంస్థలు (నివాస

ప్రాంతాలు) కేవలం పురోహితులనే కాకుండా అనేకమంది వృత్తిదారులు, వృత్తి నిపుణులను కూడా కలిగి ఉండేవని చెప్పడానికి బలమైన చారిత్రక ఆధారాలున్నాయి. సేవలందించే సముదాయాల సంఖ్య లేదా జాబితా చాలా పెద్దగా ఉండేది. అయితే అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇలాంటి మతపరమైన నివాస సముదాయంలో రెండు వేర్వేరు మతాలలో దాదాపు ఒక స్వరూపంలో ఉన్న దైవాన్ని కొలిచేవారు. ఈ దైవాలు బయటి ప్రాంతాలకు (దేశాంత్రీయ మత), మంగళదేశ ప్రజలు (వంగళదేశీయ మత)కు చెందినవి. బ్రహ్మపురలో నివాసమున్న రెండు సముదాయాల మధ్య తీవ్రమైన విభేదాలు ఉండవచ్చు. ఈ విభేదాలను మత ప్రభావానికి అతీతంగా చూడాలి ఎందుకంటే ఈ రెండు సముదాయాలు ఒకే స్వరూపం ఉన్న దైవాన్ని కొలిచేవి.

వ్యవసాయ సమాజాల విస్తరణను స్థానిక స్థాయి నీటిపారుదల పథకాలు మరింత వేగవంతం చేశాయి. మెట్ల బావులు, బావులు, చెరువులు, అరఘట్టాలు తదితర పథకాలు ఎన్నో నిర్మాణమయ్యాయి. శాసనాలు ఆ కాలపు నీటిపారుదల వ్యవస్థ గురించి మరోసారి స్పష్టమైన ఆధారాలను అందచేస్తాయి. ఇలాంటి ఆధారాన్ని బెంగాల్, రాజస్తాన్, కర్నాటకలలో లభించిన శాసనాలలో సమీక్షించారు. నీటిపారుదల పథకాలను ముఖ్యమైనవిగా పరిగణించారు. తొలి మధ్యయుగ కాలపు గ్రామీణ ప్రాంతాలలో ఈ పథకాలను ఉన్నతమైన నిర్మాణాలుగా నిలిచాయి. నీటిపారుదల పథకాల ఆకారం, స్వరూపం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారుతూ ఉండేవి. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులను బట్టి పథకాలను నిర్మించారు. రాజస్థాన్ శాసనాల ప్రకారం స్థానిక నీటిపారుదల సౌకర్యాల వినియోగం అధికంగా ఉండేది. పంటల అధిక దిగుబడి, వైవిధ్యం విస్తారంగా ఉండేది.

భూదానాల సరిహద్దులను రాగి ఫలకంపై సూచించేవారు. వాటిని జాగ్రత్తగా పరిశీలిస్తే గ్రామీణ ప్రాంతాల గురించి మరింత విస్తారమైన సమాచారం లభించింది. ఆ కారణంగా ఈ కాలపు గ్రామం ఏకలక్షణంగా లేదా ఒంటరిగా ఉండేది కాదన్న వర్ణనను ఇపుడు విస్మరించడం కష్టమవుతుంది. గ్రామీణ జనాభా వివిధ వర్గాల ప్రజలు వేర్వేరు స్థాయిలలో నివసించేవారని చెప్పడానికి అనేక చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కనుక గ్రామం, దాని సంబంధిత జీవనం మరింత సంక్లిష్టతకు సమకూర్చుకుంటాయి. భారత భూస్వామ్య వ్యవస్థ చారిత్రక ఉల్లేఖనంలో గ్రామాలను అతిసాధారణంగా, మూసపద్ధతిలో నిర్వచించారు. గ్రామాలు స్వయంపోషక నివాస సముదాయాలుగా ఉండేవని

పేర్కొన్నారు. అయితే పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉండేవి. ముఖ్యంగా అల్లూర్, ఇసానామంగళం గ్రామాలలో (చోళ యుగం) లభించిన ఆధారాలు ఈ విషయాన్ని నిరూపిస్తాయి. ఇటీవలి అధ్యయనం ఒకటి కర్నాటకలో కానకట్టే అని గుర్తించబడ్డ కాలికట్టి గ్రామంలో వచ్చిన మార్పుల గురించి ఎన్నో వివరాలను అందచేసింది. హోయసల రాజులు 12వ శతాబ్దంలో జారీచేసిన శాసనాలలో గ్రామం గుర్తించి ప్రత్యేకించి ప్రస్తావించారు. ఇక్కడ అర్థం చేసుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే గ్రామీణ సమాజం, గ్రామీణ స్థిరీకరణాల ప్రక్రియ రెండూ చలనం లేకుండా మిగిలిపోలేదు.

## 14

# ఢిల్లీ సుల్తాన్ రాజ్యం ఆర్థిక వ్యవస్థ

**వ్యవసాయదార ఆర్థిక వ్యవస్థ:**

ప్రాచీన ప్రభుత్వానికి కొన్ని అంశాలలో పూర్తిగా భిన్నమైన రాజ్యాన్ని ఢిల్లీ సుల్తాన్‌లు స్థాపించారు. వ్యవసాయాన్ని వ్యవస్థీకరించి, తద్వారా లభించే ఆదాయాలపై తీక్షణమైన దృష్టి సారించడంలో వారి మౌలిక విజయాలు దాగి ఉన్నాయి. దండయాత్ర పూర్తయిన వెంటనే, ఆక్రమణదారులు ఓడిపోయిన లేదా లొంగిపోయిన రాచరిక వంశాలతో వారి ప్రాంతాలలో ప్రవేశించడానికి ప్రయత్నించేవారు. భూమిశిస్తు లొంగదీసుకున్న పాలకులపై విధించే కప్పం కంటే ఏ మాత్రం అధికంగా ఉండేది కాదు. కేవలం కొన్ని ప్రాంతాలలోనే కొత్త పాలకులు తమ ప్రత్యక్ష నియంత్రణను అమలు చేసి రైతాంగంతో ప్రత్యక్ష సంబంధాలను ఏర్పాటుచేసుకొని ఉండవచ్చు. సుమారు శతాబ్దం పాటు అనుభవం, అనువర్తనం తర్వాత 14వ శతాబ్దం మొదటి దశకంలో నూతన చర్యకు రంగం సిద్ధమైంది. అల్లావుద్దీన్ ఖిల్జీ భూమి శిస్తును దిగుబడిలో సగభాగంగా నిర్ధారిస్తూ శాసనం జారీ చేశాడు. ఈ పన్నును ప్రతి వ్యక్తిగత వ్యవసాయదారుని భూమిపై విధించారు. అయితే అల్లావుద్దీన్ వారసుల పాలనలో భూమిశిస్తు ఏ మేరకు ఉండేదో స్పష్టంగా తెలియదు. మౌలికంగా మూడు రకాల భూములు ఉండేవి. మొదటి రకం ఇక్తా భూమి. వీటి నుండి లభించే ఆదాయాలను పాలకవర్గ సభ్యులు, అధికారులకు కేటాయించేవారు. రెండవ రకం భూమి ఖలీసా. వీటి ఆదాయాలను నేరుగా సుల్తాన్ స్వంత ఖజానా కోసం వసూలు చేసేవారు. చివరగా మదద్-ఎ-మాష్ భూములు ఉండేవి. వీటి ఆదాయాలను మత గురువులు, విద్వాంసులు, కళాకారులు తదితరులకు జీవిత కాలం అందించేవారు.

**ఇక్తా వ్యవస్థ ఆవిర్భావం:**

ఇక్తా వ్యవస్థలో ఇక్తా లేదా ప్రాంతీయ భూభాగాల ఆదాయాలను అధికారులకు వేతనాల స్థానంలో కేటాయించేవారు. కనక ఇక్తా స్వభావాన్ని, ఇక్తాదార్‌ల హక్కులు, హోదాలను కొంత వివరంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్థూలంగా చెప్పాలంటే ఢిల్లీ సుల్తాన్‌ల కింద ఇక్తా చరిత్రలో మూడు దశలను వేర్వేరుగా గుర్తించవచ్చు. తొలిదశలో

వేర్వేరు ప్రాంతాలను ఇక్తాలుగా సైనిక కమాండర్లకు అప్పగించడం తుర్కు సుల్తాన్‌లకు సహజమైన చర్య. సైనిక కమాండర్లు తమ సొంత నిర్వహణతోపాటు తమ బలగాలను ఇక్తాల నుండి లభించే ఆదాయాలతో పోషించాల్సి వచ్చేది. అప్పుడు ఇక్తా రెవెన్యూ అసైన్‌మెంట్‌గానే కాకుండా పరిపాలనా విభాగంగా కూడా నిలిచింది. ముక్తీలు లేదా ఇక్తాదార్‌లు గవర్నర్లుగా కూడా వ్యవహరించేవారు. ఒక వ్యక్తి నుండి మరో వ్యక్తికి ఇక్తాలను తరచూ బదిలీ చేసేవారు. ఈ సాంప్రదాయంవల్ల ఇక్తాలు ఆయా అధికారుల సొంత జాగీర్ అన్న భావన తొలగిపోయింది.

రెండవదశలో అంటే ఖిల్జీలు, తొలి తుగ్లక్‌ల పాలనా కాలంలో (1290--1351) సుల్తాన్ రాజ్య పరిపాలనా బలోపేతం కావడంతో అంతకుముందు చేసిన ప్రాథమిక ఏర్పాట్లను గణనీయంగా మార్చారు. ఇక్తాల బదిలీని మరీ స్వల్పకాలంలో చేపట్టేవారు. ఈ కారణంగా ముక్తీలకు తమ ప్రాంత ఆదాయాలపై నిర్దిష్టమైన నియంత్రణ ఉండేదికాదు. వసూళ్లు, వ్యయంపై తరచూ నివేదికలు సమర్పించే బాధ్యత వారిపై పడింది. మిగులు నిధులు (ఫవాజిల్) ఉంటే వాటిని రాజు ఖజానాకు పంపేవారు. ప్రతి ప్రాంతం యొక్క పన్ను చెల్లింపు సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకొని అంచనాలను (జమ) రూపొందించేవారు. అధికారుల వ్యక్తిగత వేతనాలను రూపాయల్లో నిర్ధారించేవారు. కొన్ని ప్రాంతాల వసూళ్లను (ఇక్కడి రెవెన్యూ అంచనా అధికారుల వేతనంతో సమానంగా ఉండేది) వారికి అప్పగించేవారు. వీరి నేతృత్వంలోని సైనికులకు సుల్తాన్ ఖజానా నేరుగా వేతనాలు చెల్లించేది. ఇక్తా రెవెన్యూలలో కొంత భాగాన్ని ముక్తీల బలగాలకు చెల్లించేందుకు పక్కన పెట్టేవారు. ముక్తీ అధికారానికి ఇలాంటి పరిమితులు ఉండడంతో సుల్తాన్ తన సొంత అధికారులను ఇక్తాలలో నియమించడం మొదలుపెట్టారు. బాల్బన్ హయాంలోనే ఇలాంటి సాంప్రదాయం మొదలైంది. రాచరిక సైన్యంలోని ఆశ్విక దళానికి వేతనాల బదులు అప్పగించే ఇక్తాలను అల్లావుద్దీన్ రద్దుచేసి వారికి నేరుగా నగదు వేతనాలు చెల్లించారు. రాచరిక జోక్యం ముహమ్మద్ తుగ్లక్ (1324-51) హయాంలో తీవ్ర స్థాయికి చేరుకుంది. చాలా సందర్భాలలో అతడు ఇక్తాల రెవెన్యూ వసూళ్లను రెవెన్యూ రైతులు లేదా తన సొంత ఆర్థిక శాఖ అధికారులకు అప్పగించేవాడు. ఇక్తాలలో నియమించబడ్డ అమీర్‌ల కమాండర్లు తమ వేతనాన్ని నగదు రూపంలో స్థానిక ఖజానా నుండి పొందేవారు. వారికి రెవెన్యూ వసూళ్లతో ఎలాంటి సంబంధం ఉండేది కాదు.

మూడవ దశలో, అంటే 1351లో ఫిరోజ్ తుగ్లక్ పాలనా పగ్గాలు చేపట్టారు. అంతకుముందు అధికారం కోసం తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని పాలకవర్గంలోకి ఒక ప్రధాన వర్గం తన తిరుగుబాట్ల ద్వారా సృష్టించింది. అంతవరకు కొనసాగిన పాలనా స్వరూపం పూర్తిగా మార్చివేశారు. సుల్తాన్ తన అధికారులకు కొన్ని రాయితీలు ప్రదానం చేశాడు. తొలుత, జమ లేదా రాబడి అంచనాను శాశ్వతంగా నిర్ధారించారు. భవిష్యత్తులో రెవెన్యూ వసూళ్లు పెరిగితే ఇక్తాదార్‌లు అన్ని విధాలా లాభపడగలరనే ఉద్దేశ్యంతో అలాంటి నిర్ణయం తీసుకున్నారు. అప్పటికీ ఇక్తాలను బదిలీ చేస్తూనే ఉన్నా, బదిలీలు చాలా అరుదుగా ఉండేవి.

చివరగా, తన బలగాలకు రెవెన్యూ వసూళ్లను అప్పగించడం ద్వారా వేతనాలు చెల్లించే సాంప్రదాయాన్ని పునరుద్ధరించాడు. ఆ విధంగా కొత్త పేరుతో చిన్న చిన్న ఇక్తాలను మళ్లీ సృష్టించాడు. పైగా, అతడు బలగాల భూమి కేటాయింపులు, పదవులను ఆచరణలో వారసత్వంగా మార్చివేశాడు. ఫిరోజ్ ప్రదానం చేసిన రాయితీలు దీర్ఘకాలమైనవిగా దాపురించాయి. లోఢీల పాలనలో (1451–1526) పరిపాలనా బాధ్యతలు, రెవెన్యూ కేటాయింపులను మేళవించి సర్కార్, పరగణాలను స్థాపించారు. ఈ రెండు పరిపాలనా విభాగాలుగానే కాకుండా రెవెన్యూ కేటాయింపులుగా పనిచేశాయి.

పై వివరణ నుండి ఇక్తా వ్యవస్థ చరిత్రలోని మూడు దశలను ఈ కింది విధంగా పేర్కొనవచ్చు. మొదటిది, 13వ శతాబ్దం సందర్భంగా కప్పం వసూలు చేసే గవర్నర్ల మధ్య సామ్రాజ్యం సరళంగా విభజించబడి ఉండేది. రెండవది, 14వ శతాబ్దం తొలియార్థంలో రెవెన్యూ డిమాండ్ పెరిగింది. అలాగే ఇక్తాల ఆదాయం కూడా పెరిగింది. అదే సమయంలో ఇక్తాలపై రాచరిక కుటుంబం తీవ్రమైన నియంత్రణను స్థాపించింది. చివరగా, 14వ శతాబ్దం మధ్యభాగం నుండి 16వ శతాబ్దం తొలి సంవత్సరాల వరకు ఇక్తాల నిర్వహణ సాధారణ స్వరూపానికి తిరిగి మళ్లింది. అయితే ఒక్క మార్పుతో ఇపుడు ఇక్తాదారులు రైతుల మిగులును తమ సొంత అవసరాల కోసం నేరుగా కాజేశారు.

ఇక్తా వ్యవస్థలో ఈ పరిణామాలు పాలకవర్గ మార్పులో వచ్చిన మార్పులతో చాలా దగ్గరగా ముడిపడి ఉండేవి. తొలిదశలో పాలకవర్గ పొందిక సాధారణంగా స్థిరంగానే ఉండేది. పాలకవర్గం కేవలం తుర్కు నేపథ్యం ఉన్న రాచరిక బానిసలు, వారి కుటుంబాలకు పరిమితమై ఉండేది. అయితే అల్లావుద్దీన్ నేతృత్వంలో రాచరిక నిరంకుశత్వ పాలన మొదలు కావడంతో పాలకవర్గ పొందికలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. పాతశక్తులను నాశనం చేశాడు. భారతీయ తుర్కులు, భారతీయ బానిసలు, విదేశీ వలసదారులు లాంటి కొత్త శక్తులు ఇపుడు సుల్తాన్ అధికార యంత్రాంగంలో భారీగా చేరిపోయారు. వర్గ పొందికలో ఇంతటి భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. పాత శక్తులను నాశనం చేశాడు. భారతీయ తుర్కులు, భారతీయ బానిసలు, విదేశీ వలసదారులు లాంటి కొత్త శక్తులు ఇపుడు సుల్తాన్ అధికార యంత్రాంగంలో భారీగా చేరిపోయారు. వర్గ పొందికలో ఇంతటి భారీ మార్పులు రావడానికి కారణం ఇక్తా వ్యవస్థ స్వభావమే. పాలకవర్గంలోని వ్యక్తిగత సభ్యులకు భూమిలేదా ప్రాంతంపై ఎలాంటి హక్కు ఉండేది కాదు. రాజు అభీష్టం మేరకు వారికి ఆదాయం దక్కేది, లేదా పోయేది. కొంత కాలం పాటు రాజు చేతిలో ఇంతటి విస్తృతమైన అధికారాలు కేంద్రీకృతం కావడం దోపిడీకి కొత్త వ్యవస్థను ఏర్పాటుచేయడానికి ఎంతో అవసరమని తోచింది. ఈ లక్ష్యం నెరవేరగానే శాశ్వత లేదా పాక్షిక వారసత్వ హక్కు పట్ల అధికారులు, సైనిక నాయకులు మక్కువ పెంచుకున్నారు. చివరకు ఫిరోజ్ తుగ్లక్ సంస్థానాధీశులకు పూర్తిగా లొంగిపోయారు. లోఢీల పాలనలో సంస్థానాధీశులు పూర్తి స్థాయిలో హక్కులను దక్కించుకున్నారు.

**పన్ను వ్యవస్థ:**

ఢిల్లీ సుల్తాన్‌లు విధించి, వసూలుచేసిన వివిధరకాల పన్నులను స్థూలంగా రెండు వర్గాలుగా విభజించవచ్చు. 1. మతపరమైన పన్నులు. 2. లౌకిక పన్నులు. తొలిరకం పన్నులలో జకత్ ముస్లింల ఆస్తులు, భూములపై విధించబడిన పన్ను. అయితే మౌలికంగా ఈ రాబడి మతపరమైన, సేవాపరమైన అవసరాలకు వెచ్చించేవారు. దీనిని సద్ర్‌శాఖ పంపిణీ చేసేది. రెండవ మతపరమైన పన్ను జిజ్యా. దీనిని ముస్లిమేతరులు లేదా జిమ్మీలపై విధించేవారు. రాజ్యం వారి జీవితానికి, ఆస్తికి, ప్రార్థనాలయానికి కల్పించే భద్రతకు గాను ఈ పన్ను వసూలు చేసేవారు. అయితే కొన్ని తరహాల వ్యక్తులు ఈ పన్ను నుండి మినహాయించబడ్డారు. ముఖ్యంగా కదలిక లేనివారు, మైనర్లు, భిక్షువులు, పేదలు, పురోహితులకు జిజ్యా వర్తించేది కాదు.

లౌకిక లేదా భౌతిక పన్నులలో ఖరజ్ ముఖ్యమైనది. రాజ్యానికి అది ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. అదే భూమి శిస్తు. తొలుత దానిని ముస్లిమేతర రైతుల నుండి వసూలు చేసినా తర్వాతి కాలంలో ఖలీసా భూములను సాగుచేసే ముస్లింల నుండి సైతం వసూలు చేశారు. మత మార్పిడిలు భారీ స్థాయిలో జరగడంతో రాజ్య ఆదాయం పడిపోకుండా ఉండేందుకు ఈ మార్పును చేసి ఉంటారు. భూమి శిస్తును అంచనా వేయడంలో పొలం విస్తీర్ణంతో పాటు పంట స్వరూపాన్ని పరిగణనలోకి తీసుకునేవారు. అయితే సాధారణ పద్ధతి మాత్రం పంటల విభజనే. పంట వైశాల్యం బట్టి శిస్తును నిర్ధారించేందుకు అల్లావుద్దీన్, మహమ్మద్ తుగ్లక్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అయితే ఈ పథకం పెద్దగా పురోగతి సాధించలేదు. భూ యాజమాన్య కాలపరిమితి కూడా స్పష్టంగా ఉండేదికాదు. రాజ్యానికి మరో ఆదాయ మార్గం ఖమ్స్ లేదా గనులు, ఖజానాలపై పన్ను, యుద్ధ కానుకలలో వాటా. చట్టపరంగా చెప్పాలంటే రాజ్యానికి యుద్ధ కానుకలలో కేవలం ఐదో వంతు వాటా మాత్రమే దక్కాలి. అయితే ఫిరోజ్ మినహా ఢిల్లీ సుల్తాన్‌లందరూ ఈ వాటాను సవరించి రాజ్యానికి ఐదింట నాలుగువంతులు, సైనికులకు ఐదో వంతుగా నిర్ధారించారు. అలాగే గనులు, ఖజానాలపై పన్ను ఆదాయంలో ఐదవ వంతుగా ఉండేది. అలాగే లౌకిక పన్నులు మరెన్నో ఉండేవి. ముఖ్యంగా నీటిపారుదల పన్ను (షిర్బ్), మేత పన్ను, వ్యాపారులు, వర్తకులపై కస్టం, ఎక్సైజ్ సుంకాలు, ఇంటి పన్నులు ఉండేవి. పన్నులను నగదు, వస్తూ రూపేణా చెల్లించేవారు. అయితే అల్లావుద్దీన్ లాంటి సుల్తాన్‌లు ద్వినది లాంటి కొన్ని ప్రాంతాలలో వస్తురూపేణా పన్నును వసూలు చేయడానికి ప్రాధాన్యత ఇచ్చారు. రాజ్య ఆదాయాన్ని కేంద్ర ఖజానాలో జమ చేసేవారు. వివిధ శాఖలకు వజీర్ నిధులను కేటాయించేవాడు. రెవెన్యూ పరిపాలనలో వజీర్‌కు మరెందరో అధికారులు సహకరించేవారు. అయితే ఆధునిక పద్ధతి అయిన బడ్జెట్ రూపకల్పన గురించి ఎలాంటి అవగాహన ఉండేదికాదు. రాచరిక ఖజానాను తన సొంత ఆస్తిగా పరిగణించడానికి సుల్తాన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉండేది.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పులు:

ఈ కాలంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కూడా మార్పులు వచ్చాయి. అయితే అవి పట్టణ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులలాగా అంత బ్రహ్మాండంగా ఉండేవి కావు. ముందుగా చెప్పాలంటే ఢిల్లీ సుల్తాన్‌లు నీటిపారుదల సౌకర్యాలు కల్పించడం ద్వారా, రైతులకు రుణాలు (తక్కావి) అందించడం ద్వారా వ్యవసాయ దిగుబడిని పెంచడానికి ప్రత్నించారు. కేవలం తిండి గింజలనే కాకుండా వాణిజ్య పంటలను కూడా సాగుచేయాలని వారు రైతులను ప్రోత్సహించారు. పండిన ధాన్యమంతా స్థానిక వినియోగానికే సరిపోయేది. మత శాస్త్రవేత్తలు, విద్వాంసులు, ఆస్థానంలోని దిగువ శ్రేణి అధికారులు, పదవీ విరమణ పొందిన అధికారులకు సుల్తాన్‌లు బంజరు భూములను కేటాయించి వాటిని సాగులోకి తీసుకువచ్చారు. భారతీయ ఫలాల నాణ్యతను పెంచడానికి, ఉద్యానవన వ్యవస్థను మెరుగుపరచడానికి కూడా సుల్తాన్‌లు ప్రయత్నించారు.

అయితే సుల్తాన్ రాజ్యం కాలంలో రైతుల ఆర్థిక పరిస్థితిలో ఎలాంటి మౌలికమైన మార్పు రాలేదు. ముందులాగే రైతులు భారతదేశ జనాభాలో ఈ కాలంలో కూడా పెద్ద వర్గంగా ఉండేవారు. సాధారణంగా తుర్కు పాలకులు పంట దిగుబడిలో మూడో వంతు భాగాన్ని భూమిశిస్తుగా కోరుకునేవారు. ద్వినదిలాంటి కొన్ని సారవంతమైన ప్రాంతాలలో అల్లావుద్దీన్, మహమ్మద్ తుగ్లక్‌లు పంట దిగుబడిలో సగభాగాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వాటా దిగుబడిలో సగభాగం నిర్థారించినపుడు తప్ప మిగతా సందర్భాలలో రైతులు పన్నుల వడ్డనను ప్రతిఘటించకపోవడం చూస్తే వారి ఆర్థిక పరిస్థితిలో స్థూలంగా ఎలాంటి మార్పు రానట్లు బోధపడుతుంది. అయితే రైతులందరూ ఒకే స్థాయిలో జీవించలేదు. గ్రామ పెద్దలు (ముకద్దమ్), చిన్న భూస్వాములు (ఖుత్) ఉన్నతమైన జీవన ప్రమాణాలను అనుభవించారు. తమ సొంత భూములతోపాటు పన్నురహిత భూములను కూడా కలిగి ఉండేవారు. లేదా పన్ను నామమాత్రంగా ఉండే భూములను సాగుచేసేవారు. కొన్నిసార్లు, తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి సాధారణ రైతులను తమ వంతు వాటా కూడా చెల్లించేలా ఒత్తిడి చేసేవారు. హిందూ రాయ్‌లు లేదా స్వతంత్ర రాజులు విలాసవంతమైన జీవితాన్ని గడిపేవారు. వీరిలో చాలామంది ఢిల్లీ సుల్తాన్‌లు ప్రత్యక్ష పాలన ఉన్న ప్రాంతాలలో సైతం ప్రబలమైన శక్తిగా వ్యవహరించేవారు.

## పట్టణ ఆర్థిక వ్యవస్థ:

ఈ కాలపు సమకాలీన చరిత్రకారులు ఇబ్న్ బట్టుట, ఇసామీ, బరానీ లాంటి వారు ఆర్థిక వ్యవస్థలో, ముఖ్యంగా పట్టణ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకున్న కొన్ని ముఖ్యమైన మార్పుల గురించి, అలాగే వస్తువుల ధరల గురించి ప్రస్తావించారు. ఉత్తర ఆఫ్రికా యాత్రికుడైన ఇబ్న్ బట్టుట సుమారు ఎనిమిదేళ్ల పాటు మహ్మద్ తుగ్లక్ ఆస్థానంలో గడిపాడు. దేశంలో అందుబాటులో ఉన్న వస్తువుల గురించి, రహదారుల పరిస్థితి గురించి స్థూలంగా ప్రజల

ఆర్థిక జీవితం గురించి చక్కటి వర్ణనలను అందించాడు. సుల్తాన్ రాజ్యం పట్టణ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన ప్రగతిని చవిచూసింది. మూడు పరస్పర సంబంధంగల పరిణామాలు చోటు చేసుకున్నట్లు కనబడుతోంది.

1. పట్టణాల సంఖ్య, వైశాల్యంలో గణనీయమైన విస్తరణ.
2. హస్తకళాకృతుల ఉత్పత్తిలో భారీ పెరుగుదల.
3. తత్సంబంధిత వాణిజ్య విస్తరణ.

**పట్టణ ప్రగతి:**

ఉత్తర భారతదేశంలో 13, 14వ శతాబ్దాల సందర్భంగా ఎన్నో నగరాలు, పట్టణాల ఆవిర్భావం, ప్రగతిని చరిత్రకారులు నివేదించారు. బ్రోచ్, కాంబే, ముల్తాన్, లక్నౌతీ, సొనార్‌గావ్, లాహోర్, అనహిల్వారా మొదలైన నగరాల గురించి సవివరమైన వర్ణన ఉంది. ఇబ్న్ బట్టుట ప్రకారం ఢిల్లీ ఇస్లామిక్ తూర్పు ప్రాంతమంతటిలో అతి పెద్ద నగరం. దౌలతాబాద్ కూడా ఢిల్లీ అంత విశాలంగా ఉండేది. ఆయా వంశాల రాజ్యానికి రాజధాని గుండెకాయలాగా ఉండేది. దానికి బలమైన సంరక్షణ అవసరమయ్యేది. దేశవ్యాప్తంగా భారీ రాతి కోటలు నిర్మాణమయ్యాయి. కోట (1264), బీజాపూర్ (1325), విజయనగర (1336), గుల్బర్గా (1347), జాన్‌పూర్ (1359), హిస్సార్ (1361), అహ్మదాబాద్ (1413), జోధ్‌పూర్ (1465), లూథియానా (1481), అహ్మద్‌నగర్ (1494), ఉదయ్‌పూర్ (1500), ఆగ్రా (1506)లలో భారీ కోటలు వెలిశాయి. ఈ నేపథ్యంలో సామ్రాజ్య రాజధానిగా ఢిల్లీ తన సుదీర్ఘమైన ప్రస్థానాన్ని ప్రారంభించింది. మాల్వా, దక్కనులోకి వ్యూహాత్మకంగా చొచ్చుకుపోయింది.

చాలా సందర్భాలలో కొత్త పాలక వంశపు రాజధానులు సారవంతమైన ప్రాంతాలలో ఏర్పడలేదు. లేదా నది పరివాహక ప్రాంతాలలో దిగువన ఏర్పాటు కాలేదు. అందుకు భిన్నంగా అవి ఎగువ ప్రాంతాలలో నిర్మాణమయ్యాయి. లేదా సమాచార, సరఫరా రహదారులలో వ్యూహాత్మక స్థావరాలలో ఏర్పాటయ్యాయి. రాజ్య పరిధి విస్తరించే కొద్దీ కోటలు ప్రహరీగోడలతో కూడిన నగరాలుగా రూపాంతరం చెందాయి. నగరాలలో రాజభవనాలు, విశాలమైన ప్రాంగణాలు, ఉద్యానవనాలు, జలపాతాలు, సైనిక స్థావరాలు, అశ్వశాలలు, మార్కెట్లు, మసీదులు, ఆలయాలు, సమాధులు, సేవకుల నివాస ప్రాంతాలు వెలిశాయి. ప్రహరీ ఉన్న ప్రాంతాల వాస్తు శైలి పెద్ద వ్యాపారంగా మారింది. అది సరికొత్త నగర వాతావరణాన్ని సృష్టించింది. సాధారణ కోట లోపల మనకు రాజప్రసాద వైభవం కనిపిస్తుంది. అలాగే సైనిక స్థావరాలు, అశ్వశాలలూ కనిపిస్తాయి. స్వయం పోషక, సాయుధ నగరం కనిపిస్తుంది. ఇందులోని శక్తులు చాలా వరకు బయటి ప్రాంతాల నుండి వచ్చినవే. నిపుణులైన సైనికులతో కూడిన శాశ్వత సైన్యాలు, వ్యాపార సమూహం నుండి సరఫరాలు, వలసలు ఈ కొత్త పట్టణ ప్రాంతాలను

పెంచిపోషించాయి. కేవలం తమ రాజధాని చుట్టూ ఉన్న గ్రామీణ ప్రాంతంపైనే ఏ కొత్త పాలకవంశం ఆధారపడలేదు. వంశాలు ఎంత చిన్నవైనా రాజ్య విస్తరణ కోసం ఎడతెగని ప్రయత్నాలు చేశాయి. ఈ విషయంలో పాలకవంశాలన్నీ దాదాపు సామ్రాజ్య కాంక్షగలవే.

రాజకీయ భౌగోళిక శాస్త్రం కేవలం వ్యవసాయదారుల మూల ప్రాంతాలపైనే దృష్టిసారించలేదు. అది సైన్యాల మార్గాలను అనుసరించింది. సుల్తాన్ రాజ్యంలో కోటలు ఆయా ప్రాంతాలలో వెలిశాయి. ప్రతి కోటలోనూ సైన్యం ఉండేది. సైన్యం చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూమి నుండి పన్నులు వసూలుచేస్తూ మనుగడ సాగించేది. ఒక కేంద్ర అధికారానికి స్థానిక కోట కమాండర్లు కట్టుబడి ఉండడంతో వంశాలు విస్తరించాయి. కమాండర్లు స్వాతంత్ర్యం ప్రకటించుకుంటే వంశాలు విచ్ఛిన్నమయ్యేవి. ఇలా అనేకసార్లు జరిగింది కూడా. రెండు గొప్ప సామ్రాజ్యవాద విజయ గాథలు ఢిల్లీ సుల్తాన్‌లు, మొగల్ చక్రవర్తులకు చెందుతాయి. ఢిల్లీ సుల్తాన్‌ల ఐదు వంశాలు సుమారు 300 ఏళ్ల పాటు (1206–1526) సామంత రాజులను ఉమ్మడిగా దగ్గరికి తీసుకున్నాయి. 1556 మొదలుకొని 1707 వరకు మొగల్ చక్రవర్తులు (అక్బర్ పట్టాభిషేకం నుండి ఔరంగజేబ్ మరణం వరకు) విశాలమైన సైనిక బలగాలను నియంత్రించారు.

పట్టణవాదం సైనిక నియంతృత్వాలలో కొత్త శిఖరాలకు చేరుకుంది. సైనిక పాలనలు భౌతిక, సామాజిక చలనాన్ని భారీ ఎత్తున ప్రోత్సహించాయి. వ్యాపార మార్గాలను సైన్యాలు సంరక్షిస్తే సుల్తాన్‌లు వ్యూహాత్మకమైన రహదారులను నిర్మించారు. సౌభాగ్యానికి సైన్యం ఖచ్చితమైన మార్గాన్ని అందించేది. ఒక వ్యక్తి వృద్ధిలోకి రావాలంటే సైన్యంలో చేరి నిరంతరం ప్రయాణించవలసి వచ్చేది. యుద్ధం కోసం అనేక మంది సుదూరపు ప్రాంతాలకు ప్రయాణం కట్టేవారు. బీహార్, ఉత్తరప్రదేశ్ సరిహద్దులోని భోజ్‌పురి ప్రాంత రైతులు ప్రతి సంవత్సరం కోతలు అయిన తర్వాత దక్కను లాంటి సుదూర ప్రాంతానికి వెళ్లి యుద్ధం చేసేవారు. వేతనాలతోపాటు యుద్ధ కానుకలలో వాటాతో ఇంటికి తిరిగి వచ్చి తదుపరి పంటకు సిద్ధమయ్యేవారు. దక్కనులో సమీప ప్రాంతాలలో యుద్ధంకోసం వలస వెళ్లడం నిత్యకృత్యంగా మారింది. రైతులు యుద్ధాలలో పాల్గొనడం ద్వారా మనుగడ సాగించేవారు. యోధులు వచ్చి చేరడంతో వంశాలు విస్తరించాయి. యుద్ధం వల్ల రైతులు ఇంటికి దూరమై వ్యవసాయ కార్యకలాపాలు కుంటుపడేవి. గ్రామీణులు సైన్యాలను పోషించే దుస్థితి ఏర్పడేది. నిరంతర సంచార జీవితానికి అనేకమంది ప్రజలు బాగా అలవాటుపడిపోయారు. సీజన్లలో వలసపోయేవారు, యుద్ధం, కరువు నుండి పారిపోయేవారు, సైన్యం సరఫరాదారులు, శిబిరాన్ని అనుసరించేవారు, పని కోసం వెదుకుతూ తిరిగే వృత్తిదారులు, కొత్త భూముల అన్వేషణలో ఉండే రైతులు, వ్యాపారులు, దేశదిమ్మరులు, పోడు వ్యవసాయం చేసేవారు, వేటకారులు, పశుకాపరులు, రవాణాదారులు... వీరంతా సంచార జీవితాన్ని గడిపేవారు. మొత్తమ్మీద ఈ ప్రజలు మధ్యయుగానికి చెందిన విశాల రాజ్యాల జనాభాలో సగం వరకు ఉండేవారు.

ఈ సంచార జీవితం వాణిజ్యాన్ని వివిధ మార్గాలలో పెంచింది. దీని గురించి తర్వాత చర్చిద్దాము. అయితే ఉత్పత్తులు, సేవల కేంద్రీకరణ, వాణిజ్య సరఫరా, డిమాండ్ల ఘనీకరణ కారణంగా ఒక ప్రత్యేకమైన పట్టణవాదం అభివృద్ధి చెందింది. పాలకవంశ సైనికశక్తి స్థావరాల చుట్టూ ఇలాంటి వాదం బలపడింది. ఇంటిపట్టున ఉండే సైన్యాలు, యుద్ధరంగంలో లేదా ప్రయాణంలో ఉండే బలగాలకు విభిన్నమైన సరుకులు, సేవలు అవసరమయ్యేవి. అశ్వాల నుండి ఆయుధాల వరకు అలాగే ఆహారం, కంబళి, నగలు, కళ, వినోదం సైనికులకు అవసరమయ్యేవి. పాలకులు నగదు, అప్పును పోగుచేసి సైన్యాలకు వేతనాలు, యుద్ధ సామాగ్రిని సమకూర్చేవారు. యుద్ధానికి అవసరమైన నిధులు సమీకరించాలంటే పాలకులు సంచార సైనిక నగరాలను నెలల తరబడి సరఫరా చేయాల్సి వచ్చేది. ఇలాంటి నగరాలలో వివిధ హోదాలుగల సైనిక సిబ్బంది, సరఫరాదారులు, సేవకులు, అనుబంధసేవా బృందాలు కార్యకలాపాలు నిర్వహించేవారు.

తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి సుల్తాన్‌కు నగదు అవసరమయ్యేది. ఆ ధనంతో అతడు తన విశాలమైన సైనిక శక్తిని ప్రదర్శించేవాడు. పాలక వంశంలో సమస్యలు తలెత్తినప్పుడు ఆర్థిక సహాయం లభించడం చాలా కష్టమయ్యేది. ఫలితంగా రాజకీయాలలో బ్యాంకర్లు, వ్యాపారులు శక్తిమంతులుగా తయారయ్యారు. పట్టణ సమాజం, సంస్కృతిలో కూడా వారు ప్రభావశీలురుగా ఎదిగారు.

**హస్తకళల అభివృద్ధి :**

భారతదేశంలో తుర్కులు సాంకేతిక మార్పులు లేదా మెరుగుదలలు ప్రవేశపెట్టడంతో హస్తకళల ఉత్పత్తిలో భారీగా పురోగతి వచ్చింది. ఉదాహరణకు పత్తి జౌళి రంగం గొప్ప మార్పును చవి చూసింది. నూలురాట్నం తదితర ఆధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో వస్త్రాల ఉత్పత్తి గణనీయంగా అభివృద్ధి చెందింది. వస్త్రాల నాణ్యతకు బెంగాల్, గుజరాత్‌లు ప్రసిద్ధిగాంచాయి. ఇతర ప్రాంతాలలోని పట్టణాలు కూడా ఉన్నత నాణ్యతగల వస్త్రాలను ఉత్పత్తి చేశాయి.

విలాసవంతమైన పట్టు వస్త్రాల రంగంలో కూడా ఇలాంటి విస్తరణ సాధ్యమైంది. భారతదేశంలో తుర్కులు సెరికల్చర్‌ను ప్రవేశపెట్టారు. పట్టు దేశీయంగా ఉత్పత్తి కావడంతో పట్టు పరిశ్రమకు ముడిసరుకులు చాలా చవకగా లభించాయి. అంతవరకు ఆ పరిశ్రమ ముడిసరుకుల కోసం ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లపై ఆధారపడే ఉండేది. అయినప్పటికీ పట్టు వస్త్రాలను చాలా వరకు దిగుమతి చేసుకునేవారు. ఎందుకంటే ఒక్క బెంగాల్‌లోనే సెరికల్చర్‌ను చేపట్టేవారు. అక్కడి నుండి సరఫరాలు దేశమంతటికీ సరిపడ స్థాయిలో ఉండేవి కావు.

ఈ కాలంలోనే భారతదేశంలో కాగితపు పరిశ్రమ స్థాపించబడింది. 15వ శతాబ్దంలో కాగితం కొరత తీవ్రంగా ఉండేది. అయితే 14, 15వ శతాబ్ధాలలో అది పెద్ద పరిమాణంలో అందుబాటులో ఉండేది. నిర్మాణ కార్యక్రమాలలో కూడా సాంకేతిక మార్పులను ప్రవేశపెట్టారు.

గచ్చు, కలప సహాయంతో నిలిచే పైకప్పు– తదితర కొత్త పద్ధతులు విశాలమైన, పైకప్పు ఇటుకల నిర్మాణాన్ని సాధ్యం చేశాయి. ఢిల్లీకి చెందిన శిల్పులు, మేస్త్రీలు మొత్తం ముస్లిం ప్రపంచంలో ఉన్న తమతోటి వృత్తికారుల కంటే గొప్పవారని అమీర్ ఖుస్రో గర్వంగా పేర్కొన్నాడు. ఇతర చేతివృత్తిలు కూడా అనేకం ఉండేవి. తోళ్ల పరిశ్రమ, లోహ పరిశ్రమ, తివాచీల పరిశ్రమ, బంగారు వెండి పనులు తదితర వృత్తులు అభివృద్ధి పథంలో పయనించాయి.

### వ్యాపార, వాణిజ్యాల ప్రగతి:

**వాణిజ్యీకరణ విస్తరణ:** మంగోలుల ఆధిపత్యం తర్వాత అభివృద్ధి చెందిన కొత్త ఆసియా ప్రపంచంలో ఇబ్న్ బట్టుట పర్యటించాడు. మొరాకోలోని తాంజియర్‌లో జన్మించిన బట్టుట 1325లో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. భూమార్గాన మక్కాకు చేరుకొని అక్కడి నుండి పర్షియా, సమర్‌ఖండ్ గుండా భారత్‌లో అడుగుపెట్టాడు. సుల్తాన్ ఆస్థానంలో (ఢిల్లీ) అతడు ఎనిమిదేళ్లు జీవించాడు. తర్వాత సుల్తాన్ రాయబారిగా చైనా పర్యటించాడు. సుమత్రా, శ్రీలంక, కేరళ, గోవా, గుజరాత్‌ల గుండా సముద్ర మార్గాన దేశానికి తిరిగి వచ్చాడు. ఆ తర్వాత మొరాకో బయల్దేరి వెళ్లాడు. అతడి సునిశితమైన వ్యాఖ్యానాలు వాణిజ్య,వ్యాపార పరిస్థితులను అద్దం పడతాయి. తుర్కిస్తాన్‌లో అతడు అశ్వాలు పెద్ద సంఖ్యలో ఉండడాన్ని గమనించాడు. అయితే వాటి ధర నామమాత్రంగా ఉందని పేర్కొన్నాడు "బెంగాల్ విశాలమైన రాజ్యం. అక్కడ బియ్యానికి కొరతలేదు. ధరలు తక్కువగా ఉన్న ఇలాంటి భూభాగాన్ని నేను ప్రపంచంలో మరెక్కడా చూడలేదు," అని రాశాడు. గోవా నుండి క్విలన్‌కు భూమార్గాన పయనిస్తూ అతడు ఇలా రాశాడు: "ఇంత కంటే సురక్షితమైన రహదారిని నేనెక్కడా చూడలేదు. ఎందుకంటే ఒక చిన్న కాయను తస్కరించినా వారు మరణశిక్ష విధిస్తారు. చెట్టు నుండి పండు రాలినా ఏ ఒక్కరూ ఏరుకోరు ఒక్క యజమాని తప్ప."

తొలి మధ్యయుగపు శాసనాలు గణనీయమైన వాణిజ్య కార్యకలాపాలను ప్రస్తావించకపోయినా మధ్యయుగ నివేదికలు 1200 తర్వాత వాణిజ్యం నాటకీయంగా విస్తరించిందని సూచిస్తాయి. ప్రధాన వ్యాపార సముదాయాలు సుదూర ప్రాంతాలలో వ్యాపారం నిర్వహించేవారని పేర్కొంటాయి. ఇబ్న్ బట్టుట సూచించినట్లు కొన్ని ప్రాంతాలలో ప్రత్యేక ఉత్పత్తులను భారీ ఎత్తున తయారు చేసేవారు. పాలకులు తమ రాజ్య పరిధిలో వ్యాపారుల కార్యకలాపాలను పరిరక్షించారు. ఒక శతాబ్దం క్రితం మార్కో పోలో పర్యటించిన మార్గంలోనే బట్టుట ప్రయాణించాడు మధ్యఆసియా, హిందూ మహాసముద్రం, దక్షిణచైనా సముద్రం విశాలమైన వాణిజ్య మార్గంగా ఉండేది. మధ్య ఆసియా, దక్షిణ సముద్రాల మధ్య దక్షిణాసియా విశాలమైన భూ వంతెనగా ఉండేది. హిందూ మహాసముద్రంలోని సుదూర, సమీప వ్యాపార మార్గాలు తీరప్రాంతంతో అనుసంధానమై ఉండేవి. చైనా, ఐరోపాల మధ్య సుదూర మార్గాలు ఎప్పుడూ దక్షిణాసియాను తాకేవి. గుజరాత్ నుండి బెంగాల్ వరకు విస్తరించి ఉన్న తీరమార్గాలను ఈ సుదూర ప్రయాణాలు ఉపయోగించేవి. కైరోలోని తొలి మధ్యయుగ నివేదికలు గుజరాత్, మలబార్‌లకు యాత్రలను వివరిస్తాయి. మధ్యధరాకు చెందిన అనేక మంది వ్యాపారులకు

కొచ్చిన్ భారతదేశ ప్రవేశానికి రేవుగా ఉండేది. పశ్చిమం నుండి వచ్చిన అనేక మంది క్రైస్తవ, ముస్లిం యూదు వ్యాపారులు తొలి మధ్యయుగ కాలంలో కేరళలో స్థిరపడిపోయారు. అక్కడి హిందూ పాలకులు తన వంశ సంపదను పెంచుకోవడానికి ఈ వ్యాపారులపై ఆధారపడ్డారు. మంగళూరులో ఫార్స్ (పర్షియా), యెమన్ వ్యాపారులు అడుగుపెట్టడాన్ని ఇబ్న్ బట్టుట గమనించాడు. అక్కడ మిరియాలు, అల్లం పెద్ద ఎత్తున లభించేవి. 1357లో 12వ పోప్ బెనడిక్ట్ చైనా రాయబారి జాన్ (మారిగ్నోలా) క్విలన్‌ను భారతదేశంలో కల్లా అత్యంత ప్రఖ్యాతమైన నగరంగా పేర్కొన్నాడు. "ప్రపంచంలోని మిరియాలన్ని ఇక్కడే పండుతాయి," అని చెప్పాడు. 1498లో వాస్కోడిగామా మలబార్‌లో అడుగు పెట్టిన తర్వాత ఐరోపావాసులు పశ్చిమ తీరంపై శాశ్వత నివాసం కోసం కోటలను నిర్మించడం మొదలుపెట్టారు.

తీరం, దాని సముద్రాంతర సంబంధాలు లోపలి భూభాగాలలో నివసించే ప్రజలకు చాలా ప్రధానంగా మారాయి. అలాగే హిందూ మహాసముద్ర రేవులు కూడా లోపలి సమాజాలకు ముఖ్యమయ్యాయి. సముద్ర మార్గాన దిగుమతి చేసుకునే అశ్వాలు యోధులకు అవసరమయ్యాయి. రైతులు వ్యవసాయాన్ని ఎగువప్రాంతాలకు విస్తరించడంతో ఎగుమతులు కూడా విపరీతంగా పెరిగాయి. అక్కడి ఉత్పత్తి ప్రాంతాలు వ్యాపార వ్యవస్థల్లో ప్రవేశించాయి. ఈ వ్యవస్థలు నదులగుండా సముద్రం వరకు విస్తరించి ఉండేవి. ఎగువ ప్రాంతాల్లోని అడవులు మసాలాదినుసులు, కలప, తేనె, పండ్లు, ఏనుగులు, ఇతర విలువైన వస్తువులెన్నింటినో తీర ప్రాంతానికి పంపించి ప్రతిఫలంగా బియ్యం, మాంసం, పరికరాలు, ఇతర ఉత్పత్తులను తెప్పించుకునేవి. ఈ నేపథ్యంలో రైతులు నల్లరేగడి భూములలో పత్తిని పండించడంలో నైపుణ్యం సాధించారు. 1500 నాటికి పత్తి, పట్టువస్త్రాల తయారీ, వ్యాపారం, వినియోగం పెరిగింది. ఇందులో అనేక మంది నిపుణులు అంతర్భాగంగా ఉండేవారు: సాగుదారులు, నూలుఒడికే వారు, చేనేతలు, రంగుదారులు, రవాణాదారులు, బ్యాంకర్లు, గుత్తవ్యాపారులు, చిల్లర వ్యాపారులు. తొలుత వస్త్రవినియోగదారులు పట్టణ ప్రాంతాలకే పరిమితమై ఉన్నా తర్వాతి కాలంలో అన్ని ప్రాంతాలలోనూ విస్తరించారు.

**మారకద్రవ్య పునరుద్ధరణ:**

ఢిల్లీ సుల్తాన్‌ల రాజ్యంలో వాణిజ్య ప్రగతి వారి నాణేలలో ప్రతిబింబిస్తుంది. 13,14వ శతాబ్దాలలో నాణేలను భారీగా ముద్రించారు. గతంలో ఇంతపెద్ద ఎత్తున నాణేలు చెలామణిలో ఉండేవి కావు. ఢిల్లీ సుల్తాన్‌ల పాలనాకాలంలో నాణేల సంఖ్య గణనీయంగా పెరిగింది. వాణిజ్య లావాదేవీలు తీవ్రతరం కావడంతో నాణేల సంఖ్య కూడా పెరిగింది. మహమ్మద్ ఘోరీ ముద్రించిన బంగారు నాణేలు కనౌజ్ హిందూ పాలకుల నాణేలతో పోలి ఉండేవి. లక్ష్మీ దేవి చిత్రం ప్రధానంగా ఉండే ఈ నాణేలు ఇస్లామిక్ చరిత్రలో సాటిరానివి. తొలి 40 ఏళ్లలో నాణేలను రాగి, ఇతర లోహాలు కలిపి తయారు చేసేవారు. బంగారు నాణేలు చాలా అరుదుగా ఉండేది. తొలిసుల్తాన్‌లు ముద్రించిన వెండి నాణేలు కూడా చాలా అరుదుగా

ఉండేవి. అయితే ఇల్తుమిష్ ఎన్నో రకాల వెండి టంకాలను జారీ చేశాడు. గుర్రం పై స్వారీ చేస్తున్నరాజు చిత్రం తొలినాణెంపై ప్రధానంగా ముద్రితమయ్యేది. చివరి నాణేలలో బగ్దాద్ ఖలీఫా అల్ మస్తాన్‌సిర్ నుండి అందిన ఆమోద పత్రాన్ని (మంసూర్)ముద్రించారు.

మసూద్, నసీరుద్దీన్ మహ్మద్, బాల్బన్, జలాలుద్దీన్ ఖిల్జీలు బంగారు నాణేలు ముద్రించినా అల్లావుద్దీన్ దక్షిణ భారతంపై దండయాత్ర జరిపి తన ఖజానాను సుసంపన్నం చేసే వరకు పెద్దగా చెలామణి కాలేదు. ఈ బంగారు నాణేలు బరువు, ఆకారంలో వెండిని పోలి ఉండేవి. అల్లావుద్దీన్ నాణేల డిజైన్‌ను మార్చాడు. ఖలీఫా పేరును తొలగించి తన స్వంత బిరుదులను చేర్చాడు. "రెండవ అలెగ్జాండర్, ఖలీఫత్ కుడి భుజం" అనే స్వోత్కర్షను ప్రవేశపెట్టారు. అతడి వారసుడు ముబారక్ కొన్ని ఉన్నతమైన నాణేలను జారీ చేశాడు. బంగారు, వెండి, మిశ్రమ లోహాల నాణేలు పాత శైలిలో చదరపు ఆకారంలో ముద్రితమయ్యాయి. అతడి నాణేలపై మరీ అహంకారపూరితమైన బిరుదులు కనిపిస్తాయి "ఇస్లామ్ సర్వోన్నత నాయకుడు, భూమి, స్వర్గాది ఖలీఫా" అనే బిరుదు అందుకు నిదర్శనం.

ముహమ్మద్ తుగ్లక్‌ను "బ్యాంకర్ల రాకుమారుడు" అని పిలిచారు. అతడి నాణేలు నాణ్యతలో, అక్షరాల పొందికలో ఎంతో ఉన్నతంగా ఉండడమే కాకుండా పెద్ద ఎత్తున అందుబాటులో కూడా ఉండేవి. విశాలమైన బంగారు నిల్వలు, అనేక రకల నాణేలు, అందుకోని శాసనాలు, అతడి ప్రయోగాలు (నాణేలు) ముహమ్మద్ తుగ్లక్‌ను చరిత్రలోని గొప్ప బ్యాంకర్ల సరసన నిలబెడతాయి. ఢిల్లీతో సహా ఎనిమిదిప్రాంతాలలో తొలి బంగారు, వెండి నాణేలు ముద్రితమయ్యేవి. తుగ్లక్ జారీ చేసిన నాణేలలో కనీసం 25 రకాల గురించి సమాచారం ఉంది. టోకెన్ కరెన్సీ పై ముద్రించిన శాసనాలను బట్టి వాటి విలువలను తెలుసుకోవచ్చు. అయితే రెండు రకాల విభజన ఉండేది. ఒకటి ఢిల్లీలో వినియోగించేవారు. మరో దానిని దౌలతాబాద్, దక్షిణ భారతంలో ఉపయోగించేవారు. ఢిల్లీకి సంబంధించిన వెండి టంకాను తొలుత 48, తర్వాత 50 జితల్‌గా విభజించారు. ఫిరోజ్‌షా జారీ చేసిన బంగారు నాణెం బాగా ప్రచారం పొందింది. అవి ఆరు రకాలుగా ఉండేవి. అయితే వెండి నాణేల కొరత కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఫిరోజ్ జారీ చేసిన వెండి నాణేలలో కేవలం మూడు రకాల నాణేలే లభ్యమయ్యాయి. కాని రాగి నాణేలు అనేకం బయల్పడ్డాయి. తర్వాతి పాలకుల నాణేలు విభిన్నంగా ఉన్నా అవి కేవలం రాగి, మిశ్రమలోహానికే పరిమితమయ్యాయి. ఈ కాలమంతటా రెండు మినహాయింపులతో ఒక్క ఢిల్లీ అనే పదం నాణేలలో సర్వత్రా కనిపిస్తుంది. ఫిరోజ్ తన సుదీర్ఘ పాలనలో అతడు జారీ చేసిన నాణేలు జనాదరణ పొందాయి. వ్యాపార లావాదేవీలకు కీలక మాధ్యమంగా మారాయి.

**వ్యాపార ప్రాముఖ్యత:** ఎర్రసముద్రం, పర్షియన్ ఎడారిని ఆనుకొని ఉన్న దేశాలతో పాటు ఆగ్నేయ ఆసియా దేశాలకు సముద్ర మార్గాన అనేక వస్తువులు ఎగుమతి అయ్యేవి. తీరప్రాంత వ్యాపారం, తీరప్రాంతాలు, ఉత్తరభారతం మధ్య వ్యాపారం మార్వారీ, గుజరాతీల ఆధీనంలో ఉండేది. వీరిలో చాలా మంది జైనులు. ముస్లిం బొహ్రావ్యాపారులు కూడా వాణిజ్య

కార్యకలాపాలలో పాలుపంచు కున్నారు. మధ్య, పశ్చిమాసియాకు భూమార్గాన వ్యాపారం ముల్తానీల చేతిలో ఉండేది. వీరిలో చాలా మంది హిందువులు, ఖురాసనీలు (ఆఫ్ఘన్లు, ఇరానీలు) ఉండేవారు. ముల్తానీ వ్యాపారులు చాలా సంపన్నులని, పాలకవంశీయులు సైతం వారి నుండి రుణాలు తీసుకునేవారని బరానీ చెబుతాడు. దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యానికి రాజ్యం కూడా అనుకూల పరిస్థితులను సృష్టించింది, ముఖ్యంగా రహదారుల నిర్వహణ, సరాయిల నిర్మాణం చేపట్టి వ్యాపారులు, ప్రయాణీకులకు భద్రత కల్పించింది. అలాగే దళారుల వ్యవస్థ తొలి సుల్తాన్ రాజ్యంలో నూతన పోకడగా అభివృద్ధి చెంది ఉండవచ్చు. ఆ విధంగా ఒక రాజ్యాన్ని మరో రాజ్యం నుండి వేరు చేసిన రాజకీయ, ఆర్థిక అడ్డంకులను ఢిల్లీ సుల్తాన్‌లు క్రమంగా కూల్చివేశారు. ముల్తాన్ నుండి లక్నౌతీ వరకు ఒకే ప్రభుత్వం ఉండేది. మార్కెట్ కూడా విశాలమైనది కావడంతో వ్యాపార, వాణిజ్యాలకు అవకాశాలు కూడా చాలా మెరుగ్గా ఉండేది.

ఢిల్లీ సుల్తాన్ రాజ్యంలో పట్టణ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన ఈ మార్పులు లేదా పరిణామాలకు ఈ కింది అంశాలు కారణమై ఉండవచ్చు 1) పట్టణాలలో వినియోగం కోసం వ్యవసాయ మిగులులో ఒక పెద్ద భాగాన్ని సమీకరించే వ్యవస్థను ఏర్పాటు చేయడం. 2) ఇస్లామిక్ తూర్పు ప్రపంచం నుండి భారతదేశానికి వృత్తిదారులు, వ్యాపారులు పెద్ద ఎత్తున వలసరావడం. తమతోపాటు తమ నైపుణ్యాన్ని, కొత్త పద్ధతులను, ఆచారాలను తీసుకురావడం. 3) శిక్షణ నివ్వదగ్గ కార్మికులు పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉండడం. వీరిని భారీస్థాయి బానిసీకరణ ద్వారా సమకూర్చుకునే వారు. ఇసామీ లాంటి సమకాలీన చరిత్రకారులు భారతదేశానికి వృత్తిదారులు, వ్యాపారులు వలస రావడం గురించి మంచి వివరణలు ఇచ్చారు. సైనిక దాడులలో ఖైదు చేసిన అనేక మంది బానిసలకు వృత్తిశిక్షణనిచ్చారు. ఈ వృత్తిదారులు తర్వాతి కాలంలో స్వతంత్రులై భారతదేశానికి వలసవచ్చారు. ఆ విధంగా కొత్త ఆర్థిక వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థలకు వలస, బానిసీకరణ కారణమయ్యాయి. దేశంలోని మిగులు ఉత్పత్తిని చేజిక్కించుకున్న పాలకవర్గం ఆ వనరులను చాలా వరకు పట్టణాల్లో వ్యయం చేసింది.

## విజయనగర ఆర్థిక వ్యవస్థ

### వ్యవసాయం- హస్తకళలు:

అప్పటి ప్రపంచానికి తెలిసిన ధనిక రాజ్యాలలో విజయనగర సామ్రాజ్యం ఒకటి. అనేక మంది విదేశీ యాత్రికులు ఆ సామ్రాజ్యాన్ని 15,16,వ శతాబ్దాలలో పర్యటించారు. ఆ సామ్రాజ్య వైభవాన్ని సంపదను కీర్తిస్తూ ఎన్నో వర్ణనలను వదలి వెళ్లారు. విజయనగరం సౌభాగ్య దశలో ఉండేది. సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వివేకవంతమైన నీటి పారుదల విధానంతో వ్యవసాయోత్పత్తని పెంచడం పాలకుల లక్ష్యంగా ఉండేది. పోర్చుగీసు యాత్రికుడు నూనిజ్ జలాశయ నిర్మాణం, కాలువల తవ్వకం గురించి మాట్లాడాడు. వ్యవసాయ సంపదకు అదనంగా అనేక పరిశ్రమలు ఉండేవి. వాటిలో ముఖ్యమైనవి

జౌళి, గనులు లోహ పరిశ్రమలు. మరోముఖ్యమైన పరిశ్రమ సుగంధ ద్రవ్యాల తయారీ. పరిశ్రమలు, హస్తకళలను మండళ్లు నియంత్రించేవి. ఒకే రకమైన వ్యాపారం చేసే వారు నగరంలోని ఒకే ప్రాంతంలో నివసించడం అక్కడి ప్రజల సాంప్రదాయం. పర్షియా రాయబారి, యాత్రికుడు అబ్దుర్ రజ్జాక్ ఈ విధంగా వ్యాఖ్యానించాడు: "ప్రతి వృత్తికి చెందిన వ్యాపారులు తమ దుకాణాలను పక్క పక్కనే ఏర్పాటు చేసుకున్నారు."

**వ్యాపారం-వాణిజ్యం :** అంతర్గత, తీరప్రాంత, సముద్రాంతర వ్యాపారం గణనీయంగా విస్తరించింది. సామ్రాజ్య సుసంపన్నతకు ఇదో ప్రధాన కారణం. పోర్చుగీసు యాత్రికుడు డొమింగో పేస్ ఇలారాశాడు:"ఈ రాజ్య పాలకునికి అపారమైన ధనరాశులు, లెక్కలేనన్ని సైనికులు, ఎన్నో ఏనుగులు ఉన్నాయి. ఈ నగరంలో ( విజయనగర) ప్రతి దేశం, ప్రతిజాతికి చెందిన ప్రజలు కనిపిస్తారు. ఎందుకంటే అది విలువైన వజ్రాలు, వైఢూర్యాలకు వ్యాపార కేంద్రం. ప్రపంచంలోనే ఉన్నత వసతులు కలిగిన నగరం ఇది. బియ్యం, గోధుమలు, తిండిగింజలు, మొక్కజొన్న, బార్లీ, చిక్కుడు, తృణధాన్యాలు, అశ్వాలు మొదలైనవి పెద్ద ఎత్తున నిల్వ చేయబడి ఉన్నాయి. నగరంలోని వీధులు, మార్కెట్లు అసంఖ్యాక ఎడ్లబండ్లతో నిండి పోయి ఉన్నాయి." భూమార్గాన రవాణా కోసం కావడీలు, బండ్లు, కంచెర గాడిదలు, రవాణా గుర్రాలను ప్రధానంగా వినియోగించేవారు. అబ్దుర్ రజ్జాక్ ప్రకారం రాజ్యంలో సుమారు 300 ఓడరేవులు ఉండేవి. పశ్చిమ తీరంలో ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా మలబార్ ఉండేది. కననూర్ వద్ద ముఖ్యమైన రేవు ఉండేది. హిందూ మహాసముద్రంలో ద్వీపాలు, బర్మా, మలయ ద్వీపకల్పం, చైనా, అరేబియా, పర్షియా, దక్షిణాఫ్రికా, అబిసినియా, పోర్చుగల్‌లతో విజయనగర సామ్రాజ్యానికి వ్యాపార సంబంధాలు ఉండేవి. ఎగుమతులలో వస్త్రాలు, మసాలాదినుసులు, బియ్యం, ఇనుము, చక్కెర, సైంధవ లవణం ప్రధానమైనవి. దిగుమతులలో గుర్రాలు, ఏనుగులు, ముత్యాలు, రాగి, పాదరసం, చైనా పట్టు వస్త్రాలు, మస్లిన్‌లు ముఖ్యమైనవి. బార్బోసా అనే మరో పోర్చుగీసు యాత్రికుడు ఇలా పేర్కొన్నాడు "విజయనగర చాలావరకు అధిక జనసాంద్రత కలిగిన నగరం. దేశీయ వజ్రాలకు ముఖ్యమైన వ్యాపార కేంద్రం. పేగు రూబీలు, చైనా, అలెగ్జాంండ్రియా పట్టు, మలబార్‌కు చెందిన కర్పూరం, మిరియాలు, గంధం, సుగంధద్రవ్యాలు ఇక్కడ లభిస్తాయి." తీర, సముద్రాంతర వ్యాపారానికి ఓడలను వాడేవాడు. విజయనగర సామ్రాజ్యానికి స్వంత ఓడలు ఉండేవి. నిర్మాణ ప్రక్రియ ఇక్కడి ప్రజలకు బాగా తెలుసు. అయితే మహాసముద్రాలకు వెళ్లే ఓడలను ఇక్కడ తయారు చేశారో లేదో మనకు తెలియదు. బార్బోసా ప్రకారం దక్షిణ భారత రాజ్యాలు తమ ఓడలను మాల్దీవులలో తయారుచేయించేవి.

**జీవన ప్రమాణాలు:** ఉన్నత, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు చాలా ఉన్నతంగా ఉండేవని విదేశీ యాత్రికుల కథనాలు వెల్లడించాయి. ఉదాహరణకు అబ్దుర్ రజ్జాక్ ఇలా వ్యాఖ్యానించాడు: "గ్రామీణ ప్రాంతం ప్రజలతో దట్టంగా ఉంది. దాని స్థాయిని వర్ణించడం

ఇక్కడ సాధ్యం కాదు. రాజు ఖజానాలో బంగారాన్ని కరగబెట్టి ఒకే ముద్దగా మారుస్తారు. దేశ వాసులందరూ పేదధనిక తేడా లేకుండా నగలను ధరిస్తారు. చెవులు, మెడ, చేతులు, వేళ్లకు రకరకాల నగలను, ముత్యాలను ధరిస్తారు.”

రాజధాని నగరవైభోగం దాని సంపదకు అద్దం పడుతుంది. అయితే ఉన్నత వర్గ ప్రజలకే సంపద పరిమితమై ఉండేది. కాని నిత్యావసర సరుకుల ధరలు చాలా తక్కువగా ఉండేవి. సాధారణ ప్రజలకు మౌలిక అవసరాలు వారి ఆదాయానికి అందుబాటులో ఉండేవి. అయితే ఉత్పత్తిదారులు, ముఖ్యంగా వ్యవసాయదారులు తమ దిగుబడికి తగిన ధరలు పొందేవారు కాదు. ఆర్థిక వ్యవస్థలోని మరో లోపం ఏమిటంటే సాధారణ ప్రజలు పన్నుల భారాన్ని మోయాల్సి రావడం. పన్నుల వడ్డన మరీ భారీగా ఉండేది. కొన్ని సార్లు స్థానిక అధికారులు పన్ను వసూలు కోసం అణచివేత చర్యలకు పాల్పడేవారు.

**15**

# మొగల్ ఆర్థిక వ్యవస్థ

**వ్యవసాయ రంగం :**

నేటి లాగే 16,17,18వ శతాబ్దాలలో కూడా భారత ఆర్థిక వ్యవస్థ మౌలికంగా వ్యవసాయ, గ్రామీణ–ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఉండేది. సుమారు 80 శాతం మంది ప్రజలు వ్యవసాయం చేసేవారు లేదా వ్యవసాయం నుండి ప్రధానంగా ఆదాయం పొందేవారు. అలాగే చాలా మంది ప్రజలు గ్రామాలలో నివసించేవారు. ఈ కాలంలో వెలసిన చేతివృత్తులు, ఇతర పరిశ్రమలు కూడా వ్యవసాయ ఆధారితమైనవే. సహజంగానే వ్యాపార, వాణిజ్యానికి సంబంధించిన ఉత్పత్తులన్నీ వ్యవసాయం నుండి వచ్చినవే. వ్యవసాయ ఉత్పత్తులలో కూడా తిండి గింజలు ప్రధానంగా ఉండేవి. అయితే పత్తి, నీలం లాంటి వాణిజ్య పంటలను విశాలమైన భూభాగాలలో పండించడం మొదలుపెట్టారు. ఫలితంగా నగదు ఆర్థికవ్యవస్థ (వ్యాపార లావాదేవీలన్నీ నగదులోనే జరిగేవి) గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చొచ్చుకుపోవడం మొదలుపెట్టింది. మొగల్ పాలకుల వ్యవసాయ, ఆర్థిక విధానాలు కూడా ఈ ప్రక్రియకు దోహదం చేశాయి. అప్పటివరకు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చాలా మటుకు స్వయంసమృద్ధిగా ఉండేది.

**రైతాంగ స్థితిగతులు:**

రెండు ముఖ్యమైన వ్యవసాయ వర్గాలలో రైతాంగం ఒకటి. రెండవది జమీందార్ల వర్గం. రైతాంగం ఏకలక్షణంగల వర్గం కాదు. అది చాలా వరకు విభజితమై ఉండేది. విభజన సామాజిక హోదా, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా ఉండేది. ఈ ఆధారంగా మనం రైతులను మూడు వర్గాలుగా విభజించవచ్చు. తొలి వర్గంలో ఖుద్ కాష్త్ లేదా స్వంత గ్రామాలు, స్వంత భూములు, స్వంత పరికరాలు గల రైతులు ఉండేవారు. ఒక 18వ శతాబ్దపు నివేదిక ఖుద్‌కాష్త్‌ను స్వంత భూమిని సాగు చేసే రైతుగా వర్ణించింది. అతడు స్వంతంగా కష్టపడేవాడు. అతడికి స్వంత పరికరాలు కూడా ఉండేవి. భూమిపై అతడికి పూర్తి వారసత్వ హక్కు ఉండేది. భూమిని అతడు విక్రయించవచ్చు లేదా ఇతరులకు బదిలీ చేయవచ్చు. భూమి శిస్తు చెల్లించినంత కాలం అతడిని భూమి నుండి వెళ్లగొట్టే హక్కు ఎవ్వరికీ ఉండేది కాదు. ఖుద్‌కాష్త్ ప్రధాన లక్షణం వ్యక్తిగత నాగళ్లు, కుటుంబ శ్రమను వినియోగించడం. నాట్లు, కోత సమయంలోనే

కూలీలను ఉపయోగించేవారు. గ్రామంలో ఖుద్‌కాష్త్ హోదా, వనరులు అతడి వద్ద ఉన్న వ్యవసాయ పని ముట్లుపై ఆధారపడి ఉండేది. పెద్ద సంఖ్యలో నాగళ్లు ఉంటే అతడు విశాలమైన భూభాగాన్ని సాగు చేయగలడు. అలాగే స్వంత పరికరాలు లేని ఇతర రైతులకు అతడు నాగళ్లను అరువుగా ఇచ్చేవాడు. ఆ విధంగా భూమికంటే నాగళ్లను కలిగి ఉండడమే కీలకమని చెప్పాలి. మధ్యయుగాలలో భూమి విస్తారంగా లభించేది.

రైతులకు రాజ్యం పట్ల రెండు కీలక బాధ్యతలు ఉండేవి. ఒకటి భూమి శిస్తును క్రమం తప్పకుండా చెల్లించడం, రెండు స్వంత భూములను వరుసగా సాగు చేయడం. సాధ్యమైతే వ్యవసాయ విస్తరణను, అభివృద్ధిని చేపట్టడం. సాధారణ సమయాలలో వారు సాగు చేయడానికి వ్యతిరేకించే వారు కాదు. సాగు చేయడానికి నిరాకరిస్తే రాజ్యం వారి భూములను స్వాధీనం చేసుకొని ఇతరులకు అప్పగించేది. కొందరు ఖుద్‌కాష్త్‌లు తమ విశాలమైన భూములను ఇతర వర్గాలకు చెందిన రైతులకు కౌలుకు ఇచ్చేవారు. అలాంటి రైతులకు స్వంత భూములు ఉండేవి కావు. ఇలాంటి సందర్భాలలో కూడా అతడిపై రాజ్యానికి పన్ను చెల్లించాల్సిన బాధ్యత ఉండేది. ఆ విధంగా అతడు ఒక ఆ సామీ లేదా పన్ను చెల్లింపుదారుడు. కౌలుదారుడి నుండి దిగుబడిలో కొంత భాగాన్ని 'మాలికానా' గా తీసుకునే హక్కు ఖుద్‌కాష్త్‌కు ఉండేది. రాజ్య పన్నును చెల్లించడంలో ఖుద్‌కాష్త్‌లు సమష్టి బాధ్యత వహించేవారు. అయితే భూమి వ్యవసాయ పనిముట్లు విషయంలో ఉమ్మడి యాజమాన్యం ఉండేది కాదు. ఇతర రెండు వర్గాలకు చెందిన రైతుల కంటే వీరు సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత హోదాను అనుభవించే వారు. భూమి యాజమాన్యం కారణంగానే వారికి సామాజిక ఆధిపత్యం దక్కింది. గ్రామీణ సముదాయానికి వారు నాయకత్వం వహించేవారు లేదా ప్రధాన భాగంగా ఉండేవారు. స్వంతంగా భూములను కలిగి ఉండడం, ఇతర యజమానులకు మాలికానా చెల్లించకపోవడం వల్ల ఆర్థికంగా వారు ఉన్నతంగా ఉండేవారు. గ్రామీణ సముదాయంలో వారికి నాయకత్వ హోదా ఉండడంతో ఖుద్‌కాష్త్‌లు తమ పన్ను భారాన్ని ఇతరుల మీదికి రుద్దేందుకు అనేక మార్గాలను అన్వేషించేవారు.

రెండవ వర్గంలో పాహీలు లేదా బయటివారు ఉండేవారు. వీరు గ్రామంలోని కౌలు భూములను సాగు చేసేవారు. పొరుగు గ్రామంలో నివసిస్తూనో, లేదా అదే గ్రామంలో ఉంటూనో భూములను సాగు చేసేవారు. ఈ పాహీలను మరలా రెండు వర్గాలుగా విభజించవచ్చు: స్థానికేతర, స్థానిక పాహీలు. స్థానికేతరులు పొరుగు గ్రామాల నుండి వచ్చేవారు. కౌలు భూములు ఉన్న గ్రామాలలో శాశ్వత నివాసాలు నిర్మించకుండానే వారు వ్యవసాయం చేసేవారు. ఒకవేళ స్వంత పనిముట్లు సాధించుకోగలిగితే ఈ స్థానికేతర పాహీలు ఖుద్‌కాష్త్‌లుగా ఎదిగే అవకాశం ఉండేది. స్థానికుల కంటే వీరికే ఎక్కువగా రాయితీలు ఇచ్చేవారు. సాధారణంగా ఐదు లేదా అంత కంటే ఎక్కువ సంవత్సరాలలో వీరిని పన్ను నుండి మినహాయించేవారు. పాహీల వలసకు కారణాలను అధికారిక నివేదికలలో ఇవ్వలేదు. అయితే చాలా సందర్భాలలో పాహీలు ఆర్థిక అంశాల కారణంగానే వలసవెళ్లేవారు. మూడవ వర్గంలో ముజారియం లేదా అదే గ్రామానికి చెందిన రైతు కూలీలు ఉండేవారు. అయితే వీరికి స్వంత భూములు లేదా పరికరాలు ఉండేవి కావు. కనక ఖుద్‌కాష్త్‌పై పూర్తిగా ఆధారపడి ఉండేవారు. ఈ వర్గం రైతులను రెండు ఉపవర్గాలుగా విభజించవచ్చు: ఐచ్ఛిక కౌలుదారులు, కౌలునువారసత్వ హక్కుగా కలిగిన

వారు. ఐచ్ఛిక కౌలుదారులు సంపన్న ఖుద్‌కాష్త్ భూములను సాగుచేసి మాలికానా చెల్లించేవారు. దిగుబడిలో మిగతా భాగాన్ని తమ స్వంత అవసరాల కోసం ఉంచుకునే వారు. వారిని వాటాదారుగా కూడా నియమించేవారు. వాటాగా దిగుబడిలో 30 శాతాన్ని పొందేవారు. ఈ వాటా చాలా తక్కువ. రైతులలో ఆర్థికపరమైన అసమానతలకు ఇదే ముఖ్య కారణం. కౌలు హక్కు ఉన్న రైతులు అదే గ్రామానికి చెందిన వారైనప్పటికీ గ్రామ సముదాయంలో వారికి ఎలాంటి నిర్ణయాధికారం ఉండేది కాదు.

పై మూడు వర్గాల రైతుల మధ్య సామాజిక, ఆర్థిక అసమానతలు నగదు ఆర్థిక వ్యవస్థ పెరిగే కొద్దీ మరింత విస్తరించాయి. ధనిక రైతులు ధనాన్ని పోగు చేసుకుంటూ ఇతరులను దోపిడీ చేసేవారు. ఈ ధనిక వర్గం శ్రమను వీడి భోగ విలాసాలలో తేలిపోయింది. రైతాంగంలోని పేదవర్గాలు వ్యవసాయ పనిముట్లు కోసం రుణాలు తీసుకునేవి. అలాగే గృహ వినియోగం కోసం కూడా అప్పు చేసేవి. ధనిక రైతులు పేదల భూములను కొనుగోలు చేసేవారు లేదా తాకట్టు పెట్టుకునేవారు. సారవంతమైన భూములన్నీ ధనికులకే దక్కేవి. ఈ కారణంగా గ్రామాలలో కొత్త సంబంధాలు ఏర్పాడ్డాయి. పేద రైతులను కౌలుదారులుగా, వాటాదారులుగా మార్చివేశారు. ఫలితంగా రైతాంగంలోని వివిధ వర్గాల మధ్య ప్రయోజనాల సంఘర్షణ జరిగేది.

కేవలం భూమిశిస్తు కారణంగానే రైతులు దివాళా తీశారని చెప్పడం కూడా సరైనది కాదు. భూమిశిస్తు విపరీతంగా ఉండి రైతులకు ఏమి మిగిలేది కాదని వాదిస్తారు. ఈ వాదన రెండు వాస్తవాలను విస్మరిస్తుంది. మొదటిది, వ్యవసాయ భూములు పెద్ద ఎత్తున అందుబాటులో ఉన్న పరిస్థితిలో భూమిశిస్తును ఎక్కువగా నిర్ధారించలేదు. రెండవది, మొగల్ పాలనాకాలంలో పట్టణీకరణ పెరిగింది. పట్టణాలను పోషించడానికి తిండి గింజలు ఎక్కువగా అవసరమయ్యాయి. అదే సమయంలో మొగల్‌లు వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించారు. పారిశ్రామిక ఉత్పత్తి, విదేశీ మార్కెట్ లో డిమాండ్ కారణంగా ఇలాంటి విధానాన్ని అవలంబించారు. 17వ శతాబ్దమంతటిలో వ్యవసాయ ఉత్పత్తి విస్తరించింది. నగదు పంటల సాగు కూడా పెరిగింది. ఈ విస్తరణ ప్రోత్సాహకాలు లేకుండానే సాధ్యమయ్యేది కాదు. కనక భూమి శిస్తు ఎక్కువ ఉండేదని భావించలేము. అయితే పన్నుల భారం ధనిక రైతులకంటే పేద రైతులపైనే ఎక్కువగా పడిందన్న విషయం వాస్తవం. కనుక రైతుల దారిద్ర్యానికి కేవలం భూమి శిస్తు భారమే ప్రధాన కారణం కాదు. ధనిక రైతులు, జమీందార్లు, జాగీర్దార్ల దోపిడీ కూడా అందుకు దోహదపడింది.

**జమీందార్ల హోదా, పాత్ర:**

జమీందార్లు మరో ముఖ్యమైన వ్యవసాయధార వర్గంగా ఉండేవారు. రైతాంగం కంటే ఈ వర్గం చిన్నదే అయినా రాజకీయ, సామాజిక, ఆర్థిక, సైనికపరంగా దాని హోదా చాలా ఉన్నతంగా ఉండేది. అయినప్పటికీ ఈ వర్గం కూడా ఏకలక్షణ స్వరూపం కలది కాదు. సామాజింగా, ఆర్థికపరంగా అందులో అనేక శ్రేణులు ఉండేవి. ఈ వర్గాన్ని మూడు విధాలుగా విభజించవచ్చు: స్వతంత్ర జమీందార్లు లేదా తెగ కుల నాయకులు, దళారీ జమీందార్లు, ప్రాథమిక జమీందార్లు.

స్వతంత్ర జమీందార్లు తమ తమ ప్రాంతాలకు వారసత్వ (అనువంశిక) పాలకులుగా ఉండేవారు. వీరు ఆర్థికంగా, సైనికపరంగా బలమైన వర్గానికి ప్రాతినిధ్యం వహించేవారు. మొగల్‌లకు వీరిపై స్థూల ఆధిపత్యం ఉండడంవల్ల వీరిని మూడు ఉపవర్గాలుగా విభజించవచ్చు (ఎ) మొగల్ సామ్రాజ్య సేవలో చేరి మన్సబ్‌లు, జాగిర్లు పొందిన వారు. వీరు మొగల్ పాలకులకు సైనిక సహాయం అందించేవారు (బి) మొగల్ పాలకుల సేవలో చేరనివారికి మన్సబ్, జాగీర్ దక్కలేదు. అయితే అవసరమైనప్పుడు వీరు సామ్రాజ్యానికి సైనిక సేవలు అందించాల్సి వచ్చేది. చివరగా (సి) సైనిక సేవ కాకుండా మొగల్‌లకు కప్పాన్ని, వ్యక్తిగత గౌరవవందనాన్ని చెల్లించేవారు. స్వతంత్ర జమీందార్ల అంతర్గత వ్యవహారాల్లో మొగల్ పాలకులు సాధారణంగా జోక్యం చేసుకొనేవారు కాదు. అయితే వారసత్వ పోరు, అరాచకం, అసమర్థత లాంటి అనివార్య పరిస్థితులు తలెత్తినపుడు వారు తప్పకుండా జోక్యం చేసుకొనేవారు.

దళారీ జమీందార్లకు వ్యక్తిగత భూములపై యాజమాన్య హక్కులు ఉండేవి. అయితే వీరికి కేవలం జమీందారీ హక్కులు మాత్రమే ఉండేవి. అంటే రాజ్యం కోసం ఒక ప్రాంతం రైతుల నుండి పన్ను వసూలు చేసే వారసత్వ హక్కులు వారికి ఉండేవి. రాజ్యసేవకు ప్రతిఫలంగా వారికి మిగులు ఉత్పత్తిలో కొంత వాటాను కేటాయించేవారు. మొగల్ రెవెన్యూ పరిపాలనకు వీరు వెన్నముక లాంటివారు,. ప్రాథమిక జమీందార్లకు వారి వ్యక్తిగత భూములపై యాజమాన్య హక్కులు ఉండేవి. తమ జమీందారీ ప్రాంతంపై వారికి జమీందారీ హక్కులు ఉండేవి. అయితే రాజ్యంకోసం పన్నులు వసూలు చేసే వారసత్వ నిధులను వారు నిర్వహించలేదు. ఇలాంటి జమీందార్లకు కేవలం మాలికానా (మిగులు ఉత్పత్తిలో సాంప్రదాయబద్ధమైన వాటా) దక్కేది. కాని నన్‌కార్ లేదా మిగులులో అదనపు వాటా దక్కేది కాదు. వీరు వారసత్వ విధులను నిర్వహించి ఉంటే నన్ కార్ కూడా లభించి ఉండేది. ఆ విధంగా దళారీ, ప్రాథమిక జమీందార్లకు వారి పరిధిలోని రైతులందరిపై సర్వోన్నత హక్కులుండేవి. తమ భూములను సంరక్షించుకునేందుకు వారు సాయుధ బలగాలను కూడా కలిగి ఉండేవారు. అయితే స్వతంత్ర, సాధారణ జమీందార్ల మధ్య తేడా సైనిక శక్తి, ప్రాంతాలు, ఆదాయ రంగాలలో వస్తుంది. సాధారణ జమీందార్లు కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా లోబడి ఉండేవారు. అదే సమయంలో స్వతంత్ర జమీందార్లు తమ అంతర్గత వ్యవహారాలలో పూర్తి స్వేచ్ఛతో వ్యవహరించేవారు. భూమి శిస్తులో స్వతంత్ర జమీందార్లుకు వాటా ఉండగా సాధారణ జమీందార్లకు కేవలం మిగులు హక్కులలో వాటా దక్కేది. కనక సాధారణ జమీందార్ల హక్కులు రాజ్య విధులతో, రైతాంగ హక్కులతో సమాతరంగా ఉండేవి.

భూమి శిస్తును వసూలు చేయడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం మొగల్‌లు జమీందారీ హక్కులను గుర్తించి వాటిని ప్రదానం చేశారు. మొగల్‌ల పాలనలో జమీందారీ హక్కు ప్రైవేటు ఆస్తిగా మారింది. ఆ హక్కును ఎవరైనా కొనుగోలు చేయడానికి లేదా విక్రయించడానికి స్వేచ్ఛఉండేది. ఆ విధంగా మొగల్ కాలంలో ధనబలంతో కూడా జమీందార్ల హక్కులను సమకూర్చుకునేవారు. భూమిశిస్తు వసూలు చేసినా చేయకపోయినా జమీందారుకు మిగులు ఉత్పత్తిలో సాంప్రదాయ వాటా లభించేది. ఒక వేళ అతడు భూమి శిస్తు వసూలు

చేస్తే ఆ పని చేసినందుకు అదనపు ఆదాయాన్ని పొందేవాడు. కొన్ని సార్లు అధికారిక విధులు నిర్వహించమని కూడా అతడిని కోరేవారు. వారి ఆర్థిక విధులలో ముఖ్యమైనవి రైతులను బంజరు భూములు సాగు చేసేలా ప్రోత్సహించడం, వాణిజ్య పంటలను సాగు చేయించడం, నీటి పారుదల వసతులను సక్రమంగా నిర్వహించడం, రైతులకు వ్యవసాయ రుణాలను అందజేయడం.

సామ్రాజ్య సంస్థ జమీందార్లను పూర్తిగా విశ్వసించేది కాదు. జమీందార్లను నియంత్రించే సత్తా రాజ్యానికి ఉన్నంతవరకు వారు బాగానే ప్రవర్తించేవారు. అయితే అవకాశం లభిస్తే సామ్రాజ్య సంస్థను ధిక్కరించేవారని సమకాలీన చరిత్రకారులు పేర్కొన్నారు. ఆ విధంగా జమీందార్లు మంచి, దుష్ట పాత్రలు రెండింటినీ పోషించేవారు. వేరే మాటల్లో చెప్పాలంటే, ఒకవైపు రాజ్య ప్రాబల్యాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తూనే మరోవైపు అవకాశం లభించినప్పుడల్లా రాజ్య అధికారాన్ని బలహీనపరిచేవారు. అయితే జమీందార్ల బలహీనత వారి కులవ్యవస్థలోనే ఉండేది. కుల వైషమ్యాల కారణంగా వారు రాజ్యానికి వ్యతిరేకంగా సమైక్య పోరును కొనసాగించలేకపోయారు.

సామ్రాజ్య సంస్థ, జమీందార్ల మధ్యే సంఘర్షణలు పరిమితం కాలేదు. చివరికి వివిధ వర్గాలకు చెందిన జమీందార్ల మధ్య కూడా ఆధిపత్య పోరు జరిగేది. సామ్రాజ్య సంస్థతో ఘర్షణకు మిగులు ఉత్పత్తిలో వాటా కారణమయ్యేది. జమీందార్ల మధ్య పోరుకు కుల వైషమ్యాలతో పాటు ప్రాంతీయ ఆధిపత్యం కూడా కారకమయ్యేది. రైతులతో సంబంధాల విషయంలోనూ జమీందార్లు ద్వంద్వ పాత్రను పోషించారు. అంటే ప్రగతిశీల, వినాశకర పాత్రను సందర్భోచితంగా పోషించారు. సామ్రాజ్య ప్రభుత్వం భూమిశిస్తును ఎక్కువగా వసూలు చేయాలని ప్రయత్నించినపుడు రైతులు, జమీందార్లు సమైక్యంగా ప్రతిఘటించేవారు. అయితే కొన్ని ప్రాంతాల్లో రైతులను జమీందార్లు, జాగీర్దార్లు ఇద్దరూ దోచుకునేవారు. ఈ ఇద్దరి ప్రయోజనాలు దాదాపు సమానంగా ఉండేవి.

**వ్యవసాయ రంగ స్వభావం, స్థితిగతులు:**

ప్రజల ప్రధాన వృత్తి అయిన వ్యవసాయం ప్రజలతో పాటు రాజ్యానికి కూడా ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. ప్రాచీన కాలంలో లాగే వ్యవసాయాన్ని అవే పనిముట్లతో, అవే పద్ధతుల్లో కొనసాగించారు. అయితే సాగులో ఉన్న స్థూల ప్రాంతంలో గణనీయమైన విస్తరణ వచ్చిందిని చెప్పేందుకు తగిన సాక్ష్యాలు ఉన్నాయి. ఆర్థిక శక్తులు, మొగల్ పాలకులు అవలంబించిన పరిపాలనా విధానాలు అందుకు పాక్షికంగా తోడ్పడ్డాయి. ఐరోపా వ్యాపారుల రాకతో పత్తి, నీలం లాంటి వాణిజ్య పంటలు డిమాండ్ మరింత పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తులకు పెరిగిన డిమాండ్‌ను వ్యవసాయ విస్తరణ ద్వారానే తీర్చ గలరు. సాంకేతిక మార్పులను ప్రవేశపెట్టి వ్యవసాయోత్పత్తిని పెంచే అవకాశాలు దాదాపు మృగ్యంగా ఉండేవి. మొగల్‌ల పరిపాలనా విధానాల విషయానికి వస్తే జమీందార్లు, సంస్థానాధీశులందరూ, చివరకు మత గురువులు కూడా వ్యవసాయ విస్తరణపై వ్యక్తిగత శ్రద్ధను చూపించాల్సి వచ్చేది.

సాగు భూమి విస్తరించినప్పటికీ వ్యవసాయోత్పత్తిలో ప్రగతి చాలా నెమ్మదిగా వచ్చింది. ప్రజలు, రాజ్య అవసరాలతో సమానంగా వ్యవసాయ ఉత్పత్తి పెరగలేదు. వ్యవసాయ ఉత్పత్తిలో వృద్ధి నెమ్మదిగా రావడానికి లేదా స్తంభించిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. తొలుత కొత్త వ్యవసాయ పద్ధతులంటూ ఏవీ అభివృద్ధి కాలేదు. భూసారం నశించిపోయింది. రెండవది, భూమిశిస్తు చాలా వరకు భారీగా ఉండేది. అక్బర్ కాలంనుండి భూమిశిస్తు వ్యవసాయ దిగుబడిలో దాదాపు సగ భాగంగా ఉండేది. అంటే జమీందార్లు, స్థానిక శక్తులకుచెల్లించాల్సిన వాటాలను కూడా కలుపుకుంటే రైతులు తమ దిగుబడిలో దాదాపు సగ భాగాన్ని పన్ను రూపంలో చెల్లించేవారు. రైతు భూమిని విడిచి వెళ్లేంత స్థాయిలో శిస్తు లేకున్నా అతడికి అదనపు నిల్వలు మిగిలేవి కావు. కనుక సాగును మెరుగు పరిచేందుకు పెట్టుబడిని సమకూర్చుకోలేకపోయాడు. మూడవ విషయం, ఆ కాలపు గ్రామీణ సామాజిక నిర్మాణం కూడా వ్యవసాయ విస్తరణను పరిమితం చేయడంలో, వ్యవసాయోత్పత్తి వృద్ధిని నియంత్రించడంలో కీలక పాత్ర పోషించింది.

సాగుకు విస్తారమైన భూములు అందుబాటులో ఉన్నా అన్ని గ్రామాల్లోనూ భూమిలేని నిరుపేద కూలీలు ఉండేవారని తెలుస్తోంది. ఈ ప్రజలు ఎక్కువగా అంటరాని కులం నుండి వచ్చేవారు. వ్యవసాయదారుల సముదాయాలు, జమీందార్లు ఎక్కువగా ఉన్నత కులాలకు చెందిన వారు కావడంతో అస్పృశ్యులను అభివృద్ధిలోకి తేవడానికి ఎలాంటి శ్రద్ధ చూపలేదు. అలాగే కొత్త గ్రామాలలో వారిని స్థిరపరచలేదు. ఫలితంగా దళితులకు భూమిపై యాజమాన్య హక్కులు లభించలేదు. వాస్తవానికి అగ్రవర్ణాల వారికి ఈ విషయంలో స్వంత ప్రయోజనాలు దాగి ఉండేవి. దళితులను నిల్వకార్మిక శక్తిగా ఉంచి అధమస్థాయి పనులను వారితో చేయించారు. భూమి లేని కార్మికులు, పేదలకు తగిన వనరులు అందుబాటులో లేకపోవడం వల్ల కొత్త గ్రామాలను స్థిరపరచలేకపోయారు. అలాగే స్వంతంగా బంజరు భూములలో వ్యవసాయాన్ని చేపట్టలేకపోయారు. కొన్ని సార్లు రాజ్యం చొరవ తీసుకొని కొత్త భూములను ఈ నిమ్న కులాల వారికి అప్పగించడానికి ప్రయత్నించింది. అయితే దళితులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోలేకపోయారు. కారణం ఈ కార్యక్రమంలో రాజ్యం స్థానిక జమీందార్లు, గ్రామపెద్దలను భాగస్వాములను చేయాల్సి వచ్చేది. పైన పేర్కొన్నవిధంగా జమీందార్లు, పెద్దలు అగ్రవర్ణాలకు చెందిన వారు కావడంతో తమ స్వంత ప్రయోజనాలను కాపాడుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చారు.

## వ్యవసాయేతర రంగం

**హస్తకళలు, వృత్తికారుల కార్యకలాపాలలో ప్రగతి :** బ్రిటీషు అధికారులు భారతదేశాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడానికి ముందు అనేక పరిశ్రమలు ప్రగతి పథంలో ఉండేవని విదేశీ యాత్రికుల కథనాలు వెల్లడిస్తాయి. మొగల్ భారతదేశంలో మెజారిటీ ప్రజలకు వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్నా భారతదేశం దేశీయ, విదేశీ డిమాండ్లను తీర్చడానికి అనేక వస్తువులను కూడా ఉత్పత్తి చేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ వ్యవసాయేతర ఉత్పత్తి విశాలంగా ఉండడంవల్లే ఇది సాధ్యమైంది. గ్రామీణ ప్రాంతంలో వృత్తిదారుని కుటుంబం ఉత్పత్తికి మౌలిక భాగంగా ఉండేది. అనువంశిక వృత్తిదార కులాలు,

వృత్తుల వారు గ్రామీణ ఉత్పత్తులను భారీగా తయారు చేశారనడంలో ఎలాంటి సందేహం లేదు. వ్యవసాయం, ఉత్పత్తి మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉండేది కాదని తెలుస్తోంది. ఎందుకంటే అనేకమంది వృత్తిదారులకు వ్యవసాయమే ప్రాథమిక వృత్తిగా ఉండేది. ఉదాహరణకు నేత పనిని కుటుంబాల్లోని మహిళలే చేపట్టేవారు.

వడ్రంగి పనులు, నేత పనులు, రంగుల అద్దకం, కంసాలీ పనులు ప్రధాన గ్రామీణ ఉత్పత్తి కేంద్రాలుగా ఉండేవి. ఈ పనులను (ఉత్పత్తులను) స్థానిక అవసరాలు తీర్చుకోవడానికే చేపట్టేవారు. పత్తితోపాటు నీలం, నూనెగింజలు ఇతర ముఖ్యమైన గ్రామీణ ఉత్పత్తులుగా ఉండేవి. నీలం జౌళి పరిశ్రమలో ముఖ్యమైన ముడిసరుకు కావడంవల్ల దానిని గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఉత్పత్తి చేసేవారు. వాణిజ్య పంటల ఆధారిత ఆర్థిక వ్యవస్థ పెరగడంతో గ్రామీణ హస్తకళలు, ఉత్పత్తులు కూడా అభివృద్ధి చెందాయి. (ఈ కాలంలో పొగాకు ముఖ్యమైన మార్కెట్ పంటగా ఉండేది. ఈ పంటను 17వ శతాబ్దంలో ఇక్కడ ప్రవేశపెట్టారు) గ్రామాలలో వ్యవసాయేతర ఉత్పత్తి విషయానికి వస్తే కుమ్మరి, చర్మం ఉత్పత్తులు ప్రధానమైనవి. చర్మ పాదరక్షలు, సంచులు దేశమంతటా వినియోగంలోకి వచ్చాయి. బంగారు, వెండి, రాగి, కాంస్య పనులు, యుద్ధ సామాగ్రి, వ్యవసాయ పనిముట్లు, గృహ పరికరాలు ఇతర ప్రధాన గ్రామీణ ఉత్పత్తులుగా ఉండేవి.

**పట్టణ వృత్తుల స్థితిగతులు :** సాంప్రదాయ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఆధారిత వృత్తిదారుల ఉత్పత్తితోపాటు దేశంలో భారీ పరిశ్రమలు కూడా విలసిల్లాయి. ఈ భారీ పరిశ్రమలే నగదు ఆర్థిక వ్యవస్థను సృష్టించాయి. జౌళి, పట్టు, ఉన్ని వస్త్రాలు, వజ్రాల వెలికితీత భారీ పరిశ్రమలుగా ఉండేవి. అన్నింటి కంటే ప్రధానమైనది జౌళి పరిశ్రమ. బెంగాల్, గుజరాత్, కోరమాండల్ జౌళి వ్యాపారానికి ప్రధాన కేంద్రాలుగా అవతరించాయి. ఈ భారీ పరిశ్రమలు సాధారణ మార్కెట్–ఆధారితమైనది. వాటికి ఎగుమతుల సామర్థ్యం చాలా ఎక్కువగా ఉండేది. ఈ పరిశ్రమలకు ముడిసరుకులను గ్రామీణ ప్రాంతాల నుండి పారిశ్రామిక పట్టణాలకు చేర్చేవారు. పారిశ్రామిక వాడలలో ప్రత్యేక ఉత్పత్తులను తయారు చేసేవారు. విదేశీ యాత్రికులు సుమారు 160 రకాల జౌళి ఉత్పత్తుల గురించి ప్రస్తావించారు. వీటిని ఆసియా, ఐరోపా దేశాలకు ఎగుమతి చేసేవారు. కోరమాండల్, బెంగాల్‌లలో ఉత్పత్తి అయ్యే పొడవాటి వస్త్రాలు, మస్లిన్‌లకు ఆసియా మార్కెట్లలో విపరీతమైన డిమాండ్ ఉండేది.

ఆ కాలపు ఇతర భారీ పరిశ్రమలలో కంచు, రాగి, వజ్రాల ఉత్పత్తి కేంద్రాలు ప్రధానమైనవి. వజ్రాల గనులకు గోల్కొండ పెట్టింది పేరు. అయితే ఈ గనులు గోల్కొండకు దూరంగా ఉన్న చిన్న చిన్న గ్రామాలలో ఉండేవి. ఇనుము గనులు, రాగి గనులను సింగ్‌భమ్, ఖేత్రిలలో ప్రారంభించారు. రాజులు, సంస్థానాధీశులు వ్యాపార కార్యకలాపాలు, ఉత్పత్తిపై వ్యక్తిగత శ్రద్ధ చూపడం ఈ కాలపు ముఖ్యమైన లక్షణం. మొగల్ చక్రవర్తులు కార్ఖానాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వాటిని రాజధానితోపాటు ప్రాంతీయ కేంద్రాలు, ముఖ్యమైన ఇతర పారిశ్రామిక పట్టణాలకు కూడా విస్తరింపచేశారు. రాజ్య అవసరాల కోసమే కాకుండా నాణ్యత, డిమాండ్ ఉన్న పరికరాలను కూడా కార్ఖానాలు ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకున్నారు.

ఈ కార్ఖానాలలోని వృత్తిదారులు కేవలం దినసరి వేతన కార్మికులుగా ఉండేవారు. సంస్థానాధీశుల అభిరుచి మేరకు వస్తువులను ఉత్పత్తి చేసేవారు. ఈ కార్ఖానాలలో తివాచీలు,

షాల్‌లు, రాచరిక వస్త్రాలు, నగలు, ఆయుధాలు, తుపాకులను తయారు చేసేవారు. విలాస వస్తువులను కూడా ఎక్కువగా ఉత్పత్తి చేసేవారు. ఉత్పత్తిలో కార్ఖానాలు ముఖ్యమైన భాగం అయినప్పటికీ అంతర్గత, విదేశీ మార్కెట్లకు అవసరమైన సరుకులను ఎక్కువగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని వృత్తిదారులే ఉత్పత్తి చేసేవారు. 16 నుండి 18వ శతాబ్దం వరకు భారతదేశం పత్తి, పట్టువస్త్రాలు, రంగులు, ఆయుధాలు, నూనెలు, సైంధవ లవణం తదితర రసాయనాలను భారీ ఎత్తున ఉత్పత్తి చేసేది. ఎగుమతులకు జౌళి పరిశ్రమ ప్రధాన సరఫరాదారుగా ఉండేది. బెంగాల్, గుజరాత్, కోరమాండల్‌లు జౌళి వ్యాపారానికి ప్రముఖ కేంద్రాలుగా విలసిల్లాయి. ఉన్ని వస్త్రాలకు కాశ్మీర్ పేరు గాంచింది.

## వ్యాపారం - వాణిజ్యం

**దేశీయ వ్యాపారం :** స్థానిక డిమాండ్ ఆధారంగా ఉత్పత్తుల వినియోగం జరిగేది. ఉత్పత్తుల అమ్మకం బాగా నిర్వహించబడేది. ప్రతి ప్రాంతానికి ఒక రోజు మార్కెట్ దినంగా నిర్ధారించి ఆయా ప్రాంతాల ఉత్పత్తులను తెచ్చి విక్రయించేవారు. ఈ ఉత్పత్తులు గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పత్తి చేసిన మిగులుకు ప్రాతినిధ్యం వహించేవి. కస్బా లేదా పట్టణాలు అంతర్గత వ్యాపారానికి ప్రధాన మార్కెట్ కేంద్రాలుగా వ్యవహరించేవి. దేశీయ వ్యాపారానికి రవాణా ప్రధాన సాధనంగా ఉండేది. రెండు రకాల రవాణాలో నది జలమార్గాల ద్వారా రవాణా చాలా వరకు చవకగా ఉండేది. బ్రహ్మపుత్ర, గంగ, గోదావరి, కావేరి బేసిన్లలో నిర్దిష్టమైన జలరవాణా వ్యవస్థలు కలిగి ఉండేవి. ఆయా ప్రాంతాలను ఈ జలమార్గాలు అనుసంధానం చేసేవి. సుమారు 300 నుండి 500 టన్నులు మోయగల నావలు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి సరుకులను రవాణా చేసేవి. ఈ నావలు కలప లాంటి భారీ వస్తువులను తీసుకెళ్లేవి. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో రవాణా పన్నుల కారణంగా రహదారుల గుండా రవాణా వ్యయం కొంత భారీగానే ఉండేది. బంజారాలు కాఫిలాలలో సరుకులను తరలించే వారు. సమగ్రమైన రహదారులను షేర్‌షా నిర్మించడంతో దేశంలోని ఆయా ప్రాంతాలు బాగా అనుసంధానమై ఉండేవి. ఉదాహరణకు సోనార్‌గావ్ (బీహార్) నుండి ఆగ్రా గుండా లాహోర్‌కు వేసిన గ్రాండ్ ట్రంక్‌రోడ్డు వ్యాపారులకు ఎంతో అనుకూలంగా ఉండేది.

**విదేశీ వాణిజ్యం :** దేశీయ వ్యాపారం కంటే అంతర్జాతీయ వాణిజ్యం కారణంగా భారత పరిశ్రమలకు గుర్తింపు వచ్చింది. భూ, సముద్ర మార్గాలలో ఇతర దేశాలకు సరుకులను ఎగుమతి చేసేవారు. ఐరోపావాసుల రాకకు చాలా ముందు, అంటే ప్రాచీన కాలం నుండే భారతదేశం పాశ్చాత్య దేశాలతో వ్యాపార సంబంధాలను కొనసాగించింది. ఏడవ శతాబ్దం నుండి భారతదేశ సముద్ర మార్గ వ్యాపారం అరబ్‌ల చేతుల్లోకి వెళ్లింది. అరబ్‌లు హిందూ మహాసముద్రం, ఎర్ర సముద్రాలలో వ్యాపార, వాణిజ్యాలపై ఆధిపత్యం సాధించారు.

మలబార్ నుండి ఎగుమతి అయ్యే భారత వస్త్రాలు, మసాలా దినుసులు పాశ్చాత్య దేశాలను ఆకర్షించాయి. 15వ శతాబ్దపు భౌగోళిక ఆవిష్కరణలకు ముందు పశ్చిమ దేశాలతో భారత వ్యాపారం భూమార్గాన కొనసాగేది. ఆ విధంగా లాహోర్, ముల్తాన్ నగరాలు ట్రాన్సిట్ కేంద్రాలుగా మారాయి. పోర్చుగీసుల రాకకు ముందే దేశం తన విశాలమైన తీర ప్రాంతాన్ని వ్యాపారం కోసం బాగా వినియోగించుకుంది. ఉదాహరణకు బెంగాల్ నుండి కోరమాండల్

వరకు తీరకలేని వ్యాపార లావాదేవీలు జరిగేవి. బెంగాల్ నుండి పెగూ, మలక్కాలకు సుదూర సముద్ర వ్యాపారం జరిగేది. జౌళి ఉత్పత్తులు, పట్టు వస్త్రాలు, ఆయుధాలు, చక్కెర, వజ్రాలు, గారకం తదితర ఉత్పత్తులు ఎగుమతి అయ్యేవి. అలాగే చైనా తదితర ప్రాంతాల నుండి బంగారం, కర్పూరం, పట్టు, పింగాణీ దిగుమతి అయ్యేవి.

**అభివృద్ధికి కారణాలు :** వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల విస్తరణకు ప్రధాన కారణం పాలకవర్గ ప్రత్యక్ష భాగస్వామ్యమే. భారత సముద్ర వ్యాపారాన్ని అభివృద్ధి పరచడంలో అక్బర్, జహంగీర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మీర్ జుమ్లా, షయిస్తాఖాన్ లాంటి సంస్థానాధీశులకు స్వంత ఓడలు ఉండేవి. ఇవి హిందూ మహా సముద్రంలో సరుకులను రవాణా చేసేవి. హుండీల ఆధారంగా వ్యాపారం జరిగేది. హుండీ అంటే హామీ పత్రం. సరుకులు ఒక ప్రాంతానికి తీసుకువస్తే అక్కడ నగదు చెల్లిస్తామని లేదా విక్రయం తర్వాత ఒక నిర్ధారిత ప్రాంతంలో ధర చెలిస్తామన్న హామీ పత్రాలను హుండీ అనిపిలిచేవారు. సర్రఫ్‌లు (ష్రాఫ్‌లు) ఈ హుండీలను నిర్వహించేవారు. వీరు నిపుణులైన బ్యాంకర్లు, చివరి, అత్యంత ముఖ్యమైన కారణం 15వ శతాబ్దంలో ఐరోపా శక్తుల ప్రవేశం. కొత్త సముద్ర మార్గాన్ని కనుగొన్న ఐరోపా నావికులు, వ్యాపారుల వాణిజ్యం పెరిగింది. ప్రపంచంలోని విశాలమైన అంతర్-ఖండ వ్యాపారంలో భారతదేశం ఇమిడిపోయింది. ఈ కొత్త వ్యాపారం జౌళి, ఇండిగో ఉత్పత్తిని గణనీయంగా పెంచిందనడంలో ఎలాంటి సందేహం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థలో ఐరోపా వ్యాపారుల ప్రభావం ధరల పెరుగుదలలో ప్రతిబింబించింది. వృత్తి నిపుణుల వర్గాల ఆధారంగా విశాలమైన పట్టణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందింది. ఈ వృత్తి నిపుణులు ఎగుమతి ప్రధాన ఉద్దేశ్యంగల ఉత్పత్తి, వాణిజ్యంలో సిద్ధహస్తులు.

**ఆర్థిక వ్యవస్థ నగదీకరణ :** నిర్మాణ, పరిపాలనాపరమైన సామర్థ్యం ఉన్న గొప్ప పాలకుడు షేర్‌షా. నాణేల ముద్రణలో అతడు ప్రవేశపెట్టినా సంస్కరణలను అక్బర్ పూర్తి చేసినా వాటి విజయానికి షేర్‌షా తెలివితేటలు, దూరదృష్టే కారణం. అతడి ఆవిష్కరణలు రెండు దిశలలో కొనసాగాయి. మొదటిది, వెండి నాణానికి 178 గ్రాముల కొత్త ప్రమాణాన్ని ప్రవేశపెట్టడం. అలాగే రాగి నాణేనికి 330 గ్రాముల ప్రమాణాన్ని నిర్ధారించాడు. నాణేలలో సగం, పాతిక, ఎనిమిది, పదహారు భాగాలను ప్రవేశపెట్టారు. ఈ కొత్త నాణేలు రెండూ తదుపరి కాలంలో రూపీ, దమ్‌లుగా పిలవబడ్డాయి. రెండవ ఆవిష్కరణ ముద్రణ కేంద్రాల సంఖ్య పెరగడం. సుర్ నాణేలపై కనీసం 23 ముద్రణా పేర్లు కనిపిస్తాయి. సుర్ పాలకుల అసలు బంగారు నాణేలు చాలా అరుదు. రూపీలు విశాలమైన నాణేలు. వాటిని ఉన్నతంగా తీర్చిదిద్దేవారు. నాణేలపై ముద్ర హుమాయూన్ వెండి నాణేం శైలిని పోలి ఉండేది. నాణెం వెనుకభాగాన హిందీలో సుల్తాన్ పేరు చెక్కబడేది. అయితే చాలా వరకు అక్షర దోషాలు కనిపిస్తాయి. మార్జిన్‌లలో సుల్తాన్‌కు ఉన్న వివిధ ప్రత్యేక బిరుదులను, ముద్రణ కేంద్రం పేరును ప్రచురించేవారు. అయితే వెండి, రాగి నాణేలపై చాలా వరకు ముద్రణ కేంద్రం పేరు కనిపించదు.

అబుల్ ఫజల్ వివరణలలో మొగల్ చక్రవర్తులు మారక ద్రవ్యానికి ఇచ్చిన ప్రాధాన్యత వెల్లడవుతుంది. అయినీ అక్బరీ (అబుల్ ఫజల్), జహంగీర్ స్మృతులు తుజుక్-ఎ-జహంగిరి, సమకాలీన చరిత్రకారుల రచనలు ఆర్థిక వ్యవస్థ, మారక ద్రవ్యం గురించి విలువైన సమాచారాన్ని

అందిస్తాయి. ఈ గ్రంథాల అధ్యయనం, నాణేల పరిశీలన తర్వాత పరిశోధకులు ఎంతో విలువైన సమాచారాన్ని సేకరించారు. వాటి ఆధారంగా మొగల్ నాణేల వ్యవస్థను సమగ్రంగా వివరించడం సాధ్యమవుతుంది. అబుల్ ఫజల్, జహంగీర్‌లు అనేక రకాల నాణేల గురించి ప్రస్తావించారు. బరువులో కొన్ని గ్రాముల నుండి 2,000 తులాల వరకు ఉండే వివిధ రకాల నాణేల ప్రస్తావన వారి రచనల్లో కనిపిస్తుంది. మనుకీ, హాకిన్స్, తదితరులు భారీ నాణేల గురించి ప్రస్తావించారు. షాజహాన్ భారీ నాణేలను మహిళలకు కానుకగా ఇచ్చేవాడని మనుకీ పేర్కొన్నాడు. కొన్నిసార్లు ఈ ప్రత్యేకమైన నాణేలను రాయబారులకు కూడా ప్రదానం చేసేవారు. దాచుకోవడానికి వీలుండే విధంగా ఈ నాణేలను రూపొందించారని తెలుస్తోంది.

మొగల్‌ల ప్రామాణికమైన బంగారు నాణేం 'ముహర్'. అది 170 నుండి 175 గ్రాముల బరువు ఉండేది. అబుల్ ఫజల్ కాలంలో దాని విలువ తొమ్మిది రూపాయలతో సమానంగా ఉండేది. ముహర్‌లలో సగం, నాలుగోవంతు విలువ ఉండే నాణాలను అనేక మంది మొగల్ చక్రవర్తులు జారీ చేసినట్లు తెలుస్తోంది. షేర్ షా మారకం నుండి ఆమోదించిన రూపాయి మొగల్ నాణేలలో ప్రసిద్ధమైనది. ఈ పేరు ఒక్కసారే వెలుగులోకి వచ్చింది. అక్బర్ 47వ పాలనా సంవత్సరంలో ఆగ్రాలో ముద్రితమైన నాణెంపై రూపాయి పేరు కనబడుతుంది. సగాలు, నాలుగోవంతులు, ఎనిమిదో వంతులు, పదహారో వంతులు కూడా ముద్రితమయ్యాయి. సూరత్‌లో రూపాయిలో సగభాగానికి భారీ డిమాండ్ ఉండినట్లు తోస్తోంది. సాధారణ బంగారు, వెండి నాణేలకు తోడు దానాలకు అవసరమైన చిన్న చిన్న నాణేలను ప్రత్యేకంగా ముద్రించేవారు. అలాంటి నాణేలలో తరచుగా కనబడేది నిసార్. జహంగీర్ దానిని వెండిలో చెక్కించాడు. షాజహాన్, ఔరంగజేబ్‌లు కూడా వాటిని ముద్రించారు. జహంగీర్ తన నాణేలను నూర్ అఫ్షాన్, ఖయిర్ కబూల్ అని పిలిచేవాడు. షేర్‌షా దమ్ ఆధారంగా మొగల్ రాగి నాణేలు ఉండేవి. ఔరంగజేబ్ ఐదవ పాలనా సంవత్సరం వరకు కూడా ఈ నాణేలు ముద్రితమయ్యేవి. 'దమ్' అనే పేరు అక్బర్ ముద్రించిన సగం దమ్‌పైనే కనిపిస్తుంది. ఈ నాణేన్ని సాధారణంగా ఫులుస్ అని పిలిచేవారు. నిస్ఫీ, దమ్ర, దమ్రీ అనే పేర్లు కూడా అక్బర్ రాగి నాణేలపై కనిపిస్తాయి.

ముద్రణల వైవిధ్యమే మొగల్ నాణేల వ్యవస్థ వినూత్న లక్షణమై ఉండవచ్చు. అక్బర్‌కు సంబంధించిన ముద్రణలు సుమారు 76 వరకు ఉన్నట్లు తెలిసింది. ఇందులో 59 రాగి నాణేలు. ఏ చక్రవర్తికి అయినా ఇది రికార్డు సంఖ్యే. అలాగే 39 వెండి నాణేలను ముద్రించాడు. దక్కనులో ఔరంగజేబ్ దండయాత్రలు వెండి నాణేల ముద్రణ సంఖ్యను 70కి చేర్చాయి. మరోవైపు రాగి ముద్రణలు 24కు పడిపోయాయి. గొప్ప మొగల్‌ల నాణేల వ్యవస్థ ఆ విధంగా ఉండేది. ఒకే ఒక్క పాలక వంశ ఉత్పత్తిగా పరిగణనలోకి తీసుకుంటే మొగల్ మారక ద్రవ్యాన్ని ప్రపంచంలోని గొప్ప నాణేల వ్యవస్థ సరసన నిలబెట్టవచ్చు. సుమారు 300 సంవత్సరాలపాటు ఆ పాలక వంశం తన బంగారు, వెండి, రాగి నాణేల స్వచ్ఛత, నాణ్యతను కాపాడింది. ప్రామాణికమైన రూపాయి నాణేనికి నాటి వాణిజ్యంలో కూడా ప్రాధాన్యత ఉంది.

16

# ఐరోపాతో వాణిజ్యం

**భారతదేశంలో ఐరోపా కంపెనీలు :**

**పోర్చుగీసుల గుత్తాధిపత్యం :** 16వ శతాబ్దం తొలినాళ్లలో హిందూ మహాసముద్ర జలాలపై పోర్చుగీసులు అధికారాన్ని హస్తగతం చేసుకున్న తర్వాత లిస్బన్‌కు వెళ్లే ఓడల సంఖ్య గణనీయంగా పెరిగింది. సుమారు వందేళ్ల వరకు పోర్చుగీసుల ఆధిపత్యానికి అడ్డు లేకుండా పోయింది. సముద్ర వాణిజ్యంపై సాయుధ నియంత్రణ పోర్చుగీసులకు సునాయాసంగా దక్కింది. వారు రక్షణలేని స్వేచ్ఛా వాణిజ్య వ్యవస్థను ఏర్పాటు చేశారు. అప్పుడప్పుడు సముద్ర దొంగల దాడులు తప్ప ఈ జలమార్గాలలో ఇతరులెవ్వరూ కార్యకలాపాలు నిర్వహించలేదు. పోర్చుగీసులు వ్యాపార నియంత్రణ కోసం బలప్రయోగానికి పాల్పడ్డారు. దానినే వ్యాపకంగా చేసుకున్నారు.

హిందూ మహా సముద్రంలోని ఈ స్వేచ్ఛా వాణిజ్య వ్యవస్థ మరీ ప్రమాదకరమైన పరిస్థితిలో ఉండేది. ఎందుకంటే ఈ వాణిజ్యం కేవలం విలాస వస్తువులు, సరుకులకే పరిమితం కాలేదు. మసాలాదినుసులు, జౌళి ఉత్పత్తులు, బంగారు, ఏనుగు దంతాలు ఈ కోవలోకి వస్తాయి. పోర్చుగీసులు ఈ వ్యాపారంలో ప్రధాన పాత్రను పోషించినా తదుపరి కాలంలో శ్రమ విభజన చోటు చేసుకుంది. ఈ క్రమంలో కొన్ని రేవులు సుదూర ప్రాంతాల నుండి తిండి గింజల తరలింపుపై పూర్తిగా ఆధారపడ్డాయి.

పోర్చుగీసులు మధ్యధరా సాంప్రదాయాన్ని హిందూ మహాసముద్రంలో ప్రదర్శించడానికి ప్రయత్నించారు. వారు నిశిత పరిశీలకులు. కీలక కేంద్రాలను వెంటనే స్వాధీనం చేసుకొని అక్కడి నుండి విశాలమైన ఆసియా సముద్ర రవాణా వ్యవస్థను నియంత్రించారు. బలమైన కోటలు సుంకం కేంద్రాలుగా వ్యవహరించాయి. ఇక్కడ వ్యాపారులు రక్షణ పత్రాలను (కార్టజస్) పొందడం తప్పనిసరి, ఆ విధంగా ఉచ్ఛ జలాలలో పోర్చుగీసు నౌకాదళ దాడి నుండి, విధ్వంసం నుండి రక్షణ పొందేవారు.

మసాలా దినుసులు, ముఖ్యగా మిరియాల వ్యాపారాన్ని, పోర్చుగీసు రాజు రాచరిక గుత్తాధిపత్యంగా ప్రకటించాడు. వారి మసాలదినుసుల దిగుమతులు 1501లో 2.5 లక్షల పౌండ్ల నుండి 1505 నాటికి 23లక్షల పౌండ్లకు (వార్షిక) పెరిగాయి. అలెగ్జాండ్రియాలో 10 లక్షల పౌండ్లకు మించి మసాలా దినుసులు కొనుగోలు చేయలేమని అప్పటికి వెనీస్ వ్యాపారులు గ్రహించారు. అయినప్పటికీ 1495లో వారి వార్షిక కొనుగోళ్లు అలెగ్జాండ్రియాలో సుమారు 35 లక్షల పౌండ్ల వరకు ఉండేవి. ఆసియాలో పోర్చుగీసులు ఆధిపత్యం ఉన్న వందేళ్లలో కూడా అరబ్, వినీస్, వ్యాపారులు మసాలాదినుసుల వ్యాపారాన్ని నిర్వహించారు. అయితే వ్యాపార సమతుల్యం పోర్చుగీసులకు అనుకూలంగా నాటకీయంగా మొగ్గు చూపింది. వారు అరబ్ మధ్యవర్తులను పక్కకు తప్పించి ఐరోపాలో మసాలా దినుసులకు ఉన్న విపరీతమైన డిమాండ్‌ను సొమ్ము చేసుకున్నారు.

పోర్చుగీసు రాజు వెనీసు వ్యాపారులకు ఈ ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయించాలని ఏనాడు భావించలేదు. వెనీసు వ్యాపారులకు ఒకే ధరను నిర్ధారించి భారతీయ సరఫరాదారుల నుండి చవకైన ధరలకు మిరియాలను కొనుగోలు చేశాడు. రాచరిక గుత్తాధిపత్యానికి ఇది అనుకూలమైన వ్యవస్థగా ఉండేది. భారత్‌లో మిరియాలను చవకగా కొనుగోలు చేసి ఐరోపాను స్థిరమైన అధిక ధరకు విక్రయించారు. ఈ వ్యవస్థ ఏర్పడ్డాక ఉపదళాలను ప్రవేశపెట్టి రాజు తన బరువుబాధ్యతలను తగ్గించుకొన్నాడు. అలాగే స్థిరమైన ఆదాయాన్ని పొందారు.

1506 నుండి 1518 వరకు పోర్చుగీసు బడ్జెట్‌ల పోల్చిచూస్తే మిరియాల వ్యాపారంపై గుత్తాధిపత్యానికి సంబంధించిన రాజ్య పెట్టుబడుల స్వరూపంలో వచ్చిన సృష్టమైన మార్పును గ్రహించవచ్చు. మిరియాలపై గుత్తాధిపత్యం నుండి లభించే ఆదాయం 1506లో 1,35,000 క్రుజాదోల నుండి 1518లో 3,00,000 క్రుజాదోలకు క్రమంగా పెరిగింది (ఒక క్రుజాదో 3.6 గ్రాముల బంగారంతో సమానం). ఈ కాలంలో ఇతర ఆధారాల నుండి కూడా ఆదాయం పెరిగినా మిరియాలపై గుత్తాధిపత్యం అన్ని అధారాలను అధిగమించింది. ఈ గుత్తాధిపత్య వాణిజ్యం నుండి సమకూరిన భారీ లాభం ముందు వారి పెట్టుబడులు (50,000 క్రుజాదోలు) చిన్నబోతాయి. ఆ విధంగా పోర్చుగీసులు ఈ విషయంలో తమ పెట్టుబడికి మంచి విలువను రాబట్టగలిగారు.

కెప్టెన్, కస్టమ్‌సుంకాల వసూలుదారు ఉద్యోగాలను అమ్ముకోవడం ద్వారా కూడా పోర్చుగీసు రాజు గణనీయమైన ఆదాయాన్ని పొందారు. పర్షియన్ ఎడారిలో ఆర్మూజ్ వద్ద, హిందూ మహాసముద్రంలోని మరి కొన్ని ప్రాంతాలలో పోర్చుగీసులు కస్టమ్ సుంకాలను వసూలు చేశారు. మూడేళ్ల కాల పరిమితితో ఉద్యోగాలను రాజు వేలం వేసేవాడు. ఎలాంటి పెట్టుబడులు లేని ఈ ఉద్యోగాల నియామకం కూడా భారీ ఆదాయాన్ని సమకూర్చింది. రాచరిక పోషకుడి కంటే కౌలు స్వీకరించే వాడిగా పోర్చుగీసు రాజు తయారయ్యాడు

**డచ్‌ల కార్యకలాపాలు:**

16వ శతాబ్దం చివరి నాటికి ఉత్తర ఐరోపా దేశీయులు, ముఖ్యంగా డచ్, ఆంగ్లేయులు, ఆసియా మార్కెట్లలో వాటా కోసం తహతహలాడారు. ఐరోపా అంతర్జాతీయ రాజకీయాలలో పోర్చుగల్ స్పానిష్ ఆక్రమిత ప్రాంతంగా మారిపోయింది. తమ నూతన ఓడనిర్మాణ పరిశ్రమ, శాస్త్రీయ నౌకా రవాణా పద్ధతులు, నిర్వహణతో డచ్‌లు తూర్పు దేశాలతో వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని అమితాసక్తిని ప్రదర్శించారు. తమ స్వంత భూభాగంలో స్పానిష్ ఆధిపత్యంపై తిరుగుబాటు, తదుపరి కాలంలో స్పెయిన్‌తో పోర్చుగల్ విలీనం కావడం ఆంట్వెర్ప్ రేవు మూతపడడంతో డచ్‌లు తూర్పు ప్రాంతంతో ప్రత్యక్ష సంబంధాలను మెరుగుపరచుకున్నారు.

1602లో యునైటెడ్ డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఏర్పాటైంది. యుద్ధాలు చేపట్టడం, ఒప్పందాలు కుదుర్చుకోవడం, ప్రాంతాలను సమకూర్చుకోవడం, కోటలను నిర్మించడం లాంటి విశాలమైన అధికారాలను ఆ కంపెనీకి దఖలు పరిచారు. అయితే డచ్‌ల ప్రధాన లక్ష్యం భారతదేశం కాదు. వారి ఆసక్తి అంతా ఇండోనేషియా ద్వీపకల్పంపై ఉండేది. దాంతో వారు తమ ఓడలనూ ఆ వైపుమళ్లించారు. ఆ ప్రాంతం మసాలాదినుసులకు ప్రసిద్ధి గాంచినది. డచ్‌లు ఈ మసాలాదినుసులపై దృష్టి సారించారు. ఆగ్నేయాసియా ద్వీపాలపై వారు అనతికాలంలోనే ఆధిపత్యం సాధించారు. బటావియా(జకార్తా) వద్ద రాజధానిని నిర్మించారు. అయితే భారతదేశం, అక్కడి వాణిజ్యాన్ని కూడా అభివృద్ధి పరచాల్సిన అవసరాన్ని డచ్‌లు గ్రహించారు. ద్వీపాలలో మసాలదినుసులు కొనుగోలు చేసి అందుకు బదులుగా భారతీయ వస్త్రాలను అందించవచ్చని గుర్తించిన తర్వాత డచ్‌లకు భారతదేశంపై ఆధిపత్యం సాధించాల్సిన అవసరం ఏర్పడింది. అందుకే సూరత్, బ్రోచ్, కాంబే, అహ్మదాబాద్, కొచ్చిన్, నాగపట్టణం, మసులిపట్నం, చిన్సూరా, పాట్నా, ఆగ్రాలలో వారు వాణిజ్య స్థావరాలను ఏర్పాటు చేశారు.

**ఆంగ్లేయుల కార్యకలాపాలు:**

1588లో స్పానిష్ ఆర్మాడా ఓటమి, తూర్పు దేశాల గురించి అవగాహన కారణంగా ఆంగ్లేయులు తూర్పు ప్రాంతంలో చొరబడేందుకు వ్యూహాలు రూపొందించారు. 1599లో ఒక ఆంగ్లేయ సంఘం లేదా కంపెనీని స్థాపించి వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించారు. ఈ కంపెనీని సాహసిక వ్యాపారుల బృందం ఏర్పరిచింది. 1600 లో ఒక రాచరిక శాసనం జారీ అయ్యింది. కంపెనీని లాంఛనంగా ఇంగ్లిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ గా నామకరణం చేశారు. 1601లో తొలి యాత్ర ఇండోనేషియా వైపు సాగింది. అక్కడ ఒక ఫ్యాక్టరీని స్థాపించారు. తర్వాత వారు కెప్టెన్ హాకిన్స్‌ను భారతదేశానికి పంపారు. రాచరిక రాయితీలను పొందడానికి 1609లో బయల్దేరిన హాకిన్స్ తన రాయబారంలో విఫలమయ్యారు. పోర్చుగీసులు కుట్ర పన్నడం వల్లే అతడు ఎలాంటి రాయితీలను సాధించలేకపోయాడు. అందుకు ప్రతీకారంగా

ఆంగ్లేయులు 1612, 1614లలో పోర్చుగీసు నౌకాదళాన్ని సూరత్ సమీపంలోని స్వాలీ వద్ద ఓడించారు. ఆంగ్లేయులను పోర్చుగీసులకు వ్యతిరేకంగా ఉపయోగించుకోవచ్చని గ్రహించిన మొగల్ చక్రవర్తి ఆంగ్లేయులకు అనుకూలంగా ఫర్మానా జారీ చేశాడు.

అయితే ఈ ఫర్మానా ఆంగ్లేయులను తృప్తిపరచలేదు. అందుకే సర్ థామస్‌రోవ్‌ను మొగల్ ఆస్థానానికి పంపారు. అతడు సామ్రాజ్య ఫర్మానాను సాధించడంలో సఫలమయ్యాడు. సామ్రాజ్యమంతటా ఫ్యాక్టరీలు, వాణిజ్య స్థావరాలను స్థాపించేందుకు అవసరమైన అనుమతులను ఫర్మానా రూపంలో పొందాడు. దౌత్యనీతి అవసరాన్ని కూడా గుర్తించిన ఆంగ్లేయులు 1625లో సూరత్ తమ స్థావరాన్ని బలోపేతం చేసుకోవడానికి చర్యలు ప్రారంభించారు. అయితే వారి ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈలోగా స్పైస్ ఐలాండ్స్‌లో బ్రిటీషు, డచ్ బలగాల మధ్య సంఘర్షణ మొదలైంది. 1623లో అంబొయినావద్ద డచ్‌ల ఆంగ్లేయులను హతమార్చారు. దాంతో ఆంగ్లేయులు తమ స్థావరాన్ని భారతదేశానికి మార్చారు. 1639లో మద్రాసును కనుగొని కోరమాండల్ తీరంపై దృష్టి కేంద్రీకరించారు.

తమ పూర్వపు వ్యాపారుల్లాగే ఆంగ్లేయులు కూడా వాణిజ్యాన్ని దౌత్యంతో జత చేశారు. 1688లో స్పెయిన్ నుండి బొంబాయి నుండి కొనుగోలు చేశారు. (ఆ సమయంలో పోర్చుగల్ స్పెయిన్ నియంత్రణలో ఉండేది) బొంబాయిని వెంటనే బలోపేతం చేశారు. బొంబాయిని ఆంగ్లేయులు సాధించడంతో సూరత్ తన ప్రభావాన్ని కోల్పోయింది. తూర్పు తీరంలో ఆంగ్లేయులు ఒరిస్సాలోని హరిహర్‌పూర్, బాలాసోర్‌లలో (1633) ఫ్యాక్టరీలను స్థాపించారు. జాన్ చెర్నాక్ బెంగాల్ వెళ్లి కలకత్తా నగరాన్ని 1690లో నిర్మించాడు. 1696లో ఆ నగరాన్ని అన్నివైపులా బలోపేతం చేశారు. ఆ విధంగా 17వ శతాబ్దం చివరి నాటికి ఆంగ్లేయులు దేశంలోని ప్రతి ప్రాంతంలో, ముఖ్యంగా తీరం వెంబడి స్థావరాలను ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు.

మొగల్ పాలకులు, ముఖ్యంగా ఔరంగజేబ్, ఆంగ్లేయులను పూర్తిగా ఎన్నడూ నమ్మలేదు. 1688లో ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఆంగ్లేయులు తమ ఫ్యాక్టరీలన్నింటినీ మూసి వేయాలని మొగల్ పాలకులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ సైనిక ఘర్షణలు తలెత్తాయి. తదుపరి జరిగిన చర్చలలో రాజీ ఒప్పందాలు కుదిరాయి. మొగల్‌లు ఆంగ్లేయులను క్షమించారు. వివిధ ఫర్మానాల ద్వారా ఆంగ్లేయులకు ప్రత్యేక హక్కులను ప్రసాదించారు. ఉదాహరణకు 1698లో జారీ చేసిన ఫర్మానా ఆంగ్లేయులకు కలకత్తాను అప్పగించింది. 1717లో ఫారుఖ్ సియర్ జారీ చేసిన ఫర్మానా వారికి దక్కన్, గుజరాత్‌లపై నియంత్రణ ఇచ్చింది. ఆ విధంగా 18వ శతాబ్దం మలియార్థం నాటికి ఆంగ్లేయులు తమ ప్రాబల్యాన్ని గణనీయంగా పెంచుకొన్నారు. వ్యాపారం, రాజకీయాలను మేళవించి తమ కార్యకలాపాలు సాగిస్తూ చివరకు భారతదేశాన్ని పూర్తిగా ఆక్రమించారు.

### ఆంగ్లేయ-ఫ్రెంచి వైరం :

1664లో ఏర్పాటైన ఫ్రెంచి ఈస్ట్ ఇండియా కంపెనీ 1720 నాటికి ఆంగ్లేయులకు తీవ్రమైన ప్రత్యర్థిగా తయారైంది. కలకత్తా సమీపంలోని చందర్‌నగోర్ వద్ద, పాండిచ్చేరి, కోరమాండల్ వద్ద ఫ్రెంచి కంపెనీ బలంగా పాతుకుపోయింది. ఆంగ్లేయులతో పోలిస్తే వ్యాపారంలో ఫ్రెంచి ప్రజలు బలహీనులైనప్పటికీ భారతదేశంలో వివిధ ప్రాంతాలను హస్తగతం చేసుకోవడంలో వారు సమీప ప్రత్యర్థులుగా మారారు. నిరంకుశ, పాక్షిక భూస్వామ్య ఫ్రెంచి రాజ్యం వ్యాపారంలో అభివృద్ధి సాధించేందుకు ఫ్రెంచికంపెనీకి తగిన విధంగా సహాయపడలేదు. 1712లో ఐరోపాలో ఫ్రెంచి, ఇంగ్లాండ్ సైన్యాల మధ్య యుద్ధం జరగడంతో ఈ రెండు ఐరోపా కంపెనీల మధ్య భారతదేశంలో ప్రాంతాల స్వాధీనానికి ప్రత్యక్ష పోరు మొదలైంది. అయితే ఎట్టకేలకు ఆంగ్లేయులు భారతదేశంలో విజయం సాధించారు.

### ఐరోపా వాణిజ్య స్వభావం

**డచ్ వాణిజ్యం :** 17వ శతాబ్దం ఆరంభంలో డచ్‌లు హిందూ మహాసముద్రాన్ని నాటకీయమైన వేగంతో స్వాధీనం చేసుకున్నారు. పూర్వ నిర్ధారిత అనుకూల పరిస్థితులు ఎన్నో డచ్ విజయానికి బాటలు వేశాయి. ముఖ్యంగా, సమర్థవంతమైన విద్యా వ్యవస్థ, శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రగతి, పోర్చుగీసుల నుండి సముద్ర మార్గాల గురించి సమాచారాన్ని సేకరించగల సామర్థ్యం, వాణిజ్య ఓడల భారీ సంఖ్య, ఓడ నిర్మాణానికి కలప అందుబాటులో ఉండడం తదితర అనుకూల పరిస్థితులలో డచ్‌లు ఈ విజయం సాధించారు.

పోర్చుగల్ వలె డచ్ రాజ్యం ఈ కంపెనీ వ్యవహారాలలో ఎలాంటి జోక్యం చేసుకోలేదు. కేవలం మసాలాదినుసుల విషయంలోనే డచ్ కంపెనీకి గుత్తాధిపత్యం కల్పించారు. అలాగే గుత్తాధిపత్య నియంత్రణ ఓడలు ఆమ్‌స్టర్‌డామ్ చేరుకొనే వరకే పరిమితమైంది. అక్కడ అత్యధిక వేలం పాడిన వారికి సరుకులను స్వేచ్ఛగా విక్రయించేవారు. ఈ కాలం వేలంపాటలు మార్కెట్ డిమాండ్‌ల గురించి మంచి అవగాహన కలిగించాయి. జౌళి ఉత్పత్తులు లాంటి కొత్త సరుకులను ప్రవేశపెట్టడంలో అవి సహకరించాయి.

17వ శతాబ్దమంతటా డచ్ కంపెనీ బ్రిటీషు కంపెనీ కంటే విశాలమైన స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించింది. అయినప్పటికీ బ్రిటీషు కంపెనీ పోటీ పట్ల డచ్ వారు తీవ్ర ఆందోళన చెందారు. ఆ కంపెనీని దూరంగా ఉంచడానికి ప్రయత్నించారు. సముద్ర జలాలపై పోర్చుగీసు, స్పానిష్ నౌకాదళాల ఆధిపత్యాన్ని ఎదుర్కొంటూనే డచ్ వారు సముద్ర జలాల స్వేచ్ఛ సిద్ధాంతాన్ని నొక్కి చెప్పారు. అయితే 17వ శతాబ్దపు రెండవ దశకంలో బ్రిటీషుతో సహా అన్ని ఐరోపా శక్తులకు స్పైస్ ఐలాండ్స్‌లో వ్యాపారం నిర్వహించడానికి అనుమతి నిరాకరించారు. ఈ విధంగానే తమ ప్రయోజనాలు నెరవేరగలవని, తాము కల్పించే రక్షణకు ప్రతిఫలం లభించగలదని డచ్ వారు వాదించారు.

తొలి దశలో ఇండోనేషియాపై తమ నియంత్రణను చాలా జాగ్రత్తగా కాపాడుకున్న డచ్ వారు భారతదేశంలో అలాంటి ఆకాంక్షలను ప్రదర్శించలేదు. భారతదేశంలో జౌళి ఉత్పత్తులను భారీ పరిమాణంలో కొనుగోలు చేయడం వల్లే బహుశా వారు రాజ్యకాంక్షను ప్రదర్శించలేదు. అలాగే ఈ ఉత్పత్తులపై ఎవరికీ గుత్తాధిపత్యం ఉండేది కాదు. జౌళి వ్యాపారం డచ్‌వారికి ప్రధాన వ్యాపకంగా మారింది. ఉత్పత్తికోసం ఒక ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడం కంటే ఇతర పరోక్ష నియంత్రణ పద్ధతులను వారు అన్వేషించారు. రుణాలు, అడ్వాన్స్‌ల రూపంలో ఉత్పత్తిదారులు, దళారులను లోబర్చుకోవడమే ఉత్తమమని గ్రహించారు. విదేశాలలో వినియోగదారులకు ఇష్టమైన జౌళి ఉత్పత్తులను సమీకరించడం మొదలుపెట్టారు.

జౌళి వ్యాపారాన్ని విస్తరించిన నేపథ్యంలో డచ్ ఫ్యాక్టరీలు నిర్మాణపరమైన మార్పులను భారీగా చవిచూశాయి. తొలుత అలాంటి ఫ్యాక్టరీలు వార్షిక తరలింపుకోసం కేవలం ఉత్పత్తులను మాత్రమే నిల్వ చేసేవి. అయితే క్రమంగా అవి ప్రధానమైన వ్యాపార కేంద్రాలుగా ఎదిగి తమ ప్రభావాన్ని గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాయి. తూర్పు తీరంలో ఎన్నో ఫ్యాక్టరీలు కలిగిన డచ్‌లు గోల్కొండ సుల్తాన్ ఆస్థానంలో కూడా ప్రాతినిథ్యం సాధించారు. గోల్కొండ రాజ్యం జౌళి ఉత్పత్తులకు ముఖ్యమైన ఆధారంగా ఉండేది.

ఆ విధంగా డచ్ వారు భారతదేశాన్ని ముఖ్యంగా దక్షిణ ప్రాంతాన్ని, పత్తి వస్త్రాల కొనుగోలుకు ప్రధాన ఆధారంగా వాడుకున్నారు. అలాగే స్పైస్ ఐలాండ్స్‌లో తోటల పెంపకం కోసం ఈ ప్రాంతం నుండే బానిసలను సమీకరించారు. కోరమాండల్ వస్త్రాలలో డచ్ వారి పెట్టుబడులు అమిత లాభాలను ఆర్జించిపెట్టాయి. ఇక్కడి వస్త్రాలను ఇండోనేషియాలో విక్రయించి మసాలాదినుసులను పొందేవారు. ఆ విధంగా స్వదేశం నుండి మసాలా దినుసుల కోసం ధనాన్ని వెచ్చించకుండా చేయగలిగారు. ఈ త్రికోణ వాణిజ్య పద్ధతిని ఆంగ్లేయులు అనతికాలంలోనే నేర్చుకొని ఆచరణలో పెట్టారు. తూర్పుదేశాలకు ధన ప్రవాహాన్ని అడ్డుకోవాలని ఆంగ్లేయులు కూడా అంతేస్థాయిలో ప్రయత్నించారు.

హిందూమహాసముద్రంపై డచ్‌వారి ఆధిపత్యం అంతర్జాతీయ వాణిజ్యంలో విప్లవాన్ని తీసుకు వచ్చింది. ఈ లక్ష్యాన్ని పోర్చుగీసులు ఎన్నడూ సాధించలేకపోయారు. మధ్యధరాలో సరుకులప్రవాహాన్ని పూర్తిగా మార్చివేశారు. 16వ శతాబ్దంలో చివరలో పునరుద్ధరణకు నోచుకున్న లేవాంట్ (తూర్పు మధ్యధర ప్రాంతం) వ్యాపారం ఉన్నట్లుండి పతనమైంది. ఇపుడు పశ్చిమ ఐరోపా ఓడలు లేవాంట్ రేవులకు సరుకులను చేరవేశాయి. అంతకుముందు ఇలాంటి సరుకులు లేవాంట్ నుండి పశ్చిమ ఐరోపా దేశాలకు సరఫరా అయ్యేవి. వెనీస్ కూడా అదే దారిలో పయనించింది. ఇటలీలో ప్రాంతీయ రేవుగా మిగిలిపోయింది. ఈవాణిజ్య విప్లవం వల్ల మధ్యధర వ్యాపారం ప్రభావితమైనట్లుగా ఆసియా సముద్ర వాణిజ్యం అంత త్వరగా ప్రభావితం కాలేదు. భారతీయ వ్యాపారులు ప్రతి సంవత్సరం అరేబియా పర్షియన్ ఓడరేవులకు ఎన్నో వాణిజ్య ఓడలను పంపేవారు. ఆ సమయంలో హిందూ సముద్ర జలాల్లో భారతీయు ఓడలు ఐరోపా

ఓడలను అధిగమించేవి. డచ్‌లు ఈ సముద్ర జలాలలో కూడా వాణిజ్యం నిర్వహించారు. ఇపుడు ఆసియా వ్యాపారులకు తమ సేవలను అందించారు. వారి సేవల స్థాయి క్రమంగా పెరిగింది. ఆసియా వ్యాపారులకు స్వంత ఓడలు లేకుంటే డచ్‌లు ఐరోపావాసులకు తమ సరుకులను అప్పగించడానికి సంతోషంగా ముందుకు వచ్చేవారు. ఐరోపా వ్యాపారుల ఓడలు సాయుధ బలగాలతో సురక్షితంగా ఉండేవి. సముద్ర దొంగలను ఎదురించే సత్తా వాటికి ఉండేది.

**ఆంగ్లేయుల వాణిజ్యం :**

డచ్ కంపెనీ కంటే రెండేళ్ల ముందే లండన్‌లో ఏర్పాటైన ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వేలంపాట విక్రయాలతో సహా దాదాపు అవే షరతులపై తన కార్యకలాపాలను నిర్వహించింది. తూర్పులో సూరత్ స్థావరం నుండి ఆంగ్లేయులు అరేబియా సముద్రం, పర్షియన్ ఎడారిపై అనతికాలంలోనే నియంత్రణ సాధించారు. 1622లో ఆర్ముజ్‌లో పోర్చుగీసు నౌకాదళాన్ని ఓడించి ఆ ఓడరేవును స్వాధీనం చేసుకున్నారు. అప్పటినుండి పర్షియా పట్టు వస్త్రాలు గుజరాత్ వస్త్రాలతో పోటీ పడసాగాయి. పశ్చిమ ఐరోపా, బ్రిటన్‌లలో గుజరాత్ వస్త్రాలనే ఎక్కువగా వాడేవారు. అయితే ఇపుడు తూర్పు నుండి పర్షియా పట్టువస్త్రాలు కూడా ఐరోపాను ముంచెత్తాయి.

భారతీయ కాలికో వస్త్రాలు 1619లో 14,000వరకు ఐరోపాకు వార్షికంగా ఎగుమతి అయ్యేవి. అయితే 1625లో వాటి సంఖ్య 2,00,000లకు చేరుకుంది. పర్షియా పట్టుకు డిమాండ్ క్రమంగా మెల్లగా పెరిగింది. భారతదేశం నుండి ఇండిగో, సైంధవ లవణం కూడా ప్రధానంగా ఎగుమతి అయ్యేవి. ఈ ఉత్పత్తులు బీహార్‌లో ఎక్కువగా ఉత్పత్తి కావడంతో ఆంగ్లేయులు తూర్పు, పశ్చిమ తీరాలలో కూడా ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడానికి ముమ్మర ప్రయత్నాలు చేశారు.

స్వదేశం నుండి వనరులు తూర్పు దేశాలకు ప్రవహించకుండా అడ్డుకునేందుకు ఆంగ్లవ్యాపారులు తమ పెట్టుబడులను దక్షిణభారత నేతపనులలో పెట్టారు. అక్కడ ఉత్పత్తి అయ్యే వస్త్రాలను ఇండోనేషియాలో మసాలాదినుసులు కొనుగోలు చేయడానికి ఉపయోగించారు. తమ పెట్టుబడికి నాలుగు రెట్లు విలువ కలిగిన లవంగాలు, మిరియాలను సమకూర్చుకోగలిగారు. కోరమాండల్ తీరంలో ఫ్యాక్టరీని స్థాపించడానికి వారు ఆసక్తి చూపడంలో ఎలాంటి ఆశ్చర్యం కనిపించదు. భారతదేశ ఆగ్నేయ ప్రాంతాల నుండి ఆంగ్లేయులు గంగాలోయ నుండి బంగాళాఖాతానికి వెళ్లే ప్రధాన స్రవంతి ఉత్పత్తులను చాలా త్వరగా సమకూర్చుకోవాలని ప్రయత్నించారు. హిందూ మహాసముద్రంలో ఐరోపా నౌకాదళాల దొంగతనాలు, దాడులు ఎక్కువయ్యాయి. వీటి వల్ల భారీగా నష్టపోయిన భారత వ్యాపారులు తమ గుణపాఠాలను త్వరగా నేర్చుకున్నారు. అయితే ఐరోపా నావికులందరూ సముద్ర దొంగలు కాదు. వారిలో

కొందరు దేశీయవ్యాపారం ద్వారా జీవనోపాధి సాధించేవారు. ఈ రంగంలో బ్రిటీషు ప్రైవేటు వ్యాపారులు చాలా చురుకుగా ఉండేవారు. ఈ కొత్త వ్యాపారుల కార్యకలాపాలను ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యతిరేకించినా వారి మధ్య ఒక పరస్పర సహకార బంధం ఏర్పడింది. ఖండాంతర వాణిజ్యంపై కంపెనీయే స్వయంగా దృష్టి సారించింది. దేశీయ వ్యాపారులు కంపెనీ సేవకులతో ఒప్పందం కుదుర్చుకొని కంపెనీ మౌలిక సదుపాయాలను, రక్షణను సద్వినియోగం చేసుకున్నారు. అయితే కంపెనీ నిర్వహణకు ఎలాంటి తోడ్పాటును ఇవ్వలేదు. ఆసియా అంతర్గత వ్యాపారంలో బ్రిటీషు ప్రైవేటు వ్యాపారులకు ఆ విధంగా తులనాత్మక ప్రయోజనం కలిగింది. ఖండాంతర వాణిజ్యంలో నైపుణ్యం సాధించి ఆసియా వాణిజ్యాన్ని ఇతరులకు వదలివేయడం వల్ల కంపెనీ రెండు విధాలా లాభపడింది.

## ఫ్రెంచి వాణిజ్యం:

18వ శతాబ్దపు భారతదేశ చరిత్రలో ప్రముఖ పాత్ర పోషించడానికి ప్రయత్నించిన ఐరోపాశక్తులలో ఫ్రెంచి కంపెనీ ఒకటి. 17వ శతాబ్దం చివరలో భారతదేశ విషయానికి వస్తే ఈ కంపెనీకి అంత ప్రాధాన్యత ఉండేది కాదు. కోల్‌బర్ట్ ఫ్రెంచి కంపెనీని సమాఖ్య పద్ధతిలో నడిపించారు. అయితే ఇది విపరీతపరిణామాలకు దారి తీసింది. ఎందుకంటే కంపెనీ ఫ్రెంచి ప్రభుత్వ నియంత్రణలో ఉండేది. అందులో ప్రైవేటు పెట్టుబడిదారులు ఎవరూ ఉండేవారు కాదు. కోల్‌బర్ట్ పెద్ద మనుషులను ఒప్పించి ఇందుకోసం నిధులను రాబట్టాల్సి వచ్చింది. నిధులను సమకూర్చిన వారందరూ రాజును ప్రసన్నం చేసుకోవడానికి ఎక్కువగా మొగ్గు చూపారు.

కంపెనీ గొప్ప అధికారుల సామ్రాజ్యవాద దృష్టి కంటే దాని వాణిజ్యపరమైన విజయం చాలా పరిమితంగా ఉండేది. గవర్నర్ డూప్లిక్స్, అడ్మిరల్ ల బౌర్డునాయి, జనరల్ డ బుస్సీ కంపెనీని బలంగా తీర్చిదిద్దాలని కలలు గన్నారు. అయితే 1685లో ప్రక్షాళన తర్వాత ఫ్రెంచి కంపెనీ ఖచ్చితమైన నిబంధనలను వాణిజ్యాన్ని నిర్వహించడం మొదలుపెట్టింది. శాంతి సమయాలలో అది లాభాలను కూడా ఆర్జించింది. అయితే జౌళి వ్యాపారం నుండి అది మినహాయించబడింది. అందుకు ఫ్రెంచ్ వ్యాపార విధానమే కారణం. కాని ఐరోపాయుద్ధాలవల్ల ఈ జౌళిరంగ వ్యాపారంలో తరచూ వచ్చిన అంతరాయాలు కంపెనీని దివాళా దశకు చేర్చాయి. ఫ్రెంచి వెస్ట్ ఇండీస్ కంపెనీ ఫ్రెంచి ఈస్ట్ ఇండియా కంపెనీతో 1719లో విలీనమైన తర్వాతే ఫ్రాన్స్ అంతర్జాతీయ వాణిజ్య నూతన పోకడను అందుకోగలిగింది. ఈ పోకడ హిందూ మహాసముద్ర వాణిజ్యాన్ని అట్లాంటిక్ విస్తృత వాణిజ్యంతో జత చేసింది.

## భారత విదేశీ వాణిజ్యంపై ఐరోపావాసుల ప్రభావం:

ఐరోపావాసుల, ముఖ్యంగా డచ్, ఆంగ్లేయుల, రాకతో భారతీయవస్త్రాలకు ఆసియా, ఐరోపా మార్కెట్లలో  విపరీతమైన డిమాండ్ పెరిగింది. సుదీర్ఘకాలంలో భారతీయ వస్త్రాలకు

ఆసియా మార్కెట్లు అభివృద్ధి చెందాయి. ఈ మార్కెట్లు విశాలమైనవి. వాటి డిమాండ్‌లో చాలా విభిన్నత ఉండేది. ఈ అంతర్గత ఆసియా వాణిజ్యం రెండు మార్గాలలో జరిగినట్లు కనబడుతోంది. తొలుత, కోరమాండల్, ఆగ్నేయ ఆసియా ప్రాంతాలైన మలక్కా, జావా, స్పైస్ ఐలాండ్‌ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ఉండేది. ఈ వాణిజ్యంలో కోరమాండల్ వస్త్రాలను ఆగ్నేయ ఆసియా ఉత్పత్తులతో మార్చుకునే వారు. రెండవది, బహుళపక్ష వాణిజ్యంలో కోర్‌మాండల్ వస్త్రాలు వారధిగా వ్యవహరించాయి. ఇందులో కోరమాండల్, ఆగ్నేయ ఆసియా, పశ్చిమాసియా, మధ్యధరా భాగస్వాములుగా ఉండేవి. ఈ వ్యాపారంలో కోరమాండల్ వస్త్రాలను మసాలాదినుసులతో మార్చుకునేవారు. అలా సమకూర్చుకున్న మసాలాదినుసులను మరలా పశ్చిమాసియా, మధ్యధరా మార్కెట్లకు సరఫరా చేసేవారు. భారతీయ వస్త్రాలకు ఐరోపా మార్కెట్ కేవలం 17వ శతాబ్ది మధ్యదశకాల నుండే విస్తరించి తదుపరి కాలంలో అనూహ్యంగా పెరిగింది.

ఆసియా అంతర్గత వాణిజ్యం వివిధ వ్యాపార వర్గాల మధ్య తీవ్రమైన పోటీని చవిచూసింది. ముఖ్యంగా పోర్చుగీసు, డచ్, ఆంగ్ల, డానిష్, భారతీయ (మూర్, షెట్టి) వ్యాపారుల మధ్య తీవ్రపోటీ ఉండేది. భారత వస్త్రాలకు ఐరోపా మార్కెట్‌లో ఐరోపా కంపెనీలకే ఆధిపత్యం ఉండేది. అందులోనూ ఆంగ్ల, డచ్ కంపెనీలకే ఎక్కువ పాత్ర ఉండేది. మరోవైపు భారత వ్యాపారులు మౌలికంగా మధ్యవర్తులుగా వ్యవహరించారు.

భారత విదేశీ వాణిజ్యంలో ఐరోపా కంపెనీలు, వ్యాపారుల భాగస్వామ్యం 17వ శతాబ్దం మలియార్థంలో గణనీయంగా పెరిగింది. కంపెనీలు పెట్టిన పెట్టుబడులే అందుకు సృష్టమైన సూచికలు. ఆసియా, ఐరోపా మార్కెట్లకు ఉద్దేశించిన జౌళి ఉత్పత్తులలోనే ఎక్కువగా పెట్టుబడులు పెట్టారు. తొలుత ఐరోపా మార్కెట్ డిమాండ్ కంటే ఎక్కువగా ఉన్న ఈ పెట్టుబడులు 17వ శతాబ్దం చివరి నాటికి ఈ పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. పెట్టుబడులలో మూడింట రెండు వంతులు ఒక్క ఐరోపాకే పోగా కేవలం మూడో వంతు మాత్రమే ఆసియా మార్కెట్‌కు వెళ్లింది. భారతీయ వస్త్రాల మార్కెట్ కోసం పోటీ పడ్డ కంపెనీలలో డచ్, ఇంగ్లీష్ కంపెనీల మధ్యే ప్రధాన పోటి ఉండేది. తొలుత డచ్ కంపెనీకి ఆధిపత్యం దక్కినా తర్వాతి కాలంలో ఇంగ్లీష్ కంపెనీ తన ప్రాబల్యాన్ని క్రమంగా పెంచుకున్నది (17వ శతాబ్ది చివరి సంవత్సరాల నుండి 18వ శతాబ్ది తొలి దశకం వరకు).

కోరమాండల్ నుండి ఆగ్నేయ ఆసియా, ఇతర ఆసియా మార్కెట్లకు ఎగుమతి అయిన వస్త్రాల రకాల జాబితా చాలా పెద్దదిగా ఉంది. పొడవాటి వస్త్రం, సేలం వస్త్రాల, మోరిస్ గినియా వస్త్రం, తాపీలు తదితర రకాలు ముఖ్యమైనవి. మలక్క, స్పైస్ ఐలాండ్స్, జావా, సుమత్ర, బోర్నియో, మలయ ద్వీపకల్పం, సియాం, తెనస్సరిమ్, పెగూ, అలాకన్, పర్షియా, అరేబియా, ఎర్రసముద్ర ఓడరేవులకు కూడా ప్రాచీన కాలం నుండే వస్త్రాలను ఎగుమతి చేసేవారు. అయితే కాలపు ప్రత్యేకత ఏమిటంటే ఐరోపా మార్కెట్లు నుండి కొనుగోలు

అర్జీలు ఎక్కువ కావడమే. ఆసియా మార్కెట్లు కంటే అధిక కొలమానంలో ఐరోపా మార్కెట్లు భారతీయ వస్త్రాలను దిగుమతి చేసుకున్నాయి. ఫలితంగా భారతీయ చేనేత కార్మికులు తమ ఉత్పాదనా పద్ధతులను మార్చుకోవలసి వచ్చింది. ఐరోపా డిమాండ్‌కు అనుగుణంగా చేనేత యంత్రాలను తీర్చిదిద్దాల్సి వచ్చింది. కొందరు లాభదాయకమైన పద్ధతుల్లో రాణించినా దీర్ఘకాలపు కాంట్రాక్టులు అవసరమయ్యాయి. స్పాట్ ఆర్డర్లు అసాధ్యంగా మారాయి.

భారతీయ ఆర్థిక వ్యవస్థ, ముఖ్యంగా దాని జౌళి వ్యాపారం, పరిశ్రమ, 17వ శతాబ్దం మలిభాగంలో విక్రయదారుల (ఉత్పత్తిదారుల) మార్కెట్‌గా ఉండేది. ఎందుకంటే ఆ మూడు ఐరోపా కంపెనీలు (డచ్, ఇంగ్లీష్,ఫ్రెంచి) స్వేచ్ఛా విపణిలో పోటీ పడుతున్నపుడు చేనేత దారులకు చాలా వరకు స్వేచ్ఛ ఉండేది. వారు తమ ఇష్టానికి అనుగుణంగా ఉత్పత్తి చేసేవారు. కొనుగోలుదారులు కోరుకునే మార్పిడి ఉత్పత్తులు చేనేతదారులకు మంచి అవకాశాన్ని ఇచ్చేవి. ఐరోపా కంపెనీల మధ్య వారు పరస్పర పోటీని పెంచేవారు. మరోమాటలో చెప్పాలంటే చేనేతదారుడు ఉత్పత్తి చేసే ఏ వస్తువునైనా ఎవరో ఒక ఔత్సహిక కొనుగోలుదారుడు ఏకమొత్తంగా కొనుగోలు చేసేవాడు. ఉదాహరణకు ఒకవేళ కంపెనీలు ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి నిరాకరించినా చేనేతదారులు వాటిని ఇంగ్లాండుకు చెందిన ప్రైవేటు వ్యాపారులకు అమ్మేవారు. ఈ పరిస్థితి దేశంలోని చాలా భాగాలలో నెలకొని ఉండేది. ఈ ప్రాంతాలలో మూడు ఐరోపా కంపెనీలతో పాటు ఇతర కొనుగోలు దారులు కూడా మార్కెట్‌లో స్వేచ్ఛగా పోటీపడేవారు.

**వాణిజ్య నిర్వహణలో మార్పులు :**

17, 18వ శతాబ్దాలలో భారతదేశ వాణిజ్య నిర్వహణకు సంబంధించిన ఒక ముఖ్యమైన లక్షణం వ్యాపారులు వ్యక్తిగతంగా చొరవ తీసుకొని కొత్త ప్రాంతాలలో వాణిజ్య లావాదేవీలను చేపట్టడమే. సాధారణంగా ఇలాంటి వ్యాపారులను మండళ్ల కంటే వ్యక్తిగతంగానే గుర్తించేవారు. మధ్యయుగాల కాలం నాటి వ్యాపార మండళ్ల ప్రభావం గణనీయంగా క్షీణించిందని చెప్పడానికి ఇదో మంచి నిదర్శనం. ఐరోపా కంపెనీల పక్షాన పని చేసిన వ్యాపారులు, స్వతంత్ర వ్యాపారులు మధ్య విభజన రేఖ చాలా సన్నగా ఉండేది. కొన్ని ఉదంతాలలో వాస్తవానికి వ్యాపారి రెండు పాత్రలూ పోషించేవాడు. అయితే కంపెనీ నివేదికలు అనేక మంది స్థానిక వ్యాపారులను పోటీదారులు, ప్రత్యర్థులుగా స్పష్టంగా పేర్కొన్నాయి.

అయితే అనేక మంది దేశీయ వ్యాపారులు కంపెనీ పక్షాన పని చేయడం లాభదాయకమని, అపాయ రహితమని గుర్తించారు. స్వంతంగా సుదూర ప్రయాణాలు చేపట్టి వాణిజ్యం నిర్వహించడం కంటే కంపెనీ దళారులుగా పని చేయడమే ఉత్తమమని గ్రహించారు. కంపెనీల నిర్మాణ స్వరూపంలో వారి బాధ్యత నాలుగు విధాలుగా ఉండేది; కంపెనీ కోసం వస్త్రాలు కొనుగోలు చేసి కంపెనీకి, చేనేతదారుల మధ్య వారధిగా వ్యవహరించడం; చేనేత కార్మికులపై పర్యవేక్షణ, వసూలు కాని అప్పులను భరించడం, నాణ్యత, సమయానికి ఉత్పత్తులు

అందేలా చూడడం; స్వయంగా అడ్వాన్స్‌లు చెల్లించి కంపెనీ పెట్టుబడులను చాలా వరకు పొదుపు చేయడం.

వ్యాపార మండళ్లు, వాటి కార్యకలాపాల విషయానికి వస్తే కోరమాండల్ వాణిజ్య ప్రపంచంలో స్థూలంగా హిందూ వ్యాపారులకే అధిపత్యంఉండేది. సముద్రాంతర, తీర వాణిజ్యం, గుత్త, చిల్లర వర్తకం, దళారితనం, బ్యాంకింగ్, ష్రాఫ్ బాధ్యతలు అన్ని హిందువులే నిర్వహించేవారు. హిందూ వ్యాపారులలో తెలుగు వ్యాపార కులాలైన కోమటి, బలిజ, బేరు షెట్టిలు ముఖ్యమైనవారు. వ్యక్తిగత వ్యాపారులలో కాశి వీరన్న (కాసా వెరోనా), మల్లయ్య, అతడి సోదరుడు చిన్నన్న, నరసింహరామషెట్టి, కేసర షెట్టి, శేషాద్రి, వరదప్ప, కోనేరి షెట్టి ముఖ్యులు.

ఐరోపియన్లతో మూర్‌లుగా పిలవబడ్డ కోరమాండల్ ముస్లిం వ్యాపారులు తమ తోటి హిందూ వ్యాపారులతో కలసి సముద్రాంతర, తీర ప్రాంత వాణిజ్యాన్ని నియంత్రించేవారు. వీరిలో గోల్కొండ ముస్లిం వ్యాపారులు, దక్షిణ కోరమాండల్‌కు చెందిన చులియా వ్యాపారులు ఉండేవారు. వీరి పుట్టుపూర్వోత్తరాలు చాలా భిన్నంగా ఉండేవి. అలాగే గుజరాతి, ఆర్మేనియన్ వ్యాపారులు కూడా కోరమాండల్ తీరంలో స్థిరపడ్డారు. ముస్లిం వ్యాపారులలో ముఖ్యమైన వ్యక్తులు మీర్ జుమ్లా, ఖ్వాజా నిజాం, మీర్ కమాలుద్దీన్, మిర్జా ముహమ్మద్, ఖ్వాజా హసన్ అలీ, మీర్ కసర్, ఖ్వాజా అరబి. వీరిలో అనేక మందికి రాజకీయ సంబంధాలు ఉండేవి. దాంతో ఐరోపా కంపెనీలతో లావాదేవీలలో వారికి అనుకూలమైన స్థాయి ఉండేది.

17వ శతాబ్దం మధ్య నాటికి ఐరోపా కంపెనీలతో భారతీయ వ్యాపారుల సంబంధాలు వ్యవస్థాగత స్వరూపాన్ని సంతరించుకున్నాయి. తొలుత ప్రధాన వ్యాపారుల స్వరూపంలో ఆ తర్వాత జాయింట్ స్టాక్ కంపెనీలు లేదా స్థానిక వ్యాపారుల సంఘాల స్వరూపంలో ఈ సంబంధాలు కొనసాగాయి. ఈ రెండు స్వరూపాల పుట్టుపూర్వోత్తరాలు మధ్యయుగ భారతీయ వాణిజ్య సాంప్రదాయాలలో ఉన్నాయి. అయితే వాటిని ఐరోపా వాణిజ్య ఆవిష్కరణలు ప్రభావితం చేయడంతోపాటు స్ఫూర్తిగా కల్గించాయి. ఆర్డర్లు, సరఫరాల ప్రక్రియను నిర్దిష్టంగా రూపొందించాలని భావించిన ఐరోపా కంపెనీలు ఈ రెండు స్వరూపాల అవసరాన్ని గుర్తించాయి. అలాగే ప్రమాణాలను పాటించడానికి, సరఫరాదారులపై మరింత నియంత్రణ సాధించడానికి పై రెండు స్వరూపాలు ఎంతగానో తోడ్పడ్డాయి.

భారతదేశంలోని ఐరోపా వాణిజ్య స్థావరాలన్నింటిలోనూ ప్రధాన వ్యాపారి పదవి ఉద్భవించింది.ఆ స్థావరంలోని ఒకరు లేదా ఇద్దరు ప్రముఖ వ్యాపారులు ఈ పదవిని నిర్వహించేవారు. వ్యాపారులతో ఉమ్మడిగా లావాదేవీలు నిర్వహించడం కంటే కేవలం ఒకరిద్దరు ప్రముఖ వ్యాపారులపై ఆధారపడే ఈ లక్షణం డచ్‌ల కంటే ఆంగ్లేయులలోనే బలంగా ఉండేది. మరోవైపు ఫ్రెంచి కంపెనీ అధికారులు మధ్యేమార్గాన్ని అనుసరించారు. వ్యాపార మండళ్ల

లేదా సంఘాల విషయానికి వస్తే అందుబాటులో ఉన్న అన్ని సాక్ష్యాలను బట్టి ఈ సంఘాలు 1660లో తొలిసారిగా వెలుగులోకి వచ్చాయని బోధపడుతోంది. భారతదేశంలోని డచ్ వాణిజ్య స్థావరాలలో ఇలాంటి సంఘాలు ఏర్పడ్డాయి. డచ్ కంపెనీ ఈ సంఘాల ఏర్పాటుకు చొరవ తీసుకొని వాటికి మద్దతు ఇచ్చింది. తర్వాత, ఆంగ్ల, ఫ్రెంచి కంపెనీలు అదే మార్గంలో పయనించాయి. తమ స్థావరాలలో భారతీయ వ్యాపారుల సంఘాలను ప్రోత్సహించాయి. అయితే ఈ వ్యాపార సంఘాలు 18వ శతాబ్దం సమీపించే కొద్దీ త్వరగా క్షీణించడం మొదలు పెట్టాయి.

పరిస్థితుల స్వభావంవల్ల కొందరు దళారులు ఈ కాలంలో భారతదేశంలో వ్యాపార నిర్వహణకు కీలకంగా మారారు. మధ్యయుగ కాలమంతటా దళారితనం ఒక వ్యవస్థగా, దళారులు ఒక ప్రత్యేక వాణిజ్య వర్గంగా కొనసాగారు. ఉత్పత్తిదారులు, గుత్త వ్యాపారులు, చిల్లర వ్యాపారులు, వినియోగదారుల మధ్య దళారులు వారధిగా వ్యవహరించారు. తమ క్లయింట్‌లకు ఉత్పత్తులను చౌకధరలకు కొనుగోలు చేసే ప్రాథమిక బాధ్యతతోపాటు వారు విభిన్న విధులను నిర్వర్తించారు. దళారుల మధ్య స్పష్టమైన పని విభజన ఉండేది. వాణిజ్య నిర్వహణ స్థూల నిర్మాణంలో ప్రతిదళారికి ముఖ్యమైన పాత్ర ఉండేది.ముందుగా పేర్కొన్నట్లు భారతదేశ వ్యాపారులు ఈ కాలంలో వివిధ తరహాల దళారి పనులను నిర్వహించారు.

# IV

# సమాజం – మతం

## 17

# మధ్యయుగ భారతీయ సమాజం

**స్థూల పరిచయం :**

రెండు సుదీర్ఘ ఆర్థిక పోకడల నేపథ్యంలో మధ్యయుగ సామాజిక వాతావరణాలు శతాబ్దాల తరబడి అభివృద్ధి చెందాయి. ఒకటి : సంచార రైతులు ప్రత్యేక శ్రమ, సాంకేతిక పరిజ్ఞానంతో భూమి ఉత్పాదకతను పెంచారు. రెండు, సంచార జాతులు భూ, సముద్ర మార్గాలలో రవాణా, సమాచార వ్యవస్థలను దక్షిణాసియా నుండి మధ్య ఆసియా, చైనా, మధ్యధర ప్రాంతాలకు విస్తరింపచేశారు. ఏడవ శతాబ్దం నాటికే యురేషియా సంచార మార్గాలన్నీ దక్షిణాసియాలోని ప్రాంతీయ మార్గాలతో అనుసంధానమయ్యాయి. వ్యవసాయ ఉత్పత్తి విస్తరిస్తున్న ప్రాంతాలలో కూడా స్థానిక రవాణా మార్గాలు అభివృద్ధి చెంది ప్రధాన రహదారులతో ముడిపడ్డాయి. సుదూర వాణిజ్య మార్గాలు సారవంతమైన లోయలు, డెల్టా ప్రాంతాలతో అనుసంధానమైన చోటే తొలి సహస్రంలోని అనేక కొత్త పాలక వంశాలు పుట్టి అభివృద్ధిలోకి వచ్చాయి. పంజాబ్‌లో కొండ ప్రాంతాల క్రింద పాలక వంశాలు వెలిశాయి. గంగా, నర్మద, తపతి, సాబర్మతి, మహానది, గోదావరి, కృష్ణ, పెన్నా, కావేరి, వాయ్‌గై నదీ పరివాహక ప్రాంతాల వెంబడి పాలక వంశాలు స్థాపితమయ్యాయి. ద్వీపకల్పంలో అవి నదులు సముద్రంలో కలిసే చోట పరిఢవిల్లాయి.

పాలక వంశాల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల సరిహద్దులు తరచూ మారడంవల్ల మధ్యయుగ భారత రాజకీయ భౌగోళిక చిత్రపటం రంగులమయంగా కనిపిస్తుంది. అయితే మధ్యయుగ రాజ్యాలలో అభివృద్ధిచెందిన సామాజిక వాతావరణాలు చాలా వరకు సుస్థిరమైన ఆర్థిక క్షేత్రాలలో కేంద్రీకృతమై ఉండేవి.

ప్రధాన పాలక వంశాల సగటు జీవితకాలం 300 సంవత్సరాల వరకు ఉండేది. మౌర్యులు, గుప్తులు సగటున 137, 230 సంవత్సరాలపాటు పాలించారు. భౌతిక, ఆధ్యాత్మిక నిర్వహణకు సామాజిక వ్యవస్థలను నిర్మించడంలో పాలక వంశాలు పోషించిన పాత్ర వల్లే అవి విజయం సాధించగలిగాయి. విభిన్న జీవన శైలులు గల వ్యక్తుల మధ్య సృజనాత్మక సంబంధాలను మెరుగుపరచడంలో పాలక వంశాలు చొరవ తీసుకున్నాయి. ముఖ్యంగా ఉన్నత వర్గాల ఆధిపత్యం ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఈ సంబంధాలు బలపడ్డాయి.

ఈ ప్రాంతాలలో ప్రయాణంలో ఉన్న వ్యాపారులు, యోధులు, వృత్తిదారులు, తీర్థయాత్రికులకు తగిన సేవలు అందించేవారు. ఫలితంగా పాలక వంశాలు సాంస్కృతిక ప్రాంతాలలో సాంప్రదాయానికి ప్రతీకలుగా మారాయి. ఆధునిక సామాజిక అస్తిత్వాలకు పునాదులు వేశాయి.

చారిత్రక ఆవిష్కరణగల మూడు సుదీర్ఘ కాలాలలో సామాజిక అస్తిత్వానికి సంబంధించిన కొత్త స్వరూపాలు, వర్గాలు ఆవిర్భవించాయి. తొలి మధ్యయుగ కాలపు అసలు ధనం పాలక వంశ ప్రాబల్యం ఉన్న చిన్న ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉండేది. అక్కడ రాజులు స్థానిక ఉన్నత వర్గంతో చేతులు కలిపి సామాజిక మార్పును నిర్దేశించారు. పదకొండు నుండి పదిహేనవ శతాబ్దం వరకు ఒక మధ్యయుగ పరివర్తనం సంభవించింది. పాత మధ్యయుగ ప్రాంతాలతోపాటు కొత్త భూభాగాలలో సైతం సామాజిక మార్పుకు యోధులు ముఖ్యమైన సారధులుగా మారారు. కొత్త భూభాగాలలో సైనిక పాలనలు పెరిగి తమ ప్రాబల్యాన్ని ఆశ్విక దళశక్తి, సైనిక క్రమశిక్షణతో గణనీయంగా పెంచుకున్నాయి. కొండ ప్రాంతాలలో బురుజులను ఏర్పాటు చేసుకొని ప్రధాన వాణిజ్య మార్గాలను నియంత్రించాయి. ఈ పరివర్తన తర్వాత మలి మధ్యయుగకాలం వచ్చింది. ఈ కాలపు ప్రధాన రాజకీయ వ్యక్తులు మొగల్‌లు. వారు 16వ శతాబ్దంలో ఒక విశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించారు. రెండు శతాబ్దాల రాజకీయ ఆధిపత్యంలో మొగల్ సామ్రాజ్యం వాతావరణాన్ని గణనీయంగా మార్చివేసింది. తొలి ఆధునిక యుగానికి ఆ సామ్రాజ్యం నాంది పలికింది.

రెండవ సహస్రంలో సామాజిక వాతావరణాలు నెమ్మదిగా, క్రమంగా పరివర్తన చెందాయి. ప్రతి తరంలోనూ కొత్త సామాజిక అనుభవం, కొత్త పరిసరాలు వెలుగులోకి వచ్చాయి. ప్రతి కాలంలోనూ దాదాపు కొత్త సమాజాలు అవతరించాయి. ఒక వైపు కొన్ని జీవన విధానాలు తెరమరుగు కాగా మరోవైపు కొత్తవిధానాలు అభివృద్ధి చెందాయి. కొత్త ప్రజలు, కొత్త సాంస్కృతిక అంశాలు పాత సాంస్కృతిక ప్రాంతాలలో ప్రవేశించి సంక్లిష్టమైన సమాజాలను నిర్మించాయి. మొత్తమ్మీద ప్రజలు తమ చుట్టూ ఉన్న గ్రామాలు, పట్టణాలు, ప్రాంతాలతో గుర్తించబడేవారు. సమాజాలు మరింత సంక్లిష్టంగా, వైవిధ్యంగా, విభజితంగా మారాయి.

**తొలి మధ్యయుగకాలం**

**హిందూ సమాజాల నిర్మాణం:**

తొలి మధ్యయుగ శతాబ్దాలలో మార్పులు చవి చూసిన ప్రాంతాలు ప్రాచీన సామ్రాజ్యవాద సమాజాలకు ఆతిథ్యం ఇచ్చిన మహానగరాలను పోలి ఉండేవి కావు. తమ కాలానికి ప్రాచీన నగరాలు మరీ విశాలంగా ఉండేవి. అయితే నగరజీవితానికి దూరంగా ఉన్న సముదాయాలు, బహిరంగ ప్రదేశాలతో చుట్టుముట్టబడి ఉండేవి. సుదూర సరఫరా మార్గాలపై అవి ఆధారపడి ఉండేవి. అయితే కొత్త వంశాల ఏర్పడి ప్రాంతీయ రాజ్యాలు స్థాపించబడితే ఈ సరఫరా మార్గాలు పూర్తిగా దెబ్బతినేవి. వ్యవసాయ ప్రాంతాలు, మార్కెట్లపై

ఆధిపత్యం ఉన్న సముదాయాల మధ్య తొలిమధ్యయుగకాలంలో వాణిజ్య సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రాంతీయ రాజ్యాలు సుదూర వాణిజ్యంపై చాలా తక్కువగా ఆధారపడి ఉండేవి. అయితే సైనిక కార్యకలాపాలను స్థానికంగా పెద్ద స్థాయిలో కొనసాగించేవి. ప్రతి మధ్యయుగ భారతీయ రాజ్యం మర్రి చెట్ల సమూహాన్ని పోలి ఉండేది. అందులో వేర్వేరు యాత్రికులు గూళ్లను ఏర్పర్చుకొని తమ ప్రగతిని బలోపేతం చేసుకునేవారు.

మధ్యయుగ వ్యవసాయ ప్రాంతాలు సంచారజాతుల నివాసప్రాంతాలకు విస్తరించడంతో కొత్త తరహా సమాజాలు వెలుగులోకి వచ్చాయి. ధర్మనైతిక అధికారాన్ని పరిరక్షించి దానిని విస్తరించే పనిని రాజులు, పురోహితులు, స్థానిక నాయకులు తమ భుజాన వేసుకున్నారు. ధర్మ పరిరక్షణ వల్ల రాచరిక కుటుంబాలు, స్థానిక పెద్దలు హోదా, ఆధ్యాత్మిక సామర్థ్యాన్ని పొందే వారు. దాంతో వారు శ్రమశక్తిని క్రమశిక్షణలో ఉంచి, ఆర్థిక కార్యకలాపాలను సమన్వయం చేస్తూ భూములపై యాజమాన్య హక్కులను దక్కించుకున్నారు. ధర్మంపై ఉన్న మధ్యయుగ గ్రంథాలలో రాజు క్షత్రియుడై ఉండాలని ఎక్కడా నొక్కి చెప్పలేదు. చాలా ప్రాంతాలలో కులసంఘటనాలు (జాతి) ఇతర వర్గాలు లేకుండానే అభివృద్ధి చెందాయి. అందుకు విరుద్ధంగా మధ్యయుగ ధర్మశాస్త్రాలు రాజు యొక్క పవిత్ర కర్తవ్యం (రాజధర్మం) స్థానిక ఆచారాలను కాపాడడమేనని పేర్కొన్నాయి. రాజులు, బ్రాహ్మణులు, స్థానిక భూస్వాములు కలిసి పనిచేస్తూ ధర్మాన్ని పరిరక్షించాల్సి వచ్చింది.

జాతి వర్గాల విస్తరణ ఉన్నత వర్గాల మధ్య సాంప్రదాయ సంబంధాల వల్ల సాధ్యమైనట్లు కనబడుతోంది. కొత్త పాలక వంశ ప్రాంతాలు ఇలాంటి వర్గ వ్యవస్థల నిర్మాణానికి అనుకూలంగా మారాయి. పాలకవంశ నాయుకులు, బ్రాహ్మణులు ఈ వ్యవస్థల నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారు. సామాజిక విభజన, హోదా, శ్రేణి, అధికారాన్ని నిర్ధారించారు. కొత్త సమాజాలు కొత్త సామాజిక వర్గాలు, సంస్థలను తమలో ఇముడ్చుకుని కొత్త ప్రవర్తనా పోకడలను, గుర్తింపును, విలువలను సృష్టించాయి.

సంస్కృత గ్రంథాలలో పేర్కొన్న రాచరిక పోషణ నిబంధనలను ఉటంకిస్తూ బ్రాహ్మణులు సామాజిక హోదాను నిర్ధారించేవారు. అభివృద్ధిలోకి వస్తున్న పాలక వంశాలు బ్రాహ్మణులు, ఆస్థాన కవులను నియమించుకొనేవారు. బ్రాహ్మణులు, దేవాలయాలను పోషిస్తూ తీర్థయాత్రికులు, యాచకులకు భోజనం పెట్టేవారు. అలాగే సంతులను గౌరవించేవారు, వేడుకలను ఘనంగా నిర్వహించేవారు. దేవుళ్లు, పురోహితులు, రాజులు, రైతులను ఒకే ప్రదేశంలో చేర్చే కార్యక్రమాలలో పాలుపంచుకునేవారు. బ్రాహ్మణులను అనుసరిస్తూ వారికి సహాయపడుతూ ప్రజలు సామాజికంగా తమ హోదాను పెంచుకునేవారు

రైతులు భూమి, శ్రమశక్తిపై నియంత్రణను విస్తరించేకొద్దీ ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. రైతాంగంలోని ఇతర వర్గాలు, సంచార జాతులు, వేటకారులు, అటవీ తెగలు కొత్త సామాజిక అస్తిత్వాలను సంతరించుకున్నాయి. ఎన్నో తరాల తరబడి ప్రజలు ఉన్నత వర్గ (అగ్రవర్ణ) భూస్వాములుగా, రాజులుగా, ధర్మ పరిరక్షకులుగా, క్షత్రియులుగా, వైశ్యులుగా, ఉన్నత సూద్రులుగా, దిగువశ్రేణి సూద్రులుగా, అంటరానివారిగా, పరాయి వాళ్లుగా మారారు,

వివిధ ప్రాంతాలలో రైతాంగ వర్గాలు ఆధిపత్యం సాధించాయి. జాట్‌లు, రాజపుత్రులు, కున్‌బీలు, వెల్లలాలు, వెలమలు, రెడ్లు, కాపులు, నాయర్లు తదితరులు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించారు. ఈ విస్తృత ప్రక్రియలో ప్రాచీన అస్తిత్వాలు మాయమయ్యాయి. ఉదాహరణకు హొయసల రాజులు మేకపాల (సోసెయుర్ అడవులలోని కొండదొరలు) వారసుల, యాదవులు, వొడెయార్లు పశువుల కాపరి కుటుంబాలకు చెందిన వారు. ఒకప్పుడు గుర్జరులు, రాజపుత్రులు సంచార జీవితాన్ని గడిపేవారు. కొత్త పాలకవంశాలు, పాలకవర్గాల నియంత్రణ వల్ల కొన్ని ప్రాంతాలు కూడా కొత్త పేర్లను సంతరించుకున్నాయి. సముదాయ నియంత్రణ ఆధారంగా భూములు విభజితమయ్యాయి. ఉన్నత కులాలు పాలకవంశ ప్రాంతాలతో ముడి పడ్డాయి. అన్ని ప్రాంతాల్లోనూ బ్రాహ్మణులు సహజంగా ఇమిడిపోయారు. అన్ని హిందూ సమాజాలలో నేటికి కూడా బ్రాహ్మణులకు ఉన్నత హోదా ఉంది. అయితే ఇతర అగ్రవర్ణాలకు సాధారణంగా ప్రాంతీయ గుర్తింపులభించింది.

ఉద్భవిస్తున్న సామాజిక అస్తిత్వాలను దేవాలయ శాసనాలు నాటకీయంగా తెరకెక్కించాయి. బ్రాహ్మణులు నిర్వహించే కార్యక్రమాలు దివి నుండి భువికి ఆధ్యాత్మిక శక్తిని రప్పించి ఒక కుల సామాజిక వ్యవస్థను పవిత్రం చేశాయన్న భావన ఉంది. దేవాలయాలను పవిత్రక్షేత్రాలుగా పరిగణించి వాటిలో మత వేడుకలు నిర్వహించేవారు. భక్తులు ధర్మాన్ని పరిరక్షించి మత వేడుకలకు విరాళాలు అందించేవారు. ఇలాంటి వేడుకలు విభిన్నమైన స్థానిక, ప్రాంతీయ, సామ్రాజ్య దైవాలను ఒక చోటికి చేర్చాయి. మధ్యయుగ సమాజాలు అనేక రకాల వేడుకలను (ఆచారాలను) చవి చూశాయి. ఆధ్యాత్మికవాదులు, అధికారులు, విభిన్న సామాజిక నేపథ్యం ఉన్నవారు ఈ మత ఆచారాలను నిర్వహించారు. అన్ని ప్రాంతాలలోనూ ఇలాంటి కార్యక్రమాలు జరిగాయి. వాటి వల్ల వర్షాలు కురిశాయి, పంటలు బాగా పండాయి, వ్యాధులు దూరమయ్యాయి, ఆరోగ్యవంతమైన పిల్లలు పుట్టారు, వంశాలు అభివృద్ధి చెందాయి – అన్న విశ్వాసాలు బలపడ్డాయి. అయితే మధ్యయుగ భారత శిలాశాసనాలు శివ, విష్ణువు, వారి పౌరాణిక సంబంధీకులకు బ్రాహ్మణులు జరిపిన పూజలనే గుర్తిస్తాయి. ఈ దేవుళ్లకు కట్టించిన ఆలయాలు వైభవోపేతమైన కట్టడాలుగా నిలిచి రాజకీయ ప్రాబల్యానికి ప్రతీకలుగా మారాయి.

ఏడు నుండి పదిహేడవ శతాబ్దం వరకు హిందూ దేవాలయం యొక్క విస్తరణ, వివరణ మధ్యయుగ సంస్కృతికి అద్దం పడతాయి. మహాబలిపురం, ఖజరహో దేవాలయాలు అందుకు నిదర్శనాలు. స్థానిక దైవాలు, ఆచారాలు, చిహ్నాలు, ఆధ్యాత్మికవాదాన్ని పౌరాణిక సాహిత్యంలో మేళవించి సంబంధిత కల్పిత గాధలను, జానపదాలను, కళాత్మక వస్తువులను సృష్టించారు. స్థానిక ఆచారాలను పౌరాణిక సాంప్రదాయాలలో అంతర్భాగం చేశాడు. దేవాలయ కార్యక్రమాలు, స్థానిక సముదాయాలు రాచరిక నియంత్రణ కిందికి వచ్చాయి. దేవుళ్ల గొప్పతనం రాచరిక పోషకులచి ప్రతిష్టను పెంచింది. మహాఆలయ నిర్మాణం బ్రాహ్మణులను ఆ ప్రాంతానికి రప్పించేది. ఆ ప్రదేశం రాచరిక వైభోగానికి ప్రతిబింబంగా మారేది. గొప్ప పాలకులు గొప్ప ఆలయాలను నిర్మించారు. ఆ విధంగా శిలాశాసనాలు, దేవలయాలు మధ్యయుగ సామాజిక భౌగోళిక విస్తరణను వివరిస్తాయి. తూర్పు, మధ్య ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, పశ్చిమ మహారాష్ట్ర, తీర ప్రాంతాలలో శిలాశాసనాలు ఎక్కువగా కేంద్రీకృతమయ్యాయి. పంజాబ్,

పశ్చిమ గంగాలోయ మైదాన ప్రాంతాలలోని జాత్‌రాజ్యాలు, పర్వత ప్రాంతాలలో ఇలాంటి శాసనాలు కనిపించవు. కనక ఈ ప్రాంతాలలో బ్రాహ్మణ ప్రభావం పరిమితంగా ఉండేదని, సంస్కృతులు చాలా తక్కువగా హిందూకరణ చెందాయని మనం ఒక నిర్ధారణకు రావచ్చు.

ప్రజలు, దేవుళ్లు కలిసి జీవించడంతో దేవాలయాల చుట్టూ సామాజిక అస్తిత్వాలు ప్రత్యక్షమయ్యాయి. ఒక దేవాలయం ఎంత ప్రసిద్ధి పొందేదో దాని పోషణ విలువ కూడా అంతే ఎక్కువగా ఉండేది. దేవాలయంతో ముడిపడి ఉన్న ప్రజల అస్తిత్వం కూడా బలపడేది. భక్తి ఉద్యమాలు తీర్థయాత్ర విలువను పెంచాయి. విరాళాలు జనాదరణ పొందాయి. దేవాలయాలు వాణిజ్య కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. అక్కడ భూస్వాములు, యజమానులు స్థిరపడ్డారు. ఉత్పత్తి కేంద్రాలు ప్రారంభమయ్యాయి. సామాజిక హోదా నిర్ధారణకు దేవాలయ కార్యక్రమాలు ఒక వేదికగా మారాయి. దేవాలయ గౌరవాలను ఆయా ప్రజల సామాజిక స్థాయిని బట్టి అందించేవారు. ప్రజాదరణ చూరగొన్న భక్తి ఉద్యమాలు సార్వభౌమ దైవాలను రోజు వారీ జీవితంలో మరీ కీలకంగా మార్చివేశాయి. చివరికి పేద ప్రజల కూడా దైవాలను స్మరించుకునేవారు. అయినప్పటికీ ఈ నిమ్న కూలాలకు చెందిన వారిని దేవాలయాలలోకి అడుగు పెట్టనిచ్చేవారు కాదు. విచిత్రమేమింటే భక్తి ఉద్యమ నాయకులు అనేకమంది సమాజంలోని దిగువ శ్రేణి కులాల నుండే వచ్చారు. వారి భక్తి ఎంతశక్తి మంతంగా ఉండేదంటే స్వయంగా దైవాలే దేవాలయాల బయటికి వచ్చి తమ భక్తుల ప్రేమను గుర్తించి వారిపై మమకారాన్ని కురిపించేవని చెప్పుకునేవారు.

కాలక్రమంలో బంధుత్వాలు వంశాల చుట్టూపెరిగాయి. ఈ వంశాలు, కుటుంబాలు దేవుళ్లను, బ్రాహ్మణులను పోషించేవి. ఈ బంధుత్వాలే బ్రాహ్మణేతర అగ్రవర్ణాలుగా (జాతులు) ఎదిగాయి. బ్రాహ్మణులు ఈ ప్రక్రియలో బాగా లబ్ది పొందారన్నది నిస్సందేహం. ఉదాహరణకు ఒక రాష్ట్ర కూట శిలాశాసనం వెయ్యి మంది బ్రాహ్మణులకు కానుకగా కేటాయించిన 8,000 కోసుల భూమిని నమోదు చేసింది. ఒక్క బ్రాహ్మణుడికే సుమారు 4,000 కోసుల భూమిని కేటాయించినట్లు పేర్కొంది. అలాంటి శాసనాలు బ్రాహ్మణ పోషకుల హోదాను ప్రతిబింబిస్తాయి. అయితే కొన్ని శాసనాలు బ్రాహ్మణ నివాస ప్రాంతాల ఏర్పాటును వ్యతిరేకిస్తాయి. పన్నువసూలు, మేత ప్రాంతాలపై బ్రాహ్మణులకు ఉన్న హక్కులను అవి ప్రశ్నిస్తాయి. రాచరిక అధికారం నెమ్మదిగా విస్తరించింది. కొన్ని సార్లు హింసాత్మకంగా రాజ్య విస్తరణ జరిగింది. చాలా సందర్భాలలో రాచరిక అధికారానికి భూకేటాయింపులు సరిహద్దులుగా ఉండేవి. ఇక్కడ ప్రజల ప్రతిఘటనను ఊహించవచ్చు. ప్రతిచోటా సమాజం బ్రాహ్మణుల స్థాయిని అంగీకరించింది. బ్రాహ్మణులకు భూములు కేటాయించడంపై తీవ్రమైన వ్యతిరేకత వచ్చేది. కొన్ని చోట్ల బ్రాహ్మణులను హత్య కూడా చేసినట్లు బోధపడుతోంది. ఎందుకంటే బ్రాహ్మణులను చంపితే కఠిన శిక్షను విధిస్తామన్న శాసనాలు అక్కడక్కడా కనిపించాయి.

**యోధుల ఆవిర్భావం:**

తొలి మధ్యయుగాల కాలంలో హింసాత్మక సంఘర్షణలు ఎన్నో చోటు చేసుకున్నాయి. ఒక 9వ శతాబ్ది శాసనం ఏమని పేర్కొంటుందంటే :"చండేలాలు (పాలకవంశం) బిల్లులు,

సబరులు, పులిందులనే ఆటవిక తెగలను లోబర్చుకున్నారు." శత్రువులు, ఆటవిక తెగలను నియంత్రణలోకి తెచ్చుకోవడాన్ని అనేక పాలకవంశాలు తమ వ్యాపకంగా చేసుకున్నాయి. ధీరత్వ హత్యలు, అమర సాహిత్యం, జానపదాల్లో ప్రస్ఫుటమవుతుంది. నియంత్రిత యుద్ధ స్వభావం కాలక్రమంలో మారింది. మౌర్యులు, గుప్తులు యుద్ధాన్ని నాగరికశక్తిగా తీర్చిదిద్దుతు తొలి మధ్యయుగ రాజులు పాలకులు, సామంతులు నియంత్రణ రేఖను నిర్ధారించడానికి పోరాడారు. అదే సమయంలో వారు సంచారజాతులు, ఆటవికతెగలను జయించడానికి కృషి చేశారు. ధర్మ వెలుపల ఉన్న తెగ సమాజాలు గ్రామాలు, పట్టణాల చుట్టూ ఉన్న భూభాగాన్ని చాలా వరకు తమ ఆధీనంలో తెచ్చుకున్నాయి. ఈ తెగలను అణచివేసి, అరాచక శక్తులను భూభాగాల నుండి వెలివేసి, సంచార జాతుల దాడుల నుండి పంటలను రక్షించడం, పౌర సమాజంలో తెగ సముదాయాలను అంతర్భాగం చేయడం... ఈ లక్ష్యాల సాధనకు సంఘటిత హింస అవసరమైంది.

శాశ్వత సాగు భూములను విస్తరించడానికి ఈ కాలపు పాలకవంశాలు ప్రాధాన్యతనిచ్చాయి. అందు కోసం సరిహద్దులలో తరచూ యుద్ధాలు చేశాయి. గ్రామాలలో స్థిరపడ్డ రైతులు, సంచార జాతివారు, పోడు వ్యవసాయదారులు, వేటకారులు, యోధులు, అటవీప్రాంత వాసుల మధ్యజరిగిన హింసాత్మక ఘర్షణలు సూచించేదేమిటంటే ఇలాంటి అనేక సముదాయాలు ధర్మ పాలనను వ్యతిరేకించాయి. అయితే సంచార, తెగ జాతి ప్రజలెందరినో పౌరసమాజంలో భాగస్వాములను చేశారు. పశ్చిమ మైదానప్రాంతాలు, మధ్యభారత పర్వతాలు, పంజాబ్, పశ్చిమ గంగాలోయ, ద్వీపకల్పంలోని లోపలి ప్రాంతాలలో రైతాంగ జనాభా ఇలాంటి ప్రజలు గణనీయమైన సంఖ్యలో ఉండేవారు. ఈ ప్రాంతాలలో తెగసముదాయాలకు విశాలమైన రాజకీయ అధికారాలు ఉండేవి. ఉదాహరణకు రాజపుత్ర పాలకులు భిల్ నాయకులను తమ మిత్రులుగా పరిగణించడమే కాకుండా కొన్ని రాజపుత్ర పట్టాభిషేక కార్యక్రమాలలో వారికి కీలక స్థానాన్ని కల్పించారు.

మధ్యయుగ రాజ్యాలలో సంచార జాతులు, అటవీ వ్యవసాయ దారులను తరిమివేయడం ద్వారా రైతాంగ సముదాయాలు వ్యవసాయాన్ని విస్తరించాయి. కాని అదే సమయంలో పశువుల కాపరులు, వేటకారులు, సంచార, తదితర తెగ ప్రజలు కూడా విస్తరిస్తున్న వ్యవసాయదార సమాజాలలో వచ్చి చేరారు. వ్యవసాయ కార్మికులుగా, వృత్తికారులుగా, పశుపోషకులుగా, రవాణాదారులుగా, పాల ఉత్పత్తిదారులుగా, సైనికులుగా, వ్యాపారులుగా, యోధులుగా, రాజులుగా కూడా స్థిరపడ్డారు. వ్యవసాయ ప్రాంతాలలో విభిన్న జాతులు, సముదాయాలకు చెందిన ప్రజలు నివాసముండేవారు. రైతులలో వేర్వేరు వర్గాలే కాకుండా వ్యవసాయేతర సముదాయాలు కూడా ఎంతో భిన్నంగా ఉండేవి. వ్యవసాయేతర ప్రజలు లేదా సముదాయాలు వ్యవసాయానికి కీలకంగా మారారు. వృత్తిదారులు, పశుకాపరులు, రవాణాదారులు, వ్యాపారులు, పురోహితులు, ఇంజనీర్లు, వాస్తుశిల్పులు, జోతిష్యులు, యోధులు ఈ కోవకిందికి వస్తారు. వీరిలో అనేకమంది ధర్మపాలనను కొత్తగా పుణికి పుచ్చుకున్నారు. వీరు లేనిదే ఆర్థిక వ్యవస్థలు విస్తరించేవికావు. సమాజంలో వారిని అంతర్భాగం చేయడం ఒక ముఖ్యమైన సామాజిక పథకంగా ఉండేది.

ఈ నేపథ్యంలోనే యోధులు తమ ప్రభావాన్ని పెంచుకున్నారు. యోధుల అధికారం పెరగడానికి అనేక అంశాలు తోడ్పడ్డాయి. అందులో ముఖ్యమైనది ప్రత్యేక సైనిక నైపుణ్యాలు ఉన్న ప్రజలు వ్యవసాయదార సమాజాలలో జీవించడమే. సంచార జాతి పుట్టుపుర్వోత్తరాలు ఉన్న యోధులు చాలా వరకు సైనిక నిపుణులయ్యారు. ముఖ్యంగా రాజస్థాన్, దాని పొరుగు ప్రాంతాలలో యోధుల వంశాలు గుర్జర ప్రతిహార వంశాల నుండి పుట్టుకొచ్చాయి. ఎనిమిదవ శతాబ్దంతర్వాత అవి గంగాలోయ ప్రాంతాలను చాలా వరకు స్వాధీనం చేసుకున్నాయి. పదవ శతాబ్దం నాటికి వృత్తిపరమైన సైనిక బలగాలు పాలకవంశ అధికారానికి చిహ్నాలుగా మారాయి. పాత వంశాలు భారీ సైన్యాలను వినియోగించి అపారమైన సంపదను కూడబెట్టాయి. చోళులు ఈ పోకడను అవలంబించారు. చోళ సైన్యాలు ఆంధ్ర, ఉత్తర కర్ణాటక, కన్యాకుమారి, కేరళ తదితర దక్షిణభారతప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాయి. చివరకు పాక్ జలసంధిని దాటు కొని శ్రీలంకతో పోరాడాయి. వారు పాండ్యులను జయించి తమను తాము ఒక కొత్త పాలక వర్గంగా ప్రకటించుకున్నారు. బ్రాహ్మణులు, ఇతర సేవా కులాలను సమీకరించారు. చోళులవిస్తరణ పోటీదారులలో కొత్త పాలకవంశాలను సృష్టించింది. కోస్తాంధ్ర నుండి చోళుల చేత వెలివేయబడ్డ యోధులు వరంగల్‌వద్ద కాకతీయ వంశాన్ని కొత్తగా స్థాపించారు. కాకతీయులు వ్యవసాయ కాలువలను నిర్మించారు. ఆ కాలంలో అవి అద్భుత కట్టడాలు. మైసూరు ప్రాంతంలో కూడా ఇలాంటి పరిణామాలే సంభవించాయి. అక్కడ చోళుల ఒత్తిడికి తోడు దక్కనులో చాళుక్యుల విస్తరణ హొయసల అనే కొత్త పాలకవంశాన్ని సృష్టించాయి. ఈ వంశం నిర్మించిన దేవాలయాలలోని శిల్పాలు హొయసల సాయుధ ఆశ్విక దళ వృత్తి పరమైన లక్షణాన్ని ప్రతిబింబిస్తాయి.

**సామాజిక స్థాయి పరిధి:**

ఈ కాలంలో సమాజంలో వచ్చిన మార్పులలో నిమ్నవర్గాలకు సూద్రుల ముద్ర వేయడం ప్రధానమైనది. వైశ్యులు, సూద్రుల మధ్య కాలక్రమంలో తీవ్రమైన వైరుధ్యాలు సమసి పోయాయి. సిద్ధాంతపరంగా తొలి యుగాలలో వలె ఈ కాలంలో కూడా మిశ్రమ కులాలలో అనుచిత ప్రవర్తన తాండవమాడేది. విష్ణుధర్మోత్తరపురాణలో అందుకు తగిన వ్యాఖ్యానాలు ఉన్నాయి. వైశ్య మహిళలు, నిమ్నకులాల పురుషుల మధ్య సంయోగం కారణంగా వేలాది మిశ్రమ కులాలు పుట్టు కొచ్చాయి. అయితే ఇది ఊహాజనిత వివరణ మాత్రమే. కులాల ఆవిర్భావానికి అసలు కారణం సంస్కృతీకరణ నిరంతర ప్రక్రియలో దాగి ఉంది. ఈ ప్రక్రియలో అనేక కొత్త ప్రాంతాలు, కొత్త సామాజిక వర్గాలు కుల సమాజంలో వచ్చి చేరాయి. చివరికి ఖాసా, హూణలాంటి అసలు సిసలు తెగజాతులు కూడా అగ్రవర్ణ హోదానుచాటుకున్నాయి.

అయితే కులసమాజంలో కొత్తగా అడుగుపెట్టిన వారికి విభిన్నమైన హోదా ఉండేది. ఒకే తెగ అనేక వర్ణాలుగా, కులాలుగా చీలిపోయేది. ఉదాహరణకు అభిరులు బ్రాహ్మణులుగా క్షత్రియులుగా, వైశ్యులుగా, మహాసూద్రులుగా వర్గీకరించబడ్డారు. కొందరిని మలిన సూద్రులుగా వర్గీకరించారు. ఈ కాలం మలిన సూద్రులు లేదా అంటరాని వారి సంఖ్యలో గణనీయమైన పెరుగుదలను చవి చూసింది. అగ్రవర్ణాల్లోనూ కొత్త కులాలు ఆవిర్భావించాయి. సమాచార

నివేదన లాంటి కొత్త వృత్తులు కాయస్థ కుల ఆవిర్భావానికి దారి తీశాయి. ఉత్తర భారతదేశంలో కులపెద్దలలో రాజపుత్రులు అనే కొత్త వర్గం ఆవిర్భవించింది. 12, 13 వ శతాబ్దాల నాటికి పశ్చిమ భారతదేశంలో రాజ్‌పుత్ర వంశాల సంఖ్యను 36 గా నిర్ధారించారు. అయితే నిర్మాణం అస్థిరంగా ఉండడం వల్ల పాలక వంశాలు కొత్తగా ఉన్నతహోదాను దక్కించుకున్నాయి. రాజపుత్రులలో గిరిజనులైన మేడా తెగవారు చేరడం ఇందుకు నిదర్శనం. సిద్ధాంతపరంగా వర్ణరత్నాకరలో పేర్కొన్నట్లు రాజపుత్ర సిద్ధాంతం దక్షిణాదికి కూడా విస్తరించింది.

బ్రాహ్మణులలో కూడా ప్రాంతాల వారీ వర్గీకరణ వచ్చింది. అప్పటి శిలాశాసనాల ప్రకారం ప్రత్యేక సామాజిక హోదా గల కనౌజ్ బ్రాహ్మణులు, గౌడ బ్రాహ్మణులు, కొలంక బ్రాహ్మణులు లాంటి ప్రాంతీయ కులాలు ఆవిర్భవించాయి. వాస్తవానికి స్థానికతత్వం ఎంత బలంగా మారిందంటే గ్రామాచారానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చేవారు. కొన్ని శాసనాలు గ్రామాన్ని సామాజిక నిర్వహణకు మౌలిక ప్రాంతీయ భాగంగా గుర్తిస్తాయి.

## మధ్యయుగ పరివర్తనం:

### ఎదుగుదల, సాంస్కృతిక కలయిక :

దక్షిణ యురేషియా నగరాలు, పట్టణాలపై మంగోలు సైన్యాల పాశవిక దాడులతో శతాబ్దాల తరబడి భారతదేశానికి వలసలు ప్రారంభమయ్యాయి. యోధులు, విద్వాంసులు, ఆధ్యాత్మికవాదులు, వ్యాపారులు, కళాకారులు, వృత్తిదారులు, రైతులు కార్మికులు ప్రాచీన వ్యాపార మార్గాలను అనుసరించి భారతీయ సుల్తాన్‌ల రాజ్యాలలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకున్నారు. హిందూకుష్ పర్వత ప్రాంతాల నుండి వలసదారులు వెల్లువలా వచ్చిపడ్డారు. పంజాబ్ అంతటా ఒక పట్టణం నుండి మరో పట్టణానికి, తర్వాత గంగాలోయ, బెంగాల్, సింధూ దాటి సింధ్, గుజరాత్, అటు నుండి వింధ్యలను దాటుకొని దక్కనులోకి, అక్కడి నుండి తీర పట్టణాలకు (దక్షిణ ద్వీపకల్పంలో) విస్తరించారు. సంచార జీవితం గడుపుతూ ఉపాధి లభిస్తే స్థిరపడిపోయేవారు. విద్య, రాచరిక పోషణ, అధికారం, సాహసం, ఉన్నత జీవన ప్రమాణాల కోసం అన్వేషించారు. ఈ మార్గాలలో వారు ఐదు శతాబ్దాల పాటు ప్రయాణించారు. అయితే స్థానిక జనాభా కంటే ఎన్నడూ అధిక సంఖ్యలో ఉండేవారు కాదు. కాని కాలం గడిచే కొద్దీ కొత్త వారు ఇతరులు ముందుగానే స్థిరపడ్డ ప్రాంతాలలో స్థిరపడేవారు. వారి సమీకరణ, సహజ పెరుగుదల, స్థానిక ప్రాబల్యం భారత ఉపఖండంలోని సమాజాలను శాశ్వతంగా మార్చివేశాయి. ప్రపంచంలోని అత్యంత ప్రాధాన్యత గల దీర్ఘకాలిక వలస ప్రక్రియలలో ఇదొక్కటి. అది భారతదేశంలోకి ప్రజలు, సంపదనే కాకుండా దక్షిణాసియా నుండి పశ్చిమాసియా, ఐరోపాలకు ఉత్పత్తుల సమతుల్య ప్రవాహాన్ని కొనసాగించింది.

పట్టణ కేంద్రాలు, వ్యాపార మార్గాలలో వలసదారులు ఎక్కువ సంఖ్యలో స్థిరపడి అక్కడి సమాజాలను మార్చివేశారు. పశ్చిమ, మధ్య ఆసియాలలోని దక్షిణ ప్రాంతాలనుండి భూమార్గాన దేశంలోకి వలస వచ్చినవారిని రెండు సామాజిక వర్గాలుగా విభజించవచ్చు.

అందరికీ నాయకత్వం వహిస్తూ యోధులు పోరాటవీరులను, సైనిక సరఫరాదారులను, సేవలు అందించేవారిని, తెగ, వంశ, కుటుంబ పరంగా సమీకరించారు. వారిలో ముఖ్యంగా తుర్కులు, ఆఫ్ఘన్లు ఉండేవారు. ఈ వర్గాలు కూడా బహుళ సాంస్కృతికమైనవి. అయితే రెండవ వర్గంలోని సైనికేతర ప్రజలు ఇంతకంటే విభిన్నమైన నేపథ్యాలు గలవారు. పర్షియా నుండి వలసవచ్చే వారి సంఖ్య (పై రెండు వర్గాల ప్రజలు) కాలక్రమంలో పెరిగింది. మెజారిటీ వలసదారులు సైనికేతర ముస్లింలు కావడంతో సామాజిక మార్పునకు బహుళ సంస్కృతి కేంద్రాలను సృష్టించారు. ముఖ్యంగా పట్టణకేంద్రాలు, వాటి పొరుగు ప్రాంతాలలో ఇలాంటి సాంస్కృతిక కేంద్రాలు ఏర్పడ్డాయి. వాస్తవానికి వారు పట్టణీకరణ ప్రక్రియను కొత్త పుంతలు తొక్కించారు. దేశంలో పట్టణీకరణ గణనీయమైన స్థాయిలో పెరిగింది. వలసల ప్రవాహం వల్ల చారిత్రక నమోదు కూడా మెరుగుపడింది. ముఖ్యంగా సుల్తాన్‌ల పోషణ వల్ల ఈ మార్పు వచ్చింది. కొత్త చారిత్రక  వివరణలు చాలావరకు సుల్తాన్‌ల కార్యకలాపాలు, ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాయి. సాధారణ వలసదారుల సామాజిక చరిత్ర గురించి వ్యాఖ్యానాలు పెద్దగా వెలువడలేదు. 1048లో పూర్తయిన అల్‌బిరూనీ రచన 'కితాబ్‌ఫి తహ్‌కీక్' చరిత్ర లేఖనంలో కొత్త శకాన్ని ప్రారంభించింది. అందులో ఆవిష్కరణ, అన్వేషణ భావం కనిపిస్తుంది. అల్లావుద్దీన్ ఖిల్జీ ఢిల్లీలో నిర్మించిన అలయ్ దర్వాజాతో చారిత్రక కట్టడాల నమోదు (1311) ప్రారంభమయ్యింది. అయితే అల్‌బిరూనీ "లాహోర్" లేదా అలయ్ దర్వాజాను నిర్మించిన ప్రజలు, దానినిదాటుకొని వెళ్లిన వారి కంటే మనకు సుల్తాన్‌ల గురించే ఎక్కువ తెలుసు.

పదమూడు నుండి పదహారవ శతాబ్దం వరకు తుర్కు, ఆఫ్ఘన్ యోధులు పాత మధ్యయుగ పాలక వంశాలనులోబరుచుకొని స్వయంగా స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. వారు ఒక కొత్త, సాంస్కృతికంగా భిన్నమైన పాలకవర్గాన్ని సృష్టించారు. ఈ పాలకవర్గాన్ని పాత పాలకవంశాల కుటుంబాలు, గ్రామ పెద్దలపై రుద్దారు. ఆ విధంగా కొత్త వంశాలు మధ్యయుగ చరిత్రలోని బహుళ సార్వభౌమత్వాలకు కొత్త దొంతరలను జతపరిచారు. మునుపటిలాగే యుద్ధరంగంలో ఓడిపోయిన వారు వేరే చోట అదృష్టం దక్కించుకునేందుకు పారిపోయారు. చోళుల విస్తరణ సమయంలో వరుస సమీకరణలు చోటు చేసుకున్నట్లు ఇపుడు కూడా అనేక పరిణామాల వరుసగా సంభవించాయి. జయింపబడిన రాజపుత్రులు పశ్చిమ హిమాలయాలు, పంజాబ్ కొండప్రాంతాలలో స్థానిక పాలకులను ఓడించారు. ఈ స్థానిక పాలకులు ఎగువలోయల్లోకి  వలసపోయారు. నేపాల్‌లో వారు ప్రవేశిస్తుండగా యక్ష మల్ల (1429-1482) తన రాజ్యాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి తన కుమారులకు అప్పగించాడు. ఖాట్మండు, పటన్, భక్త్‌పూర్‌లను (ఇవన్నీ నేడు ఖాట్మండు నగరంలో అంతర్భాగంగా ఉన్నాయి) అతడి ముగ్గురు కుమారులు పాలించారు. మైదాన ప్రాంతాలలో ఓటమిచెంది పారిపోయి వచ్చిన క్షత్రియులతో ముగ్గురు పాలకులు పోరాడాల్సి వచ్చింది. శతాబ్దాల తరబడి పోటీతత్వం నెలకొనడంతో సైనికు పాలకుల్లో కొన్ని ఉమ్మడి లక్షణాలు ప్రస్ఫుటమయ్యేమి. శత్రువుల లొంగుబాటు, మిత్రరాజ్యాల కూటమి, సాంస్కృతిక సమ్మేళనం గురించి తెలుసుకొని దానిని అనుసరించడం... ఇవి కొన్ని సాధారణ లక్షణాలు.

కొత్త పాలకవంశ ప్రాంతాలలో (రాజ్యాలలో) కొత్త తరహా సాంస్కృతిక సముదాయం ఆవిర్భవించి పాలకులకు ఎన్నో అవకాశాలను కల్పించింది. అయితే మెజారిటీ పాలకులు సాధారణంగా బహుళ సంస్కృతిని పెంచి పోషించారు. మధ్యయుగ సమాజాలలో హిందు భక్తి ఆచరణ, స్ఫూర్తి ముస్లిం సూఫీ ఆధ్యాత్మికవాదంతో కలిసిపోయింది. ఆధ్యాత్మిక శక్తికి ప్రతిరూపాలుగా సూఫీ గురువులు కొనసాగారు. సంగీతం, సాహిత్యాలను భక్తికి మార్గాలుగా వాడుకున్నారు. భక్తులను దేవుని సన్నిధిలోకి తీసుకువచ్చారు. ఆధ్యాత్మిక గురువులు, బోధకులు, తాంత్రికవేత్తలు, కవులు, వేడుకలు, బలిదానాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయి. తుర్కు ఆఫ్ఘన్ పర్షియన్, ప్రాంతీయ హిందూ ఆచార వ్యవహార గుణాలు కళలు, కోటలు, రాజభవనాలు, వినియోగదారుల అభిరుచిలో కలగలసిపోయాయి. రాచరిక ముద్రలు గౌరవానికి ఒక ప్రతీకభాషగా మారాయి. అన్ని మతాలకు చెందిన పాలకులు ఇలాంటి భాషనే మాట్లాడారు. ఒకరి అధికారాన్ని మరొకరు గౌరవించారు. ఉమ్మడి కార్యక్రమాలలో పాల్గొన్నారు. సుల్తాన్ రాజులు పోరాడారు. ప్రజలపై పన్నులు విధించారు, పెట్టుబడులు పెట్టారు, పరిపాలించారు, పరస్పర సంబంధాలను కొనసాగించారు. ఒకరి నుండి మరొకరు నేర్చుకున్నారు. ఈ వ్యవహారాలన్నీ ఒకే భాషలో, ఒకే తరహా సాంకేతిక పద్ధతుల్లో కొనసాగాయి. ఇలాంటి సమ్మేళనానికి విజయనగర సామ్రాజ్యం చక్కటి ఉదాహరణ. రాయ పాలకులు బహమనీ సుల్తాన్‌లలో బద్ధ విరోధులను ఎదుర్కొన్నారు. సుల్తాన్‌లు చివరికి విజయనగరను సర్వనాశనం చేశారు. అయితే రాయ పాలకులు స్వయంగా హిందూ సుల్తాన్‌లుగా మారారు. వారి అధికార పద్ధతులు బహమనీ సుల్తాన్‌లకు చాలా దగ్గరగా పోలి ఉండేవి. దక్షిణంలో నాయకులు, ఉత్తరంలో రాజపుత్రులు ఇలాగే హిందూ సుల్తాన్‌ల లక్షణాలను సంతరించుకున్నారు.

**కొత్త అస్తిత్వాల ఆవిర్భావం:**

తీరప్రాంతాలు, అంతర్గత ప్రాంతాలలో కొత్త సమాజాలు ఆవిర్భవించాయి. అలాగే పాత సమాజాలు మారిపోయాయి. వందలాది పట్టణ క్షేత్రాలలో అత్యంత నాటకీయమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. అవి మధ్య ఆసియా నుండి హిందూ మహాసముద్ర తీరం వరకు విస్తరించి ఉండేవి. ఈ పరిణామాలు మనకు కొత్త తరహా చారిత్రక ఉల్లేఖనంలో తెలియవస్తాయి. మధ్యయుగ శతాబ్దాలలో శిలాశాసనాల స్థానంలో కలం-సిరా చేతిప్రతులు క్రమంగా విస్తరించాయి. నిర్మాణశైలి '(వాస్తుశాస్త్రం) మౌఖిక వివరణలు చరిత్ర గ్రంథాలుగా మారాయి. అయితే శిలాశాసనాలు గ్రాంధిక రచనలో మార్పును కూడా ప్రతిబింబిస్తాయి. సామాజిక మార్పు ఇదో ముఖ్యమైన లక్షణం. వ్యక్తులు మరింత ప్రసిద్ధులయ్యారు. వ్యక్తిగత అస్తిత్వాలు చాలా స్పష్టంగా, వివరణాత్మకంగా ప్రత్యక్షమయ్యాయి (రెండవ సహస్రాబ్దిలోని గ్రంధాలు, నివేదికలలో). చరిత్ర రచనలో ప్రసిద్ధ వ్యక్తులు అలా విశాలమైన పాత్రను సంతరించుకున్నారు. ఇబ్న్ బట్టుట, బరానీ లాంటి రచయితలు ఘనమైన చారిత్రక ఘటనలను, వ్యక్తిగత అనుభవాన్ని చక్కగా వివరించారు.

వంశచరిత్రల రచనకు పాలకులు నిధులను సమకూర్చారు. ఆస్థాన కవులు (విద్వాంసులు) వ్యక్తి చరిత్రలను రాశారు. చరిత్ర రచన సాంస్కృతిక రాజకీయాలలో

అంతర్భాగమైంది. అయితే మధ్యయుగ చరిత్రలోని అత్యంత ప్రకాశవంతమైన తారలు 'సుల్తాన్' అనే పదాన్ని ఉపయోగించిన వ్యక్తులు. వాస్తవానికి ఆపదం అనేక మంది పాలకులకు బిరుదుగా ఉండేది. అయితే స్థూలంగా అది ఒక వ్యక్తిగత అస్తిత్వాన్ని సూచిస్తుంది. ప్రాముఖ్యత ఉన్న అనేకమంది వ్యక్తులు ఆ బిరుదును పొందారు. ఎందుకంటే సుల్తాన్ పాలకవర్గానికి ఒక ఆదర్శప్రాయునిగా లేదా సాంస్కృతిక ప్రతినిధిగా మారాడు.

సుల్తాన్‌గా వ్యవహరించడమంటే అర్థమేమిటి? ఖురాన్‌లో ఈ అరబిక్ పదానికి అర్థం ఆధ్యాత్మిక శక్తి ఉన్న వ్యక్తి. సమకాలీన చరిత్రకారుల ద్వారా సుల్తాన్‌గా పిలవబడిన తొలి వ్యక్తి మహ్మద్ ఘజ్ని. తొలుత తుర్కులలో ఈ బిరుదు లోకప్రియంగా ఉండేది. మహ్మద్ రోజులలో పాలస్తీనా, పర్షియాను పాలించిన సెల్యూక్ వంశాలు ఈ బిరుదును తొలుత సాధారణంగా ఉపయోగించాయి. తర్వాత ఐరోపాలో ఆ బిరుదును ఒట్టోమన్ తుర్కులు మరింత ప్రచారంలోకి తెచ్చారు. ఖలీఫా ఆ బిరుదును ప్రదానం చేయడం మొదలుపెట్టినపుడు అది ముస్లిం పాలకులలో త్వరితగతిన వ్యాపించింది. దారి పొడవునా మారుతూ పోయింది. తారీఖ్-ఎ-ఫిరోజ్ షాహీలో జియా ఉద్దీన్ బరానీ ఇలా పేర్కొన్నాడు : "ప్రవక్తలు, ఖలీఫాలు, సుల్తాన్‌లు, ప్రభుత్వాలు, మతానికి చెందిన గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, వారి సాంప్రదాయాల పరిజ్ఞానమే చరిత్ర." ఈ కాలం నాటికి సుల్తాన్‌లకు ఉద్దండుల సావాసం ఉండేది. దక్షిణాసియాలో గొప్ప సుల్తాన్‌లు మొగల్ చక్రవర్తులు. వారు పర్షియా సామ్రాజ్యవాద సంస్కృతిని అలవర్చుకున్నారు. పర్షియా బిరుదు 'పాద్‌షా'ను సంతరించుకొని హోదాలో తాము తుర్కు, ఆఫ్ఘన్, ఇతర సుల్తాన్‌ల కంటే ఉన్నతమైన వారమని చాటి చెప్పదలచుకున్నారు. సుల్తాన్‌కు ఎలాంటి బిరుదు ఉన్నప్పటికీ అతడో గొప్ప వ్యక్తి. సర్వసైన్యాధ్యక్షునిగానే కాకుండా ఆధ్యాత్మిక, నైతిక జీవిగా అతడికి ఎంతో ఘనకీర్తి ఉండేది. ఒక సుల్తాన్ వైభవం అతడి చుట్టూ ఉన్న వ్యక్తుల పనితనం నుండి వచ్చేది. ముస్లిం సుల్తాన్‌లపై పొగడ్తలను కుమ్మరించడం కవులు, విద్వాంసులు (ఇమామ్‌లు, ఉలేమాలు) వాస్తు శిల్పులు, చరిత్రకారులు, జీవిత చరిత్ర రచయితలు, ఆధ్యాత్మిక గురువులు (సూఫీలు), మసీదులలో శుక్రవారం ప్రార్థనలు నిర్వహించే వ్యక్తుల బాధ్యత. హిందూ పాలకుల విషయంలో ఆ బాధ్యతను బ్రాహ్మణులు, పురోహితులు, వంశ చరిత్రకారులు, కల్పిత గాథ రచయితలు, నాటక కర్తలు, గాయకులు, ఆలయ నిర్మాతలు, వేడుకల నిర్వాహకులు నిర్వర్తించేవారు. నైపుణ్య సేవలను అందించేవారు, సాంస్కృతిక కార్యకర్తలు సుల్తాన్‌లను కీర్తించే గౌరవాన్ని పూర్తి చేసేవారు. అలా చేయడంలో వారు తమ స్వంత ఉద్యోగ హోదాలను, ఆధ్యాత్మిక హోదాను అదే సమయంలో పెంచుకునేవారు.

బహిరంగ చర్చ, నాటకీతయ, ప్రతిష్ట సుల్తాన్‌ను చుట్టుముట్టి అతడికి ఘనకీర్తి కట్టబెట్టేవి. మహ్మద్ ఘజ్ని స్వీయ ప్రచారకుడిగా మారాడు. ఖలీఫాను ఆకట్టుకోవడానికి అతడు సోమనాథ ఆలయానికి జరిగిన నష్టాన్ని కొండంతలు చేసి చెప్పాడు. స్థానిక సాక్ష్యాలు అతడి వాదనతో ఏకీభవించవు. అతడు వాదించినంత విస్తృత స్థాయిలో దేవాలయాల కూల్చివేత జరగలేదు. మూడు శతాబ్దాల తర్వాత బరానీ, ఇసామీలు మహ్మద్‌ను ఆదర్శ పాలకునిగా, భారతదేశంలో ముస్లిం పాలనను స్థాపించినవాడిగా కొనియాడారు. ఈ రెండు వాదనలూ నిరాధారమైనవే. మహ్మద్ వివాదాస్పద వ్యక్తిత్వాన్ని స్థానిక రాజకీయ అవసరాల కోసం ఈ

ఇద్దరు కవులు వాడుకున్నట్లు స్పష్టంగా కనబడుతోంది. బహుశా వారు రాచరిక పోషణ అంశంపై వాదోపవాదాలలో నిమగ్నమై ఉండి ఉంటారు. సుల్తాన్‌ల విషయంలో ఈ వాదనలు మరీ తీవ్రంగా ఉండేవి. సుల్తాన్ అన్ని మతాలకు చెందిన నాయకులను సమర్థించాలా? ఇతరులపై సూఫీ గురువులకు ప్రాధాన్యత ఇవ్వాలా? ముస్లిమేతరులు, అహ్మదీ, ఇస్మాయిలీ తెగకు చెందిన దైవధిక్కారులను అణచివేయాలా? హిందూ ఆలయాలను పోషించి క్రైస్తవులతో జత కట్టాలా? ముస్లింలు, ముస్లిమేతరులపై పన్ను సమానంగా విధించాలా? ఇలాంటి ప్రశ్నలు మేధావుల మధ్య బహిరంగ వివాదానికి దారి తీశాయి. మేధావి వర్గం సుల్తాన్‌కు వెన్నుదన్నుగా నిలిచి వారసత్వ రాజకీయాలకు మద్దతునిచ్చింది. మహ్మద్ ప్రకారం హిందూ తీర్థయాత్రికులను దోచుకోవడం (అతడు దోచుకున్నాడు కూడా) సోమనాథ్ ఆలయాన్ని కూల్చడం (బహుశా అతడు ధ్వంసం చేసి ఉండకపోవచ్చు.) కంటే ప్రశంసనీయమైన పని కాదు. అందుకే ఆలయ విధ్వంసక చర్య. సమకాలీన, తర్వాతి ప్రచారకులకు ప్రధాన అంశంగా మారింది. తొలి సుల్తాన్‌లు (మహ్మద్ ఘజ్నీ లాంటి వారు) బంధువులు, తెగ ప్రజలపై పూర్తిగా ఆధారపడ్డారు. రాజకీయ ముఖచిత్రం క్లిష్టంగా మారడంతో మరింత క్లిష్టమైన వ్యక్తిత్వాలు ఆవిర్భవించాయి. మొగల్ కాలంలో అలాంటి వ్యక్తిత్వాలు పతాక స్థాయికి చేరుకున్నాయి.

చిష్టి వ్యవస్థకు చెందిన సూఫీలు బాగా సంఘటితమైన సాంస్కృతిక కార్యకర్తల బృందంగా ఉండేవారు. సుల్తాన్‌లు ఇతరులపై ఆధిపత్యం సాధించడానికి సూఫీలు తోడ్పడేవారు. చిష్టి వ్యవస్థ స్థాపకుడు ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టి అజ్మేర్‌లో జీవించారు. 1236లో అక్కడే మరణించాడు. అతడి సమాధి నేటికీ భారతదేశంలో ముస్లిం పవిత్ర ప్రదేశాలలో ఒకటిగా కొనసాగుతోంది. చిష్టిల ప్రభావం ఆధ్యాత్మికతకు మించి ఉండేది. ఎందుకంటే చిష్టి అనుచరులకు తీవ్రమైన ప్రాబల్యం ఉండేది. ఉదాహరణకు 1400లో చిష్టి నాయకులు (షేక్‌లు) బెంగాల్‌లో స్థానిక సుల్తాన్ బ్రాహ్మణులను పోషించడాన్ని, ముస్లిమేతరులను ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వారి వ్యూహం ఫలించినట్లు కనబడుతోంది. ఎందుకంటే బెంగాల్ సుల్తాన్ స్థానిక చిష్టిల పోషణను పెంచాడు. అయితే తన బహుళ సంస్కృతి విధానంలో ఎలాంటి మార్పు చేయలేదు. సుల్తాన్ దేహదారుఢ్యం, మాట, దయాగుణం, వ్యక్తిగత అలవాట్లు, వ్యాపకాలు, కుటుంబం, నివాసం, పూర్వీకులు, భార్యలు,కుమారులు, అల్లుళ్లు, అతడి బహిరంగ అస్తిత్వానికి లోపలి నిర్మాణంగా ఉండేవి. అతడి లక్షణాలు, కుటుంబ సభ్యులు గురించి ప్రజలు లోలోపలే మాట్లాడుకునేవారు. వాటి మీద కళ, జానపదాలు, పాటలు, చరిత్ర వెలువడేవి. ఆస్థానంలో సుల్తాన్ వ్యక్తిత్వాన్ని ప్రతిరోజూ నాటకీయంగా పొగడడం, ప్రజా దర్బార్‌లలో అతడిని కీర్తించడం జరిగేది. ప్రజాదర్బార్‌లో సుల్తాన్ అతిధులను, రాయబారులను, సామంతులను, మిత్ర రాజ్యాల పాలకులను, పన్నులు, కప్పాలు చెల్లించే వారిని స్వాగతించేవాడు. దర్బార్ సంస్థాగతంగా అభివృద్ధి చెందింది. దాని మధ్య ఆసియా తొలి స్వరూపం యుద్ధరంగంలో ఒక రాచరిక స్థావరంగా ఉండేది. తదుపరి శతాబ్దాలలో అది నిర్మాణపరమైన వైభవాన్ని సంతరించుకుంది. ముఖ్యంగా తుగ్లకాబాద్ కోటల సముదాయం, తర్వాతి మొగల్ కోట నగరాలైన ఫతేపూర్ సిక్రి, ఆగ్రా, ఢిల్లీలు నిర్మాణశైలిలో అత్యంత వైభవంగా తీర్చిదిద్దబడ్డాయి. మొగల్ నగరాలలోని దర్బార్ హాళ్లు చక్రవర్తి అధికార నిర్వహణకు

విశాలమైన వేదికలుగా మారాయి. చాలా దర్బార్‌లలో అధికార దర్పం, నాటకీయతకు సంబంధించిన హిందూ, ముస్లిం సాంప్రదాయాలను పాటించేవారు.

సుల్తాన్‌తో సంబంధం ఉన్న వ్యక్తిగత అస్తిత్వాలను బహిరంగంగా రక్తికట్టించేందుకు దర్బార్‌లు వేదికగా మారాయి. తన అధికార దర్పాన్ని చాటు కోవడానికి సుల్తాన్ తాను వెళ్లే ప్రతి ప్రాంతానికి తన దర్బార్‌ను తీసుకెళ్లేవాడు. యుద్ధ సమయాలలో దర్బార్ చాలా వరకు ప్రయాణంలో ఎక్కువగా కాలం గడిపేది. పాలకుడి ప్రయాణ ఆస్థానం నిరంతరం సాంస్కృతిక దృగ్విషయంగా మారింది. ఒక సుల్తాన్ యొక్క బృందం, రాచరిక సామాగ్రి, కుటుంబం అతడి గొప్పతనాన్ని ప్రతిబింబించేవి. బహిరంగ ప్రవర్తనలో సుల్తాన్‌లు నిక్కచ్చిగా వ్యవహరించేవారు. అధికారిక లాంఛనాలను ఖచ్చితంగా పాటించేవారు. అలా చేయకపోతే తోటి సంస్థానాధీశులు హద్దు మీరే అవకాశముండేది. సుల్తాన్ దేహంపై విలువైన, ఆకర్షణీయమైన భారీ వస్తువులు ఉండేవి. ఆ విధంగా అతడు తన ఆధిపత్యాన్ని నిత్యం చాటుకునేవాడు. విజయనగర రాయలు తమను తాము "తూర్పు, పశ్చిమ సముద్రాల అధిపతులు"గా ప్రకటించుకున్నారు. తమ దేహాలపై విదేశాల నుండి తెప్పించిన విలువైన వస్తువులు, ముఖ్యంగా సుగంధ ద్రవ్యాలు, విలువైన వజ్రాలు, ముత్యాలు ధరించేవారు. సుల్తాన్ నివాసం అతడి దేహానికి విస్తృత రూపంగా ఉండేది. వనరుల సమీకరణ, నియంత్రణ, ఆధిపత్యం, సంపద, విలువ, అభిరుచికి అతడి రాచరిక నివాసం నాటకీయతను చేకూర్చేది. గొప్ప పాలకుని వినియోగ సాంప్రదాయాలు భారతదేశ రాజకీయ జీవితంలో ఎన్నడూ మారని వాస్తవంగా మిగిలిపోయాయి.

బహిరంగ వేడుకలలో, మరీ ముఖ్యంగా వివాహ వేడుకలలో, సుల్తాన్ వ్యక్తిత్వానికి సంబంధించిన ముఖ్య లక్షణాలు ప్రస్ఫుటమయ్యేవి. రాజకీయ జీవితంలో వివాహాలు ప్రధాన ఘటనలుగా ఉండేవి. ఎందుకంటే రాజకీయ మైత్రిని సాధ్యం చేయడానికి వివాహ సంబంధం ఒక సురక్షితమైన మార్గంగా ఉండేది. రాచరిక నివాస అంతర్గత లేదా రహస్య గదుల్లో పాలక కుటుంబ సభ్యులు అధికారం, ప్రాబల్యం కోసం పోటీపడేవారు, కుట్రలు పన్నేవారు. కొన్నిసార్లు ఈ ఎత్తులు పై ఎత్తుల వల్ల వారసత్వ పోరాటాలు జరిగేవి. అందులో బంధువులు ఒకరినొకరు చంపుకునేవారు. తన నివాసంలో సుల్తాన్ గౌరవం అతడి తల్లి, భార్యలు, కుమార్తెలు, చెల్లెళ్ల మచ్చలేని వ్యక్తిత్వంపై ఆధారపడి ఉండేది. అంతఃపుర మహిళలు పర్దా చాటున నివసించేవారు. పర్దాలో ఉన్న వారు (పర్దానషీన్) సుల్తాన్ స్వంత ప్రతిష్టగా మారారు. ఉన్నత వర్గాలలో కూడా పర్దా సంప్రదాయం విస్తరించింది. సుల్తాన్‌లు, హిందువులు, ముస్లింల వలే వారు సామాజిక కట్టుబాట్లను పాటించడం మొదలుపెట్టారు. ఈ విషయంలో, అలాగే మరికొన్ని అంశాలలో రాజ్‌పుత్ర పాలకులు ఆదర్శ క్షత్రియులుగా మారారు. వీరు కూడా సుల్తాన్‌ల ఆచార వ్యవహారాలను అనుకరించారు.

**మలి మధ్యయుగ కాలం :**

**ఇండో-పర్షియన్ సామ్రాజ్యవాద సమాజం :** ఆధునిక సామాజిక వాతావరణాలను నిర్ధారించే ఎన్నో లక్షణాలు 16వ శతాబ్దంలో ఆవిర్భవించడం మొదలుపెట్టాయి. అందుకే

మలి మధ్యయుగ కాలాన్ని (1526–1757) తొలి ఆధునిక కాలంగా వర్ణించడానికి సహేతుకమైన కారణం ఉంది. విస్తరణ దశలో ఉన్న వ్యవసాయ ప్రాంతాలలో పట్టణీకరణ నాటకీయంగా పెరిగింది. 1595లో అబుల్‌ఫజల్ అయిన్–ఎ–అక్బరీ ప్రకారం 180 మహానగరాలు, 2,837 పట్టణాలు ఉండేవి. మొగల్ కాలంలో అధికార హోదాలు కూడా స్పష్టంగా నిర్ధారితమయ్యాయి. మహానగరాలలో సామ్రాజ్య ఉన్నత అధికారులు, నగరాలలో తక్కువ హోదా ఉన్న అధికారులు, పట్టణాలలో మూడువ శ్రేణి అధికారులు విధులు నిర్వర్తించారు. అధికారస్వామ్యం, భౌగోళశాస్త్రం ప్రాంతాల, అందులోని ప్రజల అస్తిత్వాలను నిర్ధారించాయి. పాలకవర్గాల్లో ఉన్నత వ్యక్తులు మహానగరాలలోని ఉన్నతాధికారులు. వీరి చుట్టూ ప్రాంతీయ, స్థానిక నాయకులు మూగేవారు. అయిన్–ఎ–అక్బరీలో పేర్కొన్న అధికారస్వామ్యం చక్రవర్తికి వ్యక్తిగత విధేయతపై ఆధారపడి ఉండేది. సంస్థానాధీశులందరూ చక్రవర్తికి విధేయులుగా ఉండి సామ్రాజ్యాన్ని సమైక్యంగా ఉంచేవారు. సామ్రాజ్యవాద సమాజానికి పాలకవర్గం వెన్నముకగా ఉండేది. సామ్రాజ్య ప్రాంతాల నుండి పన్నులు వసూలు చేస్తూ ఈ పాలకవర్గ సభ్యులు భారీ సైన్యాలను నియంత్రించేవారు. చక్రవర్తి వ్యక్తిగత కమాండ్‌లో అత్యంత విశాలమైన సైన్యం ఉండేది. అయితే సంస్థానాధీశులు గణనీయమైన సంఖ్యలో ఏకమైతే వారిని ఓడించే శక్తి చక్రవర్తికి ఉండేది కాదు. అంటే గొప్ప సంస్థానాధీశుల సైన్యాలు అంతే స్థాయిలో శక్తివంతంగా ఉండేవి. స్వతంత్ర వనరులు ఉన్న యోధులు అమీర్‌లుగా మారారు. వారికి మన్సబ్ హోదాను కట్టబెట్టారు. వారికి జీతాలు లేదా భూముల ఆదాయాన్ని చెల్లించారు. క్రమంగా ఈ వ్యవస్థను అక్బర్ ప్రక్షాళన చేశారు. సైనికులు, అశ్వాల సంఖ్యను బట్టి సంస్థానాధీశుల మన్సబ్ హోదాను నిర్ధారించారు. ఫలితంగా సామ్రాజ్య హోదా సంస్థానాధీశుడి సైనిక బలగాలతో నేరుగా ముడిపడి పోయింది. తమ రాచరిక యోధుని హోదాను కాపాడుకుంటూ చక్రవర్తికి విధేయులుగా ఉంటూ, సైనిక సేవలు అందించే ఉన్నతస్థాయి  సైనిక కమాండర్లను తీర్చిదిద్దాలన్నదే ఈ ప్రణాళిక లక్ష్యం.

చక్రవర్తి విచక్షణాధికారాల నుండే మన్సబ్‌దార్‌లకు మన్సబ్‌లను కేటాయించేవారు. అలాగే ప్రాంతీయ గవర్నర్లు, సుబేదార్‌లను కూడా చక్రవర్తే నియమించేవాడు. ఇలాంటి అధికారులు ఆయా ప్రాంతాలలో అధికార యంత్రాంగాన్ని నిర్వహించాలి. సిద్ధాంతపరంగా ఈ ఏర్పాటు సంస్థానాధీశులు రాజకీయ ప్రాబల్యం ఉన్న స్వతంత్ర ప్రాంతీయ ఆధారాలను నిర్మించుకోకుండా నివారించలిగింది. అయితే ఆచరణలో సంస్థానాధీశుని వ్యక్తిగత ప్రాబల్యాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే చక్రవర్తి మన్సబ్‌లు, నియామకాలు వంటి రాజకీయ నిర్ణయాలు తీసుకునేవాడు. చక్రవర్తి పై ఎదురు తిరిగే ప్రమాదం ఎప్పుడూ ఉండేది. ఎందుకంటే అమీర్ సైన్యాలు అతడికి వ్యక్తి గతంగా విధేయత చూపేవి. ప్రాంతీయ జమీందార్లు, బ్యాంకర్లు, ఇతర సంపన్నులు అమీర్‌లు లేదా సుబాదార్‌ల పక్షం వహించే అవకాశం ఉండేది. సామ్రాజ్యాన్ని సమైక్యంగా ఉంచాలంటే చక్రవర్తి తన వ్యక్తిగత అధికారాన్ని వినియోగించి సంకీర్ణ రాజకీయాలను నిర్వహించాల్సిన అవసరం ఉండేది. అలాగే వ్యతిరేక శక్తులలో చీలిక తెచ్చి. పాలకవర్గాన్ని ఒక సర్వోన్నత అధికారం కింద ఉంచాల్సిన అవసరం కూడా ఉండేది. మొగల్ పాలకవంశంలో వచ్చిన వారసత్వ పోరాటాలన్నీ ఏ రాకుమారునికి ప్రబలమైన శక్తి ఉందో నిరూపించాయి. ఈ శక్తి సంస్థానాధీశుల మద్దతును కూడ గట్టడంపైనే ఆధారపడి ఉండేది.

అక్బర్ వ్యూహాత్మక, కీలక భాగస్వామ్యం రాజపుత్ర పాలకులతో ఉండేది. తన పాలకవర్గంలో చేరాల్సిందిగా అతడు రాజపుత్ర నాయకులను ఆహ్వానించాడు. వారి కుమార్తెలను వివాహం చేసుకోవడం ద్వారా వారితో మైత్రిని ధృడపరచుకున్నాడు. చివరకు ఒక రాజపుత్ర కుటుంబం తప్ప మిగతా వంశాలన్నీ మొగల్ వంశీయులతో వివాహ సంబంధాలు పెట్టుకున్నాయి. పాలకవంశంలో వివాదాలు తలెత్తి అంతర్గత పోరాటానికి దారి తీసేవి. అంటే సంస్థానాధీశుల మద్దతు ఆధారంగా ఆధిపత్య సమీకరణలు తారుమారయ్యేవి. రాజపుత్ర మహిళకు జన్మించిన రాకుమారుడు సలీం తన తండ్రిపై తిరుగుబాటు చేశాడు. తన చుట్టూ సంస్థానాధీశులను చేరదీశాడు. 1602లో తన పేరును చక్రవర్తిగా చదివించుకున్నాడు. (తండ్రి మరణానికి మూడేళ్ల ముందు). అయితే అతడి తిరుగుబాటు విఫలమైంది. అయినప్పటికీ అతడు అక్బర్ వారసునిగా సింహాసనాన్ని అధిష్టించి జహంగీర్ చక్రవర్తిగా మారాడు. అంతకు ముందు తిరుగుబాటు చేసిన తన స్వంత కుమారుడిని ఓడించాడు. ఖుస్రోను నిర్బంధించి అతడి కళ్లను పీకి వేయించాడు. 1622లో నిర్బంధంలో ఖుస్రో మరణించినపుడు జహంగీర్ మరో కుమారుడు ఖుర్రం కూడా తిరుగుబాటు చేసి విఫలమయ్యాడు. ఐదేళ్ల తర్వాత అతడు ఆగ్రాలో విజయగర్వంతో అడుగుపెట్టాడు. జహంగీర్ మరణం తర్వాత ఈ పరిణామం సంభవించింది. ఖుర్రం షాజహాన్ అనే బిరుదుతో చక్రవర్తి అయ్యాడు. 1639లో షాజహాన్ అనారోగ్యం పాలుకావడంతో అతడి ప్రథమ కుమారుడు దారాషికో, చివరికుమారుడు ఔరంగజేబ్‌ల మధ్య వారసత్వ పోరు మొదలైంది. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఔరంగజేబ్ ఎట్టకేలకు విజయం సాధించి చివరి గొప్ప మొగల్ చక్రవర్తిగా తన సుదీర్ఘ పాలనను ప్రారంభించాడు.

ఔరంగజేబ్ మరణం తర్వాత కొన్నేళ్లకే చక్రవర్తి, సంస్థానాధీశుల మధ్య అధికార సమతుల్యం స్పష్టంగా మారిపోయింది. సంస్థానాధీశులు పైచేయి సాధించారు. చక్రవర్తులు ప్రాంతాలలో తిరుగుబాట్లను అణచివేయలేకపోయారు. 1725 నాటికి బెంగాల్ సుబా అన్నివిషయాల్లోనూ స్వతంత్రంగా వ్యవహరించింది. ఇతరులు కూడా అదే బాటలో పయనించారు. చక్రవర్తి రాజకీయ ప్రాబల్యం క్షీణించి ఎంతో కాలం గడచినప్పటికీ సామ్రాజ్యంలోని రాజ్యాలు సామ్రాజ్యవాద ప్రాంతాలుగా మొగల్ ఆధిపత్యం కింద కొనసాగాయి. సామ్రాజ్యం కంటే మొగల్ అధికారం ఉన్న ప్రాంతాలు చాలాకాలం కొనసాగాయి. మొగల్ ఆధిపత్యంలో ఈ ప్రాంతాలు రాజకీయ ప్రాంతాలుగా మౌలికంగా రూపాంతరం చెందడంతో ఇలాంటి అధికారం సాధ్యం అయ్యింది. మార్పు ప్రక్రియలో అనేక నేపథ్యాలు గల శక్తులు అంతర్భాగమయ్యాయి. అయితే అత్యంత ముఖ్యమైన విషయం అన్ని మొగల్ ప్రాంతాలలో ఇండో-పర్షియన్ సంస్కృతిని ఒంటబట్టించుకున్న ఉన్నతవర్గ సామ్రాజ్యవాద సమాజం ఆవిర్భవించింది. ఈ సామ్రాజ్యవాద సమాజం మనుగడ సాగించడమే కాకుండా ఔరంగజేబ్ మరణం తర్వాత బలమైన చక్రవర్తి ఎవరూ లేకపోవడంతో తమ ప్రాబల్యాన్ని కూడా విస్తరించుకున్నాయి.

భారతదేశంలోని అన్ని ప్రాంతాలు, వర్గాల నుండి సైనిక, భౌతిక, సాంస్కృతిక శక్తులను విశాల స్థాయిలో మొగల్ సామ్రాజ్యవాద సమాజం తనలో ఇమడ్చుకుంది. బాబర్

తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించినపుడు సర్వవ్యాపితంగా ఉన్న మంగోలు, తుర్కు సైనిక పద్ధతులు, పరిజ్ఞానాలను ఈ సమాజం పుణికిపుచ్చుకుంది. బాబర్ ఉజ్బెక్ ఆశ్వికదళాన్ని, ఫిరంగులను, పదాతి దళాన్ని జతపరిచారు. ఇవి ఒట్టోమన్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల చుట్టూ విస్తరించాయి. కొత్త పోరాట నైపుణ్యాలు, వ్యూహాలు, ఆయుధ సామాగ్రి మధ్య ఆసియా, ఐరోపా నుండి వలసదారులతోపాటు ఇక్కడికి వచ్చాయి. ఐరోపా ఆయుధాలు, పద్ధతులు 1498లో వాస్కోడిగామా భారతదేశంపై అడుగుపెట్టిన తర్వాత క్రమంగా దిగుమతి అయ్యాయి. యురేషియాలో జరిగిన సైనిక ఆవిష్కరణలన్నీ ఢిల్లీకి, తీరప్రాంతాలకు క్రమం తప్పకుండా వచ్చి చేరాయి. రెవెన్యూ పరిపాలనలో తుర్కు ప్రభావం స్పష్టంగా కనిపించింది. తైమూర్ అనుసరించిన ఇక్తా పద్ధతులను మొదలుకొని ఈ ప్రభావం అన్ని పాలక వంశాలలోనూ కనిపించింది. ఒట్టోమన్, ఢిల్లీ సుల్తాన్‌లు ఇలాంటి విధానాలనే కొనసాగించారు. అయితే మొగల్‌ల పాలనలో పర్షియన్, ప్రభావం గణనీయంగా కనిపించింది. పర్షియా అధికారులు, న్యాయమూర్తులు, సూఫీలు, కళాకారులు, తదితరులను అక్బర్ తన పాలనాయంత్రాంగంలో భర్తీ చేశారు. సామ్రాజ్యాన్ని విస్తరించి, స్థిరీకరించి దానిని సానపెట్టే ఉద్దేశ్యంతోనే నిపుణులైన పర్షియన్లను అతడు నియమించాడు. అయినప్పటికీ మొగల్ పరిపాలన సాంప్రదాయబద్ధమైనది. యోధుని గౌరవంపై మంగోలులకు ఉన్న సిద్ధాంతాలు, సైనిక కమాండర్లకు పన్నులను కేటాయించే తుర్కు పద్ధతులు,పర్షియా అధికారస్వామ్య లక్షణాలు (సైనిక, పరిపాలన, న్యాయపాలన మధ్య విభజన) స్థానిక సముదాయాలలో పాలకవర్గ నియంత్రణకు ఉన్న ప్రాంతీయ సాంప్రదాయాల కలయికగా మన్సబ్‌దారి వ్యవస్థ ఆవిర్భవించింది.

మొగల్‌ల అధికార ప్రామాణికం కింద బహుళ సార్వభౌమత్వాలు కొనసాగాయి. విశాలమైన పర్షియన్ సామ్రాజ్య సంస్థలు మొగల్ రాజకీయ వ్యవస్థను సమైక్యపరిచాయి. ఇందులో వ్యక్తిగత విధేయతలకు ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. ప్రాంతాలలో శతాబ్దాల తరబడి వచ్చిన కలయికలవల్ల కొత్త సమాజాలు ఆవిర్భవించాయి. సామ్రాజ్యవాద ఉన్నత వర్గాలు ఈ సమాజాలలో నాయకత్వ స్థాయిని అందుకున్నాయి. ఈ వర్గాలు తమతమ ప్రాంతాలలో జాతి, మత విధేయతల కారణంగా ప్రత్యేక గుర్తింపును పొందాయి. అయితే మొగల్ ఆధిపత్య ఛత్రం కింద తమ ప్రాబల్యాన్ని, జీవనోపాధిని దక్కించుకున్నాయి. గొప్ప చక్రవర్తుల కంటే సామ్రాజ్యవాద సమాజం చాలా కాలం కొనసాగింది. ఎందుకంటే మొగల్ అధికారం ప్రాంతీయ పాలకవర్గాలను బలోపేతం చేసింది. ఈ వర్గాలు కూడా సామ్రాజ్యానికి లోబడి ఉండేవి. స్వతంత్ర హోదాను దక్కించుకున్న తర్వాత (18వ శతాబ్దంలో)ఈ వర్గాలు తమ సామ్రాజ్య అస్తిత్వాలను నిలుపుకున్నాయి. మొగల్ వ్యవస్థ వారసత్వమైన అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. అన్ని మొగల్ ప్రాంతాలలో సామ్రాజ్యవాద వ్యవస్థ గొప్ప యోధులు కాకుండా రాజులు, భూస్వాములనే కాకుండా స్థానికంగా బలంగా ఉన్న కుల సముదాయాలను కూడా తనలో విలీనం చేసుకుంది. దేవాలయాలు, బ్రాహ్మణులకు రాచరిక విరాళాలు కొనసాగాయి. ఆ విధంగా పాత మధ్యయుగ ఆచారాలను సామంతులను బలోపేతం చేయడానికి మొగల్ పాలకులు ప్రయోగించారు. ఇండో-పర్షియన్ సామ్రాజ్యవాద సంస్కృతి బహుళ, వికేంద్రీకృత సార్వభౌమత్వాలకు సరికొత్త చట్టబద్ధతను కల్పించింది. ఒక మహా చక్రవర్తి

నుండి ఇలాంటి చట్టబద్ధత లభించేది. ప్రాచీన ధర్మశాస్త్ర సిద్ధాంతాలను తన ప్రసిద్ధమైన 1665 ఫర్మాన్‌లో ఔరంగజేబ్ పునరుద్ధరించాడు. "ఎవరైతే బంజరు భూమిని సాగు భూమిగా మారుస్తారో వారినే ఆ భూమికి అసలైన యజమానులుగా గుర్తించాలి. వారిని భూమి నుండి తొలగించకూడదు," అని ఆ ఫర్మాన్‌లో ప్రకటించాడు. స్థానిక భూస్వాములు ఉన్నత అధికార వ్యవస్థ నుండి గ్రామ సార్వభౌమత్వాన్ని పొందారు.

పార్సీభాష ప్రాంతీయ పాలకవర్గాలకు రాజకీయాలు, పరిపాలన, చట్టానికి సంబంధించి ఉమ్మడి పదాలను అందించింది. మొగల్ జాతి రాజకీయాలలో పర్షియా వలసదారులు ప్రత్యేక హోదాను దక్కించుకున్నారు. చక్రవర్తి, సంస్థానాధీశుల అస్థానాలు, వాటి చుట్టూ వారు సాంస్కృతిక ఉన్నత వర్గంగా ఎదిగారు. పార్సీ కవిత్వం, వాచకం మొగల్ ఆస్థానాన్ని, దరఖాస్తులు, పన్నుపద్దులను ముంచెత్తింది. పాలకవర్గం కూడా అదే భాషను వినియోగించింది. ఇలాంటి సాంస్కృతిక ఉన్నత వర్గం తొలుత సామ్రాజ్య నగరాలైన లాహోర్, ఢిల్లీ, ఆగ్రా, అలహాబాద్, జాన్‌పూర్, ఆ తర్వాత ప్రాంతీయ రాజధానులైన లక్నో, ఢాకా, హైదరాబాద్‌లలో అభివృద్ధి చెందింది. ఉత్తర భారతదేశంలోని మొగల్ ప్రాంతాలలో – ఆఫ్ఘనిస్తాన్ నుండి బెంగాల్ వరకు– పట్టణ వాడుక, సాహిత్య భాషలైన ఉర్దూ, హిందుస్తానీలలో సంస్కృత, అరబిక్, పార్సీ, స్థానిక భాషల పదాలు వచ్చి చేరాయి. సామ్రాజ్యవాద సమాజంలో ఎదుగుదలకు పార్సీ పాండిత్యం ఒక సాధనంగా ఉండేది, పట్టణ ప్రాంతాలలో పార్సీ పరిజ్ఞానం ఏ స్థాయిలో ఉంటే ఆస్థాయిలో సామాజిక హోదా దక్కేది. పార్సి బాగా తెలిసిన వారు ఉన్నత వర్గాలుగా, తెలియనివారు దిగువశ్రేణి వర్గంగా ఉండేవారు. ఇండో పర్షియన్ సాంస్కృతిక రూపాలు, పదప్రయోగాలు సామ్రాజ్య ఆధిపత్యం ఉన్న అన్ని ప్రాంతాలకు విస్తరించి స్థానిక రూపాలుగా స్థిరపడ్డాయి. సర్కార్ అనే పదం ఒక ఉదాహరణ. ప్రాంతీయ భాషలో ఆ పదానికి అర్థం 'ప్రభుత్వం'. ఆవిధంగా ఆ పదం ఒక బిరుదుగా, హోదా, ఒక ప్రాంతంపేరుగా, గౌరవ వందనంగా మారింది. ప్రజలు తమ వ్యక్తిగత పేర్లకు సర్కార్ అనే బిరుదును వాడుకోవడం మొదలుపెట్టడంతో అది కుటుంబ గుర్తింపుగా, కుటుంబంపేరుగా మారిపోయింది. ఇతర అధికార బిరుదులు(హోదాలు) కూడా వ్యక్తిగత పేర్లుగా మారాయి. ఆ విధంగా మొగల్ పదాలు సామ్రజ్యవాద సమాజమంతటా విస్తరించాయి. సామ్రాజ్యం విస్తరించిన కొద్దీ కొత్త నగరాలకు ప్రయాణించాయి. సైనిక, పరిపాలన, న్యాయ అధికారం లోతుగా చొచ్చుకుపోవడంతో భారతీయ సమాజంలోస్థూలంగా మొగల్ పదాలు విస్తరించాయి.

సర్వోన్నత చక్రవర్తి అత్యంత శక్తివంతమైన అధికార వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తాడన్న సిద్ధాంతం సర్వవ్యాపితం అయ్యింది. ఈ సిద్ధాంతం ప్రాచీన, తొలిమధ్యయుగ సామ్రాజ్య ఆధిపత్య సిద్ధాంతాలనుండి శక్తిని గ్రహించింది. కనక చక్రవర్తి ఆధిపత్యం కేవలం అణచివేతకు కాకుండా నైతిక, ఆధ్యాత్మిక, న్యాయవర్తనానికి కూడా సంబంధించినది. అందుకే నిత్యం భౌతిక బలప్రయోగానికి దిగాల్సిన పరిస్థితిపై, అది ఆధారపడలేదు. నిత్యజీవితంలో చక్రవర్తి సర్వోన్నత ఆధిపత్యం కనిపించింది. సామ్రాజ్య, ప్రాంతీయ, స్థానిక అధికారులు చక్రవర్తి నియంత్రణలో పని చేస్తున్నారన్న భావన బలపడింది. పార్సీ భాషలాగా మొగల్ కేంద్ర ప్రాంతాలలో (సింధూ, గంగా బేసిన్‌లలో) భారత–పర్షియా రాజకీయ సంస్కృతి విశాలంగా

అభివృద్ధి చెందింది. అయితే సామ్రాజ్యం విస్తరించిన ప్రాంతాలు, వాటి వెలుపలకూడా ఈ సంస్కృతి క్రమంగా విస్తరించింది. భారత ద్వీపకల్పం చివరి మూలకు కూడా విస్తరించింది. అక్కడ ఏ మొగల్ చక్రవర్తి అడుగుపెట్టకపోయినా వారి సంస్కృతి మాత్రం బలపడింది. కేవలం 1750లోనే మొగల్ సైన్యాలు ఈ ప్రాంతంలో అడుగుపెట్టాయి. ఆర్కాట్ నవాబు వాటిని పంపించాడు. అయితే అతడు మొగల్ చక్రవర్తుల ఆజ్ఞలను ఏనాడూ పాటించలేదు.

ఈ సాంస్కృతిక నేపథ్యంలో ప్రజాదర్బార్ అనేసంస్థ ప్రతిస్థాయిలోనూ విస్తరించింది. ఆ విధంగా సుల్తాన్ సాంస్కృతిక నమూనా ప్రతిస్థాయిలో ఉన్న ప్రజలలో విస్తరించింది. సమాజంలో తమ వ్యక్తిగత హోదాను, ఆధిపత్యాన్ని చాటుకోవడానికి వ్యక్తులు ఈ సంస్కృతిని వాడుకున్నారు. సామ్రాజ్యానికి సాంప్రదాయబద్ధంగా కట్టుబడి ఉండడంపైనే హోదాలు నిర్ధారితమయ్యేవి. ఆ విధంగా దర్బారు సంస్కృతి అన్ని వైపులా విస్తరించింది. హోదా ఉన్న ప్రతి వ్యక్తి ప్రజా దర్బార్‌ను నిర్వహించాడు. బహిరంగ నాటకాలు, సాహిత్యాలలో వ్యక్తులను కీర్తించడం వల్ల వారి అనుచరులకు అధికారం దక్కింది. ప్రతిస్థాయిలోనూ హోదాలను, బిరుదులను కట్టబెట్టడం వల్ల సార్వభౌమత్వం నిర్ధారణ అయ్యేది. తమ నాయకుడిని గుర్తించడం, గౌరవించడం ద్వారా అనుచరగణం అధికారాన్ని చెలాయించారు. తమ కింది వారికి హోదాలు, గౌరవాలు కల్పిస్తూ నాయకులు వారి గుర్తింపును, రాజకీయ మద్దతును పొందారు. నిత్యజీవితంలో సామ్రాజ్య హోదాలు సామాజిక ఎదుగుదలకు కొలమానాలు అయ్యాయి. చిహ్నాలు, హోదాలు ఒక వ్యక్తి సామాజిక స్థాయిని నిర్ధారించేవి. అందుకే అవి ఆశించదగ్గ సామాజిక ఆస్తులుగా మారాయి.

**జాతుల కలయిక - సాంస్కృతిక విభిన్నత :**

సామాజిక వర్గాలను అధికారికంగా ఉమ్మడి వ్యవస్థలుగా నామకరణం చేశారు. సామ్రాజ్యవాద సమాజంలో ఆయా వర్గాల ప్రతినిధులు గౌరవాలు, హోదాలు, భూకేటాయింపులను పొందారు. ఈ వర్గాలు అధికారికంగా ఉమ్మడి సామాజిక అస్తిత్వాలను పొందాయి. అందులో ప్రజలంతా ఆ అస్తిత్వంలో భాగమయ్యారు. జాతుల సమతుల్యానికి సామ్రాజ్యవాద వ్యూహాలను రూపొందించిన ఘనత అక్బర్‌కు దక్కుతుంది. ఏ వర్గానికి ఎలాంటి హోదా, గౌరవం దక్కాలో అక్బర్ మంత్రులు జాబితాలను తయారు చేసేవారు. ముఖ్యంగా తుర్కు, ఆఫ్ఘన్ జాతీయుల మధ్య సమతూకం పాటించడానికి అక్బర్ చాలా ప్రాధాన్యత ఇచ్చాడు. సామ్రాజ్య సేవలో ఈ జాతీయులు గణనీయ సంఖ్యలో ఉండేవారు. వారి విధేయతలు ఎప్పుడూ సందేహాస్పదంగా ఉండేవి. వారి ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయడానికి అక్బర్ రాజపుత్రులు, పర్షియన్లు, భారతీయ ముస్లింలను పాలకవర్గంలోకి తీసుకువచ్చాడు. ఆయా వర్గాల నాయకుల మధ్య పోటీ సృష్టించి వారు సామ్రాజ్య నియంత్రణలో ఉండే విధంగా వ్యూహాలు రూపొందించారు.

పాద్షానామా ప్రకారం 443 మధ్యవర్తి మన్సబ్‌దార్‌లలో (సామ్రాజ్యం విస్తరించే కొద్దీ వీరి సంఖ్య కూడా పెరిగింది) ఇరానీలు (పర్షియన్లు) 28%, తురానీలు (తుర్కులు) 23%, రాజపుత్రులు 16%, భారతీయ ముస్లింలు 15%, ఆఫ్ఘన్లు 6%, మరాఠాలు 2%

ఉండేవారు. దీనిని బట్టి పాలకవర్గంలో ముస్లింలు 72 శాతంగా ఉన్న జాతిపరంగా చీలిపోయారని అర్థమవుతుంది. దిగువ శ్రేణులలో స్థానికంగా ప్రాబల్యం ఉన్న కుల వర్గాలను విదేశీయులు, వలసదారులతో సమతూకం పాటించేవారు. మొగల్‌కేంద్ర భూభాగాలలో ఇలాంటి వ్యూహం చాలా అవసరమైంది. అయిన్-ఎ-అక్బరీ ప్రకారం ఢిల్లీ సర్కార్‌లోని పది పరగణాలు ముస్లిం, హిందువులలోని ఆయా జాతులు, కులాల నాయకుల నియంత్రణలో ఉండేవి. వీరిలో తోన్వర్లు, షేక్ జాదాలు, రాజపుత్రులు, గుజ్జర్లు, జాట్‌లు, బ్రాహ్మణులు, అహిర్లు, ఆఫ్ఘన్లు ఉండేవారు. మసీదులు, సమాధుల నిర్వహణకు ఆఫ్ఘన్లు పన్నురహిత ఆర్థిక సహాయాన్ని పెద్ద మొత్తంలో పొందారు. ఢిల్లీ ప్రాంతంలో మొగల్ అధికారులు ఆఫ్ఘన్లను భర్తీ చేశారని దీనిని బట్టి అర్థమవుతుంది. అయితే స్థానిక రాజపుత్రులు, జాట్‌లు సైనికపరంగా చాలా శక్తిమంతులుగా ఉండేవారు. రెండు ప్రధాన కొండ బురుజుల నియంత్రణ రాజపుత్రుల చేతిలో ఉండేది. వారి స్వాతంత్ర్యాన్ని చక్రవర్తి పట్ల వారి విధేయతను ఈ హోదా ప్రతిబింబిస్తుంది.

స్థానిక సమాజాలలో సామ్రాజ్యహోదాలు ఆ విధంగా పాత వ్యవస్థల్లో చొచ్చుకుపోయి వాటి చారిత్రక గమనాన్ని ప్రభావితం చేశాయి. ఇంతకు ముందు మనం గమనించినట్లు సమాజంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన హిందూ వర్గాలు తమ హోదాను నిలబెట్టుకునేందుకు ధర్మ శాస్త్రాలను వాడుకున్నాయి. అంటే వర్ణ వ్యవస్థలో తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు ధర్మపాలన సిద్ధాంతాన్ని ఉపయోగించుకున్నాయి. ఈ వ్యవస్థలో పురోహితులు, యోధులు ఉన్నతవర్గంగా, వ్యాపారులు, రైతులు పీడిత వర్గంగా కొనసాగారు. వంశపాలన ఉన్న ప్రాంతాలలో స్థానిక హిందూ వర్గీకరణ వ్యవస్థలు ఎన్నో ఆవిర్భవించాయి. అక్కడ పాలకులు పై స్థాయి నుండి జాతి శ్రేణులను నిర్వచించారు. విస్తరిస్తున్న వ్యవసాయదార సమాజాలు కింది స్థాయి నుండి జాతిశ్రేణులను ఆక్రమించాయి. మొగల్ కాలంలో సామాజిక మార్పు హిందూ జాతిశ్రేణుల నిర్వచన సంస్థల నియంత్రణగా సామర్థ్యాన్ని అధిగమించింది. అమల్లో ఉన్న జాతివ్యవస్థకు భిన్నంగా ఎందరో రాజులు, సుల్తాన్‌లు, రాజ్య అధికారులు రాజ్యగౌరవాలను, పురస్కారాలను నిమ్నకులాల వారికి ప్రదానం చేశారు. అంటే హిందూ దేవాలయ జీవితానికి వెలుపల ఉన్న సముదాయాల నేతలకు రాజ్యగుర్తింపు లభించింది. గొప్ప పాలకుల దర్బార్‌లు దేవాలయాలతో పోటీపడి ఆయా ప్రజలకు రాజ్య హోదాను, గౌరవాన్ని కల్పించారు.

సుదీర్ఘ పోకడలెన్నో హిందూ సామాజిక శ్రేణులను ఆచరణపరంగా లౌకికీకరణ చేశాయి. సామాజిక వర్గీకరణ, కలయిక ఎన్నో హోదాలను, మరెన్నో పాత్రలను సృష్టించాయి. వాటిని నియంత్రించే నైతిక శక్తి ధర్మశాస్త్రాలకు లోపించింది. ఉదాహరణకు ఉన్నత వర్గాలు, చేనేత పనివారు వివిధ వర్ణ హోదాలను దక్కించుకున్నారు. బ్రాహ్మణేతర ఉన్నత వర్గమైన కాయస్థ కులానికి స్పష్టమైన వర్ణ హోదా ఉండేది కాదు. భూమిలేని నిరుపేదలు (వీరు పెద్ద సంఖ్యలో ఉన్నారు) వర్ణ హోదాలో చివరి స్థానానికి దిగజారి అస్పృశ్యులుగా లేదా బహిష్కృతులుగా మారారు. దక్షిణ తమిళనాడు గ్రామీణ ప్రాంతానికి చెందిన కల్లుగీత కార్మికులను షానన్ అని పిలిచేవారు. వీరిది పెద్ద జాతి. ఇలాంటి జాతులు హిందూ సముదాయాలకు వెలుపల లేదా శివార్లలో జీవించేవి. వీరిని పవిత్ర క్షేత్రాలలోకి (దేవాలయాలు) అడుగు పెట్టనిచ్చేవారు కాదు. అయితే రోజువారీ ఆర్థిక జీవనంలో వారు ఎంతో కీలకమయ్యారు.

ఆర్థిక రంగంలో వారికి అనిశ్చిత వర్ణ హోదా ఉండేది. మానవ సంబంధాలు విస్తృతంగా ఉన్న ప్రపంచంలో మెజారిటీ హిందువులు జీవించారు. అలాంటి ప్రదేశాలలో వారు ధర్మాన్ని కూడా జవదాటారు. పట్టణీకరణ, వలసల వల్ల తక్కువ కులంలో పుట్టిన వారు కూడా కొత్త ప్రదేశాలలో ఉన్నత కుల హోదాలు చాటుకున్నారు. ఉదాహరణకు సౌరాష్ట్ర నేతనివారు గుజరాత్ నుండి మదురైకి వలసపోయినపుడు (17వ శతాబ్దంలో) తాము బ్రాహ్మణులమని వాదించారు. వారి వాదనతో స్థానిక రాజులు కూడా ఏకీభవించారు. మితవాద ధర్మ శాస్త్రాలెన్నో ఇలాంటి సర్దుబాట్లును హేతుబద్ధం చేశాయి. హిందూ సమాజాలు ముఖ్యమైన హిందూయేతరులను తమలో కలుపుకున్నాయి. విస్తరిస్తున్న మొగల్ సామ్రాజ్య ప్రాంతాలలో వర్ణ (కులం) సామాజిక హోదాకు ప్రామాణిక నిబంధనగా మారింది.

మలిదశ మధ్యయుగ రాజకీయ పాలనలన్నీ ఆచరణలో బహుళసంస్కృతిగల రాజ్యాలుగా చెలామణి అయ్యాయి. మొగల్ పాలకవంశంతో వివాహ సంబంధాలు పెట్టుకోవడం ద్వారా రాజపుత్రులు తమ హోదాను, ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. మరాఠా నాయకుడు షాజీ భోంస్లే దక్కను సుల్తాన్‌లసేవలో తన సైనిక జీవితాన్ని ప్రారంభించాడు. దక్కను సుల్తాన్‌లు ఇచ్చిన గౌరవం హోదాలతో అతడు వృద్ధిలోకి వచ్చాడు. 18వ శతాబ్దపు తమిళ హిందు నాయకులు కాండీ వద్ద సింహళ బౌద్ధ రాజులతో వివాహ బంధాలు పెట్టుకొని హిందూ।బౌద్ధ రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. మొగల్, మొగల్ అనంతర కాలంలో సైన్యాలన్నీ వివిధ సాంస్కృతిక వర్గాలను కలిగి ఉండేవి. వ్యాపార కుటుంబాలు సంస్కృతులకు అతీతంగా తమ కార్యకలాపాలు నిర్విహించాయి. 1650 నాటికి జైనులు, బొహ్రాలు, సున్నీలు, అహ్మదీయాలు, బనియాలు, ఖత్రీలు, అరబ్‌లు, చెట్టియార్‌లు, ఆర్మేనియన్లు, యూదులు, డచ్‌లు, ఆంగ్లేయులు, తదితరులు వ్యాపార రంగంలో క్రియాశీలమయ్యారు. ఉపసంస్కృతి ప్రదేశాలలో ప్రజలు క్రమం తప్పకుండా తమ స్థావరాలను మారుస్తూ వాటి సరిహద్దులను చెరిపివేశారు. క్రైస్తవ, ఇస్లాం మతం స్వీకరించిన వారు తమ పాత జాతి అస్తిత్వాలను నిలుపుకున్నారు. శ్రీలంకలోని బౌద్ధులు కుల హోదాలను కొనసాగించారు. హిందువులుగా మారిన గిరిజన తెగలు తమ గిరిజన సంస్కృతిలోని ఎన్నో అంశాలను అలాగే ఉంచుకున్నారు. ముఖ్యంగా వివాహ సాంప్రదాయాలు, ఇతర ఆచారాలను మునుపటి లాగే కొనసాగించారు.

చివరి మధ్యయుగ కాలం నాటి సాంస్కృతిక సమ్మేళనం హిందూ వర్ణ విభజనను విశాలమైన బహుళసంస్కృతి దృశ్యంలో భాగం చేసింది. ఇక్కడ ప్రజలు వివిధ మార్గాలలో హోదాను దక్కించుకున్నారు. సర్కారు హోదాను నిర్ధారించే అధికార సంస్థగా మారింది. ఉన్నత, మధ్య కింది స్థాయి హిందూ సమాజాలలో సామాజిక హోదాను నిర్ధారించే కార్యకాలాపాలు మతం నిర్వచించిన సాంస్కృతిక సరిహద్దులను దాటాయి. సంపూర్ణమైన హిందూ వర్గీకరణ వ్యవస్థలు చివరికి సనాతనవాద హిందువులలో సామాజిక హోదాను నిర్ధారించే బాధ్యతకు సరితూగలేదు.

అయితే ఇండో పర్షియన్ సంస్కృతి ఉన్న ప్రాంతాలు, ఉపప్రాంతాలన్నింటిలో సంపన్న యోధులు, పురోహితులు, వ్యాపారులు జమీందార్లు సమాజంలో ఉన్నత హోదాలను దక్కించుకున్నారు. మతాలకు అతీతంగా వాటికి ఆ హోదా దక్కింది. అలాగే అన్ని వృత్తులకు

చెందిన మెజారిటీ పేదప్రజలు సమాజంలోని దిగువ శ్రేణులకు పరిమితమయ్యారు. వీరిలో శారీరక శ్రమ చేసేవారు. సంచార జాతులు, అటవీ ప్రాంత నివాసులు, మత్స్యకారులు, తదితర వర్గాలు ఉండేవి. అభివృద్ధి కాంక్ష కలిగిన రైతులు, వృత్తిదారులు, దుకాణదారులు, మరెందరో మధ్యస్థంగా ఉన్న హోదాలకై పోరాడారు. బహిరంగ వేడుకల్లో గౌరవాలు పొందడం ద్వారా వ్యక్తులు సమాజంలో తమ స్థాయిని పెంచుకున్నారు. హోదాలు, బిరుదులను ప్రదానం చేసే సంస్థల సంఖ్య కూడా పెరిగింది. ప్రాంతీయ సమాజాలలో స్థానికంగా బాగా ఉపయోగపడే సంస్థలకే ఆయా వర్గాలు ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చాయి. రాజులు, సుల్తాన్‌లు, పురోహితులు, గురువులు, సూఫీలు, మఠాలు గౌరవపురస్కారాలను ప్రదానం చేశాయి. వ్యాపారాలు, వ్యవసాయ సముదాయాలు, పట్టణ కేంద్రాలు, పాలకవంశాలు గౌరవాలకు అవకాశాలు కల్పించాయి. తమ అంతర్గత శ్రేణులను నిర్ధారించే సంస్థలు చుట్టూ సామాజిక వర్గాలు మూగాయి. ఆ సంస్థలను హోదాల విశాల ప్రపంచానికి అనుసంధానం చేశాయి.

సమాజంలో వాణిజ్యీకరణ పెరగడంతో సైనికశక్తి, మార్కెట్లు, యుద్ధాలు సామాజిక ఎదుగుదలకు అవకాశాలు కల్పించాయి. 18వ శతాబ్దంలో ఇలాంటి పోకడ మరింత ప్రస్ఫుటమయ్యింది. అయితే సామాజిక హోదా పెంచుకోవడానికి వివాహ సంబంధాలు మౌలిక పద్ధతిగా కొనసాగాయి. రాజకీయ పథకం నిర్మాణంలో నిమగ్నమైన కుటుంబాల మధ్య వైవాహిక సంబంధాలు పెరగడంతో కొత్త సామాజిక వర్గాలు పుట్టుకువచ్చాయి. ఈ వర్గాలు సామాజిక వర్గ లక్షణాలను జాతీయతతో జతపరిచాయి. రాజపుత్రులు అందుకు చక్కటి ఉదాహరణలు అందించారు. రాజపుత్రులు  మొగల్ పాలకులతో వివాహ సంబంధాలను పెట్టుకున్నపుడు సామ్రాజ్య పాలకవర్గంలో ప్రవేశించి రాజపుత్ర నాయకులుగా తమ హోదాను పెంచుకున్నారు. మొగల్ అధికారంలో రాజపుత్రుల హోదా ప్రాంతీయ పాలకుడిగా మారింది. జాతి వివాహాల నిర్వహణ జాతిహోదాకు వెలుపల, వర్ణవ్యవస్థ లోపల తీవ్ర ప్రభావాన్ని చూపింది.

ప్రాంతీయ సమాజాలలో అనేక జాతి వర్గాలు ఇండో-పర్షియన్ సాంస్కృతిక శ్రేణులలో హోదా కలిగిన జాతి వర్గాలుగా రూపాంతరం చెందాయి. ఇవి మత సరిహద్దులను దాటాయి. ఈ ప్రక్రియ తొలి ఆధునిక కాలపు మరో ముఖ్యమైన లక్షణాన్ని ప్రతిబింబిస్తుంది. అక్బర్ పాలనతో ఒక ఆధునిక తరహా ప్రభుత్వ ప్రామాణికత మొదలవుతుంది. సామ్రాజ్య ఆర్థిక వ్యవస్థ మొగల్ భారతాన్ని కొత్త స్వరూపం గల ఆర్థిక ప్రాంతంగా మార్చింది. మొగల్ అధికార విస్తరణతో భారతదేశానికి రాజకీయ గుర్తింపు వచ్చింది. ఈ గుర్తింపును గ్రహించిన ఐరోపా వ్యాపారులు ఇక్కడికి తరలివచ్చి భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లను సృష్టించారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారతదేశాన్ని అంతార్భాగం చేశారు.

ఈ దృష్టికోణం నుండి చూస్తే శతాబ్దాల ఇండో- పర్షియన్ సాంస్కృతిక ఆధిపత్యం మధ్యయుగ, ఆధునిక అంశాలు రెండింటినీ కలిగి ఉంది. చారిత్రక ఉల్లేఖనం(సాక్ష్యాలు) కూడా సామాజిక వివరణ, సామాజిక వ్యవస్థ ఆధునిక స్వరూపాలవైపు పరివర్తనాన్ని సూచిస్తాయి. అయిన్-ఎ-అక్బరీ, 19వ శతాబ్దపుతొలి ఇంగ్లీషు జనగణన జాతి వర్గాలను ఇతర వర్గాల పక్కన నమోదు చేశాయి. ఇతర వర్గాలను వర్ణ వ్యవస్థ నిర్వచించికపోయినా భాష, కులం, వృత్తి, జన్మస్థలం ఆధారంగా వాటిని నమోదు చేశారు.

జాతి అనే పదం భారతీయ బహుళసంస్కృతి జాతీయత అస్తిత్వాన్ని నిర్ధారిస్తుంది. సమాన లక్షణాలు కలిగిన, అంతర్గత వివాహ సంబంధాలున్న, సముదాయ జీవితం కలిగిన, ఒకే రకమైన ఆచారవ్యవహారాలు, ప్రార్థనా పద్ధతులు, వస్త్ర, ఆహార అలవాట్లు, భాష, నాయకత్వం కలిగిన వర్గాన్ని జాతిగా నిర్వచించేవారు. ఆవిధంగా విభిన్న వర్గాలైన ఇరానీలు, బ్రాహ్మణులు, క్రైస్తవులు, ఆర్మేనియన్లు, బిహారీల, ఫిరంగీలు (ఐరోపావాసులు) జాతులుగా మారారు. కులం అనే పదం జాతి వర్గమనే అర్థానిచ్చింది. సామాజిక సంబంధాలలో ఈ వర్గానికి హోదా నిర్ధారించబడి ఉండేది. కులం అనేపదం పోర్చుగీసు కాస్టా అనే పదం నుండి ఏర్పడింది. అయితే ఈ పదం వర్ణను పరిగణలోకి తీసుకోదు. కాని హోదాగల వర్గాలకు శ్రేణిని నిర్ధారిస్తుంది. జాతీయత రాజకీయాలలో అక్బర్ నిమగ్నమై ఉన్నపుడు అతడు ఆఫ్ఘన్లు, పర్షియన్లు, తుర్కులు, రాజపుత్రులు, భారతీయ ముస్లింల మధ్య ప్రత్యక్ష సమతుల్యాన్ని పాటించాడు. ఎందుకంటే అతడి సాంస్కృతిక వీక్షణంలో"ఒక వ్యక్తికి ఎలాంటి హోదా కల్పించినా దాని ప్రభావం ఆ వ్యక్తి జాతి వర్గంపై స్థూలంగా ఉంటుంది."

మొగల్ సామ్రాజ్యం నుండి ఆవిర్భవించిన సాంస్కృతిక ప్రాంతాలలో ప్రాంతీయ, స్థానిక పాలకులు జాతి రాజకీయాలను నడిపారు. అందులో బౌద్ధులు, ముస్లింలు, జైనులు, క్రైస్తవులు, ఇతర హిందూయేతర వర్గాలు కూడా అంతర్భాగంగా ఉండేవారు. ఈ వర్గాలు వర్ణ వర్గీకరణలను ఉపయోగించకపోయినా సామాజిక హోదా దక్కించుకునేందుకు ఒకే రకమైన వ్యూహాలను అనుసరించాయి. ఆ విధంగా సాంస్కృతిక సరిహద్దులను చెరిపివేస్తూ రవాణా, సమాచారాన్ని సులభతరం చేశాయి. ముస్లింలు పేదలుగా ఉన్న ప్రాంతాలలో (తూర్పు బెంగాల్ గ్రామీణ ప్రాంతాలు, గంగా లోయలోని నగరాలు) స్థానిక హిందువుల కంటే ముస్లింలకు తక్కువ హోదా ఉండేది. ముస్లింలు సంపన్నంగా, బలంగా ఉన్న ప్రాంతాలలో (మొగల్ కేంద్ర భూభాగాలలో సంస్థానాధీశులు, జమీందార్ల లాగా) ముస్లిం నాయకులు సమాజంలో ఉన్నతహోదాను కలిగి హిందూ ఉన్నత వర్గాల నుండి తగిన గౌరవాన్ని పొందేవారు. ఈ సాంస్కృతి కలయిక, విభిన్నత కారణంగా కులం విభిన్న పరిణామాలు గల అనువర్తిత పదంగా మారింది.

## రెండు సమాజాల సహజీవనం:

సుల్తాన్ రాజ్య కాలంలోలాగా మొగల్ కాలంలో కూడా భారతీయ సమాజం మతం ఆధారంగా రెండు విశాలమైన విభజనలుగా విభాజితమైంది. ఆంగ్లేయుల నివేదికలు, ఆ కాలపు అధికారిక పత్రాలలో హిందువులను జెంటూలుగా (జెంటైల్స్) ముస్లింలను మూర్లుగా పేర్కొన్నారు. వీరి మధ్య సామాజిక కలయిక ఉండేది కాదు. అంటే అంతర వివాహాలు, సహపంక్తి భోజనాలు తదితర స్వరూపాలలో ఎలాంటి కలయిక ఉండేది కాదు. సామాజిక ప్రవర్తన, ఆచారవ్యవహారాలలో రెండు సముదాయాలు వేర్వేరుగా ఉండేవి. వారి ప్రణామ స్వరూపాలు కూడా భిన్నంగా ఉండేవి. ఆహార, వస్త్ర అలవాట్లలో భిన్నంగా ఉండేవారు. ప్రతి సముదాయానికి స్వంత మత వేడుకలు, పండుగలు ఉండేవి. జననం, మరణం, తదితర సందర్భాలలో ఇరు సముదాయాల సామాజిక వేడుకలు, ఆచారాలు వేరుగా ఉండేవి. ఇలాంటి

వైరుధ్యాలు తరచూ సంఘర్షణలకు దారి తీసినా శాంతియుత సహజీవన వ్యవస్థ ఒకటి అభివృద్ధి చెందింది. చివరికి సామాజిక సందర్భాలు, జాతర్లలో స్నేహపూర్వక కలయికలు అసహజంగా కనిపించేవి కావు. అయితే ప్రతి సమాజం తన స్వంత అస్తిత్వాన్ని జాగ్రత్తగా కాపాడుకుంది.

**ముస్లిం సమాజం:**

మధ్య, పశ్చిమాసియా ముస్లిం దేశాల నుండి వరుసగా వలసలు సంభవించడం వల్ల ముస్లిం జనాభా తన మిశ్రమ లక్షణాన్ని నిలుపుకుంది. బాబర్, అతడి వారసుల పాలనలో మధ్య ఆసియా వాసులు, పర్షియన్లు పశ్చిమోత్తర ప్రాంతంలో భారతదేశంలో ప్రవేశించి మొగల్ పూర్వ ముస్లిం వలసదారుల పక్కన సహజీవనం చేశారు. తీరప్రాంతాలలో వలసదారులు మౌలికంగా వ్యాపారులు. తొలుత వారు అరేబియా, పర్షియన్ ఎడారి ప్రాంతాల నుండి వచ్చారు. స్థానిక హిందువులు లేదా ఇస్లాం పుచ్చుకున్న వారితో అడపాదడపా కలయిక ఫలితంగా మిశ్రమ నేపథ్యం ఉన్న ముస్లిం సముదాయాలు ఎన్నో ఆవిర్భావంలోకి వచ్చాయి. ఉదాహరణకు పశ్చిమ భారతదేశంలో నకాయత్‌లు, మలబార్‌లో మప్పిళ్ల లేదా మోప్లాలు, కోరమాండల్ తీరంలో లబ్బయిలు. అలాగే అబిసినియా నేపథ్యం ఉన్న ముస్లింలు కూడా గణనీయమైన సంఖ్యలో ఉండేవారు. తొలుత వీరు భారతదేశానికి బానిసలుగా దిగుమతి అయ్యారు. మొగల్ సామ్రాజ్యంలో ఆఫ్ఘన్‌లోని విశాల భూభాగాలు అంతర్భాగంగా ఉండడం వల్ల భారతదేశంలో నివసించిన ఆఫ్ఘన్లను వలసదారుల జాబితాలో చేర్చాల్సిన అవసరం తలెత్తదు.

విదేశీ పుట్టుక ఉన్న ముస్లింలు ఇస్లాం మతం ఆధారంగా సమైక్యం అయ్యారు. అయితే వారిలో జాతి, మత విభేదాలు ఉండేవి. ఈ విభేదాలు సమాజం, రాజకీయాలను ప్రభావితం చేశాయి. తురానీలు(మధ్య ఆసియా వారు), ఆఫ్ఘన్లు సున్నీ వర్గానికి చెందిన వారు. పర్షియన్లు (ఇరానీలు) షియాలు. విభిన్న నేపథ్యాలు కలిగిన ముస్లింలలో రాజకీయ ప్రాబల్యం, సామాజిక ఎదుగుదల కోసం తీవ్రంగా పోటీపడే వారు. అయితే ఒక విభిన్న వర్గంగా పరిగణిస్తే, విదేశీ పుట్టుక ఉన్న ముస్లింలు మొగల్ కాలపు పాలకవర్గంలో ప్రధాన శక్తిగా ఉండేవారు. హిందుస్తానీ ముస్లింలకంటే తమకు ఉన్నతమైన హోదాఉందని వాదించేవారు. అంటే పుట్టుక, జాతి, సంస్కృతి ఆధారంగా తాము హిందూ మతం మార్చుకున్న వారు, వారి వారసుల కంటే ఉన్నత హోదాకలవారమని వాదించేవారు.

హిందూ మతం నుండి ఇస్లాం స్వీకరించిన వారే ముస్లిం జనాభాలో మెజారిటీ వర్గంగా ఉండేవారు. అయితే రాజకీయ, సామాజిక ప్రయోజనాలను దక్కించుకోవడం కోసం తాము విదేశీయులమని చెప్పుకునే గుణం వారిలో ఎక్కువగా ఉండేది. అసలు సిసలు తురానీ, ఇరానీలు వీరిని సాధారణంగా చిన్నచూపు చూసేవారు. అయితే శుక్రవారం ప్రార్థనల్లో వారిని మసీదులలోకి సాదరంగా ఆహ్వానించేవారు. అలాగే ప్రధాన పండుగల సమయంలో వారితో కలిసిపోయేవారు. జాతీయత ఆధారంగా అంతర వివాహాలపై ఎలాంటి నిషేధం ఉండేది కాదు. తక్కువ పుట్టుక పుట్టిన ముస్లిం తన సామర్థ్యంపై పాలకవర్గంలో ఉన్నత స్థానానికి ఎదిగే అవకాశం ఉండేది. అలాగే కాలం కలిసి వచ్చినా అతడి దశ మారిపోయేది. హిందూ సమాజం కంటే ముస్లిం సమాజంలో అంతర్గత ఎదుగుదల చాలా ఎక్కువగా ఉండేది.

షియా–సున్నీ వివాదాలు లాంటి జాతి, మత విభేదాలతో పాటు ముస్లిం సమాజంలోనే విస్పష్టమైన సామాజిక తేడాలు ఉండేవి. పదహారవ శతాబ్దపు పార్సీ కృతిలో మూడు వర్గాలను ప్రస్తావించారు: (ఎ) సామ్రాజ్య కుటుంబం, సంస్థానాధీశులు, సైన్యంతో కూడిన పాలకవర్గం, (బి) మతాధిపతులు (ఉలేమాలు), న్యాయమూర్తులు(కాజీలు), విద్వాంసులు, సాహిత్యకారులతో కూడిన మేధావి వర్గం, (సి) సంగీతకారులు, దళారులు, నృత్యకారిణులతో కూడిన భోగవిలాసాల వర్గం, ఈ వర్గీకరణ నిస్సందేహంగా అసగ్రమైనది, అసంబద్ధమైనది. ఉదాహరణకు అది రైతులు, వృత్తికారులు లాంటి ఉత్పత్తి వర్గాలను గమనంలోకి తీసుకోలేదు. రైతులు, వృత్తికారులు రాజ్యం, సమజానికి వెన్నముకగా ఉండేవారు. అలాగే అధికార యంత్రాంగంలోని దిగువశ్రేణి అధికారుల గురించి ఎలాంటి ప్రస్తావన లేదు.

**హిందూ సమాజం:**

16,17వ శతాబ్దాల హిందూ సమాజంలో ఒకవైపు ప్రగతిశీల, సనాతనవాద పరస్పర విరుద్ధ పోకడలు, మరోవైపు ప్రత్యేకవాదం, సాంప్రదాయవాదం రాజ్యమేలాయి. కొందరు వైష్ణవ, తాంత్రిక బోధకులు మహిళలతో పాటు సూద్రుల మత, సామాజిక హక్కులను కూడా కొంతవరకు గుర్తించారు. చైతన్య అనుచరుల్లోని కొందరు బ్రాహ్మణేతరులు కేవలం మూడు నిమ్నకులాల ఆధ్యాత్మిక బోధకులుగానే కాకుండా బ్రాహ్మణులకు గురువులుగా కూడా మారారు. మహారాష్ట్రలో తుకారామ్ (సూద్రుడు), బ్రహ్మపుత్ర లోయలో శంకర్‌దేవ్, మాధవ్‌దేవ్ (కాయస్థ)లకు బ్రాహ్మణ శిష్యులు ఉండేవారు.

అయితే "నిబంధన"లు రచించిన బ్రాహ్మణులు ప్రాచీన సామాజిక మత వ్యవస్థను (వర్ణాశ్రమ ధర్మ) అలాగే కొనసాగించాలని ప్రయత్నించారు. సాంప్రదాయబద్ధమైన కుల నిబంధనల ఆధారంగా హిందూ సమాజంలోని అన్ని వర్గాల జీవితాన్ని అన్ని విషయాలలోనూ సంపూర్ణంగా నియంత్రించాలని చూశారు. స్మృతి నిబంధనలు రూపొందించిన కొందరు రచయితలకు రాచరిక పోషకులు ఉండేవారు. వారి సూత్రీకరణలకు రాజకీయ ఆమోదం లభించేది. అలాంటి రచయితలలో ఒకరైన కేశవ పండిట్ మరాఠారాజు సాంభాజీ నేతృత్వంలో న్యాయమూర్తిగా పని చేశారు. అయితే మరికొందరు ప్రముఖరచయితలు ఉన్నారు. వారికి రాచరిక పోషణ లేకున్నా వారి అధికారాన్ని (మత,నైతిక) హిందూ సమాజం అంగీకరించింది. బెంగాల్‌కు చెందిన రఘునందన్, రామ్‌నాథ్‌లు, కామ్‌రూప్‌కు చెందిన పితాంబర్, మహారాష్ట్రకు చెందిన కమలాకర్ భట్టా ఈ కోవకు చెందుతారు. ప్రగతిశీల పోకడలకు వారి ప్రభావం సమర్థవంతంగా అడ్డుకట్ట వేసేది. బ్రాహ్మణుల ప్రత్యేక ప్రయోజనాలు, హక్కులను నిమ్నకులాలు హరించడాన్ని వారు తీవ్రంగా అభ్యంతరం చెప్పేవారు.

**మహిళల స్థితిగతులు:**

**పర్దావ్యవస్థ :** ఇస్లాంరాకతో భారత విపణిలో కొత్త శక్తులు ప్రత్యక్షమయ్యాయి. ముస్లింల మాతృభూమిలో మహిళలు పర్దాను ఖచ్చితంగా పాటించడం సాధారణ సాంప్రదాయంగా ఉండేది. భారతదేశం లాంటి విదేశీ గడ్డపై సహజంగానే పర్దాకు ఎక్కువ

ప్రాధాన్యత ఇచ్చారు. హిందువులు పర్దాను రక్షణ చర్యగా స్వీకరించారు. పాలకవర్గాన్ని అనుకరించాలన్న తాపత్రయం కూడా హిందూ కుటుంబాలలో పర్దావ్యవస్థ ప్రవేశించడానికి ఒక కారణమై ఉండవచ్చు. ఆ విధంగా పర్దా గౌరవానికి చిహ్నంగా మారింది. రెండు సముదాయాల్లోని ఉన్నత కుటుంబీకులు ఈవ్యవస్థను ఖచ్చితంగా పాటించారు. బెంగాల్ మహిళలు పర్దాను కఠినంగా ఆచరించడం గురించి బార్బోసా తన రచనల్లో ప్రస్తావించాడు. దక్షిణ భారతీయుల్లో కొన్ని ప్రముఖ ముస్లిం కుటుంబాలను మినహాయిస్తే మిగతాఎవ్వరూ పర్దాను ఆమోదించలేదు. విజయనగర సామ్రాజ్యం పర్దా కేవలం రాచరిక కుటుంబ సభ్యులకే పరిమితమైంది. హిందూ మధ్య తరగతి కుటుంబాలలో అలాంటి నిరంకుశ పర్దా వ్యవస్థను పాటించలేదు. హిందూ సాధారణ ప్రజానీకంలో అలాంటి వ్యవస్థ అసలు ఉండేది కాదు.

**బాల్యవివాహాలు :** ఆ రోజుల్లోని ఆచారం బాలికలను ఆరేడు సంవత్సరాల తర్వాత పుట్టింటిలో ఉండడానికి ఏమాత్రం అనుమతించలేదు. 16వ శతాబ్దపు బెంగాలికవి ముకుంద్‌రామ్ ప్రకారం ఒక తండ్రి తన కుమార్తెను తొమ్మిదవ ఏటలోగా పెళ్లి చేయిస్తే అతడిని అదృష్టవంతునిగా పరిగణించేవారు. భగవంతుని కృపకు అతడు పాత్రుడయ్యాడని భావించేవారు. ఆచారం నిర్దిష్టత, మరి చిన్న వయస్సులో వివాహం జరిపించడంతో వధువుకు కాని, వరుడికికాని తన జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశమే లేకుండా పోయింది. కట్నాన్ని ఖచ్చితంగా కోరేవారు. కొన్ని కులాలు, ప్రాంతాలలో వధువు విలువ గురించి ముందే తెలిసేది. కొన్ని సార్లు ధనంకోసం ఒక యువకుడు వయస్సులో తనకంటే పెద్ద అయిన మహిళను వివాహం చేసుకునేవాడు. ఈ దురాచారం ఎంత తీవ్రంగా ఉండేదంటే అక్బర్ ఒక శాసనాన్ని జారీ చేయాల్సి వచ్చింది. ఒక యువకుడు తన కంటే 12 ఏళ్లు పెద్ద అయిన మహిళను వివాహమాడితే అలాంటి వివాహం చట్టపరంగా చెల్లనేరదని ప్రకటించటం వధూవరుల ఇష్టప్రకారం పెళ్లి జరగాలని, అలాగే వివాహానికి పెద్దల అనుమతి తప్పకుండా ఉండాలని అక్బర్ ప్రజలకు నచ్చజెప్పేందుకు శతవిధాలా ప్రయత్నించాడు.

**ఏకపత్నీవ్రతం:** మధ్యయుగ కాలంలో హిందు, ముస్లిం సమాజాలలోని దిగువ శ్రేణికులాలలో ఏకపత్నీవ్రతం ఒక నియమంగా ఉండేదని బోధపడుతోంది. అక్బర్ కాలంలో ఇబాదత్ ఖానాలో ఉలేమాలు ముతా ద్వారా ఎందరు మహిళలనైనా పెళ్లి చేసుకోవచ్చని, అయితే నికాహ్ ద్వారా కేవలం నలుగురిని భార్యలుగా స్వీకరించాలని నిర్ణయం తీసుకున్నా అక్బర్ మాత్రం సాధారణ వ్యక్తి ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాడు. ఒక వేళ తొలి భార్య గొడ్రాలైతేనే రెండవ వివాహం చేసుకోవచ్చని మినహాయింపు ఇచ్చాడు. బహుభార్యత్వం ధనికుల ప్రత్యేక హక్కుగా ఉండేది.

**విధవల పరిస్థితి :** ముస్లింలలో సాధారణమైన విడాకులు, పునర్వివాహాన్ని హిందూ మహిళలకు నిరాకరించారు. తక్కువజాతి కులాలలో తప్ప విధవల పునర్వివాహం మధ్యయుగంలో హిందూ సమాజం నుండి పూర్తిగా అదృశ్యమైంది, సతి దురాచారం అమల్లో ఉండేది. నిశ్చితార్థం జరిగిన బాలికలు కూడా తమ కాబోయే భర్తల చితిపై సతి సహగమానానికి పాల్పడాల్సివచ్చేది. తమ భర్తలతో పాటు కాలి బూడిద కాని విధవలను సమాజం చాలా క్రూరంగా హింసించేది. కురులను జాలువారుగా వదలడానికి లేదా నగలు ధరించడానికి వారిని అనుమతించేవారు

కాదు. విధవలు తమ పుట్టింటిలో పనిమనిషి కంటే హీనంగా బ్రతుకుతూ కుటుంబ సభ్యుల ఛీత్కారాలకు గురయ్యే వారు.

**సతి దురాచారం :** సతి దురాచారాన్ని పారదోలేందుకు కొందరు సుల్తాన్‌లు గట్టిగానే కృషి చేశారు. హిందూ సమాజంలో, ముఖ్యంగా అగ్రవర్ణాలు, రాజ్‌పుత్రులలో ఈ దురాచారం పెద్ద ఎత్తున ప్రబలి ఉండేది. దక్షిణంలో సతీసహగమనం ఐచ్ఛికమే అయినా విజయనగర సామ్రాజ్యంలోని ఉన్నత కుటుంబాలు ఈ దురాచారం కొనసాగడానికి కారణాలను అన్వేషించడం కష్టం. అక్కడి పాలకులు ఈ దురాచారాన్ని అరికట్టేందుకు ఎలాంటి నిర్దిష్ట చర్యలు తీసుకోలేదు. మధ్యయుగ పాలకులలో ఈ దురాచారంపై ఆంక్షలు విధించిన మొట్టమొదటి పాలకుడు బహుశా మహమ్మద్ తుగ్లక్ అయి ఉండవచ్చు. అక్బర్ సతిని పూర్తిగా నిషేధించకపోయినా కోత్వాళ్లకు కొన్ని నిర్దిష్టమైన ఆదేశాలు జారీచేశాడు. ఒక మహిళ అభీష్టానికి వ్యతిరేకంగా ఆమెను భర్తతో పాటు అగ్నికి ఆహుతి ఇవ్వరాదని స్పష్టం చేశాడు. తన సామ్రాజ్య మంతటా సతిని పూర్తిగా నిషేధించిన ఏకైక మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్. 1664లో అతడు ఆ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాడు. అయితే అతడి ఆదేశాలు హిందూ సమాజంపై అంతగా ప్రభావం చూపలేదు. వారు ఎప్పటిలాగే సతి దురాచారాన్ని కొనసాగించారు.

**ఆర్థిక పరిస్థితి:** వారసత్వ హక్కుగా ఒక ముస్లిం మహిళకు తండ్రి ఆస్తిలో కొంత భాగం దక్కేది. ఆస్తులను అమ్ముకునే హక్కు కూడా ఆమెకు ఉండేది. వివాహమైన తర్వాత కూడా ఆమె ఆస్తి హక్కు కొనసాగేది. మరో సురక్షిత ఉపాయం మెహర్ (వివాహ బంధం పరిష్కార రుసుం). అయితే హిందూ మహిళకు తన భర్త తల్లితండ్రుల ఆస్తిలో ఎలాంటి వాటా దక్కేది కాదు. ఆమెకు కేవలం భరణం, నివాస ఖర్చులు మాత్రమే దక్కేవి. అలాగే చరాస్తులైన నగలు, సామాగ్రి లభించేవి. ఆ విధంగా చట్టపరంగా చూస్తే మహిళ జీవితంలోని ప్రతి రంగంలోనూ ఇతరులపై ఆధారపడేలా చేశారు. కులం, పర్దా ఆమెను సామాజిక, రాజకీయ, మేధోపరమైన అణచివేతకు గురిచేశాయి. వారి ప్రగతి ఈ రంగాలలో దాదాపు స్తంభించిపోయింది. రైతాంగ, కార్మిక మహిళలు తప్ప మిగతా వర్గాల మహిళలు కేవలం ఇంటి పనికి మాత్రమే పరిమితమయ్యారు. రైతు, కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు మగవారికి వ్యవసాయం, పశుపోషణ, నూలు వడకడం, నేత, దర్జీ పనిలో సహాయపడేవారు. అయితే చోళుల పాలనలో దక్షిణాది మహిళలకు (8-13 శతాబ్దాలు) ఆస్తి హక్కు ఉండేది.

**18**

# మధ్యయుగ భారతీయ మతం

## తొలి మధ్యయుగ మత జీవనం

### పరిచయం:

తొలి మధ్యయుగ కాలపు మతపరమైన పరిణామాలన్నింటితో దేవాలయం చాలా దగ్గరగా ముడిపడి ఉండేది. అంతకుముందే దేవాలయం ఒక ప్రధాన సంస్థగా ఎదిగింది. ఆధ్యాత్మిక బృందాలు లేదా వర్గాల ఆవిర్భావంతో పాటు దేవాలయాల సంఖ్య కూడా పెరిగింది. కేవలం సంఖ్యాపరంగానే కాకుండా ఆకారంలో కూడా దేవాలయాలు విస్తరించాయి. తొలి మధ్యయుగ దేవాలయాలు చాలా సాధారణ స్థాయి నుండి ప్రారంభమయ్యాయి. కాని రాచరిక పోషణ, దయాగుణ సంపన్నమైన మత వర్గాల చేరికతో అవి బహుళ అంతస్తు సంస్థలుగా ఎదిగాయి. సామాజిక స్థాయిపై సమకాలీన చైతన్యం పెరగడంతో దేవాలయాల నిర్మాణం ఊపందుకుంది. దక్షిణభారతదేశంలో నిర్మాణమైన దేవాలయాలలో మూల విరాట్టుల విగ్రహాలపై భక్తుల పేర్లు కనిపిస్తాయి. వివిధ వర్గాల అనుచరులు లేదా భక్తులు దేవాలయాలను నిర్మించడంలో ఒకరితో మరొకరు పోటీ పడ్డారు. ఉదాహరణకు కర్ణాటకలో జైనులు, శైవులు, శ్రీవైష్ణవులు మధ్య తీవ్ర పోటీ ఉండేది. రాజస్థాన్, గుజరాత్ లాంటి ఇతర ప్రాంతాలలో కూడా ఈ మత విశ్వాసులు తమ సామాజిక ప్రతిష్టను పెంచుకునేందుకు దేవాలయాలను పెద్ద ఎత్తున నిర్మించారు.

మత సంస్థలు క్రమంగా దేవాలయాలను తమ ఆస్తులుగా పరిగణించడం మొదలు పెట్టాయి. కఠోర నియమాలను సరళతరం చేసి కులాలు, ఉపకులాల హోదాలను నిర్ధారించాయి. దీని ఫలితంగా అనేక ప్రాంతాలలో నిరసన ఉద్యమాలు బయల్దేరాయి. పశ్చిమ భారతదేశంలో చైత్యవాసినులకు వ్యతిరేకంగా జైన విధి– చైత్య ఉద్యమం లేదా దేవాలయాల సంస్కరణ ఉద్యమం, అలాగే వీరశైవ ఉద్యమం (జంగమ పురోహితులతో కూడిన) అలాంటి ఉద్యమాలకు బాటలు వేశాయి.

తాంత్రికత్వం మత సూత్రాలను ఈ కాలంలో గణనీయంగా ప్రభావితం చేసింది. తాంత్రికత్వంలో బ్రాహ్మణేతర, స్థానికేతర శక్తులు రెండూ ఉండేవి. వాటిని వివిధ మత వర్గాలు ఏ విధంగా ఆమోదించాయో చెప్పడం అలా సులభం కాదు. అయితే జపం, శబ్దం, మంత్రంపై వక్కాణింపుతో తంత్ర కేవలం శైవ, బౌద్ధ మతాల వర్గాలనే కాకుండా వైష్ణవ, జైన వర్గాలను కూడా తన పరిధిలోకి తెచ్చుకుంది. జైన యక్షిణులు తాంత్రిక పద్ధతులతో ముడిపడ్డ స్వతంత్ర భక్తి మార్గాలుగా రూపాంతరం చెందడం ఒక ముఖ్యమైన పరిణామం. తొలి మధ్యయుగ భారతదేశంలో వివిధ మతాలపై తాంత్రిక ప్రభావం ఏ విధంగా ఉండేదో దీనిని బట్టి అర్థమవుతుంది.

తత్త్వశాస్త్రంలో తొలియుగపు చర్చలు కొత్త దశకు చేరుకున్నాయి. వేదాంత ఆలోచన లేదా సిద్ధాంతం బహుళ భక్తిమార్గాలను తనప్రభావం కిందికి చేర్చుకుంది. బౌద్ధ మత పతనం ఈ దశలోనే సంభవించింది. శంకర ప్రబోధించిన వేదాంతం మరో వక్ర బ్రాహ్మణ ఆలోచనను విమర్శించింది. కాని తొలి మధ్యయుగ కాలపు మత వైరుధ్య లక్షణం వేదాంతను అధిగమించింది. వేదాంత కేవలం తాత్విక ఆధారం, నేపథ్యంగా మిగిలిపోయింది. ఒక వేదాంత బ్రహ్మను శ్రీవైష్ణవునికి విష్ణుస్వరూపంగా కనిపిస్తే అంతే నమ్మకంతో శైవుడు బ్రహ్మను శివునితో పోల్చేవాడు.

**ఆధ్యాత్మిక శక్తులు:**

మధ్యయుగ సాంస్కృతిక వాతావరణంలో దైవత్వం, మానవత్వం కలగలసి ఉండేవి. వాటి మధ్య ఎలాంటి విభజన రేఖ లేదు. అందులో ఎన్నో రకాల జీవులు ఉండేవారు. పై రెండు శక్తుల కూడలిలో అస్పష్టమైన జీవితాన్ని గడిపేవారు. రాచరిక వంశాలకు సాధారణంగా సూర్య, చంద్రుల నేపథ్యం ఉండేది. రోజువారి జీవితంలో ప్రతిచోటా ఆధ్యాత్మిక విశ్వాసాలు ఉండేవి. దైవ శక్తులు మానవులకు యుద్ధంలో విజయాన్ని సాధించిపెట్టేవని, మానవుల భవిష్యత్తును నిర్ధారించేవని, ప్రకృతి ఆత్మలు వ్యాధులను, కరువులను, వరదలను, మానవులు, జంతువులు, మొక్కలకు ఉత్పత్తిని కలిగించేవని నమ్మేవారు. దృశ్యాదృశ శక్తులు తమ ఇష్టానుసారం కలిసిపోయేవి. పురోహితులు, పాలకులు, సంతులు, ఆధ్యాత్మిక గురువులు సమాజంలో దైవత్వం, దేవుళ్లపట్ల గౌరవభావాన్ని కలిగించేవారు.

రాజకీయాలలో వలె మతంలో కూడా క్షేత్రస్థాయి, స్థానిక వైఖరిని తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. తమిళనాడులోని మత పోకడలు మంచి ఉదాహరణలుగా ఉపయోగపడతాయి. ప్రాచీన కాలంలో, అంటే క్రీస్తు శకానికి ముందు తమిళ రచనలు దయ్యాలు, ఆత్మలు మెండుగా ఉన్న ప్రాంతాల గురించి వివరిస్తాయి. అలాంటి ఆత్మలలో సియోను ఒకటి, అది పూర్తి ఎరుపు రంగులో ఉండేది. ఎర్రటి మట్టి కొండలలో నివసించేది. అదంటే అందరికీ భయం, భక్తి భావం ఉండేది. సియోను కథావస్తువుగా మారింది. దాని శక్తుల గురించి అసంఖ్యాక వర్ణనలు ఉన్నాయి. ప్రాచీన తమిళ సాహిత్యంలో మనిషి స్వరూపం సంతరించుకున్న సియోను వ్యక్తిత్వం ఉన్న మనిషిగా, మనిషి రూపంలో ఉన్న దైవంగా మారింది.

అతడు తర్వాతి కాలంలో అనేక పేర్లను పొందారు. అందులో మురుగన్ అనే పేరు ఒకటి. తొలి సహస్రం మధ్యభాగంలో మురుగన్ శివుని కుమారుడిగా మారాడు. అతడిని స్కంధతో పోల్చేవారు. ఆ విధంగా ఒక ప్రాచీన స్థానిక ఆత్మ క్రమంగా పురాణ సాహిత్య సాంప్రదాయంలో చోటు సంపాదించుకుంది. సంస్కృతం నుండి అనువదించబడిన స్కంధ పురాణము తమిళ భాషలో మళ్లీ సృష్టించారు. ఇతర సంస్కృత రచనలను కూడా స్థానిక వాతావరణానికి తగ్గట్టు అనువదించారు. ముఖ్యంగా రామాయణం. కంబన్ ఆ గ్రంథాన్ని తమిళంలోకి అనువదించాడు. సంస్కృత గ్రంథం కంటే తమిళ అనువాదంలో సీతను అపహరించిన రావణుడికి దాదాపు కథానాయకుని హోదా కల్పించారు. శివుడు, విష్ణువులిద్దరూ గొప్పరాజులుగా కీర్తిస్తూ వారి రాజ్యాలలో వందలాది స్థానిక ఆత్మలను జత చేశారు.

మధ్యయుగ రాజ్యాలలో విభిన్నమైన హిందూ సాంస్కృతిక సముదాయం విస్తరించింది. అనేక స్థానిక సాంప్రదాయాలను తనులో ఇముడ్చుకుంది. అయితే ప్రాంతాల వారీగా హిందూ సముదాయం వేర్వేరుగా ఉండేది. స్థానిక సాంప్రదాయాలను ప్రజలు పాటించడంవల్ల వారు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతంలో భిన్నంగా కనిపించేవారు. పురోహితులు, శాస్త్రాలు అభ్యసించిన బ్రాహ్మణులు పాలకులు, స్థానిక పెద్దల నుండి సహాయ కానుకలు పొందేవారు. వాటితో దేవాలయాలను, వేడుకలను నిర్వహించేవారు. స్థానిక దైవాలు, ఆచారాలు, సాంప్రదాయాలను మత వేడుకలు ప్రతిబింబించేవి. అదే సమయంలో బ్రాహ్మణులు స్థానిక హోదాలను హేతుబద్ధం చేసి వాటికి శాశ్వత ప్రాతిపదికను కల్పించారు. వర్ణ, జాతి అనే సాంప్రదాయ పదాలతో స్థానిక అస్తిత్వాలను నిర్వచించారు. ప్రాచీన సంస్కృతి గ్రంథాల నుండి ఉన్నత సంస్కృతి అంశాలను ఉపయోగించుకొని స్థానిక హిందూ ఆచార వ్యవస్థలను రూపొందించారు. ఈ వ్యవస్థలు పుట్టగొడుగుల్లా పెరిగాయి. జైన, బౌద్ధ, ఇస్లాం, క్రైస్తవ మతప్రబోధకులు తమ మతాలను వ్యాపింపచేసినట్లే బ్రాహ్మణులు కూడా హిందూ సాంస్కృతిక స్వరూపాలను విస్తరింపచేశారు. ఎక్కువగా ప్రయాణిస్తూ వారు రాచరిక పోషణలో కీలక స్థానాలలో స్థిరపడ్డారు. స్థానిక, ప్రాంతీయ మిత్రులతో కలిసి హిందూ మత సూత్రాలను స్థానిక భాషలలోకి అనువదించి వాటిని ప్రచారం చేశారు. గ్రామ, పట్టణ అంశాలను సమైక్యపరిచారు. వైరి రాచరిక పోషకులు వైరి మత ప్రత్యేకవాదులను ఒకే సారి ప్రోత్సహించేవారు.

సాంస్కృతిక రాజకీయాల ఈ క్రియాశీల ప్రపంచంలో బ్రాహ్మణులు హిందూ సనాతనవాదాన్ని స్థానిక భాషలలో నిర్వచించారు. ఉద్భవిస్తున్న సామాజిక వాతావరణాలకు అనుగుణంగా వారు కొత్త పద్ధతులను అనుసరించారు. రెండు భిన్నమైన రంగాలలో వారు చాలా క్రియాశీలంగా ఉండేవారు. మొదటిది రాజ్యంలోపల, రెండోది రాజ్యం వెలుపల. స్థానిక సమాజంలో, మరీ ముఖ్యంగా గ్రామీణ సమాజంలో. మధ్యయుగ పాలకవంశాలలో బ్రాహ్మణ ఆచారాలు, సంస్కృత గ్రంథాలు గొప్ప ప్రభావాన్ని సంతరించుకున్నాయి. శిలాశాసనాలలోని ప్రశస్తిలలో కనిపించే సంస్కృత వచనం, పురాణ దైవాలు, దైవ నేపథ్యాల ప్రాముఖ్యత

సూచించేదేమిటంటే: “భారతదేశమంతటా మధ్యయుగ పాలనకు బ్రాహ్మణులు ఒక శక్తివంతమైన ప్రతీకాత్మక పరిజ్ఞానాన్ని తెచ్చిపెట్టారని పాలకవర్గాలు అభిప్రాయపడ్డారు.” అనేక శిలాశాసనాలు ద్విభాష డాక్యుమెంట్లుగా ఉన్నాయి. ఒకటి సంస్కృతంలో ఉండగా, మరొకటి స్థానిక భాషలో ఉన్నాయి. సంస్కృతి ప్రశస్తిలు రాజులు నిర్వహించిన వేదిక ఆచారాలను వివరిస్తాయి. బ్రాహ్మణ గ్రామాలకు, వేదాల అభ్యాసానికి, ఆలయాల నిర్మాణం, వేడుకల నిర్వహణకు రాచరిక వంశాలు చేసిన ఆర్థిక సాయాన్ని ప్రాంతీయ భాష(రచనలు) నివేదికలు వివరిస్తాయి.

హిందూ సంస్కృతిని పోషిండానికి అనేక మార్గాలు ఉండేవి. అవన్నీ దేవాలయాల ప్రాంగణాలలోనే కేంద్రకృతమై ఉండేవి. అక్కడే శిలాశాసనాలు కూడా కనిపిస్తాయి. అనేక హిందూ అస్తిత్వాలు అక్కడే రూపొందాయి. బ్రాహ్మణుల ఆధ్యాత్మికశక్తులు దేవుళ్ల శక్తితో విలీనమయ్యాయి. మధ్యయుగ జీవితంలో దేవుళ్లు, దేవతలు కీలక వ్యక్తులుగా మారారు.

**మత రాజకీయాలు :** ఆధ్యాత్మికశక్తిని ఆచరణలో పెట్టేందుకు పోటీ పడిన సాంస్కృతిక కార్యకర్తలలో బ్రాహ్మణులు కూడా ఉన్నారు. వారందరికీ స్థానిక పోషణ అవసరమైంది. పాలకవంశాలు, వ్యాపారులు, భూస్వాములు ఆయా రూపాలలో చేసిన ఆర్థిక సహాయం విభిన్న సాంస్కృతిక ప్రాంతాలలో మారుతున్న మత సూత్రాలపై తీవ్ర ప్రభావం చూపించింది. వ్యాపార, వలస మార్గాలలో బౌద్ధ, ఇస్లాం మతాలు చాలా క్రియాశీలంగా ఉండేవి. ఈ మార్గాలు ఆసియాలోని ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి విస్తరించి ఉండేవి. ఆరవ శతాబ్దంలో బౌద్ధులు ఆఫ్ఘనిస్తాన్‌లో ఎక్కువ స్థాయిలో ప్రోత్సాహం పొందారు. అలాగే ఎగువ సింధూప్రాంతం, కాశ్మీర్ నుండి నేపాల్ వరకు విస్తరించి ఉన్న హిమాలయ ప్రాంతాలలో కూడా వారికి స్థానిక రాచరిక పోషణ లభించింది. అక్కడి నుండి వారు మధ్యఆసియాకు విస్తరించి టిబెట్,చైనా, జపాన్‌లలో గట్టిగా స్థిరపడిపోయారు. అయితే ఎనిమిదవ శతాబ్దం తర్వాత పశ్చిమ, మధ్య ఆసియా నుండి అరబ్‌లు, తుర్కులు వలసరావడంతో ఆఫ్ఘనిస్తాన్, సింధూ పరివాహక ప్రాంతం, పంజాబ్, కాశ్మీర్‌లలో రాచరిక పోషణ ఇస్లాం వైపు మళ్లింది. కాని బౌద్ధ భిక్షువులకు శ్రీలంకలో బలమైన శాశ్వతమైన రాజకీయ పునాది ఉండేది. ఎనిమిదవ శతాబ్దం నుండి వారు దక్షిణ బర్మా నుండి ఆగ్నేయ ఆసియా వరకు రాజ్య మద్ధతును కూడ గట్టారు. జావాలో తొలి మధ్యయుగ పాలకులు హిందూమతాన్ని పోషించారు. తొమ్మిదవ శతాబ్దంలో రాచరిక ఆస్థానం నుండి హిందువులను తప్పించి వారి స్థానాన్ని బౌద్ధులు దక్కించుకున్నారు. అయితే బాలీలో బౌద్ధులతో పాటు హిందువులు కూడా రాచరిక ఆస్థానంలో ప్రభావశీలురుగా కొనసాగారు. పదవ శతాబ్దం నాటికి అరబ్ వ్యాపారులు. హిందూ మహాసముద్రంలో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నారు. ద్వీపకల్పంలో, శ్రీలంక తీర ప్రాంతంలో ముస్లిం స్థావరాల హెచ్చింపయ్యాయి. ఈ వ్యాపారులు ఇస్లాం మతాన్ని పోషించడంతో స్థానిక పాలకులు బౌద్ధ మతాన్ని వీడారు. ముఖ్యంగా ఆగ్నేయ ఆసియా ఓడరేవు ప్రాంతాలలో ఈ పరిణామం సంభవించింది.

బెంగాల్‌లో బౌద్ధులు తొలి మధ్యయుగ కాలంలో బాగా స్థిరపడి ఉండేవారు. పాలా వంశం వారిని నాలుగు వందల సంవత్సరాల పాటు ప్రోత్సహించింది, పోషించింది. అయితే హేమంతసేన తన స్వంత వంశాన్ని (సేన వంశం) స్థాపించిన తర్వాత అతడి వారసుడు విజయసేన (1095-1158) పాలా వంశీయులను ఓడించాడు. సేన తన సైన్యాలను బెంగాల్, ఉత్తర బీహార్‌లోకి తీసుకెళ్లాడు. విష్ణు ఆరాధనను పోషించి బౌద్ధులను బహిష్కరించాడు. సేన ప్రాబల్యం ఉన్న ప్రాంతాలలో వైష్ణవ హిందూ మతం పరిఢవిల్లింది. చివరి సేన అయిన లక్ష్మణసేన జయదేవ అనే ప్రముఖ బెంగాలీ వైష్ణవ కవిని పోషించాడు. జయదేవ అత్యంత ప్రసిద్ధమైన భక్తి కావ్యం 'గీతగోవింద'ను రచించాడు. 1206లో లక్ష్మణసేనను తుర్కు ఆక్రమణదారు భక్తియార్ ఖిల్జీ బెంగాల్ నుండి తరిమికొట్టాడు. భక్తియార్ ఇస్లాం మతాన్ని పోషించడం మొదలు పెట్టాడు. అంతకు ముందు తర్వాత బెంగాల్ తూర్పు ప్రాంతాలలో రాచరిక పోషణ ఇస్లాం వైపు మళ్లింది. ఖిల్జీ ఆక్రమణ ముందు ఈ ప్రాంతాల నుండి బౌద్ధులను సేనులు పెకలించివేశారు. వైష్ణవ హిందువులు, వ్యాపారులు, భూస్వాములు, బెంగాల్ పశ్చిమ ప్రాంతాల పాలకుల నుండి సహాయం పొందారు. సేనుల కాలం నుండి బహు భార్యత్వం ద్వారా బెంగాలీ సమాజంలో బ్రాహ్మణుల ప్రభావం పెరిగింది. అగ్రవర్ణాలకు చెందిన మహిళలు కులీన బ్రాహ్మణ పురుషులను వివాహమాడి సంతానం పొందేవారు. బ్రాహ్మణ పురుషుడు అనేక మంది భార్యలను కలిగి సంతానాన్ని పుట్టించేవాడు. ఫలితంగా బహుకుల ఉన్నతవర్గం ఆవిర్భవించింది. ఇందులో వ్యాపారులు, భూస్వాములు, అధికారులు ఉండేవారు. మధ్యయుగ రాజ్యాలలో వీరు సంపన్నులయ్యారు. ఖిల్జీ కాలం నుండి ముస్లింలుగా మారిన వారు, వలసదారులు తూర్పు బెంగాల్‌లో కొత్త వ్యవసాయ సముదాయాలను స్థాపించారు. అక్కడ సాధారణంగా హిందూ దేవాలయాలు, కళలు, సాహిత్యం, సంగీతం ప్రత్యేకంగా వైష్ణవ మతం కూడా హిందు భూస్వాములు, వ్యాపారులు, పాలనాధికారుల పోషణతో వికసించాయి. మధ్యయుగ రాజ్యాలలో బహుళ సార్వభౌమత్వాల వలె బహుళమత సంస్కృతులు కూడా అభివృద్ధి చెందాయి. అవి అందించిన సహాయంవల్ల విభిన్న మత సంస్థలు మనుగడ సాగించాయి.

హిమాలయ రాజ్యమైన నేపాల్ బౌద్ధుల కంచుకోటగా ఉండేది. రాజ్యాన్ని హిందూ రాజులు పాలించేవారు. ఖాట్మండు చుట్టూ ఉన్న రాజ్యాలు హిందువులు, బౌద్ధులకు సంగమ కేంద్రాలుగా మారాయి. బెంగాల్ పాలక వంశాల లాగే ఆ రాజ్యాలు బహుళ సంస్కృతి పోషణను దీర్ఘకాలిక మత సాంప్రదాయాలుగా మార్చాయి. గుజరాత్, రాజస్థాన్, మాల్వా, బుందేల్‌ఖండ్ లాంటి పశ్చిమ మైదాన ప్రాంతాలలో మధ్యయుగ హిందూ పాలక వంశాలైన కాలాచురీలు, చాళుక్యులు, పరమారులు, చండెలాలు జైనులను కూడా పోషించారు. కొందరు జైనులు ప్రముఖ వ్యాపారులుగా ఉండేవారు. హిందూ, జైన సాంస్కృతి లక్షణాలు ఒకదానిలో ఒకటి ఒదిగిపోయాయి. జైన ఆలయాలలో పూజలు, హిందూ- జైనవివాహాలు సాధారణ మయ్యాయి. మరీ ముఖ్యంగా గుజరాత్‌లో జైనమతం ఎక్కడ అంతమవుతుందో, హిందూమతం ఎక్కడ ప్రారంభమవుతుందో చెప్పడం కష్టంగా మారింది. జైన మత సూత్రాలలో మౌలికమైన

అహింస ఈ ప్రాంతపు హిందువులలో తాత్వికంగా ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. అక్కడ జైన మత పోషకులలో క్షత్రియ యోధులు, గొప్ప రాజపుత్ర వంశీయులు ఉన్నారు. గుజరాతి బనియాలు తమ వైశ్య సంస్కృతిని జైన సాంస్కృతిక దృగ్విషయంగా మార్చుకున్నారు. దాని పుట్టు పూర్వోత్తరాలు మధ్యయుగ వంశాల మిశ్రమ పోషణలో ఉన్నాయి.

ద్వీపకల్పంలో, ముఖ్యంగా మదురై, కాంచిపురంలలో బౌద్ధ, జైన మతాల ఆధిపత్యాన్ని మధ్యయుగ శైవ, వైష్ణవ భక్తులు పూర్తిగా దెబ్బతీశారు. అయితే జైన ప్రభావం ఉన్న కొన్ని ప్రాంతాలు తీర ప్రాంతం వెంబడి, మరీ ముఖ్యంగా కేరళలో కొనసాగింది. హిందూరాజులు విభిన్న వ్యాపార సముదాయాలను పోషించారు. అందులో జైనులు, జొరాష్ట్రియన్లు, ముస్లింలు, క్రైస్తవులు, యూదులు ఉన్నారు. అరబ్ ముస్లిం స్థావరాలను తీర ప్రాంతాలలో ముస్లిమేతర పాలకులు పోషించారు. పాక్ జలసంధిని దాటుకొని శ్రీలంక తీర ప్రాంతాలలో స్థిరపడ్డ అరబ్ వ్యాపారులకు కూడా అక్కడి హిందూ పాలకులు సహాయం అందించారు.

మధ్యయుగ హిందూ సాంస్కృతిక కేంద్రాల లోపల సార్వజనిక మత పోకడలు బ్రాహ్మణేతర భావాలను బలంగా ప్రతిబింబించాయి. ప్రాచీన బ్రాహ్మణ సనాతనవాదానికి దూరంగా ఉన్న ప్రాంతాలలో దేవాలయ ప్రార్థన రూపంలో ఈ పోకడలు ప్రారంభమయ్యాయి. దక్షిణంలో చివరి అంచు ప్రాంతాలలో ఎనిమిదవ శతాబ్దం నుండి బ్రాహ్మణేతర సాంస్కృతిక కార్యకర్తలు శివ, విష్ణువు ఆరాధనను ప్రచారం చేయడంలో ముందు నిలిచారు. పాత దక్షిణ పథంలో భక్తి ఆరాధనను ఆవిష్కరించడం ద్వారా తమ ప్రచారాన్ని ఉధృతం చేశారు. జ్ఞానం, క్రమశిక్షణ, ఆచారాల కంటే భక్తిభావనకే ప్రాధాన్యత ఇచ్చారు. తమిళంలో ఆరాధన గీతాలను రచించారు. మహిళా యోగినిలను ప్రోత్సహించారు. దైవ ప్రార్థనలలో విశాల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించారు. భక్తులకు దేవునితో ప్రత్యక్ష సంబంధాన్ని ప్రచారం చేశారు. బ్రాహ్మణుల మధ్యవర్తిత్వాన్ని నిరాకరించారు. దేవుని దృష్టిలో నిమ్నకులాలకు సమాన ఆదరణ కల్పించారు. భక్తి కవులు కొత్తతరహా జనప్రియ సాంస్కృతిక రాజకీయాలను సృష్టించారు. ఆరాధనాభావం ఉన్నత విలువగా మారింది. పదవ శతాబ్దం నాటికి ఈ శక్తులన్నిటినీ వైరి మత ప్రబోధకులపై ఎక్కుపెట్టారు. బౌద్ధులు, జైనుల ఊచకోతను అనేక గ్రంథాలు సూచిస్తాయి.

చోళ రాజుల పాలనలో శైవ భక్తులు వైష్ణవులను వెనక్కునెట్టి సంపన్నులయ్యారు. ఫలితంగా వర్గపోరాటాలు మొదలయ్యాయి. భక్తి ఆరాధనాభావం, వర్గ పోటీ సాంప్రదాయ బద్ధమైన సంస్కృత మతాన్ని ప్రబోధించే బ్రాహ్మణ ఉన్నత వర్గాన్ని సవాలు చేశాయి. ఎందుకంటే బ్రాహ్మణుల సనాతన వాదానికి పాలక వంశాల పోషణ, ప్రోత్సహం పెద్ద స్థాయిలో లభించేవి. ప్రజలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పాలకులు వైష్ణవ (ఆళ్వార్), శైవ (నయనార్) భక్తి కవులను పోషించారు. తొలి మధ్యయుగ కాలానికి చెందిన గొప్ప మేధావి శంకరాచార్య (788–820) తన స్వల్ప జీవిత కాలంలో అద్వైత సిద్ధాంతాన్ని ప్రబోధించి గణనీయమైన ఖ్యాతిని ఆర్జించాడు. కేరళ నుండి కాశ్మీర్, ఆ తర్వాత కేరళకు తిరిగి ప్రయాణం చేస్తూ అద్వైత సిద్ధాంతాన్ని మెరుగుపరిచాడు. అందులో బౌద్ధ అంశాలను కూడా జత చేశాడు.

కేరళలో మఠాలను స్థాపించాడు. జనప్రియమైన ఆరాధనాభావాన్ని ఉన్నత బ్రాహ్మణ సంస్కృతిలో విలీనం చేయడానికి తోడ్పడ్డాడు. బ్రాహ్మణుల ఆధ్యాత్మిక ప్రాబల్యాన్ని ప్రజా ప్రతిఘటనలు చాలా వరకు స్థానికంగా ఉండేవి. అయితే కన్నడ మాట్లాడే ప్రాంతాలలో ఒక ప్రధాన ప్రాంతీయ ఉద్యమం ఆవిర్భవించింది. అక్కడ భక్తి ఉద్యమ నాయకుడు బసవ వీరశైవ (లింగాయత్‌లని కూడా పిలుస్తారు) వర్గాన్ని స్థాపించాడు. బ్రాహ్మణేతర జంగమ పురోహిత్యాన్ని ప్రారంభించాడు. వీరశైవ మతానికి రాచరిక పోషణ దక్కింది. వ్యాపార సముదాయాల నుండి అనేక మంది ప్రజలు ఆ వర్గంలో చేరారు. ఉత్తర కర్ణాటకలో తమ ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. నేటికి కూడా ఆ ప్రాంతంలో లింగాయత్‌లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు.

జనప్రియ ఆరాధనాభావం వేలాది మంది భక్తులను దేవాలయాలు, తీర్థస్థలాలకు రప్పించింది. దానితో ప్రజాపోషణ సంక్లిష్టంగా, భారంగా మారింది. ఎందుకంటే వైరి మత వర్గాలు ప్రత్యర్థి వంశాలకు నిర్ణయాత్మకమైన సైనిక ఆర్థిక మద్దతును ఇవ్వగల స్థాయికి ఎదిగాయి. అయినప్పటికీ బహుళ సార్వభౌమత్వాలు దేవుళ్లలో కొనసాగాయి. పాలకవంశాలు వివిధ రూపాలలో మత సంస్థలకు నిధులను, హక్కులను సమకూర్చిపెట్టాయి. అలాగే మత నాయకులనుకూడా పోషించాయి. ప్రజా ఉద్యమాలు అలాంటి సహకారాన్ని వివాదాస్పదంగా మార్చాయి. పాలకులు తమ సమర్థకులు, ఇతరుల మధ్య సమతుల్యం పాటించాల్సి వచ్చింది. సంస్థానాధీశులు విమర్శించేవారు. అదే స్థాయిలో విష్ణు, శైవ భక్తులు కూడా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. భక్తి ఉద్యమం ఉత్తర భారతదేశానికి విస్తరించే కొద్దీ వైరి మత వర్గీయులు కవితల రచించడమే కాకుండా (జయదేవుని గీత గోవింద) సైన్యాలను కూడా సమీకరించారు. ఈ సైన్యాలను తీర్థస్థలాలు, మతవేడుకలకు రక్షణ కవచంగా వాడుకున్నారు. వైరి మత వర్గీయులు తమ ఆస్తులను, సంపదనుదోచుకోకుండా చూశారు. తరచూ ఘర్షణలకు కూడా దిగారు. హరిద్వార్‌లో కుంభ్‌మేళా, ప్రయాస మేళాల నుండి నిధులను రాబట్టడానికి సైన్యాలను ఉపయోగించారు.

**జనరంజక హిందూ ఆవిర్భావం:**

తొలి సహస్రంలోని ద్వితీయార్థంలో బ్రాహ్మణత్వ చరిత్ర రెండు పరస్పర భిన్నమైన పోకడలవల్ల ప్రభావితమైంది. అయితే ఈ పోకడల కలయిక వాస్తవానికి ఒక నూతన ప్రజారంజక హిందూ మతానికి బాటలు వేసింది. ఆ మతం నేటికీ కొనసాగుతోంది. ఒకవైపు ఈ కాలంలో గొప్ప తాత్విక వ్యవస్థలు ఆవిర్భవించగా మరోవైపు గొప్ప ప్రజా ఉద్యమాలు (భక్తి ఉద్యమాలు) బయల్దేరాయి. ఇవి బ్రాహ్మణ సనాతనవాదాన్ని తిరస్కరించి భగవంతుని పట్ల వ్యక్తిగత ఆరాధనతో విముక్తి పొందే మార్గాన్ని సూచించాయి.

**నూతన తాత్విక వ్యవస్థలు:**

స్థూలంగా ఆరు ప్రాచీన తాత్విక వ్యవస్థలు ఉండేవి. అయితే ఈ వ్యవస్థలలో అత్యంత ప్రభావవంతమైన వ్యవస్థ వేదాంత అని నిస్సందేహంగా చెప్పవచ్చు. భారతీయ తత్త్వశాస్త్రానికి

వేదాంత మౌలిక ఆధారమని పరిగణిస్తారు. శంకరాచార్య వేదాంత తత్త్వశాస్త్రాన్ని పునరుద్ధరించి దానికో స్వరూపం అందించాడు. ఏకేశ్వరోపాసనను మూల సూత్రంగా ఎంచుకున్నాడు. మలబార్‌లోని కలాడి వద్ద జన్మించిన శంకరాచార్య బ్రహ్మసూత్రాలపై వ్యాఖ్యానాన్ని రచించాడు. అతడి రచనల్లో అదే ప్రధానమైనది. దానిని వారణాసి వద్ద రచించి భారతదేశమంతటా పర్యటించాడు. బద్రీనాథ్ (హిమాలయాల్లో), ద్వారక (గుజరాత్), పూరీ (ఒరిస్సా), శృంగేరి (కర్నాటక)లలో నాలుగు మఠాలను స్థాపించాడు. తన 32వ ఏట హిమాలయాలలోని కేదార్‌నాథ్ వద్ద మరణించాడు.

జీవాత్మ సంసార చక్రంతో ముడిపడి ఉందని అతడు ప్రవచించాడు. ఈ భౌతిక ప్రపంచం కేవలం ఒక ‘మాయ’అని పేర్కొన్నాడు. అయితే జీవాత్మ ఈ భౌతిక ప్రపంచాన్ని నిజమైన వ్యవస్థగా భావిస్తుందని, అందుకు అజ్ఞానమే కారణమని చెప్పాడు. సరైన జ్ఞానం మోక్షానికి దారి తీస్తుందని ప్రబోధించాడు. ఈశ్వరుడినే దైవ సృష్టికర్త ఈ భౌతిక ప్రపంచాన్ని సృష్టించాడని సూత్రీకరించడం ద్వారా అతడు జనరంజకమైన హిందూ మతానికి కూడా కొంత అవకాశాన్ని కల్పించాడు. కనక ప్రతి ఒక్కరూ తమ తమ స్థాయిలలో ఈ రెండు వాస్తవాల కలయికను గ్రహించగలరని చెప్పాడు. ఈ విధంగా అతడు జనరంజక హిందూ మతాన్ని బ్రాహ్మణ సనాతన వాదంతో జోడించి ఒక ఉన్నతమైన తాత్విక వ్యవస్థను నిర్మించాడు.

**భక్తి ఉద్యమం:**

బ్రాహ్మణులు కర్మమార్గానికి, జ్ఞాన మార్గానికి ఇచ్చిన ప్రాధాన్యతకు భిన్నంగా భక్తిమార్గం భగవంతుని పట్ల సంపూర్ణ ఆరాధనను ప్రబోధించింది. భగవత్ గీతలో ఇలాంటి ఆరాధనకు సాక్ష్యం లభిస్తుంది. అయితే తమిళనాడులో క్రీ.శ. ఆరవ శతాబ్దంలో నిజమైన భక్తి ఉద్యమం ప్రారంభమైంది. ఆ తర్వాత దక్షిణ భారతంలోని ఇతర ప్రాంతాలకు, చివరగా ఉత్తర భారతదేశానికి విస్తరించింది. హిందూ మతానికి కొత్త స్వరూపాన్ని ఇచ్చింది. తీర్థ యాత్రికులను ఆకర్షించగల ‘పుణ్యక్షేత్రాలు’ అనే భావన జనప్రియమైన ఈ మత ఉద్యమాలతో గాఢంగా ముడిపడి ఉండేది. భూతలం, స్వర్గాలలో శివ, విష్ణువులు అనేక అవతారాలలో ప్రత్యక్షమయ్యారు. గొప్ప ఆలయాల సాంప్రదాయం మూల విరాట్టుని స్థానిక పుట్టుకను ప్రస్తావిస్తాయి. ఇలాటి కల్పిత గాథలను ‘స్థల మహత్యం’ అని పిలుస్తారు. ఇలాంటి స్థానిక అవతారాలలో ఇరుదైవాలను కొలవబడిన తర్వాత తక్కువ స్థాయి దైవాలు, చివరకు గ్రామ దైవాలు (గ్రామ దేవతలు) కూడా హిందూ మతంలో స్థానం సంపాదించుకున్నాయి. స్థానిక దైవాలు పురోగమించాయి. వాటికి బ్రాహ్మణ పురోహితులు సేవలు అందించారు. అలాంటి స్థానిక దైవాలు తదనంతరం నిర్దిష్టమైన స్వరూపాలను పొంది దేవాలయాలలో స్థానం సంపాదించాయి. ముఖ్యంగా పుణ్యక్షేత్రాలలో వాటి శిలా విగ్రహాలకు చోటు లభించింది.

తమిళనాడులోని ఆలయాల నగరమైన చిదంబరం ఈ ప్రక్రియకు ఒక మంచి ఉదాహరణ. ఒక స్థానిక దేవాలయం ప్రాంతీయ పుణ్యక్షేత్రంగా రూపాంతరం చెందింది.

చిదంబరం నటరాజ (శివుడు)తో ముడిపడి ఉంది. ఒక స్థానిక చెరువులో ఒక శిలా విగ్రహాన్ని కొలవడం ద్వారా ఈ వర్గం ప్రారంభమైంది. ఆ శిలను తర్వాత శివలింగంగా గుర్తించి, మూలస్థానంగా దానిని కొలిచారు. ఇదే తరహాలో ఇతర స్థానిక దైవాలు కూడా హిందూ మతంలో ప్రధాన దైవాలుగా ఎదిగాయి. మదురై పాండ్యుల ఆరాధ్యదైవమైన మీనాక్షి పితృస్వామ్య సంస్కృత సాంప్రదాయంలో స్థానం కల్పించారు. మీనాక్షిని శివుని సహచరి పార్వతిగా గుర్తించారు. శివపార్వతుల కళ్యాణాన్ని మీనాక్షి పథంలో ప్రధాన లక్షణంగా మార్చారు. దక్షిణ భారతంలో విష్ణువుకు తిరుపతి, శ్రీరంగంలలో మహా ఆలయాలను నిర్మించారు. అక్కడ విష్ణువును వెంకటేశ్వరునిగా, రంగనాథునిగా కొలిచారు. దక్కనులో పండ్‌హార్‌పూర్‌కు చెందిన విఠోభ పథం విష్ణువును కొలిచింది. ఇప్పటికీ అది అనేకమంది తీర్థయాత్రికులను ఆకర్షిస్తుంది. తూర్పు భారతంలో పూరీ జగన్నాథుడు ప్రధానమైన దైవం. గిరిజనుల ఆరాధ్యదైవమైన జగన్నాథుడు హిందూ మతంలో గౌరవ ప్రదమైన స్థానం దక్కించుకున్నాడు. అతడిని విష్ణువుతో పోల్చారు. ఫలితంగా దేశం నలుమూలల నుండి తీర్థయాత్రికులు పూరి ఆలయాన్ని సందర్శించడం మొదలు పెట్టారు. భక్తి ఉద్యమ దైవాలకు 'రాజ్యం' కూడా ఉండేది. అంటే ఈ దైవాల ప్రభావం ఉన్న ప్రాంతం. శివ, విష్ణువు అవతారాలకు గొప్ప సాంప్రదాయంలో భాగస్వామ్యం ఉండేది. అయితే ఒక ప్రత్యేక అవతారంలో వారి శక్తి, మహత్యం కొన్ని పరిమితులలోపే ప్రస్ఫుటమయ్యేవి. ఈ శక్తి క్షేత్రలో కేంద్రీకృతమై ఉండేది. తమ ప్రాంత శివార్లలో వారి శక్తి నశించిపోయి, పొరుగు దైవం యొక్క ప్రభావం మొదలయ్యేది. ప్రాంతీయ దైవాల ఈ కేంద్రీకరణను మధ్యయుగ పాలకుల రాజ్యాలతో పోల్చవచ్చు. పాలకులను చక్రవర్తిన్లుగా గుర్తించిన వారి నిర్దిష్ట అధికారం చాలా పరిమితంగా ఉండేది. రాజ్యం సరిహద్దులో పొరుగు రాజ్యాల ప్రభావం స్పష్టంగా కనిపించేది.

అదనంగా దైవాల వ్యవస్థ ప్రభుత్వ వ్యవస్థను కూడా ప్రతిబింబిస్తుంది. గ్రామ స్థాయిలో అనేక గ్రామ దేవతలు ఉండేవి. వారి శక్తి గ్రామాన్ని దాటి విస్తరించేది కాదు. తర్వాతి స్థాయిలో ఉపప్రాంతీయ దైవాలు కనిపిస్తాయి. ఇవి స్థానిక రాకుమారుల ఆరాధ్యదైవాలు. తర్వాత ప్రాంతీయ దైవాలు వస్తాయి. వీరు కుల దేవతలు, రాష్ట్ర దేవతలు కావడంవల్లే వారికి ప్రాంతీయ హోదా దక్కింది. కొన్ని సార్లు అలాంటి దైవాన్ని నిజమైన పాలకునిగా గుర్తించేవారు. ప్రాంతీయ, ఉప ప్రాంతీయ, స్థానిక దైవాలను ముడిపెట్టడానికి అనేక మార్గాలు, సాధనాలు ఉండేవి. గొప్ప పాలకుల్లాగా ప్రాంతీయ దైవాలు కూడా ఆస్థానాన్ని నిర్వహించేవి. అందులో ఉపప్రాంతీయ దైవాలు సంస్థానాధీశులుగా వ్యవహరించేవి. ఉప ప్రాంతీయ దైవాలు సామంతుల ఇలవేల్పుగా ఉండేవి. ఉప ప్రాంతీయ దైవాలు స్థానిక దైవాలను తమ ఆస్థానంలో కలిగి ఉండేవి.

హిందూ మతంలో తీర్థయాత్ర వ్యవస్థ కీలక అంశంగా ఉండిపోయింది. అది స్థానిక, ప్రాంతీయ, జాతీయ స్థాయి పుణ్యక్షేత్రాలను అనుసంధానం చేస్తుంది. పుణ్యక్షేత్రాలను ఆది వైదిక కాలంలో 'తీర్థ' అని పిలిచేవారు. ఆర్యుల సంస్కృతి విస్తరించడంతో అలాంటి పుణ్యక్షేత్రాల సంఖ్య కూడా పెరిగింది. అయితే ప్రత్యేక సందర్భాలలోనే వాటిని సందర్శించేవారు. సుదూర

తీర్థయాత్రలు క్రీ.శ. తొలి శతాబ్దాలలోనే వెలుగులోకి వచ్చాయి. అప్పటికి మహా ఆలయాల సాంప్రదాయం బలపడింది. మూలవిరాట్టులలో దైవ శక్తి ఉందని గ్రహించడం మొదలు పెట్టారు. తొలి సహస్రం ముగింపు దశ నుండి భారతదేశం తీర్థయాత్ర మార్గాలలో ముడిపడడం ప్రారంభించింది.

### తాత్విక సమ్మేళనం, కొత్త హిందూ మతం:

శంకరాచార్యుని ఏకేశ్వరోపాసన హేతువాద, దైవిక వాదనలను మధ్యేమార్గంతో పరిష్కరించింది. బ్రహ్మ వ్యక్తిగత ఆత్మతో సమానమైనవాడు. కనుక వ్యక్తిగత సూత్రాన్ని, దైవ స్వరూపాన్ని కలిగి ఉంటాడు. ఇది వ్యక్తిగత భక్తుని ఆకర్షిస్తుంది. ఆ విధంగా శంకర శాంతియుత సహజీవనాన్ని స్థాపించాడు. పూర్వం వర్గ కోణంతో తాత్విక చర్చలు జరగలేదు. మధ్యయుగ తత్త్వ శాస్త్రం హిందూ మతంలోని ఆయా పంథాలతో ప్రత్యేకంగా గుర్తింపు పొందడం మొదలుపెట్టింది. శివ, విష్ణు, శక్తిలను వారి భక్తులు ఉన్నత దైవాలుగా కొలిచేవారు.

నూతన వైష్ణవ విచారధారలో అత్యంత ప్రధానమైన వ్యక్తి రామానుజ. అతడు శంకరుని అద్వైత వాదాన్ని వైష్ణవ పంచరత్న శాస్త్రంతో జతచేశాడు. రామానుజ రచనల ప్రభావం, అతడి సుదీర్ఘ సేవ (శ్రీరంగం విష్ణు ఆలయ ప్రధాన పురోహితునిగా) వల్ల అతడి సిద్ధాంతాలు వైష్ణవులలో బాగా విస్తరించాయి. అతడిని శ్రీవైష్ణవ మత స్థాపకునిగా పరిగణిస్తారు.

కృష్ణ భక్తి పెరగడం వైష్ణవ పంథాలో మరో ముఖ్యమైన పరిణామం. కృష్ణుడిని ఒక విష్ణు అవతారంగా కంటే వ్యక్తిగత దైవంగానే పరిగణించడం మొదలుపెట్టారు. పురాణాలలో గొప్పదైన భగవత్ పురాణం (10 లేదా 11వ శతాబ్దంలో రచించబడిన) కృష్ణుని హోదాను పెంచడానికి అంకితమైంది. కృష్ణ పంథా ఆధ్యాత్మికత జయదేవుని గీత గోవింద (1200 క్రీ.శ.)లో అద్భుతమైన రీతిలో వ్యక్తీకరించబడింది. 15, 16వ శతాబ్దాలలో కృష్ణ పంథాను భక్తి సంతులు నింబర్క, వల్లభ, చైతన్య, మీరాబాయ్ తదితరులు జనప్రియం చేశారు. శైవ పంథా కూడా అనేక జనప్రియ పంథాలకు బాటలువేసింది. ముఖ్యంగా ప్రత్యాభిజ్ఞలు, స్పంద శాస్త్రాలు, మత్తమయూరులు, ఆగమంతినులు, సుద్ధశైవులు, వీరశైవులు ఆ పంథా నుండి ఉద్భవించారు. మహదేవుడు ఉన్నాడని వీరందరూ అంగీకరించినప్పటికీ భగవంతుని, భక్తునికి మధ్య ఉన్న సంబంధంపై ఉన్న గొప్ప ప్రశ్నకు భిన్నమైన సమాధానాలు ఇచ్చారు.

## దేవాలయాలు, మఠ సంస్థల ప్రాముఖ్యత:

### పరిచయం:

గుప్తుల కాలం చివరి దశలో హిందూ దేవాలయం సాంస్కృతిక, వాస్తు శాస్త్ర సముదాయంగా పూర్తి స్వరూపాన్ని సంతరించుకుంది. ఆరు నుండి 14వ శతాబ్దం వరకు దేవాలయాల అభివృద్ధి, విస్తరణ ఘనమైన మధ్యయుగ సంస్కృతికి నిదర్శనం.

మహాబలిపురం నుండి ఖజురహో వరకు గొప్ప ఆలయాలు విస్తరించాయి. స్థానిక దైవాలు, ఆచారాలు, చిహ్నాలు, ఆధ్యాత్మిక వాదాన్ని పౌరాణిక సాహిత్యం, సంబంధిత కల్పన, జానపదం, కళలలో విలీనం చేయడంతో సాంస్కృతిక భిన్నత్వం వెల్లివిరిసింది. స్థానిక దైవాలు, భక్తులు, పోషకుల సాంస్కృతిక స్థాయి పెరిగింది. స్థానిక పంథాలు పురాణ సాంప్రదాయాలు, దేవాలయ వేడుకలలో అంతర్భాగమయ్యాయి. స్థానిక సముదాయాలు రాచరిక నియంత్రణలోకి వచ్చాయి. దేవాలయ పూజ ఉన్న సంపన్న కేంద్రాలు బ్రాహ్మణుల నియంత్రణలో ఉన్న నైపుణ్యాలను జత చేసి వ్యవసాయ ప్రాంతాలను అభివృద్ధిపరిచాయి. వాస్తుశాస్త్రం, నిర్మాణకళ, ఆర్థిక నిర్వహణకు ఈ నైపుణ్యాలు అవసరమయ్యాయి. మహా ఆలయాల నిర్మాణం బ్రాహ్మణులను ఆ ప్రదేశానికి రప్పించేది. అక్కడ రాచరిక వైభవ కేంద్రం ఏర్పడేది. గొప్ప పాలకులు గొప్ప ఆలయాలను నిర్మించి ఎందరో బ్రాహ్మణులను పోషించారు. దేవాలయాలు, శిలా శాసనాల విస్తరణ, వాటి విషయ సూచిక మధ్యయుగ సామాజిక భౌగోళిక శాస్త్రాన్ని సూచిస్తాయి. దేవాలయ శాసనాలు అధికంగా ఉన్న భూభాగాలు తూర్పు, మధ్య ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, గుజరాత్, పశ్చిమ మహరాష్ట్ర, కోస్తా మైదాన ప్రాంతాలలో కేంద్రీకృతమయ్యాయి. పంజాబ్, పశ్చిమ గంగా మైదాన ప్రాంతాలలో జాట్ నివాస ప్రాంతాలు, పర్వత ప్రాంతాలలో ఇలాంటి శిలాశాసనాలు ఎక్కడా కనిపించవు. దీనిని బట్టి ఆ ప్రాంతాలలో బ్రాహ్మణ ప్రభావం చాలా పరిమితంగా ఉండేదని, అక్కడి సమాజాలు చాలా తక్కువగా హిందూకరణ చెంది ఉండేవని బోధపడుతుంది. దేవాలయం ఎంత ప్రాశస్త్యం పొందితే దాని పోషణ విలువ అంతగా పెరిగేది. దేవాలయంతో ముడిపడి ఉన్న ప్రజల ప్రతిష్ట కూడా పెరిగేది. ఉధృతమవుతున్న భక్తి ఉద్యమం తీర్థయాత్ర విలువను గణనీయంగా పెంచింది. అలాగే దేవాలయాలకు విరాళాలు, పెట్టుబడులను సమకూర్చి పెట్టింది. సామాజిక హోదా ప్రతిష్టను పెంచుకోవడానికి విరాళాలు దానాలు ఒక సాధనంగా మారాయి. దేవాలయాలు వాణిజ్య కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. భూస్వాములు, యజమానులు ఈ ప్రాంతాలలో ఉత్పత్తి కేంద్రాలను స్థాపించారు. దేవాలయ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం పెరగడంతో దేవాలయాలు సామాజిక సంబంధాలు, సామాజిక హోదాలను నిర్ధారించే సమర్థవంతమైన క్షేత్రాలుగా ఎదిగాయి. వ్యక్తుల సామాజిక హోదా ప్రకారం దేవాలయ గౌరవ పురస్కారాలను ప్రదానం చేశారు. భక్తులను వారి సామాజిక హోదా బట్టి దైవం ఎదుట నిలబెట్టేవారు.

**సామాజిక ఆర్థిక ప్రాముఖ్యత:**

క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దం నుండి దేవాలయం ఏకీకరణకు ఉన్నత సాధనంగా మారింది. మధ్య చోళుల కాలంలో (985-1118) దేవాలయ పాత్ర గణనీయంగా పెరిగింది. ప్రాంతీయ సార్వభౌమత్వం ముఖ్యంగా రాచరిక ఆలయాల ద్వారా నిర్ధారించబడింది. తంజావూర్, గంగైకొండ చోళపురంలోని దేవాలయాలు అందుకు ఉదాహరణ. స్థానిక పంపిణీ ప్రక్రియను నిర్వహించే బాధ్యతను దేవాలయాలు క్రమంగా హస్తగతం చేసుకున్నాయి. స్థానిక సంస్థలకు దేవాలయాలకు పర్యవేక్షణ బాధ్యతలను తరచూ బదిలీ చేసేవారు. ముఖ్యంగా విశాలమైన

దేవాలయ భూములు, ఆస్తులకు ఈ బాధ్యతలు దక్కేవి. చాలా సందర్భాలలో దేవాలయాలను బ్రాహ్మణ సభలే నిర్వహించేవి. దేవాలయాల పాలనను వెల్లాల భూస్వాములు ఊరులలో చూసేవారు.

అయితే స్థానిక దేవాలయం, స్థానిక పెద్దల మధ్య ఎలాంటి సంబంధాలు కొనసాగినప్పటికీ దేవాలయ ఆర్థిక వ్యవస్థ విస్తరించడంతో అవి పూర్తిగా తెగిపోయాయి. నాడు పరిధిలో వనరుల నిర్వహణ, పాలకుల కేంద్రీకరణ చర్యలు (దేవాలయ వ్యవహారాలను రాచరిక అధికారులతో పర్యవేక్షించడం), జమాఖర్చుల పరిశీలన, ఆలయ ఆస్తులపై విచారణ, ఆలయ ఖర్చుల స్థాయి, నిధులను తిరిగి కేటాయించడం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. స్థానిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి పాలకులకు దేవాలయాలు ఆశ్రయం కల్పించాయి.

ఘనమైన రాచరిక ఆలయాలు దేవాలయాల యొక్క ఆర్థిక ప్రభావ సీమను సూచిస్తాయి. తంజావూర్ విషయంలో అది చోళ రాజ్యాన్ని మొత్తం శాసించింది. కాంచీపురం లాంటి రాజకీయ – సాంస్కృతిక కేంద్రాలలో దేవాలయాలు మండలాలను శాసించాయి. ఈ దేవాలయాలకు భారీగా నిధులను సమకూర్చిపెట్టే ఏర్పాట్లలో రాజ్యంలోని శివారు ప్రాంతాల నుండి రాజధానులకు, రాజధానుల నుండి శివారు ప్రాంతాలకు నిధుల ప్రవాహం జరిగింది. ఈ విషయాన్ని రాచరిక నివేదికలు నిర్ధారిస్తాయి. తంజావూర్ విషయంలో అది ఉత్తర శ్రీలంకను సైతం తన పరిధిలోకి తెచ్చుకుంది. దేవాలయాలకు అనేక సభలు, నగరాలు ధాన్యాన్ని లేదా వస్తువులను సరఫరా చేశాయి. అందుకు ప్రతిఫలంగా రాచరిక ఆలయం నుండి బంగారు నిల్వలను పొందాయి. కంచీపురం విషయంలో ఆలయ ఆస్తులు నగర ఆలయాలు, విశాలమైన గ్రామీణ ప్రాంతాల మధ్య పరస్పర ఆధారిత సంబంధాలను నెలకొల్పాయి. ముఖ్యంగా తొండై మండలంతో ఇలాటి సంబంధాలు ఏర్పడ్డాయి.

**రాజకీయ ప్రాముఖ్యత:**

పల్లవ – చోళ కాలంలోని దేవాలయ – ఆధారిత హిందూ మతం బ్రాహ్మణ రైతాంగ కూటమి ప్రయోజనాలను నెరవేర్చిందని నమ్ముతారు. ఈ కూటమి స్థానిక పరిపాలన ఉన్న రైతాంగ ప్రాంతాలకు మౌలిక ఆధారంగా ఉండేది. రైతాంగంలోని ప్రత్యేకవర్గాల ప్రయోజనాలను హిందూ – మతం చట్టబద్ధం చేసింది. ముఖ్యంగా నత్తర్ అనే వర్గానికి అది లాభదాయకంగా మారింది. ఈ వర్గం మరోవైపు బ్రాహ్మదేయపై ఆధారపడేది. పాలకవర్గ భావజాలం తప్ప బ్రాహ్మణ – రైతాంగ కూటమి స్థానిక సంస్థలలో ఆధిపత్యం ఉండేది కాదని కొందరు వాదిస్తారు.

చోళులు ముఖ్యంగా ఈ భావజాలాన్ని లేదా సిద్ధాంతాన్ని అమలుచేశారు. వివిధ పద్ధతులలో తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. భక్తి గీతాలను ప్రజలలో ప్రచారం చేశారు. భక్తి గీతాలు ఆలపించే అన్ని ప్రాంతాలలో దేవాలయాలు నిర్మించి వాటిలో పూజలు పురస్కారాలను ప్రవేశపెట్టారు. ఆలయ–ఆధారిత భక్తి సార్వజనీక స్వరూపాన్ని సంతరించుకుంది.

మత, వర్గ వైషమ్యాలను అధిగమించింది. అన్ని పంథాల కేంద్రాలకు చోళులు ప్రాధాన్యతనిచ్చారు. మరీ ముఖ్యంగా దైవ పంథాను పోషించారు. వారి కోసం ఆలయాలను నిర్మించారు.

ప్రధాన సైద్ధాంతిక నిర్మాణంగా దేవాలయం ఒక ప్రత్యేక లక్షణాన్ని పొందింది. చోళుల రాజకీయ ప్రతీకగా మారింది. ఈ దశలో సాగిన ఆలయ నిర్మాణాలు ద్రవిడ నిర్మాణ శైలిని పతాక స్థాయికి తీసుకెళ్లాయి. సంబంధిత కళలు కూడా వికసించాయి. దేవుడు, పాలకుడి మధ్య దాదాపు సమానమైన ఆస్తిత్వం స్థాపంచబడింది. దీనితో ఆలయ, రాజ్య సరిహద్దులు కలిసిపోయాయి. భక్తి సిద్ధాంతం దైవ, మానవ సార్వభౌముల ప్రాబల్య ప్రక్రియలో తోడ్పడింది. బ్రహ్మాండ/దేవాలయ/రాజ్య ప్రతీకాత్మకత ద్వారా రాజకీయ ప్రాబల్యం విస్తరించింది.

దేవాలయ స్థాపన, పరిసర ప్రాంతం దేవాలయాల విస్తరణను, రాజకీయ–ఆర్థిక సమైక్యతతో దాని సంబంధాన్ని విశదీకరిస్తుంది. పట్టణ కేంద్రాల ప్రగతిలో దేవాలయాల పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది. నగరాలు, పట్టణాల స్వరూపాన్ని ఆలయం నిర్ధారించేది. ఆలయమే నగర/పట్టణానికి కీలక స్థావరంగా ఉండేది. ఆలయాల చుట్టూ వ్యాపారులు, వృత్తిదారులు స్థిరపడ్డారు. ఈ ప్రక్రియకు పట్టణాల ప్రగతి దశలో నిర్మాణమైన ఆలయాలు లేదా ఆలయ సముదాయాలు అద్దం పడతాయి.

**సాంస్కృతిక ప్రాముఖ్యత:**

పల్లవ, చోళుల కాలం నాటి ఆలయ నిర్మాణం, వాస్తు శాస్త్రాల అధ్యయనం (7 నుండి 13వ శతాబ్దం) కళల చరిత్ర ప్రాముఖ్యతను నిర్ధారించింది. ఈ చరిత్ర ఆలయ పాత్రను వివరిస్తుంది. ఈ ప్రాంతంలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక కలయికలో ఆలయ ప్రధాన పాత్రను పోషించింది. ద్రవిడ నిర్మాణ శైలి గర్భాలయ స్థాయి నుండి శిఖర స్థాయి, తర్వాత అర్థ మండప స్థాయికి ఎదిగింది. వీటిన్నంటిని కలిపి విమానం అంటారు. క్రీ.శ. 11వ శతాబ్దం నాటికి ఆలయాలు విస్తరణలో, ఎత్తులో ఎన్నడూ లేని స్థాయికి చేరుకున్నాయి.

చోళుల పాలనలో ఆలయ నిర్మాణం ఉన్నత దశకు చేరుకుంది. తంజావూర్, గంగైకొండ చోళపురం లోని రాచరిక ఆలయాలు నిర్మాణ ప్రణాళిక, ఆకారం, ఎత్తు విషయాలలో అసమానమై సమతుల్యాన్ని సాధించాయి. వీటికి ఎత్తయిన స్తంభాలతో కూడిన మండపాలు జత అయ్యాయి. చుట్టూ ప్రాకారంతో గోపురాలు కీలక ప్రదేశాలలో ఉండే విశాలమైన ఆలయాలు వెలిశాయి. ప్రాకారంలో చిన్నస్థాయి దైవాలు, సంరక్షణ దైవాలకు చోటు కల్పించారు. ముఖ్యంగా తమిళ ఆరాధ్యదైవం మురుగన్‌కు బ్రాహ్మణ సనాతన వాద హిందూ పంథాలో చోటు లభించింది. అతడిని శివుని కుమారునిగా గుర్తించారు. ఉమ లేదా పార్వతిని స్థానిక దేవతగా కొలిచారు. బ్రహ్మాండం / రాజ్యాన్ని సూచిస్తూ ఆలయ సముదాయాల నిర్మాణం కొనసాగింది.

చోళుల పాలన చివరి దశలో, చోళుల పాలన అనంతరం ఆలయాలు నిర్మాణాల విశాల సముదాయాలుగా విస్తరించాయి. అందులో స్తంభాల మంటపాలు, ఎత్తయిన

ప్రవేశద్వారాలు అదనంగా చేరాయి. సమాజం సాధించిన ప్రగతిని అవి ప్రతిబింబించాయి. సమాజం శిఖర స్థాయిలో రాచరిక కుటుంబం ఉండేది. వారు దేవాలయాలను పోషించారు. విమానాలు, గోపురాలను పాలక వంశీయులు నిర్మించారు. రాచరికం తర్వాత స్వచ్ఛమైన బ్రాహ్మణ పురోహితులకు సమాజంలో ఉన్నత గౌరవం దక్కేది. వీరి వ్యాపకం పూజలు నిర్వహించడం. తర్వాత పరిపాలనా బాధ్యతలు చూసే ఉన్నత వర్గం, భూస్వామ్య, వ్యాపార వర్గాలు ఉండేవి. కింది స్థాయిలో వ్యవసాయ కార్మికులు, వృత్తికారులు, ఇతర అతిసాధారణ పనులు చేసేవారు ఆలయానికి సేవలు అందించేవారు.

రాతి నుండి మలచబడిన నిర్మాణాలు, తత్సంబంధిత పద్ధతులు పల్లవ - పాండ్య నిర్మాణ కళను శాసించాయి (7 నుండి 9వ శతాబ్దాల మధ్య). పదవ శతాబ్దం నాటి నిర్మాణ వ్యవస్థ ఇలాంటి కళను రూపుమాపింది. సమాంతరంగా విస్తరించిన ఆలయాలు వ్యవసాయదార జీవితానికి కీలక స్థావరాలుగా ఎదిగాయి. పట్టణ ప్రగతిని ప్రతిబింబిస్తూ ఆలయ సముదాయాలు విస్తరించాయి. పట్టణ కేంద్రాలలో కేంద్రీకృతమయ్యాయి.

శిల్ప కళ ఉద్భవించడంతో పాలక కుటుంబాలు, వాటి బ్రాహ్మణ సూత్రధారుల రాజకీయ సిద్ధాంతాలను ప్రతిబింబించే నిర్మాణాలు మొదలయ్యాయి. పల్లవుల రాజ్యంలో బాదామి చాళుక్యల పాలన ఉన్న దక్కను ప్రాంతంలో, రాష్ట్రకూటుల పాలన ఉన్న మాన్యఖేతాలో శిల్పాలు పౌరాణిక గాథలను ప్రతిబింబించాయి. చోళుల కాలం నాటి భావ వ్యక్తీకరణ, రాజకీయ సిద్ధాంతాలకు అనుగుణంగా శిల్పకళ అభివృద్ధి చెందింది. రాతి, కాంస్య విగ్రహాలు దక్షిణాసియా శిల్ప కళ వైశిష్ట్యాన్ని చాటి చెబుతాయి. వీటిపై పాలకులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. నటరాజ, త్రిపురాంతక, సోమస్కంధుల కాంస్య విగ్రహాలు ఉన్నత శైలిలో చెక్కబడ్డాయి.

## ఇస్లాం ఆవిర్భావం, విస్తరణ:

### మహమ్మద్ ప్రవక్త - ఇస్లాం పుట్టుక:

అరేబియాలోని మక్కాలో ఇస్లాం జన్మించింది. ఇస్లాం అంటే దైవానికి దాసోహం అని అర్థం. నిరంతరం వ్యాపార లావాదేవీలతో కిటకిటలాడే ప్రాంతంలో మక్కా ఉండడంవల్ల ఆ నగరం ఎంతో అభివృద్ధి చెందింది. దాని వాణిజ్య ప్రాముఖ్యత కాబాకు వార్షిక తీర్థయాత్రల వల్ల ద్విగుణీకృతమైంది. అబ్దుల్లా, అమీనా అనే దంపతులకు ఇస్లాం వ్యవస్థాపకుడు మహమ్మద్ జన్మించాడు. అతడి మేనమామ అబూతాలిబ్ అతడిని పెంచి పెద్దవాడిని చేశాడు. ఖదీజా అనే విధవను పెళ్లాడిన తర్వాత మహమ్మద్ తనను తాను సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజలతో గుర్తించడం మొదలు పెట్టాడు. తాను అల్లాహ్ దూతనని అతడు నిర్ధారించుకున్నాడు. అతడి భార్య, సోదర వరస వాడైన అలీ అతడికి తొలి శిష్యులుగా మారారు. అనతి కాలంలో మిత్రులు కూడా అతడిని ప్రవక్తగా ఆమోదించారు. అయితే మహమ్మద్ ప్రవచనాలు సంపన్న మక్కా వాసులకు ఆగ్రహం కలిగించాయి. వారు మహమ్మద్‌కు బద్ధ శత్రువులుగా మారారు.

ఫలితంగా క్రీ.శ. 622లో సెప్టెంబరు 24వ తేదీన అతడు మదీనాకు వలసపోయాడు. తర్వాత అతడి వలసను (హిజ్రత్) ముస్లిం హిజ్రా శకానికి నాందివాచకంగా మార్చారు. ముస్లిం చంద్రమాసానికి మొదటి రోజు అయిన జులై 16 (622)కు ఆ తేదీని సర్దుబాటు చేశారు. వలసదారులను మహాజిర్‌లుగా పిలిచారు. మదీనాలోని ఇతర ప్రజలను అన్సార్‌లు లేదా సహాయకులుగా గుర్తించారు. వీరు వలసదారులను ఆహ్వానించారు. క్రీ.శ. 630 ముగిసే నాటికి మహమ్మద్ తన అనుచరులతో మక్కాకు తిరిగి వచ్చాడు. అయితే జూన్ 632లో మరణించాడు.

## ఖలీఫాల నేతృత్వంలో ఇస్లాం విస్తరణ:

మహమ్మద్ మరణం తర్వాత మదీనాకు చెందిన ముహాజిర్‌లు అన్సార్‌లు అబూ బకర్‌ను ఖలీఫా (వారసుడు)గా ఎన్నుకున్నారు. ముహమ్మద్ తన వారసుడిని ప్రకటించలేదన్న భావనతో ఈ ఎన్నిక జరిగింది. అయితే ప్రవక్త ఇతర అనుచరులు, ప్రవక్త హాషిమ్ తెగకు చెందిన సభ్యులు ముహమ్మద్ తన అల్లుడు అలీని వారసుడిగా ప్రకటించాడని నమ్మారు. ఆ కారణంగా ప్రధాన వర్గం నుండి చీలిపోయారు. అలీ సమర్థకులుగా షియాలుగా (పక్షపాతులు) గుర్తింపు పొందితే అబూబకర్ అనుచరులు సున్నీ అనే బిరుదును కాలక్రమంలో సంతరించుకున్నారు.

అబూ బకర్ (632–34) ఉమర్–ఉల్–ఖత్తబ్ (634–44)ను తన వారసునిగా నియమించాడు. ఉమర్ నేతృత్వంలో బైజాంటీన్ సామ్రాజ్య ప్రాంతాలైన సిరియా, పాలస్తీనా, ఈజిప్టు, ససానిద్ దేశాలైన ఇరాన్, ఇరాక్‌లను ఖిలాఫత్ కిందికి చేర్చారు. తన ఇరానీ బానిసలలో ఒకరు ఉమర్‌ను హత్య చేసినపుడు ప్రవక్త సహచరుడు ఉస్మాన్ (644–56) ఖలీఫాగా ఎన్నికయ్యాడు. ఉస్మాన్ పాలనలోని తొలి ఆరు సంవత్సరాలు శాంతియుతంగా గడిచాయి. అయితే ద్వితీయార్థంలో అంతర్యుద్ధం చెలరేగింది. ఫలితంగా సముదాయం విచ్ఛిన్నం కాకుండా కాపాడేందుకు అలీ (656–61) ఖిలాఫత్‌ను స్వీకరించాడు. ఈ తొలి నలుగురు పాలకులను (అబూ బకర్, ఉమర్, ఉస్మాన్, అలీ) రషీదూన్ (సరైన మార్గదర్శకత్వం గల ఖలీఫాలు)గా గుర్తిస్తారు.

అయితే ఉస్మాన్ బంధువు, సిరియా గవర్నర్ అయిన ముఆవియా అలీ నాయకత్వాన్ని వ్యతిరేకించాడు. చివరగా ఆలీ హత్యకు గురైనపుడు ముఆవియా ఖలీఫా అయ్యాడు. ఉమయ్యద్ అనే వంశాన్ని (661–749) స్థాపించాడు. అయితే శతాబ్దం లోపే అబ్బాసిద్‌లు (749–1258) ఉమయ్యద్‌లను పదవి నుండి దించారు. అబ్బాసిద్‌లు ఇరాన్, అరేబియా ప్రజలలోని ఉమయ్యద్ వ్యతిరేకులను సమీకరించి తమ బలాన్ని పెంచుకున్నారు. ఆ తర్వాతే ఉమయ్యదలను పదవీచ్యుతులను చేశారు. ఉమయ్యద్, అబ్బాసిద్‌లు ఖలీఫాలుగా పిలవబడినప్పటికీ వారిది వారసత్వ పాలన.

## ఇస్లాంలో ఆధ్యాత్మిక ఉద్యమాలు:

### సూఫీ మత ఆవిర్భావం - విస్తరణ:

సూఫీ మతానికి చెందిన వివిధ వ్యవస్థలు ఇరాక్, తుర్కిస్తాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో ఆవిర్భవించాయి. ఈ వ్యవస్థల అనుచరులు క్రమంగా భారతదేశానికి వలసవచ్చారు. సుదీర్ఘ క్రమశిక్షణ, శిష్యరికం (ఈ దేశాల ఆధ్యాత్మిక నాయకుల కింద), ఇస్లాం పుణ్యక్షేత్రాలకు జరిపిన ప్రయాణాలు, తీర్థయాత్రల నుండి గడించిన అనుభవంతో సూఫీ అనుచరులు తమతోపాటు ఉల్లాసం, ఆరాధన, దయా గుణాలను ఇక్కడికి తీసుకువచ్చారు.

ముస్లిం మత ప్రచారకులు (మిషనరీలు) దేవునికి సేవ చేయాలన్న కాంక్షతో స్ఫూర్తి పొందేవారు. వారికి కేంద్రీకృత సంఘటనం ఉండేదికాదు. అలాగే రాజ్య మద్దతు అంతకన్నా ఉండేదికాదు. తమ వ్యక్తిత్వం, దయాగుణం కారణంగానే ముస్లిం మత ప్రచారకులు విజయం సాధించారు. తమ కార్యకలాపాలను శాంతియుతంగా చేపట్టారు. వ్యాపారులను అనుసరిస్తూ భూ, సముద్ర మార్గాల ద్వారా భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించారు. ముస్లిం పాలన లేని ప్రాంతాలలో సైతం ప్రచారం నిర్వహించారు.

తొలిగా మతం స్వీకరించిన హిందువులకు సూఫీలు ఎన్నో రాయితీలు కల్పించారు. హిందూ మత విశ్వాసాలు, ఆచారాలకు స్థానం కల్పించారు. వారు నిర్దిష్టమైన విజయాన్ని సాధించారు. దేవునితో మమేకం కావాలన్న సూఫీ మత ప్రబోధనలు ఆ మతానికి భారత భూభాగంపై ఘనమైన ఆతిధ్యాన్ని తెచ్చిపెట్టింది. అయిన్-ఎ-అక్బరీలో అబుల్ ఫజల్ తన కాలంలో కొనసాగిన 14 సూఫీ వ్యవస్థల గురించి ప్రస్తావించారు. వాటిలో ప్రధానమైనవి సుహ్రావర్ది, చిష్టీ, కాదిరి, నక్ష్ బందీ వ్యవస్థలు. ఇస్లామిక్ దేశాలలో షేక్‌గా పిలవబడిన ఆధ్యాత్మిక గురువును భారతదేశంలో ముర్షీద్ లేదా పీర్ అని పిలుస్తారు. శిష్యుడిని మురీద్ అంటారు. దర్వీష్ వ్యవస్థలో సూఫీ మత ఆచరణను పీరీ - మురీదీ అని అంటారు. హిందూ మతంలో దీనిని గురు-శిష్యపరంపరగా పరిగణిస్తారు.

### సుహ్రావర్ది వ్యవస్థ:

భారత సూఫీ మతానికి తొలి భూమిగా సింధ్ ఘనతను సాధించింది. ఖ్వాజా హసన్ నిజామీ ప్రకారం సుహ్రావర్ది సూఫీ భారతదేశంలో తొలిగా అడుగుపెట్టారు. సింధ్‌ను తన ప్రధానస్థావరంగా మార్చుకున్నారు. అరబ్ దండయాత్ర జరిగిన తర్వాత కొన్ని శతాబ్దాలకు ఈ పరిణామం సంభవించి ఉంటుంది. ఎందుకంటే భారతదేశంలో సుహ్రావర్ది వ్యవస్థ ముల్తాన్‌కు చెందిన బహావుద్దీన్ జకారియా (1170-1267) నేతృత్వంలో ప్రగాఢమైన ప్రభావాన్ని సంతరించుకుంది. మక్కా, మదీనా, జెరుసలేం తీర్థ యాత్ర నుండి తిరిగివస్తూ అతడు బాగ్దాద్‌ను సందర్శించాడు. అక్కడ సుహ్రావర్ది వ్యవస్థను స్థాపించిన షేక్ షిహాబుద్దీన్ సుహ్రావర్ది(1144-1235)కు ప్రియమైన శిష్యునిగా మారాడు. జకారియా మరణం తర్వాత

అతడి శిష్యుడు, అల్లుడు, ఆధ్యాత్మిక కవి అయిన ఇరాకీ వారసత్వాన్ని స్వీకరించారు. కాని తన చుట్టూ ఉన్న వ్యక్తుల మత మౌఢ్యం, రాగ ద్వేషాలతో విసిగిపోయిన ఇరాకీ తన కుమారుడు కబీరుద్దీన్‌ను ముల్తాన్‌లో వదిలేసి మక్కాకు తీర్థయాత్రపై వెళ్లిపోయాడు.

బీహార్, బెంగాల్‌లలో సుహ్రావర్ది సూఫీ వ్యవస్థ క్రియాశీలంగా ఉండేదని పాత నివేదికలు చెబుతాయి. అలాగే ధ్వజస్తంభాలు, సమాధుల వల్ల శిలా శాసనాలు తగిన సాక్ష్యాలను అందిస్తాయి. వ్యవస్థలో ప్రముఖ వ్యక్తులలో జలాలుద్దీన్ తబ్రీజీ ఒకడు (1244). అతడు షిహాబుద్దీన్ సుహ్రావద్ది శిష్యుడు. అతడు అనుచరుల్లో ఒకడు బెంగాల్ రాజా కంస్ (గణేష్) కుమారుడు జట్‌మల్‌ను ఇస్లాం మతానికి మార్చాడు. జట్‌మల్ తర్వాత జాదూ జలాలుద్దీన్‌గా ప్రసిద్ధుడయ్యాడు. సుహ్రావర్ది వ్యవస్థ వారసులు, శిష్యులు ఇస్లాం ప్రపంచంలో గొప్ప సాహిత్యకారులను అందించారు. భారతదేశంలో ఈ వ్యవస్థ ప్రచారకులు ఆధ్యాత్మిక, విద్యారంగాలలో ఎనలేని కృషి చేశారు. ప్రజలను పెద్ద సంఖ్యలో ప్రభావితం చేశారు. అలాగే పలుకుబడి కలిగిన నేతలను శిష్యులుగా చేర్చుకున్నారు. వాస్తవానికి ఆధ్యాత్మిక భౌతిక విషయాల్లోనే కాకుండా తుర్కు, పఠాన్, సయ్యిద్ పాలకవంశాల రాకుమారులకు పరిపాలనా విషయాల్లో కూడా వారు మార్గదర్శకులుగా వ్యవహరించారు.

### చిష్టీ వ్యవస్థ:

భారతదేశంలో అత్యధిక సంఖ్యలో అనుచరులను కలిగి వున్న, అతి పురాతన దర్వీష్ సోదర బృందాలలో చిష్టీ వ్యవస్థ ఒకటి. ఖ్వాజా అబు అబ్దుల్లా చిష్టీ (966) ఈ వ్యవస్థను స్థాపించాడు. సిస్తాన్‌కు చెందిన ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టీ (1142–1236) ఈ వ్యవస్థను భారతదేశంలో ప్రవేశపెట్టాడు. 1192లో ముహమ్మద్ ఘురీ సైన్యంతోపాటు ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టీ భారతదేశానికి వచ్చాడు. 1195లో అజ్మేర్‌కు వెళ్లాడు. 1236లో తన 93వ ఏట మరణించే వరకు అతడు అక్కడే శాశ్వతంగా నివసించాడు. అజ్మేర్‌లోని అతడి సమాధి ఖ్వాజీ సాహెబ్ దర్గాగా ప్రసిద్ధిగాంచింది.

ఖ్వాజా సాహెబ్ ఆధ్యాత్మిక వారసులలో ప్రముఖుడు నిజాముద్దీన్ ఔలియా (1238–1325) ఢిల్లీ నగరంలో అతడి సమాధి ఉన్న ప్రాంతాన్ని నిజాముద్దీన్‌గా పిలుస్తారు. భారతదేశం నలువైపులా చిష్టీ సోదర బృందం విస్తరించింది. మొగల్ చక్రవర్తుల మన్ననలను పొందింది. షేక్ సలీం చిష్టీ ప్రార్థనల కారణంగా అక్బర్‌కు వారసుడు, కుమారుడు దక్కాడు. అక్బర్ ఆ రాకుమారుడికి సలీం అని నామకరణం చేశారు. (తన గురువు పేరును అనుసరించి).

### కాదిరి వ్యవస్థ:

బాగ్దాద్‌కు చెందిన షేక్ అబ్దుల్ కాదిర్ జిలానీ (1078–1166) ప్రారంభించిన ఈ వ్యవస్థ 1482లో సింధ్ మార్గాన భారతదేశానికి ప్రవేశించింది. అబ్దుల్ కాదిర్ శక్తివంతమైన వ్యక్తిత్వం, విద్య, ప్రవచనాలు, దయాగుణం కారణంగా ఈ వ్యవస్థకు ఎనలేని ప్రతిష్ట

సమకూరింది. అనేక మహిమల (కరామాత్‌లు)ను అతడు ప్రదర్శించినట్లు భావిస్తారు. కాదిర్ వారసుల్లో ఒకరైన సయ్యిద్ బందగీ ముహమ్మద్ గౌత్ సింధ్‌లోని ఉచ్ వద్ద జీవించాడు. ఆ స్థలాన్ని అంతకుముందే సుహ్రావర్ది వ్యవస్థ ప్రముఖ స్థావరంగా తీర్చిదిద్దింది. 1517లో గౌత ఉచ్‌లో మరణించాడు. అయితే వారసుల సుదీర్ఘ చిట్టాతో అతడు భారతదేశంలో ఆధ్యాత్మిక విజయాన్ని సాధించాడు. కాశ్మీర్ పోషక సంతునిగా షా మహ్మద్ గౌత్‌ను పూజించారు. ఉత్తర భారతమంతటా అతడికి శిష్యగణం తయారైంది. షా నిజామత్ ఉల్లా, నసీరుద్దీన్ ముహమ్మద్ జిలానీలు భారతదేశంలో ఈ వ్యవస్థకు చెందిన ప్రముఖ వ్యక్తులు.

## నక్ష్ బందీ వ్యవస్థ :

సూఫీ వ్యవస్థలో చివరిదైన నక్ష్ బందీ వ్యవస్థను ఖ్వాజా బహావుద్దీన్ నక్ష్ బంద్ (తుర్కెస్తాన్) ప్రారంభించాడు. అతడు 1389లో మరణించాడు. అతడిని బుఖారా వద్ద ఖననం చేశారు. 1603లో మరణించి ఢిల్లీలో సమాధి అయిన ఖ్వాజా మహమ్మద్ బాకీ బిల్లాహ్ బేరంగ్ ఈ వ్యవస్థను భారతదేశంలో ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది. 1625లో మరణించిన షేక్ అహ్మద్ సరూకీ సర్హిందీ మొగల్ కాలంలో ఈ వ్యవస్థకు నాయకునిగా ఉన్నాడు. తొలి వ్యవస్థల వలే నక్ష్ బందీ వ్యవస్థ అంతగా విజయం సాధించలేదు. కేవలం మేధావులకే పరిమితం కావడంవల్లే ఈ పరిస్థితి తలెత్తి ఉండవచ్చు. అదీగాక చిష్టీల రాక తర్వాత నాలుగు శతాబ్దాలకు భారతదేశానికి రావడం వల్ల కూడా నష్టపోయి ఉండవచ్చు.

## సూఫీ వ్యవస్థల సంఘటనం, పనితీరు:

పైన పేర్కొనబడిన సూఫీ వ్యవస్థల సంఘటనం దాదాపు సాధారణ సూత్రాల ఆధారంగానే జరిగింది. అన్వయింపుదారుని మార్గదర్శకత్వంలో కొన్ని నిబంధనలు రూపొందించబడ్డాయి. వాటి ప్రకారం శిష్యులు, భక్తులు నడుచుకుంటూ దేవుని ఆరాధించారు. ఉదాహరణకు భక్తిగీతాల ఆలాపన జరిగేది. తొలుత పదాలను వల్లెవేస్తూ వాటిని స్పష్టంగా ఉచ్ఛరించేవారు. తర్వాత భక్తుల దృష్టి కేంద్రీకృతమయ్యేది. అనంతరం భక్తులు చిన్న స్వరంలో వాటిని ఆలపిస్తూ ధ్యానంలో మునిగిపోయేవారు. చివరి దశలో మానసికంగా పదాలను వల్లె వేస్తూ తన దృష్టినంతా భగవంతునిపైనే కేంద్రీకరించేవారు. భౌతిక ఆలోచనలన్నీ మది నుండి మాయమై దేవుని ఆలోచనలతో నిండిపోయేది.

ఒక సోదర బృందానికి చెందిన వారు ఇతర వ్యవస్థల సభ్యుల ప్రవేశంపై ఎలాంటి నిషేధం విధించలేదు. సోదర బృందంలో తన స్థానం కోల్పోకుండా ఒక వ్యక్తి ఆయా వ్యవస్థల ప్రవచనాలను, ఆచారాలను పాటించడానికి అవకాశం ఉండేది. ఖ్వాజా కుతుబుద్దీన్ భక్తియార్ కాకీ సుహ్రావర్ది వ్యవస్థకు చెందినవాడు. ఢిల్లీలోని కుతుబ్ మినార్‌లోని అతడి సమాధిని ప్రజలు మతాలకు అతీతంగా కొలుస్తారు. అతడు షేక్ అబ్దుల్ కాదిర్ నుండి ఆధ్యాత్మిక కానుకలను పొందేవాడు. తర్వాత ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టీ అనుంగు అనుచరులలో ఒకడిగా మారాడు.

వ్యవస్థాపకులు తమ అనుచరులకు నిర్దేశించిన ప్రత్యేక ఆచారాలు, నిర్దేశాలే నిర్దిష్టమైన లక్షణాలు. ఉదాహరణకు సుహ్రావర్ది వ్యవస్థ నిబంధన ప్రకారం భక్తుడు ఖురాన్‌ను పఠిస్తూ హదీత్ (ప్రవక్త సాంప్రదాయాలు)ను పాటిస్తూ జీవితం గడపాలి. భక్తిగీతాలు, దేవుని స్తోత్రాలు ఆలపిస్తూ నృత్యం చేసే ఖలందర్‌లను కొందరు మత మౌఢ్యులు (ఈ వ్యవస్థకు చెందినవారు) తీవ్రంగా ద్వేషించేవారు. అయితే ఇలాంటి నృత్య సంగీత ఆరాధనకు చిష్టీ, కాదిరి వ్యవస్థల ఆమోదం ఉండేది. ఇలాంటి జనరంజక సాంప్రదాయాలు ప్రజలను ఆకర్షించేవి, అద్భుతమైన ఫలితాలు సాధించేవి. హేతువాద ముస్లింలు ఇలాంటి ఆచారాలకు ఎలాంటి అభ్యంతరాలు చెప్పరు.

ఏ ముస్లిం మతస్థుడైన పై నాలుగు వ్యవస్థల్లో ఒకదానిని ఆమోదించవచ్చు. తన పేరు చివరన కాదిరి, చిష్టీ, సుహ్రావర్ది లేదా నక్షబందీ అనే బిరుదును వాడుకోవచ్చు. అనేక హిందూ సామాజిక ఆచారాలను (బిదాత్) పాటించడం భారతీయ ఆవిష్కరణ మాత్రమే. వీటి గురించి ఇతర ఇస్లామిక్ దేశాలలో ఎలాంటి అవగాహన లేదు. సంతుల సమాధులకు తీర్థయాత్ర, విరాళాల ప్రదానం, ప్రతిజ్ఞ చేయడం, చిరాగ్ కాల్చడం (సమాధి వద్ద), ప్రసాదాల స్వీకారం (తబర్రుక్) లాంటి ఆచారాలు ఇస్లామ్‌కు అస్వాభావికమైనవి కావు. అయితే హిందూ వాతావరణ ప్రభావంవల్లే అవి పుట్టుకొచ్చాయి. ఫలితంగా ముస్లిం సంతులను అన్ని మతాల వారు గౌరవించారు. హిందూ సంతులను పూజించినట్లే సూఫీ సంతులను అదే పద్ధతి, మాండలికంలో స్తుతించారు. వాస్తవానికి భారత ముస్లింలు ఉర్స్ లేదా వార్షిక సంస్మరణ ప్రార్ధనలకు మంచి వస్త్రధారణతో హాజరవుతారు. ఇక్కడ ఇస్లాం మత మౌలిక సూత్రాలను పాటించడం కంటే ఎంతో ఉత్సాహం, భక్తిభావంతో పాల్గొంటారు.

## మధ్యయుగ కాలపు భక్తి ఉద్యమాలు:

**భక్తి ఉద్యమాలకు దారితీసిన కారణాలు :** ఒక ప్రత్యేకమైన సమాజంలో భక్తి ఉద్యమాలు ప్రజల భావ వ్యక్తీకరణలు. కొన్ని సామాజిక – ఆర్థిక పరిస్థితుల కారణంగా అవి ఉద్భవించాయి. సమాజంలోని అణగారిన, పీడిత వర్గాల ఉద్ధరణే లక్ష్యంగా అవి వెలిశాయి. రూపాంతర దశలో ఉన్న సమాజం నుండి పుట్టిన ప్రక్రియలు అవి. ఆ సమయంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. రాజకీయ–ఆర్థిక–సామాజిక పోకడలు మత కార్యకలాపాల మధ్య చాలా దగ్గరి సంబంధం ఉన్న కారణంగా భక్తి ఉద్యమాలను ప్రత్యేకమైనవిగా పరిగణించలేము. రాజకీయ రంగంలో 14, 15వ శతాబ్దాలు శక్తివంతమైన, కేంద్రీకృత రాజ్యం పతనాన్ని చవిచూశాయి. ఫ్యూడల్ దొరల మధ్య ఘర్షణలు, సామంతుల తిరుగుబాట్లు, రైతాంగంలో గూడుకట్టుకున్న అసంతృప్తి జతకలిసి సుల్తాన్ రాజ్య ఆధిపత్యాన్ని దెబ్బతీశాయి. ఆర్థికరంగంలో ఈ కాలంలో ఢిల్లీ సుల్తాన్ రాజ్యం అనేక మార్పులను తీసుకువచ్చింది. తొలి దశలో ఆ రాజ్యం సామాజిక శక్తులను సారించి పట్టణ కేంద్రాల విస్తరణకు దోహదం చేసింది. వ్యవసాయధార సంబంధాలలో ఈ పరిణామం మార్పులు

తీసుకువచ్చింది. హస్తకళాకృతుల ఉత్పత్తి వాణిజ్య కార్యకలాపాలు విస్తరించడంతో వృత్తిదారులు, వ్యాపారులు అస్థిరతను ఎదుర్కొన్నారు. వృత్తుల వెలుపల నుండి అనేకమంది వృత్తిదారులు వచ్చినా వారిని భారతీయ వృత్తిదారులతో సమానంగా పరిగణించలేదు. సామాజిక శ్రేణులలో వ్యాపారులకు కూడా స్థానం లభించలేదు. బుద్ధుడు, మహావీర కాలం నాటి పరిస్థితులు పునరావృతమయ్యాయి. ఫలితంగా అనేక లౌకికవాదమత పంథాలు ఆవిర్భవించాయి. సామాజిక క్షేత్రంలో వర్తమాన పరిస్థితిని స్థిరీకరించేందుకు హిందూ మతానికి చెందిన సనాతన వాదులు క్లిష్టమైన ఆచారాలను ప్రవేశపెట్టి వాటిని పాటించారు. ఈ సమయానికి బౌద్ధ, జైన మతాలు దాదాపు రంగం నుండి అదృశ్యమయ్యాయి. ఈ కాలంలో హిందూ మతం పునరుద్ధరణకు గురైంది. సాంప్రదాయాలు, ఆచారాలు ప్రస్తావించబడిన సంస్కృత గ్రంథాలను కేవలం బ్రాహ్మణులు ఒక్కరే అర్థం చేసుకున్నారు. ఫలితంగా స్థూల మతపరమైన నిర్మాణం వారిగుత్తాధిపత్యంగా మారింది. ఈ కారణంగానే భక్తి ఉద్యమ నాయకులు సరళమైన స్థానిక భాషలో బోధనలు చేశారు. భక్తి ఉద్యమాలు సామాజిక ఉత్పత్తులు, వాటి నాయకులు చేతకాని తత్త్వ వేత్తలు లేదా అచేతన సంస్కరణవాదులు కాదు. వారు సమాజంలోని అట్టడుగు వర్గాల నుండి వచ్చారు. తమతోటి వర్గీయుల ఉన్నతి కోసం పాటుపడ్డారు. రామ్‌దాస్ చర్మకారుడు, ధన్న అంటరానివాడు, కబీరు ముస్లిం చేనేత కుటుంబానికి చెందినవాడు. తమ స్థానిక భాషలలో సాహిత్య స్వరూపాలలో తత్త్వశాస్త్రాలను బోధించారు. అవి సంస్కృత సాహిత్య సాంప్రదాయానికి పూర్తి భిన్నంగా ఉండేవి. నానక్ ప్రకారం మతం అంటే కేవలం మాటల గారడి కాదు. మతమంటే అందరినీ సమానంగా చూడాలి. దాదూ సమసమాజం గురించి మాట్లాడాడు. అలాంటి సమాజంలో లింగ, జాతి, వర్ణ వర్గ, కుల వివక్ష ఉండరాదని చెప్పాడు. కబీర్ మానవ చరిత్రను తిరగదోడి పూర్వం మనిషికీ మనిషికీ మధ్య ఎలాంటి తేడా ఉండేది కాదని స్పష్టం చేశాడు. భక్తి సంతులు ప్రేమానురాగాలపై ఎక్కువ దృష్టి సారించారు. వారి ప్రకారం భక్తి అంటే ఏకదృష్టి ఆరాధన. అది పెరిగి గాఢమైన ప్రేమగా మారుతుంది. కేవలం మత శాస్త్రాలను అధ్యయనం చేసినంత మాత్రాన వ్యక్తులు విద్యాంసులుగా మారబోరని కబీర్ పేర్కొన్నాడు. భగవంతునికి భక్తునికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఏర్పడాలని వారు ప్రబోధించారు. సాంప్రదాయ, విశాలమైన, అర్థంలేని ఆచారాలను వ్యతిరేకించారు. సమాజంలో సనాతనవాద ధోరణులు పెరిగిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

వృత్తిదారులు, కళాకారులను పెద్ద సంఖ్యలో చేర్చుకోవడం ద్వారా భక్తి ఉద్యమాలు ఆ వర్గాలను వారి సామాజిక హోదాపై అవగాహన, చైతన్యాన్ని కల్గించాయి. సమాజంలోని మత, సామాజిక నిర్మాణాన్ని ప్రజాస్వామీకరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాయి. వాస్తవానికి అనేకమంది భక్తి ప్రబోధకులు పుట్టుకతో వృత్తికారులు లేదా సామాన్య రైతు కుటుంబానికి చెందినవారు. చాలా వరకు ఉద్యమ అనుచరులు నిమ్న కులాల నుండి వచ్చారు. నాయకత్వ స్థానంలో అగ్రకులం లేదా ఉన్నత వర్గం ఉండి పెద్ద సంఖ్యలో ఉన్న మాన, పరాధీన భక్తులపై ఆధిపత్యం చెలాయించలేదు. ఈ సంతుల ప్రబోధనలు సమసమాజ సిద్ధాంతానికి ఒక నిర్దిష్టమైన స్వరూపం ఇచ్చాయి. ఈ ఉద్యమ పట్టణ లక్షణం హిందూ చైతన్యాన్ని జాగృతపరచింది. తమ

మతంలోని ఆచారాలు, మూఢనమ్మకాలను సంస్కరించుకోవలసిన అవసరాన్ని అనేకమంది ప్రజలు గుర్తించారు. బ్రాహ్మణులు అక్కడక్కడా ఈ ఉద్యమంలో చేరారు. పట్టణాలలో నాగరిక వర్గాల భావాలను కబీర్ వ్యక్తపరచగా గ్రామాలు, చిన్నపట్టణాలలోని వృత్తిదారుల ఆలోచనలకు నానక్ అద్దం పట్టాడు. సంగత్, పంగత్ సంస్థను స్థాపించడం ద్వారా నానక్ అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చాడు.

## భక్తి ఉద్యమ స్వభావం, స్వరూపం:

భారత దేశ చరిత్రలోని రెండు భిన్నమైన దశలకింద భక్తి ఉద్యమాలు సంభవించాయి. మొదటి దశను భాగవత పంథా ఆవిర్భావం నుండి పరిగణనలోకి తీసుకోవచ్చు. ఇది 13వ శతాబ్దపు తొలి దశకం నుండి కొనసాగింది. ఈ దశలో సంతుల తత్వం దాదాపు వ్యక్తిగత వ్యక్తీకరణగా ఉండేది. రెండవ దశ దాదాపు నాలుగు శతాబ్దాలపాటు కొనసాగింది. (13-16 శతాబ్దాల వరకు). ఈ కాలంలో ఉన్నతమైన మేధోపర చింతన వచ్చింది. ఇస్లాం, హిందూ మతాల మధ్య పరస్పర సంబంధాల నుండి ఉద్భవించిన సహజ పరిణామం ఇది. అయితే ఈ రెండు దశలకు కొన్ని సాధారణ లక్షణాలు ఉండేవి. అంటే రెండు దశలకు ఉదారవాద దృక్పథం ఉండేది. మతాల సమానత్వం, దైవాల సమైక్యత, వ్యక్తిగత చర్యల గౌరవస్వరూపం, భక్తి ద్వారా స్వచ్ఛమైన ఆరాధన తదితర అంశాలు రెండు దశలలోనూ ఉండేవి. భగవంతుని పట్ల భక్తి లేదా ఆరాధన ఒక్కటే మోక్షానికి మార్గమని ఈ రెండు ఉద్యమాల ఆలోచనగా ఉండేది. ప్రత్యేక మతాన్ని స్థాపించాలన్న ఆకాంక్ష వాటికి ఏ కోశాన ఉండేది కాదు. అలాగే లిఖిత మతశాస్త్రాలపై గుడ్డి నమ్మకం కూడా ఉండేది కాదు. ఆచారాలను ఖండించడమే కాకుండా అవి విగ్రహారాధనను కూడా నమ్మలేదు. భక్తి అంటే భగవంతుని పట్ల ఏక దృష్టి, నిరంతర, వల్లమాలిన ఆరాధన అనే అర్థాన్ని స్ఫూరించింది.

మధ్యయుగ భారతదేశ మతచరిత్రలో అత్యంత ముఖ్యమైన ఉద్యమం రామానంద స్థాపించిన ప్రత్యేక పంథా. అతడికి ఇస్లాంపై గణనీయమైన పరిజ్ఞానం ఉండేది. అతడు బహుశా ఇస్లాం మతంతో ప్రభావితమై ఉండవచ్చు. ఆ విధంగా హిందూ తత్వశాస్త్ర సనాతన వాదాన్ని తిరస్కరించిన తొలి వ్యక్తిగా రామానంద చరిత్రలో నిలిచిపోయాడు. ఆ కారణంగా అతడి శిష్యులు అవధూతలుగా మారారు. అయితే అతడి ఆలోచనలో కొన్ని లోపాలు ఉండేవి. ముఖ్యంగా వేదాలను చదివే హక్కును అది దళిత వర్గాలకు నిరాకరించింది. సామాజిక సమానత్వాన్ని ప్రబోధించలేదు. ఆ దిశగా పని చేయలేదు. అతడు చేసిన కృషిలో ప్రధానమైనది సాధారణ భాషను వినియోగించడం. రామానంద ప్రబోధనలు రెండు విభిన్నమైన ఆలోచనా పంథాలను సృష్టించాయి. అతడి కాలంలో ఆవిర్భవించిన రెండు ప్రధాన ఆలోచనా పంథాలు సగుణ, నిర్గుణ. సగుణ పంథా హిందూ మతాన్ని బలోపేతం చేయడానికే కాకుండా వేదాల అధికారాన్ని సంరక్షించడానికి ప్రయత్నించింది. గతంతో వేరుపడాలని అది కోరుకోలేదు. సగుణ ప్రబోధకులలో చైతన్య, శంకరదేవ, సుర్దాస్, మీరాబాయి, తులసిదాస్ తదితరులు ముఖ్యమైనవారు.

కబీర్ ప్రాతినిధ్యం వహించిన మరో ఆలోచనా పంథా నిర్గుణ పంథా. ఏకేశ్వరోపాశసనను ప్రబోధించిన ఈ మత వ్యవస్థ శంకర సిద్ధాంతానికి భిన్నంగా ఉండేది. కుల వ్యవస్థను నిర్మూలించాలని కబీర్ ప్రచారం చేశాడు. వేదాల అధికారాన్ని ప్రశ్నించాడు. ఇస్లాం మత శాస్త్రాల నుండి జ్ఞానాన్ని ఆర్జించడానికి ప్రయత్నించాడు. ఏకీకరణ ఉద్యమాన్ని నిర్మించడానికి కృషి చేశాడు. ఆ దిశగా రామ్, రహీం ఒక్కరేనని ప్రముఖంగా ప్రకటించాడు. నిర్గుణ విచారధారకు చెందిన ఇతర ముఖ్య నాయకులు నానక్, దాదూ దయాళ్, రాయ్‌దాస్ మొదలైనవారు. వ్యవస్థీకృత హిందూ మతాన్ని సంస్కరించడానికి ఈ నాయకులు ప్రయత్నించలేదు. పూజా విధానాన్ని, ఆచారాలను వ్యతిరేకించారు. అలాగే పూజా విధానంపై ఉన్న సాంప్రదాయ చైతన్యాన్ని ప్రజల మది నుండి తప్పించలేకపోయారు. ఈ తత్త్వ వేత్తలు హిందూ, ఇస్లాం సిద్ధాంతాలను (దైవంపై) తిరస్కరించాడు. చివరకు రెండు సిద్ధాంతాలు ఒకేటనని పోల్చి చెప్పారు.

## నిర్గుణ భక్తి సంతులు:

కబీర్ (1398–1518) బ్రాహ్మణ విధవ కుమారుడైన కబీర్ వారణాసిలో ఒక ముస్లిం చేనేత కార్మికుని ఇంట్లో పెరిగి పెద్దవాడయ్యాడు. యోగులు, సంతుల, సూఫీల సహవాసంలో ఎక్కువ కాలం గడిపాడు. ఇస్లాం, హిందూ మత సిద్ధాంతాలను ఒంటబట్టించుకున్నాడు. హిందూ – ముస్లిం ఐక్యత కోసం పోరాడాడు. అల్లాహ్, రాముడు ఒకే దైవం యొక్క రెండు పేర్లని ప్రకటించాడు. దేవుడు మసీదులోకాని, గుడిలోకాని కనిపించడని, అలాగే బనారస్‌లోకాని, మక్కాలోకాని ఉండడని, కేవలం తన భక్తుని హృదయంలో నివాసం ఉంటాడని పేర్కొన్నాడు. ఖురాన్, వేదాలు రెండిటినీ అతడు విస్మరించాడు. ముల్లా, బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని నిరసించాడు. అతడి దైవానికి ఒక స్వరూపం, ఆకారం లేవు (నిర్గుణ). వ్రతాలు, పూజలు, విగ్రహారాధన, సమాధుల ఆరాధనను తీవ్రంగా విమర్శించాడు. కుల విభేదాలను తిరస్కరించాడు. పునర్జన్మ సిద్ధాంతాన్ని కొట్టిపారేశాడు. దైవ సమైక్యతను నొక్కి చెప్పాడు. ప్రేమ ఆరాధన, భక్తి మార్గాన్ని ప్రబోధించాడు. అతడు రచించిన 'బీజక్' అనే గ్రంథంలో అతడి బోధనలు ఉన్నాయి. సరళమైన హిందీ భాషలో రచించిన ఆ గ్రంథం జనావళిని గొప్పగా ఆకర్షించింది. అతడి దోహాలు మతమౌఢ్యం, మత విశ్వాసాలు, ఆచారాలను తీవ్రంగా విమర్శించాయి. దోహాలు జనరంజకమయ్యాయి. నేటికీ వాటిని ప్రజలు తరచూ మననం చేసుకుంటూ ఉన్నారు. ఉదాహరణకు కబీర్ ఇలా పేర్కొన్నాడు: "నేను ఆలయంలో కాని, మసీదులో కాని లేను. అలాగే నేను కాబాలో కాని, కైలాష్‌లోకాని లేను. ఆచారాలు, సాంప్రదాయాల్లో కూడా లేను. యోగ్, త్యాగం (భౌతిక సౌకర్యాల)లో కూడా లేను. ప్రతి ఇంటిలోనూ దీపం వెలుగుతుంది. ఓ గుడ్డివాడా! నీవు వాటిని చూడలేవు. నీ ప్రభువు నీ చెంతనే ఉన్నాడు. అయినప్పటికీ నీవు అతడిని చూడడానికి తాటి చెట్టును ఎక్కుతున్నావు." హిందూ, ఇస్లాంల మధ్య సయోధ్యకు కృషి చేసిన మొదటి వ్యక్తి కబీర్. సర్వజనీన పథాన్ని అతడు ప్రబోధించాడు. ఆ పథంలో ఇరువురూ (హిందూ, ముస్లింలు) పయనించవచ్చని చెప్పాడు. అతడి బోధనలు ప్రజలపై గాఢమైన ప్రభావం చూపాయి. అతడికి అనేకమంది

అనుచరులు తయారయ్యారు. వారంతా కబీర్ పంథీలుగా పిలవబడ్డారు. అతడి అనుచరుల సంఖ్య ఇక్కడ ప్రధానం కాదు. పంజాబ్, గుజరాత్, బెంగాల్ తదితర ప్రాంతాలకు అతడి బోధనల ప్రభావం విస్తరించింది. మొగల్ పాలనలో ఆ ప్రభావం విస్తరిస్తూ పోయింది. ఇదే ఇక్కడ ముఖ్యమైన అంశం.

**ఇతర ఏకేశ్వరోపాసకులు:** కబీర్‌తో పాటు రామానందకు మరో నలుగురు ప్రముఖ శిష్యులు ఉండేవారు. ధన్న, పీపా, సెయిన్, రాయ్‌దాస్‌లు. వారు రచించిన కొన్ని భక్తిగీతాలు సిఖ్‌ల ఆదిగ్రంథ్‌లో పేర్కొనబడ్డాయి. వృత్తిరీత్యా చర్మకారుడైన రాయ్‌దాస్ నిర్గుణ ఆలోచనా పంథా ప్రబోధకుడిగా మారాడు. అతడి బోధనలను సేకరించి ప్రత్యేక గ్రంథంగా ప్రచురించారు. అతడి గీతాలు భక్తితో నిండి ఉండేవి. అందులో మానవత్వం స్ఫూరిస్తుంది. కబీర్‌లాగా అతడు ఇతరుల మతవిశ్వాసాలను నిరాకరించలేదు.

అహ్మదాబాద్ వాస్తవ్యుడైన దాదూ దయాళ్ (1544–1603) తన జీవితాన్ని ఎక్కువ కాలం రాజస్థాన్‌లో గడిపాడు. నిర్గుణ పంథాను ప్రచారం చేసిన వారిలో అతడు ముఖ్యమైనవాడు. కబీర్ వలె అతడు కుల వ్యవస్థను వ్యతిరేకించాడు. సర్వజనీన మతాన్ని ప్రబోధించాడు. భగవంతుని పట్ల ప్రేమ ఆరాధన భావాలను పెంపొందించాడు. హిందూ–ముస్లిం ఐక్యత కోసం పాటుపడ్డాడు. ఇరు మతస్తుల మధ్య ఐక్యత ఉండాల్సిన అవసరాన్ని పదేపదే నొక్కి చెప్పాడు. “హిందూ లేదా ముస్లిం హృదయాలలో ఒకే ఒక్క ఆత్మ ఉంటుంది. ఓ అల్లాహ్ రామ్! నా భ్రమలు తొలగిపోయాయి. హిందూ, ముసల్మాన్ మధ్య ఎలాంటి తేడా లేదు”. దాదూ బ్రజ్ భాషలో 5000కు పైగా పద్యాలను రచించాడు. మతానికి సంబంధించిన విభిన్న అంశాలపై ఆ పద్యాలు వివరణ ఇస్తాయి.

సుందర్‌దాస్ (1596–1689) దాదూ శిష్యుడు. భక్తి సందేశాన్ని అతడు వ్యాపింపచేశాడు. సంస్కృత, పార్సీ తదితర భాషలలో అతడు పండితుడు. అతడు రచించిన సుందరవిలాస హిందువుల తాత్విక వ్యవస్థలను వివరిస్తోంది. నిర్గుణ పంథాను ప్రచారం చేసిన వారిలో మాయిక్‌దాస్ (1574–1682), సంగనేర్ రజ్జాబ్ (1567–1683), ధరణిదాస్ (1656 జననం), షాహాబాద్‌కు చెందిన దర్యా సాహెబ్ (1674–1780)లు ఉన్నారు.

**సిఖ్ మతం, సిఖ్ గురువులు:**

**గురునానక్ (1469–1539) :** కబీర్ సమకాలీకుడు గురునానక్. అతడు సిఖ్ మతాన్ని స్థాపించాడు. నానక్ జీవితాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. తొలి భాగంలో 30 ఏళ్ల పాటు అతడు గృహస్తునిగా తాల్వండి, సుల్తాన్‌పూర్‌లలో గడిపాడు. రెండవ భాగంలో 22 ఏళ్లు ప్రచార యాత్రలలో గడిపాడు. మూడవ, చివరి భాగంలో 18 ఏళ్లపాటు అతడు తన అనుచరుల సౌకర్యార్థం కర్తార్‌పూర్‌లో బసచేశాడు. ధర్మశాలలనే పూజా మందిరాలను అతడు స్థాపించాడు. ఎక్కడికి వెళ్లినా పేదలకు విరాళాలందించి, సేవ చేయాలని అతడు ప్రజలను కోరాడు.

పశ్చిమ పంజాబ్‌లోని షేక్‌పుర జిల్లా తాల్వండి (నన్కానా సాహెబ్) వద్ద ఖత్రీ కుటుంబంలో అతడు జన్మించాడు. 18వ ఏట అతడు పెళ్లి చేసుకున్నాడు. అతడికి ఇద్దరు కుమారులు కలిగారు. తొలుత తన బావమరిది జయ్‌రామ్ (దీవాన్)తో కలిసి నవాబ్ దౌలత్‌ఖాన్ లోధికి సేవలందించాడు. తన 30వ ఏట ప్రపంచ సుఖాలను త్యాగం చేసి ఫకీరుగా మారాడు. దేశమంతటా పర్యటించాడు. చివరికి మధ్య ఆసియా, అరేబియాలలో కూడా పర్యటించినట్లు కొందరు భావిస్తారు. తన 70వ ఏట కర్తార్‌పూర్ వద్ద మరణించాడు. తన మరణం దగ్గరలో ఉందని గ్రహించిన నానక్ తన శిష్యులను పరీక్షించి గురుత్వాన్ని గురు అంగద్‌కు అప్పగించాడు.

కుల వ్యవస్థ, సాంప్రదాయవాదం, బ్రాహ్మణ, ముల్లాల ఆధిపత్యాన్ని నానక్ ధిక్కరించాడు. విగ్రహారాధనను పూర్తిగా వ్యతిరేకించాడు. దైవ సమైక్యత, మానవాళి సమైక్యత ఈ గురువు యొక్క రెండు మౌలిక సిద్ధాంతాలు. ఇతర ఆధ్యాత్మిక ప్రబోధకుల్లాగా అతడు ఇరు సముదాయాలకు సంబంధించిన కొన్ని మతాచారాలపై తీవ్రంగా దాడి చేశాడు. ముఖ్యంగా సమాధులు, స్మశాన భూముల ఆరాధన, తీర్థయాత్రలు, వ్రతాలు, సతి తదితర ఆచారాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. ఇలాంటి ఆచారాలను విడనాడి వాటి స్థానంలో భగవంతుడు, అతడు సృష్టించిన జీవుల పట్ల ప్రేమను పెంచుకోవాలని తన అనుచరులకు సలహా ఇచ్చాడు. అయితే గురునానక్ కర్మ సిద్ధాంతాన్ని నమ్మాడు. అలాగే జీవాత్మల వలస సిద్ధాంతాన్ని కూడా విశ్వసించాడు. హిందువులు, ముస్లింలిద్దరూ అతడి అనుచరులుగా మారారు.

మనుషులందరూ సమానమేనని అతడు ప్రబోధించాడు. హిందువులు, ముస్లింలపట్ల ఒకే రీతిలో వ్యవహరించాడు. వారి ముఖ్యమైన ఆలయాలు, మసీదులకు వెళ్లాడు. ఆధ్యాత్మిక జీవితానికి సరైన మార్గాన్ని వారికి వివరించాడు. కుల వ్యవస్థను, సంబంధిత విభేదాలను అతడు వ్యతిరేకించాడు. గృహస్త జీవితం గడపాలని సూచించాడు. సన్యాసం పలాయన వాదమని చెప్పాడు. మానవుడు తన భౌతిక విధులను నిర్వహించాలని, అదే సమయంలో భౌతికపరమైన సుఖాలకు దూరంగా ఉండాలని బోధించాడు. నానక్ బోధనలను ఐదవ గురువు అర్జున్‌దాస్ (1563–1604) సంకలించి ఆది గ్రంథ్‌లో చేర్చాడు.

**గురు అంగద్ (1504–52) :** తొలుత లినా అనే పేరు కలిగిన అంగద్ గురునానక్ ప్రవేశపెట్టిన గురుముఖి లిపిని జన ప్రియం చేశాడు. అన్ని వర్గాల ప్రజలు గురుముఖిని నేర్చుకునేలా ప్రోత్సహించి విద్యపై బ్రాహ్మణులకు ఉన్న ఆధిపత్యాన్ని తెరదించాడు. సామాన్య ప్రజలు కూడా మత సాహిత్యాన్ని చదవడం మొదలు పెట్టారు. భాయి బాలా నుండి గురు నానక్ జీవిత విశేషాలను సేకరించి గురునానక్ దేక్ జీవిత కథను రాశాడు. సిఖ్ మత సిద్ధాంతాల వ్యాప్తికి మత కేంద్రాలను స్థాపించాడు. గురు అంగద్ లంగర్ సేవను (ఉచిత భోజనాలు) విస్తరించాడు. భోజన ఏర్పాట్లు వడ్డింపును స్వయంగా పర్యవేక్షించాడు. కుల విభజనలు, సామాజిక వివక్షను నిర్మూలించడానికి లంగర్ ఒక వేదికగా మారింది. సమానత్వంపై గురు అంగద్ ఎన్నో ప్రబోధనలు చేశాడు. “పింగాణి నుండి వివిధ రూపాలున్న పాత్రలు తయారవుతాయి. అయితే పింగాణి ఒక్కటే. అలాగే మనుషుల దేహాలు కూడా పంచభూతాలతో

నిర్మాణమవుతాయి. అలాంటపుడు ఒకరు ఉన్నత, మరొకరు నిమ్న వర్గం ఎలా అవుతారు"? ఖదూర్ వద్ద గురు అంగద్ సేవా, దయార్ద్ర భావంతో జీవితం గడిపాడు. ఇక్కడ అమర్ దాస్ (అంగద్ బంధువు అతడికి రేయింబవళ్లు సేవ చేశాడు. గురు తన కుమారులను కాదని అమర్‌దాస్‌ను 1552లో తన వారసునిగా నియమించాడు.

**గురు అమర్‌దాస్ (1479–1574) :** తన నిస్వార్థ సేవ కారణంగానే 73వ ఏట అమర్‌దాస్ మూడవ గురువయ్యాడు. సిఖ్ మత విస్తరణకు అతడు ఎనలేని ప్రాధాన్యతనిచ్చాడు. ప్రతి ప్రాంతానికి ఒక నిస్వార్థ భక్తుడిని బాధ్యుడిగా నియమించాడు. అలాంటి భక్తుల సంఖ్య 22 వరకు ఉండేది. సంచార మత ప్రచారకులను (మస్సంద్‌లు) కూడా తయారుచేశాడు. వీరు దేశంలోని ఇతర ప్రాంతాలలో మత ప్రచారం నిర్వహించారు. సిఖ్‌ల సంగమానికి అతడు మూడు ముఖ్యమైన పండుగలను నిర్ధారించారు. దివాలీ, బైసాకీ, మాఘి. ఈ వేడుకలు మత సదస్సులుగా ఉపయోగపడ్డాయి. చక్రవర్తి అక్బర్‌తో గురు అమర్‌దాస్‌కు సన్నిహిత సంబంధాలుండేవి. గోయింద్వల వద్ద అమర్‌దాస్ ఆశీస్సులను అందుకునేందుకు అక్బర్ స్వయంగా విచ్చేశాడని చెబుతారు. సిఖ్ మత సర్వజనీనత, లంగర్ సేవ పట్ల చక్రవర్తి బాగా ఆకర్షితుడయ్యాడు. గురునానక్ అడుగు జాడల్లో నడుస్తూ అమర్‌దాస్ తన శిష్యులను పరీక్షించిన తర్వాతే వారసుడిని ఎంపిక చేశాడు. తన అల్లుడు ఖాయి జేథాలో అతడికి ఒక త్రికరణ శుద్ధిగల, అణుకువగల సిఖ్ కనిపించాడు. కనుక అతడిని 1574లో గురు రామ్‌దాస్ పేరుతో మత పీఠంపై కూర్చోబెట్టాడు.

**గురు రామ్‌దాస్ (1543–81):** తన 40వ ఏట రామ్‌దాస్ నాల్గవ గురువయ్యాడు. మత వ్యాప్తి కార్యక్రమాన్ని నిర్దిష్టంగా నిర్వహించాడు. ఉత్తర భారతంలోని వివిధ ప్రాంతాలకు మస్సంద్‌లను పంపారు. సిఖ్‌లకు సరైన పూజా నిలయాన్ని ఇవ్వాలని అతడు ఆసక్తి చూపాడు. భూస్వాముల నుండి కొనుగోలు చేసి భూమిని అభివృద్ధి పరచి రామ్‌దాస్‌పూర్ అనే కొత్త పట్టణాన్ని స్థాపించాడు. కొత్త పట్టణంలో ఎందరో సిఖ్‌లు స్థిరపడ్డారు. ఎందుకంటే అది వ్యాపార మార్గాల మధ్యలో ఉండేది. ఆ నగరాన్ని తర్వాతి కాలంలో అమృత్‌సర్ అని పిలిచారు. గురు సిఖ్‌ల వివాహ వేడుకల కోసం ఒక ప్రత్యేక ప్రార్థనా గీతాన్ని రచించాడు. అలాగే విభిన్న వేడుకలు, పూజలకు కూడా గీతాలను రచించాడు. గొప్ప సంగీతకారుడు కావడం వల్ల అతడు 11 కొత్త రాగాలలో భక్తి గీతాలను స్వరపరిచాడు. తన కుమారులను పరీక్షించి చివరివాడైన అర్జన్‌ను 1581లో ఐదవ గురుగా నియమించాడు.

**గురు అర్జన్ (1563–1606):** గురుగా నియమితుడైనపుడు అర్జన్ యుక్తవయస్సులో ఉన్నాడు. అమృత్‌సర్‌ను సిఖ్‌ల పారిశ్రామిక, సాంస్కృతిక నగరంగా తీర్చిదిద్దాడు. ముస్లిం మత పెద్ద మియా మీర్‌ను హర్ మందిర్‌కు శంకుస్థాపన చేయాలని విజ్ఞప్తి చేశాడు. చుట్టూ ఉన్న భూముల కంటే దిగువన ఉన్న ప్రాంతాలలో ఒక అందమైన సరస్సు మధ్యలో ఆ మందిరాన్ని నిర్మించారు. ఈ మందిరాన్ని ఇపుడు స్వర్ణ దేవాలయంగా పిలుస్తారు. తొలి నలుగురు గురువులు, ఇతర భారతీయ సంతుల భక్తి గీతాలను అర్జన్ సేకరించాడు. తన

సొంత గీతాలతో సహా ఇతరుల గీతాలను భాయి గురుదాస్‌కు అప్పగించి ఆది గ్రంథ్ సంకలాన్ని పూర్తిచేశాడు. (1604). గురు అర్జున్‌కు పెరుగుతున్న ప్రతిష్ట, ప్రాబల్యం స్థానిక దీవాన్ చందులో అసూయ పుట్టించింది. విపరీతమైన ద్వేషంతో అతడు జహంగీర్‌కు చాడీలు చెప్పాడు. ఫలితంగా జహంగీర్ ఆది గ్రంథ్‌ను మార్చి మహమ్మద్ ప్రవక్త కీర్తనను చేర్చాలని గురు అర్జన్‌ను ఆదేశించాడు. అయితే ఆది గ్రంథ్‌ను మార్చడానికి అర్జన్ నిరాకరించడంతో జహంగీర్ అతడిని చందు నిర్బంధంలో ఉంచాడు. చందు అతడిని తీవ్రంగా హింసించి నదిలో విసిరివేశాడు. ఆ విధంగా గురు అర్జున్ సిఖ్‌ల చరిత్రలో తొలి అమరవీరుడయ్యాడు.

**గురు హర్‌గోబింద్ (1595–1644):** సైన్యాన్ని సమీకరించాలని తన తండ్రి ఇచ్చిన సలహా మేరకు ఈ ఆరవ గురు సైనికులను చేరదీసి వారికి యుద్ధ తంత్రంలో శిక్షణ ఇప్పించాడు. కొందరు చరిత్రకారులు ఈ పరిణామాన్ని సైనిక మతరాజ్యానికి నాంది వాచకంగా పిలుస్తారు. జహంగీర్ అతడిని గ్వాలియర్ కోటలో నిర్బంధించాడు. తనను విడుదలచేస్తూ ఆదేశాలు వెలువడినా కోటను వదలివెళ్లడానికి హర్‌గోబింద్ నిరాకరించాడు. తనతోపాటు నిర్బంధంలో ఉన్న ఇతర భారతీయ రాకుమారులను కూడా విడుదల చేస్తే కాని తాను అక్కడి నుండి కదలనని గట్టిగా చెప్పాడు. ఈ సంఘటన తర్వాత గురును "బందీఛోడా"గా (గొప్ప విముక్తిదారుడు) పిలిచారు. అతడు మొగల్‌లతో మూడు ప్రధాన యుద్ధాలు చేశాడు. ఈ యుద్ధాలన్నింటిలోనూ అతడు విజయం సాధించడంతో సిఖ్‌లలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఈ పరిణామాలవల్ల సిఖ్ మతం అతివాద పంథాలో పయనించడం మొదలుపెట్టింది. గురు రెండు ఖడ్గాలను ధరించాడు. ఒకటి ఆధ్యాత్మిక శక్తి (పీరి)ని ప్రతిబింబిస్తే మరొకటి సైనిక శక్తిని సూచించింది (మీరి). ఆత్మరక్షణ, న్యాయం కోసం ఖడ్గాన్ని ధరించడం గురు అనుచరులలో ఒక ఆచారంగా మారిపోయింది. 1644లో హర్‌గోవింద్ తన వారసునిగా గురు హర్ రాయ్‌ను నియమించాడు.

**గురు హర్‌రాయ్ (1630–61):** గురు హర్ గోబింద్ మనవడైన హర్‌రాయ్ 14 ఏళ్ల వయస్సులో ఏడవ గురుగా బాధ్యతలు చేపట్టాడు. అయితే అతడు శాంతి, ప్రేమానురాగాలను కోరుకున్నాడు. సంగత్‌కు సేవ చేయడం అతడికి అత్యంత ఇష్టమైన పని. గురు గ్రంథ్ సాహెబ్ గీతాలతో ధ్యానం చేస్తూ స్వీయ క్రమశిక్షణ గల జీవితాన్ని గడపాలని తన అనుచరులకు బోధించాడు. గొప్ప మానవత్వం, దయాగుణం గల హర్‌రాయ్ అపర కర్ణుడిగా ఖ్యాతి గడించాడు. తన భక్తులంటే అతడికి వల్లమాలిన ప్రేమ. కష్టాల్లో ఉన్న భక్తులను ఆదుకునేవాడు. తన మరణం దగ్గరలో ఉందని గ్రహించిన హర్ రాయ్ తన ఐదేళ్ల కుమారుడు హర్‌కిషన్‌ను 1661 అక్టోబర్‌లో తదుపరి గురువుగా నియమించాడు.

**గురు హర్‌కిషన్ (1656–1664) :** ఈ ఎనిమిదవ గురును 'బాల గురు'గా గుర్తిస్తారు. చిన్నారులు, విద్యార్థులకు ఈ గురు అంటే ఎంతో ఇష్టం. తన చిన్న వయస్సులోనే ఈ గురు అపారమైన మేధాను ప్రదర్శించాడు. అతడి పెద్దన్న రామ్ రాయ్ చక్రవర్తి ఔరంగజేబ్‌కు వారసత్వంపై ఫిర్యాదు చేశాడు. గురుహర్‌రాయ్ ప్రథమ కుమారుడిగా తనకే వారసత్వ హక్కు

ఉందని వాదించాడు. చక్రవర్తి గురుహర్‌కిషన్‌ను ఢిల్లీకి పిలిపించాడు. అందుకు ప్రతిస్పందనగా గురు ఢిల్లీ వెళ్లి రోగులను నయం చేసే తన ఆశయాన్ని ప్రారంభించాడు. నేటి గురు ద్వారా బంగ్లా సాహెబ్ ఉన్న చోటే గురు నివసించాడు. అనతి కాలంలోనే అతడు అనారోగ్యం పాలయ్యాడు. వారసుడు ఎవరని ప్రశ్నించగా అతడు ఠక్కున సమాధానమిచ్చాడు. "బాబా బకాలే" తదుపరి గురు బకాలా అనే గ్రామంలో కనిపించగలడని అతడి మాటల అర్థం. మార్చి 1664లో అతడు మరణించాడు.

**గురు తేగ్ బహదుర్ (1621-75):** గురు తేగ్ బహదుర్ జీవితాన్ని మూడు కాలాలుగా విభజించవచ్చు. తొలి 23 ఏళ్ల కాలంలో అతడు తన తండ్రితో అమృత్‌సర్‌లో గడిపాడు. రెండవ కాలంలో 19 ఏళ్లపాటు ఒకలా వద్ద సుదీర్ఘ ధ్యానం చేశాడు. మూడవ కాలంలో 11 ఏళ్లపాటు తూర్పు ప్రాంతాలలో, తర్వాత పంజాబ్‌లో విస్తృతంగా పర్యటించాడు. చక్రవర్తి ఔరంగజేబ్ గురును నిర్బంధించాలని ఆదేశించాడు. ఇస్లాంను స్వీకరించాలని లేదా మహిమను ప్రదర్శించాలని చెప్పాడు. అందులో ఒక్క పని చేయడానికి కూడా గురు నిరాకరించాడు. గురును హతమార్చాలని ఔరంగజేబ్ ఆదేశించాడు. నేడు గురుద్వారా రకబ్‌గంజ్ (ఆనంద్‌పూర్) ఉన్న చోట అతడి మృతదేహాన్ని ఖననం చేశాడు. గురు తేగ్ బహదూర్ బలిదానం సిఖ్‌ల చరిత్రలో రెండవ అమరవీరత్వం.

**గురు గోబింద్ సింగ్ (1666-1708) :** తన తండ్రి అమరత్వం పొందిన వెంటనే తొమ్మిదేళ్ల వయస్సులో గోవింద్‌సింగ్ సిఖ్‌ల పదవ గురుగా బాధ్యతలు స్వీకరించాడు. నాలుగు విజయాలను సాధించిన ఘనత అతడికి దక్కుతుంది. 1. మొగల్ అధికారాన్ని ఖంగు తినిపించడం, 2. ఖాల్సా పంథ్ ఏర్పాటు 3. సృజనాత్మక సైనిక సాహిత్యాన్ని రూపొందించడం. 4. ఆది గ్రంథ్‌ను గురు గ్రంథ్ సాహెబ్‌గా నియమించి ఆ పవిత్ర గ్రంథాన్ని సిఖ్‌ల శాశ్వత గురుగా ప్రకటించడం. గోబింద్ సింగ్ ద్విముఖ దాడిని ఎదుర్కోవలసి వచ్చిది. ఒకవైపు కొంత ప్రాంత రాజులు, మరోవైపు మొగల్‌సైన్యాలతో పోరాటం చేయాల్సి వచ్చింది. భంగానీ (1687), నదౌన్ (1689) యుద్ధాలలో అతడు విజయం సాధించడంతో కొండరాజుల ప్రాబల్యంతోపాటు మొగల్ సైన్యాల శక్తి కూడా నిర్వీర్యమైంది. స్వాతంత్ర్యం, ధర్మ పరిరక్షణ కోసం అతడు తన నలుగురు కుమారులు, భార్య, తల్లిని త్యజించాడు. ఔరంగజేబుకు పంపిన జఫర్‌నామా అనే లేఖలో చక్రవర్తి ఆగడాలను అతడు కవితా శైలిలో బహిర్గతం చేశాడు. మస్సంద్‌ల వ్యవస్థను అతడు రద్దుచేశాడు. మత ప్రచారకుల దుశ్చర్యల కారణంగానే ఆ వ్యవస్థను భంగం చేశాడు. వ్యక్తిగత గురుత్వాన్ని కూడా రద్దుచేశాడు. గురు గ్రంథ్ సాహెబ్‌ను శాశ్వత గురుగా ప్రకటించాడు. 1699లో ఖాల్సా పంథ్‌ను ఏర్పాటు చేయడం అతడు సాధించిన మరో గొప్ప విజయం. నిమ్న వర్గాలలో బలహీనులు పీడితులుగా ఉన్న వారిని సైనికులుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనను అతడు రూపొందించాడు. 1708లో ఇద్దరు పఠాన్‌లు చేసిన గాయంతో బాధపడుతూ అతడు మరణించాడు. నాందేడ్ వద్ద గురు పరమ పదించిన స్థలంలో మహారాజ రంజీత్ సింగ్ తర్వాతి కాలంలో గురుద్వారా అబ్చల్ నగర్‌ను నిర్మించాడు.

**బందా సింగ్ (1670–1716):** జమ్మూలోని రజౌరీ వద్ద జన్మించిన ఈ సిఖ్‌ల నేత తొలుత లచ్మన్‌దేవ్‌గా పిలవబడ్డాడు. తర్వాత అతడు ఆధ్యాత్మిక పురుషునిగా మారాడు. మాధో దాస్ అనే పేరును స్వీకరించాడు. నాందేడ్‌లో స్థిరపడ్డాడు. 1708 సెప్టెంబర్‌లో అతడు గురు గోబింద్‌సింగ్ శిష్యుడుగా మారి గురు ఆశీస్సులను కోరాడు. బ్రహ్మచారిగా ఉండి సత్యాన్ని పలుకుతూ సత్యాన్ని ఆచరిస్తూ ఖాల్సా పంథ్‌కు సేవ చేస్తూ అణుకువగా మెలుగుతూ స్వంత పంథాను ఏర్పాటు చేసి రాజులా పాలించరాదని గోబింద్‌సింగ్ అతడికి హితబోధ చేశాడు.

ఖాల్సా పంథ్ శత్రువులను శిక్షించడానికి బందా పంజాబ్ బయల్దేరి వెళ్లాడు. 1709లో సమనపై దాడి చేశాడు. తర్వాత 1710లో చాపేర్ చిరి వద్ద జరిగిన యుద్ధంలో సర్హింద్ నవాబ్ వజీర్ ఖాన్‌ను హత్య చేశాడు. బందాసింగ్ దండయాత్రలతో కలవరపడిన మొగల్ చక్రవర్తి అతడిని అణచివేయడానికి పెద్ద సైన్యాన్ని పంపాడు. గురుదాస్ నంగళ్ వద్ద బందాసింగ్‌ను మొగల్ సైన్యం చుట్టుముట్టింది. సుమారు ఎనిమిది నెలల ముట్టడి తర్వాత బందా, అతడి అనుచరులను డిసెంబరు 1715లో బందీలుగా పట్టుకున్నారు. 1716 జూన్‌లో వారిని తీవ్రంగా వేధించి చంపివేశారు. మొగల్ ఆధిపత్యానికి బందా విసిరిన సవాలు తరిగిపోయిన మొగల్ సైనిక శక్తిని ప్రతిబింబిస్తుంది. మరో అవకాశం లభించి ఉంటే వారు సిఖ్ సామ్రాజ్యానికి పునాదులు వేసి ఉండేవారు. ఆ అవకాశం 1799లో వచ్చింది. అప్పుడు రంజీత్‌సింగ్ పంజాబ్‌లో సిఖ్‌ల పాలనను స్థాపించాడు.

## దక్షిణ భారత వైష్ణవ సంతులు:

దక్షిణ భారత వైష్ణవ పునరుద్ధరణ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచిన సంతులలో రామానుజ ఒకడు. అతడు సనాతన వాద హిందువు. మోక్షానికి జ్ఞానమే ఏకైక మార్గమని సూత్రీకరించిన శంకర్‌తో అతడు విభేదించాడు. రామానుజ ప్రకారం జ్ఞానం కేవలం ఒక మార్గం అయితే అదే నిర్దిష్టమైన పంథా కాదు. ప్రేమ ఆధారంగా భగవంతునితో స్వచ్ఛమైన సంబంధం ఏర్పరచుకోవాలని అతడు ప్రబోధించాడు. ఈ సంబంధంలో వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రొటెస్టెంట్ పంథాను తలపిస్తుంది. హిందూ మతశాస్త్రం, ఆరాధన వర్గం మధ్య సక్రియమైన వారధిగా రామానుజ వ్యవహరించాడు. రెండు భిన్నమైన పంథాలను కలపడానికి ప్రయత్నించాడు.

మాధవ 13వ శతాబ్దానికి చెందిన సంతు అతడు కన్నడలో ప్రబోధించాడు. ఆరాధన మార్గాన్ని హిందూ మత శాస్త్రంతో మేళవించడానికి అతడు తదుపరి ప్రయత్నాలు చేశాడు. మాధవ కూడా వైష్ణవుడే. అతడి విష్ణు సిద్ధాంతానికి రామానుజ విచారధార స్ఫూర్తినిచ్చింది. భారతదేశానికి వచ్చిన తొలి క్రైస్తవ మిషనరీ సెయింట్ థామస్ ప్రభావం అతడిపై ఉండవచ్చని భావిస్తారు. మాధవ ప్రకారం విష్ణు తన కుమారుడు వాయుదేవుడు ద్వారా తన భక్తులపై కృపను ప్రసరిస్తాడు. ఈ ఆలోచన హిందూ పురాణాలకు పూర్తిగా విరుద్ధమైనది. అయితే క్రైస్తవ మత పవిత్ర ఆత్మను పోలి ఉంది.

అగ్రవర్ణాలకు ప్రత్యేక హోదా, హక్కులను ఆమోదిస్తూనే సూద్రులను ఆలయ పూజల నుండి దూరంగా ఉంచడాన్ని రామానుజ, మాధవలు వ్యతిరేకించారు. సూద్రులకు ఆలయ ద్వారాలు తెరవాలని వారు ఎంతగా విన్నవించుకున్నప్పటికీ ఫలితం దక్కలేదు. భక్తి ఉద్యమాల స్థాయి పెరగడం, వాటిని హిందూ మత శాస్త్రంతో ముడిపెట్టడానికి పై ఇద్దరు సంతులు ప్రయత్నించడం కొంత ప్రభావాన్ని చూపించింది. సనాతనవాదులు రాజీ బేరానికి రాక తప్పలేదు. సూద్రులకు ఆలయ ద్వారాలు తెరవనప్పటికీ చిన్న పంథాల దైవాలను, సాంప్రదాయాలను వారు ఆమోదించారు. అవి క్రమంగా ఆలయ పరిసరాలలోకి ప్రవేశించాయి. ఆలయం సామాజిక, మతపర జీవితానికి కేంద్రంగా కొనసాగాలంటే ఇలాంటి అనివార్య ప్రక్రియ తప్పనిసరి అయ్యింది. ఈ తొలి వైష్ణవ ఉద్యమాలు తర్వాతి కాలంలో దేశంలోని అన్ని ప్రాంతాలలో భక్తి ఉద్యమాలకు బాటలు వేశాయి. ముఖ్యంగా 15, 16వ శతాబ్దాలలో భక్తి ఉద్యమాలు బలోపేతమయ్యాయి.

### ఉత్తర భారత సగుణ భక్తి సంతులు:

**శంకరదేవ (1449-1568):** అస్సాంకు చెందిన ఈ గొప్ప మత సంస్కరణవాది భక్తి పంథాను బ్రహ్మపుత్ర లోయతోపాటు కూచ్‌బెహార్ (ఇప్పుడు ఇది పశ్చిమ బెంగాల్‌లో ఉంది)లో కూడా ప్రవేశపెట్టాడు. బ్రాహ్మణేతర భుయన్‌ల కుటుంబంలో జన్మించిన శంకరదేవ వివాహం చేసుకొని ఒక కుమార్తెను పొందాడు. భార్య అకాల మరణం తర్వాత శంకరదేవ యోగిగా మారాడు. బ్రాహ్మణిక మత శాస్త్రాలను అధ్యయనం చేశాడు. చివరగా భక్తి ప్రాముఖ్యతను గ్రహించాడు. సుహంగ్ మంగ్ పాలన (1497-1539)లో అస్సాం త్వరితగతిన హిందూకరణ చెందింది. విష్ణు పట్ల పూర్తి భక్తిభావనను అతడు ప్రబోధించాడు. ఏకేశ్వరోపాసన అతడి సిద్ధాంతం. దానిని ఏక శరణ దర్మ అని పిలిచేవారు. గ్రామాలలో సంధ్యాసమయంలో ఆలాపనకు అతడి భక్తిగీతాలు, ఇతర రచనలు ఎంతో ఉపకరించాయి. సముదాయ ప్రార్థనలు భక్తిగీతాల ఆలాపన, మత శాస్త్రాల పఠనంతో "నాకు ఘర్" అనే ప్రార్థనా స్థానాలలో జరిగేవి. కుల వ్యవస్థను అతడు నిందించాడు. ఎన్నో సత్రాలను నిర్మించాడు. నాకు ఘర్‌లలో అన్ని వర్గాలు, కులాలకు చెందిన ప్రజలు గుమికూడి ప్రార్థనలు నిర్వహించేవారు అలాగే సామాజిక కార్యక్రమాలను కూడా చేపట్టేవారు. మహాపురుషీయ ధర్మ అనే అతడి పంథా అస్సాం ప్రజా జీవితంపై విస్తృత ప్రభావం చూపించింది. తాత్వికంగా మహాపురుషీయులు బెంగాల్ వైష్ణవులకు భిన్నంగా విశ్వాసం ఉంచలేదు. అయితే ఈ ఆచారాన్ని బెంగాల్ వైష్ణవులు కీలకంగా పరిగణించారు. మహాపురుషీయులు రాధను అసలు గుర్తించనే లేదు.

**సుర్దాస్ (1478-1583):** కృష్ణ పంథాకు చెందిన అగ్రశ్రేణి కవి సుర్దాస్. అతడు కవిత్వంలో కృష్ణుని 'బాల లీల' ప్రథమ అంకంగా ఉంది. అతడి దృష్టిలో కృష్ణుడు దివ్య పురుషుడు. బ్రహ్మాండ వ్యవహారాలను అతడు చక్కదిద్దుతాడు. సుర్‌దాస్ కవిత్వంలో ప్రేమ అనే భావన అంతర్లీనంగా కనిపిస్తుంది. కృష్ణుడు, అతడి గోపికల మధ్య ఉన్న ప్రేమను భగవంతుడు - భక్తుని మధ్య ఉండే సంబంధంతో పోల్చాడు. తర్కం కంటే ఆరాధనకే అతడు

ప్రాధాన్యతనిచ్చాడు. ఎన్నో అద్భుతమైన, సుందరమైన కవితలలో ఈ సందేశాన్ని అందించాడు. సుర్‌సాగర్ అనే గొప్ప రచన కృష్ణుడి జీవిత కథ, కృష్ణుడి జననం నుండి అతడు మధురకు బయల్దేరే వరకు ఈ కథ కొనసాగుతుంది.

**చైతన్య (1486-1533):** భక్తి ఉద్యమానికి చెందిన ఈ గొప్ప ప్రచారకుడు కృష్ణుడి భక్తుడు. తన 24వ ఏట అతడు ప్రపంచాన్ని త్యజించాడు. దేశమంతటా పర్యటించి సంతులు, ఫకీర్లను కలుసుకున్నాడు. వివిధ పుణ్యక్షేత్రాలకు తీర్థయాత్ర జరిపాడు. చివరగా పూరీలో స్థిరపడి అక్కడే 1533లోమరణించాడు. ప్రేమ, ఆరాధనే చైతన్యుడి మతం. భక్తి ద్వారా భగవంతుడిని తెలుసుకోవాలని అతడి సిద్ధాంతం చెబుతుంది. "కృష్ణుడు సర్వోన్నత దైవం – అతడి పట్ల భక్తిని పూర్తి ఆరాధన, ప్రేమతో చాటుకోవాలి". కుల వివక్ష, బ్రాహ్మణిక సాంప్రదాయాలను అతడు వ్యతిరేకించాడు. మనుషుల పట్ల ప్రేమానురాగాలు కల కృష్ణుని ప్రార్థించడానికి అందరూ అర్హులేనని చెప్పాడు. కృష్ణుడి ప్రేమిక రాధ. ఆమె భగవంతుడిని చేరుకోవాలన్న భక్తుడి తాపత్రయానికి ప్రతీక. చైతన్య భక్తులలో చాలా మంది దళిత వర్గాలకు చెందినవారు. వారిలో ముస్లింలు  కూడా కొందరు ఉన్నారు. చైతన్య తర్వాత అంతటి పెద్ద ప్రచారకుడు హరిదాస్ ఒక ముస్లిం. బెంగాల్‌లో ఆలోచనా విధానంపై చైతన్య లోతైన ప్రభావం చూపాడు. అనతి కాలంలోనే వైష్ణవ వాదం ప్రధాన మత ఉద్యమంగా మారింది.

**మీరాబాయి (1498-1546):** మెర్తా వద్ద రావ్ రతన్ సింగ్‌కు జన్మించిన మీరాను రాణా సంగా పెద్ద కుమారుడు భోజ్‌రాజ్‌తో వివాహం జరిపించాడు. అయితే పెళ్లి అయిన ఏడేళ్లలోపే ఆమె భర్త మరణించాడు. తన మరిది అయిన విక్రమ్ సింగ్ నుండి ఆమె ఆనేక కష్టాలను ఎదుర్కొంది. రాణా సంగా మరణం తర్వాత విక్రమ్ సింగ్ పాలనా బాధ్యతలు చేపట్టాడు. అప్పటి నుండి మీరాను వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టాడు. బాల్యం నుండే మీరా కృష్ణుని భక్తురాలు. ప్రేమ, ఆరాధనతో నిండిన ఆమె గీతాలు రాజస్థానీ లేదా బ్రజ్ భాషలో రచించబడ్డాయి. వాటిని ఉత్తర భారతంలో భక్తులు ఆలపిస్తారు. జీవితంలోని అన్ని కార్యకలాపాలలో కృష్ణుడు దర్శనమిస్తాడని మీరా ప్రగాఢ విశ్వాసం. ఆమె కవిత్వంలో కనిపించే ప్రేమ స్వరూపం కృష్ణుడిని తన ప్రియునిగా, నిజమైన భర్తగా పరిగణిస్తుంది.  మీరా కబీర్‌లాగా సంస్కరణవాది కాదు, ప్రచారకులు అంతకంటే కాదు. అలాగే తులసీదాస్‌వలె ఆమె ఒక ప్రత్యేక ప్రపంచ దృష్టి కోణాన్ని ముందుంచలేదు. ఆమె భక్తి సిద్ధాంతాలన్నింటినీ ఆమోదించి వాటిని జీవితమంతా పొల్లుపోకుండా ఆచరించింది.

**తులసిదాస్ (1532-1623) :** రామచరిత మానస్ అనే గొప్ప గ్రంథాన్ని రచించిన ఈ మహాకవి గొప్ప భక్తుడు కూడా. అతడి గ్రంథాలను కోట్లాది మంది హిందువులు దేశ వ్యాప్తంగా చదువుతారు. రామచరిత మానస్‌ను 'ప్రాంతీయ గీత'గా పరిగణిస్తారు. రాముని సిద్ధాంతాలను అతడి పదాలు నలువైపులా వ్యాపింపచేస్తాయి. రాముడిని భగవంతుని అవతారంగా అతడు చిత్రీకరించాడు. మానవుడు కేవలం భక్తి లేదా ఆరాధన ద్వారానే భగవంతుని చేరుకోగలడని అతడు నమ్మాడు.

**మహారాష్ట్ర ధర్మ :** శివాజీ నాయకత్వం ఆవిర్భవించిన తర్వాత 16, 17వ శతాబ్దాలలో మరాఠాలు తొలిసారిగా భారత రాజకీయ చరిత్రలో దర్శనమిచ్చారు. మరాఠాల ఆధిపత్యానికి బాటలు వేసిన వివిధ కారణాలలో మతపరమైన చైతన్యం ప్రధానమైనది. "మరాఠా అంశాన్ని" ఈ చైతన్యం లేవదీసింది. అప్పటి మత సంస్కర్తలు రాజకీయ లక్ష్యాలను కూడా ప్రబోధించారు. మహారాష్ట్రలో మత, రాజకీయ పోరాటాల మధ్య సమీప సంబంధం ఉండాలని మరాఠాలు నొక్కి చెప్పారు. ఆ దిశగా ఉద్యమించారు. మహారాష్ట్రలో భక్తి ఉద్యమం విస్తరించడం మరాఠాల ఐక్యమత్యాన్ని సూచిస్తుంది. మహారాష్ట్ర ధర్మ అంటే ఉదారవాద మతం. అందులో కుల విభేదాలు ఉండవు. వివక్ష ఉండదు. మహిళల సామాజిక, రాజకీయ హోదాను ఆ ధర్మం పెంచింది. సాంప్రదాయాల స్థానంలో భక్తిని ప్రధాన సూత్రంగా ముందుంచింది. బహు దైవాల ప్రార్థనను నియంత్రించింది. జ్ఞానేశ్వర్, నామ్‌దేవ్, ఏక్‌నాథ్, తుకారామ్, సమర్థ రామ్‌దాస్‌లు ఈ ధర్మానికి నాయకత్వం వహించారు.

ఉత్తర భారతానికి సమాంతరంగా మహారాష్ట్రలో భక్తి ఉద్యమం సాగింది. దాని కీలక కేంద్రం పండ్‌హార్‌పూర్. అక్కడ ప్రసిద్ధమైన విఠోభా లేదా విఠల్ దేవాలయం ఉంది. జ్ఞానదేవ్‌గా కూడా పిలవబడే జ్ఞానేశ్వర్ తండ్రి విఠల్ పంత్ రామానంద శిష్యుడు. మహారాష్ట్రలో భక్తి ఉద్యమానికి తొలి నాయకుడు జ్ఞానేశ్వర్. చాలా యుక్త వయస్సులో అతడు "జ్ఞానేశ్వరీ" అనే గ్రంథాన్ని రాశాడు. భగవత్‌గీతపై మరాఠిలో వ్యాఖ్యానమే ఆ గ్రంథం. అనంతరం అమృతానుభవ అనే గ్రంథాన్ని రచించాడు. అతడి అభంగాలు లేదా సాహిత్య పద్యాలు ఆరాధన అనుభూతులను వివరిస్తాయి. నామ్‌దేవ్ వృత్తిదారుల కుటుంబానికి చెందినవాడు. దోపిడీదారునిగా, హంతకునిగా అతడికి భయంకరమైన నేపథ్యం ఉంది. అయితే అనతికాలంలోనే అతడు అపర భక్తునిగా మారాడు. అతడు నిర్గుణ భక్తిని అనుసరించాడు. అతడు రచించిన అభంగాలలో కొన్నింటిని గురు గ్రంథ్ సాహిబ్‌లో కూడా చేర్చారు. ప్రముఖుడైన భానుదాస్ మనవడే ఏక్‌నాథ్. తన 12వ ఏట అతడికి జ్ఞానోదయం అయ్యింది. కుల విభజనను అతడు పూర్తిగా వ్యతిరేకించాడు. నిమ్న కులాల వారిపై ప్రగాఢ సానుభూతి చూపాడు. ఎన్నో అభంగాలను రచించాడు. అతడి భజనలు, కీర్తనలు బాగా ప్రాచుర్యం పొందాయి. భగవత్‌గీతపై ఎన్నో వ్యాఖ్యానాలు రాశాడు.

ఇద్దరు గొప్ప సంతులు తుకారామ్, సమర్థ్ రామ్‌దాస్‌లు శివాజీ కాలంలో జీవించారు. పూణే సమీపంలోని దేహూ నుండి తుకారామ్ వచ్చాడు. అతడికి వ్యవసాయ భూమి, నిత్యావసర సరుకుల దుకాణం ఉండేవి. అయితే సామాన్య గృహ జీవితం అతడికి సంతృప్తినివ్వలేదు. పొరుగున ఉన్న కొండకు వెళ్లి విఠల్‌ను ఆరాధిస్తూ గీతాలు పాడేవాడు. ఆషాఢం, కార్తీక మాసాలలో 11వ రోజైన ఏకాదశినాడు అతడు పండ్‌హార్‌పూర్ వెళ్లేవాడు. అతడు భంగాలను రాశాడు. కీర్తనలు పాడాడు. అతడి కీర్తనలు వినడానికి వేలాది మంది ప్రజలు గుమికూడేవారు. దయ, క్షమాగుణం, మనశ్శాంతి తదితర సద్గుణాల ప్రాముఖ్యతను అతడు ప్రజలకు బోధించాడు. సమానత్వ సందేశాన్ని కూడా అందించాడు. "బలహీనులు, అట్టడుగు వర్గాలను అక్కున

చేర్చుకునేవాడు సంతు. అతడిలో భగవంతుడు నివాసం ఉంటాడు", అని ప్రబోధించాడు. ఈ వాస్తవాన్ని గ్రహించేలా ప్రజలను ఒప్పించాడు. ఆత్మ పరిశీలన చేసుకోవాలని పిలుపునిచ్చాడు. ప్రజలు తుకారామ్‌ను గొప్ప మత నాయకునిగా అంగీకరించి అతడిపై ప్రశంసల జల్లును కురిపించారు.

నిర్గుణ భక్తి ఉద్యమ నాయకులలో అత్యంత గొప్పవాడైన రామ్‌దాస్ ఆధ్యాత్మిక జీవితాన్ని అన్వేషిస్తూ సిద్ధిని పొందాడు. సతార జిల్లాలో కృష్ణా తీరాన ఉన్న చఫల్ అనే గ్రామంలో స్థిరపడ్డాడు. పూర్వపు ప్రచారకుల వలె కాకుండా అతడు ఆధ్యాత్మిక, ఆచరణాత్మక జీవితాన్ని జోడించడానికి ప్రయత్నించాడు. రాజకీయాలపట్ల అమితాసక్తిని ప్రదర్శించాడు. మహారాష్ట్ర అంతటా ఆశ్రమాలను స్థాపించాడు. ముస్లిం ప్రాబల్యాన్ని ఎదుర్కొని స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసేందుకు శివాజీ రామ్‌దాస్ నుండే స్ఫూర్తి పొందాడు. అభంగాలతోపాటు రామ్‌దాస్ దాసబోధ అనే గ్రంథాన్ని రచించాడు. సమాజం గురించి సమగ్రమైన సమాచారాన్ని అందులో పొందుపరిచాడు. ఈ గ్రంథం చదివి బాగా ప్రభావితుడైన శివాజీ ప్రత్యేక మరాఠా రాజ్యాన్ని స్థాపించాడు. వివరణలో ఈ గ్రంథం లౌకికవాద ధోరణిని ప్రదర్శించింది. మరాఠాల యుద్ధ కౌశల్యాన్ని తొలిసారిగా వర్ణించింది. అప్పటికే ఆవిర్భవిస్తున్న మరాఠా జాతీయోద్యమానికి ఈ గ్రంథం మరింత ఊతం ఇచ్చింది. మేధోచింతన నుండి ఆవిర్భవించిన ఈ జాతీయవాదం ప్రజల ఆకాంక్షలకు నిర్దిష్ట స్వరూపాన్ని ఇచ్చిందని బోధపడుతుంది.

బ్రాహ్మణేతర కులాల కృషి వల్లే మరాఠా సముదాయం ప్రాథమికంగా ఏర్పడింది. జనాలు మతంపట్ల మరోమారు ఆకర్షితులయ్యారు. ఉద్యమ నాయకులు కూడా దళిత కులాల నుండి వచ్చినవారే. దర్జీలు, వడ్రంగులు, కూలీలు, మాలీలు, దుకాణదారులు, క్షౌర వృత్తిదార్లు తదితరులు గొప్ప సంతులుగా తత్త్వ వేత్తలుగా ఎదిగారు. శివాజీ కమాండర్లు చాలా వరకు మవాలీ కొండ తెగకు చెందినవారు. మరాఠా సామ్రాజ్యం యొక్క ఈ విభిన్న స్వభావంలో ఏకీకరణ శక్తి అవసరమైంది. ఆ కార్యాన్ని భక్తి ఉద్యమ నాయకులు సమర్థవంతంగా నిర్వహించారు. మహారాష్ట్ర ధర్మను అధ్యయనం చేస్తే భక్తి ఉద్యమానికి కొండ ప్రాంతాలు సైతం ప్రతిస్పందించాయని బోధపడుతుంది. మత సంస్కరణలు రాజకీయ రంగంలో కూడా కదలికను తీసుకొచ్చాయి. ఈ నేపథ్యలోనే శివాజీ తన ఆధిపత్యాన్ని పెంచుకున్నాడు.

భక్తి ఉద్యమ ప్రభావాన్ని జస్టిస్ రణడే ఇలా వివరించాడు : "16వ శతాబ్దంలో ఐరోపా ఖండంలో ప్రొటెస్టెంట్ సంస్కరణోద్యమంలాగే భారతదేశంలో కూడా మత, సామాజిక, సాహిత్య పునరుద్ధరణ, సంస్కరణ జరిగాయి. అయితే 15, 16వ శతాబ్దాలలో ఈ పరిణామం ముఖ్యంగా దక్కనులో సంభవించింది. మత పునరుద్ధరణ సనాతన వాద విషయంలో బ్రాహ్మణికాన్ని తలపించలేదు. జన్మ ఆధారంగా నిర్ధారించబడిన కుల, వర్గ స్థాయిలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి అది స్ఫూర్తినిచ్చింది. స్వచ్ఛమైన హృదయం, ప్రేమ భావాలకు ఇతర సామర్థ్యాలు, మంచి కార్యాలకంటే ఎక్కువగా పిలుపు ఇచ్చింది. వర్గాలు కాకుండా ప్రజలే ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఉద్యమ నాయకులుగా సమాజంలోని అట్టడుగు వర్గాల నుండి వచ్చిన వారే వ్యవహరించారు".

మరాఠాల భాష, సాహిత్యం కూడా సమైక్యశక్తిగా పని చేశాయి. తుకారామ్ భక్తి గీతాలను అన్ని వర్గాల ప్రజలు పాడేవారు. ఫలితంగా సమాజంలోని ఆయా వర్గాల మధ్య ఐక్యతాబంధం ఏర్పడింది. మరాఠి యాస, భాషలలో రచించబడిన పాటలు కీలక పాత్రను పోషించారు. జె.ఎన్. సర్కార్ ప్రకారం “17వ శతాబ్దంలో ఆ విధంగా మహారాష్ట్రలలో భాష, వర్గం, జీవితాలను కలబోసిన అద్భుతమైన సముదాయం ఏర్పడింది. శివాజీ రాజకీయ సమైక్యతను స్థాపించకముందే ఈ పరిణామం జరిగింది. 18వ శతాబ్దం చివరి నాటికి మరాఠా ప్రజలు రాజకీయ, సాంస్కృతిక స్వరూపాలను ఏర్పాటు చేశారు. అయితే కుల విభజనలు అలాగే కొనసాగాయి. ఆ విధంగా చరిత్ర సమాజాన్ని తీర్చిదిద్దింది”.

**భక్తి ఉద్యమాల ప్రభావం, ప్రాముఖ్యత:**

మతపరమైన కృషితోపాటు ఈ ఉద్యమాలు సాహిత్యాన్ని అభివృద్ధి పరచడంలో కీలకపాత్రను పోషించాయి. ప్రాంతీయ భాషలకు ఊతమిచ్చాయి. రామానంద, కబీర్‌లు హిందీలో బోధనలు చేయగా నామ్‌దేవ్ మరాఠీలో ప్రచారం చేశాడు. ఈ సంతుల బోధనలతో ప్రభావితులైన రాజకీయ నాయకులు వేదాలు మొదలుకొని రామాయణ, మహాభారతాల వరకు ఉన్న అన్ని పౌరాణిక గ్రంథాలను స్థానిక భాషలలోకి అనువదింపచేశారు. భగవత్ గీతలో ప్రబోధించిన భక్తి యోగాపై అనేక వ్యాఖ్యానాలు వెలువడ్డాయి.

హిందూ, ఇస్లాం మతాల మధ్య మౌలికమైన తేడాలు ఉన్నప్పటికీ ఉమ్మడి అవగాహనకు రావలసిన అవసరం ఏర్పడింది. ఈ విషయంలో భక్తి సంతులు ఘన విజయం సాధించారు. నానక్ ఇస్లాం మతంతో ఎక్కువగా ప్రభావితం కావడం ఈ విషయాన్ని నొక్కి చెబుతుంది. భక్తి సిద్ధాంతం భారతదేశానికి కొత్త కాదు. భాగవత సంస్కృతిలో దాని మూలాలు ఉన్నాయి. మౌర్యుల అనంతర కాలంలో ఆ సంస్కృతి జనప్రియం అయ్యింది. ఉద్యమ సుదీర్ఘ చరిత్ర అనేక దశలలో కొనసాగింది. వివిధ సమయాలలో అది వివిధ స్వరూపాలను సంతరించుకుంది. 13 నుండి 16వ శతాబ్దం వరకు చివరకు ఒక స్థిరమైన స్వరూపాన్ని దక్కించుకుంది. హిందూ, ఇస్లాం మతాలు దగ్గరయ్యాయి. ఇరు సముదాయాల సామాజిక ఆచారాలు దాదాపు ఒకేలా పోలి ఉండడం అందుకు నిదర్శనం. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఉద్యమాల ప్రాశస్త్యం మతాన్ని వ్యక్తిగత అనుభూతిగా మార్చడంలోనే ఉంది. సనాతన వాద ఆచారాలను అధిగమించి ప్రజలు కుల, వర్గ విభజనలకు అతీతంగా భక్తిలో లీనమవడానికి ఈ ఉద్యమాలు అవకాశం కల్పించాయి. గతంలో మత వ్యవహారాలను పురోహితుడు ఏకపక్షంగా శాసించేవాడు. భక్తి ఉద్యమాల తర్వాత ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది.

ముస్లిం దండయాత్రల నేపథ్యంలో హిందుస్తాన్‌కు మౌలికంగా భిన్నమైన కొన్ని నిర్దిష్టమైన సామాజిక, మత సిద్ధాంతాలు దేశంలోకి ప్రవేశించాయి. ఆక్రమణదారులను తమలో పూర్తిగా విలీనం చేసుకోవడం స్థానికులకు సాధ్యంకాలేదు. రెండు సముదాయాల మధ్య రాజకీయ సంబంధాలు తరచూ ఘర్షణకు దారితీశాయి. అయితే రెండు నాగరికతలు ఎదురుపడినప్పుడు

పరస్పరం ప్రభావితం కావడం సహజం. ఆ విధంగా సుదీర్ఘ సంబంధంతో ఇండో-ముస్లిం సముదాయాల ఎదుగుదల సాధ్యమైంది. ఎన్నో ఉదారవాద మత ఉద్యమాల ప్రభావంతో హిందూ, ముస్లిం సముదాయాలు ఒకరి ఆలోచనలు, ఆచారాలను మరొకరు అనుసరించడం మొదలుపెట్టారు. కలహాల నేపథ్యంలో పరస్పర సహకారం, సోదరభావం, సహనం జీవితంలోని అన్ని రంగాలలో వెల్లివిరిశాయి. ప్రసిద్ధ ముస్లిం విద్వాంసులు దేశంలో జీవించి శ్రమపడ్డారు. ఇస్లాం తాత్విక ఆలోచన, ఆరాధనాతత్వాన్ని వ్యాపింపచేయడంలో వారు తోడ్పాటునందించారు. భారతీయ, ఇస్లాం అంశాలు, వస్తువులంటే ఇరు సముదాయాలలో గౌరవభావం నెలకొంది. చివరకు సత్యపీర్ లేదా నిజమైన సంతుని కొలవడం మొదలుపెట్టారు.

బహుశా ఈ భావన కారణంగానే భారత తత్త్వశాస్త్రానికి సంబంధించిన గొప్ప గ్రంథాలు ముస్లిం ఆస్థానాలలో తుర్కు, పార్సీ తదితర భాషలలో అనువాదం అయ్యాయి. ముస్లిం ప్రచారకులు యోగ, వేదాంత, ఆయుర్వేద, జోతిష్యశాస్త్రం పట్ల ఆకర్షితులయ్యారు. అలాగే హిందువులు అరబిక్ కాలసూచిక తదితర అంశాలను అరువు తీసుకున్నారు. హిందూ మతం ఇస్లాంను పూర్తిగా విలీనం చేసుకోకపోయినా ఆ మతంతో రెండు విధాలా ప్రభావితం అయ్యింది. ఒకవైపు ఇస్లాం మత విస్తరణ హిందూ సనాతన వాదులలో మత పరిరక్షణ భావన పెంచింది. తమ స్థానాన్ని పదిలం చేసుకునేందుకు కుల నిబంధనలను వారు తీవ్రతరం చేశారు. మాధవ (విజయనగర), విశ్వేశ్వర ఈ కోవకు చెందుతారు.

మరోవైపు ఇస్లాంలోని కొన్ని ప్రజాస్వామిక సూత్రాలు హిందువుల సామాజిక, మత వ్యవస్థలలో చొచ్చుకుపోయాయి. సంతుల నేతృత్వంలో ఉదారవాద ఉద్యమాలకు బాటలు వేశాయి. కొన్ని చిన్న చిన్న వైరుధ్యాలున్నా భక్తి ఉద్యమ నాయకులందరూ ఉదారవాద భక్తి సాంప్రదాయాన్ని ప్రచారం చేశారు. వాటి సందేశం సర్వజనీనంగా ఉండేది. అన్ని మతాలు మౌలికంగా ఒక్కటే, సర్వేశ్వరుడు ఒక్కడేనన్న సందేశాన్ని హిందూ, ముస్లిం ప్రచారకులిద్దరూ ప్రజలకు అందచేశారు. మానవుడి ఆత్మగౌరవం అతడి సొంత కార్యాలయాలపైనే ఆధారపడి ఉంటుందని, పుట్టుకతో దానికి సంబంధం లేదని ప్రచారం చేశారు. మతం యొక్క విపరీతమైన సాంప్రదాయాలు, నియమాలను, పురోహితుల, ముల్లాల ఆధిపత్యాన్ని వ్యతిరేకించారు. స్వచ్ఛమైన భక్తి, విశ్వాసాలతో మోక్షం సాధించాలని ప్రజలకు బోధించారు.

# V

# సంస్కృతి

19

# తొలి మధ్య యుగ కాలం

**సాధారణ అధ్యయనం :**

తొలి మధ్యయుగ కాలంలో సంభవించిన అత్యంత కీలకమైన పరిణామం ప్రాంతీయ భాషలు క్రమంగా ఆవిర్భవించడమే. ఇండో-ఆర్యన్ భాష మాట్లాడే ప్రాంతంలో ఈ పరిణామం అపభ్రంస అనే మధ్య దశ ద్వారా సంభవించింది. ప్రాకృత భాష చివరి దశకు అపభ్రంశ ప్రాతినిధ్యం వహించింది. అయితే ఆ భాషలు భారీ పరిమాణంలో సాహిత్యాన్ని పండించాయి. ముఖ్యంగా జైనులలో సాహిత్యం విపరీతంగా అభివృద్ధి చెందింది. తొలిసాహిత్య కృతులలో అపభ్రంశ ఛాయలు కనిపించాయి. భరతుని నాట్యశాస్త్రం వెలువడేంతవరకు దానిని ఒక మాండలికంగా పరిగణించారు. తర్వాతి కాలంలోనే అది సాహిత్య పరమైన ప్రమాణాలను అందుకుంది. ప్రాకృత భాష ప్రాంతీయ స్వరూపాలు కూడా ఉన్నాయి. వాటిని సంబంధిత రచయితలు దేశీ లేదా భూమికి సంబంధించిన భాషలుగా వర్ణించారు. సంధభాష లేదా ప్రతీకాత్మక భాషణంగా కొన్ని సార్లు పిలవబడిన దానిని ఆరాధన అంశాలను వివరించడానికే ఉపయోగించారు. అలాగే మహా గ్రంథాల రచనలో కూడా ఆ భాషను ఉపయోగించారు.

ఈ కాలంలో ఆవిర్భవించిన ఉత్తర భారత దేశీ భాషలలో మరాఠి, బెంగాలీ, గుజరాతీని చేర్చవచ్చు. దక్షిణ భారతంలో కూడా అలాంటి భాషా వికాసమే జరిగింది. కన్నడ, తెలుగు ఇపుడు స్వంతంగా తమ ఉనికిని చాటుకున్నాయి. ఈ భాషల ప్రగతి ప్రాంతీయ సామాజిక-రాజకీయ నిర్మాణాలతో దగ్గరగా ముడిపడి ఉంది. ముఖ్యంగా ఈ ప్రాంతాల మత ఉద్యమాలు ప్రాంతీయ భాషల అభివృద్ధికి విశేషంగా కృషి చేశాయి. ఈ విధంగా కొత్త భాషలకు విశాలమైన సామాజిక పునాది ఉండేది. మహారాష్ట్రలో నామ్‌దేవ్ లాంటి ప్రచారకులు ప్రయత్నించిన ఏకేశ్వరోపాసన పద్ధతులు (అభంగాల ద్వారా) కుల సరిహద్దులను చెరిపివేశాయి. బెంగాల్‌లో బౌద్ధ చార్యపదలను రచించిన వారు సమాజంలోని అట్టడుగు వర్గాలకు ప్రాతినిధ్యం వహించారు. జైనులు, వీర శైవులు, శ్రీవైష్ణవుల తోడ్పాటువల్ల కన్నడ అభివృద్ధి చెందింది. తెలుగులో దేశీ శైలి గ్రామీణ, సార్వజనీన భాషకు ప్రాతినిధ్యం వహించింది. అది సంస్కృతానికి స్వతంత్రంగా ఆవిర్భవించింది. తెలుగు 'మార్గి'కి భిన్నమైనది. ఈ పరిణామాలు సహజంగానే

సంస్కృత భాష పరిధిని కుదించివేశాయి. ప్రాచీన, సాంప్రదాయ అంశాల రచనలో సంస్కృత ప్రభావం అలాగే కొనసాగింది. కవిత్వం విషయంలో నూతన శైలిని అన్వేషించాల్సి వచ్చింది. తన పాండిత్యాన్ని, భాషపై తన పట్టును, పదాల కూర్పును, కొన్ని అద్భుతమైన, క్లిష్టమైన సాధనాలను వినియోగాన్ని చాటుకోవడానికే సంస్కృత పండితుడు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. వ్యవస్తీకరణ, అన్వయింపులకు సంబంధించిన అవసరాన్ని సంస్కృతం తీర్చుకోగలిగింది కాని ఆ కాలపు విశాల సాహిత్య కాంక్షను నెరవేర్చలేకపోయింది.

భారతీయ చారిత్రక సాంప్రదాయం అభివృద్ధి చెందిన వివిధ దశలు, దాని భిన్నమైన స్వరూపాలు తొలి భారతీయులకు చారిత్రక చైతన్యం కొరవడిందనే సాధారణ భావనను నమ్ముతాయి. ఈ సాంప్రదాయం లౌకికవాద చరిత్ర అనే భావనతో ఏకీభవించకపోయినా అది మార్పులేని మూస సాంప్రదాయం మాత్రం కాదు. తొలి భారతీయ చరిత్ర శాస్త్రం ప్రపంచంలోని ఇతర శాస్త్రాలలాగా వివిధ కాలాలలో కొత్త సామాజిక కోణాలను సంతరించుకుంది. సతపథ బ్రాహ్మణ కాలంలో ఇతిహాస అనే పదానికి పరిమితమైన ప్రభావం ఉండేది. దాని అధ్యయనం దేవుళ్లు, అసురులను ప్రార్థించడానికే పరిమితమైంది. అర్థశాస్త్ర కాలం నాటికి ఆ పదానికి నిర్దిష్టమైన అర్థం సమకూరింది. దాని అధ్యయనాన్ని రాజులకు కూడా సిఫార్సు చేసేవారు.

తొలి మధ్యయుగ చరిత్ర శాస్త్ర పుట్టుపూర్వోత్తరాలు గత కాలపు రాజకీయ, సామాజిక మార్పులలో ఉన్నాయి. ఇతిహాస సాంప్రదాయం కొత్త వ్యవస్థీకరణను సంతరించుకుంది. పురాణాల సంకలనంతో ఈ మార్పు వచ్చింది. కొత్త చరిత్ర శాస్త్రం యొక్క మరో కోణం రాచరిక వ్యక్తిత్వాల చరితలు పెరుగుతున్న సంఖ్యలో ప్రతిబింబిస్తుంది. చరిత్రలు వర్ణ శైలిలోని జీవిత కథలు కాదు. అయితే వాటిని సాహిత్య ప్రమాణాలకు లోబడి పూర్తి చేసేవారు. ఈ రెండు కోణాలు అసంఖ్యాక రాచరిక, సాధారణ అధికారి వ్యక్తిగత ప్రశస్తిలలో దర్శనమిస్తాయి. ప్రశస్తిలోని రెండు ముఖ్యమైన భాగాలు ఒక కుటుంబం యొక్క పూర్వాపరాలను, ఘటనా క్రమాన్ని, ముఖ్యంగా సైనిక సమూహాలు, సంబంధిత విషయాల వర్ణనను కలిగి ఉంటాయి. కల్హణుని రాజతరంగిణి ఇలాంటి చరిత్ర రచన సాంప్రదాయానికి మినహాయింపు అని నిస్సందేంగా చెప్పవచ్చు. గత చారిత్రక విషయాలు, అంశాలను వర్ణించడంలో కల్హణుడు తన సమకాలీన రచయితలకు భిన్నంగా వ్యవహరించాడు. అలాగే అతడి రచనా శైలి కూడా భిన్నంగా ఉంది. అయితే కల్హణుడి చారిత్రక భావనలు కూడా దైవం, అతీంద్రియ శక్తులలో విశ్వాసం ఉంచాయి.

ఈ కాలపు సాహిత్య ఉత్పత్తిలో ఒక ప్రధాన భాగం లలిత కళలకు సంబంధించిన సూత్రాలను క్రమబద్ధం చేయడానికి అంకితమైంది. ప్రాచీన యుగం నాటికి లలితకళలపై ఒక నిర్దిష్టమైన సిద్ధాంతం అభివృద్ధి చెందింది. ఆ కాలపు కృతులలో నమోదుచేసిన కళల జాబితా విద్యాభ్యాసంలో లలిత కళలకు ఇచ్చిన ప్రాధాన్యతను వివరిస్తుంది. తొలి మధ్యయుగ

కాలంలో లలిత కళలు మరింత అభివృద్ధి సాధించడానికి అనేక అంశాలు దోహదం చేశాయి. ఉన్నత వర్గీయుల సంఖ్య పెరగడంతో కళా సాహిత్యాలకు కూడా పోషణ, ఆదరణ ఎక్కువయ్యాయి. అలాగే అధ్యయన, అభ్యాస కేంద్రాలు కూడా పెద్ద సంఖ్యలో ఏర్పాటయ్యాయి. ఇలాంటి కేంద్రాలలో వివిధ రకాల కళలను బోధించేవారు. ముఖ్యమైన సాంస్కృతిక కేంద్రాలుగా అవి ఎదిగాయి. ఉదాహరణకు సమాజంలోని వివిధ వర్గాల నుండి పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందుకున్న వ్యవస్థ ఆలయం. ఒకవైపు వాస్తు శాస్త్రంలో కొత్త పుంతలు తొక్కుతూ మరోవైపు ఆర్థిక వనరుల కారణంగా నృత్య, సంగీతాలకు ఆలయాలు కేంద్రాలుగా మారాయి. లలిత కళలకు చెందిన వివిధ విభాగాల చారిత్రక అభివృద్ధికి ఇలాంటి కేంద్రాలు వేదికగా నిలిచాయి.

సమాజ అవసరాల దృష్ట్యా వ్యవస్థీకరణ ప్రక్రియ కూడా పుంజుకుంది. తొలి మధ్యయుగ కాలంలో రచించబడిన వివిధ గ్రంథాలలో లలిత కళలపై అధ్యాయాలు కూడా ఉన్నాయి. స్వతంత్ర శిల్పకృతులు కూడా రచించబడ్డాయి. సమకాలీన పాలకవర్గాలు లేదా రాచరిక ఆస్థానాల పోషణ కారణంగానే గ్రంథాలు చాలా వరకు వెలువడ్డాయి. మానసోల్లాస, సమరాంగన సూత్రధార అనే ముఖ్యమైన కృతులు సోమేశ్వర, భోజ అనే గొప్ప రాచరిక వ్యక్తులతో ముడిపడి ఉన్నాయి. సంగీతంపై వెలువడిన అత్యంత ముఖ్యమైన కృతి సంగీతరత్నాకర యాదవ ఆస్థానంలోని సారంగదేవ అనే అధికారిచే రచించబడింది. అపుడు యాదవ రాజ్యాన్ని సింహన పాలించేవాడు. అలాంటి కృతుల్లో ప్రాంతీయ వర్గీకరణకు కూడా ప్రయత్నాలు జరిగాయి. ఉదాహరణకు శిల్ప కృతులు (వాస్తు శాస్త్రంపై) ప్రాంతీయ నిర్మాణ శైలుల వర్గీకరణతో మొదలవుతాయి. ముఖ్యంగా, నగర, వేసార, ద్రవిడ నిర్మాణ శైలులను ప్రస్తావించారు.

## ప్రాంతీయ సంస్కృతుల అభివృద్ధి:

భారతీయ సంస్కృతి ఎదుగుదల ప్రక్రియలో తొలి మధ్యయుగ కాలానికి సొంత ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే అనేక ప్రాంతీయ సంస్కృతుల అభివృద్ధి ఈ కాలంలోనే జరిగింది. ఈ ప్రక్రియలో మూడు ముఖ్య కారణాలు లేదా పరిణామాలను గుర్తించవచ్చు. అవి: ప్రాంతీయ రాజ్యాల ఆవిర్భావం, జనరంజక హిందూమతంగా బ్రాహ్మణవాదం రూపాంతరం, ప్రాంతీయ భాషలు, సాహిత్యాల వికాసం. గొప్ప ప్రాంతీయ రాజ్యాల ఆవిర్భావంతో భారతీయ సంస్కృతి ప్రాంతీయకరణ చెందడం మొదలుపెట్టింది. రాజకీయ నిర్మాణంలో ఈ మార్పు తర్వాత మతపరమైన పరివర్తన సమాంతరంగా వచ్చింది. సమైక్య బ్రాహ్మణవాదాన్ని ప్రజారంజక భక్తి ఉద్యమాలు సవాలు చేశాయి. ఈ ఉద్యమాల ఫలితంగా కొత్త తాత్విక సిద్ధాంతాలు ఆవిర్భవించాయి. దాదాపు సమాంతరంగానే ప్రాంతీయ భాషలు గొప్ప సాహిత్యాన్ని ఉత్పత్తిచేశాయి. ఈ ప్రాంతీయ సాహిత్యం సంస్కృతసాహిత్య గుత్తాధిపత్యాన్ని సవాలు చేసింది. తొలి మధ్యయుగ కాలంనాటి సాంస్కృతిక వారసత్వ మంతా ఇస్లాం ప్రభావం కారణంగా మరింత సంపన్నమైంది. మొగల్ సామ్రాజ్యం, తర్వాతి కాలంలో ఆవిర్భవించిన రాజ్‌పుత్ మరాఠ, సిఖ్ రాజ్యాలలో ఈ వారసత్వం కొనసాగింది. నేటికీ ఆ సంస్కృతి సజీవంగా ఉంది.

## ప్రాంతీయ భాషలు, సాహిత్యాల వికాసం:

క్రీ.శ. 1000–1300 మధ్య ఉత్తర, మధ్య, తూర్పు భారతదేశ ఇండో–ఆర్యన్ భాషలు నిర్దిష్టమైన ప్రాంతీయ అస్తిత్వాలను సంతరించుకున్నాయి. వాటిలో హిందీ, మరాఠి, బెంగాలీ, అస్సామీ, ఒడియా మన దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షించాయి. వాటి తొలి అభివృద్ధి దశ, మధ్యయుగ భారతీయ సంస్కృత యాసలైన ప్రాకృతం, అపభ్రంశలతో వాటికి ఉన్న సంబంధం అధ్యయనానికి ఒక ఆసక్తికరమైన అంశం కాగలదని ఖచ్చితంగా చెప్పవచ్చు. భక్తి పంథాలు ఈ వికాస ప్రక్రియపై ప్రగాఢ ప్రభావం చూపాయి. ప్రాంతీయ భాషలు, సాహిత్యాన్ని మరింత అభివృద్ధి పరిచాయి. కొందరు భక్తి ఉద్యమ నాయకులకు సంస్కృత పరిజ్ఞానం ఏ మాత్రం ఉండేదికాదు. కనుక వారు తమ భావాలు, సిద్ధాంతాలను తమ ప్రాంతీయ భాషలోనే వ్యక్తపరిచారు. అయితే సంస్కృతం తెలిసిన బ్రాహ్మణులు కూడా ప్రజలతో సంభాషించడానికి ఆసక్తి చూపారు. అందుకు ప్రాంతీయ భాషపైనే మొగ్గు చూపారు. పైగా అనేకమంది భక్తి కవులు మత ఉద్యమాలను ప్రభావితం చేస్తూనే ఉత్తర సాహిత్య కృతులను ఉత్పత్తి చేశారు. ఇది ప్రాంతీయ భాషలను సంపన్నం చేసింది. అలాగే పురాణాలతో మొదలుకొని అనేక సంస్కృత గ్రంథాలు ప్రాంతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఈ విషయంలో వైష్ణవులకు భాగవత పురాణం అత్యంత ముఖ్యమైన గ్రంథంగా మారింది. అలాంటి అనువాదాలు చాలా వరకు ప్రాంతీయ భాషలలో తొలి ఉత్తమ గ్రంథాలుగా నిలిచాయి.

ఈ నేపథ్యంలో సాహిత్యంలోని రెండు ఇతర శైలులను గమనంలోకి తీసుకోవడం అవసరం. అవి దేవాలయాలు, రాచరిక వంశాల చరిత్రలు. అన్ని గొప్ప ఆలయాలు, పుణ్యక్షేత్రాలు తమ స్థల మహత్యాలపై సంస్కృత గ్రంథాలను వెలువరించాయి. ఈ గ్రంథాలు కూడా ప్రాంతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. స్థల మహత్యాల గురించి తీర్థ యాత్రికులు అన్ని ప్రాంతాలలో గీతాలు ఆలపించేవారు. తీర్థయాత్రికుల అన్వేషణకు పంపబడిన పురోహితులు కూడా ఈ తరహా సాహిత్యం విస్తరించేందుకు తోడ్పడ్డారు. రాజులు, స్థానిక పాలకుల జీవిత చరిత్రలు కూడా ఇలాంటి విధినే నిర్వహించాయి. రాజవంశావళిగా ఈ చరిత్రలు ప్రసిద్ధమయ్యాయి. మహాకవులు ఇలాంటి చరిత్రలను రచించి తమ పోషకులకు ఘనమైన చరిత్రను అందించారు. రాజుల వంశాలను మహనీయులు, చివరికి పురాణ పురుషులతో ముడిపెట్టారు. ఆయా పాలక వంశాలు నిర్మించిన ఆలయాలకు కూడా పురాణ నేపథ్యాన్ని కల్పించారు. చివరి అధ్యయాలే చారిత్రక పాలకుల కార్యకలాపాలను వివరించేవి. ఎన్ని లోపాలున్నప్పటికీ రాజవంశావళులకు చాలా ప్రాముఖ్యత ఉంది. అవి ప్రాంతీయ అస్తిత్వాన్ని నిర్ధారించాయి.

## మధ్యయుగంలో ప్రాంతీయ భాషల అభివృద్ధి:

### పంజాబీ:

సూఫీ కవి మసూద్ ఫరీదుద్దీన్ (13వ శతాబ్దం) పంజాబ్ సాహిత్య కొత్త పంథాకు అగ్రగణ్యుడు. 15వ శతాబ్దం చివరలో పంజాబీ కవిత్వం అభివృద్ధికి గురునానక్ ప్రధానంగా

కృషి చేశాడు. తర్వాత సిఖ్ గురులు కూడా పంజాబీ అభివృద్ధికి కృషి చేశారు. 1604లో గురు అర్జన్ అది గ్రంథ్‌ను సంకలించాడు. అలాగే మధ్యయుగ భక్తి పద్యాలలో సుదీర్ఘమైన గొప్ప గ్రంథం సుఖ్‌మణిని కూడా రచించాడు. గురు గోబింద్ సింగ్ కృషి కూడా ఎనలేనిది. వారిస్ షా రచించిన 'హీర్' లాంటి ప్రణయ కవితలు కూడా పెద్ద సంఖ్యలో వెలువరించబడ్డాయి. పంజాబీ వాచకం కూడా గణనీయమైన ప్రగతిని సాధించింది. క్రీ.శ. 1600–1800 మధ్య సంస్కృతంలోని అనేక మత, తాత్విక కృతులను పంజాబీలోకి అనువదించారు.

**హిందీ:**

క్రీ.శ. 7–10 శతాబ్దాల మధ్య హిందీ భాష ఆవిర్భవించింది. హిందీ సాహిత్య తొలి దశను ఆది కాల్ (1206–1318) అని పిలుస్తారు. ఈ కాలంలో వెలువడిన సాహిత్య స్వరూపం ప్రధానంగా పాండిత్యాన్ని తలపించేది. ఆది కాల్‌కు చెందిన ఇద్దరు ప్రధాన కవులు నరపతి నల్హా, అమీర్ ఖుస్రో. రెండవ దశను (1318–1643) భక్తి కాల్‌గా పరిగణిస్తారు. హిందీ సాహిత్య చరిత్రలో ఈ కాలం అత్యంత సంపన్నమైనది. నిర్గుణ, సగుణ భక్తి కవులు సాహిత్యాభివృద్ధికి ప్రధానంగా కృషిచేశారు. నిర్గుణ భక్తి కవులలో కబీర్, గురు నానక్, దాదూ, సుందరదాస్ మొదలైన వారు ఉన్నారు. సగుణ భక్తి కవులలో తులసిదాస్ (రామ్‌చరిత మానస్), సుర్‌దాస్ (సుర్ సాగర్), మీరాబాయి తదితరులు ఉన్నారు. ఆరాధన కవులలో జయసి (పద్మావతి), నూర్ మహమ్మద్ (ఇంద్రావతి), ఉథ్‌మన్ (చిత్రావళి) మొదలగువారు ఉన్నారు. అబ్దుల్ రహీం ఖాన్–ఎ–ఖానన్ లాంటి లౌకికవాద కవులు కూడా హిందీ భాషాభివృద్ధికి తోడ్పాటునందించారు. రితికాల్‌గా పిలవబడే మూడవదశ (రితి అంటే ప్రేమ) (1643–1850) మౌలికంగా లౌకికవాద ధోరణిని ప్రదర్శించింది. ఈ కాలపు ముఖ్య కవులలో కేశవదాస్, చింతామణి, మాతిరామ, బీహారీ తదితరులు ఉన్నారు.

**ఉర్దూ:**

అల్లావుద్దీన్ ఖిల్జీ సైనిక స్థావరాలలో పార్సీ, భారతీయ భాషల కలయిక కారణంగా ఉర్దూ ఆవిర్భవించింది. ఈ భాషకు దక్కను ప్రధాన కేంద్రంగా ఉండేది. బీజాపూర్, గోల్కొండ రాజ్యాలలో ఈ భాష తొలుత వికసించింది. దక్కనీ ఉర్దూలో వెలువడిన తొలి సాహిత్య కృతి మిరాజ్–ఉల్–ఆషికిన్. ఈ గ్రంథాన్ని గేసుదరాజ్ (15వ శతాబ్దం తొలినాళ్లలో) అనే సూఫీ ప్రబోధకుడు రచించాడు. బీజాపూర్‌కు చెందిన షా మీరాన్‌జీ షంషుల్ (ఖుష్ నామా), బుర్హానుద్దీన్ జనమ్(ఇర్షాద్ నామా), గోల్కొండకు చెందిన మహమ్మద్ కులీ, ఘవాసి (తుతి నామా) ప్రముఖ దక్కను ఉర్దూ కవులు. మొగల్ పాలనలో ఉర్దూ ఉత్తర భారతదేశానికి పరిపూర్ణ స్వరూపంలో విస్తరించింది. 18వ శతాబ్దంలో ఉత్తర భారతానికి చెందిన ప్రముఖ ఉర్దూ రచయితలలో హాతిమ్, మిర్జా జాన్–ఎ–జనుమ్, మీర్ తాకీ, ముహమ్మద్ రఫీ సౌదా, మీర్ హాసనన్‌లు ఉన్నారు.

**ఒడియా:**

ఈ భాష ఎనిమిదవ శతాబ్దంలో ఆవిర్భవించినప్పటికీ ప్రధాన సాహిత్య కృతులు 13, 14వ శతాబ్దాలలోనే వెలువడ్డాయి. సర్లదాస (14వ శతాబ్దంలో మహాభారత్‌ను అనువదించారు), బలరామదాస్, జగన్నాథ దాసలు ముఖ్యమైన ఒడియా రచయితలు. పంచ సాఖ లేదా ఐదుగురు మిత్రుల బృందానికి చెందిన వారిలో (15వ శతాబ్దం), బలరామదాస, జగన్నాథదాసలు ఉన్నారు. చైతన్య, వైష్ణవ కవుల భక్తి ఉద్యమం ఒడియా సాహిత్యంపై దీర్ఘమైన ప్రభావం చూపింది.

**బెంగాలీ:**

తొలి దశ క్రీ.శ. 10–12 శతాబ్దాలకు వర్తిస్తుంది. ఈ కాలంలో సాహిత్యం ప్రధానంగా జానపద గేయాల రూపంలో ఉండేది. సహజ పంథా తత్త్వ శాస్త్రంతో అది ప్రభావితమైంది. రెండవ దశ 13వ శతాబ్దంలో ముస్లింల దండయాత్రతో ప్రారంభమైంది. 17వ శతాబ్దం చివరి వరకు అది కొనసాగింది. ఈ దశలోనే మూడు ప్రధాన పోకడలు: వైష్ణవ కవిత్వం – ముఖ్య కవులు చండీదాస్, చైతన్య, గోవిందదాస, కృష్ణ దాస కవిరాజ (చైతన్య చరితామృత), ప్రాంచీన సంస్కృత గ్రంథాలు, కావ్యాల అనువాదం, అనుకరణ – కాశీరామ (మహాభారత), క్రిస్టివాస ఓఝా (రామాయణ), తదితర కృతులు, మంగళ్ కావ్య కవితా స్వరూపం – సనాతనవాద స్ఫూర్తి కలది. సుర, అసురల మధ్య జరిగిన సంఘర్షణను వివరిస్తుంది. ప్రధాన కృషీవలురు మాణిక్యదత్తా, ముకుందరామ.

**గుజరాతి:**

క్రీ.శ. 13 నుండి 15వ శతాబ్దం వరకు విస్తరించి ఉన్న ప్రథమ దశలో రెండు సాహిత్య స్వరూపాలు – ప్రబంధ (వివరణాత్మక కవిత), ముక్త (స్వల్ప కావ్యం) –కనిపిస్తాయి. ఈ దశలోని ప్రధాన కవులు శ్రీధర, భీమ, రాజశేఖర, జయశేఖర, సోమసుందర. రెండవ దశ 15 నుండి 17వ శతాబ్దం వరకు కొనసాగింది. గుజరాతి సాహిత్యంలో ఇది స్వర్ణయుగం. ఈ కాలపు గొప్ప రచయితలలో నరసింహ మెహ్తా, భలన, అఖో ఉన్నారు.

**మరాఠి:**

13వ శతాబ్దపు ద్వితీయార్థంలో మరాఠి సాహిత్యం అభివృద్ధి చెందింది. గోరఖ్‌నాథ్ స్థాపించిన నాథ పంథ్ భక్తి కవులు (ముకుందరాజ 'వివేక్ సింధూ'ను రచించాడు). మరాఠి అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. మహానుభావ పంథాకు చెందిన కవులు కూడా మరాఠి వాచకం, కవిత్వం అభివృద్ధికి కృషి చేశారు. ఉదాహరణకు లీల చరిత, సిద్ధాంత సూత్రోపత్త తదితర రచనలు వెలువడ్డాయి. ఇతర ముఖ్య రచయితలు జ్ఞానదేవ (అతడి జ్ఞానేశ్వరి, అమృతానుభవను మరాఠీలు పవిత్ర గ్రంథాలుగా పరిగణిస్తారు), ఏక్‌నాథ్, తుకారామ్, రామ్‌దాస్,

వామన పండితులు. 17వ శతాబ్దంలో లౌకికవాద సాహిత్యాన్ని పోకడల స్వరూపంలో సంకలించారు. లావణీలు (ప్రణయ కావ్యాలు, గాథలు) కూడా ఈ కాలంలో వెలువడ్డాయి.

**తమిళం:**

ఆళ్వార్‌లు లేదా వైష్ణవ సంతుల సాహిత్యాన్ని 'ప్రబంధ' అని పిలుస్తారు. అందులో ముఖ్యమైనది నలయిరమ్ (తిరుమలిసాయి ఆళ్వార్, నమ్మళ్వర్ తదితర 12 మంది ఆళ్వార్‌లు రూపొందించిన భక్తి గీతాల సంకలనం. నయనార్‌లు లేదా శైవ సంతుల సాహిత్యాన్ని తేవరమ్ అని పిలుస్తారు. అప్పార్, సంబంథార్, సుందరార్‌లు ముఖ్యమైన నయనార్‌లు. వారి కృతులను తిరుమరై అంటారు. కంబన్ రామయణ (రామనాటక అని కూడా పిలుస్తారు). చోళ కాలంలో రచించబడింది. సెక్కిలర్ రచించిన తిరుత్తోందర్ పురాణం (పెరియ పురాణం) కూడా చోళ కాలంలో వెలువడింది. ఇది 63 మంది నయనార్‌ల జీవిత కథ. పుగలేంది 15వ శతాబ్దంలో "నలవేంబా"ను రచించాడు.

**తెలుగు:**

కవిత్రయంగా పిలవబడే నన్నయ (11వ శతాబ్దం), తిక్కన (13వ శతాబ్దం), ఎర్రాప్రగడ (13-14వ శతాబ్దాలు)లు తెలుగు సాహిత్యానికి పునాదులు వేశారు. వారు మహాభారతాన్ని తెలుగులోకి అనువదించారు. వారి ఇతర రచనలలో నన్నయ ఆంధ్ర శబ్ద చింతామణి, తిక్కన నిర్వచనోత్తర రామాయణ ఉన్నాయి. కృష్ణదేవరాయుని కాలంలో తెలుగు సాహిత్య ప్రభ శిఖర స్థాయికి చేరుకుంది. ఈ కారణంగానే కృష్ణదేవరాయుడిని ఆంధ్ర భోజ అని పిలుస్తారు. కవులలో అష్టదిగ్గజాలు అతడి ఆస్థానంలో ఉండేవారు. వారిలో అల్లసాని పెద్దన గొప్పవాడు. అతడిని ఆంధ్ర కవితాపితామహుడు అని కీర్తిస్తారు. అతడి ముఖ్యమైన రచనలు మను చరిత్రం, హరికథా సారాంశం. ఇతరులు నంది తిమ్మన (పారిజాతా పరహరణం), మాదయ్య (రాజశేఖర చరిత్రం), ధూర్జటి (కాళహస్తి మహత్యం), అయ్యలరాజు రామభద్ర (సకల మతసార సంగ్రహం), పింగళి సూరన (రాఘవ పాండవీయం, ప్రభావతి ప్రద్యుమ్న), రామరాజు భూషణుడు, తెనాలి రామలింగడు (పాండురంగ మహత్యం). అలాగే కృష్ణదేవరాయలు స్వయంగా అముక్తమాల్యద అనే తెలుగు గ్రంథాన్ని, జాంబవతి కళ్యాణం అనే సంస్కృత కావ్యాన్ని రచించాడు. ఇతర ముఖ్య రచయితలు సోమనాథ (బసవ పురాణం), శ్రీనాథ (శృంగార నైషధం, శివరాత్రి మహత్యం, కాశిఖాండ), బమ్మెరపోతన (భాగవతం), వేమన (శతకం), మొల్ల (రామాయణం), భీమ కవి (భీమేశ్వర పురాణం), నన్నెచోడ (కుమార సంభవ) తదితరులు.

**కన్నడ:**

ఒకటవ రాష్ట్ర కూట అమోఘవర్ష రచించిన 'కవిరాజమార్గ' కన్నడంలో వెలువడిన తొలి ముఖ్యమైన సుదీర్ఘమైన కృతి. రత్నత్రయగా పిలవబడిన కవులు పంపా (9వ శతాబ్దం), పొన్న (10వ శతాబ్దం), రన్న (10వ శతాబ్దం). పంపా ఆదిపురాణ, పంపాభారత, పొన్న

"శాంతి పురాణ", రన్న అజితనాథ పురాణ, గధయుద్ధలను రచించారు. కన్నడ వాల్మీకిగా ప్రసిద్ధుడైన నరహరి తరవి రామాయణను, విరుపాక్ష పండిత చిన్న బసవ పురాణను రచించారు.

**మలయాళం:**

మలయాళంలో వెలువడిన తొలి సాహిత్య కృతి ఉణ్ణునిలి సందేశం. 14వ శతాబ్దానికి చెందిన ఒక పేరు తెలియని రచయిత దానిని రచించాడు. మలయాళి కవులలో గొప్పవాడైన రామానుజ ఎల్లుట్టొక్కన్ హరినామ కీర్తనం, భాగవతం కిలిపట్టు, తదితర గ్రంథాలను రచించాడు.

**మధ్యయుగ భారత కళ, వాస్తుశాస్త్రం:**

**రాజపుత్ర కళ, వాస్తు శాస్త్రం:**

**ప్రధాన లక్షణాలు:** ఉత్తర భారతమంతటా కనిపించే నగర శైలి ఆలయాల మౌలిక లక్షణాలు వృత్తాకార భూ ప్రణాళిక, శిఖరాలు. ఈ నిర్మాణ శైలి అభివృద్ధి ప్రక్రియలో కొన్ని ప్రాంతీయ మార్పులు, చేర్పులు జరిగాయి. అయితే అవి మౌలిక లక్షణాలను మార్చలేదు. నగర శైలి ప్రాంతీయ అభివృద్ధులలో ఒరిస్సాకు చెందిన నిర్మాణ శైలి ప్రత్యేకమైనది, ఉన్నతమైనది.

**ఒరిస్సా శైలి:**

నగర శైలిని స్వచ్ఛమైన రూపంలో ప్రదర్శించిన ఒరిస్సా నిర్మాణ శైలిని అందరూ కొనియాడారు. క్రీ.శ. 8వ శతాబ్దంలో భువనేశ్వర్ వద్ద నిర్మించబడిన పరశురామేశ్వర ఆలయం గుప్తుల శైలికి పరాకాష్టగా పేర్కొంటారు. అదే చోట నిర్మించబడిన ముక్తేశ్వర ఆలయం (9వ శతాబ్దం) నగర శైలి పరిపక్వతను ప్రతిబింబిస్తుంది. అయితే కాలక్రమంలో ఒరిస్సాలో నగర ఆలయం ఒక ప్రత్యేకమైన వ్యక్తిగత స్వరూపాన్ని సంతరించుకుంది. భువనేశ్వర్ వద్దగల లింగరాజు ఆలయం (1100 క్రీ.శ.) ఒరిస్సా నిర్మాణ శైలి పరిపక్వ దశను సూచిస్తుంది. శిఖరం ఎత్తు, దాని ఆకారం ఆలయానికి ఎనలేని వైభవాన్ని సమకూర్చింది. ఆలయాలలో ప్రసిద్ధమైన జగన్నాథ ఆలయం (పూరి) కూడా లింగరాజ ఆలయ నిర్మాణశైలి ఔన్నత్యాన్ని అధిగమించలేదు. అయితే నరసింహ-1 పాలనలో (1238-64) కోణార్క్ వద్ద నిర్మించబడిన సూర్యదేవాలయం లింగరాజ ఆలయ వైభవాన్ని తలతన్నుతుంది. నిర్మాణ శైలిలో, సంపూర్ణమైన ఆకారంలో అది లింగరాజు ఆలయం కంటే ఉన్నతమైనది. శిథిలావస్థలో కూడా దివ్యంగా, వైభవంగా కనిపించే సూర్య దేవాలయం ఒరిస్సా నిర్మాణ శైలి ఉద్యమానికి పరిపూర్ణతను చేకూర్చింది.

**చండేలా శైలి:**

నగర శైలికి మరో స్వరూపం మధ్య భారతంలో అభివృద్ధి చెందింది. అందులో మధ్య భారతానికి ప్రత్యేకమైన లక్షణాలు క్రమంగా ఉద్భవించి మధ్యప్రదేశ్‌లోని ఖజురహో ఆలయాల్లో పతాక స్థాయికి చేరుకున్నాయి. క్రీ.శ. 950-1050 మధ్య ఈ ఆలయాలను

జజభుక్తికి చెందిన చండేలాలు నిర్మించారు. ఖజురహో ఆలయాలలో ప్రముఖమైనవి కాందరియా మహాదేవ, దేవి జగదాంబ, దులాదేవ్, పార్శ్వనాథ, లక్ష్మణ, విశ్వనాథ్ ఆలయాలు. కాందరియా మహాదేవ ఆలయం మధ్యభారత నిర్మాణ ఉద్యమ శిఖర స్థాయిని తలపిస్తుంది. లోతైన పునాదులు, శిఖరాల ఎత్తు, హెచ్చింపుల వల్ల ఆలయానికి వైభవం చేకూరింది. పుష్ప, మానవ శిల్పాలు ఆలయానికి అందాన్ని తెచ్చిపెట్టాయి.

**సోలంకి శైలి:**

అనహిలపాటక (అనహిల్ ద్వారా) సోలంకి పాలకుల కాలంలోనే పశ్చిమ భారత నగర శైలి లక్షణాలు నిర్దిష్ట స్వరూపాన్ని సంతరించుకున్నాయి. ఈ పశ్చిమ భారత నగర శైలిని అక్కడి పాలకులైన సోలంకిల పేరున పిలిచారు. పశ్చిమ భారతదేశంలోని అనేక ఆలయాలలో స్వంత వ్యక్తిత్వం, పరిపూర్ణత కలిగిన కొన్ని ఆలయాలను పేర్కొనవచ్చు. దిల్వారాలోని ప్రసిద్ధ జైన మందిరాలలో (మౌంట్ అబూ (రాజస్థాన్) క్రీ.శ. 1032లో విమల నిర్మించిన ఆలయం, 1230లో తేజపాల నిర్మించిన ఆలయాలు ప్రముఖమైనవి. ఈ ఆలయాలలో రాజస్థాన్‌కు చెందిన పాలరాయిని పరిపూర్ణంగా వినియోగించారు. మరో ముక్యమైన ఆలయం రుద్ర మహాకాల్ ఆలయం. దీనిని సిద్దరాజు (1093–1143) నిర్మించాడు.

**పరమార శైలి:**

మాల్వా, ఖాన్‌దేశ్‌లలో మరో నగర శైలి అభివృద్ధి చెందింది. పరమార్ పాలకుల హయాంలో ఈ నిర్మాణ శైలి అభివృద్ధి చెందిన కారణంగా దానిని పరమారశైలి అని నిర్వచించారు. ఈ శైలిలో నిర్మాణమైన ఉత్తమ కట్టడం మధ్యప్రదేశ్‌లోని ఉదయపూర్ వద్ద గల నీలకంతేశ్వర ఆలయం. ఈ ఆలయాన్ని పరమార రాజు ఉదయాదిత్య (1059–1080) నిర్మించడంతో దానిని ఉదయేశ్వర ఆలయమని కూడా పిలుస్తారు. ఈ ఆలయ శిఖరాన్ని కింద నుంచి శిఖర స్థాయి వరకు నాలుగు సన్నటి రేఖలలో ముత్యాలతో అలంకరించారు. అంబరనాథ వద్ద గల ఆలయం (మహారాష్ట్రలోని థానే జిల్లాలో) పరమార శైలికి మరో మంచి వ్యక్తీకరణ.

**చోళ కల, నిర్మాణ శైలి:**

**ఆలయాల ముఖ్య లక్షణాలు:**

ఆలయాల నిర్మాణ శైలి ముఖ్యంగా ద్రవిడ చోళుల పాలనలో శిఖర స్థాయికి చేరుకుంది. చోళ ఆలయం యొక్క ముఖ్య లక్షణం విమాన లేదా అంతస్తు. తర్వాతి కాలంలో దీనిని గోపురం లేదా ప్రవేశ ద్వారం కప్పివేసింది. చోళుల పాలనలో ఆలయాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో, జీవన కేంద్రాలుగా మారాయి. గ్రామ సభ సాధారణంగా ఆలయ మండపంలో జరిగేది. చోళ ఆలయ నిర్మాణ శైలిలో మండపం అదనపు లక్షణంగా మారింది.

**తొలి ఆలయాలు:**

తమిళనాడులోని పుదుకొట్టయి జిల్లాలో తొలి చోళ ఆలయాలు ఎన్నో దర్శనమిస్తాయి. పల్లవుల కాలం నుండి చోళుల పాలన వరకు దక్షిణ భారత ఆలయ నిర్మాణ శైలిలో వచ్చిన మార్పులు, ప్రగతిని ఈ ఆలయాలు ప్రతిబింబిస్తాయి. అందులో ముఖ్యమైనది నార్థమలై (మేలమలై) వద్ద నిర్మించబడిన విజయాలయ చోళేశ్వర ఆలయం. ఈ శైలిలో నిర్మితమైన ఇతర ఆలయాలలో కుంభకోణం వద్దగల నాగేశ్వరస్వామి ఆలయం, శ్రీనివాస నల్లూర్ వద్దగల కురంగనాథ ఆలయం, తిరువలీశ్వరంలోని అగస్తేశ్వర, చోళేశ్వర ద్వంద్వ ఆలయాలు ముఖ్యమైనవి.

**పరిపక్వమైన ఆలయాలు:**

ఒకటవ రాజరాజ తంజావూరు వద్ద 1009లో నిర్మించిన శివాలయం (బ్రహదీశ్వర లేదా రాజరాజేశ్వర ఆలయం) ఈ పరిపక్వతకు నిదర్శనం. రాజరాజ ఏలుబడిలో చోళుల సాధించిన భౌతిక ప్రగతికి ఈ ఆలయం నిలువుటద్దం లాంటిది. మధ్యయుగ కాలంలో నిర్మాణమైన అన్ని ఆలయాలలోకెల్లా ఈ ఆలయం ఎత్తయినది (216 అడుగులు). దక్షిణ భారత నిర్మాణశైలిలో ఇది ఒక నిరుపమానమైన కళాఖండం. ఈ ఆలయంలో ఒకవైపు ఐరోపా టోపీ ధరించి ఉన్న ఒక వ్యక్తి తల శిలపై చెక్కబడి ఉంది. ఇది మార్కో పోలో (13వ శతాబ్దం చివరలో) శిరస్సు అయి ఉంటుందని భావిస్తారు. అతడు వెనీసు నుండి భారతదేశానికి పర్యటనపై వచ్చాడు. గంగైకొండ చోళపురంలోని ఆలయం (ఇది కూడా శివ లేదా బృహదీశ్వరునికి అంకితమైనది) ఒకటవ రాజరాజ సృష్టి. గత ఆలయానికి అన్ని విధాలా తలదన్నేలా ఈ ఆలయాన్ని తీర్చిదిద్దారు. క్రీ.శ. 1030లో నిర్మాణమైన ఈ ఆలయం అత్యంత వైభవోపేతంగా ఉంది. ఒకటవ రాజరాజుని కాలంలో చోళులు అత్యంత సంపన్నులుగా ఉండేవారని ఈ ఆలయ నిర్మాణ వైభవం బట్టి అర్థమవుతోంది. గత ఆలయం కంటే పొడవైనది కాకపోయినా విస్తరణలో మాత్రం అత్యంత విశాలమైనది.

**తర్వాతి ఆలయాలు :**

ఈ కోవ కిందికి రెండు చోళ ఆలయాలు వస్తాయి. అవి తంజావూరు జిల్లాలోని దారసురం వద్ద నిర్మాణమైన ఐరావతేశ్వర ఆలయం, త్రిభువనం వద్ద గల కంపహారేశ్వర ఆలయం.

**శిల్పాలు:** శిల్ప కళా రంగంలో కూడా చోళుల కాలం గొప్ప ప్రగతిని సాధించింది. చోళ శిల్ప కళలోని మూడు వర్గాలు నిలువెత్తు చిత్రాలు, ముఖ చిత్రాలు, అలంకరణ శిల్పాలు. శ్రీనివాస నల్లూర్ వద్దగల కురంగనాథ ఆలయంలో నిలువెత్తు విగ్రహాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. అలాగే కుంభకోణం వద్ద గల నాగేశ్వరస్వామి ఆలయంలో అనేక శిలా విగ్రహాలు ఉన్నాయి. తిరువలీశ్వరంలోని శివాలయం తొలి చోళ ముఖ చిత్ర

శిల్పకళకు మ్యూజియంలా ఉంది. తంజావూరు, గంగైకొండ చోళపురంలోని బృహదీశ్వర ఆలయాల గోడలపై అనేక ముఖ చిత్రాలు చెక్కబడ్డాయి. అవి చాలా పెద్దవిగా, ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దబడ్డాయి. క్రీ.శ. 9వ శతాబ్దంలో చోళ శిల్పులు కాంస్య విగ్రహాలను తయారు చేయడం మొదలుపెట్టారు. నటరాజ కాంస్య విగ్రహాలకు చోళులు ప్రసిద్ధులు. కుంభకోణంలోని నాగేశ్వరస్వామి ఆలయంలోని నటరాజ ప్రతిమ ఒక చక్కటి ఉదాహరణ. తంజావూరు జిల్లాలోని తిరుక్కదైయూర్‌లో లభించిన రామ, లక్ష్మణ, సీత, హనుమ విగ్రహాలు (కాంస్య) రాజరాజ పాలనలో రూపొందించబడిన చక్కటి కళాఖండాలు. అలంకరణ శిల్పకళ అనేక రూపాల్లో ప్రదర్శించబడింది. నిర్మాణ చిహ్నాలు, తీగలు, పుష్పాలు, జంతువులు, పక్షులు, నృత్యకారిణులు, పౌరాణిక, చారిత్రక పురుషుల చిత్రాలు చెక్కబడ్డాయి.

**చిత్రకళ:** చోళ కుడ్యచిత్రాలు విజయాలయ చోళేశ్వర, రాజరాజేశ్వర ఆలయాలలో కనిపిస్తాయి. విజయాలయ చోళేశ్వర ఆలయ గోడలపై మహాకాల, దేవి, శివుని అద్భుతమైన కుంచె చిత్రాలు ఇప్పటికీ కనిపిస్తాయి. రాజరాజేశ్వర ఆలయంలో శివుడిని నటరాజ, త్రిపురాంతక స్వరూపంలో చిత్రీకరించారు. అవి ఎంతో విశాలమైన, బలమైన వ్యక్తీకరణ గలవి.

**రాష్ట్ర కూట కళ, నిర్మాణ శైలి:** కళ, నిర్మాణ రంగాలను రాష్ట్ర కుట పాలకులు బాగా పోషించారు. రాష్ట్ర కుట నిర్మాణ శైలికి ఉత్తమ నిదర్శనం ఎల్లోరాలోని శివాలయం. అది రాతికొండ నుండి మలచబడింది. ఈ ఆలయాన్ని కైలాస ఆలయమని కూడా పిలుస్తారు. క్రీ.శ. 9వ శతాబ్దంలో ఒకటవ కృష్ణ దీనిని నిర్మించాడు. రాతి కొండ నుండి అద్భుతంగా మలచబడిన ఈ ఆలయం వైశాల్యంలో కూడా చాలా పెద్దది. దానిని రాతి కావ్యంగా సరిగ్గా నిర్వచించారు. ఎల్లోరాలోని రావణ-కా-ఖాయి, దశవతార గుహలు ఇతర ముఖ్య రాష్ట్ర కూట నిర్మాణాలు. రావణ-కా-ఖాయిలో చుట్టూ ప్రదక్షిణలు చేయడానికి తగిన స్థలం ఉంది. గర్భగుడి తర్వాత విశాలమైన మంటపం ఉంది. ఆలయ ముఖ్య శిల్పకళ సురదేవుడు రావణ కైలాస పర్వతాన్ని కుదిపివేస్తున్న దృశ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ శిల్పం ఎంత చక్కగా చెక్కబడిందంటే అది దాదాపు వృత్తాకారంలో ఉంది. దశావతార గుహలను బహుశా దంతి దుర్గ నిర్మించి ఉంటాడు. అందులో లోతైన మంటపం ఉంది. ఏకశిల మండపం బాహ్య చిత్రీకరణలతో ఉంది. శిల్పకళ ఉన్నతంగా, కాలాన్ని తట్టుకొని నిలబడగలిగే ప్రమాణాలను కలిగి ఉంది. అలాగే ఎల్లోరలో చారిత్రక ప్రాముఖ్యత గల తొలి శిలాశాసనాన్ని ఈ గుహలు కలిగి ఉన్నాయి.

**హోయసల కళ, నిర్మాణశైలి:** అనేక సందర్భాలలో హోయసల దేవాలయాలు ద్విజ నిర్మాణాలుగా వెలిశాయి. అంటే ఆలయంలోని వివిధ శిల్పాలు, స్తంభాలు, చిత్రాలు రెండేసి సార్లు కనిపిస్తాయి. ఇవి శిల్పి స్వంత నిర్మాణాలను తలపిస్తాయి. హాలేబీడులోని హోయసలేశ్వర ఆలయం అందుకు చక్కటి ఉదాహరణ. ఇందులో తొమ్మిది రేఖలు ఉన్నాయి. ఒక్కో రేఖలో వివిధ భంగిమలు గల అలంకరణ చిత్రాలు ఉన్నాయి. వీటిని శిల్పి నిర్మాణశైలిగా వర్ణిస్తారు. మైసూరు ప్రాంతంలో అసంఖ్యాక ఆలయాలు ఉన్నాయి. అవి కూడా ఉన్నత శిల్పకళను ప్రదర్శిస్తాయి. సోమనాథ పుర్ వద్దగల కేశవ ఆలయం, బేలూరు వద్దగల చెన్నకేశవ ఆలయం,

హాలేబీడులోని హోయసలేశ్వర ఆలయం ఇలాటి శైలికి నిదర్శనాలు. శ్రీరంగపట్నం సమీపంలోని సోమనాథపుర్ వద్దగల కేశవ ఆలయం 1268లో నిర్మాణమైంది. నేటికీ ఆ ఆలయం చెక్కుచెదరని స్థితిలో ఉంది.

**విజయనగర కళ, నిర్మాణ శైలి:**

విజయనగర పాలకుల ఆలయ నిర్మాణ కార్యక్రమం కొత్త నిర్మాణ శైలిని సృష్టించింది. దానిని విజయనగర శైలి అంటారు. ద్రవిడ శైలి లక్షణాలు ఉన్నప్పటికీ దానికి కూడా సొంత ప్రత్యేకమైన లక్షణాలు ఉన్నాయి. స్తంభాలు, మూలాలు అధిక సంఖ్యలో గల ఈ నిర్మాణశైలిలో క్లిష్టంగా చెక్కబడిన శిల్పాలు కొత్తదనాన్ని తీసుకువచ్చాయి. స్తంభాలపై సాధారణంగా అశ్వాల శిల్పాలను చెక్కారు. ఆలయాల్లో మండపం లేదా ప్రవేశద్వారాలు ఎత్తయిన వేదికపై వెలిశాయి. ప్రత్యేక సందర్భాల్లో మూల విరాట్టును ఈ వేదికపై ఉంచేవారు. ఈ ఆలయాల్లో కళ్యాణ మండపాలు కూడా ఉన్నాయి. అందులో ఉన్నతంగా తీర్చిదిద్దిన స్తంభాలు కనిపిస్తాయి. విజయనగర ఆలయాల్లో ప్రధాన భాగాన్ని గర్భగుడి ఆక్రమించింది. అక్కడ మూలవిరాట్టును ఉంచేవారు. అమ్మ ఆలయాన్ని దేవుని ప్రధాన సహచరిని ఉంచడానికి నిర్మించారు.

హంపీ-విజయనగరలో ముఖ్యమైన ఆలయాలు వెలిశాయి. విఠల స్వామి, కృష్ణస్వామి, హజరా రామస్వామి ఆలయాలు విజయనగర శైలికి మచ్చుతునకలు. ఆలయాల్లో పుష్పాలు, లతల అలంకరణ ఎక్కువగా కనిపిస్తుంది. తాడిపత్రి, పార్వతి దేవాలయాలు (చిదంబరం), వరదరాజ, ఏకాంబరనాథ ఆలయాలు (కంచిపురం) మరికొన్ని ఉదాహరణలు. రాయగోపురాలు కూడా ముఖ్యమైనవే. సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలను చక్రవర్తి సందర్శించినపుడు ఈ విజయ గోపురాలను నిర్మించారు.

20

# ఇండో - పర్షియన్ సంస్కృతి

క్రీ.శ. 13వ శతాబ్దం తొలి సంవత్సరంలో ఢిల్లీ సుల్తానుల రాజ్యం ఏర్పడడంతో భారతదేశ సాంస్కృతిక వికాసంలో కొత్త అధ్యాయం మొదలైంది. తుర్కు దండయాత్రికులు ఏ కోణం నుండి చూసినా అసభ్య అనాగరికులు కాదు. 9, 10వ శతాబ్దలలో మధ్య ఆసియాలోని తమ మాతృభూముల నుండి పశ్చిమాసియాకు వస్తూ వారు ఇస్లాం మతాన్ని స్వీకరించారు. ఆ ప్రాంతపు సంస్కృతిని కూడా బాగా జీర్ణించుకున్నారు. భారతదేశానికి వచ్చినపుడు వారికి ఇస్లాంలో నిర్ధారిత విశ్వాసం ఉండడంతోపాటు ప్రభుత్వం, కళ, నిర్మాణశైలి తదితర రంగాలపై ఖచ్చితమైన సిద్ధాంతాలు, ఆలోచనలు ఉండేవి. ఈ రంగాలపై మంచి పరిజ్ఞానం ఉన్న భారతీయులతో వారు కలిసినపుడు సుదీర్ఘ, సంపన్న సాంస్కృతిక వికాసం సంభవించింది. అయితే ఈ ప్రక్రియ ఎన్నో లోతుపాతులను ఎదుర్కొంది. అయితే అత్యంత ప్రాధాన్యత గల విషయం మాత్రం పరస్పర అవగాహన, విశ్వాస కల్పన చర్యలే. ఫలితంగా ఎన్నో రంగాలలో, ముఖ్యంగా కళ, నిర్మాణం, సంగీతం, సాహిత్యం, చివరకు ఆచారాలు, మత విశ్వాసాలలో కూడా సమ్మేళన ప్రక్రియ మొదలైంది. సమ్మేళన, సంఘర్షణ ప్రక్రియలు రెండు సమాంతరంగా నడిచాయి. అయితే ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి, ఒక కాలం నుండి మరో కాలానికి ఈ ప్రక్రియలు వేర్వేరుగా సంభవించాయి.

## ఇండో-పర్షియన్ నిర్మాణ శైలి:

ఢిల్లీ సుల్తాన్ రాజ్యం కొనసాగినంత కాలం నిర్మాణ రంగం ఎంతో పుంజుకుంది. తుర్కు సుల్తాన్‌లు, హిందూ రాజులు, సమాజంలోని ఇతర ధనిక వర్గాలు పోటీపడి ఉన్నత కట్టడాలను నిర్మించారు. ఈ కాలంలో వెలసిన అత్యధిక కట్టడాలు మసీదులు, ఆలయాలు, కోటలు కొన్ని ప్రాంతాలలో విజయ స్థూపాలను లేవనెత్తారు. మరికొన్ని ప్రాంతాలలో రాజ ప్రసాదాలు నిర్మాణమయ్యాయి. తుర్కు, ఆఫ్ఘన్ కట్టడాలలో చాలా వరకు మసీదులు, సమాధులు, మదరసలు కోటలు ఉన్నాయి. వారు నిర్మించిన కోటలు మాయమయ్యాయి లేదా శిథిలాలుగా మారాయి. అయితే మసీదులు, సమాధులు ఒక మోస్తరు సంఖ్యలో ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయి. వాటి ఆకారం కూడా చెక్కుచెదరలేదు.

**మౌలిక లక్షణాలు:** ఈ కాలపు నిర్మాణ శైలి ముఖ్య లక్షణాలలో సాంస్కృతిక సమ్మేళనం స్పష్టంగా గోచరిస్తుంది. తమ నిర్మాణాలలో తుర్కులు ఆర్చి-గోపుర పద్ధతిని పెద్ద ఎత్తున వాడారు. అయితే ఆర్చి కాని, గోపురం కాని తుర్కు లేదా ముస్లిం ఆవిష్కరణ కాదు. ఈ పద్ధతిని అరబ్‌లు రోమ్ నుండి అరువు తీసుకున్నారు. ముఖ్యంగా బైజాంటిన్ సామ్రాజ్యం నుండి ఈ పద్ధతిని అభివృద్ధిపరచి తమదైన నిర్మాణ శైలిని ఏర్పాటు చేసుకున్నారు. గోపురం వల్ల గగనతలానికి అందం చేకూరేది. వాస్తు శిల్పులు అనుభవాన్ని విశ్వాసాన్ని గడించేకొద్దీ గోపురాల వైశాల్యం, ఎత్తు పెరుగుతూ పోయాయి. ఈ విధంగా అనేక భారీ, అద్భుత కట్టడాలు నిర్మాణమయ్యాయి. ఆర్చి, గోపురం వల్ల స్తంభాలను ఎక్కువగా వాడే శ్రమ తప్పింది. స్పష్టమైన దృశ్యంగల విశాల మండపాలు వెలిశాయి. అలాటి సమావేశ స్థలాలు (వేదికలు) మసీదులతోపాటు రాజభవనాలలో కూడా అవసరమయ్యాయి. అయితే ఆర్చి-గోపురం పద్ధతికి బలమైన సిమెంటు అవసరమైంది. బలమైన సిమెంటు లేకుంటే రాళ్లను ఒక చోట స్థిరంగా ఉంచడం కష్టం. అందుకే తుర్కులు ఉన్నత నాణ్యతగల గచ్చు లేదా సిమెంటును తమ కట్టడాలలో వాడారు. ఆ విధంగా కొత్త నిర్మాణ స్వరూపాలు, నాణ్యతగల గచ్చు తుర్కుల రాకతో ఉత్తర భారతదేశంలో సర్వ వ్యాపితం అయ్యాయి.

భారతీయులు సాధారణంగా అనుసరించిన నిర్మాణ పద్ధతిలో రాళ్లను ఒకదానిపై ఒకటి పేరుస్తూ బీముల సహాయంతో బండరాళ్ల కప్పును పరిచేవారు. దీనిని స్లాబ్, బీము పద్ధతి అంటారు. మొదటి నుండి కూడా భారతీయులకు ఆర్చి-గోపురం పద్ధతి గురించి తెలిసినా దానిని విశాలస్థాయిలో ఎప్పుడూ వినియోగించలేదు. అయితే తుర్కు పాలకులు ఈ పద్ధతితోపాటు స్లాబ్-బీము పద్ధతిని కూడా తమ కట్టడాలలో వినియోగించారు.

అలంకరణ విషయానికి వస్తే తుర్కులు మానవ, జంతువుల ఆకారాలు, చిత్రాలను తమ కట్టడాల నుండి మినహాయించారు. అందుకు భిన్నంగా వారు త్రికోణ, పుష్ప-లత డిజైన్లను వాడారు. వాటికి ఖురాన్ బోధనల శిల్పలిపిని చేర్చారు. ఆ విధంగా అరబ్ లిపి స్వయంగా ఒక కళాకృతిగా మారింది. ఈ అలంకరణ కలయికను 'అరబేస్క్' అని పిలిచారు. హిందూ చిహ్నాలైన ఎద్దు, స్వస్తిక్, కమలం తదితర వాటిని స్వేచ్ఛగా వినియోగించారు. తుర్కులు తమ కట్టడాలకు రంగును కూడా జతచేశారు. ఎర్ర ఇసుకరాయి, పచ్చని ఇసుకరాయి, పాలరాతిని ఎక్కువగా వాడారు.

## ఢిల్లీ సుల్తాన్‌ల కృషి:

ఢిల్లీ సుల్తాన్ రాజ్యాన్ని పాలించిన అనేక వంశాల కింద ఇండో-పర్షియన్ నిర్మాణశైలి వికసించిన తీరును అధ్యయనం చేస్తే ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. బానిస పాలకవంశం కింద హిందూ ఆలయాలు, ఇతర కట్టడాలను మసీదులుగా మార్చివేశారు. ఢిల్లీలోని కుతుబ్‌మినార్ వద్దగల కువ్వత్-ఉల్-ఇస్లాం మసీదు అందుకు ఒక ఉదాహరణ. పూర్వం అది జైన మందిరంగా ఉండేది. దానిని హిందువులు విష్ణు ఆలయంగా మార్చారు. తదుపరి

కాలంలో సుల్తాన్ ఆ ఆలయాన్ని మసీదుగా మార్చారు. అజ్మేర్ వద్దగల అఢాయిదిన్‌కా ఝోప్డా (రెండున్నర రోజుల గుడిసె) మరో ఉదాహరణ. గతంలో అది జైన వసతిగా ఉండేది. తొలి నిర్మాణాల ప్రత్యేక లక్షణం ఏమిటంటే మేస్త్రీలకు ఆర్చి–గోపుర నిర్మాణ పద్ధతి సక్రమంగా తెలియదు. అలాగే వారి కట్టడాలు కూడా దృశ్యపరంగా అంత అందమైనవి కావు. వాస్తవానికి అల్లావుద్దీన్ ఖిల్జీ కాలంలోనే సరైన నిర్మాణ పద్ధతిని పాటించారు. బానిస సుల్తాన్‌లు నిర్మించిన అత్యంత అద్భుతమైన కట్టడం కుతుబ్‌మినార్. కుతుబుద్దీన్ ఐబక్ నిర్మాణాన్ని ప్రారంభించగా ఇల్తుమిష్ దానిని పూర్తిచేశాడు. ఎత్తయిన ఆ శిఖరాన్ని సూఫీ సంతు కుతుబుద్దీన్ ఖబ్తియార్ కాకికి అంకితమిచ్చారు. కాకిని ఢిల్లీ ప్రజలు ఆరాధించేవారు. భారతదేశంతోపాటు పశ్చిమాసియాలో కూడా శిఖరాల నిర్మాణం సాధారణమే అయినప్పటికీ కుతుబ్‌మినార్ అనేక విధాలుగా విభిన్నమైనది. బాల్కనీలను ఎంతో నైపుణ్యంగా నిర్మించి వాటిని ప్రధాన స్థూపంతో జత చేయడం వల్లే కుతుబ్‌మినార్‌కు ఎనలేని అందం, వైభవం చేకూరాయి. ఎర్ర, తెల్లటి ఇసుకరాయి వాడకం, అలలను తలపించే గోడలు దానికి ప్రత్యేకతను చేకూర్చాయి.

ఖిల్జీ కాలంలో కూడా ఎన్నో నిర్మాణాలు జరిగాయి. అల్లావుద్దీన్ తన రాజధానిని సిరివద్ద నిర్మించాడు. కుతుబ్ మినార్‌కు ఆ ప్రాంతం కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే ఆ నగరానికి సంబంధించిన ఆనవాళ్లు ఏమీలేవు. కుతుబ్ కంటే రెండింతలు ఎత్తుగల మినార్‌ను నిర్మించాలని అల్లావుద్దీన్ యోచించాడు. అయితే తన కల నెరవేరేలోపే అతడు మరణించాడు. అయితే అతడు కుతుబ్ మినార్‌కు ఒక ప్రవేశ ద్వారాన్ని జతపరిచాడు. ఈ ద్వారాన్నే అలాయ్  దర్వాజ అంటారు. అందమైన ఆర్చీలు ఎన్నో దాని చుట్టూ ఉన్నాయి. తొలిసారిగా ఖచ్చితమైన పద్ధతిలో అక్కడ గోపురాన్ని నిర్మించారు.

తుగ్లక్ కాలంలో కూడా అనేక కట్టడాలు నిర్మాణమయ్యాయి. తుగ్లకాబాద్ అనే విశాలమైన రాజప్రసాద కోటల సముదాయాన్ని గియా సుద్దీన్, ముహమ్మద్ తుగ్లక్‌లు నిర్మించారు. గియాసుద్దీన్ స్మారక స్థూపం నిర్మాణ శైలిలో కొత్త పోకడలను ప్రారంభించింది. మంచి ఆకార దృశ్యం కోసం ఆ కట్టడాన్ని ఎత్తయిన వేదికపై నిర్మించారు. జారుడు గోడలు తుగ్లక్ నిర్మాణ శైలిలో ప్రత్యేక లక్షణం. వాటి వల్ల కట్టడానికి బలం, మద్దతు లభించేది. అయితే ఫిరోజ్ తుగ్లక్ నిర్మించిన కట్టడాలలో ఏటవాలు గోడలు కనిపించవు. రెండవ లక్షణం ఆర్చి–గోపురం పద్ధతిని స్లాబు – బీము పద్ధతిలో మేళవించడం. ఫిరోజ్ నిర్మాణాలలో ఇది ప్రస్ఫుటమవుతుంది. హౌజ్ ఖాస్‌లో (విహార విడిది) అంతస్తులకు (ఒకదాని విడచి మరోదానికి) ఆర్చీలు, స్లాబ్, బీడు ఉన్నాయి. కోట్ల అనే కోటలో కూడా ఇలాటి నిర్మాణ పద్ధతి కనిపిస్తుంది. తుగ్లక్‌లు తమ కట్టడాలలో ఖరీదైన ఇసుకరాళ్లను వాడలేదు. చవకగా లభించే నల్లని రాయినే వాడారు. ఇలాటి రాళ్లను ఒలచడం కష్టం కాబట్టి తుగ్లక్ కట్టడాలలో పరిమితమైన అలంకరణ మాత్రమే కనిపిస్తుంది.

తుర్కులు కొత్తగా తీసుకొచ్చిన నిర్మాణ పద్ధతులను భారతీయ శైలిలో మేళవించే సాంప్రదాయాన్ని లోఢీలు మరింత బలపరిచారు. ఆర్చి–గోపురం, స్లాబ్–బీమ్ పద్ధతులను కలిపి తమ కట్టడాలను నిర్మించారు. బాల్కనీలు, గుడారాలు, గుజరాతి – రాజస్థాని శైలిలోని గుహలను కూడా ఉపయోగించారు. ఎత్తయిన వేదికలపై తమ కట్టడాలను లోఢీలు నిర్మించారు. ముఖ్యంగా సమాధులు, స్మారక స్తూపాలు ఈ పద్ధతిలో నిర్మాణమయ్యాయి. ఫలితంగా వాటికి ఆకాశ హర్మ్యం స్థాయి లభించింది. కొన్ని సమాధులను ఉద్యానవనాల మధ్యలో నిర్మించారు. ఢిల్లీలోని లోఢి ఉద్యానవనం ఇందుకో చక్కటి ఉదాహరణ. ఈ లక్షణాలను చాలావరకు తర్వాతి కాలంలో మొగల్ పాలకులు ఉపయోగించారు. షాజహాన్ నిర్మించిన తాజ్‌మహల్‌లో ఆయా నిర్మాణ శైలుల సంగమం కనిపిస్తుంది.

ఈ కాలానికి చెందిన ముస్లిం కట్టడాలు ముస్లిం ఆదేశాలు, ఇస్లాం సూత్రాలకు లోబడి నిర్మాణమైనా వాటిని హిందూ మేస్త్రీలు, వాస్తు శిల్పులు నిర్మించారు. ఇండో– ముస్లిం కట్టడాలకు స్వంత వినూత్నత్వం ఉంది. సమకాలీన మసీదులు సమాధులతో అవి చాలా విషయాల్లో భిన్నంగా ఉన్నాయి. ఈ వినూత్నత్వం భారతీయ వాతావరణం, భారతీయ వృత్తిదారుల కానుక. అలాగే ముస్లిం కళ సాంప్రదాయాలు హిందూ సిద్ధాంతాలను ప్రభావితం చేశాయి. దాంతో ఈ కాలపు ఆలయాలు ప్రాచీన కట్టడాలకు భిన్నమైన వర్గంగా ప్రత్యక్షమయ్యాయి. రాజపుత్రులు కూడా ఛత్రీలను నిర్మించడం మొదలుపెట్టారు. ముస్లిం సమాధులకు అవి హిందూ నకళ్లు. ఆర్చి–గోపురం పద్ధతిని హిందూ కట్టడాల నిర్మాణంలో కూడా పాటించారు. అయితే నిర్దిష్టమైన సంగమానికి సమయం ఆసన్నం కాలేదు. తర్వాతి కాలంలో అక్బర్ మహాచక్రవర్తి దానిని సాధించాడు.

### ఇండో పర్షియన్ కళలు:

### సంగీతంపై ఇస్లామిక్ ప్రభావం:

సంగీతాన్ని చట్ట వ్యతిరేకమైనదిగా ఇస్లాం ఖండిస్తుంది. ఈ నిషేధం ఉన్నప్పటికీ ఈ కళ ముస్లిం పాలిత భూభాగాల నుండి పూర్తిగా మాయం కాలేదు. వాస్తవానికి భారతదేశానికి వచ్చిన తుర్కులు అరబిక్ సంగీతాన్ని వారసత్వంగా పొంది దానిని ఇరాన్, మధ్య ఆసియాలలో మరింత సంపన్నం చేశారు. భారతీయ సంగీత విద్వాంసులు, పార్సీ – అరబ్ సంగీతకారుల మధ్య క్రమబద్ధ సంబంధం భారతదేశంలో ఢిల్లీ సుల్తాన్ రాజ్యం కింద మొదలైంది.

అలాగే ఈ కాలంలో దక్షిణ భారతదేశానికి చెందిన కర్ణాటిక సంగీతానికి భిన్నమైన హిందుస్తానీ సంగీతం ఉత్తర భారతదేశంలో ఆవిర్భవించింది. తుర్కులు తమతోపాటు ఎన్నో కొత్త సంగీత వాయిద్యాలను తీసుకువచ్చారు. ముఖ్యంగా రబాబ్, సారంగి, అలాగే కొత్త ధ్వనులు, ధ్వని రచనలు తీసుకువచ్చారు. ఖుస్రో కొత్త రాగాలను ప్రవేశపెట్టాడు. అయిమన్,

ఘోరా, సనమ్ తదితర రాగాలు అందులో ఉన్నాయి. సితార్‌ను కూడా అతడు రూపొందించాడు. అయితే అందుకు తగిన సాక్ష్యంలేదు. తబ్లా 17 లేదా 18వ శతాబ్దంలో రూపొందించబడింది. సంగీత రంగంలో సమీకృత ప్రక్రియ ఫిరోజ్ తుగ్లక్ పాలనలో కూడా కొనసాగింది. రాగదర్పణ్ అనే భారతీయ ప్రాచీన కృతిని పార్సీలోకి అనువదించారు. సూఫీ నిలయాలనుండి పాలకవర్గ ప్రముఖుల నివాసాలకు సంగీత కచేరీలు విస్తరించాయి. హిందుస్తానీ వాయిద్యం కర్నాటక సంగీతంతో ఎప్పటి నుండి విభేదించడం మొదలుపెట్టిందో మనకు ఖచ్చితంగా తెలియదు. అయితే ఈ వైరుధ్యం చాలా వరకు పార్సీ- అరబిక్ గాత్రాలు, వాయిద్యాల సమ్మేళం వల్లే ఉండేదని చెప్పడంలో ఎలాంటి సందేహంలేదు.

**ఆచారాలు, వేడుకలపై ప్రభావం:**

ఇండో-పర్షియన్ సాంస్కృతిక వికాసాన్ని ఆచారాలు, వేడుకల రంగాలలో కూడా చూడవచ్చు. ఇరు సముదాయాల మత విశ్వాసాలు, ఆచారాలలో ఈ సమ్మేళనం కనిపిస్తుంది. ఒక సముదాయ ఆచారాలు మరో సముదాయ ప్రజలను పరస్పరం ప్రభావితం చేశాయి. ఉన్నత వర్గ హిందూ మహిళలు పెద్ద ఎత్తున పర్దాను పాటించడానికి పూర్తిగా ముస్లిం మహిళలే మార్గదర్శకులు. ఒక సముదాయ మత, సామాజిక వేడుకలను మరో సముదాయం జరుపుకోవడం మొదలుపెట్టాయి. ఇస్లాం స్వీకరించిన ముస్లింలలో ఇలాంటి సమ్మేళనం స్పష్టంగా ఉండేది. తమ పూర్వపు హిందూ ఆచార వ్యవహారాలను వారు కొనసాగించారు. ఒక సముదాయ మత విశ్వాసాలు కూడా మరో సముదాయాన్ని ప్రభావితం చేశాయి. భక్తి ఉద్యమ నాయకులు ఇస్లామిక్ సిద్ధాంతాలు, సూఫీ బోధనలతో ప్రభావితమయ్యారు. మరోవైపు సూఫీ నాయకులు కూడా హిందూ సిద్ధాంతాలు, ఆచారాలతో ప్రభావితమయ్యారు. ఈ కలయిక యొక్క ప్రధానమైన ఫలితం కబీర్, నానక్‌ల ఎదుగుదలే. వారు ఇస్లాం, హిందూ మతాలు రెండింటి నుండి తమ సిద్ధాంతాలు, ఆలోచనలను గ్రహించారు.

**భాష - సాహిత్యం :** భాష-సాహిత్య రంగానికి వస్తే ఒక కొత్త భాష అయిన పార్సీని తుర్కులు భారతదేశంలో ప్రవేశపెట్టారు. పార్సీ భాష అభివృద్ధికి తొలి కేంద్రంగా లాహోర్ ఆవిర్భవించింది. అయితే తుర్కు పాలన బలపడే కొద్దీ పార్సీ భాష దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా వేగంగా విస్తరించింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించింది. దేశంలో తొలి పార్సీ సాహిత్యం కేవలం పార్సీ సాంప్రదాయాన్నే ప్రతిబింబించింది. అయితే క్రమంగా భారతీయ అంశాలు కూడా ఆ భాషలో తమ స్థానాన్ని పదిలపరచుకున్నాయి. అప్పటికే పార్సీకి భారతీయ సాహిత్యంతో పరిచయం ఎక్కువైంది. ఈ కాలపు అత్యంత ప్రముఖ పార్సీ రచయిత అమీర్ ఖుస్రో. తాను భారతీయుడినని అతడు గర్వంగా చెప్పుకునేవాడు. భారతీయులతో తమ వాళ్లకు పెరుగుతున్న సాంస్కృతిక సాన్నిహిత్యాన్ని తుర్కులు ఇక ఎంత మాత్రం అంగీకరించలేదని చెప్పడానికి ఖుస్రో చూపిన దేశభక్తే నిదర్శనం. ఖుస్రో అనేక పద్య గ్రంథాలను రచించాడు. వాటిలో ప్రణయ కావ్యాలు కూడా ఉన్నాయి. అన్ని కవితా శైలులతో అతడు ప్రయోగం చేశాడు. సబక్-ఎ-హింద్ అనే కొత్త పార్సీ రచనా శైలిని సృష్టించాడు.

అతడి కృతుల ప్రాముఖ్యత ఏమిటంటే అవి భారతీయ పార్సీ, ఇస్లామిక్ సాహిత్య ఆవిర్భావానికి నాంది పలికాయి. పద్ధతి ప్రకారం అతడి కవిత్వం పార్సీ అయినా వ్యక్తీకరణలో మాత్రం భారతీయ సాంప్రదాయాన్ని స్ఫూరించింది.

గతంలో అధికార భాషగా ఉన్న సంస్కృతం స్థానాన్ని ఇప్పుడు పార్సీ దక్కించుకుంది. అయితే భారతీయులకు పార్సీ పరిజ్ఞానం తక్కువగా ఉండడంతో ప్రాంతీయ భాషలతోపాటు పార్సీని కూడా అధికార విధుల కోసం వినియోగించారు. అయితే ప్రాంతీయ భాషల వాడకంవల్ల సంస్కృత రచనలు ఆగిపోలేదు. వాస్తవానికి సంస్కృత కవులను అప్పటికీ అనేక మంది స్థానిక పాలకులు, అలాగే ధనిక జైన వ్యాపారులు పోషించారు. ఫిరోజ్ తుగ్లక్ హయాంలో అనేక సంస్కృత గ్రంథాలు పార్సీలోకి అనువాదమయ్యాయి. అయితే పార్సీ కృతులను సంస్కృతంలోకి అనువదించడానికి ఎలాంటి ప్రయత్నాలు జరగనట్లు బోధపడుతోంది. ఆ విధంగా దేశంలో పార్సీ, సంస్కృతం వారధి భాషలుగా విధులు నిర్వహించాయి. భాష–సాహిత్య రంగంలో భారతీయ, పార్సీ సంస్కృతుల కలయిక వల్ల ఉర్దూ ఒక స్వతంత్ర భాషగా ఆవిర్భవించింది. (14వ శతాబ్దం చివరలో). పార్సీ పదాలు, పద రూపకాలు, సాహిత్య రూపకాలు, వ్యక్తీకరణలే కాకుండా సంస్కృతం, హిందీ లాంటి భారతీయ భాషల రూపకాలను అరువు తీసుకొని ఉర్దూ ఒక ఘనమైన భాషగా అభివృద్ధి చెందింది. ఆ విధంగా అది ఒక మిశ్రమ భాష. భారత ప్రజలు, అల్లావుద్దీన్ ఖిల్జీ, మహమ్మద్ తుగ్లక్‌ల సైనికుల మధ్య ఉర్దూ అనుసంధాన భాషగా ఉపయోగపడింది. తొలుత బీజాపూర్, గోల్కొండ రాజ్యాలలో ఉర్దూ వికసించింది.

**పార్సీ చారిత్రక కృతులు :** ముస్లిం పాలక వంశాల చరిత్రను వివరించే అనేక సమకాలీన, పాక్షిక సమకాలీన పార్సీ గ్రంథాలు ఉన్నాయి. దేశంలోని రాజకీయ, సైనిక ఘటనలు లేదా పరిణామాలను అవి నమోదు చేశాయి. చాలా వరకు ముస్లిం ప్రపంచానికి సంబంధించిన సాధారణ చరిత్రలు వెలువడ్డాయి. వాటిలో మధ్యయుగ భారతీయ చరిత్ర కొంత స్థానాన్ని సంపాదించింది. అయితే మధ్యయుగ చరిత్రకు సంబంధించిన అనేక వర్ణనలు కూడా వెలువడ్డాయి. కొన్ని ఉదంతాలలో అవి ప్రత్యేకమైన ప్రాంతాలు, పాలకవర్గాలు లేదా పాలకుల వివరాలను అందజేశాయి. పార్సీ చారిత్రక రచనలు రెండు ప్రధాన లోపాలతో దెబ్బతిన్నాయి. రచయితలు సాధారణంగా రాచరిక ఆస్థానాలతో ముడిపడి ఉండడంవల్ల, రాచరిక దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండడం వల్ల చారిత్రక పరిణామాలను నిష్పక్షపాతంగా అందించలేకపోయారు. పైగా కొన్నిసార్లు వారు మత మౌఢ్యంతో ప్రభావితమయ్యారు. కేవలం హిందువుల విషయంలోనే కాకుండా ఉదారవాద ముస్లిం పాలకులపట్ల కూడా (మహమ్మద్ తుగ్లక్) వివక్షతో వ్యవహరించారు. రెండవ లోపం ఏమిటంటే వారి దృష్టి రాచరిక ఆస్థానం, సైనిక స్థావరంపైనే కేంద్రీకృతమై ఉండేది. ప్రజల జీవన స్థితిగతులు, సామాజిక–ఆర్థిక పరిణామాల గురించి వారు చాలా తక్కువగా పట్టించుకున్నారు.

**మిన్‌హజ్–ఉస్–సిరాజ్ :** తబాకత్–ఎ–నాసిరి అనే గ్రంథాన్ని రచించిన మిన్‌హజ్–ఉస్–సిరాజ్ క్రీ.శ.1193లో జన్మించాడు. ఇల్తుమిష్ పాలనా కాలంలో అతడు

ప్రభుత్వ సేవలో చేరాడు. ఢిల్లీ ప్రధాన కాజీగా విధులు నిర్వహించాడు. న్యాయాధికారంతోపాటు ఆస్థాన ప్రముఖుడు కావడంవల్ల అతడు చరిత్ర రచనలో రాజకీయ విచక్షణను పాటించాడు. ఆదాము జననం నుండి క్రీ.శ.1260 వరకు ఉన్న ఇస్లాం చరిత్రను "తబాకత్"లో పొందుపరిచాడు.

అప్పటి పాలకుడు నసీరుద్దీన్ మహమ్మద్ పేరున ఆ చారిత్రక గ్రంథానికి నామకరణం చేశాడు. సుల్తాన్ రాజ్యాన్ని వివరించే అధ్యాయం ముఖ్యమైనది. ఎందుకంటే రచయిత సమకాలీనుడు. ఆ కాలపు పరిణామాలను చాలా దగ్గరి నుండి పరిశీలించినవాడు. వివిధ ఆధారాల నుండి సమాచారాన్ని సేకరించడానికి ఎంతో శ్రమ పడ్డాడు. స్వచ్ఛమైన లేదా పరిపూర్ణమైన రాజకీయ చరిత్రను అతడు మనకు వారసత్వంగా మిగిల్చి వెళ్లాడు. ముహమ్మద్ ఘురి, ఇల్తుమిష్‌ల సమీప సహచరుల జీవితాలను తబాకత్-ఎ-నసీరీ వివరిస్తుంది. తనకు ప్రయోజనం కలిగించిన వారిపై సిరాజ్ ప్రశంసలు కురిపించాడు. తన స్వంత దృష్టికోణానికి అనుగుణంగా వాస్తవాలను దాచిపెట్టాడు లేదా వాటిని వక్రీకరించాడు. తనకు దురభిప్రాయం ఉన్న వారి గురించి, వారి రాజకీయ జీవితాల గురించి వివరాలను మినహాయించాడు. ఉలేమాల వ్యక్తిత్వంలోని దుష్టకోణాన్ని బహిర్గతం చేశాడు. భౌతిక విజయాల కోసం ముల్లాలు స్వార్థంతో ఎలా వ్యవహరించారో వెల్లడించాడు.

**జియావుద్దీన్ బరానీ :** ఫిరోజ్ షా తుగ్లక్ పేరున బరానీ రచించిన "తారీఖ్-ఎ-ఫిరోజ్ షాహీ" సుల్తాన్ రాజ్యకాలంలో వెలువడిన అత్యంత విలువైన చారిత్రక కృతులలో ఒకటి. బాల్బన్ పాలన తొలి సంవత్సరం (1266) నుండి అది మొదలై ఫిరోజ్ తుగ్లక్ ఆరవ పాలనా సంవత్సరంతో ముగుస్తుంది (1357) తబాకత్-ఎ-నాసీరీ ముగింపు తర్వాతి ఆరేళ్ల కాలాన్ని ఈ గ్రంథం నమోదు చేయలేదు. "తారీఖ్-ఎ-ఫిరోజ్ షాహీ" గ్రంథాన్ని పూర్తి చేసే నాటికి బరానీకి 74 ఏళ్లునిండాయి. ఒక ప్రభుత్వ అధికారి కుమారుడైన బరానీ తన 17వ ఏట ముహమ్మద్ తుగ్లక్ పాలనా కాలంలో ప్రభుత్వ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగం సంపాదించాడు. "ఒక చరిత్రకారుని విధి సత్యానికి, నిజాయితీకి కట్టుబడి ఉండడం. తాను చెప్పదలచుకున్నది నిర్భయంగా చెప్పడం. వాస్తవాలను బహిర్గతం చేయడంలో అవరోధాలు ఏవైనా తలెత్తితే వాటిని సూచనలు, పర్యవసానాల రూపంలో పరోక్షంగా వ్యక్తం చేయాలి," అని బరానీ పేర్కొన్నాడు. తాను రాసినదంతా వాస్తవమేనని అతడు అనేక సందర్భాలలో వాదించాడు. అయితే ఫెరిష్టా (17వ శతాబ్దపు చరిత్రకారుడు) మాత్రం బరానీ వాస్తవాలను తొక్కిపెట్టాడని నిందించాడు. ఘటనా క్రమానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం బరానీ తీవ్ర లోపాలలో ఒకటి. అలాగే అతడి ధోరణి కూడా క్రమబద్ధమైనది కాదు. కొన్ని సందర్భాలలో అది అసంపూర్ణంగా ఉంది. వేర్వేరు ఆధారాలు, వర్గాల నుండి అతడు సమాచారాన్ని సేకరించాడు. ముఖ్యంగా రాచరిక దర్బారుతో సన్నిహిత సంబంధాలున్న వ్యక్తుల నుండి వివరాలను రాబట్టాడు. అయితే అతడి సమన్వయం చాలా పరిమితంగా ఉండేది. ఉదాహరణకు మాలిక్ కఫూర్ దక్కను దండయాత్రల గురించి అతడు అందించిన వర్ణన చాలా క్లుప్తంగా, అసంతృప్తికరంగా ఉంది.

చరిత్ర రచనలో బరానీ పాటించిన ప్రత్యేక పద్ధతి సంభాషణలను (చర్చలను) నమోదు చేయడం. అతడి వర్ణనలోని ఈ భాగాలు తీవ్ర సందేహాలను రేకెత్తిస్తాయి. అయితే ఇలాంటి పద్ధతిని పాటించడం ఆ కాలపు చరిత్రకారులకు అసాధారణ సాంప్రదాయమేమి కాదు. అమీర్ ఖుస్రో, ఇసామీ, ఇబ్న్ బటుటా రచనలలో ఇలాంటి ఉదంతాలు కనిపిస్తాయి. బరానీ రచించిన తారీఖ్-ఎ-ఫిరోజ్ షాహీలోని అత్యంత ముఖ్యమైన లక్షణం పాలనా వ్యవహారాలపై అతడు చూపిన శ్రద్ధ. ముఖ్యంగా రెవెన్యూ యంత్రాంగం, నిత్యావసర వస్తువుల ధరలపై అతడు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాడు. ఈ విషయంలో అతడు కొత్త పంథాను స్థాపించాడు. ఇతర మధ్యయుగ చరిత్రకారుల వలె తన దృష్టిని కేవలం పాలకులు, ఆస్థానాలు, యుద్ధాలపైనే కేంద్రీకరించకుండా ఆధునిక చరిత్రకారులకు ఆసక్తి ఉన్న చారిత్రక అంశాలను కూడా వివరించాడు. అతడి రచనా శైలి అస్పష్టంగా ఉంది. కొన్నిసార్లు వైరుధ్యాలు కనిపిస్తాయి. ఆధునిక అన్వయింపుదారులకు ఎన్నో సమస్యలను కలిగిస్తుంది. ఫతావా-ఎ-జహాందారీ అనే మరో గ్రంథాన్ని కూడా బరానీ రచించాడు. రాజ్య వ్యవహారాలపై సూత్రావళి ఆ గ్రంథం. ఇస్లామిక్ ఆదర్శ రాజ్యాన్ని (ప్రభుత్వాన్ని) అది వివరిస్తుంది. ఈ గ్రంథానికి ఎలాంటి తాత్విక ఆధారం లేదు. అలాగే ఆచరణాత్మక పరిజ్ఞానమూ లేదు.

**ఇసామీ :** ఇసామీ రచించిన "ఫతు-ఉస్-సలాతిన్" పార్సీ గ్రంథం రచనా శైలిలో ఫిరదౌసీ "షాహ్‌నామా"తో పోలి ఉంది. ఇసామీ మహమ్మద్ తుగ్లక్ సమకాలీకుడు. "ఫతు-ఉస్-సలాతిన్" ఘజినికి చెందిన యామినిల ఆవిర్భావం నుండి ముహమ్మద్ తుగ్లక్ పాలన వరకు సంభవించిన చారిత్రక ఘటనలను నమోదు చేసింది. తుగ్లక్ పాలనా కాలంలో ఈ రచయిత కుటుంబం రాచరిక పోషణను కోల్పోయింది. రాజధానిని ఢిల్లీ నుండి దేవగిరికి తరలించే సమయంలో అతడి కుటుంబం దక్కనుకు వలస పోయింది. ఈ విషయం లేదా వాస్తవం ఇసామీ రచనలో వ్యక్తిగత దురభిప్రాయాన్ని ప్రవేశపెట్టింది. మహమ్మద్ తుగ్లక్ పాలనను అతడు నిశితంగా విమర్శించాడు. కాని మామ్లూక్, ఖిల్జీ సుల్తాన్‌ల పాలన గురించి ముఖ్యమైన వివరాలను అతడు అందించాడు. అతడి చరిత్ర గ్రంథం యొక్క ప్రత్యేకత సామాజిక, సాంస్కృతిక జీవనానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను అందించడంలోనే ఉంది.

**షమ్స్-ఎ-సిరాజ్ అఫీఫ్ :** ప్రభుత్వ అధికారుల కుటుంబంలో అఫీఫ్ జన్మించాడు. ఫిరోజ్ తుగ్లక్ అతడిని రెవెన్యూ శాఖలో నియమించాడు. బరానీ అసంపూర్ణ కృతిని పూర్తి చేయడమే అతడి లక్ష్యం. తారీఖ్-ఎ-ఫిరోజ్ షాహీని తన పోషకుడికి బరానీ అంకితం ఇచ్చినా సుల్తాన్ మరణం తర్వాతనే ఆ గ్రంథం పూర్తయ్యింది. ఎందుకంటే తైమూర్ దండయాత్రలో తుగ్లక్ వంశం తుడిచిపెట్టుకుపోయింది. బరానీ వర్ణన ముగిసిన చోట అఫీఫ్ కృతి మొదలవుతుంది. ఫిరోజ్‌షా తుగ్లక్ పాలనపై అది ప్రత్యక్ష వ్యాఖ్యానం. అయితే దానికి కొన్ని లోపాలున్నాయి. కవితాశైలిలో వర్ణించడం అఫీఫ్‌కు చాలా సరదా. కవితా వచనం కారణంగా స్పష్టమైన వివరణ లభించడం కష్టం. అతడి వ్యాఖ్యానాలు చాలా వరకు అతిశయాలే. కాని కేవలం ఒక్క ప్రభుత్వానికే పరిమితం కావడంవల్ల ఆ కృతి కేంద్రీకృత వర్ణనను అందిస్తుంది.

పైగా పాలనతోపాటు ప్రధాన సంస్థానాధీశుల జీవిత చరిత్రల గురించి ఎన్నో వివరాలను అందిస్తుంది.

**అహ్మద్ సర్హిందీ :** యాహ్యా బిన్ అహ్మద్ సర్హిందీ తారీఖ్–ఎ–ముబారక్ షాహీ అనే గ్రంథాన్ని రచించాడు. దానిని సయ్యద్ వంశానికి చెందిన సుల్తాన్ ముబారక్‌షాకు అంకితమిచ్చాడు. ముహమ్మద్ ఘోరి పాలనతో మొదలై 1434 సంవత్సరంతో ఆ గ్రంథం ముగుస్తుంది. తాను ఫిరోజ్ షా తుగ్లక్ పట్టాభిషేకానికి ముందు జరిగిన పరిణామాలను ఇతర చారిత్రక గ్రంథాల నుండి సేకరించానని, తర్వాతి కాలంలో సంభవించిన ఘటనలను తాను ప్రత్యక్షంగా వీక్షించి నమోదు చేశానని అహ్మద్ చెప్పాడు. ఫిరోజ్ పాలన చివరి సంవత్సరాలను వివరించేందుకు అఫీఫ్ అందించిన నామమాత్రపు సమాచారాన్ని ఉపయోగించాడు. 1400 నుండి 1434 వరకు జరిగిన పరిణామాలను తెలుసుకోవాలంటే అహ్మద్ సర్హిందీ ఒక్కడిపైనే ఆధారపడాలి. చరిత్ర రచనలో అతడు బాధ్యతాయుతంగా, నిజాయితీగా వ్యవహరించినట్లు బోధపడుతోంది. గత చరిత్రకారులంతా సున్నీలైతే అహ్మద్ సర్హిందీ షియా వర్గానికి చెందిన వాడు.

**ఇతర చరిత్రకారులు :** ప్రముఖ ఇండో–పర్షియన్ కవి అమీర్ ఖుస్రో రచనలు కొన్నింటిలో విలువైన చారిత్రక సమాచారం లభిస్తుంది. అతడి వచనా కృతులలో ఒకటైన "ఖాజాయిన్– ఉల్–ఫతు" అల్లావుద్దీన్ ఖల్జీ పాలనపై ముఖ్యమైన సమాచార ఆధారంగా ఉపయోగపడుతుంది. "ఫుతుహత్–ఎ–ఫిరోజ్ షాహీ" అనే గ్రంథంలో ఫిరోజ్ షా తుగ్లక్ తన పాలన గురించి క్లుప్తంగా వివరించాడు. "సీరత్–ఎ–ఫిరోజ్ షాహీ" అనే మరో అనామక కృతి బహుశా అతడి పోషణలో, అతడి వివరణతో రచించబడి ఉంటుంది. లోధీల చరిత్రపై సమకాలీన గ్రంథాలేవీ లేవు. కాని 17వ శతాబ్దంలో రచించబడిన మూడు చరిత్ర గ్రంథాలు భారతదేశంలో ఆఫ్ఘన్ పాలనా చరిత్రను ప్రత్యేకంగా ప్రస్తావిస్తాయి. అవి అహ్మద్ యాద్‌గార్ రచించిన "తారీఖ్–ఎ–సలాతిన్–ఎ–అఫ్ఘనా", నియామతుల్లా రచించిన "మఖ్‌జన్–ఎ– అఫ్ఘనా", అబ్దుల్లా రచించిన "తారీఖ్–ఎ–దువాదీ". సుల్తాన్ రాజ్య చరిత్రను తర్వాతి చరిత్రకారులైన నిజాముద్దీన్, బదౌనీ (16వ శతాబ్దం), ఫెరిష్టా (17వ శతాబ్దం)లు కూడా తమ రచనలలో పొందుపరిచారు. స్వతంత్ర సుల్తాన్‌ల పాలనలో ఉన్న ప్రాంతాల చరిత్రను అనే పార్సీ కృతులు వివరిస్తాయి. గుజరాత్ రాజ్యంపై అలా ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. అందులో సికందర్ బిన్ మహమ్మద్ (17వ శతాబ్దం) రచించిన "మీరత్–ఎ–సికందరీ", అలీ మహమ్మద్ ఖాన్ (18వ శతాబ్దం) రచించిన "మీరత్–ఎ–అహ్మదీ" ప్రముఖమైనవి. "రియాజ్–ఉస్–సలాతిన్" (18వ శతాబ్దం) అనే తన గ్రంథంలో గులాం హుస్సేను సలీం బెంగాల్ చరిత్రను వివరించాడు. కాశ్మీర చరిత్ర మిర్జా హైదర్ దుగ్లత్ రచన "తారీఖ్–ఎ–రషీదీ", హైదర్ మాలిక్ రచన "తారీఖ్–ఎ–కాశ్మీర్" (17వ శతాబ్దం)లో వర్ణించబడింది.

**విదేశీ యాత్రికుల వర్ణనలు :** దేశంలోని వివిధ ప్రాంతాలలో నెలకొన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక స్థితిగతులపై విదేశీ యాత్రికుల వర్ణనలు ఆసక్తికరమైన వెలుగును ప్రసరిస్తాయి.

యాత్రికులు విభిన్న దేశాల నుండి వచ్చారు. తాము వీక్షించిన పరిస్థితులు, సంఘటనలను చాలా వరకు నిష్పక్షపాతంగా రాశారు. అయితే భారతీయ భాషలు తెలియకపోవడంవల్ల కొన్నిసార్లు తప్పులు కూడా చేశారు. క్రీ.శ.13 నుండి 16వ శతాబ్దం వరకు విదేశీ యాత్రికులు వరుసగా వచ్చారు. క్రీ.శ.13వ శతాబ్దం చివరలో ఇటాలియన్ యాత్రికుడు మార్కోపోలో దక్షిణ భారతదేశంలో పర్యటించాడు. మొగల్ పాలనకు పూర్వం దేశంలో పర్యటించిన యాత్రికులలో అత్యంత ముఖ్యమైన వాడు మొరాకో యాత్రికుడు ఇబ్న్ బటుటా. మహమ్మద్ బిన్ తుగ్లక్ పాలనా కాలంలో అతడు ఎనిమిదేళ్లపాటు భారతదేశంలో జీవించాడు. అతడి వర్ణనలు నిర్దిష్టమైనవి, విశ్వసనీయమైనవి.

15వ శతాబ్దంలో ఎందరో సుపరిచితులైన యాత్రికులు వచ్చారు. చైనాకు చెందిన మహువన్ బెంగాల్, మలబార్‌లపై తన వ్యాఖ్యానాలను నమోదు చేశాడు. రష్యాకు చెందిన అథనాసియస్ నికిటిన్ దక్షిణ భారతదేశం గురించి రాశాడు. ఇటాలియన్ అయిన నికోలో ద కాంటీ, పర్షియన్ అయిన అబ్దుర్ రజ్జాక్ కూడా ఈ కాలంలోనే వచ్చారు. 16వ శతాబ్దపు తొలియార్థంలో వార్థిమా, డొమింగో పేస్, బార్బోసా, ఫెర్నావో నూనిజ్ పర్యటించారు. మొత్తానికి ఇలాంటి ఆధారాలు ప్రధాన పార్సీ రచనలకు అదనపు కృతులుగా మిగిలిపోయాయి.

21

# మొగల్ పాలకుల విభిన్న సంస్కృతి

**విభిన్న స్వభావం :**

మొగల్ కాలపు విభిన్న సంస్కృతిని “మొగల్ ఆస్థాన సంస్కృతి” అని అంటారు. ఎందుకంటే ఈ కాలమంతా ఆ సంస్కృతికి సింహాసనమే స్ఫూర్తినిచ్చింది. ప్రజలకు అందులో ఎలాంటి ప్రముఖ హస్తంలేదు. సామ్రాజ్యవాద పోషణపైనే ఆ సంస్కృతి పూర్తిగా ఆధారపడింది. మొగల్ చక్రవర్తి తీక్షణ, వ్యక్తిగత శ్రద్ధ ఆ సంస్కృతిని ప్రోత్సహించినపుడు అది ఉన్నత శిఖరాలను అధిరోహించింది. పాలకుడి శ్రద్ధ తగ్గిపోయినప్పుడు అది నిరాదరణకు గురై పారిపోయింది. ఫలితంగా తొలి ఐదుగురు గొప్ప మొగల్ చక్రవర్తుల పాలనలో కళా, సాహిత్యం, వాస్తు శాస్త్రాలు ఉన్నత ప్రమాణాలను అందుకున్నాయి. కాని ఆస్థాన పోషణను నిలిపివేసినపుడు అవి క్షీణ దశకు చేరుకున్నాయి. మొగల్ కాలపు ప్రధాన గుణం హిందూ-ముస్లింల సయోధ్య ప్రక్రియ కొనసాగడమే. తీవ్ర రాజకీయ స్పర్థలున్నా ఇరు సముదాయాల సభ్యుల మధ్య స్నేహపూర్వక సంబంధం కొనసాగింది. ఫలితంగా సమ్మేళనం, పరస్పర సామరస్య వాతావరణం విభిన్న సంస్కృతి ఆవిర్భావానికి బాటలు వేసింది. అటు పూర్తిగా పార్సీ (లేదా ముస్లిం) సంస్కృతి కాని, ఇటు పూర్తిగా భారతీయ (లేదా హిందూ) సంస్కృతి కాని మిశ్రమ సంస్కృతి ఆవిర్భవించింది. రెండు సంస్కృతులలోని ఉత్తమ అంశాలు సంతోషకరంగా కలిసిపోయాయి. కళ, నిర్మాణ రంగాలలో పార్సీ, భారతీయ శైలులు స్వేచ్ఛగా కలిసిపోయాయి. అక్బర్, షాజహాన్ నిర్మించిన కట్టడాలలో ఈ మిశ్రమ శైలి కనిపిస్తుంది. అలాగే మొగల్ చిత్రకళ భారతీయ, విదేశీ పద్ధతులకు అపూర్వ కలయికను ప్రదర్శిస్తారు. సాహిత్యం కూడా ఈ సాంస్కృతిక సమ్మేళ ప్రభావం నుండి తప్పించుకోలేక పోయింది. పార్సీ, అరబిక్ పదాలతో వివిధ భారతీయ భాషలు సంపన్నమయ్యాయి.

హిందూ-ముస్లింల సమ్మేళనం, సామరస్యానికి అక్బర్ పాలన ముఖ్యమైన, ఆదర్శ ప్రాయమైన స్ఫూర్తిని నెలకొల్పింది. అక్బర్ మత విధానమైన సులహ్-ఎ-కుల్ మతపరమైన సమ్మేళనాన్ని ప్రదర్శించింది. కుల, వర్గ పరిమితులు, మత గురువుల ఆధిపత్యం, విదేశీ సంస్కృతికి అది దూరంగా ఉండేది. ఏకేశ్వరోపానసన, ఉన్నత నైతిక జీవితాన్ని అది

ప్రబోధించింది. పరమత సహనం, సన్నిహిత సామాజిక సంబంధం, ఇతరులపై ప్రేమానురాగాలు రాకుమారుడు దారా షికో నేతృత్వంలో పతాక స్థాయికి చేరుకున్నాయి. హిందూ, ముస్లిం ఆరాధనాతత్వంలో కేవలం భాషాపరమైన భేదాలే ఉన్నాయని అతడు వాదించాడు. రెండూ ఆరాధనా ప్రవాహాలు ఎక్కడ సంగమం అవుతాయో వివరిస్తూ "మజ్మా-ఉల్-బహ్రెయిన్" అనే గ్రంథాన్ని రచించాడు. ఔరంగజేబ్ పాలనలో సత్నామీ, నారాయణ్ పంథాలు హిందూ-ముస్లింలిద్దరినీ తమ ప్రభావం కిందికి తీసుకురావాలని ప్రయత్నించాయి. సత్నామీ పంథాలో హిందూ, ముస్లిం అనుచరులిద్దరూ ఉండేవారు. తూర్పు దిక్కున చూస్తూ సత్నామీలు రోజుకు ఐదుసార్లు ప్రార్థనలు చదివే వారు. దేవుల పేర్లలో అల్లాహ్‌ను కూడా చేర్చారు. మృతులకు దహన సంస్కారాలు నిర్వహించే బదులు వారిని ఖననం చేశారు.

హిందూ-ముస్లింలను ఐక్యంగా ఉంచి సామాజిక సామరస్యాన్ని సాధించాలన్న అక్బర్ ఆకాంక్ష ఆహార, వస్త్ర, ప్రవర్తన, జీవన విధానం, వేడుకలు, పండుగలలో సారూపత్యను తెచ్చి పెట్టింది. హిందూ వివాహ వేడుకలో సెహ్రా, జమలు సాధారణమయ్యాయి. పైజామా, అచ్కన్‌లు ప్రత్యేక సందర్భాలలో ధరించే వస్త్రాలుగా మారాయి. బలుషాయి, గులాబ్‌జామ్, బర్ఫీ, ఫులావ్ తదితర కొత్త రుచికరమైన తీపి మిఠాయిలు, వంటకాలు ఆహార పరికరాలలో చేరాయి. హుక్కా, పొగాకును హిందూ-ముస్లింలిద్దరు వాడారు. ఇరు సముదాయాలు మగ పిల్లాడి జననాన్ని ఘనంగా జరుపుకునేవి. ఇరు సముదాయాలకు చెందిన మహిళల అలంకరణ, నగలు ఒకేలా ఉండేవి. ఒకరి వేడుకలలో మరొకరు స్వేచ్ఛగా పాల్గొన్నారు. హిందువులు మొహర్రంను జరుపుకోవడం మొదలుపెట్టగా సయ్యిద్ సోదరులలో ఒకడైన అబ్దుల్లా ఖాన్ హిందువుల పండుగలైన బసంత్, హోలీలను జరుపుకున్నాడు. బెంగాల్ నవాబ్‌లు సిరాజ్-ఉద్-దౌలా, మీర్ జాఫర్‌లు తమ హిందూ స్నేహితులతో కలిసి హోలీ వేడుకలను ఆస్వాదించారు. క్లుప్తంగా చెప్పాలంటే మొగల్ పాలకులు ప్రవేశపెట్టిన వస్త్రధారణ, అలవాట్లు, సామాజిక సేవలు, పండుగలు విదేశీయతను కోల్పోయి భారతీయుల ఆమోదాన్ని పొందాయి.

ఆ విధంగా మొగల్‌పాలన ప్రయోగ, ఆవిష్కరణ కాలాన్నే కాకుండా ఈ ప్రక్రియల కొనసాగింపు సమ్మేళ కాలంగా మిగిలిపోయింది. ఈ ప్రక్రియలకు ఢిల్లీ సుల్తాన్‌ల పాలన చివరలో బీజం పడింది. మరో మాటలో చెప్పాలంటే ఢిల్లీ సుల్తాన్ రాజ్యం చివరి సంవత్సరాలలో మొదలైన సామరస్య, సమ్మేళన స్ఫూర్తి మొగల్ కాలంలో కొనసాగి పరిపూర్ణతను సాధించింది.

కళాసాహిత్య పిపాసులైన మొగల్ చక్రవర్తులు కొత్త శైలులు, పద్ధతులను అభివృద్ధి పరిచారు. పార్సీ, భారతీయ అంశాలు సామరస్యంగా కలిసిపోయాయి. ఈ కలయిక సాహిత్యం, చిత్రకళ, నిర్మాణశాస్త్రం, సంగీతం, దస్తకారి,నగల తయారీ,లోహ పనులపై చెరగని ముద్ర వేసింది. మొగల్‌ల నేతృత్వంలో బహుముఖ సాంస్కృతిక కార్యకలాపాలు పెరగడానికి, వివిధ రంగాలలో ఉన్నత ప్రమాణాలు నెలకొనడానికి ఈ కింది అంశాలు కారణమయ్యాయి. మొట్టమొదటిది, సామ్రాజ్య అపార సంపద, అపరిమిత ప్రాబల్యం వల్ల మొగల్ చక్రవర్తులు లలిత కళలు, సాహిత్యాన్ని, నిరంతరం పోషించారు. వర్సెయిల్స్ వైభోగానికి  అలవాటుపడిన

కళ్లకు కూడా భారతదేశ సంపద మిరుమిట్లు గొల్పిందనడం ఎలాంటి అతిశయోక్తి కాదు. రెండవది, దాదాపు సుస్థిర పరిస్థితులు, సుదీర్ఘ కాలశాంతి ఉత్తర భారతదేశమంతటా నెలకొని ఉండడంతో కళరంగాలలో విస్తృత పనులు చేపట్టడానికి మార్గం సుగమమైంది. మూడవది, మొగల్ చక్రవర్తులు ప్రకృతీ ఆరాధనా భావాన్ని, సాంస్కృతిక దృష్టికోణాన్ని కలిగి ఉండేవారు. కొన్ని దృశ్యకళలలో తమదైన వ్యక్తీకరణను చూడాలని అందరూ ఆతృత పడ్డారు. మొదటి ఐదుగురు పాలకులు చాలా అంశాలలో తమ చుట్టూ ఉన్న వారి కంటే అపారమైన మేధ కలిగినవారు. సాంస్కృతిక దృష్టికోణం, ఉన్నత రుచులలో వారికి వారే సాటి. నాల్గవది, ఒకవైపు మొగల్‌ల ఘనమైన, సంపన్నమైన సాంస్కృతిక వారసత్వం, మరోవైపు భారతీయుల సంస్కృతి ఉన్నతమైన సాహిత్యం, లలిత కళల ఉత్పత్తికి వినూత్న వాతావరణాన్ని సృష్టించాయి.

## మొగల్ నిర్మాణ శాస్త్రం :

**స్వాభావిక లక్షణాలు :** సనాతన భావాలు గల ఔరంగజేబ్‌ను మినహాయిస్తే మిగతా మొగల్ చక్రవర్తులందరూ గొప్ప నిర్మాణదారులే. వాస్తవానికి తొలి మొగల్ చక్రవర్తులు నిర్మాణ సారథులు. మొగల్‌ల రాకతో భారతీయ నిర్మాణశాస్త్రం కొత్త దశలోకి అడుగుపెట్టింది.

ఢిల్లీ తొలి సుల్తాన్‌ల అపరిపక్వమైన, సాధారణమైన కట్టడాలు ఇప్పుడు పార్సీ ప్రభావంతో ఉన్నతంగా, అందంగా తయారయ్యాయి. మొగల్‌ల పాలనలో నిర్మాణశాస్త్రం ఉన్నత శిఖరానికి చేరుకుంది. అసమాన సంపద, వైభోగం, గొప్ప విలాసం కారణంగా మొగల్‌లు అత్యంత సుందరమైన కట్టడాలను నిర్మించగలిగారు. కొత్త నగరాలు, అందమైన ఉద్యానవనాలను ఏర్పాటు చేశారు. మొగల్ నిర్మాణశాస్త్రం పార్సీ, భారతీయ శైలుల సామరస్య కలయికను కూడా ప్రదర్శిస్తుంది.

మొగల్ నిర్మాణశాస్త్ర ముఖ్యలక్షణాలలో ఏకీకరణ ప్రక్రియను స్పష్టంగా చూడవచ్చు. మొదటిది, మొగల్ నిర్మాణశాస్త్రం పర్షియన్ వైభవ, సృజనాత్మక అంశాలు, భారతీయ లేదా హిందూ నిర్మాణశాస్త్ర అలంకరణ, ఔన్నత్యాల కలయికగా ఉండేది. బాబర్ మరణం తర్వాత హుమాయూన్ భారత కళలపై పర్షియన్ ప్రభావాన్ని తీసుకువచ్చాడు. అక్బర్ పాలనాంతం వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. అయితే అక్బర్ తన మేధస్సుతో పార్సీ సాంప్రదాయాలను భారతీయ సాంప్రదాయాలతో జత చేశాడు. అక్బర్ తర్వాత మొగల్ నిర్మాణ శాస్త్రం భారతీయతను సంతరించుకుంది. ఇది పర్షియన్ అని ప్రత్యేకంగా చెప్పడానికి ఎలాంటికళ మిగలలేదు. రెండవది సామ్రాజ్యమంతటా విస్తరించి ఉన్న మొగల్ కట్టడాలు తమ నిర్మాణ శైలిలో సారూప్యతను, నిర్మాణ సూత్రాలను ప్రదర్శిస్తాయి. మరో మాటలో చెప్పాలంటే సుల్తాన్‌రాజ్యకాలానికి చెందిన కట్టడాలకు భిన్నంగా అవి ప్రాంతీయ లేదా స్థానిక శైలులను సూచించవు. మూడవది, ఉద్యానవనాల మధ్యలో సమాధులను నిర్మించే సాంప్రదాయాన్ని మొగల్‌లు ప్రవేశపెట్టారు. తాజ్‌మహల్ అందుకు చక్కటి ఉదాహరణ. నాల్గవది, ద్వంద్వ గోపురాలను నిర్మించే కొత్త పద్ధతిని వారు ఆవిష్కరించారు. ఒకటి బాహ్య గోపురం, రెండవది అంతర్గత గోపురం. అలంకృతమైన అంతర్గత గోపురం కింద సమాధిని నిర్మించారు. అర్థవృత్తాకార

ఆకారంలో ఉండే అందమైన గోపురాలు, మూలలలో సున్నితమైన స్తంభాలపై నిలిచే మినార్లు, వైభవోపేతమైన రాచరిక మండపాలు, ఎత్తయిన ప్రవేశద్వారాలు మొగల్ నిర్మాణశాస్త్రంలోని ఇతర ప్రధాన లక్షణాలు.

**అక్బర్ కృషి :**

వివిధ మొగల్ పాలకుల నేతృత్వంలో మొగల్ నిర్మాణ శాస్త్ర ప్రగతి విభిన్న దశలలో సంభవించింది. బాబర్ నిర్మించిన కట్టడాలు దాదాపు అన్ని శిథిలం కాగా అతడు నిర్మించాడని చెప్పబడుతున్న మూడు మసీదులు నేటికీ సజీవంగా ఉన్నాయి. పానిపట్‌లోని కాబుల్ బాగ్ వద్ద గల విశాలమైన మసీదు, సంభల్ వద్ద గల జామా మసీదు (రోహిల్ ఖండ్), ఆగ్రా వద్దగల పాతలోధి కోటలోని మూడవ మసీదు నేడు పురాతత్వ శాఖ ఆధీనంలో ఉన్నాయి. నాల్గవ మసీదైన బాబ్రీ మసీదు దురదృష్టవశాత్తు నేడు లేదు. బాబర్ కుమారుడు, వారసుడు అయిన హుమాయూన్ ఆందోళన, సమస్యల కారణంగా కట్టడాల నిర్మాణంపై అంతగా శ్రద్ధ వహించలేకపోయాడు. అన్ని ఆచరణాత్మక అవసరాల నిమిత్తం మొగల్ నిర్మాణ శాస్త్రం అక్బర్‌తోనే మొదలవుతుంది. కట్టడాల నిర్మాణంపై అతడి ఎనలేని ఆసక్తి ఉండేది. అబుల్ ఫజల్ ఇలా చక్కగా పేర్కొన్నాడు : "వైభవోపేతమైన కట్టడాలను చక్రవర్తి వారు ప్రణాళికా రూపంలో తీసుకువస్తారు. తన మేధస్సు, మనస్సులో ఉత్పన్నమైన పనికి రాళ్లు, బంకమట్టితో ఒక ఆకారాన్ని ఇస్తారు." కళారంగానికి సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని అక్బర్ ఆకళింపు చేసుకున్నాడు. ఉదారవాద, లౌకికవాద దృక్పథంతో అతడు విభిన్న ఆధారాల నుండి కళాత్మక సిద్ధాంతాలను అరువు తీసుకున్నాడు. అతడి ఆలోచనలకు నిపుణులైన భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు ఒక ఆకారాన్ని ఇచ్చారు. అక్బర్ నేతృత్వం ఉద్భవించిన నిర్మాణ శైలిలోని ప్రధానాంశాలు ఎర్రటి ఇసుకరాయిని వాడడం, పాలరాతిని పరచడం, అంతర్గత అంకరణలు, అంతర్గత గోడలపై చిత్రాలు, పై కప్పు అలంకరణ ప్రధానమైనవి. పార్సీ, హిందూ ప్రభావాలు అక్బరీ శైలిలో పూర్తిగా కనిపిస్తాయి. తన పర్షియన్ షియా తల్లి నుండి నేర్చుకున్న పర్షియన్ సిద్ధాంతాలు, ఆలోచనలను కొనసాగిస్తూనే భారతీయ నిర్మాణ శాస్త్రంలోని ప్రధాన అంశాలను తన కట్టడాలలో ప్రవేశపెట్టాడు. జైన, హిందూ దేవాలయాలలో కనిపించే అలంకరణలు అతడి కట్టడాలలో కూడా దర్శనమిస్తాయి. ఆగ్రా కోటలోని జహంగీరీ మహల్‌లో భారతీయ లేదా హిందూ శైలి స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. చదరపు స్తంభాలు, చిన్న ఆర్చీల వరుస ఇందులో కనిపిస్తాయి. సామ్రాజ్య రాజధాని ఫతేపూర్ సిక్రి, లాహోర్, కోటలలో కూడా ఇలాంటి కట్టడాలు అనేకం ఉన్నాయి. పాత ఢిల్లీలోని హుమాయూన్ సమాధి ప్రణాళిక, దాని బాహ్య ఆకారంలో పాలరాతిని స్వేచ్ఛగా వాడడం హిందూ నిర్మాణశైలిలోని అంశాలను తలపిస్తాయి. అనేక కోటలు, రాజప్రసాదాలు, మసీదులు, సమాధులు (స్మారక స్థూపాలు), స్తంభాలు, ప్రవేశ ద్వారాలు తదితర వాటిని అక్బర్ నిర్మింపజేశాడు. అక్బర్ పాలనలో తొలుత నిర్మాణమైన అద్భుత కట్టడాలలో హుమాయూన్ సమాధి ఒకటి. విశాలమైన వేదికపై నిర్మించబడిన ఈ సమాధి రెండు విషయాలలో పాత కట్టడాలకుభిన్నంగా ఉంది : (1) దాని గోపుర ఆకారం, డిజైన్,

నిర్మాణం పార్సీ శైలి ప్రకారం జరిగాయి. (2) ఈ మొత్తం కట్టడం విశాలమైన ఉద్యానవనం మధ్యలో ఉంది. ఆ విధంగా హుమాయూన్ సమాధి మొగల్ నిర్మాణ శాస్త్రంలో కొత్త అంశాలను ప్రవేశపెట్టింది. అక్బర్ నిర్మించిన ఇతర గొప్ప కట్టడాలలో ఆగ్రా, లాహోర్ కోటలు, కోట రాజప్రసాదాలు ఉన్నాయి. ఆగ్రా కోటను అతడు విస్తరింప చేశాడు. ఎత్తయిన గోడలు, భారీ ప్రవేశద్వారాలు, విశాలమైన అష్టాకార శిఖరాలు ఈ కోట ప్రత్యేకతలు. ఈ కోట ఎర్రటి ఇసుకరాయితో నిర్మితమైంది. ఎర్రటి ఇసుకరాయిని ఇంత భారీ స్థాయిలో వాడడం అదే మొదటిసారి. ఆగ్రా కోట రెండు భారీ, ఉన్నతమైన ప్రవేశద్వారాలు సృజనాత్మకతను, ఘనమైన అలంకరణను, ఆకర్షణీయమైన ఆకారాన్ని ప్రదర్శిస్తాయి. రాజ్‌పుత్ స్తంభాలు ఆగ్రా కోట నిర్మాణాన్ని ప్రభావితం చేసి ఉంటాయి. లాహోర్ కోటలో రాజప్రసాదం పెంకుల అలంకరణను ప్రదర్శిస్తుంది. బాహ్య గోడలపై ఈ అలంకరణ విస్తృతంగా కనిపిస్తుంది. అలహాబాద్‌లోని 40 స్తంభాల కోట రాజప్రసాదం ఆ తరహా నిర్మాణాలలో చాలా పెద్దది. దీనిని అక్బర్ నిర్మించాడు. అది ఖచ్చితంగా హిందూ డిజైనే. ఇందులో స్తంభాల వరుసలపై వరండా పై కప్పు నిలబడి ఉంది.

అయితే అన్నిటికంటే ప్రతిష్టాత్మకమైన నిర్మాణ పథకం, అక్బర్ నిర్మాణ విజయాలలో ప్రముఖమైనది ఫతేపూర్ సిక్రీ అనే కొత్త రాజధాని నగరం, దాని కట్టడాలు. వాస్తవానికి అక్బర్ మహత్తరమైన మేధస్సుకు అది అద్దం పడుతుంది. ఫతేపూర్ సిక్రిలోని కట్డడాలు, రాజభవనాలు పూర్తిగా పరిపక్వమైన నిర్మాణ శైలికి సంబంధించిన ప్రతి లక్షణాన్ని ప్రదర్శిస్తాయి. సిక్రి వద్ద గల అత్యంత అద్భుతమైన కట్టడాలలో జోధా బాయి రాజనివాసం, మరియమ్, సుల్తానాల అంతఃపురాలు, బీర్బల్ నివాసం, సోన్హాలా మకాన్ (అంబర్ రాకుమారుల రాజభవనం), దీవాన్-ఎ-ఆమ్ (చక్రవర్తి కార్యాలయం,ఇది హిందూశైలిలో నిర్మితమైంది), దీవాన్-ఎ-ఖాన్ (వ్యక్తిగత అతిథుల మందిరం), పంచ్ మహల్, జామా మసీదు, బులంద్ దర్వాజా, సలీం చిష్టీ సమాధి తదితర కట్టడాలు ఉన్నాయి.

ఆకారం, అలంకరణ ఏర్పాట్ల విషయంలో జోధాభాయి రాజనివాసం పూర్తిగా పరిపూర్ణమైనది. రాళ్లతో మలచిన అలంకరణ హిందూ ఆలయ నిర్మాణశైలిని పోలి ఉంది. మరియం రాజనివాసం అంతర్గత అలంకరణ పార్సీ అంశాలతో కూడా విశాలమైన కుడ్య చిత్రాలతో నిండి ఉంది. సుల్తానా నివాస గృహం ఒక్క అంతస్తు మాత్రమే కలిగి ఉన్న డిజైన్ సాత్వికత, ఘనమైన అలంకరణకు ప్రసిద్ధిగాంచింది. బీర్బల్ నివాస గృహం అత్యంత ఆకర్షణీయమైనది. నిర్మాణపర అలంకరణ, బాహ్య, అంతర్గత అలంకరణ వైభవం చూపరులను ఇట్టే ఆకట్టుకుంటుంది. దీవాన్-ఎ-ఖాస్‌లో చక్రవర్తి సింహాసనానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. ప్రణాళిక, నిర్మాణంలో దానికి ప్రత్యేకమైన భారతీయ లక్షణం ఉంది. ఐదు అంతస్తుల పంచ్‌మహల్ పిరమిడ్ ఆకారంలో నిర్మాణమైంది. ప్రతి అంతస్తును విభిన్నంగా తీర్చిదిద్దారు. భారతీయ బౌద్ధ విహారాల నిర్మాణ ప్రణాళికకు కొనసాగింపును పంచ్‌మహల్ ప్రదర్శిస్తుంది. ఆ కాలం వరకూ కూడా బౌద్ధ విహారాలు బహుశా కొనసాగి ఉండవచ్చు.

పైన పేర్కొన్నవన్నీ లౌకికవాద (భౌతికవాద) కట్టడాలే. అయితే ఫతేపూర్ సిక్రిలోని అత్యంత ఆకర్షణీయమైన భాగం మతపర స్వభావం ఉన్న కట్టడాల సమూహం. ఇందులో జామా మసీదు ప్రథమ స్థానంలో నిలుస్తుంది. ఈ మసీదులో ఉన్నతమైన నిర్మాణ నైపుణ్యం కేంద్రీకృతమైంది. అంతర్గత పాలరాయి, రంగుల లేపనాలను ఈ మసీదులో విరివిగా వాడారు. పని నైపుణ్యానికి మణిపూస లాంటిది సలీం చిష్టీ సమాధి. ఈ సమాధితోపాటు బులంద్ దర్వాజా కూడా జామా మసీదు సమీపంలో ఉంది. సుమారు 176 అడుగు ఎత్తు కలిగిన బులంద్ దర్వాజా ఒక అద్భుతమైన కట్టడం. బాహ్య ద్వారం 130 అడుగుల వెడల్పు ఉంది. భారతదేశంలో ఏ ఇతర మహాద్వారం దీనికి సాటి రాదు. వర్ణింపనలవి కాని ఔన్నత్యం, ఆకర్షణ దాని స్వంతం. గుజరాత్‌పై అక్బర్ సాధించిన విజయాన్ని పురస్కరించుకొని ఈ మహాద్వారాన్ని నిర్మించారు.

**జహంగీర్ కృషి :** అక్బర్ సాగించిన నిరంతర నిర్మాణ ప్రక్రియ తర్వాత కొద్ది కాలం పాక్షిక స్తంభన నెలకొంది. నిర్మాణాల కంటే చిత్రకళపై ఎక్కువ మోజుగల జహంగీర్ తన తండ్రి సాధించిన నిర్మాణ శాస్త్ర విజయాలతో పోలిస్తే చాలా వెనుకబడి ఉన్నాడు. అయితే అతడి కాలంలో నిర్మితమైన రెండు కట్టడాలు చాలా ఆసక్తికరమైనవి, సామర్థ్యం కలవి.

మొదటిది, ఆగ్రా సమీపంలోని సికందర్ వద్ద నిర్మాణమైన అక్బర్ సమాధి. ఈ విశాలమైన సమాధి డిజైన్ భారతీయ బౌద్ధ విహారాలతో ప్రభావితమైంది. అందులో ఐదు చదరపు పై అంతస్తులు ఉన్నాయి. ఒక దానిపై ఒకటిగా అవి నిర్మాణమయ్యాయి. అయితే ఎత్తు పెరిగే కొద్ది వాటి వైశాల్యం తగ్గిపోతూ కనిపిస్తుంది. రెండవ ముఖ్యమైన కట్టడం ఐతిమాద్-ఉద్-దౌలా సమాధి. తన తండ్రి స్మారక స్థూపాన్ని మహారాణి నూర్‌జహాన్ స్వయంగా నిర్మింపచేశారు. తులనాత్మకంగా అది చిన్న కట్టడమే అయినా, స్వచ్ఛమైన పాలరాయితో, ఖరీదైన రంగురాళ్లతో నిర్మాణమయ్యింది. ఈ నిర్మాణం వజ్రాల హారాన్ని తలపిస్తుంది. ఇది రాజపుత్ర తరహా నిర్మాణశైలిలో రూపుదిద్దుకుంది. అద్భుతమైన పనితనం వల్ల ఈ కట్టడం ఎనలేని కీర్తిని గడించింది. మొగల్ నిర్మాణశైలిలో ఒక మలుపురాయిని ఈ కట్టడం ప్రతిబింబిస్తుంది. అంతవరకు మొగల్ కట్టడాలు ఎర్రటి ఇసుకరాయి, బాహ్య వర్గీకృత అలంకరణతో నిర్మాణమయ్యాయి. అయితే ఈ సమాధి పూర్తిగా పాలరాయితో నిర్మాణమైన తొలి మొగల్ కట్టడం. "పియత్రా దూరా" తరహా అంతర్గత అలంకరణ దీని ప్రత్యేకత. ఆ విధంగా అది స్వచ్ఛమైన పాలరాయి మందిరాలు, పియత్రా దూరా అలంకరణకు ద్వారాలు తెరిచింది. చక్రవర్తి షాజహాన్ ఈ తరహా నిర్మాణాలను చేపట్టాడు.

**షాజహాన్ కృషి :** మొగల్ పాలకుల్లో అత్యంత ప్రసిద్ధుడైన నిర్మాణ సారధి చక్రవర్తి షాజహాన్. అతడు అనేక రాజమందిరాలు, కోటలు, మసీదులు, సమాధులు, సంబంధిత కట్టడాలను నిర్మించాడు. ఆగ్రా, ఢిల్లీ, లాహోర్, అజ్మేర్, అహ్మదాబాద్, కాశ్మీర్ తదితర చోట్ల అతడు నిర్మించిన కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. అక్బర్ మహాచక్రవర్తి నిర్మాణాలతో పోలిస్తే షాజహాన్ కట్టడాలు వైభవం, వైశాల్యం, సృజనాత్మకత విషయాలలో నాసిరకంగా కనిపిస్తాయి. కాని కళాత్మకత, సున్నితత్వం, ఘనమైన ప్రదర్శన, సంపన్నమైన

అలంకరణ విషయాలలో ఎంతో ఉన్నతంగా ఉన్నాయి. ఈ కారణంగానే షాజహాన్ కట్టడాలు "విశాలమైన నగలు"గా మారతాయి. వాస్తవానికి మొగల్ నిర్మాణశాస్త్రం షాజహాన్ హయాంలోనే పతాక స్థాయికి చేరుకుంది. అలాగే పరిపూర్ణత విషయంలో ఉన్నత దశను తలపించింది. కొన్ని ప్రత్యేకమైన లక్షణాలకు షాజహాన్ నిర్మాణశైలి ప్రసిద్ధిగాంచింది. భవన నిర్మాణ సామగ్రిలో మార్పులే కాకుండా నిర్మాణ పద్ధతి, నిర్మాణశైలి అంశాలలో కూడా ఈ కాలంలో కొత్త మార్పులను ప్రవేశపెట్టారు. ఇసుకరాయి స్థానంలో పాలరాతిని వాడారు. పద్ధతిని కూడా మార్చారు. రంగురంగుల పెంకులను చాలా తక్కువగా ఉపయోగించారు. రంగు రాళ్లతో ఘనమైన అలంకరణను తీసుకువచ్చారు. శైలి విషయానికి వస్తే గత కాలపు చదరపు ఆకారాల స్థానంలో అలలను తలపించే రేఖలు వచ్చాయి. ఇలాంటి ఆకారంలో రత్నాలను పొదిగారు. నక్కాషి కల పాలరాతి ఆర్చీలు విభిన్న లక్షణాలుగా మారాయి.

సున్నితంగా శృంగారాన్ని ఒలకబోసే కట్టడాలను షాజహాన్ నిర్మించాడు. ఆగ్రా, ఢిల్లీలలో కోట–రాజప్రసాదాలను నిర్మించాడు. షాజహానాబాద్ అనే కొత్త నగరాన్ని స్థాపించాడు. యమునా నది కుడి గట్టుపైన ఎర్రకోట అనే కోట–రాజప్రసాదాన్ని నిర్మించాడు. షాజహానాబాద్‌లో ఎర్రకోట కీలక స్థావరంగా ఉండేది. రంగ్‌మహల్, దీవాన్–ఎ–ఆమ్, దీవాన్–ఎ–ఖాస్ (ఢిల్లీ ఎర్రకోట ప్రాంగణంలో) జామా మసీదు, మోతి మసీదు, సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో అనేక చిన్నకట్టడాలు షాజహాన్ హయాంలో నిర్మాణమయ్యాయి. రంగ్‌మహల్ అలంకరణకు ప్రసిద్ధిగాంచింది. షాజహాన్ నిర్మించిన కట్టడాలలో అదోకలికితురాయి. అయితే దీవాన్–ఎ–ఖాస్ కూడా రంగ్‌మహల్‌కు ఎందులోనూ తీసిపోలేదు. ఖరీదైన వెండి సీలింగు, పాలిష్ అయిన పాలరాతి చప్టా, బంగారు, ఖరీదైన రాళ్లు, పాలరాయి మిశ్రమంతో అలంకరణ గల ఈ ప్రత్యేక అతిథుల మందిరం గోడలపై పార్సీ శిలాశాసనం కనిపిస్తుంది. "భూమిపై ఆనందపు లోకం ఏదైనా ఉందంటే అది ఈ మందిరం తప్పమరొకటి కాదు", అనే ప్రశంస అందులో చెక్కబడింది. దీవాన్–ఎ–ఆమ్ విహార విడిది కాదు. అది అధికార, పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన కట్టడం. ఎర్రకోట సమీపంలోని జామా మసీదు శోభయామాన, ఆకర్షణీయమైన ఉదాత్తమైన కట్టడం. ప్రార్థనలు చదవడానికి ఉద్దేశించిన ఈ మసీదు తన వైభవం, వైశాల్యం కారణంగా దేశంలో అత్యంత పెద్దదైన, విశాలమైన మసీదుగా పేరుగాంచింది. ఆగ్రా వద్దగల మోతి మసీదు షాజహాన్ కాలపు నిర్మాణపరమైన కౌశల్యానికి శిఖరస్థాయిని ప్రతిబింబిస్తుంది. నిర్మాణ శాస్త్రంలో అది ఒక కళాఖండం. అయితే షాజహాన్ జీవితకాలంలో నిర్మాణమైన అత్యంత ప్రధానమైన కట్టడం తాజ్‌మహల్. పూర్తిగా పాలరాయితో నిర్మించబడిన ఈ కట్టడానికి ఆ రోజుల్లోనే రు.50 లక్షలను వ్యయం చేశారు. ముంతాజ్ మహల్ సమాధిపై ఈ కట్టడాన్ని లేపారు.

మొగల్ కళలో అదో అందమైన పుష్పం. దాంపత్యప్రేమ, సామరస్యం, విశ్వాసానికి ప్రపంచంలోనే అద్భుతమైన ప్రతీకగా ఈ కట్టడం నిలుస్తుంది. ఉన్నత కళ, అత్యంత నైపుణ్యంగల నిర్మాణాల కలయిక ఈ కట్టడం. అత్యున్నత కళానైపుణ్యాన్ని, అసాధారణ శాస్త్రీయ ఆలోచన,

సాంకేతిక నైపుణ్యం, అందం, వైభవం, ఘనమైన అలంకరణ, అందమైన పరిపక్వత, అలంకృత ఉద్యానవనాలు, సంపూర్ణమైన నిర్మాణ ప్రవాహం, నిర్మాణశైలి ప్రభావాల కలయికకు తాజ్‌మహల్ ఒక నిరుపమానమైన ఉదాహరణ. ప్రపంచ అద్భుతాలలో తాజ్‌మహల్ సరైన చోటును సంపాదించుకుంది. మొగల్ నిర్మాణశాస్త్ర ఉద్భవానికి అంతిమ చరణాన్ని అది సూచిస్తుంది. షాజహాన్ పాలనలో ఉత్పత్తి అయిన మరో అద్భుత కళాఖండం నెమలి సింహాసనం. స్వర్ణ ఆధారాలపై నిర్మాణమైన ఈ మంచం ఆకారపు సింహాసనంలో 12 వజ్రాల స్తంభాలు ఉన్నాయి. ప్రతి స్తంభంపై రెండు నెమళ్లు కలికితురాళ్లతో పొదగబడి కనిపిస్తాయి. ప్రతి జంట నెమళ్ల మధ్య ఖరీదైన రాళ్లతో కప్పబడిన చెట్టు కనిపిస్తుంది. 1739లో నాదీర్ షా ఈ సింహాసనాన్ని పర్షియాకు తీసుకెళ్లాడు.

షాజహాన్ మరణంతో మొగల్ నిర్మాణ శాస్త్రం పతనమైంది. ఎందుకంటే అతడి కుమారుడు, వారసుడు ఔరంగజేబ్ సనాతనవాది. అనవసరపు వ్యయాన్ని (దుబారా వ్యయాన్ని) వ్యతిరేకించిన ఔరంగజేబ్ అద్భుత కట్టడాల నిర్మాణాన్ని ప్రోత్సహించలేదు. అయితే అతడి హయాంలో నిర్మితమైన కొన్ని కట్టడాలు ప్రస్తావించదగినవి. తన వ్యక్తిగత వినియోగం కోసం అతడు ఢిల్లీలో నిర్మించిన ఒక చిన్న పాలరాతి మసీదు, బనారస్ మసీదు – దాని ఎత్తయిన మినార్లు, లాహోర్‌లోని బాద్‌షాహీ మసీదు అందులో ఉన్నాయి. ఔరంగజేబ్ సమాధి, అతడి తొలి భార్య సమాధి దక్కనులోని ఔరంగబాద్‌లో ఉన్నాయి. ఇవి కూడా అద్భుతమైన కట్టడాలే. ఔరంగజేబ్ వారసులు నిర్మించిన కట్టడాలు వారి అభిరుచి దివాళాకోరుతనాన్ని, ప్రణాళికాలోపాన్ని ప్రదర్శిస్తాయి.

అందమైన ఉద్యానవనాలను ప్రస్తావించకుండానే మొగల్ నిర్మాణశాస్త్ర అధ్యయనాన్ని ముగించలేము. ప్రకృతి అంటే మొగల్ పాలకులకు ఆరాధానాభావం ఉండేది. బాబర్, అతడి వారసులు చెట్లు, పుష్పాల మధ్య పరవశం పొందారు. రాజకీయ జీవిత కష్టాల నుండి తీరికగా గడిపేందుకు ఉద్యానవనాలను విడిదిగా చేసుకున్నారు. ఈ కారణంగానే విశాలమైన ఉద్యానవనాలను పెంచి పోషించారు. తర్వాతి కాలంలో సమాధులను ఉద్యానవనం మధ్యలో నిర్మించారు. మొగల్ చక్రవర్తులు వేయించిన ఉద్యానవనాలు ప్రకృతి సౌందర్యానికి తార్కాణంగా ఉండేవి. వాటిలో నిరంతర నీటి ప్రవాహం ఉండేది. పానిపట్ వద్ద కాబుల్ అనే ఉద్యానవనాన్ని బాబర్ వేయించాడు. తాము విడిది చేసిన ప్రతి చోటా నూర్‌జహాన్, జహంగీర్‌లు ఉద్యానవనాలను వేయించారు. కాశ్మీర్‌లోని షాలిమార్, నిషాత్, తదితర ఉద్యానవనాలు మొగల్ పాలకుల ప్రకృతి ఆరాధనకు ఉత్తమ నిదర్శనాలు.

**చిత్రకళ, ఇతర కళలు :**

**చిత్రకళ తొలి వికాస దశ :** భారతదేశంలో చిత్రకళ ఆస్థాన ప్రత్యేకతగా ఎల్లప్పుడూ కొనసాగింది. కుడ్య చిత్రాలతోపాటు నిలువెత్తు చిత్రాలను హిందు పాలకులు, సంస్థానాధీశులు

పెంచి పోషించారు. అయితే ఢిల్లీ సుల్తాన్‌లు చిత్రకళను ప్రోత్సహించలేదు. కాని మొగల్‌లు దానిని పునరుద్ధరించారు. పార్సీ, భారతీయ కళాత్మక అంశాలు సామరస్యంగా కలిసిపోయాయి. అక్బర్ కాలంలోనే మొగల్ చిత్రకళ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. జహంగీర్ పాలనలో శిఖర స్థాయికి చేరుకుంది. షాజహాన్ కాలంలో వెల్లివిరిసింది. అయితే సనాతనవాది ఔరంగజేబ్ పాలన చిత్రకళకు మరణ మృదంగాన్ని మ్రోగించింది. అవధ్ నవాబ్‌ల పోషణలో 18వ శతాబ్దం చివరి వరకు ఈ చిత్రకళ మనుగడ సాగించినా బ్రిటీషు పాలన రాకతో పూర్తిగా అంతరించిపోయింది. స్వల్ప కాలికమే అయినా దాని వ్యవధి భారతీయ కళాచరిత్రలో అద్భుతమైన ఘట్టాన్ని తలపిస్తుంది.

సౌందర్య, కళాపిపాసి అయిన బాబర్ చిత్రకళను పోషించాడు. ఆస్థాన చిత్రకారులను నియమించారు. తుజుక్–ఎ–బాబరీ (బాబర్ స్మృతులు) అనే గ్రంథాన్ని అల్వార్ లిపిలో చేర్చబడిన చిత్రకళ ఆస్థాన చిత్రకారులు ఉత్పత్తి చేసిన కృతులు ఔన్నత్యాన్ని చాటి చెబుతుంది. పర్షియన్ పాలకుడి ఆస్థానంలో బస చేసిన సమయంలో హుమాయూన్ దివ్యంగా వెలిగిపోతున్న చేతి ప్రతులను, పనిలో నిమగ్నమైన చిత్రకారులను చూసి మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. తబ్రీజ్ వద్ద మీర్ సయ్యద్ అలీ, అబ్దల్ సమద్ (అబ్దుస్ సమద్) అనే యువ చిత్రకారులను అతడు కలుసుకున్నాడు. రాజ్యాన్ని తిరిగి దక్కించుకుంటే వారికి ఉజ్వల భవిష్యత్తులను అందిస్తానని హామీ ఇచ్చాడు. తర్వాతి కాలంలో ఆ ఇద్దరు చిత్రకారులు హుమాయూన్‌తో కాబుల్‌లో కలిసి జీవించారు. అబ్దుస్ సమద్ చిన్నారి అక్బర్‌కు చిత్రకళలో పాఠాలు నేర్పాడు.

**అక్బర్ పాలనలో చిత్రకళ వికాసం :**

నిరక్షరాస్యుడైనప్పటికీ అక్బర్‌కు జ్ఞానార్జన తపన ఎక్కువగా ఉండేది. అనేక సాహిత్య, మత గ్రంథాలకు చిత్రరూపం ఇవ్వాలని అతడు కళాకారులకు వేతనాలను చెల్లించాడు. తన ఆస్థానానికి అనేక మంది చిత్రకారులను రప్పించాడు. పేర్లను బట్టి చిత్రకారుల్లో చాలా మంది హిందువులే ఉన్నట్లు తెలుస్తోంది. ఆ విధంగా మొగల్ చిత్రకళకు అక్బర్ వ్యవస్థాపకుడయ్యాడు. అనేక మంది కళాకారులకు అతడు ఉపాధి కల్పించాడు. సుమారు 150 మంది చిత్రకారుల వరకు ఉండేవారని తెలుస్తోంది. ఎందుకంటే అక్బర్ కాలంలో వెలువడిన చిత్రాలపై కళాకారుల పేర్లు తప్పకుండా ఉండేవి. అక్బర్ పాలనా కాలంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది కళాకారులు కలిసి పని చేశారు. అయితే ఈ బృందాలలో నలుగురైదుగురు కంటే ఎక్కువ మంది ఉండేవారు కాదు. ఒకడు తర్రావేస్తే, మరొకడు అమీ (చిత్రం) గీసేవాడు. ఎప్పుడో ఒక సందర్భంలో మూడవ కళాకారుడు చెహ్రానుమా (నిలువెత్తు చిత్రం) గీసేవాడు. నాల్గవ వ్యక్తి చాలా అరుదుగా సూరత్ (బొమ్మలను తీర్చిదిద్దడం) చేసేవాడు. కొన్ని శాసనాలలో ఐదవ కళాకారుడి పేరు కనిపిస్తుంది. అలాంటి వ్యక్తి రంగమేజి (రంగు లద్దడం) చేసేవాడు. ఇలాంటి వ్యవస్థ చిత్రకళ మొగల్ పాలనలో లలిత కళ కంటే ఎక్కువగా గుర్తింపు పొందిందని చాటి చెబుతుంది.

ముఖ్య చిత్రకారులలో మీర్ సయ్యద్ అలీ, అబ్దుస్‌సమద్, బాస్వాన్ (హిందూ) ఉండేవారు. పార్సీ సూక్ష్మచిత్రాల రూపకల్పనలో కళాకారులకు మీర్ సయ్యద్ అలీ, అబ్దుస్ సమద్‌లు శిక్షణ ఇచ్చారు. బాస్వాన్, మిస్కీనా, దశ్వంత్ లాంటి ఎందరో భారతీయులు ఆస్థాన కళాకారులుగా ఉన్నత హోదాను పొందారు. అబుల్ ఫజల్ తన అయిన్-ఎ-అక్బరీలో భారతీయ చిత్రకారులను గొప్పగా ప్రశంసించాడు. రజ్మ్‌నామా (మహాభారత్) సూక్ష్మ చిత్రాల్లో 12 చిత్రాలపై బాస్వాన్ పేరును ప్రస్తావించారు. తొలుత ఈ గ్రంథంలో 169 పూర్తిస్థాయి చిత్రాలు కలిగిన పేజీలు ఉండేవి. ఈ గ్రంథంతోపాటు రామాయణ పార్సీ అనువాదంలో భారతీయ కళాకారులు తాము ఆరాధించే వ్యక్తులను, భౌగోళిక వివరాలను ప్రవేశపెట్టగలిగారు.

మీర్ సయ్యద్ అలీ, అబ్దుస్ సమద్‌ల పర్యవేక్షణలో సామ్రాజ్య కళాకారుల కార్ఖానా, లిపికారుల వ్యవస్థ రూపుదిద్దుకున్నాయి. వారి తొలి కర్తవ్యం దాస్తాన్-ఎ-అమీర్ హమ్జా అనే బొమ్మల చేతిప్రతుల గ్రంథాన్ని పూర్తి చేయడం. క్రీ.శ.1550లో హుమాయూన్ నేతృత్వంలో మొదలైన ఈ పని సంపూర్ణం కావడానికి 25 ఏళ్లు పట్టింది.

అయితే 1375 చిత్రాలలో దాదాపు అన్ని శైలిపరంగా నిలకడను చూపాయి. ఎందుకంటే మీర్ సయ్యద్ అలీ మొదటి నుంచి ఈ చిత్రాలను సఫావిద్ శైలిలో రూపొందించాలని ప్రణాళిక సిద్ధం చేశాడు. కాని ఇతర చిత్రకారులు (పర్షియన్లు, భారతీయులు) చిత్రాలను గీయడంలో అతడికి తోడ్పడ్డారు.

సంస్థానాధీశుల అభిరుచి మేరకు అక్బర్ ఆస్థాన కళాకారులు ప్రాచీన పార్సీ సాహిత్యానికి చిత్రరూపం ఇచ్చారు. నిజామి రచించిన ఖంసా, సాది రచించిన గులిస్తాన్, హఫీజ్ రచించిన దీవాన్, జామీ రచించిన బహారిస్తాన్ గ్రంథాలకు చిత్రీకరణ జరిగింది. హమ్జా నామా సంపుటాలు మీర్ సయ్యద్ అలీ పనితనానికి, అబ్దుల్ సమద్ చిత్రీకరణకు మధ్యగల తేడాలను ఆవిష్కరిస్తాయి. సయ్యద్ అలీ చాలా వరకు పార్సీ సఫావిద్ సాంప్రదాయాలను పాటిస్తే, అతడి కంటే ఘనుడైన సమద్ చిత్రాలను పూర్తి చేశాడు. నిజానికి 1574లో అలీ పర్షియా తిరిగి వెళ్లిపోయాడు. అతడి స్థానంలో ప్రధాన చిత్రకారునిగా సమద్ నియమితుడయ్యాడు. 1582లో పూర్తయిన హమ్జానామా సంపుటావళిలో 14 సంపుటాలు ఉన్నాయి. ప్రతి సంపుటంలో వంద చిత్రాలు వున్నాయి. కాని వాటిలో పదోవంతు చిత్రాలు కూడా మిగలలేదు.

1580లో అక్బర్ తన ఆస్థానంలో తొలి జెస్యూట్ పురోహితుల బృందానికి స్వాగతం పలికాడు. వారు అక్బర్‌కు పాలీగ్లాట్ బైబిల్ ప్రతిని అందజేశారు. అందులో ఫ్లెమిష్ నక్కాషి ఉండేది. చక్రవర్తి ఆ నక్కాషిని నమోదు చేయాలని తన కళాకారులను ఆదేశించాడు. అనతి కాలంలో ఇతర ఐరోపా చిత్రాలను అతడి ఆస్థానానికి రప్పించాడు. వాటిని ఎంతో ఆసక్తితో అధ్యయనం చేశారు. ఫలితంగా మొగల్ కళాకారులు నేపథ్యాన్ని ఉపయోగించడం మొదలుపెట్టారు. వెలుతురు, నీడలను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. చిత్రాలలో నేపథ్యాల ఎత్తును తగ్గించారు. మబ్బులతో ఆకాశాన్ని మరింత వాస్తవికంగా ప్రదర్శించడం మొదలుపెట్టారు.

అద్భుతమైన సూర్యాస్తమయాలను ఉపయోగించారు. 1595 తర్వాత మొగల్ చిత్రాలు పశ్చిమ (పాశ్చాత్య) పద్ధతుల మేళవింపును బహిర్గతం చేశాయి. త్రిముఖ చిత్రాలను ఛాయల ఆధారంగా రూపొందించారు. నేపథ్యాన్ని పరిమితంగా వాడారు. జానపద కథల చిత్రావళిలో పాశ్చాత్య ప్రభావం కనిపిస్తుంది. తూతీ నామా (చిలుక కథ), అన్వర్–ఎ–సుహేలీ చిత్రావళులు ప్రతిపక్షిని, జంతువును వివరణాత్మక వాస్తవికవాదంలో చూపుతాయి. జంతువుల ఈ చిత్రీకరణ జహంగీర్ పాలనలో సాధించిన పరిపూర్ణతను కప్పివేస్తుంది.

చారిత్రక గ్రంథాల చిత్రీకరణలు అక్బర్ కార్ఖానా ప్రత్యేక ఉత్పత్తులుగా మారాయి. అందులో తారీఖ్–ఎ–అల్ఫీ (ప్రపంచ చరిత్ర), జమీ–అల్–తవారీఖ్ (రషీదుద్దీన్ రచించిన మంగోలుల చరిత్ర), దరబ్‌నామా, షాహ్‌నామా, తైమూర్ నామా, బాబర్‌నామాలు ప్రధానమైనవి. జమీ–అల్–తవారీఖ్‌కు చిత్రాలను సమకూర్చిన వారిలో బాస్వాన్, లాల్, భీమ్ గుజరాతి, ధరందాస్, మధు, సుర్‌దాస్ గుజరాతి ఉన్నారు. అయితే అత్యంత వినూత్న శైలి మిస్కీనాకే చెందుతుంది. విరహ, నృత్య సన్నివేశాలను భారతీయ నేపథ్యాలతో పాశ్చాత్య శైలిలో అతడు చిత్రీకరించాడు. నన్హా, బురా, శరావణ, కణ్హాలతో కలిసి మిస్కీనా దరబ్ నామాకు చిత్రాలను అందజేశాడు. అక్బర్ నామాలోని 61 చిత్రాలు బహుశా తర్వాతి ప్రచురణ (1605)కు సంబంధించినవి కావచ్చు.ఇక్కడ ప్రస్తావించబడిన కళాకారులలో శంకర్, దౌలత్, గోవర్ధన్, ఇనాయత్, పిదారత్‌లు ఉన్నారు. అక్బర్ హయాంలో చిత్రీకరించబడిన ఆధ్యాత్మిక కృతులలో యోగా వశిష్ట్ (హిందూ వేదాంత తత్త్వశాస్త్రం), నఫ్‌హాత్–ఉల్–ఉన్స్ (సాంగత్య శ్వాసలు) ఉన్నాయి. చివరి గ్రంథాన్ని జామీ రచించాడు. సూఫీ సంతులు దాని కథాంశం.

వాస్తవిక చిత్రాల చిత్రీకరణను కూడా అక్బర్ ప్రోత్సహించాడు. భారతీయ కళకు ఇదో ముఖ్యమైన సహకారం. స్మృతిపథం నుండి చిత్రించిన చిత్రాలు అజంతాలో కనిపిస్తాయి. ఈ వ్యక్తిగత చిత్రాలను మినహాయిస్తే భారతీయ చిత్రకారులు ఎప్పుడూ సమగ్రమైన చిత్రాలు, ఆలోచనలనే రూపొందించారు. పార్సీ ప్రభావం కారణంగా ముఖచిత్ర రూపకల్పన అసలుసిసలు పార్సీ చిత్రాలనే తలదన్నే విధంగా అభివృద్ధి చెందింది. అక్బర్ ఆదేశాల మేరకు చిత్రకారులు ఆస్థాన ప్రముఖుల చిత్రాలను ఎంతో నైపుణ్యం, సున్నితత్వంతో ఖచ్చితమైన రేఖలతో రూపొందించారు. తర్వాతి కాలపు రాజపుత్ర చిత్రకళపై ఇది తీవ్ర ప్రభావం చూపించింది.

**జహంగీర్ కృషి :** చిత్రకళపైనే జహంగీర్‌కు ఎక్కువ ఆసక్తి ఉండేది. అలహాబాద్‌లో రాకుమారుడు సలీంగా నివసించినపుడు అతడు అప్పటికే ఎంతోమంది చిత్రకారులను నియమించుకున్నాడు. వారిలో అకా రీజా ఉన్నాడు. రీజా కుమారుడు అబుల్ హసన్ తర్వాతి కాలంలో జహంగీర్ కొలువులో పని చేశాడు. జహంగీర్ సమకాలీకులలో బిషన్‌దాస్, మధు, అనంత్, మనోహర్, గోవర్ధన్, ఉస్తాద్ మన్సూర్ ఉన్నారు. మన్సూర్ ఆధ్వర్యంలో మొగల్ చిత్రకళ ఉన్నత శిఖరానికి చేరుకుంది. ఒక కృతిపై ఎందరో కళాకారులు ఉమ్మడిగా పని చేయడం కొనసాగించారు. అయితే ఏ భాగాన్ని ఏ చిత్రకారుడు చేశాడనే విషయాన్ని జహంగీర్ స్పష్టంగా గ్రహించేవాడు.

ఈ కాలంలో ఐరోపా ప్రభావం మరింతగా పెరిగింది. రంగులు తేలికపాటిగా, పారదర్శకంగా మారాయి. అవి సామరస్యపూర్వకంగా పరస్పరం కలిసిపోయాయి. ముఖ్యంగా ప్రకృతి దృశ్యాల చిత్రీకరణలో ఇలాంటి మార్పు వచ్చింది. ఐరోపా చిత్రాలు, లిపి ఆకారాలను అనుకరించే సాంప్రదాయం కొనసాగింది. ఆ సమయానికి గ్రంథాలలో చిత్రవ్యాసాల పరంపర పాతదైపోయింది. ముఖ్యంగా జానపద కథల విషయంలో ఇలా జరిగింది. ఉదాహరణకు ఇయార్-ఎ-దానిష్, అన్వర్-ఎ-సుహేలీ గ్రంథాలు మాత్రమే తమ ప్రత్యేకతను నిలుపుకున్నాయి. అధికారుల చిత్రీకరణ (నిలువెత్తు చిత్రాలు) కొనసాగింది. జహంగీర్ బృంద చిత్రీకరణలను, ఆస్థాన దృశ్యాల చిత్రీకరణను ఇష్టపడేవాడు. తన జీవితంలోని వివిధ ఘట్టాలను చిత్రరూపంలో నమోదు చేయించుకున్నాడు. జహంగీర్ షాజహాన్‌ను కౌగిలించుకుంటున్న చిత్రం అక్బర్ కాలం నాటి పరిపూర్ణతను తలపిస్తుంది.

సింహాసనాన్ని అధిష్టించిన వెంటనే జహంగీర్ మురక్కాలను (ఆల్బమ్‌లు) తయారు చేయాలని ఆదేశించాడు. ఇందులో 40, 24 సెం.మీ ప్రామాణిక వైశాల్యం ఉన్న చిత్రాలను చేర్చారు. 1618లో పూర్తయిన ఈ పనులలో ప్రతి సంపుటంలోనూ ఒక పక్క ఒకటి లేదా అనేక చిత్రాలు, మరో పక్క ఘనమైన లిపికరణ ఉండేది. అరబేస్క్ లేదా పుష్పాలంకరణ, జంతువుల చిహ్నాలు అంచులలో చిత్రీకరించబడేవి. ఇందులో బంగారు నక్కాషిని కూడా ఉపయోగించారు. ఫ్రేములు అందంగా తీర్చబడ్డాయి. అలంకృత అంచుల ఆలోచన 1570లో పర్షియా నుండి వచ్చింది. కాని జహంగీర్ కాలంలోనే అది పరిపూర్ణత సాధించింది.

జంతువులు, పుష్పాలను  ప్రదర్శిస్తూ ఎన్నో అద్భుతమైన చిత్రాలు జహంగీర్ పాలనా సమయంలో వెలువడ్డాయి. ఇవి కొత్త శైలిని సృష్టించాయి. జహంగీర్ ఎక్కడికి వెళ్లినా కళాకారులు అతడి వెంట వెళ్లేవారు. తరచూ పుష్పవికాసం, మొక్కలు, పక్షులు, జంతువుల చిత్రాలను తయారు చేయాలని జహంగీర్ ఆదేశించేవాడు. ఈ గొప్ప చిత్రాలు ఆస్థాన దృశ్యాల కంటే ఎంతో తాజాదనాన్ని వెదజల్లుతాయి. జహంగీర్ హయాంలో చిత్రకళలో సాధించిన ఉన్నత విజయాన్ని అవి ప్రతిబింబిస్తాయి. తుజుక్-ఎ-జహంగీరీ (జహంగీర్ స్మృతులు)లో చక్రవర్తి రోజువారీ జీవితంలో వివిధ ఘట్టాలను చిత్రరూపంలో నమోదు చేశారు.

జహంగీర్ పాలనలోని చివరి పదేళ్లలో మొగల్ చిత్రాలు ఒక మార్పును ప్రదర్శిస్తాయి. అదేమిటంటే ప్రతీకాత్మకతకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడం. ఆరాధనాతత్వం కూడా అతడిని ఆకర్షించింది. అందుకే అతడు సూఫీ పవిత్ర గురువులను తన ఆస్థానానికి రప్పించి గౌరవ మర్యాదలు చేశాడు. గొప్ప సూఫీ నాయకుల సమాధులను సందర్శించాడు. "రాజుల కంటే సూఫీ షేక్‌లకు జహంగీర్ ఇస్తున్న ప్రాధాన్యత" అనే చిత్రంలో జహంగీర్ ఒక పెద్ద సమయసూచికపై కూర్చొని షేక్‌కు (ఇతడు అజ్మేర్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టీ దర్గా అధిపతి షేక్ హుసేన్ అయి ఉంటాడు) పుస్తకం అందిస్తున్నట్లు చిత్రీకరించారు. జహంగీర్ పక్కన ఒట్టోమన్ సుల్తాన్ చేతులు కట్టుకొని నిలబడి వినమ్రత ప్రదర్శిస్తున్నాడు. అతడి కింద ఇంగ్లాండ్ రాజు ఒకటవ జేమ్స్ వేచి చూస్తూ ఉన్నాడు.

నిలువెత్తు చిత్రాల విషయంలో జహంగీర్ అక్బర్ ప్రారంభించిన మరో శైలిని అభివృద్ధి పరిచాడు. తొలి చిత్రాలు వ్యక్తులను భవనాల ముందు లేదా లోపల నిలబడి ఉన్నట్లు లేదా ఆసనంపై కూర్చొని ఉన్నట్లు చూపుతాయి. అయితే జహంగీర్ హయాంలో వచ్చిన పరిపక్వ చిత్రాలు వ్యక్తుల నిలువెత్తు చిత్రాలను సాధారణ నేపథ్యంతో చూపిస్తాయి. లేదా ప్రకృతి రమణీయత నేపథ్యంగా ఉండేది. నేపథ్యాలు చిత్రంలో దాదాపు నాలుగింట మూడువంతులను ఆక్రమించేవి. ఇలాంటి చిత్రాలను చాలా వరకు ఆస్థాన ప్రముఖుల కోసం నకలు చేసేవారు. కనుక నిజమైన చిత్రాలను గుర్తించడం కష్టమవుతుంది.

**షాజహాన్ కృషి :**

నిర్మాణరంగంపైనే ఎక్కువగా ఆసక్తి ఉన్నప్పటికీ షాజహాన్ చిత్రకళను కూడా పోషించాడు. ఉన్నతమైన నాణ్యతగల పనితనం కొనసాగింది. అయితే అంతర్గత ప్రతిభ తగ్గిపోవడం మొదలుపెట్టింది. అక్బర్ కాలం నాటి చలనశక్తి, జహంగీర్ కాలం నాటి ప్రకృతి సౌందర్యం ఈ కాలంలో వచ్చిన చిత్రాల్లో కొరవడ్డాయి. చక్రవర్తి తన ఆస్థాన ప్రముఖులు, రాచరిక మహిళలతో కలిసి దర్వేష్లు, సూఫీ సంతులను సందర్శించే ఘటనలను చిత్రీకరించడం ఈ కాలంలో సాంప్రదాయంగా మారింది. మొగల్ పాలనలో తొలిసారి రేయి దృశ్యాలను కూడా చిత్రీకరించారు. నియంత్రిత భావాలు ఈ దృశ్యాలలో కనిపిస్తాయి. ఇలాంటి చిత్రాలు అంతకు ముందు వెలువడలేదు. సున్నితమైన, సన్నటి రేఖా చిత్రాలు తేలికపాటి రంగులు, బంగారు కాగుతో తయారయ్యేవి. ఇలాంటి పద్ధతిని "సియాహీ కలామ్" అని పిలిచేవారు. అనతి కాలంలోనే ఈ పద్ధతి జనరంజకంగా మారింది.

"నెమలి సింహాసనంపై చక్రవర్తి షాజహాన్" అనే ప్రముఖ మొగల్ సూక్ష్మచిత్రం రెండు విధాలా ఆసక్తిని కలిగిస్తుంది. ఒకవైపు అది ప్రసిద్ధమైన నెమలి సింహాసనాన్ని (నెమలి సింహాసనం ఇపుడు లేదు కాని సమకాలీకులు దానిని ఎంతో ప్రశంసించేవారు. ఫ్రెంచి యాత్రికుడు బెర్నియర్ ఆ సింహాసనం గురించి చక్కగా వివరించారు) ఆ చిత్రం చూపుతుంది. మరోవైపు వ్యక్తుల చిత్రీకరణ పద్ధతిని (షాజహాన్ కాలంలో) స్ఫూర్తినిస్తుంది. చక్రవర్తి గంభీరంగా కూర్చుని ఉన్నాడు. అతడి శిరస్సు వెనుక ఎలాంటి నేపథ్యంలేదు. అతడి కుడి చేయిలో ఒక పుష్పం ఉంది.

ఔరంగజేబ్ ఏ కళను ప్రోత్సహించలేదు. సంస్కృతి తన అంతర్గత చలనశక్తిని కోల్పోయి చివరకు పతనమైంది. బహుశా ఈ పతనావస్థలోనే అతడు తన చిత్రాలను రూపొందించడానికి అనుమతినిచ్చి ఉంటాడు. తెల్లటి గడ్డంతో ఒక వృద్ధుడు వేటాడుతున్న దృశ్యాలు, అలాగే ఖురాన్ ప్రతిని చేతిలో పట్టుకొని ఉన్న దృశ్యాలలో చక్రవర్తిని చూపే చిత్రాలు అనేకం ఉన్నాయి. మరో వైపు చాలా మంది మొగల్ కళాకారులు అవధ్, హైదరాబాద్, మైసూర్, బెంగాల్ లాంటి ప్రాంతీయ రాజ్యాలకు వలసపోయారు. తమ పాత సాంప్రదాయాలను కొత్త ప్రదేశాలకు తీసుకెళ్లారు. అయితే ప్రాంతీయ రాజ్యాలలో వారికి లభించిన ఆదరణ, పోషణ, వారి కృతుల నాణ్యత గొప్ప మొగల్ పాలకుల కంటే చాలా తక్కువ స్థాయిలో

ఉన్నాయి. మొగల్ చిత్రకళ మనుగడ చాలా వరకు రాచరిక పోషణపైనే ఆధారపడింది. ఈ పోషణను ఉపసంహరించుకున్నప్పుడు దాని పతనం అనివార్యమైంది.

**మొగల్ చిత్రకళాశైలి లక్షణాలు :**

మొగల్ చిత్రకళాశైలికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. తొలుత, మొగల్ చిత్రాలు పరిమాణంలో చాలా చిన్నవిగా ఉండేవి. కనుక వాటిని సూక్ష్మ చిత్రాలు అని పిలిచేవారు. ప్రాచీన కాలపు బౌద్ధ చిత్రాల ప్రతిభను, పరిమాణాన్ని మొగల్ చిత్రాలు ఎన్నడూ సంతరించుకోలేకపోయాయి. రెండవది, చిత్ర నేపథ్యాలు లేదా అంశాలు చాలా పెద్ద సంఖ్యలో ఉండేవి. ఉదాహరణకు వేట, యుద్ధం, పశుపక్ష్యాదులు, చెట్లు, మొక్కలు, పుష్పాలు, యుద్ధ సన్నివేశాలు, కోటల ముట్టడి, సామ్రాజ్య ఆస్థానం, చారిత్రక ఘట్టాలు, పౌరాణిక కథలు తదితర అంశాలను ఎన్నుకునేవారు. అయితే ఆరాధనాభావం, గృహస్తు జీవితానికి సంబంధించిన వాస్తవిక చిత్రాలు ఏవీ వెలువడలేదు. మూడవది, మొగల్ చిత్రకళ ఆస్థాన, రాచరిక అభిరుచి మేరకు ఉండేది. జానపద భావాలు వాటిలో ఏ కోశానా కనిపించేవి కావు. భారతీయ వాతావరణాన్ని అలవర్చుకున్నప్పటికీ మొగల్ చిత్రకళ భారతీయ భావాలను కాని, భారతీయుల నిత్యజీవిత సన్నివేశాలను కాని ఎన్నడూ ప్రతిబింబించలేదు. భారత ప్రకృతిలోని పీపల్, మామిడి, మర్రిచెట్లు, జింక, సింహం, నెమలి తదితర అంశాలను, భారతీయ వస్త్రాలు, నగలను మాత్రం ఎంతో విధేయతతో ప్రదర్శించారు. కాని సాధారణ ప్రజల జీవితాలకు ఎన్నడూ దర్పణం పట్టలేదు. ఆ విధంగా మొగల్ చిత్రకళ ఆ కాలపు ప్రజల జీవితంపై ఎలాంటి వెలుగును ప్రసరించలేకపోయింది. నాల్గవది, మొగల్ సామ్రాజ్యం ప్రకృతి ఆరాధన ఒక అద్భుతమైన లక్షణం. సామ్రాజ్య ఆస్థానం, ముఖ్యంగా జహంగీర్ ఇలాంటి చిత్రాల రూపకల్పనను ప్రోత్సహించారు. తీక్షణ పరిశీలన తర్వాత పశుపక్ష్యాదులను చిత్రీకరించడమే కాకుండా మొగల్ సూక్ష్మచిత్రాల అంచుల పట్టికలో పుష్పాల నక్కాషిని చెక్కారు. అడవి దృశ్యాలలో పరిసరాలను చాలా ఖచ్చితంగా, గొప్ప భావనలో ప్రదర్శించారు. ఐదవది, వ్యక్తిగత నిలువెత్తు చిత్రాల ఉత్పత్తిలో మొగల్‌శైలి అపారమైన ప్రతిభను చూపింది. ఆరవది, రంగులను అద్దడం, వాటిని మేళవించడంలో మొగల్ చిత్రకారులు ఆరితేరారు. సాధారణంగా ఎర్ర, నీలి, స్వర్ణ ఛాయల అందమైన కలయికగా వారి చిత్రాలు ఉండేవి.

**రాజ్‌పుత్ చిత్రకళ శైలి :**

రాజపుత్ర చిత్రకళాశైలి (1550–1750) దాదాపు సమాంతరంగా జీవించింది. ఫ్రెస్కో చిత్రాల ఛాయలు మధ్యయుగ రాజపుత్ర రాజభవనాలలో కనిపిస్తాయి. ముఖ్యంగా జోధ్‌పూర్, జైపూర్, ఉదయ్‌పూర్, బికానేర్ తదితర కోటలలో స్థానిక చిత్రకళాశైలి నిరంతరంగా పోషించబడింది. ప్రాచీన భారత చిత్రకళాశైలి మొగల్ పాలకుల నేతృత్వంలో వచ్చిన కొత్త పరిణామాలతో కలిసిపోలేదు. అయితే పర్షియన్, మొగల్ శైలులతో సంబంధాల కారణంగా దానికి ఊతం లభించింది. ఆసక్తికరమైన రీతిలో అది పునరుద్ధరణకు గురైంది. హిందూ

పునరుద్ధరణ, భక్తి ఉద్యమాలు, మత వేడుకలు, పౌరాణిక సాహిత్యంలో అమితాసక్తి భారతచిత్రకళ పునరుద్ధరణకు మరింత దోహదం చేశాయి. రాజస్థాన్, మధ్యభారత్, జైపూర్‌లలో అది వికసించింది. జైపూర్ భారతీయ చిత్రకళకు ప్రధాన కేంద్రంగా మారింది. ఈ కారణంగానే అది రాజపుత్ర చిత్రకళ శైలి అని పిలవబడింది. 16వ శతాబ్దపు ద్వితీయార్థంలో అది ఉన్నత శిఖరానికి చేరుకుంది. సుమారు రెండు శతాబ్దాల నిరంతర వికాసం తర్వాత అది పతనమైంది.

రాజ్‌పుత్ చిత్రకారుల కుటుంబాలు కొన్ని హిమాలయ రాజ్యాలలో శరణు, పోషణ పొందాయి. కనక 18, 19వ శతాబ్దాలలో పంజాబ్–హిమాలయ ప్రాంతంలో ఒక నూతన రాజ్‌పుత్ శైలి అభివృద్ధి చెందింది. కొందరు కళావిమర్శకులు ఈ శైలిని కాంగ్రా చిత్రశైలి అని పిలిచారు. కాంగ్రా అప్పుడు ప్రముఖ హిమాలయ రాజ్యంగా ఉండేది. మరికొందరు విమర్శకులు దానిని పహారీ (పర్వత ప్రాంతానికి సంబంధించిన) శైలి అని పిలిచారు. కాంగ్రా లేదా పహారీ శైలి భావ వ్యక్తీకరణలకు ప్రఖ్యాతి గడించింది. పహారీ లేదా కాంగ్రా చిత్రాల అంశాలు రాజపుత్ర చిత్రాల అంశాల కంటే విశాలంగా ఉన్నాయి.

**మొగల్, రాజపుత్ర చిత్రకళా శైలుల తులనాత్మక అధ్యయనం :**

తొలుత మొగల్ శైలి రాచరికత్వాన్ని, నిర్దిష్టతను కలిగి ఉండేది. అయితే రాజపుత్ర శైలి ప్రజాతంత్రమైనది, ప్రధానంగా ఆరాధనకు సంబంధించినది. సామ్రాజ్య ఆస్థాన వైభవం, వైభోగానికే మొగల్ శైలి పరిమితమైంది. కనక అది మొగల్ వైభోగం, విలాసాన్ని ప్రదర్శించడానికి సరిపోయింది. అందుకు విరుద్ధంగా రాజపుత్ర శైలి ప్రజాకళగా ఎదిగింది. దాని అంశాలు జనాంతికమైనవి, సుపరిచితమైనవి. రేఖ, వర్ణం ద్వారా అది జాతి భావాలను ప్రదర్శించింది. రాజ్‌పుత్‌ల ధీరత్వాన్ని, ఉన్నత గుణాలను ప్రతిబింబించింది. అది చాలా వరకు జానపద కళ. మతం, వేడుకలు, రాజుల ఆశయాలు, అలవాట్లు, గ్రామాల అందమైన వాతావరణం, సంతలు, వృత్తిదారుల పనితనం, పొలాలు, రైతులు, ప్రయాణ ఘట్టాలైన మధ్యాహ్న విశ్రాంతి తదితర అంశాలను ఎంతో ఉన్నతంగా, ఉత్సాహభరితంగా, నిజాయితీగా చిత్రీకరించారు. రామాయణ, మహాభారతాల నుండి ఎన్నో దృశ్యాలను అంశంగా తీసుకున్నారు. గత కాలపు బౌద్ధ జాతక కథలలో వలే ప్రజల జీవితాలు మరోసారి ముందుకు వచ్చాయి.

రెండవది మొగల్ శైలి అటవీ జీవన భౌతికవాద కోణాన్ని (క్రూర మృగాల వేట, జింకలవేట, ఏనుగుల పోరాట దృశ్యాలు తదితర అంశాలు) ఆవిష్కరిస్తే రాజపుత్ర శైలి ఈ పశువులకు ఆత్మగౌరవాన్ని కల్పించింది. దేవతలను జంతువుల అవతారంలో చూపారు. ఉదాహరణకు హనుమంతుని ఎక్కువగా చిత్రీకరించారు. మూడవది, మొగల్ శైలి భౌతికవాదాన్ని ప్రదర్శిస్తే రాజపుత్ర శైలి ఆధ్యాత్మిక కోణాన్ని స్పృశించింది. ఒకటి వినోదాన్ని అందిస్తే మరొకటి భారతీయ జీవన సౌందర్యాన్ని, ప్రజల మత విశ్వాసాన్ని ప్రదర్శించింది. ఆ విధంగా రాజపుత్ర శైలి మతంతో చాలా దగ్గరగా ముడిపడి ఉంది. అందుకు భిన్నంగా మొగల్ శైలి లౌకికవాద (భౌతికవాద) వాస్తవికవాద పంథాకు ప్రతిబింబంగా నిలిచింది.

## సంగీత రంగంలో కృషి :

హిందువులు, ముస్లింలు పరస్పరం సహకరించుకున్న మరో సాంస్కృతిక రంగం సంగీతం. గ్వాలియర్‌కు చెందిన తాన్‌సేన్‌ను అక్బర్ పోషించాడు. తాన్‌సేన్ అనేక రాగాలను సృష్టించారు. జహంగీర్, షాజహాన్‌తోపాటు మరెందరో సంస్థానాధీశులు అక్బర్ స్థాపించిన సాంప్రదాయంలో పయనించారు. సనాతనవాది అయిన ఔరంగజేబ్ సంగీతాన్ని పాతిపెట్టడంపై అనేక కథలు వెలువడ్డాయి. ఇటీవలి అధ్యయనాల ప్రకారం ఔరంగజేబ్ తన ఆస్థానంలో కేవలం గాత్ర కచేరీలను మాత్రమే నిషేధించాడు. వాయిద్య సంగీతాన్ని కొనసాగించాడు. వాస్తవానికి ఔరంగజేబ్ స్వయంగా వీణావాదకుడు. సంగీతాన్ని అన్ని స్వరూపాల్లోనూ ఔరంగజేబ్ రాణులు తమ అంతఃపురాలలో పోషించేవారు. అలాగే సంస్థానాధీశులు కూడా ఈ సాంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ కారణంగానే ఔరంగజేబ్ హయాంలో ప్రాచీన భారత సంగీతంపై పార్సీలో అనేక గ్రంథాలు వెలువడ్డాయి. అయితే సంగీత రంగంలో అనేక ముఖ్యమైన పరిణామాలు తర్వాతి కాలంలో (18వ శతాబ్దంలో) ముహమ్మద్ షా పాలనలో సంభవించాయి. ముహమ్మద్ షా 'రంగీలా'గా ప్రసిద్ధుడయ్యాడు (1720–48).

**ఇతర కళల అభివృద్ధికి కృషి :** మొగల్‌ల కాలంలో లలిత కళల వికాస పర్వం ఇతర కళల గురించి ప్రస్తావించకుండానే పూర్తికాదు. ఖురాను నిషేధం ఉన్నప్పటికీ శిల్పకళను కొంత వరకు ప్రోత్సహించారు. 1568లో చిత్తోర్ కోటను పరిరక్షిస్తూ నేలకొరిగిన జైమల్, పట్టాల శిలావిగ్రహాలను ఢిల్లీ కోట ద్వారాల బయట చెక్కించినట్లు ప్రతీతి. స్వర్ణకారుల పనితనానికి సంబంధించి నెమలి సింహాసనం ఒక అపూర్వమైన ఘట్టం. స్వర్ణకారులకు ఎనలేని గౌరవం దక్కింది. బంగారు, వెండి నగలు లోకప్రియం అయ్యాయి. సామ్రాజ్య ముద్రణాలయాలు ఉన్నతమైన బంగారు, వెండి, రాగి నాణేలను ఉత్పత్తి చేశాయి. సాధారణంగా నాణేలలో లిపి (పార్సీ, అరబిక్)ని అందంగా చెక్కేవారు. జరి, దస్తకారి కళ కూడా గణనీయంగా అభివృద్ధి చెందింది. ఈ కళను సామ్రాజ్య రాజభవనాలలో ఎక్కువగా పోషించారు. నేత, రంగుల అద్దకం కళను విజయవంతంగా పోషించారు. ఖరీదైన పట్టుతో తయారు చేయబడిన తివాచీలు, బ్రోకేడ్లు, మస్లిన్‌లు, షాల్‌లు, చిట్జీలు ప్రపంచమంతటా ప్రసిద్ధమయ్యాయి.

## భాష-సాహిత్యం :

**పార్సీ చారిత్రక కృతులు :** ముస్లిం చరితశాస్త్రంలో మొగల్ కాలానికి వచ్చే సమయానికి స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. దృక్పథంలో, వ్యవహారశైలి, పద్ధతి అంశాలలో ఈ పరివర్తనం చోటు చేసుకున్నట్లు కనబడుతుంది. సుల్తాన్ రాజ్యకాలం దాదాపు అంతరాల కాలం. మొగల్ కాలానికి అది దాదాపు పరిపక్వత, విజ్ఞానాన్ని, గౌరవాన్ని సంతరించుకుంది. ప్రజా సమస్యలు, నాగరికత ప్రగతి, ఆలోచనల ఆవిర్భావాన్ని పరికించే కొత్త తరహా చరిత్ర ఆవిర్భవించింది. వృత్తి నిపుణులైన చరిత్రకారులే కాకుండా చక్రవర్తులే స్వయంగా ఈ కొత్త తరహా చరిత్ర రచనలో తెరపైకి వచ్చారు. బాబర్ స్వంత స్మృతులు తుజుక్–ఎ–బాబరీ అనే తుర్కు భాష

చరిత్ర గ్రంథాన్ని పోలి ఉండే ఏ కృతి వెలువడలేదు. అలాగే బాబర్ కుమార్తె హుమాయూన్ నామాను రచించింది. ఈ విషయంలో గుల్బదన్ బేగం తన సోదరుని గురించి అద్భుతమైన చరిత్ర సంగ్రహాన్ని తీసుకురావడంలో కృతార్థురాలైంది. పై రెండు గ్రంథాలు భాషలో ఉదాత్తమైనవి, విజ్ఞానపరమైనవి. వాస్తవాలను న్యాయబద్ధంగా నమోదు చేశాయి. అన్నింటికంటే విశ్వసనీయమైన ఆత్మకథ జహంగీర్‌దే. అందులో తన తప్పిదాలను, బలహీనతలను అతడు బహిరంగంగా అంగీకరించాడు. అతడి స్మృతుల సంకలనాన్ని 'తుజుక్-ఎ-జహంగీరీ' అంటారు. చరిత్రలో విమర్శనాత్మక అధ్యయనాలను పాలకులు ప్రోత్సహించారు. ఉదాహరణకు బదౌని తన చక్రవర్తి అక్బర్‌పై నిశితమైన వ్యాఖ్యానాలు చేశాడు. ఈ కాలపు చారిత్రక సాహిత్యం అద్భుతంగా వచ్చింది. ప్రత్యేక, సాధారణ చరిత్రలను దాదాపు ఘటనా క్రమాన్ని నమోదు చేసినంత స్థాయిలో రచించారు. ఈ కాలపు ఇతర సాహిత్యాలలో (1) అధికారిక నివేదికలు (2) ప్రభుత్వ నివేదికలు (3) జీవిత కథలు, స్మృతులు (4) అనధికార చరిత్రలు, (5) స్థానిక చరిత్రలు, (6) అధ్యయన పత్రాల సేకరణ, (7) గజెట్‌లు, అధికారిక నిబంధనావళులు, (8) సాహిత్య కృతులు ఉన్నాయి.

గొప్ప మొగల్ పాలకుల యుగంలోని అత్యంత ముఖ్యమైన చరిత్రకారుడు అబుల్ ఫజల్ అల్లామీ. 1550లో జన్మించిన ఫజల్‌ను 1602 రాకుమారుడు సలీం ప్రోద్బలంతో బీర్‌సింగ్ బుందేలా హత్య చేశాడు. ఫజల్ తండ్రి షేక్ ముబారక్ ప్రముఖ విద్వాంసుడు సూఫీ. అక్బర్ మత ఆలోచనలు, విధానాన్ని రూపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఫజల్ సోదరుడు ఫైజీ అక్బర్ ఆస్థానకవి. స్వయంగా ఫజలే ఉన్నత శ్రేణి విద్వాంసుడు. ఆరాధనాతత్వాన్ని నమ్మేవాడు. రాజ్య విశ్వాసపాత్రుడు, గొప్ప పరిపాలకుడు. ఎన్నో శక్తి సామర్థ్యాలు గల ఫజల్ అక్బర్‌కు ఆప్తమిత్రుడు.

తన పాలనాకాలపు చరిత్రను రచించే బాధ్యతను అక్బర్ అతడికి అప్పగించాడు. అబుల్ ఫజల్ రెండు అద్భుతమైన గ్రంథాలను తీసుకువచ్చాడు. వాస్తవాల వివరణ, ఘటనాక్రమాన్ని అతడు సాధ్యమైనంత వరకు పక్కాగా నమోదు చేశాడు. అతడి శైలి అద్భుతంగా ఉన్నప్పటికీ అది చాలా వరకు చర్వితచరణంగా, అంతర్గతంగా ఉండి పాఠకుడిని ప్రత్యక్షంగా ఆకర్షించలేదు. తన పోషకుడిని అతడు పొగడ్తలతో ముంచెత్తాడు. అక్బర్‌ను అతడు మహాపురుషునిగా భావించాడు. మొత్తం మీద అబుల్ ఫజల్‌ను పూర్తి నిష్పక్ష, వాస్తవికవాద చరిత్రకారునిగా పరిగణించలేము.

అబుల్ ఫజల్ రచించిన అక్బర్ నామా భారీ గ్రంథం. తైమూర్ నుండి హుమాయూన్ వరకు గల మొగల్ రాచరిక చరిత్రను తొలి భాగంలో వివరించిన తర్వాత ఆ గ్రంథం అక్బర్ పాలన చరిత్రను రెండవ భాగంలో నమోదు చేసింది. అక్బర్ పాలన తొలి సంవత్సరం నుండి 1602 వరకు ఈ వర్ణన ఉంది. చక్రవర్తి తీసుకున్న ప్రతి చర్య వెనుకగల కారణాలను అది విశదీకరిస్తుంది. ఈ కాలపు చరిత్రలోని ప్రతి అంశాన్ని ముందుకు తెస్తుంది. ఇనాయతుల్లా రచించిన తక్మిల్-ఎ-అక్బర్ నామా అబుల్ ఫజల్ కృతికి కొనసాగింపు. అక్బర్ మరణం

వరకు సంభవించిన పరిణామాలను అది ఉల్లేఖిస్తుంది. అక్బర్ నామాలో మూడవ అత్యంత ముఖ్య భాగమైన అయిన్-ఎ-అక్బరీ అక్బర్ పరిపాలనా సంస్థల (వ్యవస్థలు) గురించి సమాచారాన్ని అందించే ప్రధాన ఆధారంగా ఉంది. అన్ని శాఖల్లోనూ, అన్ని విషయాల్లోనూ అక్బర్ రూపొందించిన విధి విధానాలను, నిబంధనలను ఆ గ్రంథం మౌలికంగా చర్చిస్తుంది. అలాగే కొన్ని ఇతర విషయాలను, సామ్రాజ్య గణాంకాలను చారిత్రక, ఇతర వ్యాఖ్యానాలతో సమగ్రంగా నమోదు చేసింది. అబుల్ ఫజల్ లేఖల సంకలనం రుఖ్బత్-ఎ-అబుల్ ఫజల్ ఉంది. అందులో అక్బర్, ఇతర సామ్రాజ్య కుటుంబీకులకు ఫజల్ రాసిన లేఖల వివరాల ఉన్నాయి. ఈ సంకలనం అనేక చారిత్రక ఘటనలపై సరైన సమాచారాన్ని ఇస్తాయి.

సమాచారాన్ని సేకరించడానికి అబుల్ ఫజల్ ఎంతో కష్టపడ్డాడు. ఎందరో అధికారులను ప్రశ్నించాడు. సంస్థానాధీశులు, ఇతర ప్రముఖుల అభిప్రాయాలను తెలుసుకున్నాడు. ఆ విధంగా పరిపాలన, సామాజిక స్థితిగతులు, ఆర్థిక జీవనం గురించి సమగ్ర సమాచారాన్ని సంకలించాడు.అతడి నివాస గృహం ఒక భారీ నివేదికల కార్యాలయంగా మారింది. అన్ని అధికారిక పత్రాలు, మంత్రుల నివేదికలను సేకరించడానికి అతడు ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాడు. వివిధ విషయాలపై చక్రవర్తిని స్వయంగా కలుసుకున్నాడు. అతడు ఎంతశ్రద్ధ వహించేవాడంటే నివేదికలను ఐదుసార్లు సరిదిద్దేవాడు. పరిపాలనా సంబంధిత భాగాన్ని (అయిన్-ఎ-అక్బరీ) అతడు 1593లో పూర్తి చేశాడు.

సమాచార విశ్వసనీయత విషయానికి వస్తే ఈ గ్రంథంలో పొందుపరచిన వివిధ అంశాలు, అందులో పాటించిన విమర్శనాత్మక, విశ్లేషణా పద్ధతి, లక్ష్య నిజాయితీ, విశ్లేషణ, అన్వయింపు కారణంగా అది ఒక సమగ్ర గ్రంథంగా కనిపిస్తుంది. అదో సమాచారగని. వనరులు, స్థితిగతులు, జనాభా, పరిశ్రమలు, వ్యాపార-వాణిజ్యాలు, పరిపాలనా విభాగాలు (సుబాలు) తదితర వాటి గురించి సవివరంగా నమోదు చేశాడు. ఆ కాలపు ఆలోచనాధోరణిని అద్దం పట్టేందుకు అబుల్ ఫజల్ ప్రయత్నించాడు. ప్రజల ప్రవర్తనను వివరించాడు. ఎన్నో ఉన్నత లక్షణాలు ఉన్నప్పటికీ అతడి అక్బర్‌నామా స్వాభావికంగా స్వీయానుభవ దృక్పథం కలది. అతడి వర్ణనాశైలి కూడా క్లిష్టమైనది. కేవలం అంకితభావం గల విద్వాంసులే ఆ గ్రంథాన్ని తమ అధ్యయనం కోసం చక్కగా వినియోగించుకోగలరు. విశాలమైన పాఠక లోకాన్ని అబుల్ ఫజల్ గమనంలోకి తీసుకోలేదని తెలుస్తోంది. కేవలం అక్బర్ మెప్పుకోసమే అతడు పరిశ్రమించాడు. కనుక అతడి గ్రంథం కూడా ఏకపక్షంగా ఉండే అవకాశమే ఎక్కువగా ఉంది. ఫలితంగా అక్బర్ నామా పార్సీ తెలిసిన వారందరి నోళ్లపై నానలేదు (ఫిరదౌసి షానామాలాగా). అయితే అధ్యయనానికి అది ఒక ఆధారంగా మిగిలిపోయింది.

అబుల్ ఫజల్‌కు విరుగుడు అబ్దుల్ కాదిర్ బదౌనీ. అతడు అక్బర్‌ను ప్రత్యేకంగా విమర్శించాడు. అబుల్ ఫజల్ అత్యంత వేగంగా ఉన్నత శిఖరాలను అందుకోవడాన్ని అతడు జీర్ణించుకోలేకపోయాడు. కనుక చక్రవర్తిపట్ల వైరి భావనను పెంచుకున్నాడు. ఈ విషయం అతడు రచించిన ముంతఖాబ్-ఉల్-తవారీఖ్‌లో వ్యక్తమవుతుంది. అతడు చక్రవర్తి మత

విధానాన్ని, ఉదారవాదాన్ని హర్షించలేదు. అక్బర్ అవలంబించిన రాజపుత్ర విధానం, సనాతనవాద మత విధానంపట్ల చక్రవర్తి చూపిన అలక్ష్యాన్ని బదౌనీ తీవ్రంగా విమర్శించాడు. అతడు అబుల్ ఫజల్‌ను ప్రత్యేకంగా ద్వేషించాడు. కనక చక్రవర్తి ఆదర్శవాదాన్ని తప్పుగా అన్వయించాడు. ఆ విధంగా అతడి రచన చరిత్ర గ్రంథం కంటే వాద ప్రతివాదనల సంగ్రహంగా మారింది. 1592లో నిజాముద్దీన్ అహ్మద్ రచించిన తబాకత్–ఎ–అక్బరీ అక్బర్ హయాంలో వెలువడిన తర్వాత ముఖ్యమైన చారిత్రక గ్రంథం. ఘజ్నీ పాలకుల దండయాత్రల నుండి అక్బర్ పాలన వరకు జరిగిన చారిత్రక ఘటనలను అది సాధారణ పద్ధతిలో నమోదు చేసింది.

జహంగీర్ నుండి ఔరంగజేబ్ పాలన వరకు విస్తరించి ఉన్న కాలంలో కూడా చరిత్ర రచనలో క్రియాశీలత్వం కొనసాగింది. జహంగీర్ కాలానికి అతడి స్వంత స్మృతులు మనకు అందుబాటులో ఉన్నాయి. తుజుక్–ఎ–జహంగీరీ అనే ఆ గ్రంథం జహంగీర్ పట్టాభిషేకం నుండి అతడి 12వ పాలనా సంవత్సరం వరకు జరిగిన సంఘటనలను వివరిస్తుంది. ఈ గ్రంథం ఎంతో ఉపయోగకరమైనది, ముక్కుసూటి అభిప్రాయాలు కలది. చాలా సందర్భాలలో జహంగీర్ తాను చేసిన తప్పులను, అంగీకరించి పశ్చాత్తాపం ప్రకటించాడు. రాజకీయ, సైనిక ఘటనలే కాకుండా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలను, జహంగీర్ స్వంత అనుభవాలు (వ్యక్తులు, పద్ధతులు, ఘటనలకు సంబంధించి) కూడా ఈ గ్రంథంలో ఉన్నాయి. ముతామద్ ఖాన్ రచించిన ఇక్బాల్ నామా, ముహమ్మద్ మురాద్ రచించిన సియర్–ఉల్–బిలాద్, సికందర్ బిన్ ముహమ్మద్ మంఝూ రచించిన మీరత్–ఎ–సికందరీ తదితర గ్రంథాలు ఈ కాలంలో వెలువడిన ముఖ్యమైన గ్రంథాలు.

షాజహాన్ పాలనా కాలంలో చారిత్రక సాహిత్యం మరింత అభివృద్ధి చెందింది. చరిత్రకు అతడి ఎనలేని ప్రాధాన్యతనిచ్చాడు. చరిత్రను ఉన్నత శాస్త్రంగా, అధ్యయన విభాగంగా పరిగణించాడు. అబ్దుల్ హమీద్ లాహోరీ రచించిన పాద్‌షాహ్‌నామా భారీ గ్రంథం. అందులో చక్రవర్తి పాలనకు సంబంధించిన విషయాలను నిర్దిష్టంగా నమోదు చేశాడు. ఈ కృతి అత్యంత సాధారణంగా, చదవడానికి ఎంతో తేలికగా ఉంది. రాజకీయ, సామాజిక జీవనానికి సంబంధించిన అనేక కోణాలను అది ఆవిష్కరించింది. విద్వాంసులు, సంతుల గురించి సవివరమైన వర్ణన ఉంది. స్థూలంగా రాజకీయ మత విధానం ఉదారవాద పంథా నుండి సాంప్రదాయవాద పంథాకు మళ్లడాన్ని ఆ గ్రంథం ఉల్లేఖిస్తుంది. ముహమ్మద్ వారిస్ అదే పేరుతో మరో చారిత్రక గ్రంథాన్ని (వర్ణన) రాశాడు. ఇనాయత్ ఖాన్, ముహమ్మద్ సలిహ్ అనే చరిత్రకారులిద్దరూ షాజహాన్ పాలనా కాలాన్ని వివరిస్తూ రాసిన గ్రంథాలు కూడా "షాజహాన్ నామా" అనే ఉమ్మడి పేరుతోనే వెలువడ్డాయి.

ఔరంగజేబ్ సనాతనవాదం చరిత్ర రచనపై ప్రతికూల ప్రభావం చూపింది. ఏ చరిత్రకారుడూ తన పాలనా కాలంలోని ఘట్టాలను నమోదు చేయరాదని అతడు ఆదేశాలు జారీ చేశాడు. తన హయాంలో ఎదుర్కొన్న రాజకీయ, దౌత్య, సైనిక పరాభవాలను బహిరంగం చేయడం బహుశ అతడికి ఇష్టంలేకపోయి ఉండవచ్చు. అయినప్పటికీ చారిత్రక స్ఫూర్తి ఏ స్థాయికి చేరుకొని ఉండేదంటే అధికారిక ప్రోత్సహం లేకున్నా చరిత్ర రచన మాత్రం ఆగిపోలేదు.

ముహమ్మద్ సాకీ ముస్తయిద్ ఖాన్ "మాసిర్-ఎ-ఆలంగీరీ" అనే గ్రంథాన్ని రచించాడు. అతడు 40 ఏళ్లపాటు ఔరంగజేబ్‌కు సేవలందించాడు. అనేక ఘటనలకు అతడు ప్రత్యక్ష సాక్షి. అధికారిక చరిత్రలేని లోపాలు చక్రవర్తి రాసిన అనేక లేఖల వల్ల, ఇతర విదేశీ సాక్ష్యాలవల్ల భర్తీ అవుతున్నాయి. తదుపరి కాలంలో ముహమ్మద్ హాషిం కఫీఖాన్ ముంతఖబ్-ఉల్-లుబాబ్ (తారీఖ్-ఎ-కఫీఖాన్) అనే గ్రంథాన్ని రూపొందించాడు. ఘోరి దండయాత్రల నుండి క్రీ.శ. 1733వ సంవత్సరం వరకు సంభవించిన చారిత్రక పరిణామాలను ఆ గ్రంథంలో నమోదు చేశాడు.

చాలా మంది మొగల్ చరిత్రకారులు ఒక ప్రత్యేకమైన చారిత్రత తత్వాన్ని అవలంబించలేదు. వారు సమాచారాన్ని కష్టపడి సేకరించి దానిని తెలివిగా వాడుకున్నారు. తమ ఆలోచనలను బలంగా వ్యక్తీకరించారు. అయితే అంతకంటే ఇంకా ఎక్కువగా చేయాల్సిన అవసరం ఉండేది. వారికి రాజకీయ పరిస్థితులు, కారణాలు, ప్రక్రియల గురించి ఎలాంటి ఆలోచనలు ఉండేవి కావు. కనుక పరిణామాలను ఖచ్చితంగా, సమగ్రంగా విశ్లేషించలేక పోయారు. క్రీ.శ.1200 నుండి 1800 వరకు ఉన్న కాలంలో వ్యక్తిగతంగా అన్వయించిన చరిత్ర ఎక్కువగా వచ్చింది. ఈ చరిత్ర దురభిప్రాయాలకు దూరంగా ఉండలేకపోయింది. అధికారిక చరిత్రలు కావడంతో అవి చాలా వరకు చక్రవర్తులు కార్యాలను వివరించడంపైనే దృష్టి కేంద్రీకరించాయి. అలాగే పాలకవర్గ జీవనశైలిని వివరించాయి. కాని సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, తత్సంబంధిత అంశాలను (వాస్తవిక పరిస్థితులను) పూర్తిగా విస్మరించాయి. చరిత్రకారుల ఉద్దేశ్యం పాలకులను పరిపూర్ణులుగా, సనాతనవాదులుగా చిత్రీకరించడమే. అయితే ఈ ఆలోచనా విధానంవల్లే ఆ కాలపు చరిత్ర రచనలో లోపాలు తలెత్తాయి. కాని సమకాలీన ఆలోచన, జీవితాలకు ఈ చారిత్రక సాహిత్యం అద్భుతంగా, ఉన్నతంగా కనిపించింది (ప్రపంచంలోని ఇతర చరిత్రలతో పోలిస్తే).

### విదేశీ యాత్రికుల వర్ణనలు :

సాధారణంగా ఇస్లామిక్ చరిత్ర, మరీ ప్రత్యేకంగా చారిత్రక ఘటనల నమోదులో పొడసూపిన లోపాలు చాలా వరకు విదేశీ యాత్రికుల వర్ణనలతో నిండిపోయాయి. ఈ యాత్రికులు ప్రాచీన కాలం నుండే భారతదేశాన్ని పర్యటించడం మొదలుపెట్టారు. దౌత్యవేత్తలు, తత్త్వవేత్తలు, మతగురువులు, పోషకులు భారతదేశాన్ని సందర్శించి విలువైన అనుభవాలను, వర్ణనలను వదలి వెళ్లారు. అవి ఇప్పుడు చారిత్రక సాహిత్యంలో ఒక విశాల భాగంగా ఉన్నాయి.

భూగోళంలోని ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వివిధ వర్గాల ప్రజల కదలిక కొందరిని భారతదేశానికి వచ్చేలా స్ఫూర్తినిచ్చింది. సాధ్యమైనంత వరకు అలాంటి ప్రజలు ఇక్కడే తాత్కాలికంగా స్థిరపడేందుకు, తర్వాత తమ వ్యాఖ్యానాలు రాసేందుకు ఈ వలసలు తోడ్పడ్డాయి. భారతదేశంలో ఐరోపావాసులు అడుగుపెట్టడంతో మన చరిత్ర శాస్త్రం వినూత్న పరివర్తన చెందింది. కేవలం దృక్పథంలోనే కాకుండా సాహిత్య పరిమాణంలో మన చరిత్ర శాస్త్రం వినూత్న పరివర్తన చెందింది. కేవలం దృక్పథంలోనే కాకుండా సాహిత్య పరిమాణంలో

కూడా గణనీయమైన మార్పు వచ్చింది. బహుశా ప్రపంచంలోని ఏ ఇతర దేశం ఇంత భారీ స్థాయిలో చారిత్రక సాహిత్యాన్ని ఉత్పత్తి చేసి ఉండదు. తొలుత వాణిజ్య కార్యకలాపాల కోసం ఇక్కడి ఆ తర్వాత దేశ పాలకులుగా ఐరోపావాసులు మారడంతో కొత్త తరహా పాలనా వ్యవస్థ అవసరమైంది. ఈ వ్యవస్థకు నివేదికల రూపకల్పనే ప్రధాన ఆధారం అయ్యింది. ఐరోపాలో చరిత్ర రచనకు ఉన్నతమైన స్థానం కల్పించారు. ఈ సాంప్రదాయాన్ని వారు భారతదేశానికి తీసుకువచ్చారు. మౌలికంగా వారి శ్రద్ధంతా వ్యాపారంపైనే ఉండడంతో వారు చేసిన వ్యాఖ్యానాలు చాలా వరకు ప్రజల ఆర్థిక జీవితానికి సంబంధించినవే. భారతీయుల సామాజిక కూర్పుపై వారు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఇప్పటికి కూడా ఈ వ్యాఖ్యానాలు ఆర్థిక చరిత్ర అధ్యయనానికి ముఖ్య ఆధారాలుగా మిగిలిపోయాయి. స్థానిక దురభిప్రాయాలకు దూరంగా ఈ వ్యాఖ్యానాలు ఉండడం అనుకూలాంశం. ఒక ప్రత్యేక రాజు లేదా సుల్తాన్‌తో వారు ముడిపడలేదు. కనక భారతదేశానికి సంబంధించిన వాస్తవిక అంచనాను వారు ఇవ్వగలిగారు. క్రీ.శ.1600 నుండి 1800 మధ్యలో భారతదేశాన్ని సందర్శించిన ముఖ్యమైన యాత్రికుల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాము.

గుజరాత్ దండయాత్ర తర్వాత అక్బర్ ఐరోపా వాసులతో ప్రత్యక్ష సంబంధాలను మెరుగు పరచుకున్నాడు. అలాగే తన ఆస్థానానికి మత గురువులను ఆహ్వానించాడు. ఈ ప్రక్రియలోనే పోర్చుగీసు జెస్యూట్ మిషనరీలు (ఫాదర్ మోన్సరేట్ లాంటి వారు) అక్బర్‌తోపాటు ఫతేపూర్ సిక్రిలో నివసించారు. ఫాదర్ మోన్సరేట్ అక్బర్ మత జీవితం గురించి, అతడు స్థాపించిన దీన్-ఎ-ఇలాహీ గురించి విలువైన సమాచారాన్ని నమోదు చేశాడు. అయితే జహంగీర్ కాలం నుండే ఐరోపావాసులు భారత దేశానికి పెద్ద సంఖ్యలో రావడం మొదలుపెట్టారు. ముఖ్యంగా డచ్, ఆంగ్లేయులు, ఫ్రెంచి వ్యాపారులు ఇక్కడికి తరలివచ్చారు. విలియం హాకిన్స్, రాల్ఫ్ ఫిష్, జాన్ మిల్డెన్‌హాల్, విలియమ్ ఫించ్, థామస్ రో తదితర ఆంగ్లేయులు ఇక్కడికి వచ్చారు. వీరిలో కొందరు వ్యాపారులుగా, కొందరు దౌత్యవేత్తలు, దూతలుగా వచ్చారు.

ఉదాహరణకు విలియమ్ హాకిన్స్ జహంగీర్ ఆస్థానానికి వెళ్లి సూరత్‌లో వ్యాపారం నిర్వహించేందుకు ఫర్మానా పొందాడు. అయితే అన్నింటికంటే ముఖ్యమైన దౌత్య పర్యటనను సర్ థామస్ రో 1615లో చేపట్టాడు. అతడు జహంగీర్ ఆస్థానానికి వెళ్లాడు. అనుమతి పొందడంతోపాటు అతడు సూరత్ ఓడరేవు గురించి, మొగల్ వ్యాపార, వాణిజ్య విధానం గురించి విలువైన సమాచారాన్ని వదలి వెళ్లాడు. ఓడరేవు పట్టణమైన సూరత్ గురించి సమగ్రంగా వివరించాడు. మొగల్ ఆస్థాన వైభవం, భారతదేశంలో ఇతర ఐరోపా కంపెనీల పాత్ర గురించి వర్ణించాడు.

17వ శతాబ్దం మధ్యలో దేశాన్ని సందర్శించిన ముఖ్యమైన యాత్రికులలో ఫ్రాన్స్‌కు చెందిన ఫ్రాంకోయిస్ బెర్నియర్ (1656–58) ఉన్నాడు. అతడు రచించిన ప్రయాణ వ్యాసావళి పేరు "మొగల్ సామ్రాజ్యంలో పర్యటనలు". సామ్రాజ్యంలో అతడు విస్తృతంగా పర్యటించాడు. తన గ్రంథంలో రైతాంగ జీవితం, వారి దారిద్ర్యం, పట్టణాలు, పరిశ్రమలు, గ్రామీణ జీవితం, పట్టణ సంస్కృతి, అన్నింటి కంటే మించి భారతీయ ప్రధాన ఉత్పత్తుల గురించి ప్రస్తావించాడు. ఆ కాలపు సమగ్రమైన చరిత్రను ఆ పుస్తకం అందిస్తుంది. తావెర్నియర్ మరో ఫ్రెంచి యాత్రికుడు. అతడు 1640–67 మధ్య దేశంలో పర్యటించాడు. వజ్రాల వ్యాపారి కావడంవల్ల అతడు వజ్రాలపై శ్రద్ధ చూపాడు. దేశంలో వివిధ వజ్రాల గనులను, ముఖ్యంగా దక్కనులోని గనులను సందర్శించాడు. గోల్కొండ రాజ్యంలో పర్యటించాడు. ఆ రాజ్యం ఉత్పత్తుల గురించి మాట్లాడాడు. వివిధ పంటలు, వాటిని శుద్ధి చేసే ప్రక్రియలను, అలాగే ప్రజల విచిత్రమైన ఆచారాలను ప్రస్తావించాడు. అమలులో ఉన్న వివిధ మారకాల గురించి కూడా ప్రస్తావించాడు. వాటిని ఐరోపా ప్రమాణాలతో సమర్థవంతంగా పోల్చి చూశాడు. అతడి గ్రంథాన్ని "భారతదేశంలో పర్యటనలు" అని పిలుస్తారు. దానిని రెండు సంపుటాలలో రాశాడు. మరో ఫ్రాన్స్ వాస్తవ్యుడు ఆబ్‌కార్ మొగల్ భారతాన్ని 1672–74 మధ్య పర్యటించి తన గ్రంథంలో వాటి వివరాలను పొందుపరిచాడు. (The travels of Abbe Carre in India and the Near East). ఓడరేవు పట్టణాలు, కొత్తగా స్థాపించబడిన ఫ్రెంచి ఈస్ట్ ఇండియా కంపెనీ గురించి అతడు వివరించాడు. జాన్ ఫ్రయర్ అనే ఆంగ్లేయుడు భారతదేశంలో ఆబ్‌కార్‌కు సమకాలీకుడు. A New Account of the East Indies అనే పుస్తకంలో తమ పర్యటన విశేషాలను పొందుపరిచాడు. 1672–81 మధ్య అతడు భారతదేశంలో పర్యటించాడు. దేశంలోని ఓడరేవు పట్టణాలు, ఆగ్నేయ ఆసియాలలో భారతీయ, ఐరోపా వ్యాపారుల భాగస్వామ్యం గురించి వివరించాడు.

ఈ వర్ణనలతోపాటు నికొలాయ్ మనుకి అనే ఇటలీ యాత్రికుని స్మృతులు కూడా ఉన్నాయి. ఇతడు తన జీవితంలో అధిక భాగాన్ని మొగల్ ఆస్థానంలోనే గడిపాడు. మొగల్ పాలకుల కథ అనే గ్రంథాన్ని రచించాడు. 1653 నుండి 1702 వరకు అతడు దేశంలోనే ఉన్నాడు. కనుక అతడి గ్రంథం ఔరంగజేబ్ జీవితాన్ని నిర్దిష్టంగా అందిస్తుంది. అంతఃపుర రాజకీయాల గురించి తరచూ ఊహాగానాలు చేసినప్పటికీ (చక్రవర్తి వ్యక్తిగత జీవితంతో సహా) ఆ గ్రంథం ఇప్పటికీ ఆ కాలపు పరిస్థితులపై విశ్వసనీయమైన ఆధారంగా ఉంది. ఔరంగజేబ్ దక్కను దండయాత్రల సమయంలో అతడు చక్రవర్తితోపాటు వెళ్లాడు. గోల్కొండ ఆక్రమణ గురించి విపులంగా చర్చించాడు. మద్రాసు పట్టణం గురించి అందంగా వివరించాడు. అథనాసియస్ నికిటిన్ (రష్యా), దువార్తె బార్బోసా (పోర్చుగీసు), ఫ్రాన్సిస్కో పెల్‌సెర్త్ (డచ్),

థెవెనాట్ (ఫ్రెంచి) తదితర ప్రముఖులు కూడా భారతదేశంలో పర్యటించారు. థెవినాట్ ఇండిగో సాగు గురించి సమగ్రంగా వివరించాడు. 1626లో వెలువడిన రెమోన్‌స్ట్రేంత్ (జ్ఞాపకాలు) అనే గ్రంథంలో ఈ వివరాలు కనిపిస్తాయి.

భారతీయ చరిత్రలు, విదేశీ యాత్రికుల కథనాలను తులనాత్మకంగా అధ్యయనం చేస్తే చరిత్ర రచనలో రెండు విభిన్న పంథాల ప్రాధాన్యతలు వెలుగులోకి వస్తాయి. భారతీయ చరిత్రలు రాజకీయ, పరిపాలనా సంఘటనలపై దృష్టి సారించాయి. చాలా వరకు పాలకుల కోణం నుండే పరిణామాలను విశ్లేషించాయి. చరిత్రలో ఒక పార్శ్వాన్నే అవి స్పృశించాయి. మరోవైపు ఐరోపా కథనాలు దురభిప్రాయాలకు దూరంగా వాస్తవిక పరిస్థితులను అద్దం పట్టాయి. ప్రజల జీవిత ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులపై దృష్టి సారించాయి. వాటి ద్వారా విశాల ప్రజానీకం గురించి తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది. కొన్ని ఐరోపా కథనాలు కూడా దురభిప్రాయాలకు దూరంగా ఉండలేకపోయాయి. వాటికి కూడా బలహీనతలు ఉన్నాయి. భారతీయ భాషల పరిజ్ఞానం లేకపోవడంవల్ల ఈ వైరుధ్యాలు తలెత్తాయి. వ్యాపారులుగా వారు కోస్తా ప్రాంతాలపై స్థిరపడ్డారు. మరీ ముఖ్యంగా ఐరోపా వ్యాపార స్థావరాలలో నివాసం ఉన్నారు. కనక మైదాన ప్రాంతాలలోని గ్రామాల గురించి వారికి ప్రత్యక్ష అనుభవం ఏదీలేదు. చివరగా ఐరోపా స్వీయ ప్రయోజనాల దృష్టితో వారు భారతదేశాన్ని వెనుకబడిన దేశంగా చిత్రీకరించడానికే ఎక్కువగా మొగ్గు చూపారు. తమ స్వంత దేశాల చరిత్రకు భిన్నంగా భారతదేశాన్ని దురభిప్రాయంతో వివరించారు. అయినప్పటికీ భారతీయ చరిత్రలు, విదేశీ యాత్రికుల కథనాలను ఉమ్మడిగా అధ్యయనం చేస్తే ఆ కాలపు వాస్తవిక పరిస్థితులను అంచనా వేయగలము.

**ప్రాంతీయ భాషలు - సాహిత్యం :**

వాస్తవానికి పార్సీ భాష, సాహిత్యం ఉత్తర భారతదేశంలో ఎంతగా విస్తరించాయంటే పార్సీతోపాటు స్థానిక భాషలో అధికారిక నివేదికలను రూపొందించే సాంప్రదాయాన్ని అక్బర్ నిలిపివేశాడు. ప్రాంతీయ భాషలు స్థిరత్వాన్ని, పరిపక్వతను సంతరించుకున్నాయి. ఈ కాలంలో ఉన్నతమైన కవిత్వం వెలువడింది. భక్తి, సూఫీ నాయకులు సాధారణ, స్థానిక భాషలలో బోధించడం, సాహిత్యాన్ని రచించడంవల్లే ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెందాయి. పాలకవర్గ ఉదారవాద ఆలోచనలు, మొగల్ పాలకులు సాధించిన శాంతి, స్థిరత్వం కూడా బాగా దోహదపడ్డాయి. కృష్ణుడు రాధ, ఇతర గోపికలతో నడిపిన ప్రేమవ్యవహారం, బాలకృష్ణుని లీలలు, భగవత్ గీత నుండి కథలు బెంగాలీ, ఒరియా, హిందీ రాజస్థానీ, గుజరాతీ సాహిత్యాంశాలుగా మారాయి. రాముని స్తుతిస్తూ అనేక గీతాలు రచించబడ్డాయి. రామాయణ,

మహాభారతాలు ప్రాంతీయ భాషలలోకి అనువాదమయ్యాయి. పార్సీ గ్రంథాలను కూడా కొంత వరకు ప్రాంతీయ భాషలలోకి అనువదించారు, అనుకరించారు. హిందువులు, ముస్లింలిద్దరూ ఈ విషయంలో కృషి చేశారు.

బ్రిజ్ స్వరూపంలోని మధ్యయుగ హిందీ (ఆగ్రా పరిసర ప్రాంతాలలో మాట్లాడే యాస)ని కూడా మొగల్ చక్రవర్తులు, హిందూ పాలకులు పోషించారు. అక్బర్ కాలం నుండి హిందూ కవులు మొగల్ ఆస్థానంతో ముడిపడడం ప్రారంభించారు. అబ్దుర్ రహీం-ఖాన్-ఎ-ఖానన్ భక్తి కవిత్వాన్ని పార్సీ జీవన ఆదర్శాలతో, మానవ సంబంధాలతో సంపన్నం చేశాడు. ఆ విధంగా పార్సీ, హిందీ సాహిత్య సాంప్రదాయాలు పరస్పరం ప్రభావితమయ్యాయి. అయితే అందరికంటే ప్రభావశీలుడైన హిందీ కవి మాత్రం తులసిదాస్. అతడి కథానాయకుడు రాముడు. బనారస్ చుట్టు పక్కల నివసించే ప్రజలు మాట్లాడే యాసలో అతడు రచనలు చేశాడు. తులసిదాస్ మానవతావాది. కుటుంబ ఆదర్శాలకు అతడు ప్రాధాన్యతనిచ్చాడు. రామునిపట్ల సంపూర్ణ భక్తి మోక్షానికి మార్గమని ప్రవచించాడు. సిఖ్ గురుల రచనలతో పంజాబీ సరికొత్త జీవితాన్ని పొందింది. ఏక్‌నాథ్, తుకారమ్‌ల రచనలతో మరాఠి శిఖర స్థాయికి చేరుకుంది.

**ఉర్దూ భాష-సాహిత్యం :** తుర్కు భాషలో ఉర్దూ అంటే స్థావరమని అర్థం. అది అనేక యాసలు, భాషల మిశ్రమం. ముస్లింలు భారతదేశానికి అనేక భాషలను తీసుకువచ్చారు. భారతీయ భాషలలో తమ స్వంత పదాలను స్వేచ్ఛగా కలిపారు. 13వ శతాబ్దం తొలినాళ్లలో ముస్లిం ప్రాబల్యానికి ఢిల్లీ కేంద్రంగా ఉన్నప్పుడు ఢిల్లీ చుట్టూ ఉన్న భాషలు (ముఖ్యంగా బ్రిజ్‌భాష, సౌరసేని) పార్సీ పదాలతో నిండిపోయాయి. తుర్కు, అరబిక్ పదాలు కూడా భారతీయ భాషలలో ప్రవేశించాయి. ఈ భాషల పదప్రయోగం మారినా మౌలిక వ్యాకరణ నిర్మాణం మాత్రం చెక్కుచెదరలేదు. 13వ శతాబ్దంలో భారతీయ భాషలు హిందవీ, హిందీ, బ్రిజ్ భాషగా గుర్తింపు పొందాయి. వాటిని దేవనాగరి లిపి (సంస్కృత లిపి)లో రాశారు. ఈ భాషను దక్కనులో తుగ్లక్, ఖల్జీ సైన్యాలు ప్రవేశపెట్టాయి. దక్షిణ యాసలతో ప్రభావితమైన ఈ భాష దక్కనీగా పిలవబడింది (హైదరాబాద్ దక్కను పేరు మీద). అయితే లిపి మాత్రం పార్సీ భాషలోనే కొనసాగింది. ఈ మిశ్రమ భాష అనతి కాలంలోనే పార్సీ స్థానంలో అధికార భాషగా మారింది. తొలి ఉర్దూ కవి అమీర్ ఖుస్రో. కబీర్, మీరాబాయి, గురునానక్, మాలిక్ మహమ్మద్ జైసి, అబ్దుల్ రహీం ఖాన్-ఎ-ఖానన్ ఈ భాషను అభివృద్ధి పరిచారు. ఈ వికాస భాషకు షాజహాన్ కాలంలోనే ఉర్దూ అనే పేరు ఇచ్చారు.

**ఉర్దూ ప్రగతి :** అమీర్ ఖుస్రోకు ముందు కవితా భాష ప్రాథమికంగా బ్రజ్‌భాషలో ఉండేది. అమీర్ ఖుస్రో ఆ భాషతో పార్సీని మేళవించాడు. గజల్ కవుల తొలి బృందం 15,16వ శతాబ్దాలలో దక్కనులో ఆవిర్భవించింది. తొలి గజల్‌కు ఒక నిర్మాణం అంటూ లేదు. దక్కను కుతుబ్ షాహీ గజలలో సాధారణ, ప్రత్యక్ష వ్యక్తీకరణలు కనిపిస్తాయి. వలీ (1688–1744) గజల్ నిర్మాణానికి చాలా కృషి చేశాడు. 1720లో వలీ కృతులు ఢిల్లీకి చేరినపుడు ఆ పట్టణం పొగడ్తలతో హోరెత్తింది. తర్వాత దశాబ్ద కాలంలోనే ఉర్దూ కవితా భాషగా మారింది. హాతిమ్, నాజీ, మజ్మూన్, అబ్రూ లాంటి చిన్నస్థాయి కవుల కృతులు ఉర్దూ కవిత్వ నిర్మాణానికి పునాదులు వేశాయి (18వ శతాబ్దంలో). ఉర్దూ గజల్ పార్సీ పదాలతో బరువెక్కింది. కవితా శైలిలో స్వర్ణయుగానికి నాంది పలికింది. మీర్ తాకీ మీర్ ఈ శైలిని అవలంబించిన తొలి కవి. తొలి గజల్‌లలో కనిపించిన సాధారణ వ్యక్తీకరణలు ఇప్పుడు పరివర్తనం చెంది క్లిష్టంగా, అస్పష్టంగా (పరోక్ష వ్యక్తీకరణ) మారాయి. ఈ దశలోనే గాలిబ్ గొప్ప ఉర్దూ కవిగా ఎదిగి ఎన్నో కృతులను రచించాడు.

15 నుండి 18వ శతాబ్దం వరకు వచ్చిన ఈ పరివర్తన కేవలం పద్ధతిలో పరిపూర్ణత రావడంవల్లే సంభవించలేదు. సామాజిక వ్యవస్థలో వచ్చిన మార్పులు కూడా అందుకు తోడ్పడ్డాయి. గొప్ప మొగల్‌లలో చివరి వాడైన ఔరంగజేబ్ (1707) మరణం తర్వాత సామ్రాజ్యం విచ్ఛిన్న దిశలో పయనించింది. నాదీర్‌షా, అహ్మద్‌షా అబ్దలీ, తదితరులు రాజధానిని వరుసగా దోచుకున్నారు. చివరగా తమ దురాక్రమణ ప్రణాళికలతో ఆంగ్లేయులు మెల్లగా పావులు కదిపారు. ఈ పరిణామాలన్నీ సామ్రాజ్య వైభవాన్ని హరించివేశాయి. మానవ ఆలోచనకు తెరలు వేశాయి.

ఈ కాలపు అనిశ్చిత పరిస్థితులు ఎందరినో దృఢచిత్తులుగా మార్చాయి. వారు ప్రశ్నలను సంధించడం మొదలుపెట్టారు. కళలు, సాహిత్యాల పునరుద్ధరణ దేశంలో (18వ శతాబ్దంలో) జరిగింది. ఈ ఆలోచనల విప్లవంతో ఉర్దూ కవిత్వం ఎక్కువగా ప్రయోజనం పొందింది.

18వ శతాబ్దపు సందేహాలు, అనిశ్చిత పరిస్థితులు 19వ శతాబ్దంలో కూడా కొనసాగాయి. బ్రిటీష్ ప్రాబల్యానికి వ్యతిరేకంగా 1857లో జరిగిన తిరుగుబాటు ఉత్తర భారత సామాజిక, సాంస్కృతిక చిత్రపటంపై చెరిగిపోని ముద్రలను వేసింది. గాలిబ్‌తో సహా ఎందరో కవులు ఈ పరిస్థితులను ఎంతో అద్భుతంగా వివరించారు. పాత పద ప్రయోగాలను కొనసాగిస్తూ భాషలో అనేక కొత్త నిర్మాణాలు వెలిశాయి. ఇప్పుడు ప్రత్యర్థి, కార్యనిర్వాహకులు ఆంగ్లేయులు. పాలకవర్గానికి క్రీస్తు ప్రతీకగా మారాడు. ఖలీసా (చర్చికి) సరికొత్త అర్థాన్ని ఇచ్చారు. బలహీనుడైన


బహదుర్ షా జఫర్ విచ్ఛిన్నమవుతున్న మొగల్ సామ్రాజ్యానికి ప్రతీకగా నిలిచాడు. గత వైభవాన్ని స్మరించుకోవడం ఉర్దూ కవిత్వంలో వల్లెవేసే అంశంగా మారింది. క్లుప్తంగా చెప్పాలంటే ఉర్దూ గజల్ పూర్వపరాలు మొగల్ కాలపు ఘనమైన ప్రణయ యుగంలో ఉన్నాయి. వ్యక్తీకరణ సాధనంగా ఉర్దూ గజల్ ఆవిర్భవించడం వల్లే ఉర్దూ భాష ప్రజాదరణ, వికాసంలో గొప్ప శిఖరాలు అత్యంత స్వల్పకాలంలో అందుకుంది.

# VI


# అనుబంధం

# 22. మధ్యయుగాలు - వంశక్రమం

## ప్రతిహార చక్రవర్తులు



# బెంగాల్ పలాస్‌లు



దైత విష్ణు
శ్రీవాప్యత
మొదటి గోపాల
ధర్మపాల
వాక్పాల
జయపాల
త్రిభువనపాల
దేవపాల
విగ్రహపాల (మొదటి సురపాల)
రాజ్యపాల
నారాయణపాల
రాజ్యపాల
రెండవ గోపాల
రెండవ విగ్రహపాల
మొదటి మహిపాల
నయపాల
మూడవ విగ్రహపాల
మూడవ మహిపాల
రెండవ సురపాల
రామపాల
రాజ్యపాల
విట్టపాల
కుమారపాల
మండపాల
మూడవ గోపాల

## బెంగాల్ సేనాలు

వీరసేన (పూర్వీకుడు

↓

సమంతసేన

↓

హేమంతసేన

↓

విజయసేన

↓


బల్లలసేన

↓

లక్ష్మణసేన

- విరూపసేన
  - సూర్యసేన
  - పురుషోత్తమసేన
- కేశవసేన

## దక్కను ప్రాంత రాష్ట్రకూటులు



## కనౌజు ప్రాంత గహదవళాలు

యశోవిగ్రహ

↓

మహిచంద్ర

↓

చంద్రదేవ

↓

మండపాల

↓

గోవిందచంద్ర

↓

విజయచంద్ర

↓

జయచంద్ర

↓ ↓

హరిశ్చంద్ర | సంయుక్త ఎం. పృధ్వీరాజ్‌చౌహాన్–3

# తూర్పు చాళుక్యులు

1. కుబ్జవిష్ణువర్ధన (క్రీ.శ. 624-41)
   - 2. జయసింహ(641-73)
   - 3. ఇంద్ర భట్టారక(673)
     - 4. విష్ణువర్ధన-2 (673-821-I)
       - 5. మంగి యువరాజ (682-706-II)
         - 6. జయసింహ-II (706-18)
         - 8. విష్ణువర్ధన-III (719-55)
           - 9. విజయాదిత్య -I (755-72)
             - 10. విష్ణువర్ధన-IV (772-808)
               - 11. విజయాదిత్య-II
                 - 12. కాళి విష్ణువర్ధ -V (847-49)
                   - 13. గునగవిజయాదిత్య-III(849-92)
                   - విక్రమాదిత్య-I
                     - 14. చాళుక్య భీమ-I
                       - 15. విజయాదిత్య-IV(921)
                         - 16. అమ్మ(921-27)
                         - 22. చాళుక్యభీమ-II
                       - 19. విక్రమాదిత్య-II (927-8)
                   - యుద్ధమల్ల - I
                     - 18. తల -I
               - 12. భీమసలుకి
               - నృపరుద్ర
         - 7. కొక్కిలి (719)

16. అమ్మ(921-27)    22. చాళుక్యభీమ-II (935-47)    యుద్ధమల్ల-II(928-35)

17. విజయాదిత్య-V    20. భీమ-II (928)    బడపా    24. తల-II (970)

25. ధనమావ(970-3)    అమ్మ-II (947-70)

26. శక్తివర్మన్-I (1000-11    27. విమలాదిత్య(1011-18)

28. రాజరాజనరేంద్ర(1019-61    29. విజయాదిత్య - VII

రాజేంద్ర - II (కులోత్తుంగ)    శక్తివర్మన్- II

## <u>చోళ చక్రవర్తులు</u>

విజయాలయ (క్రీ.శ. 850–71)

↓

ఆదిత్య–I (871–907)

↓

పరాంతక –I (907–55)

↓

- రాజాదిత్య (949)
- గండరాదిత్య (949–57)
  - ఉత్తమచోళ (970–85)
- అరింజయ (956–70)
  - పరాంతక –II
    - ఆదిత్య–II
    - రాజరాజ –I (985–1016)
      - రాజేంద్ర–I(1012–44)
        - రాజాధిరాజ
        - రాజేంద్రదేవ –II
          - రాజమహేంద్రన్(1063)
          - మధురాంతకి ఎం. కులోత్తుంగ I
            - రాజరాజ
            - ముమ్మడి చోళ
            - వీర చోళ
            - విక్రమ చోళ
              - కులోత్తుంగ –I (1133–50)
                - రాజరాజ –II (1146–73)
                  - రాజాధిరాజ –II (1163–79)
                    - కులోత్తుంగ –II → రాజరాజ –III → రాజేంద్ర –IV
        - వీరరాజేంద్ర
          - అధిరాజేంద్ర(1067–70)
        - అమ్మంగదేవి ఎం.
      - కుండవ ఎం. విమలాదిత్య
        - రాజరాజ నరేంద్ర

# పశ్చిమ (కల్యాణి) చాళుక్యులు

1. తాలియా - II (క్రీ.శ. 973-97)

↓

బిందుసారుడు (మిత్రఘాతలేదా అమిట్రొచేట్స్)

↓

2. సత్యాశ్రయ (997-1008) ↓ మహాదేవి | దాస్వర్మన్

↓

3. విక్రమాదిత్య V (1008-15) | 4. అయ్యన (1015) | అక్కాదేవి | 5. జయసింహ II (1015-42)

↓

6. సోమేశ్వర I (1042-68) | అవల్లదేవి

↓

7. సోమేశ్వర II (1068-76) | 8. విక్రమాదిత్య VI (1076-1126) | జయసింహ III

↓

జయకర్ణ | 9. సోమేశ్వర III (1163-83)

↓

10. జగదేకమల్ల II(1138-55) | 11. తయిలాప III (1150-63) | 12. జగదేకమల్ల III (1163-83)

↓

13. సోమేశ్వర IV (1184-1200)

## ధర్మ సముద్ర హోసలాలు

1. నృపకామ(1022-47)
↓
2. వినయాదిత్య (1047-98)
↓
3. ఎరెయెంగ (1063-1100)
↓
- 4. బల్లల I (1100-10)
- 5.విష్ణువర్ధన (1110-52)
  ↓
  6. నరసింహ I (1152-73)
  ↓
  7. బల్లాల II (1173-1220)
  ↓
  8. నరసింహ II (1220-38-I)
  ↓
  9. సోమేశ్వర (1233-67-I)
  ↓
  - 10. నరసింహ III (1233-67-I)
    ↓
    11. బల్లాల III (1291-1342)
    ↓
    11. బల్లాల V (1291-1342)
  - రమనత (1254-95)
    ↓
    విశ్వనాథ (1295-1300)
- ఉదయాదిత్య

# వరంగల్ కాకతీయులు

**1. బేటా I (1000-30)**

↓

**2. ప్రోల I (1030-75)**

↓

**3. బేటా II (1075-1110)**

↓

**4. ప్రోల II (1110-58)**

↓

**5. ప్రతాపరుద్ర I (1158-96)** | **6. మహాదేవ (1196-9)**

↓ (from 6)

**7. గణపతి (1199-1262)** | మైలాంబ

↓ (from 7)

**8. రుద్రాంబ (1262-96)** | గణపాంబ

↓

ముమ్మదాంబ ఎం. మహాదేవ

↓

**9. ప్రతాపరుద్ర II (1295-1326)**

## బానిస సుల్తాన్లు

కుతుబ్బుద్దీన్ ఐబక్(1206-10)

2. అరామ్ బక్ష్

కుమార్తె ఎం. 3. షామ్సుఉద్దీన్ ఇల్టుటుమిష్

నసీరుద్దీన్ మే-నవ1236)

4.రుకున్‌ద్దీన్ (1236-40)

5. రజియా (1240-42)

6.బహరామ్ (1246-66)

8.మహమూద్ కుమార్తె

9.బల్బన్ (1266-87)

7.అల్లా ఉద్దీన్ మాసూద్ (1242-46)

ముహమ్మద్

బుఘ్రాఖాన్

10. కైఖుబాద్(1287-90)

## <u>ఖల్జీలు(1290-1320)</u>

తులక్ ఖాన్ ఆఫ్ కుందుజ్

ఖల్జీస్ ఆఫ్ మాల్వా

1. జలాలుద్దీన్ (1290-96)

మాసుద్

2.రుకున్ ఉద్దీన్

3. అల్లాఉద్దీన్(1296-1316)

ఖైజర్‌ఖాన్

4.షాహిబుద్దీన్ (జనవరి-ఏప్రిల్ 1316)

5.కుతుబుద్దీన్ ముబారక్ (1316-20)

నసీరుద్దీన్ ఖుస్రావ్ (ఉసుర్‌పెర్) ఏప్రిల్-సెప్టెంబర్ 1320)

# తుగ్లక్‌లు (1320–1413)

- పూర్వీకుదు
  - ఘియాసుద్దీన్ (ఘాజీ మాలిక్) (1320–25)
    - 2. ముహమ్మద్ బిన్ (జౌనా ఖాన్) (1325–90)
  - రజాబ్ ఎం. భట్టి రాణి
    - 3. ఫిరుజ్ షా (1351–88)
      - ఫతాఖాన్
        - 4. ఘియాసుద్దీన్ (1388–9)
        - 8. నుసరత్ షా 1395–98)
      - జాఫర్‌ఖాన్
        - 5. అబుబాకర్ (1389–90)
      - నసీరుద్దీన్ ముహమ్మద్‌షా (1390–94)
        - 7. అల్లాఉద్దీన్ (1394)
        - 9. మహముద్‌షా (1399–1413)

## సయ్యద్‌లు (1414-51)

1. ఖిజర్‌ఖాన్(1414-21)

- 2. ముబారక్ (1421-34)
- ఫరీద్‌ఖాన్
  - 3. ముహమ్మద్ షా(1434-45)
    - 4. అల్లాఉద్దీన్ ఆలం షా(1445-51)

---

## లోడీలు (1451-1526)

1. బహలుల్ లోడీ (1451-89)

- బర్బక్‌షా
- 2. సికిందర్ లోడీ (నిజాం ఖాన్)
  - 3. ఇబ్రహీం లోడీ(1517-26)
- ఆలమ్

# విజయనగర సామ్రాజ్యం

## 1. సంగమాస్

- సంగమ I
  - హరిహర I (1336-57)
  - కంపా
  - బుక్క I (1344-77)
    - కుమార కంపన
    - విరూపన్న
    - హరిహరII(1377-1404)
      - విరూపాక్ష(1404-5)
      - బుక్క I (1405-6)
      - దేవరాయ I(1406-22)
        - రామచంద్రరాయ(1422)
        - విజయరాయ I (1422)
          - ప్రౌఢదేవరాయ II (1422)
            - విజయరాయ II (1446-7)
            - మల్లికార్జున (1447-65)
              - రాజశేఖర (1466)
          - ప్రతాపదేవరాయ
            - విరూపాక్ష II (1466-85)
              - ప్రౌఢరాయ (1485)
  - మారపముద్దప

**2. సాళువులు**


- గుండ
  - సాళువ నర్సింహ (1486-91)
    - తిరుమల
    - ఇమ్మడి నర్సింహ
  - తిమ్మ

**3. తుళువలు**

- ఈశ్వరనాయక
  - నరసనాయక
    - వీరనరసింహ (1505-9)
    - కృష్ణదేవరాయ (1509-29)
      - తిరుమలదేవి
      - తిరుమలాయి రాయ
    - అచ్యుతదేవరాయ (1529-42)
      - వెంకట I (1542)
    - రంగ
      - సదాశివ I (1542-76)

ఎం. అలియ రాజ


## 4. అరవిదులు


అరవిటి బుక్క
రామరాజ
శ్రీరంగ
అలియరామరాజ
(1542-65)
1. తిరుమల
(1570-2)
వెంకటాద్రి
2. శ్రీరంగ
(1572-85)
రామ
3. వెంకట I (1586-1614)
పెద తిరుమల
శ్రీరంగ
తిరుమల
శ్రీరంగ II (1614)
5. రామదేవరాయ
(1618-30)
6. వెంకట III
(1630-41)
చిన వెంకట
శ్రీరంగ III (1642-9)

<u>బహమనీలు</u>

- అల్లాఉద్దీన్ బహమన్ షా(1347-58)
  - 2. ముహమ్మద్ I (1358-77)
    - 3. ముజాహిద్ (1377-8)
      - 8. ఫిరుజ్ (1397-1422)
        - హసన్
        - ముబారక్
    - ఫతాఖాన్
      - 9. అహ్మద్ (1422-35)
        - 10 అల్లాఉద్దీన్ II (1436-58)
          - 11. హుమాయూన్ (1458-61)
            - 12. నిజాం షా (1461-3)
            - 13. ముహమ్మద్III (1463-82)
              - 14. ముహమ్మద్ (1482-1518)
                - 15. అహ్మద్ (1518-21)
                - 16. అల్లాఉద్దీన్ (1521)
                - 17. వలీఉల్లా (1521-24)
                - 18. కలీముల్లా (1524-7)
            - జంషిద్
          - హసన్ ఖాన్
        - ముహమ్మద్
  - 4. దావూద్(1378)
  - అహ్మద్ఖాన్
  - మహమూద్ఖాన్
    - 5. మహమూద్ఖాన్ I (1378-97)
      - ఘియాసుద్దీన్(1397)
      - షామ్సుఉద్దీన్ (1397)

# సుర్ పాలకులు


ఇబ్రహీం ఖాన్
హసన్‌ఖాన్
ఘాజీ ఖాన్
పేరు తెలియదు
4. ఇబ్రహీం షా (1557)
5.సికిందర్‌షా (1558)
1. షేర్ షా(ఫరీద్)
(1540–45)
నిజాం ఖాన్
సులేమాన్
3.ముబారిజ్‌ఖాన్(1554–56)
ఇబ్రహీం షా (సలీం)
(1545–54)

# మొఘలాయీలు

- **1. జహీరుద్దీన్ బాబర్ (1526–30)**
  - **2. హుమాయూన్**
    - **3. అక్బర్ (1556–1605)**
      - **4. జహంగీర్(సలీం) (1605–27)**
        - ఖుస్రవ్
        - పర్వేజ్
        - **5. షా జహాన్(ఖుర్రం) (1627–58)**
          - **దారా షుకోహ్**
          - **షుజా**
          - **6. ఔరంగజేబ్ (1658–1707)**
          - **మురాద్**
        - షాహర్యార్
      - మురిద్
      - దానియా 1
    - **మీర్జా హకిమ్**
  - **కమరాన్**
  - **హిందాల్**
  - **అస్కారి**

## చివరి తరం మొఘలాయిలు

ఔరంగజేబ్ (ఆలంగిర్ I)


↓

- ముహమ్మద్ (1676లో చనిపోయాడు)
- 7. ముజ్జమ్ / బహదూర్ షా I / షా ఆలమ్ I (1707-12)
- ఆజం (1707లో చనిపోయాడు)
- కామ్‌బక్ష్ (1708లో చనిపోయాడు)

షా ఆలమ్ I (1707-12) ↓

- జహందర్‌షా (1712-13)
  - ↓ జహందర్‌షా (1712-13)
  - ↓ 14. ఆలంగిర్ II (1754-59)
  - ↓ 15. షాఆలం II(1759-1806) (1788లో అంధుడయ్యాడు)
  - ↓ 16. అక్బర్ II (1806-37)
  - ↓ 17. బహదూర్ షా II (1837-58) (1862లో రంగూన్‌లో చనిపోయాడు)
- అజీమ్
  - ↓ ఫర్రుక్షియార్(1713-19)
  - ↓ 11.రఫీద్ ఉద్ దౌలా (1719)
  - ↓ 12. రఫీ ఉద్ దరాజత్ (1719)
- రఫిల్ ఉల్ ఖాదిర్
- అఖ్తర్
  - ↓ 12. మహ్మద్ షా (రంగీలా) (1719-48)
  - ↓ 13. అహ్మద్ షా(1748-54)

# భోంస్లేలు (ఛత్రపతి)


దేవగిరి యాదవులు
మాలోజి
లుఖ్జీ జాదవ్
జిజియాబాయ్ ఎం.
షాహ్జి
ఎం. తుకాబాయి
శాంభూజి
సాయి బాయి
శివాజీ I
ఎం. సోయ్‌రాబాయ్
శాంభూజి I
రాజారామ్
సాహు I (శివాజీ II)
శివాజీIII
శాంభూజి III
(కొల్హాపూర్)
రామరాజ
రామరాజ (దత్తత)
సాహు II (దత్తత)
శివాజీ IV
ప్రతాప్‌సింగ్
(సతారా)
షాజీ రాజా
శంభు
షాహాజీ
శివాజీ V
రాజారామ్ III
సాహు ఛత్రపతి
శివాజీ VI

# <u>పీష్వాలు</u>

విశ్వనాథ్

1.బాలాజీ విశ్వనాథ్ (1713-20)

2.బాజీరావు I (1720-40)

చిమ్నాజీ అప్పా

3.బాలాజీరావు (1740-61)

రఘునాథరావు రఘోబా

విశ్వాస్‌రావు

4.మాధవరావు (1761-72)

5.నారాయణరావు (1761-72)

6.స్వామి మాధవరావు (1773-96)


అమృతరావు


7.బాజీరావుII(1796-1818)

చిమ్నాజీ అప్పా


నానాసాహెబ్(దత్తత)


# 23. మధ్యయుగాల మ్యాపులు







11వ శతాబ్దం తొలి దశలో భారతదేశం
శ్రీనగర
కాశ్మీర
ఘజనీ
ఘజ్నావిద్
సామ్రాజ్యం
దేహలి
(టోమరాస్)
చాహమనాస్
అజయమేరు
(కచ్చపా
ఘటా
మహోత్సవనగర్
గుహిల్లాస్
అనహిల్లాపుర
చాళక్యులు
పర్మరాస్
ధార
(యాదవులు)
దేవగిరి
చాళక్యులు
కళ్యాణి
(కాకతీయులు)
వరంగల్
చండెల్లాస్
(గహదవళాస్)
ముదగిరి
పలాస్
కాలచూరిస్
త్రిపురి
(సేనాస్)
నేపాళ
కామ
రూప
ప్రగియోటిస
పూరి
అరేబియా
సముద్రం
బంగాళాఖాతము
దొరసముద్ర
తంజావూర్
మధురై
(పాండ్యాస్)
అనురాధపుర
పోలోన్నరువ
సింహళ
హిందూ మహా సముద్రం
ప్రస్తుత అంతర్జాతీయ సరిహద్దు


ఇల్టుముష్ కాలం ఢిల్లీ సుల్తానుల రాజ్యం
మంగోలులు
కాశ్మీర్
ఖోఖార్స్
లాహోర్
ముల్తాన్
ఢిల్లీ
మధుర
కనావుజ్
ప్రయాగ
బెనారస్
I N D I A
గుజరాత్
యాదవులు
దియోగిర్
ఒరిస్సా
వరంగల్
కాకతీయులు
అరేబియా
సముద్రం
బంగాళాఖాతము
హొయసాళులు
చోళులు
పాండ్యులు
ప్రస్తుత భారతదేశ
అంతర్జాతీయ సరిహద్దు
హిందూ మహా సముద్రం



తైమూరు సామ్రాజ్యం
క్రీ.శ. 14వ శతాబ్దం చివరిలో
భారతదేశం
కాబూల్
కాశ్మీర్
లాహోర్
తలంబ
ముల్తాన్
సామన
హరిద్వార్
భట్నయర్
మీరట్
ఢిల్లీ
ఆగ్రా
జౌన్‌పూర్
జౌన్‌పూర్
మాల్వా
బెంగాల్
భా ర త దే శం
గుజరాత్
ఖాన్‌దేశ్
గోండ్వానా
ఒరిస్సా
బహమనీ
రాజ్యం
అరేబియా
సముద్రం
బీదర్
వరంగల్
గుల్బర్గా
తెలింగానా
బంగాళాఖాతము
రాయ్‌చూర్
దావోబ్
విజయనగర్
విజయనగర్
ప్రస్తుత భారత అంతర్జాతీయ సరిహద్దు
ఢిల్లీ సుల్తాన్ రాజ్యాన్ని తైమూర్ ఆక్రమించిన మార్గం
ఇతర సరిహద్దు
అంతర్జాతీయ సరిహద్దులు
హిందూ మహా సముద్రం




విజయనగర సామ్రాజ్యము మరియు దక్కను సుల్తానులు


కాబూల్
పెషావర్
స్వతంత్ర పఠాన్ గిరిజనులు
లాహోర్
ముల్తాన్
ఢిల్లీ
జాట్లు
రాజ్‌పుట్లు
ఆగ్రా
అలహాబాద్
బెనారస్
పాట్నా
చందర్‌నాగోర్ (ఫ్రెంచ్)
కలకత్తా (బ్రిటిష్)
గోండ్వానా సామంత రాజులు
సెరోమ్‌పూర్ (డానిష్)
డియు (పోర్చుగీసు)
సూరత్
డామన్(పోర్చుగీసు)
బేసిన్ (పోర్చుగీసు)
బొంబాయి (బ్రిటిష్)
మరాఠాలు
అరేబియా సముద్రము
బంగాళాఖాతము
గోవా (పోర్చుగీసు)
పులికాట్ (డచ్)
మద్రాస్ (బ్రిటిష్)
సదర్స్ (డచ్)
పాండిచ్చేరి (ఫ్రెంచ్)
ట్రాంకుబార్ (డానిష్)
నాగపట్నం (డచ్)
కాలికట్
కొచ్చిన్ (డచ్)
పాలిగర్స్
హిందూ మహాసముద్రం
ప్రస్తుత భారత దేశ అంతర్జాతీయ సరిహద్దు
మొఘల్ సామ్రాజ్య అంచనా సరిహద్దు
ఐరోపా వలసలు
జాట్లు తిరుగుబాట్లలో

మరాఠా, ఇతర రాజ్యాలు


కాబూల్
పెషావర్
కాశ్మీర్
పంజాబ్
సాయల్‌కోట్
కంగ్రా
లాహోర్
అమృతసర్
ముల్తాన్
పానిపట్
తరైన్
ఉక్
టట్టా
ఢిల్లీ
బికనీర్
బద్వాన్
జైసల్మేర్
అంబర్
ఆగ్రా
సికంద్ర
చంద్రవర్
అమర్‌కోట్
అజ్మీర్
ఖాన్వా
కనౌజ్
అవధ్
జౌన్‌పూర్
కారా
చౌసా
రణతంబోర్
ఫతేపూర్‌సిక్రీ
బీహార్
మహోబా
వారణాసి
ఉదయ్‌పూర్
ఖజురహో
సహస్రం
గౌర్
కరాచీ
కాలింజార్
బెంగాల్
మాల్వా
బుందేల్‌ఖండ్
ముర్షిదాబాద్
అహ్మదాబాద్
ధార్
చిత్తోర్‌ఘర్
గోండ్వానా
చందర్‌నాగోల్
కలకత్తా
ఖాందేశ్
అసిర్‌ఘర్
గుజరాత్
సూరత్
బురహన్‌పూర్
గౌలిఘర్
నాగపూర్
ఒరిస్సా
డామన్
బేరార్
దౌలతాబాద్
బేసిన్
ఔరంగాబాద్
అహ్మద్‌నగర్
బొంబాయి
కిర్కీ
పూనా
బీదర్
వరంగల్
రాజ్‌ఘర్
సతారా
గోల్కొండ
రత్నగిరి
బీజాపూర్
గుల్బర్గా
కొల్హాపూర్
రాయచూర్
తలికోట
కర్నూలు
మసులీపట్నం
బంగాళాఖాతము
అరేబియా సముద్రము
ఉదయగిరి
విజయనగర్
మద్రాస్
జింజిల్
పాండిచ్చేరి (పుదుచ్చేరి)
గంగయికొండ చోళపురం
కొచ్చిన్
తంజావూరు
నాగపట్నం
ప్రస్తుత అంతర్జాతీయ సరిహద్దు
హిందూ మహా సముద్రం

ప్రజాశక్తి బుక్‌హౌస్